౧

"జయతి భగవాన్ స్వయంభూః, గణపతినృపతే ర్హృది స్థిత స్సతతమ్,
యత్కారుణ్యకటాక్షైః, వృద్ధిం ప్రాప్తాంధ్రదేశశ్రీః" (మల్కాపురశాసనమ్)

అది మహాలయ **అమావాస్య** !

ఆకాశము మేఘావృతమై యున్నది. సూర్యోదయమైనను భగవానుడు కనుపడియు కనుపడకుండ నున్నాడు. వీరోత్సవములతో పొంగిపొరలుచుండు నేకశిలానగర మానాడు వర్షపాతమునకు బూర్వము గగనాంగనవలె పూర్ణగర్భిణియై యించుక మాంద్యము వహించియున్నది.

రాచనగరిలో మంగళతూర్యపంచకము అనుదినము ప్రాతస్సమయముల మ్రోయుచునే యున్నవి. కాని యిప్పటికి నెలనాళ్లనుండియు నవి యెప్పటివలె దీర్ఘకాలము శ్రవణపర్వము చేయక ప్రారంభించిన యల్పకాలముననే సమాప్తి నొందుచు ప్రస్తరింపని రాగస్వరమువలెను, విస్తరింపని వర్ణనవలెను, సవరింపని కావ్యమువలెను, వివరింపని కథావస్తువువలెను ఆనందదాయకములుగా లేవు. పైపెచ్చు అనిర్వాచ్యమగు నశాంతిని భయమును వినువారి కావేశింపజేయుచుండెను.

జన మందరికి మహారాజు నిత్యము దర్శనమిచ్చు నియమితవేళ ప్రాతఃకాలమున గలదు. అంతకుముందుగనే పురజనులు రాజద్వారసమీపమున మూగుచు నిశ్శబ్దముగా తమ చూపులు రాజమందిరాట్టాలకమందలి గవాక్షముపై వ్యగ్రతతో నిలుపుచుండిరి. ఆ ప్రదేశమునుండి మహారాజు దర్శన మొసంగును. కాని యీ నెలరోజులనుండియు నా యట్టాలకమునుండి కాని గవాక్షమునుండి గాని ప్రజలకు మంగళప్రదమగు రాజదర్శన మగుటలేదు. అందుకుమారు రాజమాత యొక డచ్చట ప్రత్యక్షమై దీర్ఘగంభీరస్వరముతో నిట్లు ప్రకటించుచుండెను :

"స్వస్తి. సమస్తపంచమహాశబ్ద మహామండలేశ్వర రాజపరమేశ్వర ఉద్దండమండలాగ్రప్రచండ నెలవీడుగండషేషిణి హన్మంత శ్రీమత్ గణపతిదేవమహారాజులుంగారు అస్వస్థులై యుండి వారి వాత్సల్యప్రీతివచనములు ప్రజలందరకు ఎరుక చేయమన్నారు."

అది యాలకించి ప్రజలు నిర్విణ్ణులై చింతాక్రాంతహృదయములతో వెనుదిరిగి పోవుచుండిరి. రోజులు గడచినకొలదియు నా వేళకు చుట్టుప్రక్కల జనపదములనుండియు జనసమూహము లా ప్రదేశమున జేరుచున్నందున నానాటికి జన మెక్కువగుచుండెను.

అందుకు ఈనాడు అట్లు చేరిన పౌరులయు జానపదులయు సంఖ్య య ముగా నున్నది. ఆపటినుండి శరన్నవరాత్రోత్సవము ప్రారంభించును. నవ పూజాదీక్షితుడైన మహారాజుల దర్శించు భాగ్యమైనను మన కీ సంవత్సరము లభ్య మగునా, కాదా? నవరాత్రపూజ జరుపని మహారాజారాజ్యమున మంగళము లెట్లు సమకూరును? ఆ కూడిన జనముల హృదయములలో ఈ ప్రశ్నయే శల్యమువలె వేధించుచుండెను.

దూరదేశములనుండి సామంతులును మండలేశ్వరులును దండనాథులును రాజ బంధువులును జేయు రాకపోక లానాటి కానాడు రాజమందిరమున నతిశయించు చుండెను. తిక్కచమూపతి రాచనగరు విడుచుటయే లేదు. మహాప్రధానులగు శ్రీమత్ గోవిందనాయకుడు బయ్యనానాయకుడు విశేషకాలము రాజమందిరముననే గడపు చుండిరి. ఏకశిలాపురపాలకుడగు మేచయనాయకుడు శ్రద్ధపూని రాత్రింబవళ్లు రాజ మందిరమును భటసమూహములతో సంరక్షించుచుండెను.

ఈనాడుకూడ రాజదర్శనము కాలేదు. ఈనాడుకూడ రాజదూత మహారాజా సస్వస్థవార్త దీర్ఘగంభీరస్వరముతో ప్రకటించి మహారాజులు తమ ప్రజలకు బంపిన ప్రీతిసందేశము నెరిగించెను.

ఆ సందేశము పూర్తియైనది. కాని జన మెప్పటివలె వెంటనే జయజయ నినాదములు చేయుచు కదలిపోలేదు. అసలు జయజయనినాదములే వారు చేయలేదు. కదలనేలేదు.

వారినాడు సామాన్యప్రీతివచనములు దూతముఖమున వినుటకు రాలేదు. ఇందరు జనము నవరాత్రపూజావిశేషము లెరుంగవచ్చిరి. రాజమందిరమున పండుగ కాకున్న ప్రజలు పండుగ చేసికొనుట యెట్లు?

వారట్లొక్క గడియపాటు నీరవముగా నిలిచియుండిరి. ఐనను రాజమంది రమునుండి మరి ప్రకటన రాలేదు. అంతట నా మహాజనము నిరాశతో నిశ్శబ్దముగా విచ్చిపోసాగెను. అంతటి జనసమూహము విచ్చిపోవు కదలికవలన కలిగిన శబ్దమే నేల యదిరినట్లు భయంకరమంద్రఘోషమై కోటగోడల నెల్ల వడవడ వడకించెను.

ఆ శబ్దమునకు అలకించెనో యన్నట్లు ఇంతలో రాజదూత మరల సౌధాట్టాలిక మున ప్రత్యక్షమై ఆ సాయంకాలముననే మరియొక ప్రకటన మహారాజులు చేయింప గలరని తెలిపెను. విచ్చిపోవుచున్న జనులు వెనుదిరిగివచ్చి వ్యగ్రులై అది యాల కించి వికసించిన ముఖములతో నొకరికొకరు చెప్పుకొనుచు జయజయనినాద ములు చేయుచు వెడలిపోయిరి.

శ్రీ కాకతిగణపతిదేవమహారాజుకు డెబ్బదియైదేండ్లున్నవి. ఈ వార్ధకములో నాత డిప్పుడు వ్యాధిపీడితుడై మంచముపట్టియుండెను. పాదములను ముఖమునను నీరు చూపినది. రాజవైద్యులు ఆయన నేమాత్రము కదలగూడ దని నిషేధించిరి.

ఆ మహారాజు చిన్నతనమున పడరాని కష్టము లనుభవించెను. కాకతీయుల కప్పటికి హనుమకొండ రాజధాని. దేవగిరియాదవరాజగు జైతుగి దండెత్తివచ్చి హనుమకొండను ముట్టడించి గణపతిదేవుని తండ్రియగు మహాదేవరాజును సంహరించి చిన్నవాడగు గణపతిదేవుని బంధితుని గావించి దేవగిరికి తీసికొనిపోయెను. గణపతి యౌవనమంతయు దేవగిరిచెరసాలలోనే గడచిపోయెను. దేవగిరిలో నున్న యా పది పదకొండేండ్లు నాతడు మహాతపస్సు చేసెను. కులదైవత మగు హనుమంతుని ఇష్టదైవమగు శంకరుని ఆరాధించెను. కొంతకాలమున కాతె డెట్లో హృదయములో క్రోధవహ్నిని కాలకంఠుడు గరళమునువలెనే దిగమ్రింగి యాదవరాజును శాంత పరచెను. జైతుగి కాతనిపై ననుగ్రహము కలిగి బంధవిముక్తుని జేసి యనుమ కొండకు పంపివేసెను.

అత డట్లు స్వరాజ్యము ప్రాపించునాటికి విశాలాంధ్రావని యంతయు నల్లకల్లోలముగ నుండెను. అతని పెదతండ్రి రుద్రదేవమహారాజు దీక్షతో స్థాపించిన రాజ్యమంతయు భిన్నభిన్నములై యుండెను. సామంతులును మండలేశ్వరులును స్వతంత్రులైరి. అమరావతిలో కోటవంశీయులును ముసెపల్లెలో నతవాడివారును సారసిపురమున కొలనినాయకులును గుడిమెట్టలో చాగిరరశేయువారును కృష్ణానదీ ముఖద్వారమున అయ్యవంశీయులును పొత్తపి నెల్లూరుమండలములలో తెలుగుచోళు లును పాదుకొని వారిలో వారు కలహించుచుండిరి. దానికి తోడుగా నీశాన్యమున కళింగగాంగులును ఆగ్నేయమున చోళులును రాక్షసమున హొయసలులును వాయ వ్యమున యాదవులును విజృంభించి ఎవరి కందిన భూఖండములు వారు కబళించు చుండిరి. రేచర్ల రుద్రసేనానిమాత్రము నాగతిభూపాలుడు మొదలగు శత్రుల బార దోలి హనుమకొండప్రాంతమును శత్రువులబారి పడకుండ సంరక్షించి గణ పతిదేవున కప్పగించి కాకతిరాజ్యభారధౌరేయుడను నన్వర్థబిరుదము వహించెను.

అప్పుడు గణపతిదేవుడు చేయవలసినది విశేషముండెను. స్వతంత్రులైన సామంతులను వశపరచుకొనవలెను. శత్రురాజు లాక్రమించిన రాజ్యభాగములు తిరిగి సంపాదింపవలెను. అన్నిటికంటె ముఖ్యమైనది, తన తండ్రిని జయించి వధిం చిన దేవగిరిరాజుపై కడుపులో దాచుకున్న పగ సాధింపవలెను!

గణపతిదేవుడు ఈ కార్యములు సాధించుటకు రుద్రదీక్షతో నుపక్రమించెను. దాని కనుకూలముగ నా సమయముననే యాతనికి శ్రీ విశ్వేశ్వరశంభువుల దర్శనము ప్రాప్తించెను. శ్రీవిశ్వేశ్వరశంభువు ఉగ్రతపస్వి యగు శ్రీ ధర్మశంభువులకు కరక మలసంజాతుడు; 'పృథ్వీపాలావనిమకుటఘృష్టాంఘ్రికమలద్వయుడు; విద్యావల్లీ వలయకలనాకల్పకతరువు. యౌవనసంపదతో శివదీక్షాసంపద యేకమై దివ్యజ్యోతి వలె ప్రకాశించు నా మహాయోగి యిహపరరాజ్యవిజిగీషు వగు గణపతిదేవుని నెంతయు నాకర్షించెను. కొలదికాలముననె యాత డా దేశికునియొద్ద శివదీక్ష గ్రహించెను. తదాది గణపతిదేవునికి విజయపరంపరలు సిద్ధించెను. సామంతులందరు

నొకరితరువాత నొకరు వశులైరి. శత్రువశమైన నిజభూభాగమె కాక శత్రురాజుల భూభాగములుకూడ కొన్ని యీ మహారాజువశమయ్యెను. ఇట్లాతడు తెలుగుభాష మాట్లాడు విశాలాంధ్రదేశమున కంతటికి నిష్కంటకముగా నేకచ్ఛత్రాధిపతి యయ్యెను. ఆతని రాజ్యము దక్షిణమున కాంచీపురమువరకును, ఉత్తరమున సింహాద్రిదాటె మాల్యవంతమువరకును, పశ్చిమమున కల్యాణకటకమువరకును, తూర్పున సముద్రమువరకును విస్తరించెను. ఒక్కొక్కసీమను జయించినప్పుడెల్ల ఆతడనేకము లగు శివాయతనములు ప్రతిష్ఠించి, తన నామముతో గణపేశ్వరము లను పురములను నిర్మించెను. అతడు త్రవ్వించిన తటాకములకు కట్టించిన గ్రామములకు వేయించిన రాజమార్గములకు నడిపించిన కాలువలకు లెక్కలేదు. రాజధానీనగరము నోరుగల్లుకు మార్చెను. ఇట్లాతడు బహుదీర్ఘకాలము సమర్థతతో రాజ్యపరిపాలన మొనర్చెను.

ఇందరు రాజన్యులను ఇన్ని రాజ్యములను గణపతిదేవుడు జయింపగలిగెను గాని వార్ధక్యమును గాని మృత్యుమాతయగు వ్యాధినిగాని, జయించు శక్తి యాతనికి లేకపోయినది. ముదిమి పెరుగుచున్నకొలది పాలనలో పటుత్వము తగ్గజొచ్చినది. దానికి తోడాతనికి పురుషసంతతి లేకపోయెను. స్త్రీసంతతికైనను పురుషసంతతి కలుగలేదు. అందుచే నీ వృద్ధరాజానంతరమున రాజ్యశాసకు డెవ డగునని ప్రశ్న తీరక ఎల్లప్పుడు వచ్చుచుండెను. రాజబంధువులలో భేదాభిప్రాయములు వ్యక్తమగుచుండెను. అవి సామంతులకును మండలేశ్వరులకును సూక్ష్మసూక్ష్మముగా ప్రాకసాగెను. మిక్కిలి విశాలమగు నాతని రాజ్యాంచలములలో గదలికలు ప్రారంభించెను. ఒకవంక కాంచీపురచోళులు స్వతంత్రులై నెల్లూర గణపతిసామంతుడగు మనుమసిద్ధిని రాజ్యపదభ్రష్టు నొనర్చిరి. తొండమండలమునుండి కొప్పెరుంజింగడు మరికొంతభూమిలో ప్రవేశించి దాక్షారామమువరకు నెత్తిరానుంకించుచుండెను. సామంతు డగు మనుమగండగోపాలుడు విద్రోహ మొనర్చెను. కళింగగాంగులు ఈశాన్యమున కోల్పోయిన భూభాగమును తిరిగి కబళింప యత్నించుచుండిరి. అంతలో నప్పటి యాదవరాజగు మహాదేవరాజు దండెత్తివచ్చుటకు మహాసైన్యములు సమకూర్చుచుండె నని వార్తాహరులు తరచుగా తెలుపుచువచ్చిరి.

కాకతీయప్రజాజీవనములో మతభేదములచే సామరస్యము నశించెను. శైవవైష్ణవులకు తమలోతమకును ఉభయులకు జైనులతోడను ద్వేషములు తీవ్రముకాజొచ్చెను. వానికి తోడు ఒకవైపున వీరశైవమును మరొకవైపున వీరవైష్ణవమును జనులను మతావేశముతో నున్మత్తప్రాయుల నొనర్చుచుండెను. వా రుభయులకు జైనులతో తరచుగా వాదోపవాదములు సాగుచుండెను. రాజ్యమునకు మూలాధారమగు గ్రామములలో కరణములుగా విశేషముగా జైనులే యుండిరి. పట్టణములలోగూడ పలువు రుద్యోగులు జైనులే. రాజకోశమునకు అధిపులుగా నున్నవారిలో పెక్కురు జైనులే. అందుచే ఆ నాడు రాజ్యములో జైనుల పలుకుబడి బలముగా పాదు

కొనియుండెను. రాజధానీనగరమునను పెద్దపట్టణములను శైవవైష్ణవము లెంత శీఘ్రముగా ప్రాకుచున్నను గ్రామములలో నవి యంత శీఘ్రముగా వ్యాపింపలే కుండెను.

కాకతీయసామంతులను దండనాథులందును అన్నికులములవారును గలరు. వారిలో కొందరు బ్రాహ్మణులు. కొందరు చాళుక్యక్షత్రియులు. కొందరు కదంబగాంగ పల్లవ కాకతీయాది వంశముల క్షత్రియులు. మరికొందరు పద్మనాయకులు. ఇంకను కొందరు బహువంశముల రెడ్లు. వెండియు గొందరు కాయస్థులు. వా రెన్ని భిన్నకులములవా రైనను పూర్వము ప్రభువునెడ సమానముగా భక్తి కలవారై యుండిరి. ఇప్పుడు భిన్నమతాభిమానములచే వారిలో నందరకు నేకభావన లేక అనేక పక్షములుగా నంతరంగములలో చీలియుండిరి. భవిష్యద్రాజనిర్ణయములో నీ చీలికలు గాఢమగు సూచన లున్నవి. స్పృశించినంతనే చిట్లిపోవు బుడగవలెను, ఒత్తిడి తగిలినంతనే ప్రేలిపోగల శతఘ్నివలెను, పరిస్థితు లున్నవి. అది బుద్ధిశాలి యగు గణపతిదేవునకు తెలియకపోలేదు. అందుచే నా ప్రస్తావన రానీయకుండ ఇప్పటివరకెన్నియో సంవత్సరములు గడపెను. కాని య ట్లెన్నాళ్లు గడపగలడు ?

ఈ సంవత్సరము నవరాత్రదీక్షకు తాను కూర్చుండుటకుగూడ నోపిక లేని యవస్థ వచ్చినది. ఏదో ఒక నిర్ధారణ చేసితీరవలసిన తరుణము వచ్చినది. ఇక నాలసింప సాధ్యము కాదు !

పలువురు సామంతులును దండనాథులును రాజబంధువులును రాజధానికి వచ్చియున్నారు. కాని మహారాజునకు భుజదండములవంటి మండలేశ్వరులు కొంద రింకను రాలేదు. ఇందులూరి అన్నమదేవుడును కొలని రుద్రదేవుడును ఎంత ప్రయత్నించినను రాలేకపోయిరి. గోదావరియు దాని యుపనది యగు శబరియు పొంగి వరదలు విపరీతముగా వచ్చినందున అనేకగ్రామముల జనములు నిరాధారులై ప్రాణాపాయస్థితిలో నుండిరి. వారలు దగ్గరనుండి అవసర మగు ప్రతిక్రియలు చేయింపనిచో ప్రజాబాధ దుర్భర మగును. అందుచే తాము విదియతదియలకుగాని రాలే మని గణపతిదేవులకు వినతు లంపుకొనిరి.

మరియు జన్నిగదేవుడును అంబదేవుడును అను కాయస్థదండనాథు లిరువు రుండిరి. వారు రాజధానికి రాలేదు. వా రెందుకు రాలేదోకూడ తెలుపలేదు. వారు రాకున్నందుకు గణపతిదేవునికి ముందు కోపము వచ్చెను. ఈనాడు వత్తురు. ఈనాడు వత్తు రని నిరీక్షించెను. కోపము చిరాకు నెక్కు వగుచుండెను. మహాలయ అమావాస్యకుకూడ రాకుండుటయేగాక వార్తకూడ వారు పంపలే దని తెలిసి గణపతిదేవుడు కుప్పకూలిన ట్లయ్యెను. ధైర్యమును ఆగ్రహమును తెచ్చుకొనును. మరల నధైర్య మావేశించును.

గణపతిదేవునకు చాలకాలమువరకు ముందు సంతతియే కలుగలేదు. రుద్రమదేవి గర్భములో నుండగా జ్యోతిష్కులు భావిరాజ్యాధిపతి పుట్టు నని ప్రశ్నలు చెప్పిరి.

అందుచే పుత్రజనన మగు నని పేరాసతో నిరీక్షించెను. కాని తుదకు పుత్రిక యను వార్త తెలిసినది. వెంటనే యాతడు మనోనిశ్చయము చేసికొని మహారాజులకు పుత్రోత్పత్తి కలిగెనని ప్రకటింపజేసెను. ఆ కుమార్తె కాతడు రుద్రదేవు డనియే తన తాత పేరుపెట్టి పురుష వేషము వేయించి వ్యవహరింపజొచ్చెను. కాని యట్టి యంతఃపుర రహస్యమెంతకాల మాగగలదు? నిజవార్త యానోటనానోట బడి వ్యాపింప జొచ్చెను. ఆమెకు పదేండ్లు రాకముందె కన్యక యని రాజ్యములో నలుమూలల నది తెలిసిపోయెను. రాజాజ్ఞలయెడ భయమునకైన నది ప్రజలచే రహస్యముగా నుంచునట్లు చేయుట యసాధ్య మయ్యెను. ఆ సందర్భమున నున్న విషయము మరుగుపరచి కల్లోలములు పెంచుట కతని కిష్టము లేకపోయెను.

అంతలో మరియొక భార్య గర్భవతి యయ్యెను. ఈమకైనను పుత్రు డుదయించడా యని యాశపడెను. మరల పుత్రికయే కలిగెను.

ఆసమయమున రుద్రమదేవి పూర్ణయౌవన యయ్యెను. ఖడ్గాద్యాయుధ విద్యల నామె ప్రవీణ. దండనీతి యామెకు హృద్గతము. వనిత ఎంత విద్యావతి యైనను శాశ్వతముగా కన్యకగా నుండ సాధ్యమా? ఆమెకు వివాహము చేయక తప్పినదికాదు.

గణపతిదేవు డాలోచించెను. వీరాంగన యగు నామెకు వీరాధివీరుడే భర్తగా జేయ నాతడు నిశ్చయించెను. అంతట నామె కతడు వీర్యశుల్కము నిశ్చయించి కులీనులగు దండనాథులకును సామంతులకును ఆహ్వానము లంపెను. రుద్రమదేవిని ఖడ్గయుద్ధమునను ధనుర్విద్యయందును ఆమెను జయింపగల వాని కామె నిచ్చి వివాహము చేసెద నని చక్రవర్తి నిర్ణయముచేసి యావిధముగా వార్త లంపెను.

అట్లాహూతులయిన క్షత్రియవీరులు పలువురు రాజాజ్ఞ పాలించి రాజధానికి వచ్చిరి. కాని వారిలో పెక్కురకు రుద్రమదేవిని వివాహమాడుట యిష్టము లేదు. కొందరు రాజపుత్రికయందు భయభక్తులు చూపి యామెతో యుద్ధముచేయ నియ్యకొనలేదు. కొందరు యుద్ధములో పాల్గొని ప్రయత్నపూర్వకముగా నోటమి యంగీకరించిరి. పురుషునివలె వ్యవహరించు స్త్రీని వారు భార్యగా స్వీకరించుట కిష్టములేకనే వా రట్లు ప్రవర్తించుచుండి రని గణపతిదేవు డూహింపకపోలేదు.

మరి చాళుక్యవీరభద్రేశ్వరుడో, మిగిలిన సామంతులవంటివాడు కా డతడు! రాజ్యభ్రష్టుడై యాతడు యౌవనదశలో బహుకాల ముత్తరదేశములలో సంచరించెను. అప్పు డచ్చట విజృంభించుచున్న ఇస్లాముమతావేశము నతడు కన్నులార జూచెను. శిథిలప్రాయము లగు బౌద్ధసంఘారామములను వీడి దేశాటనము చేయుచున్న బౌద్ధభిక్షువుల నెందరినో యాతడు సందర్శించి సంభాషించియుండెను. వారి యుపదేశములచే దేశమంతట నైకమత్యము లేకుండ వేరుచేసిన సంస్థ వర్ణవ్యవస్థయే యను విశ్వాస మాతనికి స్థిరపడెను. ఇట్టి కాలములో స్త్రీలు అంతఃపురములలో కుములుచుండుట శ్రేయస్కరము కా దనియు నూహ యాతనికి ప్రబలెను. ఆతని రాజ్యము హరించిన

జ్ఞాతులవలననుండి తన వేంగీమండలమును గణపతిమహారాజుసాహాయ్యముననే తిరిగి యాతడు సంపాదించుకొనగల్గెను.

వీరభద్రరాజు చాళుక్యక్షత్రియుడు! అనాదిగా వారు చంద్రవంశజుల మని చెప్పుకొనుచుండిరి. కాకతీయుల క్షత్రియత్వము వారి ప్రభుత్వముతోపాటు ఈ మధ్య పెరిగినది. చాళుక్యులు కాకతీయులతో వివాహసంబంధములు చేయుట హీనముగా భావించి యందు కుద్యుక్తులు కాకుండిరి. కాని వీరభద్రేశ్వరున కట్టి పూర్వాచారముల యందు విశ్వాసము లేదు. అదిగాక అత డిప్పటికే యొక క్షత్రియకన్యను వివాహ మాడియుండెను. తా నిప్పుడు రుద్రమదేవిని వివాహ మాడినచో నాంధ్రసామ్రాజ్యమునకే ప్రభుత్వము సంపాదింపగలుగును. పూర్వము మధ్యదేశమునంతయు బాలించిన చాళుక్యవంశప్రభ మరల కర్ణాటాంధ్రములలో తాను వెలిగించి యుద్ధరింపవచ్చు నని యతని కాశ కలిగెను. అందుచే నాతడు ప్రయత్నించి ఖడ్గయుద్ధమునను ధనుర్విద్య యందును రుద్రమదేవి నెదుర్కొని జయించి యామెను వరించి వివాహమాడి గణపతి దేవులకు ప్రియతము డయ్యెను.

గణపతిదేవుని ద్వితీయపుత్రిక గణపాంబ. ఆమెను ధాన్యకటకపాలకు డగు కోట బేతరాజున కిచ్చి వివాహ మొనర్చెను. పుత్రులు తనకు గలుగుదు రను నాశ యడుగంటినతర్వాత దౌహిత్రు లైన గలుగుదురేమో యని యాత డాశించెను. కాని దౌహిత్రులుకూడ కలుగు భాగ్య మాతనికి లేకపోయెను. రుద్రాంబిక కొక పుత్రిక కలిగెను. గణపాంబకు సంతతియే లేక బేతరాజు గతించెను. భర్తృరాజ్యమును గణపాంబయే పాలించుచుండెను.

రుద్రాంబసవతికి హరిహరుడు మురారిదేవుడు నను నిరువురు కుమారు లుండిరి. వారును వీరభద్రరాజుతోపాటు గణపతిదేవుని శ్రద్ధాభక్తులతో సేవించుచుండిరి. వారిరువురును దండనీతివిశారదులు. రాజలక్షణాలంఛితులు. గణపతిదేవునకును రాజపురుషులకును వారు ఆదరపాత్రులుగా నుండిరి. వారిలో పెద్దవా డగు హరిహరుడే గణపతిసామ్రాజ్యమునకు అనంతరపాలకు డగు నని యందరు దలంచుచుండిరి. గణపతిదేవుడుగూడ నదియే యాలోచించుచుండెను గాని ప్రత్యక్షముగా నెన్నడు నా మాట చెప్పలేదు. మర్యాదాదికములన్నియుమాత్ర మట్టి యూహనే బలపరచుచుండెను.

ఇట్లుండగా ఇప్పటికి నాలుగేండ్లక్రిందట నొక విశేషము జరిగినది. రుద్రమదేవికుమార్తెయగు ముమ్మడమ్మ మహాదేవరాజును వివాహమాడియుండెను. మహాదేవరాజుకూడ గణపతిని భక్తిభావముతో కొలుచుచు చక్రవర్తియనుగ్రహము సంపాదించుచుండెను. ఆ దంపతులకు నాలుగేళ్లనాడు కుమారుడు కలిగెను. ఆ కుమారుడు పుట్టినదియు ఏకశిలానగరముననే. దౌహిత్రజననవార్త రుద్రమదేవి వినగానే పుత్రజనన మైనట్లె యానందించెను. వెంటనే యా వార్త గణపతిదేవుల కెరిగించిరి. పాలిపోయియున్న చక్రవర్తిముఖమున రక్తపు జీరలు చిమ్మి కమలమువలె వికసించెను.

రాజజ్యోతిష్కులను సాముద్రికులను శాకునికులను రాజసన్నిధికి పిలిపించిరి. జ్యోతిష్కు లీ కుమారుడు మహాచక్రవర్తి యగు నని చక్రములు వేసి గుణించి నిశ్చయించిరి. సాముద్రికులు పసివాని శరీరము పరీక్షించి చక్రవర్తిచిహ్నములు కలవా డని యా మాటనే దృఢపరచిరి. శాకునికులు భవిష్యచ్చక్రవర్తి పుట్టెనని నిర్ధారణచేసిరి.

గణపతిదేవుని యాశాంకురము హృదయములో విచ్చెను. కాని దాని నాతడు పైకి పొక్కనీయలేదు. ఈ వంశాంకురము వృద్ధియై స్వతంత్రముగా నిలువగలుగు నంతవరకు తాను జీవించునా? ముందుగా తన యూహ తెలిసినచో పసివాని జీవితమున కెంత ప్రమాదము! ఐనను ప్రియపుత్రిక దౌహిత్రునిపై ప్రేమచూపుట వింత కాదుకదా! ఆ విధముగనే అత డా పసికందును అంగీకరించెను.

నామకరణోత్సవము మహావైభవముగా జరిగెను. ఆనాడు పరిషత్తులో రుద్రమదేవి పురుషవేషము ధరించి కుమారుని చేతులలో తీసికొని 'ఇడుగో నా కుమారుడు!' అని గణపతిదేవుల పాదములకు మ్రొక్కించెను. మహారాజు ప్రీతిపూర్వకముగా నాశీర్వదించి ప్రతాపరుద్రదేవు డని నామకరణముచేయ నాదేశించెను. మహాదేవరాజు 'మహాప్రసాద' మని ముత్యా లుంచిన బంగారుపళ్లెములో మణిఖచితాంగుళీయకముతో నర్భకుని కా వ్యవహారనామము వ్రాసి శ్రీకారము చుట్టి వినిపించెను. జయజయఘోషములు భూసురాశీరవములు మంగళవాద్యనాదములతో చెలంగెను.

తదాది దినదినము గణపతిదేవునకు ఆ యర్భకునిపై మమకార మతిశయింప సాగెను. ఆ యర్భకుడును రుద్రమదేవిని తల్లిగను గణపతిదేవుని తండ్రిగను భావించుచున్నట్లు పెరిగెను. బహుమానముగా మహాదేవరాజునకు మహామండలాధిపత్యపదవీలాంఛనము చక్రవర్తి ప్రసాదించెను.

గణపతిదేవుడు తన సామ్రాజ్యమునకు ప్రతాపరుద్రదేవునకే యౌవరాజ్య పట్టము కట్టవలెనను నిశ్చయము చేసెను. అంతవరకు హరిహరుడే రాజగు నని యందరు దలంచుచుండిరి. ఇప్పుడు ప్రజాహృదయములలో హరిహరమూర్తిని తొలగించి యా స్థానమున ప్రతాపరుద్రదేవమూర్తిని ప్రతిష్ఠించుటెట్లు?

ముదిమి వచ్చినది. దేహదార్ఢ్యము తగ్గినది. బుద్ధిలో తైక్ష్ణ్యముకూడ ఉజ్జ్వలముగా లేదు. అన్నిటికి దోడు వ్యాధి ప్రవేశించినది. జీవితశేష మెక్కువ లేనట్లు గోచరించుచున్నది. ఇట్టి స్థితిలో తన పుత్రికాదౌహిత్రుని రాజ్యమున స్థిరమొనర్చుటెట్లు?

ఇట్టి సందర్భములలో నవరాత్రోత్సవము జరుపవలసివచ్చినది. ఆ యుత్సవ మెవరిమీదుగా జరిపించిన, వాడు భవిష్యత్ప్రభువు కాగల డని చక్రవర్తి నియమించినట్లే!

అందుకై యీ మహాలయామావాస్యనాడు గణపతిదేవరాయలు అంతరంగిక మహాసభ చేసెను.

౨

"త్వంగత్పింగజటాకిరీట ముదయస్మేరారవిందాననమ్
ముక్తాకుండలతాడితాంసశిఖరం హారైర్మనోహారిణమ్
విద్యామండపవర్తినం గణపతిక్ష్మాపాలదీక్షాగురుమ్
శ్రీవిశ్వేశ్వరశంభు మీక్షితవతాం తే చక్షుషీ చక్షుషీ."

ఆ మహాసభకు ప్రధాన, మంత్రి, పురోహిత, దండనాథ సామంతులు వచ్చిరి. అందు గణపతిదేవులు వెనుకకు వ్రాలియుండున ట్లమర్చిన మనోజ్ఞాసనమున వైద్యుల నియోగమున నుపవిష్టుడై యుండెను. ఆతని దక్షిణపార్శ్వమున నున్నతాసనమున రుద్రమదేవి వీరపురుష వేషమ్ము ధరించి కూరుచుండెను. వా రిరువురనడుమ రత్నఖచితాసనమున నాలుగేండ్లబాలుఁ డగు ప్రతాపరుద్రదేవు నాసీను గావించిరి. గణపతి వామపార్శ్వమున వీరభద్రరాజును ఆతని ప్రక్కను హరిహరమురారిదేవులును ఆపై మహాదేవరాజును జాయపనాయకుడును మిగిలిన సభ్యులును యథోచితస్థానముల నలంకరించియుండిరి. ఎవరితోడను గలయక రాజగురువు లగు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు ప్రత్యేకము సమున్నతాసనమున వెలుగుచుండెను.

వందిమాగధుల కైవారము లైనవి. ఇతర రాచమర్యాదలును పూర్తి యైనవి. అంతట మహాప్రధాని శ్రీమత్ గోవిందనాయకుడు లేచి రాజగురువులకును మహారాజునకును సభకును చేతు లొగ్గి యిట్లు సభాప్రారంభ మొనర్చెను.

"శ్రీమత్ మహారాజ రాజపరమేశ్వరులు శ్రీగణపతిదేవులు అస్వస్థులై యున్నారు. ఈ యేట నవరాత్రదీక్షకు వారికి ప్రతినిధులుగా కూర్చుండుటకు యుక్త మగువారిని నియమించి యట్టివారికి విజయదశమికి యౌవరాజ్యాభిషేకము గావించి రాజ్యభారము వారిపై నుంచి విశ్రాంతి గైకొని నిరంతరము భగవచ్చింతతో కాలముగడప నిశ్చయించినారు. యౌవరాజ్యపట్టమున కధికారనిర్ణయము ప్రకృతుల సమక్షమున జేయు ననూచానాచారము నవలంబించి యీ మహాసభ చేసి యున్నారు. పరిషదనుజ్ఞ పొంద మహారాజరాజపరమేశ్వరులు ఇచ్ఛయించు చున్నారు."

దూరభాగములనుండి వచ్చిన సభ్యులకీ ప్రకటన కొంత యాశ్చర్యము కలిగించినది. వారందరకు హరిహరదేవుడే యువరాజగు నను నిశ్చయభావ మున్నది. మరి ముందుగనే హరిహరదేవుని నామ మెందుకు ప్రకటింపబడలేదు ?

రాజబంధువులలో పలువురకు హరిహరదేవుడు యువరా జగుట సమ్మతము కాదు. అతడు గణపతికి రక్తస్పర్శకల బంధువు కాడు. అట్టి రాజబంధువుల కీ ప్రకటన యెంతయు రుచించెను.

ఒక్క క్షణకాలము సభ నిశ్శబ్దముగా నుండెను. అంతట చాళుక్యవీరభద్రేశ్వరుడు లేచి చక్రవర్తికి మ్రొక్కి యిట్లు విన్నవించెను:

“సార్వభౌములతో మాకు గల సన్నిహితబంధుత్వముచే మేము ముందు మనవి చేయుట సభవారికి సమ్మతమని తలంతుము. మా పుత్రులగు హరిహరదేవరాజులు మహారాజులకు ధర్మశాస్త్రరీత్యా దౌహిత్రులే యగుదురు. పుత్రాభావమున దౌహిత్రుడు పుత్రునంతటివాడు. మా పుత్రులు చిన్ననాటినుండియు చక్రవర్తులను సేవించి వారికి ప్రేమపాత్రులై యఖిలవిద్యలు వారి సన్నిధానముననే అభ్యసించినారు. సర్వవిధముల హరిహరదేవరాజులే యౌవరాజ్యపట్టమును మహారాజానుగ్రహముచే పొందుటకు పాత్రు లని యీ మహాసభాసమక్షమున దేవరవారికి విన్నవించుకొనుచున్నాము. ఈ సభలో నందుకు భిన్నమగు చింత యుండ దని తలంతుము.”

వీరభద్రేశ్వరుని మాటలు విని సభయంతయు జలదరించి నిశ్శబ్దముగా నుండెను. అతడు నిర్వచించినది ధర్మము కా దని ప్రత్యాఖ్యానము చేయ నెవ్వరికి శక్యము కాకపోయెను. ప్రతాపరుద్రదేవులు జన్మించువరకు భవిష్యత్ప్రభువు హరిహరదేవరాజే యగు నని మంత్రిసామంతమండలము భావించుచుండినదియు వాస్తవమే. కాని ముమ్మడమ్మకుమారుడు జన్మించినదాది గణపతిదేవుల యూహలో కలిగిన మార్పు మహామాత్యులకు తెలియును. ఐతే చక్రవర్తుల యభీప్సిత మీ మహాసభలో సమర్థించు టెట్లు? అందును వారి కట్టి యవకాశము లేకుండ ముందుగనే వీరభద్రేశ్వరుడు ధర్మప్రస్తావముకూడ చేయుటచే వారి ప్రయత్నము మరింత క్లిష్టతర మయ్యెను. ప్రతాపరుద్రదేవుని వారసత్వము ధర్మబద్ధ మని నిరూపించు టెట్లు? దుహితృదౌహిత్రునికి ఎక్కడ నైనను దాయభాగ ముండునా? అట్టివానిని ధర్మవిదులు ఆత్మబంధువులలో నైన నుదహరించిరా? మహామాత్యు లొకరి మొగము లొకరు చూచుకొనిరి.

మహాప్రధాని గోవిందనాయకుని చూ పందుకొని మరియొక మహాప్రధాని యగు బయ్యనానాయకుడు కార్యభరణు డగు దామనామాత్యునివంక జూచెను. దామనామాత్యుడు మహాదేవరాజువంక సార్థకముగా ప్రోత్సహించుచు చూచెను.

మహాదేవరాజు కేవలఖడ్గవాదికాని కార్యవాదమునందు నిపుణుడు కాడు. అతని మాట సూటిగా, కొంచెము పెటుకుగా నుండును. 'ఆ మోటుదనములో గూడ గొంత యాకర్షణ మున్నది. అతని మనస్సులోని అమాయకత్వము వింతయైన నిర్భయత యాతనికి అలవరచెను. మహాదేవరాజు లేచెను. లేచి వెంటనే ముందు విశ్వేశ్వరశంభువులకు వంద— రించి పిమ్మట గణపతిదేవులకును మహాసభకును

మ్రొక్కెను. అంతట నంతకుమునుపే ఎక్కువభాగము వల్లించుకొనియున్న ఉపన్యాస మిట్లు చేసెను.

"శ్రీమత్ మహారాజాధిరాజ రాజపరమేశ్వర శ్రీగణపతిదేవచక్రవర్తులకు అపరప్రాణ మగు వారి ఆత్మజాత శ్రీమతిరుద్రమదేవులతో మాకు గల సమీపబాంధవ్యముపురస్కరించుకొని మేము ఈ మహాసభాసమక్షమున చేయవలసిన విన్నపమున్నది. పూజ్యులగు మా శ్వసురులు శ్రీవీరభద్రేశ్వరులు పల్కిన వాక్యములు మాననీయములే. శ్రీహరిహరదేవరాయలును మా కెంతయు నిష్టులే. మా కుమారులు శ్రీప్రతాపరుద్రదేవుల నటు ఒకమారు తిలకింపుడు! వారు రుద్రమదేవులకు దౌహిత్రులనుట యేమి? జన్మప్రభృతి రుద్రమదేవులు దత్తపుత్రునిగా గ్రహించి స్వకీయపుత్రునివలెనే పెంచుచున్నారు. దేవరవారును పుత్రనిర్విశేషముగా కటాక్షించుచున్నారు. తద్రీత్యా ప్రతాపరుద్రదేవులే రాజాధిరాజరాజపరమేశ్వరులకు రక్తస్పర్శ కల దౌహిత్రులును ముఖ్యవారసులును ఐయున్నారు. చక్రవర్తిసర్భలక్షణలక్షితులని జ్యౌతిషికులును సాముద్రికులును శాకునికులును జన్మకాలముననే ప్రభువుల సమక్షమున నేకగ్రీవముగా నిర్ణయించినారు. దేవర కిప్పుడు అవ్యవహితముగా దక్షిణపార్శ్వమున సుభాసనాంకితుల జేయుట ప్రతాపరుద్రదేవులే యువరాజపదవీభాజను లని నిరూపితమైన దని మనవి చేయుచున్నాము."

ఇంత సంగతముగా నాతడు మాట్లాడుట పలువుర కాశ్చర్య మయ్యెను. ఇవి మహాదేవరాజుమాటలేనా? ఆ మాటలు విన్న సభ్యుల ముఖములలో నశాంతి యించుక వ్యక్త మయ్యెను. ఆసనవిధిలో హరిహరదేవుని దూరమున నుంచి ప్రతాపరుద్రదేవుని చక్రవర్తిదక్షసన్నిధానమున నుంచుటలో దూరార్థము ధ్వనించెను.

చాళుక్యవీరభద్రేశ్వరు డిట్లు ప్రతివచన మొనర్చెను. అతని ముఖమునను కంఠమునను ఎట్టి కలతగాని తొందరగాని స్ఫురింపలేదు. పరమశాంతముగా నుండెను.

"స్త్రీలు తమ భర్తకు పుత్రు లుండగా స్వయముగా దత్తపుత్రగ్రహణ మొనర్చుట మే మెక్కడను ధర్మజ్ఞులవలన వినియుండలేదు. ఈనాడు మా జామాతలు మహాదేవరాజులుంగారు విశేషధర్మము ప్రవచించుచున్నారు. మా దౌహిత్రులు ప్రతాపరుద్రదేవులు గణపతిదేవుల దౌహిత్రులగుట ఎట్లు? ఇది చక్రవర్తులును ధర్మవిదు లగు నీ సభాసదులును అంగీకరింతురా?"

చక్రవర్తి మాటాడలేదు. మహాప్రధాని శ్రీమత్ గోవిందనాయకుడు సభవారిని అభిప్రాయము తెలుప నర్థించెను.

కోటకేతరాజు వీరభద్రేశ్వరుని మాటలు సమర్థించెను. ఇతడు గణపతిదేవుని మేనగోడ లగు బయ్యలదేవిభర్త. ధరణికోటవాడు. బౌద్ధమతాభిమాని. అల్లే రేచర్ల రుద్రరెడ్డియు, కామిరెడ్డియు వీరభద్రేశ్వరుని వాదము బలపరచిరి. ఆ రెడ్డి

పేరు లిరువురును గణపతిదేవుడు దేవగిరిచెరసాలనుండి వచ్చిననాటికి హనుమకొండ రాజ్యమును రక్షించి ప్రభువు కప్పగించి కాకతిరాజ్యభారధౌరేయు డని యన్వర్థ నామము వహించిన ప్రఖ్యాతరుద్రసేనానివంశమువారలు. వారల కా సభలో గౌరవము కలదు.

మహాప్రధాని యగు బయ్యననాయకుడును, మేచయనాయకుడును, తిక్కచమూపతియు, ప్రోలరౌతును, సివిరి అన్నయమంత్రియు, పర్వతనాయకుడును, ఆదిదమ్మరాజు, వల్లనాయకు డును మరికొందరును మహాదేవరాజుపక్షము వహించిరి.

అంతట వీరభల్లటదేశికు లను జైనాచార్యు లిట్లు వాక్రుచ్చిరి:

"ఈ యిరుపక్షములను పలువురు మాట్లాడినారు. కాని శ్రీ వీరభద్రేశ్వరులు నిర్వచించిన ధర్మము నిందు ఖండించినవా రొక్కరును లేరు. శ్రీహరిహరదేవరాయలు చక్రవర్తు లగు శ్రీగణపతిదేవులకు ధర్మశాస్త్రరీత్యా దౌహిత్రులు, నందుచే ముఖ్యమగు వారసులు నగుదురు. శ్రీ రుద్రమదేవులు అంతకంటె సన్నిహితులే యైనను నిర్బీజులగు స్త్రీలకు రాజ్యపరిపాలనాధికారము లేనందున ఆమె జ్యేష్ఠపుత్రు లగు శ్రీ హరిహరదేవరాయలే యావరాజ్యపదవికి యోగ్యు లనుటకు మా కెట్టి సందియము లేదు. శ్రీ ప్రతాపరుద్రదేవులతో శ్రీ గణపతిదేవులకు గల రక్తస్పర్శరీత్యా పుత్రనిర్విశేషముగా ప్రేమించి పెంచుట సహజమే. కాని వారికి రాజ్యాధికారము సంక్రమింపజేయుట కేవలము ఆత్మేచ్ఛచే చేయవలసినదికాని ధర్మనిర్దేశమున జేయునది కానేరదు. ప్రేమపాశములను ప్రభువులు ధర్మపాశముచే బంధించి యమించుట రాజనీతి."

ఇంత విస్పష్టముగా నా జైనాచార్యులు వివరింపగా మహాదేవరాజుముఖము కోపముతో నెఱ్ఱవారెను. దేహ మంతయు కంపించెను. ఏదో మాటాడబోయెనుగాని నోట మాట రాలేదు.

మహాప్రధాని శ్రీమత్ గోవిందనాయకుడు జైనాచార్యుల వాక్యములలోని సూక్ష్మము గ్రహించెను. కాని ఆతని వాక్యతీవ్రత సహింపలేకపోయెను. బయ్యననాయకుడు, మేచయనాయకుడు, తిక్కచమూపతి, ప్రోలరౌతు, పర్వతనాయకుడు, ఆదిదమ్మ, వల్లనాయకుడు ఇత్యాదులు క్రుద్ధులై అప్రయత్నముగా ఒరలలో నున్న తమ ఖడ్గముల పిడులపై చేతు లుంచి లేవబోవుచుగూడ తాము రాజసభాముఖమున నున్నది జ్ఞప్తికి తెచ్చుకొని ప్రయత్నపూర్వకముగా చేతులు దింపి శ్రీగణపతిదేవుల వంకను రుద్రమదేవివంకను విధేయదృష్టులతో దిలకించిరి.

రుద్రమదేవికి ఒకవంక భర్తృపక్షము, మఱియొకవంక తన ప్రియదౌహిత్రునికై వాదించు నల్లుని పక్షము ! ఒకవంక గౌరవము, రెండవవంక ప్రేమ,—ఈ రెండు భావములును ఆమెహృదయములో మహాయుద్ధము చేయుచుండెను. ఐనను ఆమెకు

మనోభావములు పొంగనీయకుండుట చిరతరాభ్యస్తమైనందున శాంతముగా చిరునవ్వు విడువని ముఖముతో నిర్లిప్తముగా గాన్పించెను.

వృద్ధులును వ్యాధిగ్రస్తులును నగు గణపతిదేవులుమాత్రము వెనుకటి యాత్మసంయమనము కనబరచలేకపోయిరి. ఆయనముఖమున కొక్కసారిగా రక్తము పరుగెత్తెను. అందుపై దేహ మొక్కింతుక కంపించెను. సమీపవర్తులగు సేవకు లౌషధ మొకటి త్రావించిరి. ఐనను అతని కన్నులు చంద్రనిప్పులవలె కణకణ లాడుచుండెను.

కార్యభరణు డగు దామనామాత్యుడు సభాస్థితి సూక్ష్మముగా గ్రహించి యి ట్లనెను.

"శ్రీ వీరభల్లటదేశికులు పూజ్యులే. ఐనను ఈ మహాసభలో శ్రీవిశ్వేశ్వర శంభుదేశికులును మరియు నిందరు పెద్దలును ఉండగా వా రొక్కరే ధర్మవేదులైనట్లు పల్కిన తీవ్రవాక్యములు సహించుట కష్టతరముగా నున్నది."

ఇట్లనుచు నాతడు శ్రీరాజగురువులవంకను ప్రత్యేకాహూతులై చేరిన పండితబృందమువంకను నిర్దేశించెను.

అంతట మహాప్రధానులు గోవిందనాయక బయ్యనాయకులును, తిక్కచమూపతియు, మేచయనాయకాదులును పరిపరివిధముల శ్రీవీరభల్లటదేశికుల వాక్పారుష్యమును ఖండించిరి. గణపతిదేవచక్రవర్తులు శాంతించి నిట్టూర్పు విడిచిరి.

మహాప్రధానులును బలవంతు లగు నితరముఖ్యసభాసదులు పలువురును అంతరంగములలో మహాదేవరాజుపక్షపాతులుగా నున్నా రని వీరభద్రేశ్వరునకు విదిత మయ్యెను. అతని కది ఉద్వేగము కలిగించి భరింపజాలక యి ట్లనెను.

"శ్రీ వీరభల్లటదేశికుల ధర్మదీక్ష మన మందర మెరిగినదే. వారి వాక్యములు తీక్ష్ణముగా నున్న వని యిందరు వచించుచున్నారు. కాని వారు చేసిన ధర్మనిర్ణయమును ఖండించినవా రొక్కరు నీ సభలో లేరు. ధర్మము ఖడ్గమువలెనే ఒక్కొక్కచో నిశిత మైన దని ధర్మవిదులకు తెలియనిది కాదు. కార్యభరణు లగు శ్రీదామనామాత్యులు ఈ సభలో ధర్మవేదులు శ్రీవీరభల్లటదేశికు లొక్కరే కా దని సెల విచ్చినారు. నిజమే! రాజగురువులు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు ప్రత్యక్షముగా నుండగా వారి నిర్ణయమైనను ఈ సభవారికిని శ్రీచక్రవర్తులకును సమ్మతముగా నుండదా? ఈవిషయమున ధర్మనిర్ణయము చేయుటకే సభాముఖమున శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల నర్థించుచున్నాము!"

దానితో సభ ఒక్కసారిగా మూగవారిపోయినది. వా రేమి సెల విత్తురో యని సభవా రందరు సంశయభయోద్వేగములతో సుద్రిక్తులైరి.

ఈ విశ్వేశ్వరశంభువులకు చోళమాళవరాజులు శిష్యులు. ఆ మహానుభావుడు కలచురిరాజుకు దీక్షాగురువు. శ్రీ గణపతిదేవులా తపస్విని నిజజనకునిగా భావించి తండ్రీ యనియే సంబోధింతురు. వా రాయనకు వెలినాడువిషయములో కండ్రవాటి యందు కృష్ణానదీదక్షిణతీరమున మందర మను గ్రామము నగ్రహారముగా సమర్పించిరి. వా రందు తపస్సు చేసికొనుచు శిష్యసంతతులకు విద్యాదానమును అభ్యాగతు లగు కవిపండితజనములకు భూరిదానములును చాతుర్వర్ణ్యజనములకే గాక చండాలురకుగూడ వాత్సల్యముతో నిరతాన్నదానమును చేయుచు కాలము గడుపుచుందురు. వారు పరమశాంతులు, దాంతులు; స్వాంతమందు వారికి ధూర్జటిమూర్తి సదా భాసించుచుండును. వేదవేదాంత వేత్త; శుద్ధశైవాగమాంభోనిధి; ధర్మదీక్షితుడు. ఈ నవరాత్రవిధులు నిర్వర్తించుటకు శ్రీ గణపతిదేవుల విశేషాభ్యర్థనచే రాజధానీనగరమునకు దయచేసియున్నారు.

వారి శిరస్సున వెలుగుచున్న పింగజటాకలాపము కిరీటమువలె ప్రకాశించుచుండెను. ముఖారవిందమున చిరునవ్వు విలసిల్లుచుండెను. వారి ముక్తాకుండలములు భుజాగ్రములపై వ్రేలుచు సూర్యచంద్రబింబములవలె భాసించుచుండెను. వారి విశాల వక్షస్థ్సలమున బంగారు పొదివిన రుద్రాక్షమాలయు స్ఫటికాక్షమాలయు రత్నమాలయు మనోజ్ఞముగా విరాజిల్లుచుండెను. వారు మంచి స్ఫురద్రూపులు. ఉన్నతమును విపులమును నగు వారి శరీరము పద్మరాగచ్ఛాయ గలది.

శ్రీవీరభద్రేశ్వరుడు వారిని ధర్మనిర్ణయము చేయు డని వేడినంతనే నీరవమైన యా సభలో కొంచెము గుసగుసలు ఎక్కడెక్కడనో ప్రారంభించెను. శ్రీరాజగురువులు వెంటనే ప్రత్యుత్తర మీయలేదు. కతిపయకాలము వారు ధ్యానసమాధిమగ్నులైనట్లు కనిపించిరి. అంతలో వారు రత్నకంకణములతో దేదీప్యమాన మగు దక్షిణకర మెక్కింత యెత్తిరి. అంతలో సభ మరల నిశ్శబ్దమయ్యెను. గుసగుస లడగిపోయెను. ధీరగంభీరవాక్కులతో వా రిట్లు సెల విచ్చిరి.

"మేము మౌనము వహించి యీ మహాసభ దర్శించి మాకు పుత్రనిర్విశేషు లగు గణపతిదేవచక్రవర్తులను యౌవరాజ్యపట్టభద్రులను ఆశీర్వదించి వెళ్లదలచి యుంటిమి. మా కిట్లని నిర్దేశించు నిచ్ఛలేదు. కాని శివాజ్ఞచే శ్రీవీరభద్రేశ్వరులు మా పేరెత్తి నిర్ణయింప నర్థించినారు. అందుచే మే మిక మౌనమువహించుట ధర్మము కాని యవస్థ కలిగినది.

"ఇది రాజబంధువులకును మహాప్రధానులకును దండనాథులకును సామంతులకును అభిప్రాయభేదము లుండదగిన సమయము కాదు. సమయధర్మము విశేషమైనది. అదియు బహుసూక్ష్మతరము!"

"ఇటు వీరభద్రేశ్వరులును అటు శ్రీమహాదేవరాజులును శ్రీరుద్రమదేవుల వల్లనేకదా సన్నిహితబాంధవ్య మున్న దని వివదించుచున్నది! సమస్తవిద్యలు

నభ్యసించి వీరావతారమై ప్రత్యక్షముగా పురుషసింహాకారముతో శ్రీగణపతిదేవ చక్రవర్తుల దక్షపార్శ్వము నలంకరించి శ్రీరుద్రమదేవి శ్రీరుద్రదేవమహారాజులుగా మూర్తిమంతమై మా కన్నులకు పొడకట్టుచున్నది. ఈ సభవారి కది ఎందుకు తోచకున్నదో మరి!"

శ్రీగణపతిదేవచక్రవర్తిపలితమైనముఖములోనుండి హిమాచలముపై నుదయించిన చంద్రరేఖవలె నొక చిరునవ్వు ద్యోతమయ్యెను.

"రాజగురువుల యాజ్ఞ శివాజ్ఞ!"

ముదిసిన సింహముగర్జనమువలె శ్రీగణపతిదేవుల కంఠము సభాస్థానమంతయు విస్పష్టముగా వినబడెను!

మరుక్షణమున ఒక్కసారిగా వందిమాగధకంఠములతోపాటు సామంతమంత్రిమండలముకంఠములనుండి, "జయ, రుద్రదేవమహారాజ, జయ!" అను జయజయనినాదము లుప్పతిల్లెను.

రుద్రదేవమహారాజు ధీరగంభీరముగా లేచి నిలువున నిలుచుండెను. ముందుగా నామె రాజగురువులకును పిమ్మట చక్రవర్తులకును పాదాభివందనము చేయ వారాశీర్వదించిరి. అంతట నామె వీరభద్రేశ్వరుల యాసనము సమీపింప నాతడును లేచి నిలుచుండెను. ఆమె నిష్కంపముగా భర్తకు పాదాభివందనము చేయ నాతడు రోషరుద్ధకంఠముతో దీవించెను. అంతట నామె మేనమామయును జాయపనాయకునకు పాదాభివందనము చేయ నాతడు వాత్సల్యముతో నాశీర్వదించెను.

రాజపురోహితు లంతట యథాక్రమముగా సువర్ణరత్నాక్షతలు పంచిపెట్టెను. శ్రీ రుద్రదేవమహారాజు నిలుచుండి శిరస్సు వంచి సభకు నమస్కరించెను. వేదవిదులు స్వస్తివాచనము చేసిరి. రాజపురోహితుడు ఆశీర్వచనములు చెప్పుచుండగా సభ్యులు తథాస్తువచనములతో నక్షతలు శ్రీ రుద్రదేవమహారాజుపై జల్లిరి. కాని శ్రీ వీరభద్రేశ్వరులయు శ్రీ వీరభల్లటదేశికులయు నక్షత లామెపై బడలేదు.

మహాప్రధానులు శ్రీమన్ గోవిందనాయక బయ్యనసాయకులు జ్యోతిషికుని రాజపురోహితుని నాలోచించి శ్రీ రాజగురువులతోడను మహారాజుతోడను కొంత సంప్రతించిరి. అంతట శ్రీమన్ గోవిందనాయకుడు మహారాజుల శాసన మిట్లు ప్రకటించెను:

"రేపటినుండి శ్రీ గణపతిదేవచక్రవర్తులకు ప్రతినిధిగా శ్రీ రుద్రదేవమహారాజులే శరన్నవరాత్రిపూజలు నిర్వర్తించి విజయదశమినాడు యౌవరాజ్యాభిషేకము పొందెదరు. ఆనాటి సాయంత్రము సామంతులును, మండలేశ్వరులును, దండనాథులును యువరాజపూజకు పేరోలగమున సమావేశము కావలె నని పెద్దల నిర్ణయమైన దని శ్రీ రాజపరమేశ్వరులు శాసించుచున్నారు."

"శివాజ్ఞ !"యని రాజగురువులు మహేశ్వరస్మరణ చేసిరి.

వెంటనే చక్రవర్తియనుమతితో నగరిగోపురద్వారమునొద్ద కూడిన జనసమూహములకీ వార్త రాజదూతి ఉత్సాహముతో ప్రకటించెను. నగరివాకిట జనుల జయజయనినాదములు మిన్నుముట్టెను.

ఉదయమునుండి తన్నాచ్ఛాదించిన మేఘముల తెర చీల్చుకొని భాస్కరుడు సముజ్జ్వలముగా ప్రకాశించెను.

వెంటనే రాజశాసనము వార్తాహరులు ఏకశిలానగరమువాడవాడల వీథివీథుల ప్రకటించిరి. అఖండసామంతమండలేశ్వరు లందరు విధిగా విజయదశమికి పూర్వమే రాజధానీనగరమున సమావేశము కావలె నను శాసనమును ఆహ్వానమును శీఘ్రవార్తాహరులగు నాశ్వికులు గ్రహించి వెడలిపోయిరి.

సభవా రందరు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల ధర్మజ్ఞసమయమును వేనోళ్ల శ్లాఘింపసాగిరి. పరమేశ్వరానుగ్రహము గలవారికిగాని సిద్ధవాక్కులు లభ్యమగునా?– ఎన్నిగ్రంథములు తిరుగవేసినా మనుకున్న నేమి లాభము!—

ఆ మహాకోలాహలములో వీరభద్రేశ్వరులును హరిహరదేవరాయలునుగాని, మహాదేవరాజులుగాని ఏ మనుకొనుచుండిరో కూడ గమనించినవారు లేకపోయిరి. శ్రీ వీరభల్లటదేశికుల ముఖము విన్నన య్యెను. ఆయన కా సభలో వాగ్బంధమై చిత్తరువులోని బొమ్మవలె నిలిచిపోయెను.

3

సభానంతరమున శ్రీ రుద్రమదేవి యాత్మమందిరమునకు ప్రయాణమయ్యెను. దారి పొడుగున నందరు "శ్రీరుద్రదేవమహారాజా జయ!" అని యామెకు జయాభినందనములు చేయుచుండిరి. ఆమె సవినయముగా తలయొగ్గి వారల జయశబ్దములు స్వీకరించుచు కన్నులలో చిరునవ్వువెన్నెలను ప్రతిఫలింపజేయుచుండెను. ఆమె మందిరము చేరగనే మందిరపాలకులుకూడ నట్లె జయజయనాదము లొనర్చిరి. చెలికత్తెలు మంగళారార్తికము లొసంగి దృష్టితీసిరి. దాసదాసీజనమును వృద్ధకంచుకులును ఆమెచుట్టు చేరి ప్రీతిపురస్సరముగా నామెను బహువిధముల ప్రశంసింపసాగిరి. ఆమె పరమశాంతముగా నాదరముతో నందరి యభినందనము లందుకొనుచుండెను. ఆ సందడి చీకటిపడువరకు తగ్గలేదు.

దీపములు వెలిగించువేళ కామె యేకాంతమందిరమునకు విశ్రాంతికై చేరెను. పరిచారిక యొక్కతె యామె ధరించిన పురుషవస్త్రము లూడ్చి స్త్రీజనోచితములగు వలువలు ధరింపజేసి తొలగి చనెను.

వెంటనే రుద్రమదేవి నిలువున మారిపోయెను. రాజసభలో మహావీరసమాజమున వీరాధివీరావతారముగా కనుపించిన దీ మూర్తియేనా? వేషముతోపాటు స్వభావముకూడ మారిపోవునా! ఇప్పుడామె దీనముగా శయ్యపై మేనువాల్చెను. అచ్చట నామె కాంతరంగికురాలగు రుయ్యాంబమాత్ర ముండెను.

రుద్రమదేవి నానాడందరు నభినందించిరి. కాని యామె యాంతరంగికురాలగు నీ రుయ్యాంబ యొక్కతెమాత్ర మభినందింపలేదు. ఆమె పదునారేండ్ల యువతి. నిండుయౌవనములో నున్న యామెముఖమున విశిష్టమైన ప్రౌఢత యొకటి గోచరించుచుండెను. ఆమెకు పసితనముననే తల్లి గతించినది. ఆమెతండ్రి రుద్రాంబికకు విలువిద్య నేర్పిన ఆచార్యుడు. రెండేళ్లకే ఆ పిల్లకు అసహాయస్థితి సంభవించినది. రుద్రమదేవి యిది తెలియగానే తండ్రియనుమతితో దానిని తన పుత్రికగా స్వీకరించినది. అప్పటినుండి యామెను తన పుత్రికకంటె ప్రేమాతిశయముతో పెంచినది. కాలవికాలమ్మునకే యా బాలికతండ్రికూడ కాలధర్మము నొందుటచే వారి యనుబంధము దృఢతర మయ్యెను. ఆ బ్రాహ్మణబాలికకు రుద్రాంబయే తల్లియు, తండ్రియు. వారిమధ్య వ్యవహారము లన్నియు తల్లికూతుండ్రకువలెనే జరుగుచుండెను. రుయ్యాంబకు బుద్ధి మిక్కిలి సూక్ష్మమైనందున సమస్తవిద్యలు శీఘ్రముగా నభ్యసించుటయేకాక రుద్రమకును అంతఃపురజనముల కందరకును ప్రీతిగౌరవభాజన కాగలిగెను.

రుద్రమ వ్రాలిన శయ్యకు సమీపముగా నున్న యాసనముపై రుయ్యమ్మ కూర్చుండి రుద్రమవంక తదేకదృష్టితో చూచుచుండెను. రుద్రమ కనులు మూసియే

యుండెను. కాని — మూసియున్న రుద్రమకన్నులలోనికిఁగూడ రుయ్యమ్మదృష్టి కాంతులు ప్రసరించుచున్నట్లుండెను.

ఇంతలో రుద్రమ పెదవులు కదలెను. కన్నులుమాత్రము ఇంకను మూసికొనియే యుండెను.

“అమ్మాయీ, నీవు నాకు జయాభినందనము చేయలేదేమి?”

“అందరూ చేసిరిగదమ్మా!”

“అమ్మాయీ, నా కానందముగా లేదు!”

“నీ కానందముగా లేనిదానికి నే నెట్లు జయజయనినాదము చేయగలనే తల్లీ?”

“న న్నొక్కసారి కౌఁగిలించుకో!”

రుయ్యాంబ రుద్రమదేవివక్షఃస్థలముపై తన శిర స్సుంచి రెండుచేతుల నామె శిరస్సును పొదివెను.

“అమ్మా! నీ కన్నుల నీరు రానీయకు, నే చూడలేనే!”

రుద్రమదేవి నెమ్మదిగా తన కనుకొలుకులలోని ముత్యాలు తుడుచుకొనుచు కనురెప్పలు విప్పెను. మరల రుయ్యాంబ యడిగెను.

“అమ్మా, నీ గుండెలు జలయంత్రమువలె ఇట్లు కొట్టుకొనుచున్నవేమే?”

“జరిగిన దంతయు నీ వెరుగుదువా?”

“రాణివాసము సోరణగండ్లనుండి సభాస్థానమునంతయు శ్రద్ధగా చూచితిని.”

“కామసాని నీప్రక్క నున్నదా?”

“ఉన్నది. శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు నిర్వచించువరకు కామసానికిని నావలెనే గుండెలు దడదడలాడుచుండెను. వారి వాక్కులు వినగానే ఆ ముడుతలుపడ్డ కామసానిముఖము ఒక్కసారిగా వికసించినది. అప్పుడామె చిన్నతనములో ఎంత అందముగా ఉండెడిదో కొంత ఊహింపగలిగితిని.”

“అమ్మాయీ, మరి నీకో?”

“ఎందుకమ్మా, నా నోట చెప్పించుట? నీ వూహించలేవుటమ్మా?”

“కాదు నీనోటనే వినవలె నమ్మాయీ!”

“అయితే మరే, శ్రీవిశ్వేశ్వరశంభువుల వాక్కులు వినగానే, నా గుండె లాగిపోయినవి—కొంతసేపు నిలువుచూపు పడ్డది. మరల భూదేవులు ఆశీర్వచనమునకు ఉపక్రమించుచు చేసిన ప్రణవోచ్చారణముతో నా సర్వాంగము సుద్బుద్ధమయినది— అమ్మా, ఐనను శ్రీవీరభద్రేశ్వరులు వదలిన అక్షతలు నీ శిరస్సుపై పడిఉన్నచో నా కానందము కలిగిఉండేదే!”

"అమ్మాయీ, అదికూడా నీకంటబడినదా?"

"కామసాని కళ్లలోకూడా పడినది. ఆమెకు క్రోధావేశముతో ఒళ్లు ఉడికినది."

"మరి, నీకో?"

"ఎందుకమ్మా, ఇంత వాచ్యముగా నానోట అనిపించుచున్నావు?—నాకు దిగులుతో గుండెలు జారినవి."

"కామసానిని ఒకసారి పిలిపించగలవా?"

రయ్యమ్మ పరుగెత్తుకొనిపోయి కామసానిని పిలుచుకొనివచ్చెను.

కామసాని ఎనుబదేళ్ల వృద్ధ. ఆమె రుద్రమదేవితల్లులగు నారాంబపేరాంబలతో కృష్ణాముఖద్వారమందలి క్రొయ్యూరునుండి దాసిగా చెలికత్తెగా చేటికగా వచ్చెను. నారమ, పేరమలకు జాయపనాయకుడు సోదరుడు. వారల తండ్రి పినచోడినాయకుడు క్రొయ్యూరుపాలకుడై యుండగ గణపతిదేవుడాతని తన దిగ్విజయయాత్రలో జయించి కూతుండ్ర నిరువుర బెండ్లియాడి జాయపనాయకునికి తన గజసైన్యాధ్యక్ష పదవి యొసంగెను. పేరమను సోమమ యనికూడ నందురు.

కామసానియే రుద్రమదేవి దాది. ఆమెచర్మము పండి ఎండిన మామిడిపండు వలె ముడుతలు పడియుండును. ఆమె కనుబొమ్మలలోని కండ లెండినందున వాని చర్మము కన్నులమీదికి తెరలవలె వ్రేలాడుచుండెను. ఆమె తల ఎత్తినప్పుడు లోపల లోతుగా నున్న చిన్న కన్నులు మిణుగురుపురుగులవలె మిలమిలలాడి యాకర్షించును. ఆమెనడుములో వార్ధకముచే బలహీనమైనను వంగక ప్రయత్నపూర్వకముగా నిలువదీసికొని నిరారుగా నిలుచుండును.

ఆమె వచ్చుచునే నిండారుప్రేమతో రుద్రమదేవిచెక్కుల రెంటిని తన రెండు చేతులతో దువ్వి యా చేతులు తన చెక్కులపై పెట్టుకొని మెటికలు విరుచుకొనెను. అంతట నామె యాదరముతో రుద్రమదేవివెన్నుక్రింద నొక చేయియు మధ్యముపై రెండవ చేయియు నుంచి లేవదీసి శయ్యపై కూర్చుండ జేసెను. రుద్రమ తనవైపు చూచుటకు వెనుదీయుచున్న దనికూడ గమనించక పొంగారుచున్న వాత్సల్యముతో తన వార్ధకసహజ మగు వాక్కులు సాగించెను.

"నా కొక్కటే కొరవగా ఉన్నదే యీనాడు! నారాంబపేరాంబ లీ మహోత్సవము చూడలేకపోయిరే అని దిగులుగా ఉన్నదే తల్లీ! వారీనాడేగదే వీరప్రసువులై ధన్యలైనారు!"

కామసాని ఒకేతీరున ఉత్సాహవచనము లాడసాగెను. దానితో రుద్రమదేవి యించుక తేరుకొని ముఖము పటముతో తుడుచుకొనెను. రుద్రమదేవినుదుట చెరిగిన తిలకము కల్యాణరేఖగా దిద్ది యలంకరించెను. రేగిన యలకలు సరిచేసెను. పెదవులకును చెక్కులకును అంగరాగ మద్ది చెదరిన హారములు సవరించెను. అంతట నామె

మణిదర్పణము తెచ్చి రుద్రమదేవిముఖమునుం దుంచి చూచుకొమ్మనెను. రుద్రమ పరాకుగా చూచుకొనుచు ఇట్లనెను.

"దినదినమూ చూచుకొను ముఖములో నే ముందును కామసానీ!"

కామసాని : "రుయ్యమ్మ, రుద్రమ్మ ఎంత అమాయకపు తల్లియో చూచితివమ్మా?—ఇప్పు డీమె మహిషాసురమర్దనార్థ మవతరించిన చండికాదేవివలె లే దటమ్మా?"

రుయ్యమ్మ : "మన రుద్రమ్మమనస్సు నేడు స్వస్థముగా లేదు."

కామసాని : "నీ పిరికిమం దేమైనా పోసినావా యేమి?—ముందు, విషయమేమిటి?"

రుయ్యమ్మ : "శ్రీవీరభద్రేశ్వరుల యాశీర్వచనాక్షతలు అమ్మపై పడలే దని దిగులుపడుచున్నది."

కామసాని : "శ్రీగణపతిదేవచక్రవర్తులవారు శ్రీజాయపనాయకులయు ఆశీరక్షతలు తల్లిపై పడినవిగదా?"

రుయ్యమ్మ : "శ్రీ వీరభల్లటదేశికుల యక్షతలుకూడ పడలేదు."

కామసాని : "శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల యాశీర్వచనాక్షతలు అమోఘములనీ సర్వదోషపరిహారకము లనీ చెప్పలేకపోతివా?"

రుయ్యమ్మ : "స్త్రీలకు భర్త సాక్షాత్తు పరదైవము కాదా, మరి!"

కామసాని : "పిచ్చిదానా, రుద్రమదేవినికూడా సామాన్యస్త్రీలోకముతోపాటు లెక్కకట్టుచున్నావా? ఆమె గర్భములో ఉన్నప్పుడే గణపతిదేవుని యనంతర చక్రవర్తి పుట్టు నని దైవజ్ఞు లైకకంఠ్యముగా నిర్ణయించిరి. అందరస్త్రీలవలెనే రుద్రమదేవి పెరిగినదా?"

అంతవరకును మౌనముగా రుద్రమదేవి వారి సంభాషణ మాలకించుచుండెను. ఉభయుల వాక్యములును ఆమెఅంతరంగములో ప్రతిధ్వనింపగా నామెకు బాహ్యాభ్యంతరములలో నా సంవాదము జరుగుచున్నట్లనిపించినది. రుద్రమ ఇప్పుడు అందుకొనినది.

"ఈనాటివరకు వివాహకాలమాదిగా నేను భర్త్రభీష్టమునకు విరుద్ధముగా మనోవాక్కాయముల ప్రవర్తించి యెరుగను. ఈనాడు ఆ మహాసభలో పితృపాదులు చక్రవర్తులు నగు శ్రీగణపతిదేవుల యాజ్ఞకు బద్ధనై య ట్లాచరించితిని."

కామసాని : "అంతే కాదు. అది రాజగురువుల యాజ్ఞ! శివాజ్ఞ! నీ విధి నీవు నిర్వర్తించితివి."

రుద్రమ : "చాళుక్యరాజేంద్రులు నా చేసిన యవజ్ఞ సహింతురా?"

కామసాని: "రుద్రమా, నీ వికమందు మహారాజ్ఞివి, రుద్రదేవమహారాజవు! చాళుక్యవీరభద్రేశ్వరుడు నీ పాదపద్మారాధకుడు!"

రుద్రమదేవి ఉలిక్కిపడెను. రుయ్యమ యా మాటలకు ఆపాదమస్తకము కంపించెను.

రుద్రమదేవి రుయ్యమకు కరసంజ్ఞ చేయగా నామె పసుపుపచ్చని చీనాపటమును తూలికయు నందుకొనెను.

రుద్రమ: "అమ్మాయీ, శ్రీ వీరభద్రేశ్వరులకు నీ వొక లేఖ వ్రాయుము! మొదలుపెట్టుము!"

రుయ్యమ విలాసముగా తూలికతో పటముపై చిత్రరచన చేయుచున్నట్లే యక్షరవిన్యాస మొనర్చి చదివి వినిపించెను.

"శ్రీ శ్రీ శ్రీ చాళుక్యవంశవర్ధనులు శ్రీ వీరభద్రేశ్వరులకు ప్రియచెలియ రుయ్యాంబ తెలుపుకొను విజ్ఞాపనము—

ఆపై నేమి వ్రాయను?"

రుద్రాంబ: "మీ పాదదాసి రుద్రాంబ మీ దర్శనభాగ్యమునకై యనుక్షణము నిరీక్షించుచున్నది."

ఆ మాటలు వినుచు కామసాని ముఖము చిట్లించెను. ఆ మాట లంతలో వ్రాసి రుయ్యాంబ రుద్రమకు వినిపించెను. అది విని రుద్రమ చాలు ననగా రుయ్యమ చేవ్రాలు చేసి ముగించి రుద్రమదేవిచేతి కిచ్చెను.

రుద్రమ చేటికను పిలిపించి బంగారుపళ్లెరమును అశోకపుష్పగుచ్ఛములను తెప్పించెను. ఆ తెచ్చిన బంగారుపళ్లెరములో రుద్రమ స్వీయహస్తములతో నా లేఖ యుంచి దాని నశోకపుష్పములతో పూజించి శ్రీ వీరభద్రేశ్వరుల కిచ్చిరమ్మని పంచెను.

చేటిక నటు పంపినవెంటనే యామె పరిచారికలను పలువుర బిలిపించి యొక యున్నతపీఠమును దాని కొక పాదపీఠమును దానియెదుర మొదటి పీఠముకంటె నీచమగు మరియొక పీఠికయు స్థాపింపజేసెను. దానికి దక్షిణపార్శ్వమున పూజాద్రవ్యములు సమకూర్ప నియమించెను.

ఇట్లు సమస్తము భర్తృపూజకు సన్నాహ మొనర్చి రుద్రమ భర్తరాకకై ఉత్కంఠతో నిరీక్షించుచుండెను. కామసాని మూతి బిగించి ఏమియు మాట్లాడ కుండెను. రుయ్యమ దీనదృక్కులతో రుద్రమను విలోకించుచుండెను.

కామసానికి వీరభద్రేశ్వరుడు వచ్చి శ్రీరుద్రదేవమహారాజు చేయు పాదపూజ యందుకొనునేమో యని భయము! రుయ్యమ కాతడు రాడని నిశ్చయభావముతో కూడిన యాందోళనము!

అడుగుల సవ్వడి యేమాత్ర మైనను సంభ్రమముతో రుద్రాంబ తల యెత్తుచు శేవశంకించుచుండెను. ఆమె యెంపుడు నెమలి ఉపవనమున క్రేంకారము చేయు చుండె రుద్రము పరధ్యానముతో ఒకటి రెండుమారులు ఉలిక్కిపడెను. "రామ చిలుక పంజరములో, శివా!—శివా!" యని యరుచుచుండెను.

రెండు గడియలకు చేటిక తిరిగివచ్చెను. కాని యా రెండుగడియల్లును ఆ మువ్వురకు రెండు నెలలుగా తోచెను.

అట్లు తిరిగివచ్చిన చేటికయాననములోని దైన్యము గాంచి రుద్రమదేవి గాంభీర్యము వహించెను. చేటిక నమస్కరించి ఇప్పుడు మొగలిపూవులతో నిండి యున్న యా బంగారుపళ్లెరమును రుద్రాంబికముం దుంచెను.

రుద్రమయనుజ్ఞతో రుయ్యమ యందులో నున్న పటపత్రము తీసి ఇట్లని చదివెను.

"అమ్మాయీ, విజయదశమిలోపల దినాణములో అందించవలసిన లెక్కలు సిద్ధముచేయుట తీరిక లేకున్నాను. విజయదశమి నాడు పేరోలగమున శ్రీరుద్రదేవ మహారాజులను వారి పాదపద్మారాధకుడు శ్రీవీరభద్రేశ్వరుడు దర్శించి విధేయకంద నాదకము లర్పింపగల డని మీ అమ్మగారికి మనవిచేయుము!"

ఆ ఉత్తరము వినుచునే శ్రీరుద్రమదేవి శరీరమంతయు బిగించి నిలువునఁ గూర్చుండెను.

"రుయ్యాంబా, శ్రీ రుద్రదేవమహారాజుల భావివిఘ్నులు శ్రీ వీరభద్రేశ్వరులు చక్కగా సూచించినారు. భావిమహారాజుల-సంకల్పములకు భంగ మొదవరాదు. వెంటనే మేము చిత్రించిన శ్రీ వీరభద్రేశ్వరుల ప్రతికృతి యా యున్నతాసనముపై పెట్టు తల్లీ!"

రుయ్యాంబ తల్లియాజ్ఞ పాలించెను. అంతట రుద్రమదేవి శయ్యాసనమునుండి లేచి శౌచ మొనరించుకొని యా యున్నతాసనముముం దున్న భద్రపీఠముపై నధివసించి యచ్చట సేకరింపబడియున్న పూజాద్రవ్యములతో నా పటచిత్రమునం దధ్యస్తు డైయున్న శ్రీ వీరభద్రస్వామిని పూజించెను.

అది యంతయు సంభ్రమాశ్చర్యములతో మౌనమువహించి చూచుచున్న కామసానికి ఆ పటచిత్రములో శ్రీ చాళుక్యవీరభద్రేశ్వరుని యాకారలక్షణము లేవియు కనుపించలేదు. శ్రీ శివావజ్ఞాదూషితదక్షాధ్వరధ్వంసనోద్యతభయంకర వీరభద్రాకారమే యందామెకు ద్యోతమయ్యెను.

శ్రీ రుద్రమదేవియాజ్ఞచే నామె చెప్పిన చాళుక్యవీరభద్రేశ్వరప్రతికృతి కాక యామెయే చిత్రించిన వీరభద్రావతారచిత్రము తెచ్చిన రుయ్యమ కం దేమియు వింత తోచలేదు. రుయ్యమ సద్యస్స్ఫూర్తి యామె యా పట ముంచినంతనే గ్రహించిన రుద్రమదేవికి రుయ్యమపై వాత్సల్యముతోపాటు గౌరవ మాకస్మికముగా నినుమడించెను.

౪

సభానంతరమున శ్రీచాళుక్యవీరభద్రేశ్వరుడు మౌనముగా నిజమందిరము చేరికొనెను. పెద్దకుమారుడగు హరిహరదేవునిగాని చిన్నవాడగు మురారిదేవునిగాని యతడు పలుకరింపలేదు. దాసదాసీజనమందరును హరిహరదేవుల పట్టాభిషేకనిర్ధారణవార్త నేడు విని బహూకృతులు పొందుదుమని సముత్సుకులై నిరీక్షించుచుండిరి. ఎన్నాళ్లగానో వారా వార్త విందుమని కుతూహలముగా నుండిరి. నేటి కది సిద్ధింపనున్నదని వారికి గలిగిన సంతోషమునకు నంతము లేకుండెను.

వీరభద్రేశ్వరుడు రాకముందే చూచాయగా నిజవార్త వారికి తెలిసినది. కాని వారి యాశ తాము విన్నది నిజమని నమ్మనీయకుండెను. సరిపడనివారు పుట్టించిన ప్రవాద మని వారు సరిపెట్టుకొనుచుండిరి.

వీరభద్రేశ్వరుడు తుదకు వచ్చెను. అతని గంభీరమగు ముఖభంగి చూచి వారు విన్నది నిజమే యని నిశ్చయించుకొని నిరాశాదృక్కులతో ఎదురువచ్చిన పరిజను లందరు ఎవరిపనిపై వారు వెడలిపోయి తమ నిర్ణీతకార్యములందు అప్రమత్తులై యుండిరి.

వీరభద్రేశ్వరుడు తన ప్రధానకరణముతో ఒక్క అరగడియపాటు ఏకాంతముగా మాట్లాడి యాపిమ్మట శాంతగంభీరవదనముతో ఆరామములోని కేగెను. ముందందులో నాతడు నాటించిన విదేశవృక్షములను పరిశీలించి వాని కవసరము లగు దోహదాదికములు తోటమాలితో సంప్రతించెను. ఆపై నాతడు యథాచారముగా తన పారశీకాశ్వముపై నెక్కి దూరము స్వారిచేసి బాగుగా చీకటిపడినపిమ్మట నిజమందిరము చేరుకొనెను.

అప్పటికే రుద్రాంబ యంపిన పటపత్రిక తెచ్చిన చేటిక యాతనికై వచ్చి నిరీక్షించుచుండి వాకిటనే దర్శించెను. ఆ వేషముతోడనే యాతడా యుత్తరమందుకొని చదువుకొని పూర్వోక్తమగు ప్రత్యుత్తరము వ్రాసి మరల నా పళ్లెరములో నుంచెను. అప్పుడా పళ్లెరమందలి యశోకపుష్పము లాతని దృష్టి నాకర్షించెను. ఒక్క క్షణ మాతడాలోచించి తన పరిచారిక నొక్కతెను రమ్మని సంజ్ఞ చేసెను. ముందామె నా యశోకపుష్పములు తన యభ్యంతరమందిరములో నుంచ నియమించి కేతకీపుష్పములు తెమ్మని యాజ్ఞాపించెను. ఆమె యట్లు చేయగా నా తెచ్చిన కేతకీపుష్పములు తన పటపత్రికపై గప్పి యా పళ్ళెరమును రుద్రమదేవికి పంపివేసెను.

అంతట నాతడు స్నానాదిక మాచరించి భోజనము చేసి తన యభ్యంతరమందిరమున నేకాంతముగా కూరుచుండి యేదో ఆలోచింపసాగెను. అతని కప్పుడు

మెరపు మెరసిన ట్లొక్కసారిగా తన ప్రాక్కథ యంతయు స్మృతివీథిలో ప్రసరించెను.

తనది అనాదిగా పవిత్రమని ప్రసిద్ధిచెందిన చంద్రవంశము. తన పూర్వులు కోసలమునుండి దక్షిణాపథమునకు వచ్చి పల్లవరాజుల జయించి పూర్వపశ్చిమసముద్రమధ్యస్థ మగు మధ్యదేశము నేలిరి. అతని తండ్రి ఇందుశేఖరనరేశ్వరుడు చిన్నతనమున గతించగా కళింగగాంగరాజగు అనియంకభీముని సేనాపతి యగు జగ్రాజకుడు దండెత్తివచ్చి తన జ్ఞాతుల కండగా నిలిచినందున తాను రాజ్యభ్రష్టుడై గ్రామాంతరగతుడై పెరిగెను. కతిపయ పరివారముతో నాతఁ డుత్తరదేశము సంచరించెను. ఆ కాలపు అలజడులచే ధ్వంసములైన సంఘారామములు వదలి నిలువ నీడ లేక పరిభ్రమించు బౌద్ధభిక్షువులు పలువు రాతనికి పరిచితులైరి. అతనికి కళింగగాంగులపై ప్రత్యేక ద్వేష ముండుటచే తురుష్కుల కొలువులో నాతడు కొన్నాళ్లు చేరి వారి దండనాయకులు ఉత్తరకళింగముపై చేసిన దండయాత్రలలో పాల్గొనెను. కాని అవి లాభము లేకపోయెను. అందువల్ల ముసల్మానులు పలువురతో నాతనికి మైత్రి కలిగెను. వారి యుద్ధపద్ధతులుకూడ కొంత యవగత మొనర్చుకొనెను. వారితో కొన్నాళ్లు కలసిమెలసి మెలగినప్పటికి వారి మతాభిమానము సమస్తబంధములను కోసివేయు ననియు వారిలో నేడు మిత్రులుగా సంచరించువారుకూడ వారి అవసరము తీరినప్పటికి తాను ఇస్లాము నంగీకరింపనిచో తన్నుగూడ త్యజించి శత్రువుగా పరిగణింతు రనియు గ్రహించెను.

ఎన్నడో తన పూర్వికుడగు విజయాదిత్యుడు త్రిలోచనపల్లవునితో యుద్ధములో మడియగా నాతని కుమారుడు విష్ణువర్ధనుడు చళుక్యగిరిపై తపస్సు చేసి నందాభగవతిని తృప్తిగా చేసి సామ్రాజ్యచిహ్నములను బడసి త్రిలోచనపల్లవుని జయించి యాతని కూతు బెండ్లాడి కళింగగాంగాది భూపాలుర వశ మొనర్చుకొని మధ్యదేశమును నిష్కంటకముగా పాలించె నని యాతడు పెద్దలవలన వినియుండెను. తానును మరల నట్టి మహాసామ్రాజ్యమునకు పాలకుడు కావలె నని కలలు గనుచు నా ప్రయత్నములో నుండెను. తన పూర్వికుడు నందాదేవిసహాయము పొందెను. ఆమె నిజముగా దేవత యైయుండదు. చళుక్యగిరిసమీపమున నొకానొకయాటవిక జాతివారి పరిపాలకురాలై యుండును. కాకున్న దేవతలు ఈ లోకమునకు దిగివచ్చి వరాహలాంఛనాదు లిత్తురా? నందాదేవి యొక కిరాతేశ్వరి యైయుండును. తా నిప్పుడు కాలానుగుణముగా తురుష్కప్రభువుల నాశ్రయించితి నని సరిపెట్టుకొనెను.

తురుష్కుల సహాయముపై నమ్మకము పోయినంత మాత్రమున నాతడు బాల్యాదిగా వాంఛించుచున్న సామ్రాజ్యకాంక్ష విడనాడలేదు. అతడంతట దేవగిరిప్రభువగు జైతుగి నాశ్రయించెను. అప్పటికే గణపతిదేవుడు బందీవిముక్తుడై స్వరాజ్యమును స్థిరపరచుకొనుచు దేవగిరిప్రభువులను గూడ ధిక్కరించు స్థితిలో నుండెను. అట్టి సమయమున దూరదేశపు దేవగిరిప్రభువు నాశ్రయించుటకంటె తూర్పుసముద్ర

తీరములపై దండయాత్రలు సలుపుచున్న గణపతిదేవు నాశ్రయించుట శ్రేయస్కర మని యాతనికి తోచినది. అంతట నతడు వేంగిరాజ్యాధిపతుల కొలువు విడిచి గణపతి నాశ్రయించెను. గణపతిదేవుని దండనాయకుడై కొలది సామంతమంత్రిపదవి నొందుటతో తన జ్ఞాతుల బారద్రోలి మరల తన సంస్థానమును సంపాదించుకొనెను. కాని యతడు చిన్ననాటినుండి కన్నకలలు కలలుగానే యుండిపోయెను. అతడిప్పుడు గణపతిదేవుని మండలేశ్వరులలో చిన్నమండలేశ్వరుడు! అంతే!

అంతలో శ్రీ రుద్రమదేవిస్వయంవరము వచ్చెను. దానికి గణపతిదేవుడు తనకు గూడ నాహ్వాన మంపెను. అతడిప్పటికే యొక రాజపుత్రికను వివాహమై పుత్రులుగూడ బడసియుండెను. తన సంస్థానపాలనతో చిన్ననాటి కలలుగూడ నెమ్మదిగా విస్మృతిపథమును పట్టుచుండెను. ఆ సమయములో వచ్చిన యీ స్వయంవరాహ్వానము అణగియున్న యాతని చిరకాలవాంఛలను ఉద్బుద్ధము గావించెను.

అంతకుముందు చాళుక్యక్షత్రియులు కాకతీయక్షత్రియులతో సంబంధములు చేసి యెరుగరు. వారి అంతరంగికసంభాషణలలో కాకతీయులను సమ్మతితీగక్షత్రియు లని పరిహసించుచుండెడివారు. కాకతీయుల పూర్వపురుషులు సమ్మతి తీగలు పట్టినవా రని ప్రతీతి యుండుటయే దానికి కారణము.

కాని వీరభద్రేశ్వరుడు మిగిలిన చాళుక్యక్షత్రియులవలె నట్టి దురభిమానము కలవాడు కాడు. అతనికి కులభేదమునందే అభిమానము లేదు. వర్ణాశ్రమభేదము నరసించు వాస్తవికాంశములను మనుష్యత్వయుక్తులను ఎందరనో ఆతడు చూచియుండెను. వారిలో పలువురు సచ్చారిత్రప్రవర్తకులును, సాధువులును మహానుభావులు నుండిరి. ఈ యగ్రవర్ణములవారిలో నెందరు నీచగుణములు గలవారు లేరు! 'కులము ప్రధానమే గుణము లేకున్న?'

అతని సంపర్కానుభవములచే తరతరములుగా నతని రక్తముతో కలసి వచ్చిన యాత్మకులగౌరవము మాయమైనను, అట్లే అతనికి వచ్చిన ప్రభుత్వకాంక్షమాత్రము పోలేదు. గణపతిదేవుల యాహ్వానము చూడగా నతనికి గలిగిన సంతోషాతిశయము వయస్సులో ఐదేళ్లు చిన్నవానినిగా మార్చివేసెను. ముప్పదియైదేండ్ల ప్రాయము గల యాతడు ముప్పదేళ్లవానివలె గోచరించెను.

అప్పుడు కాకతీయుల రాజధాని యగు హనుమకొండకు పలువురు రాజపుత్రులు స్వయంవరమున కౌతూహలులై యరుదెంచిరి. వారిలో చోళులు గాంగులు కదంబులు పల్లవులు చాళుక్యులు కాకతీయులు నుండిరి. వారిలో పలువురకు రుద్రమదేవిని వివాహమాడుట సమ్మతము కాదు. మిగిలిన సంగతు లెట్లున్నను పురుషవేషము ధరించి స్వేచ్ఛగా సంచరించు స్త్రీని వివాహమాడ నే సుక్షత్రియకుమారు డంగీకరించును? అందులో నామె చక్రవర్తికుమార్తె. అట్టిదానికి రాజజామాతకంటేహీ. మగ నవస్థ పట్టును!

చాళుక్యవీరభద్రేశ్వరుడు వారల మనోగతులు శీఘ్రముగా గ్రహించెను. దానితో నతని యుత్సాహ మెక్కుడయ్యెను. గణపతిసామ్రాజ్యమున కంతటికిని తాను ప్రభువు నగుచున్నా నని భావించెను. గణపతిదేవునకు పుత్రులు లేరు. కతా కాకున్న తన కుమారుడైన తప్పక సామ్రాజ్యాధీశుడు కాగల డనియు దానివలన వంశప్రతిభ మరల నొకసారి దేదీప్యమానముగా వెలుగు ననియు నతనికి నిశ్చయము కలిగెను. అతని యుత్సాహము మిన్నుముట్టెను.

అతడందుచే నా స్వయంవరక్రీడాయుద్ధములలో జిగీషతో పాల్గొనెను. ధనుఃప్రయోగమునను ఖడ్గయుద్ధమునను రుద్రమదేవి మహాచతుర. అయినను వీరభద్రేశ్వరుడు విశేషముగా దేశాటన మొనర్చి బహునిపుణుల ఖడ్గయుద్ధములు తిలకించి యనేకమార్గము లభ్యసించినవా డగుటచే నొకవిధముగ నాతడు రుద్రమదేవికంటె ఖడ్గసాధనలో చతురుడని చెప్పవచ్చునేమో! కాని యాతనికి వయస్సు మళ్లుచుండుటచే యతని యంగములలోని చురుకుదనము ఏ కొంచెమో క్షీణోన్ముఖముగా నున్నది. మరి రుద్రమదేవియో, నిండు యౌవనములో నిజేచ్ఛావశవర్తియైయుండు శరీర సౌష్ఠవముతో నలరారుచుండెను. కాని తాను పురుషుడు. ఆమె వనిత. యౌవనములో గురుతరములగు స్తనజఘనభారము లామెకు యుద్ధక్రీడ కాటంకప్రాయముగా నుండెను.

ఆనాడు అనుమకొండలో - తనకును రుద్రమదేవికిని జరిగిన క్రీడాఖడ్గయుద్ధ మాతని కన్నుల యెదుట చిత్రితమై యిప్పటికిని కనుపట్టుచున్నది. గణపతిదేవుడును సామంతులును దండనాథులును మండలేశ్వరులును రాజబంధువులును మిక్కిలి ఉత్సుకతతో నా రంగస్థలము నవలోకించుచుండిరి.

ఒకవైపున వీరభద్రేశ్వరుడును మరియొకవైపున రుద్రమదేవియు నా రంగములో ఖడ్గహస్తులై ప్రవేశించిరి. ఇరువురు తమ ఖడ్గములు నియమితపరీక్షాధికారులకు పరీక్ష కప్పగించి మరల గ్రహించిరి. ఇరువురు గణపతిదేవులకును మహాసభకును వీరోచితవందన మాచరించిరి. వా రొకరి ముఖము లొకరు చూచుకొనలేదు. ఒకరి దేహభంగి నొకరును ఒకరి ఖడ్గధారణభంగి నొకరును చూచుకొనిరి. రుద్రమది సనాతనాంధ్రవైఖరి. చాళుక్యవీరభద్రేశ్వరునదో, సనాతనవైఖరి యేగాని యందొక నవ్యత రుద్రమకు గోచరించెను. ఆ నవ్యతపై రుద్రమమనస్సు లగ్న మయ్యెను. ఆమెకు ఆ నవ్యతయే కలవరము కలిగించెను. ఇటు తనకును ఆ వీరనారిదృఢప్రాచీనవైఖరి యాందోళనము కలిగించెను.

ఇద్దరి ఖడ్గములును కలసినవి. ఆ కలయికలోననే వీరభద్రేశ్వరుడు దురుసుగా ప్రవర్తించెను. రుద్రమదేవి నిపుణముగా కలిపెను. కొన్ని ఖడ్గభ్రమణము లైనవి. మువ్వురు మధ్యవర్తులు క్రీడాయుద్ధ మాపి వీరభద్రేశ్వరుని అక్రమమార్గము నిరూపించి యతని సరిదిద్దుకొమ్మనిరి. రుద్రమ చిరునవ్వుతో మధ్యవర్తుల యనుజ్ఞ నిరీక్షించుచుండెను.

"ఇతడింత మూర్ఖముగా క్రీడించుచున్నాడేమి ?"

"ఇతడిది క్రీడాయుద్ధముగా నెంచుచున్నట్లు లేదే ?"

"నియమోల్లంఘనము చేయకున్న లోప మేమి ? ఖడ్గయుద్ధము నెమ్మదిచెక్కు వలె నుండునా ?"

ఈ విధముగా ప్రేక్షకులు పరస్పరవిరుద్ధముల వీరభద్రేశ్వరుని యుద్ధమును గూర్చి పలుకుచుండిరి. కాని యతనికి జయమొందవలెనను కాంక్షయేకాని వేరూహ లేకుండెను.

కొంతసేపటికి రుద్రమ జయించునట్లుండును. కొంతసేపటికి తాను జయించునట్లుండును. ఇద్దరును పరిశ్రాంతి నొందిరి. రుద్రమకు కేవల మది క్రీడగా నుండెను. అందుచే నామె కది యొక క్రీడావిశేషముగానే యుండెను. మరి వీరభద్రేశ్వరునకో ! అందులో నాతని జీవితసర్వస్వము కేంద్రీకృతమై యుండెను. ఈ క్రీడాయుద్ధములో నతడుత్తీర్ణుడు కానిచో జీవించి లాభ మేమి ? ఆ రాత్రియే యతడాత్మహత్య కావించుకొనియుండును. అందుచే నలసిపోయిన యవయవములకు నతడు ప్రయత్నపూర్వకముగా నతని యంతరాంతరములనుండి యొక శక్తిని క్షణక్షణ ముద్బుద్ధము చేసికొనుచుండెను. అతడు విదేశములలో నలవరచుకొన్న నైపుణి యేమియు నచలమగు శ్రీరుద్రమఖడ్గవిద్యయెదుట పనికిరాలేదు. అధైర్యము కలిగెను.

వీరభద్రేశ్వరునకు కాలు నిలుకడ్రొక్కుకొనలేకుండెను. చూచువారి కతడు తూలిపడిపోవుచున్నట్లుండెను. చేయి వణకుచున్నట్లుండెను. రుద్రమదేవిహస్తమును శరీరమును ఏమరుపాటు లేకుండెను.

ఆ సమయములో వీరభద్రేశ్వరుడు మరల నొకసారి తన యంతరాంతరములలో దాగియున్న యాత్మశక్తిని జగీషచే నుద్బుద్ధ మొనర్చుకొనెను. అతని ఖడ్గాగ్రము నందలి సిందూరము రుద్రమదేవివక్షస్థల మంటి రంజిత మొనర్చెను.

చూచువా రది యెట్లు జరిగెనో తెలిసికొనలేకపోయిరి. వారి కన్నులనే వారు నమ్మలేకపోయిరి. వీరభద్రేశ్వరుడు శ్రాంతుడై తూలిపడిపోయెను. రుద్రమదేవి చిరునవ్వుతో నిలిచియే యుండెను. కాని రుద్రమ విజిత యయ్యె ననియు వీరభద్రేశ్వరుడు జయించె ననియు మధ్యవర్తులు ప్రకటించిరి.

ఆ ప్రకటనతో మరల తనకు తెలివి వచ్చెను. దేహము నెట్లో నిలువరించుకొని గణపతిదేవుల పాదపీఠమునొద్దకు పోయి యాతడు వందన మాచరించెను. యథార్థముగా జయించినది రుద్రమగానే ప్రాకృతులకు గోచరించినది. కాని క్రీడాయుద్ధవిదులకు వీరభద్రేశ్వరుడు జయించె ననుటలో సందేహము లేదు.

ఆపిమ్మట రెండు దినములకు చాపవిద్యాకౌశలపరీక్ష జరిగెను. మరల నందును నట్లే వీరభద్రేశ్వరుడు జయ మందె నని పరీక్షాధికారులు ప్రకటించిరి.

అంతట శ్రీ గణపతిదేవుల యాజ్ఞతో రుద్రమాదేవి వీరభద్రేశ్వరుని కంఠమును ఇప్ప పూలమాలతో నలంకరించెను. తన కా మహాభాగ్యమియుక్తముగను నేడు ప్రవర్తించుచున్నట్లే తోచెను. అదియు స్వప్నదర్శనము వలెనే కాక అప్పుడు అది! చూచిన వారికందరకు కాకతిసామ్రాజ్యలక్ష్మియే యతని వరించినట్లు గూపట్టెను.

రాజపుత్రిక తన కంఠసీమను హారముతో నలంకరించినందు కేమాత్రమును అతడు పులకితుడు కాలేదు. కాని యప్పుడా కూడిన రాజకమంతయు నప్పుడు చేసిన జయఘోష కాతడు పులకితు డయ్యెను!

అప్పటినుండి యాతడు విశేషకాలము రాజధానీనగరముననే గడపసాగెను. శీఘ్రముగనే అతడు గణపతిదేవుని కుడిభుజమయ్యెను. సామంతుల కాతనిపై నసూయ కలుగుచుండ వారి నాదరబహుమానములచే నాతడు సత్కరించి యందర మైత్రి నేర్పుగా సంపాదించుకొనుచుండెను.

రుద్రమదేవివలన నాతనికి ముమ్మడమ్మ యను పుత్రికమాత్రమే కలిగెను. పుత్రసంతానము కలుగనందున నాతడు చింతింపజొచ్చెను. అంతట నాతడు తన సంస్థాన పాలనభారము చిన్నకుమారుడైన మహాదేవునకు అప్పగించి జ్యేష్ఠపుత్రు డగు హరిహరదేవుని రాజధానీనగరమునకు రప్పించి చక్రవర్తికొలువులో చేర్పించెను. హరిహరదేవుడు రుద్రమదేవి సజనురాలివలె లాలించుచు నాటనుండి గణపతిదేవులకును ప్రజలకును ఇష్టుడాయెను. హరిహరదేవుడే గణపతిదేవునియనంతరమున చక్రవర్తియగు నను భావము అందరకు దృఢపడుచుండెను.

ఇది యంతయు వీరభద్రేశ్వరుని మనోవీధిలో చిత్రపరంపరవలె భాసించెను. మహారాజ్యకాంక్షతో నంతఃక్రమముగనతడు కులగర్వమునే తాను పరిత్యజించెనే! దేనికై తా నా త్యాగ మొనర్చెనో ఆ ఫలము ననుభవించు సమయ మాసన్నమైనది నేడు! అది యందుకొనబోవుచుండగానే యాకస్మికముగా భంగమైనది!

కాటికి కాళ్లు చాపుకొనియున్న యొక వృద్ధరాజు ఒకానొక సన్యాసి యాదేశముతో ఒక యాలోచన సాహసముగా చేసికొని తనకు ప్రాణప్రియమగు జీవితాదర్శమును భగ్నమొనర్చునా? అతడే అది సహింపకపోయెను.

రుద్రమదేవికి యౌవరాజ్యాభిషేకము చేయుట ప్రస్తుతము హరిహరుని త్రోసివేసి కాలాంతరమున ప్రతాపరుద్రదేవుని చక్రవర్తిని చేయుటకే యని తా నంతమాత్ర మూహింప లేకున్నాడా?

తన కిప్పుడు షష్టిపూర్తి యైనను దేహదార్ఢ్యముగాని బుద్ధికుశలతగాని యేమాత్రము తగ్గలేదు. మహావాహిని నింకను నిపుణతతో నడపగలడు! రాజ్యతంత్రమును పటుత్వముతో నిర్వహింపగలడు! మరి యిప్పుడు తన కర్తవ్య మేమి?

అలదు నిజమందిరమునకు వచ్చినప్పటినుండియును ఏకాంతముగా ప్రవర్తించు చున్నాడు, అంతరంగమున తీవ్రముగా యోచించుచుండెను. తన సంకల్పము వ్యర్థ కాకుండ చేయు నుపాయ మేమి? తనకు నిశ్చయముగా సహాయభూతులగు మిత్రు లెవరు? తన్ను ప్రతిఘటించు శత్రువు లెవరు? ఈ వాదమునకు తటస్థు లెవరు? ఉభయుల బలాబలము లెట్లున్నవి?

సభారంగమునను ఇందులో కొన్ని విషయములు స్పష్టమాయెను. గణపతి దేవుని రాజ్యప్రారంభకాలమున ఆతని సామ్రాజ్యమునకు మూలస్తంభములై నిలిచిన పిల్లల మర్రి బెత్తి కీనాయని అస్థానములో నాయకము లన్నను. ఇప్పటికి కొంతకాలముగా పద్మ నాయకులపై చక్రవర్తి పక్షపాతము అతిశయించినది. పద్మనాయకుల ప్రాపు ఎవరికి ప్రాపించదు. ఈ పిల్లలమర్రి బేచర్లకొత్తి దండనాథులు ఉపయోగపడుదురు. వారు మంచి శూరులు, యోధులు. కాని వారికి వారి పూర్వుల వలె రుద్రదేవుని దండనాథుల సమర్థత లేదు.

మరి సభకు రాకున్న అన్నయమంత్రి యెవరి కలసి వచ్చునో? ఆ బ్రాహ్మణులపై నాశ పెట్టుకొనరాదు. వారు ఎంత చదువుకొన్నవారైనను స్వార్థపరాయణులు! ఎంత సమర్థులైనను అవకాశవాదులు! గుణిరాజకుచిత్తచాంచల్యమునే వారు తల దాల్చెదరు.

ఇక ప్రబలుడగు కాయస్థసేనానులు అంబదేవుడును జన్నిగదేవుడును ఉన్నారు. త్రిపురాంతకుడును ఉన్నాడు. వారికి సభ కేలనో రాలేదు. వారు రాకుండుటకు కారణముగూడ తెలిపియుండలేదు. గుణసలి రాజువారిపై నాగ్రహ మంకురించినది. వారేను ఏదో ఉద్దేశము లేక యిట్లు కారణము తెలుపక రాకుండరు. వారు చారులవలన రాజధానిరహస్యములను తెలిసికొని సమయానుకూలముగా ప్రవర్తింపనెంచియుందురు. వారి యాశలతో తన యాశలు ప్రతిఘటింపకుండు నట్లు చూడవలెను. అది దుర్ఘటము!

కాని యిప్పుడు కర్తవ్య మేమి?—కర్తవ్య మేమి?

పూజ్యుడగు వీరభల్లటదేశికునికి సభాముఖమున ఆనాడు తనకై పరాభవ మైనది. పాపము, న్యాయము మాడిన యా మహానుభావునికి రాజసభలో అవమానమా? ఆయనను విస్తారగౌరవముతో రాజధానిలో శైవులందఱు పూజించుచుండిరి. రాజధానిలోనను పెక్క రాజ్య మంతటను బ్రాహ్మణకొండ్రు ప్రధానముగా శైవులే. మహారాజుల శైవాభిమానము చాలకాలముగా శైవులకు కష్టము కలిగించుచున్నది. కాని వారి యసమ్మతి యాగ్రహముగా యొల్లుబికుటకు ఇంతవరకు అవకాశము కలుగ లేదు. ఈ అవకాశము పురస్కరించుకొని బ్రాహ్మణకొండ్రులో రాజకార్యములపై ద్వేషము కలిగించిన దండనాథులందరు కలసియో యేమియు జేయజాలరు. అందులో ఈ పద్మనాయకులకు చాలమందికి కత్తి పట్టుటయే తెలియును గాని గంటము మోద

జేగిరినో తుది రేపటినోకూడ తెలియదు. ప్రాయసకొంత్రను తానుకూడగట్టు కొనుట ప్రథమకర్తవ్యము.

ఇదిగాక రాజ్యమునకు వెలుపల ఒకవైపున చోళులు, ఒకవైపున కొప్పెరుంజింగడు, ఒకవైపున దేవగిరియాదవులు, ఒకవైపున కళింగులు నున్నారు. వీ రెవ్వ రైనను కాకతీయరాజ్యమును ఆక్రమింపుటకు కుతూహలముతో నున్నవారే!

వీరభద్రరాజు నిద్రించుటకు బోయినట్లే శయనమందిరము ప్రవేశించెను. కొంతవడి యందుండి కుడ్యమున వ్రేలుచున్న గణపతిదేవుల చిత్రపట మొకటి యించుక యెత్తి యొక మీట నొక్కెను. వెంటనే యొక లోహపుతలుపు ప్రక్కకు బోయి దారిచేసెను. ఆతడు లోనికి బోయి మరియొక్క మీట నొక్కగా నాపటము క్రిందనొడ యథాప్రకారము మూసికొనెను.

అతడా దారిని కొంత దవ్వేగి యొక రహస్యాగారమును జేరెను. అది విశాలమైనది కాకున్నను పదిమందికి సుఖముగా కూరుచుండుట కనువుగా నుండెను. అచ్చట గాలి బాగుగా నాడకున్నను ఉక్కబోసుకొనునట్లు లేదు. వెలుతురుమాత్రము దివిటీలవలన పుష్కలముగా నున్నది.

అతడు వెళ్లునప్పటికే పలువు రందు సమావిష్టులై యుండి యాతని రాకకై నిరీక్షించుచుండిరి. అందులో పిల్లలమఱ్ఱిరెడ్డి ముఖ్యులు. రేచర్ల కామయ, నామయ, మల్లయ యను సోదరులును, గణపిరెడ్డి మల్లిరెడ్డి యను సోదరులును కలరు. రాజబంధువులలో గణపతిదేవుని మేనగోడలు పెనిమిటి ధాన్యకటకవాసి యగు కోట కేతరాజు ఒక్కడే యచట కలడు. ఆనెగొందిపాలకుడు రామదేవరాయలును ఆ చేరినవారిలో నుండెను.

వీరభద్రరాజు "బోల్లా!" యని పిలిచినంతనే మైలారుభటుడు ఏకాకియై ప్రత్యక్షమై "స్వామీ, ఏమి యాజ్ఞ?" అని యడిగెను.

"వీరభల్లటదేశికులకు రమ్మని విజ్ఞప్తి చేయలేదా?"

"వా రీ రాత్రి విశేషానుష్ఠాన మున్నదని సెలవిచ్చిరి."

"మంచిది!"

ఎవరును గుసగుసలుకూడ నాడుటలేదు. చేరినవా రందరికి మనస్సులు ఉద్విగ్నము లైయుండెను. ముందు వారందరు ఖడ్గములు ఒరలలోనుండి ఒక్కసారి బయటికి తీసిరి. తీసి వాని నన్నిటిని ఏకముఖముగా కలిపిరి. అవి యన్నియు నాలుకలు తెరచిన పాములవలె మెరసి యేకమై నాగపాశముగా విద్యోతించెను. ఎన్నియో విద్యుల్లతలు ఒక్కచో గలసి యాదరముతో పరస్పరమాలింగనము చేసికొన్నట్లే భాసించెను. అన్నియు కలసి అనేకశిఖల వెలుగుచున్న యగ్నిహోత్రుని మూర్తి వలెనే అవి పొడగట్టెను.

అది నోటితో మాటలు చెప్పని యొక మహాప్రమాణము. శస్త్రజీవులకు వారి శస్త్రమే ప్రత్యక్షదైవము. ఆ ప్రత్యక్షదైవము నెవరెది వారచ్చో నేకముఖముగా న్యాసముచేసిరి. అందుచే నీవిధముగా కత్తులు కలిపినవారు మరల తిరిగిపో మనియు నొకరి కొకరము ఆప్తమిత్రులముగా నుందు మనియు తీవ్రమగు ప్రమాణము చేసి రన్న మాట! ఈ ప్రమాణము చేసినతరువాత నా సభారహస్యము బయటికి పోరాదు. అందులో నెవరైన నే కారణముచేనైన వెనుకంజ వేసిరేనియు ఈ రహస్యము రహస్యముగనే యుండితీరును!

అంతట సంభాషణ ప్రారంభమయ్యెను. నూతను డను నొక విచిత్రపురుషుడా సంభాషణ మారంభించెను. అతడు చాలకాలమునుండి పశ్చిమపు సరిహద్దున గ్రామములలో పర్యటించుచుండెను. అతని పేరెవరికి దెలియదు. అతడు మహాభక్తుడు, మహాయోగి, సకలధర్మవేత్త, మహాతపస్వి యని ప్రజలలో నమ్మకముండెను. అతనికి వేదశాస్త్రములే గాక యంతకంటె క్షుణ్ణముగా జైనబౌద్ధగ్రంథములును కొరానును బైబిలునుకూడ వచ్చును.

ఆ సభ రాత్రి మూడుజాములవరకు సాగెను. తెలుగుసామ్రాజ్యమును నాలుగు వైపులనుండి ముంచివేయుటకు విజృంభించుచున్న నాలుగు సేనావాహినులకును యథాశక్తిగా చేయూత యిచ్చుటకు ఆ రహస్యసభలో నిర్ధారణ జరిగినది. అందులో వారు ఎవ రెవ రే కార్యము సాధింపవలెనో విభజించుకొనిరి. ఇట్లు వచ్చెడి శత్రువాహినులకు ఎదురులేకుండుటకు రాజధానీనగరమునను కల్లోలములు ప్రేరేచుటకును నిశ్చయించిరి.

ముందు కార్యభార మూనుటకు ఉగ్రూతలూగినవారు పిల్లలమర్రి రెడ్లు. వారు కొప్పెరుంజింగని కూతగా నుండ నియ్యకొనిరి. కోటకేతరాజును రామదేవరాయలును చోళసైన్యములకు సహాయము చేయుట కొప్పుకొనిరి. కళింగబలములకు మురారిదేవుడు తోడుగా నంగీకరించెను. హరిహరదేవుడు దేవగిరి కేగ నియమితు డయ్యెను. వీరభద్రేశ్వరుడు స్వయముగా రాజధానీనగరమున నుండి నూతనవిచిత్రపురుషునితోడను జైనామాత్యులతోడను అంతఃకలహములు రేపు పాలు పంచుకొనెను.

ఆ సభావసానమున ఆ మహాలయామావాస్యాపరరాత్రవేళ ఆ కూడిన వీరులందరు కాకతీయసామ్రాజ్యమున కంతటికి శ్రీహరిహరదేవరాయలను మహారాజుగా చేసి యతని యాజ్ఞలకు విధేయులై యుండుటకు ప్రతిజ్ఞలు ప్రమాణపూర్వకముగా నొనర్చిరి.

అజ్ఞాతకులగోత్రనాము డగు నా నూతనమహాయోగి బొల్ల డందిచ్చినవారితో నాతనికి పట్టాభిషేక మొనర్చెను. ఆత డెప్పు డుచ్చరించిన మంత్రములును అతని సమస్తచర్యలవలెనే అభినవములు. ఆ అభినవత్వములో నొక చిత్రశక్తి ద్యోతమయ్యెను. హరిహరదేవరాయ జయజయ! యను శబ్దములతో నా రహస్యసభ ముగిసెను.

28

“ఉరు అవమందు నెత్తురి గండ్రె మల్లెల
చోద్యంపు గండాలు చొచ్చువారు,
కరవాలధారల గనపపాతర్లలో
నట్టిచేరులు కోసి యిడుకొనువారు,
గాల ప్రేగులకింక కాళ్ళచర్మము గ్రుచ్చి
యుడుకెత్తి నుయ్యాల లూగువారు,
కటి కఠారాగ్రంబు గండకత్తెర నట్టి
మిసిమింతులును గాక త్రిమ్మువారు,
సింగులను నారసంబులు సలుపువారు,
రొమ్ము కుడిచేత నారతులిచ్చువారు,
సాహసము మూర్తిగైకొన్న సరణివారు,
క్షీరస్నాపదయులు మైలారువీరభటులు.”

—క్రీడాభిరామము

శరన్నవరాత్రములు ప్రారంభమైనవి.

భరతభూమిని భరతరాజులే పాలించు దినములలో శరన్నవరాత్రములంటె జగన్మోహనమగు నుత్సవము మరొక్కటి లేదు. ఆ తొమ్మిది దినములును ప్రకృతియే దివ్యరూపముల నవతరించి పూజలు స్వీకరించును. శారదారూపములో శృంగారమూర్తి ప్రధానమో, వీరరేఖ ప్రధానమో, అద్భుతము ప్రధానమో, శాంతమే ప్రధానమో ఎవరు నిర్వచింపగలరు? నవరసములకు నధిష్ఠానమగు నా మహామాయ శోభని వర్ణింతుము! ఉపనీతులుగూడ గాని విద్యార్థిబాలకులే చేతుల విల్లంబులు పూని వీరమన్మథావతారములవలె వాడవాడల సంచరింతురే! తారకసంహారమున కీ రూపముతోడనే కుమారుడు బయలుదేరెనా?

ఏకశిలానగరముచుట్టును రాతితో కట్టిన కోట కలదు. దానికి వెలుపల మట్టిగోట యొకటి కట్టించవలె నని స్థపతులతో జరుగుచున్న యాలోచన లింకను కార్యరూపమున బరిణమింపలేదు.

పట్టణమం దంతటిలోకన్న వెలిపాలెములో నవరాత్రోత్సవ మెక్కువ సందడిగా ప్రారంభమయ్యెను. తప్పెటల రుంజల మ్రోతతో చెవులు గింగురు మనుచుండెను. ఆవేగపూరితులై మైలారుభటులు బొబ్బలుపెట్టుచుండిరి. వారి వీరావేశము చూడవలసినదే కాని వర్ణింప శక్యము కాదు. వారలకు భక్తిపారవశ్యముతోబాటు వారల యుదరములలో నిండిన మద్యము వారికి సంపూర్ణముగా దేహభ్రాంతి పోగొట్టినది. ఒకడు దండచేతులమీద కొరడాతో కొట్టుకొనగా నతని చర్మము చిట్లి రక్తబిందువులు చెమర్చుచుండెను. అట్లే యాత డానందమున గంతులు వేయుచుండెను. మరి

యొకడు రెండు బుగ్గలలో రెండు నారసములు గ్రుచ్చుకొని కేళిగా నూగుచు నృత్యము చేయుచుండెను. మరియొకడు మండుచున్న కర్పూరఖండములు రెండు తన రెండు చేతులలో ఆధారము లేకుండ పెట్టుకొని యవి వెలుగుచుండ జయజయనినాదములు చేయుచుండెను. ఇంకొకడు మండుచున్న దీపములే వత్తులతో మ్రింగివేయుచుండెను. కొందరు కణకణలాడు నగ్నికుండములలో దుమికి ముందుకు సాగిపోవుచుండిరి. వారు వేయు కేకలును బొబ్బలును మైలారుదేవుని మహాత్త్వమునే ఘోషించుచుండెను.

అంతలో నం దొక మైలారుభటున కావేశము పెరిగినది. అతడు ఎందరు పట్టినను ఆగునట్లు లేడు. "ఏమి టీ గోల బొల్లా!"అని ప్రక్కవా రడుగగా అ అడిగిన వారి నాతడు తన్ని వైచెను. కొందరు చెంపలువేసికొని "అపరాధము మైలారుదేవా, నీ కేమి కావలె చెప్పు స్వామీ!"అని ప్రార్థింపసాగిరి.

ఆ మాటలకు బొల్లడు బుసలుకొట్ట నారంభించెను. వా రాతనికి గుగ్గిలపు ధూపము వేసి మైలారుదేవుని పరిపరివిధముల ప్రార్థింప మొదలిడిరి. ప్రార్థించిన కొలదియును బుస లెక్కువయ్యెను. తుద కాతడు రొజుచు దేవత పూని చెప్పిన వాక్యము లిట్లు నెమ్మదిగా చెప్పజొచ్చెను.

"నాకు తపనగా—ఉన్నది—తపన!—ఆడది—నన్ను ముట్టిందే—ఊళ్లో లేను—ఆడస్పర్శ—తపన!...నాకు పనికిరాదు......"

"ఏమో అంటు సోకినదట స్వామికి!"

"ఏమి సోకినది?"

"ఆడస్పర్శ ఏమిటి? ఇక్కడ ఆడంగు లెవరూ లేరే!"

పరిపరివిధముల జనముల మాటలు చెలరేగినవి. చివరకు కొంద రడిగినారు.

"ఏమి అపరాధము జరిగింది స్వామీ నీకు? ఎక్కడ జరిగింది అంటు?"

బొల్లడు ఊగుతూ శివముతో చెప్పినాడు.

"ఒళ్లంతా తపనగా ఉన్నది. మండిపోతున్నది!"

చుట్టుప్రక్కలవారు కడవలతో నీళ్లందుకొని వానిపై క్రుమ్మరించినారు. కాని దానితో మంట చల్లారిన ట్లగపడలేదు. ఆ అంటు శుద్ధి ఐనట్లు తోచలేదు. బొల్లడు అరవసాగినాడు.

"ఆడస్పర్శ...నేను భరించను......నే నీ ఆడమళయాళంలో ఉండను! ఆడమళయాళం!......"

అప్పు డా ఆడస్పర్శస్వరూపము నూగినవారికి కొంత లీలగా అవగత మైనది. చుట్టుప్రక్కల నున్నవారు ఆ మాటలకు గడగడలాడిపోయిరి. ఒకవంక మైలారుదేవుని భయము! మరొకవంక ఎందును ఏమరకుండు రాజభటుల భయము! అంతకుముందే రుద్రమదేవి యీనాడు నవరాత్రదీక్ష ప్రారంభింపనున్న దని నగర

మంతట చాటింపు జరిగియుండెను. ప్రభువుల యాజ్ఞలు ధిక్కరించి మాటాడువారి కెట్టి శిక్ష యుండునో అందరెరుగుదురు. నగరమంతటను చక్రవర్తిగూఢచారులెల్ల వేళల సంచరించుచుందురని కూడ జగద్విదితమే.

ఇట్లే కొంతసేపు బొల్లని యలజడి సాగినది. అంతలో మరియొక్క ప్రక్కనుండి కాకతిదేవతకొలుపుకు మరియొక గుంపు ఊరేగుచు బోవుచుండెను. ఆ గుంపులోనున్నవారు మరియొకవిధముగా వీరమార్గమున కాకతిదేవతను కొలుచుచు సాగుచుండిరి.

ఆ ఊరేగింపుకు ముందుభాగమున నొక మాతంగకన్యక మద్యపూర్ణకుంభమును ధరించి సాగుచుండెను. ఆ కుంభము పచ్చని యాకులతోడను ఎఱ్ఱని పూలదండలతోను సర్వాంగసుందరముగా నలంకరింపబడియుండెను. పాలసముద్రమునుండి యిప్పుడే యవతరించిన వారుణీదేవతయా యిది యనిపించుచున్నది ఆ కలశహస్తయైన మాతంగ కన్య! ఆ కన్యక ముందుకు పోవుచుండ నామెయనుచరులపు [illegible] మండిరి. ఆమెయు నడచిపోవుటలేదు. అది యొక నృత్యము చేయుచుండెను. ఒక చిందు త్రొక్కుచుండెను.

ఆమెకు ఒకప్రక్కను శకటముపై సిడిపోతు వచ్చుచుండెను. ఉన్నతమైన సిడికోలచివర గ్రుచ్చబడిన యా మేకపోతు కాకతిదేవతాధ్వజస్తంభమువలె కనిపించుచున్నది. అదిగాక బలికై ఎన్నియో మేకపోతులను, కొన్ని మహిషములను ఆ గుంపులోనివారు తీసికొనిపోవుచుండిరి. ఆ గుంపులోని జనుల చేతులలో విస్తారముగా వేపమండలు కలవు. వారు చల్లుచున్న పసుపుకుంకుమలు భూనభోంతరాళములను పింగ్రా కుంకుమాంకితము చేయుచుండెను.

కాకతిశక్తి కాకతీయప్రభువుల కులదేవత. అట్లగుటచే నా దేవతయుత్సవములు అసాధారణవైభవముతో జరుగుచుండెను. ఆ దేవాలయమునకు నాదాయ మెక్కువ. ఆ కొలుపుకు పోవు జనసమూహములుకూడ మైలారభటులకంటె నధిక సంఖ్యాకులు. మైలారుభటుల యరపులు ఉరుములవలె గాను, కాకతిసేవకుల కేకలు పిడుగులవలెనే వినిపించుచుండెను.

కాకతివీరులలో గండడు అనువానికి శివము పూనినది. కాని యతని శివము బొల్లని శివమువలె లేదు. ఇతనిది ఆనందతన్మయత. గండడు కనపడ్డవారినెల్ల వికటాట్టహాసముతో కౌగిలించుకొనును. ఆ యాలింగనములో స్త్రీపురుషవివక్షణ లేదు. అతడాలింగనము చేసికొనగా పలువురు స్త్రీలు కెవ్వున కేకవేసి యతడు వదలగానే పకపక నవ్వుచు తొలగుచుండిరి. అతడానందబాష్పములు కార్చును. పెద్దలు కనపడిన నట్టివారికి పాదములంటి మ్రొక్కును. విరామము లేకుండ జయజయనినాదములు చేయును. అతనితోపాటు ఆ జనసమూహమంతయు జయజయనినాదములు చేయ నారంభించెను.

ఆ రెండు ఊరేగింపులును ఒక చతుష్పథములో తారసిల్లినవి. మైలారుభటులును కాకతిశాక్తవీరులును ఎప్పుడట్లు తారసిల్లినను సంఘర్షణ రాకుండుట యరుదు. విద్యుత్తు పుట్టినట్లే, ప్రాణాగ్నిసంయోగముచే శబ్దము పుట్టినట్లే.

బొల్లడు "ఆపసోకు సోకినది" అనుచు మహాతపనతో కేకలు వేయ నారంభించెను. ఆ మాట చెవి సోకినంతనే అంతవరకు ఆనందమూర్తివలె నున్న గండడు ఒక్కసారిగా భైరవమూర్తిగా మారిపోయెను. అతడు విజృంభించి శివశక్తివలె బొల్లని మీదికి లంఘించెను.

"జయ జయ రుద్రదేవమహారాజ! జయ కాకతమ్మతల్లీ జయ!" అని బొబ్బలు పెట్టుచు పోయి గండడు ఎగిరి బొల్లని రొమ్ములో బలముగా తన్నెను.

ఆ తాపుతో బొల్లని యావేళ మొక్కసారిగా నణగి యాతడు పడిపోయెను. మైలారుదేవున కపరాధ మైన దనుచు సింహనాదములతో మిగిలిన మైలారుభటులు మూగిరి. కాని గండడది లెక్క చేయక క్రింద పడిన బొల్లనిపై కెక్కి కాల చేతుల నట్టింపసాగెను.

ఇంత యాకస్మికముగా గండడు విజృంభించినందున నొక్కక్షణకాల మందరు నిర్విణ్ణులై యాగిపోయిరి. బొల్లడుకూడ నిశ్చేష్టు డయ్యెను.

కాని మరియొక నిమేషములో స్థితిగతులు మారిపోయెను. క్రింద పడిన బొల్లడు సందు చూచి పై నున్న గండని వదలించుకొనుటకు తీవ్రప్రయత్నము చేయుచు నాతని కాలుచేతుల క్రుమ్మసాగెను. మరియు నందినచోట రక్కుచు కొరుకుచుండెను.

గండని లాగివేయుటకు మైలారుభటులు పలువురు మూగగా వారిపై కాకతివీరులు కవిసి కొట్టసాగిరి. అటు మైలారుభటులును ఇటు కాకతివీరులును నై ఉభయపక్షములకు మల్లయుద్ధము ప్రారంభమయ్యెను.

ఆ కొట్లాట అంతకంతకు తీవ్ర మగుచుండెను. ఇంతవరకును మల్లయుద్ధమే సాగుచుండెను. ఉభయదేవతల కొలుపుకు నుపయోగించు కత్తులు బల్లెములు తోమరములు గదలు నా యూరేగింపులో కలవు. వాని ప్రయోగ మింకను ప్రారంభింపలేదు. ఆ రాజమార్గములో నా కొట్లాట తీవ్రమై ఆయుధప్రయోగమున కుభయపక్షములు నుద్యోగించు సమయమాసన్నమైనది. పరిస్థితి యిట్లు విషమమై ఘోరముగా పరిణమించు స్థితిలో నుండెను.

అంతలో నాకస్మికముగా రాజభటుల శంఖారావములు బోరుకలగెను. ఆ వచ్చుచున్న రాజభటులను గాంచి రెండుగుంపులును చెల్లాచెదరయ్యెను.

ఏకశిలానగరపాలకు డగు మేచయనాయకుడే స్వయముగా నశ్వారూఢుడై యచ్చట ప్రత్యక్షమయ్యెను. ఆ నాయకుని జూచినంతనే పారిపోయినవారు పోగా

తప్పించుకొన వీలులేని మిగిలిన రెండు గుంపులవారిలోని కొలదిమందియు ప్రక్కల కొదిగి గడగడలాడుచు నక్కి మాటలాడ సాహసింపకుండిరి.

పైన ఇంత జరుగుచున్నను ఆ పోట్లాటకు మూలకారకు లగు బొల్లనికిని గండనికిని అది ఎక్కలేదు. పైవారు తొలగుటచే వారికి స్వేచ్ఛగా పోరాడుకొను తెరపి చిక్కినది. ఇద్దరును బలశాలులే. ఇద్దరును మల్లయుద్ధవిశారదులే. ఏకశిలానగరమందలి మేటిమల్లులు వా రిద్దరే! పూర్వము వా రెన్నిమారులో మల్లరంగములో తమ మల్లయుద్ధప్రవీణత ప్రభువులకు ప్రదర్శించియుండిరి. వారిలో బొల్లనికి బల మెక్కువ; గండనికి చురుకుదన మెక్కువ. ఒక్కొక్కతరి వారిలో నొక్కొక్కడు జయశాలి యగుచుండెను. వారి స్పర్ధ యీనాటిది కాదు!

కాని ఈనాడు వారిద్దరికి ప్రవర్తమైన మల్లయుద్ధము రంగస్థలమున జరుగు యుద్ధమువంటిది కాదు. దీనికి నియమములు లేవు. మధ్యవర్తులు లేరు. అందినచోట అందినట్లు వైరిని కొట్టుటయే. వా రిద్దరు సమమగు నుద్దీ లయినను ప్రథమములో గండనికి ప్రాప్తించిన పైచేయి యతడు వదలుకొనలేదు. పైన క్రమ్మినవారు ఇప్పుడు దూరమగుటతో నా యవకాశము నాతడు పోనీక గట్టిగా నిలుపుకొనసాగెను. అతని దేహము గంట్లుపడి నెత్తురు కారుచుండెను. ఐనను అత డది లెక్కచేయక నాగసర్పమును ఒడిసిపట్టిన ముంగిసవలె బొల్లనిమాత్ర మతడు లేవనీయక బాధించుచుండెను.

“గండా!”

అది మేచయనాయకుని కంఠము! నాయకుడు గుర్రముపైనుండి దిగనైనలేదు. ఎట్టి యాందోళనమును అతడు కనబరచలేదు. శాంతముగా దృఢముగా స్వచ్ఛముగా అధికారికముగా నా రెండక్షరములు నాత డుచ్చరించెను.

ఆ కంఠస్వరము చెవులబడినంతనే గండడు మంత్రముగ్ధునివలె గడగడలాడుచు బొల్లని విడిచి లేచి నిలుచుండి వినయవిధేయతలతో నాయకునికి వందనము చేసెను.

క్రింద పడియున్న బొల్లనికి నాయకుని గొంతు వినిపించలేదు. రాజభటుల రాకయే అతనికి తెలియదు. అనుకొనకుండగా తన కా తెరపి ఎట్లు చిక్కెనో కూడ తెలియలేదు. కాని యా తెరపి చిక్కినదే వ్యవధానముగ నతడు రోషముతో లేచి గండని గొంతు పట్టుకొన కుప్పించెను. అప్పటి కాతడు గండడు కదలక ఎవరికో వందనము చేయుచుండుట గమనించి తల యటు త్రిప్పబోవుచుండెను. మేచయనాయకుని కొరడా యాతని వీపున బడి చురుక్కుమన్నది. బొల్లని కావేశ మెక్కి యా దెబ్బ కొట్టినవానిపై విజృంభింప వెనుదిరిగెను. వెంటనే యతని కొరడాదెబ్బ కంటె తీక్ష్ణమగు మేచయనాయకుని దృష్టి వానిపై ప్రసరించెను. దానితో బొల్లడు నిస్తబ్ధుడై వంగి సిగ్గుపడుచు నాయకునికి నమస్కరించెను.

నాయకుడు మరి మాటాడలేదు. అతడు కుడిచేతి తర్జనితో తనవెంట నున్న భటులకు గండని బొల్లని నిర్దేశించి యొక్కింత సంజ్ఞ చేసెను. భటు లుత్తరక్షణమున

బొల్లని గంపెని బంధించిరి. మిగిలినవారి నెవ్వరిని భటులు ఏమియూ చేయలేదు. అది చూచి ధైర్యము తెచ్చుకొని రెండు ఉత్సవములలోని జనము మరల ఒక్కరొక్కరే నిశ్శబ్దముగా నక్కడ చేరసాగిరి. ఉభయపక్షములవారును వివాదకారణ మావలి వారిపై మోపి చెప్పుట కుంకించుచుండిరి. కాని ఎవ్వరికిని ముందు మాట్లాడుటకు నాయకుని ఎదుట నోరు రాలేదు.

"అలజడిచేయక మీ మీ కొలువులు సాగించుకోవలసిన దని నాయకుల యాజ్ఞ!"

ఇట్లని నాయకునివెంట నున్న వారిలో ప్రధానభటు డాజ్ఞయిచ్చినంతనే ఉభయ పక్షములవారును తాము చెప్పికొనదలచినది చెప్పికొను ప్రయత్నమే మానివేసి నాయకునికి వంగి వంగి దణ్ణములుపెట్టుచు నెమ్మదిగా ఉత్సవములు సాగదీసిరి.

పురములో నలజడి యెచ్చట జరిగినను అది మేచయనాయకుని కంట్లకు కన పడునంతటి దివ్యదృష్టిగలవా డని యాతనికి ప్రతీతి కలదు. పూర్వము పలుమారులు వ్యక్తమైన యాతని దివ్యదృష్టి యీనాడు మరియొకపర్యాయము స్పష్టపడెను. వెను కటి యనుభవములకు మరియొక యుదాహరణముగా నీనాటి వృత్తాంతము కలసెను.

బొల్లని గంపెని కారాగృహమునకు పంపి మేచయనాయకు డింకను పుర సంచారకుతూహలియై కదలిపోయెను.



వసంత ఋతువును శరదృతువును మానవులకు యమదంష్ట్రల వంటివి. ఆ ఋతువులు ఆరంభింపగనే రోగములు విజృంభించును. అందుచే శుభము గోరు మానవులు ఆ రెండు ఋతువుల యారంభములో నవరాత్రదీక్షతో పరదేవతాపూజ చేసి తత్ప్రసాద మందవలెను. అందును శరన్నవరాత్రమహోత్సవము ముఖ్యతరము. ఈ విధి భరత భూమిలో చక్రవర్తు లనాదిగా పరిపాలించుచు వచ్చిరి.

శరత్కాలము జైత్రయాత్రలకును సేనాచలనములకును మిక్కిలి యనుకూల సమయము. వర్షర్తు వప్పుడే గతించి ప్రయాణముల కనుకూలించు కాలము సంప్రాప్త మగును. శౌర్యసంపదలతో తులదూగు రాజుల కా కాలము ప్రమదావహము. తా ముద్యమించు కార్యముల కనుకూలింప నా సమయమున నిష్టదేవతార్చన మొనర్తురు. ప్రస్తుత కార్యమునకు దైవానుకూల్యము ప్రాప్తగా నుండినప్పుడే కదా సాఫల్యము చేకూరుట!

ఐనను ఈ శరన్నవరాత్రములు కేవలము దేవతాపూజావసరముమాత్రమే యని తలంపరాదు. ఆ సమయమున విధిగా రాజధానీనగరమున సామంతులును మండలేశ్వరులును దండనాయకులును మంత్రులును ఉన్నతరాజపురుషులందరును రాజసేవకు సమకూడుదురు. ఈవిధముగా మూలమూలల నున్న పరిపాలకులు నున్నతోద్యోగులు చక్రవర్తిని దర్శించి కానుక లర్పించి తమ రాజభక్తి దృఢము చేసికొందురు. అప్పుడే దేశదేశముల పరిస్థితులు చక్రవర్తికి సమగ్రముగా నవగత మగును. మండలేశ్వరులు తాము పాలించు మండలముల లెక్కలు సమర్పించి పరిపాలనావిశేషములు చక్రవర్తికి నివేదింతురు. తమ కష్టసుఖములు తెలిపికొందురు. ఒకచోట కొరతగా నున్న సరకులు ఎక్కువగా నున్న ప్రదేశములనుండి తెప్పించు నేర్పాట్లు జరుగును. అధికారుల నొక స్థానమునుండి మరియొక స్థానమునకు మార్పులు చేయుటయు నెక్కువగా నీ సమయముననే జరుగును. సమర్థులకు బహుమతులును అసమర్థులకు శిక్షలును ఇప్పుడే లభించును. ఈ విధముగా రాజకీయవ్యవహారములకును వివిధ ప్రాంతముల ఏకీకరణమునకును ఈ ఉత్సవము లుపకరించెడివి.

మరియు నా యుత్సవములలో నొకనాడు సరస్వతీపూజ జరుగును. ఆనాటికి దేశమున నన్నియెడల గల మహావిద్వాంసులు కవులు గాయకులు నటులు బహుకళాకుశలురు రాజధానికి మూగి తమతమ విద్యలు ప్రదర్శించి మహారాజులయు సామంతమండలేశ్వరదండనాయకులయు మన్ననలు పడయుచుందురు. అది యానాటితో ప్రారంభమై తుదవరకు కొనసాగును. ఆ వినోదములలో శాస్త్రవాదములు ప్రధానములు. ఆ సభలలో నూతనగ్రంథములు చర్చకు వచ్చును. అప్పటి రాజులు తరచుగా

స్వేచ్ఛముగా వివిధ ప్రాంతములుగా కూడా వెలసెడివారు. ఐనను సర్వాధికారము నందు చేరిన పండితులకే కాని బలవంతుడగు రాజునకే కాని విద్యాహీనులగు ప్రజాసామాన్యమునకే కాని కాదు. ఆ విద్వద్విద్గ్ధులకు నిలిచిన యుత్తమగ్రంథములకే మాన్యత కలిగెడిది. అట్లు నిలిచిన గ్రంథములు శీఘ్రముగా నలుగడల దేశమంతట వ్యాప్తి గాంచెడివి. పూర్వము శీఘ్రగమనమునకు సాధనలు తక్కువ. ఐనను ఉత్కృష్టములగు ఆ గ్రంథములు ఉవేగముగ సమస్తస్థానములంతట విదితమై ఖ్యాతిగాంచిన సిద్ధాంతములు కాలక్రమమునకే దేశమంతట ప్రభవించుచుండెను. విద్వత్సభలో పేరొందిన గ్రంథమునకే మాన్యతగాని ధనవంతునో బలవంతునో అధికారినో ఆశ్రయించి ప్రశంస వ్రాయించినను ఆ గ్రంథములకు నిలుకడ లేదు. విద్వత్సభల యాదరణ ప్రాముఖ్యమిట్టిది. అట్టి ప్రాచ్యవిద్వత్సభలు స్వయముగా నెరిగి యుండినవానిలో తాను గొప్ప ప్రతిపాత్రముగా వర్తించిన ఆద్యాంధ్రకవి వాని నేమని వర్ణించినాడు ?

"పరమపవిత్ర నానాధవిభాసితసద్గుణపుంజవారిజో
త్కరరుచిరంబులై సకలగమ్యసుతీర్థములై మహామునో
త్కరసుచరిత్రపావనపయఃపరిపూర్ణము లైన సత్సభాం
బరసరసీవరంబుల మహిం గొనరం గొనియాడి వేడుకన్."

అంతే కాదు! మహాభారత ముత్తమసభాప్రాజ్యం బని వర్ణించి యందలి పర్వముల యాతిశయము చెప్పుచు సురలమరల సభాప్రాజ్య మని వర్ణించినాడు.

తొమ్మిదవనాటితో దీక్షాసమాప్తి యగును. అనా డాయుధపూజ! వీరులకు వారివారి యాయుధములే ప్రత్యక్షదైవములు. వాని నానాడు వారు విశేషముగా పర్చింతురు. ఖడ్గినీ శూలినీ చాపినీ పాశినీ అంకుశినీ చక్రిణీ గదినీ శంఖినీ— ఇత్యాదిదేవతలును తత్తన్మంత్రములును పుస్తకములలోకంటె వీరుల హృదయాంతరాళములలో దృఢతరాధిష్ఠితములై యుండెడివి. ఆయుధపూజనాడు వీరజనసమ్ముఖమున వివిధరణప్రదర్శనములు జరుగును. నూతనసాధనములు ప్రాతసాధనముల నూతనప్రయోగములు ప్రదర్శింపబడును.

వీరరసము ప్రజలలో తాండవమాడు నా కాలములో నీ విధముగా దైవపూజ, వినోదము, ప్రయోజనము పరస్పరవిరోధము లేక సామరస్యముతో చెల్లుబడి సాగించుకొనుచుండెను.

ఆ నవరాత్రములలో నాలవనాటికి గాని ఇందులూరి అన్నయమంత్రి ఏకశిలానగరము చేరుకొనలేకపోయెను. అతడు దక్షిణకళింగాధిపతి. వేగివిషయములో నూరవర మాతని రాజధాని. కాకతిసామ్రాజ్యమును కళింగుల యొత్తిడినుండి యతడే సంరక్షించుచుండెను. ఇతరభాగములలో సామంతులకు రాజభక్తి తగ్గినందున తరుచుగా గణపతిదేవు డాతని రాజధానికి పిలిపించుచుండెను. ఈ రాకపోకలతో నాత

డా భాగమును దృఢముగా పరిపాలించు నవకాశము తగ్గిపోవుచుండెను. కాలింగులు సరిహద్దున నున్న చిన్నచిన్న ప్రభువులను నెమ్మదిగా తమ కనుకూలురగా త్రిప్పుకొనుచుండిరి.

ఇందులూరివంశము పారంపర్యముగా మహామంత్రుల జన్మమునకు నెలవైనది. గణపతిదేవుడు వెలనాటిపై దండయాత్రలు చేయుచున్నప్పుడు అతని యమాత్యులలో నొకడగు ఇందులూరి సోమయమంత్రి కొలనిపుర మను నామాంతరము గల సారసిపురమును ముట్టడించి దాని ప్రభు వగు కేశవనాయకుని జయించెను. తదాదిగా ఇందులూరివారికి కొలనివా రను ప్రతాపనామము సంక్రమించెను.

ఇందులూరివంశములో పుట్టిన మహామాత్యదండనాథులలో నాయకమణి యీ అన్నయమంత్రి. అతడు కేవలము మనుష్యమాత్రు డనుటకే వీలు లేదు. కారణజన్ముడాతడు !

అతని తండ్రి గన్నభూపతి పై కొలనిసోముని కూరిమితమ్ముడు. తల్లి గౌరాంబ. ఆ దంపతు లిరువురు పుత్రార్థులై యున్నరోజుల నొకానొకనాడు గౌరమసన్నిధికి యతీంద్రు డొకడు వచ్చి భిక్షాదాన మర్థించెను. ఆమె యథాచారముగా నాతనికి భిక్షను పెట్టబోవుచుండ నాతడది యంగీకరింపక యిట్లర్థించెను.

“అమ్మా, పరమపవిత్రురాల వగు నిన్ను ఇతరు లగు తల్లులయొద్దవలె సామాన్యభిక్ష యాచించుటకు నేను రాలేదు. నాకు ప్రాప్తించిన దివ్యదృష్టిచే నాకు మరియొక జన్మము తప్పదని తెలిసికొంటిని. నాకు దల్లిగా నుండ యోగ్యురాలగు మహాసాధ్వికై బహుకాలముగా నన్వేషించుచుంటిని. పలువురు పుణ్యాంగనల దర్శించితిని. నేటికి నిన్ను చూచినంతనే నీ కడుపున బుట్టు భాగ్యము పొందవలె నని యిచ్ఛ జనించినది. ఇది గతజన్మముల సంబంధము. నాకు మాతృభిక్ష పెట్టుము, తల్లీ!”

ఆ సాధ్వి యది విని యాశ్చర్యచకితయై వల్లె యనెను. ఆ యతీశ్వరుడును తాను పుత్రుడుగా జన్మించినప్పు డుండెబోవు చిహ్నములు ప్రత్యయార్థము వ్రాసి యామె కిచ్చి యానాడే మంతెనకాళేశ్వరము పోయి యచ్చట సమాధినిష్ఠుడై దేహయాత్ర చాలించెను. ఆ మాసమే గౌరాంబకు నెల తప్పెను. ఆ గర్భశుక్తిముక్తాఫలమె అన్నయమంత్రి యయ్యెను.

“యతి మున్ను చెప్పినట్లు
న్నతఘనతంత్రాలికములు నాసము శ్యామా
యతదేహము గౌరకన్నుల
గతి వలపతిసుబ్బపిన్న కంతుని గనియెన్”1

1. శివయోగసారము.

అన్నమంత్రి తన పెదతండ్రికుమారుడగు రుద్రమంత్రిని కొలనిపురములో సభా కారిగా నుంచెను. ఈ రుద్రమంత్రి దండనీతిపారగు డగుటయే గాక మహావిద్వాంసు డగుటచే 'వ్యాకరణబ్రహ్మ' యను ప్రతీతి సంపాదించెను. అన్నయకు రుద్రు డపర ప్రాణమే.

రాజధానికి నవరాత్రమహోత్సవములకు జేరెడు విద్వద్బ్రాహ్మణబృందము లెరుదుగా అన్నమంత్రి రుద్రమంత్రుల దివాణముల జేరెడువారు. వారి కక్కడ మంచిగా సుష్ఠుగా సగౌరవముగా సన్నవిశ్రాంతులు లభించుచు. వారి దివాణములకు అరుదెంచిన యతిగణులు నభ్యాగతులు తమ భాగ్యవశమున తమ యింటికి కరుణించిన నారాయణుని యపరావతారములుగా భావించి యా గృహస్థు లిరువురు నాదరింతురు. వారిరువురును స్వయముగా నెట్టి సహాయ మైనను జేయగల సమర్థులు. మరియు రుద్రమంత్రిసంస్థానమున సమ్మానభాజను డైన విద్వాంసునకు ఏకశిలానగరమున గౌరవాదరములకు కొదువ యుండెడు. 'వ్యాకరణబ్రహ్మ' సమ్మాన మొక గీటురాయి, ఒక ఒరవడి!

అందరు ప్రధానమంత్రీశ్వరులకువలెనే అన్నమంత్రికిని రాజధానీనగరమున ప్రత్యేకమందిర ముండెను. అందు రాజకార్యములు నిర్వహించుటకు అనేకు లగు కరణము లున్న వ్యవహారశాల కలదు. కరణము లనగా వ్రాయసగాండ్రు. వా రప్పటను విశేషముగా జైనులును స్వర్ణకారులును నుండిరి. కాణము పట్టనేర్చిన హస్తములకు గంటము లూనుట చులకనగా నుండెడిది.

భరతభూమిలో అనాదిగా వేదశాస్త్రవిదు లగు బ్రాహ్మణోత్తములు భరత రాజులయొద్ద మంత్రులుగా నుండెడివారు. ఆ యాచారమే చాళుక్యప్రభువుల యొద్దను కొంతవరకు కాకతీయులయొద్దకూడ సాగినది. అందుచే పూర్వాచారపరాయణు లగు బ్రాహ్మణులకుగూడ అమాత్యపదవి మాననీయమే. కాని యట్టివారు వ్రాయసవృత్తిమాత్రము సేవావృత్తిగా పరిగణించి దానిని కొంత నీచముగా భావించెడివారు. ఐనను వేదశాస్త్రాదివిశేషవిద్యలు నేర్వలేని పేదబ్రాహ్మణులు కొందరు అప్పటికి కొంతకాలమునుండి యీ వృత్తి విధిలేక యంగీకరింపసాగిరి. అట్టివారు ఆ వృత్తిలో చిరకాలానుభవము గల జైనకరణముల ప్రతిభతో సరితూగలేక వారికి ఒదిగి యుండవలసివచ్చుచుండెను.

అన్నమంత్రిదివాణములో వ్యవహారములు చూచువా రందరుగూడ జైనకరణములే. అతడు విజయదశమిలోపల తన మండలములెక్కలును వ్యవహారములును చక్రవర్తికి విధిగా అప్పగింపవలసియుండెను. చవితినాటి సాయంత్ర మాతడు రాజధానికి వచ్చి ముందు గణపతిదేవసార్వభౌముల దర్శించి తన యనామయవార్త తెలిపి వారి కుశలవార్త యెరింగెను.

పంచమినాడు ఉదయమున అన్నమంత్రిదివాణమువాకిసాలపై గడియారమున నాలుగు గడియలు కొట్టిరి. అంతకు ముందుగనే యక్కడ మూగుచుండవలసిన కరణ

ణములలో నొక్కడును ఆనాడు కనపడలేదు. అది యదృష్టపూర్వము. ఊహింప రానిది! అందులో నాలస్యముగా వచ్చిన తాను తన ప్రధానకరణమునకు అవసరముగా అప్పగించి సిద్ధము చేయింపవలసిన వ్యవహారము లెన్నియో పేరుకొని యున్నవి.

కరణములు సకాలమున రాకపోగా తాను రాజధానీనగరమున బహుకాలము లేని యవకాశముపురస్కరించుకొని వీ రందరు నలసతి కలవాటుపడినారా? ఆ తలపుతోడనే యాతని మనస్సులో కోప మంకురించెను. దాని నణచుకొనుటయే కష్టముగా నుండెను. కాని ఒక్కడును రా డేమి? ఈనాడు ఆటవిడుపా? కాదే! ప్రధానకరణము నాగాచారి వినయవిధేయతలు కలవాడే! ఎన్నడును కాలాతిక్రమణము చేసిగాని యలసత అశ్రద్ధ చూపిగాని యెరుగడే!—పాపము జబ్బుగా నున్నాడేనా!

బవిరిని పను నాశ్వికభటుని పిలిపించి నాగాచారియింటికి బోయి శీఘ్రముగా పిలిచికొని రమ్మని యాతని బంపెను. వాడు శీఘ్రముగా తిరిగి వచ్చి నాగాచారి యింట నుండి యుదయవేళకే బయలువెడలియుండె నను వార్త తెచ్చెను.

అది విని యా మహామంత్రీశ్వరుడు నిర్ఘాంతపోయెను. ఒక్క కరణముకూడ రాలేదు. పరిచారకులు వచ్చి ఎదుటికి రా సాహసింపక చుట్టుపట్టుల తారటలాడు చుండిరి. ఒకడు ధైర్యముచేసి స్నానముచేయ రమ్మని పిలిచినను నాగాచారికి తొందరపను లప్పగించి వత్తు నని కదలలేదు. దేహము నలంకరింపలేదు.

అంత యున్నతపదవిలో నున్నను అన్నమంత్రికి వయస్సు పాతికేండ్లేని నున్నవో లేవో. పసితనమునుండియు నాతడు చూపుచు వచ్చిన యసాధారణమేధచే నాతని కా చిన్నప్రాయముననే వంశక్రమాగత మగు పదవి లభించెను. చామనచాయ శరీరము, ఉన్నతమైన ఫాలనాసములు, చిక్కని మీసములు, సింహమునకువలె పచ్చని కన్నులు చిత్రమైన పురుషసింహాకార మాతనికి గూర్చుచుండెను.

అన్నమంత్రికి చిరాకు ఎక్కువైపోయెను. ఎంత మేధావి యైనను వయస్సుతో గాని నిబ్బరము అలవడునా? మేధావి యైనవానికి చిన్నవయసున కలుగు చిరాకు ఇతరుల చిరాకునకు శతగుణముగా నుండును. అట్టి శతగుణ మగు చిరాకే యాతని కప్పుడు కలిగెను. ఆ చిరాకు వృద్ధి యగుచుండెను. ఏమి చేయగలడు? ఒక్క కరణమును రాలేదు! చిరాకు కాదు. అది కోపమే యయ్యెను. అది క్షణక్షణములోపల రేగసాగెను. కాని ఎవరిమీద? అగ్నివలె పుట్టి చెలరేగు కోప మంతె యాలోచించునా? అన్నమంత్రి యిప్పుడు కేవలము క్రోధావతారమై కాన్పించెను. ఆతని పచ్చని కన్నులలో ఎర్రని రేఖలు చేరి యచ్చట ఏదో అపూర్వ మగు ప్రళయాగ్ని పుట్టినట్లు చూచువారికి భయంకరముగా నుండెను. పరిచారకులు ఎదుట బడ సాహసింపక మూలమూలల నక్కి యడగి యుండిరి.

సరిగా నాతని కోపము మహోజ్జ్వలమై ప్రజ్వలించుచున్న సమయమున కాక సోమపీథి యగ్నులప్పుడే వేల్చి జపాదికము పూర్తిచేసివచ్చిన యలికభస్మాది

చిహ్నములతో ఇద్దరఛాత్రుల కైదండతో అన్నమంత్రియెదుట సాక్షాత్కరించెను.

ఆ సోమయాజి నాలుగుమూరల ప్రమాణము కల దీర్ఘకాయుడు. శరీరవర్ణము కొంచెము నలుపుతిరిగిన చామనచాయ గలిగి మనోజ్ఞముగా నున్నది. కాయబారు శరీర మైనందున షష్టిపూర్తి యైన యాయన దేహము ఏ కొంచముగనో వంగి యున్నది. అంత వయస్సున్నను ఆ పురుషుని దంతముల స్వచ్ఛకాంతి గాని పటుత్వము గాని ఏ మాత్రము తరిగినట్లు లేదు. నిరంతరము గా తాళీదళ సంచారము చేయుటచే గాబోలు దృష్టిమాత్ర మించుక మందగించి కనుఱెప్పల మాటిమాటికి నల్లార్పజేయుచుండెను. బాల్యమునుండి సుస్వరవాదులు ప్రయోగించుచున్నందుననో గాక ఖడ్గాదిశస్త్రసాధనలు చేసియుండుటచేతనో ఆ ముంజేతులు కాయలువారి యుండెను. ఆయన చెవులకు ధరించిన చిన్న రత్నకుండలములు ముఖముపై క్రొత్త వెన్నెలలు పరపుచుండెను.

ఆయనవెంట వచ్చిన శిష్యులలో పెద్దవానికి ముప్పదైదేండ్లుండును. అతడు చక్కగా దేహపరిశ్రమ చేసినందున కండలుతిరిగి దృఢమై స్థూలమగు దేహము కలవాడు. అందుచే నాతడు విద్యాదికములలోకంటె మల్లయుద్ధాదికములలో నెక్కువ ప్రవీణుడా యనిపించుచున్నది.

రెండవశిష్యుడు బ్రహ్మచారి. అతనికి పదునారేండ్లు దాటలేదు. బంగారు వంటి మైచాయ. ముఖము పాలుగారుచున్నది. అతని మూర్తి శాంతమై బ్రహ్మతేజస్సు పొంగారుచున్నది.

ఆహవనీయ దక్షిణాగ్నుల మధ్యస్థ మైన గార్హపత్యాగ్నివలె నా సోమయాజి అన్నమంత్రిదివాణములోనికి వచ్చుచుండగా దౌవారికుడు గాని ఇతరభటులు గాని వారించుటగాని ఆయనరాక అన్నయకు నివేదించుటగాని చేయలేదు. అందరు మంత్రముగ్ధులవలెనే నిలిచి యుండిరి. ధనుర్ముక్తమైన శరమువలెనే ఆ సోమయాజి సరాసరి నిశ్చలగమనముతో లోనికి వచ్చి యన్నమంత్రిని సమీపించెను.

కోపదుర్నిరీక్ష్యుడై యున్న యన్నమంత్రికి ఆ సోమయాజిదర్శనము కలలోనుండి లేపిన ట్లయ్యెను. ఆకస్మికముగా నాతని ముఖమందలి కోపజ్వాల లదృశ్యమై ప్రసన్న మయ్యెను. కేవలము అగ్నిభట్టారకుడే మూర్తీభవించి యీ రూపమున ప్రత్యక్ష మయ్యెనా యను భావ మాతని కుదయించినది. కారణజన్ము లైనవారికి క్రోధాదులుకూడ లీలలేగదా !

అన్నమంత్రి యాసనమునుండి లేచి సోమయాజికి వందన మాచరించి "తమ నామధేయము ?" అని ప్రశ్నించెను.

"నన్ను తిక్కనసోమయాజి యందురు !" అని యా సోమయాజి క్లుప్తముగా ప్రత్యుత్తర మిచ్చెను.

౭

"చతురాననసన్నిభునకు - సతతస్వాహాస్వధాదిశబ్దద్వయసం
సక్తీకృతహవ్యకవ్యసంతర్పితముఖశిఖిముఖనిలింపపితృవర్గునకున్"

దశకుమారచరిత్రము

వెంటనే ఇనుమడించిన సమాదరముతో అన్నయదేవుడు సోమయాజి కెదురేగెను.

"క్షంతవ్యుడను! సొగసైన మీ మీసకట్టు పోవుటచేతను శ్రీశంకరుంగాలములచే మీ ముఖమునకు తోడుకూడిన నూతనవర్చస్సుచేతను వెంటనే స్ఫురింపలేక పోయినాను."

ఇట్లనుచు చిరునవ్వుతో వికసించిన ముఖముతో అన్నయమంత్రి తిక్కన సోమయాజిని వెంటవచ్చిన శిష్యులను సుఖాసీనుల జేసి బంధుసపర్యలు చేయ బంచెను. తనవెంటవచ్చిన శిష్యులలో పెద్దవానిని గురునాథుడుగను బ్రహ్మచారిని మారన యనియు సోమయాజి అన్నయ కెరుక చేసెను. ఎన్నడో వదలివేసిన సోమయాజిమీసకట్టును అన్నయ జ్ఞప్తికి తెచ్చినను దానిపై గల వ్యామోహ మాయనకు స్మృతిలోనికి రాలేదు. అందుచే నాయన ఆవిషయమున నెట్టి యుత్తరమును నీయలేదు. అన్నయమాత్రము కొంత వేడుకతోడను విశేషగౌరవముతోడను తాను చిన్నతనములో దర్శించిన మహామాత్యస్వరూపము సోమయాజిమూర్తిగా ఎట్లు పరిణామ మందెనో పరీక్షించుచుండెను.

సోమయాజి ప్రకృతిసిద్ధముగా మితభాషి. సుఖదుఃఖములు లాభాలాభములు జయాపజయములు సమానముగా గ్రహించి తొణకకుండు స్వభావము కలవాడు. స్వప్నములో హరిహరనాథమూర్తిని దర్శించినదాదిగా ఆ ప్రకృతి దృఢపడినది. పునర్జన్మము లేకుండజేయు మని యా దేవదేవుని దా నర్థించినక్షణమునుండి యాందు కధికారము సంపాదించుకొనన దీవ్రప్రయత్న మతిశయించినది. మహాభారతాంధ్రీకరణము సాగుచున్నకొలదియు సోమయాజి కా సాధన ప్రబలము కాసాగినది.

అట్లయినను ఆ మహానుభావుని స్వభావము సమగ్రముగా నెరిగినవారు నేడాయనను జూచినచో, చింతాశల్య మేదో ఆయనహృదయమును బాధించుచున్నదని ఊహించలేకపోరు.

అన్నయదేవుడు పదునారేండ్ల యువకుడై యుండగా నొకమారు తన తండ్రిని చూడవచ్చిన తిక్కనామాత్యుని నీ యేకశిలానగరముననే చూచియుండెను. అప్పుడు తిక్కనశరీరదర్పము జనాకర్షణ అన్నయ నెంతయు ముగ్ధుని జేసి

యుండెను. ఈ మేధావి చక్రవర్తియొద్ద మహామాత్యపదవిలో నుండదగినవాడు సామంతప్రాయుడగు మనుమసిద్ధియొద్ద నున్నాడేమి? అన్నయదేవుని తండ్రి యది తిక్కనకు సూచించియుండెను. కాని తిక్కనకు మనుమసిద్ధిపై వాత్సల్యము చేతను నాతని వదలుటకుగాని బంధుమిత్రాదులు పాదుకొనియున్న నెల్లూరుపరిసరములనుగాని పెన్నానదీతీరమునుగాని వదలి వచ్చుటకుగాని సమ్మతము కాదాయెను.

ఆనాడు అన్నయదేవునికి గలిగిన సందేహము, ఈనాడు తిక్కనసోమయాజి రూపమును జూచగా జూడగా తీరిపోయినది. ఈ లోకమందు ఉన్నతపదవులపై వ్యామోహము గలవారికి తృప్తి ఎన్నటికిని చేకూరదు. తృప్తి లేనివానికి సుఖ మెక్కడిది? తిక్కనామాత్యుడు నెల్లూర మంత్రిపదవి వదలి కాకతీయచక్రవర్తికొలువులో మహామంత్రి యగుట కప్పు డిచ్ఛగింపలేదు. తరువాత నేమి చేసినాడు? నెల్లూర నా మంత్రిపదవికూడ విసర్జించి ఈతడీ సోమయాజిపదవి నధిష్ఠించినాడు నేడు! మనుమసిద్ధి యాస్థానకవిపదము వదలి నేడీతడు హరిహరనాథునాస్థానమున మహాకవియైనాడు! ఈ పదవులపై నభిమానము కలవానికి మహామంత్రిపదవులపై నభిలాష యెట్లుండును?

అన్నమంత్రికిని తిక్కనసోమయాజులకును దూరపుబంధుత్వ మున్నది. కాని వారి కెక్కువ పరిచయము లేదు. అందుచే అన్నమంత్రి తిక్కనసోమయాజిహృదయములో శల్య మున్నట్లే తెలిసికొనలేకపోయెను. అదియుగాక నేడాతని నావేశించిన చింతలో ఇతరుల చింతలు తెలిసికొను స్థితిలో నున్నాడా? పూజ్యుడైన అతిథి తన గృహమును పావనముచేసినందున గలిగిన ఉత్సుకతతో తాత్కాలికముగా గౌరవాదులు చూపుచున్నాడుగాని యన్నమంత్రి తన యప్పటి చిక్కు మరువగలడా!

ఇక నైదురోజులలో తన లెక్కలును మండలపరిపాలనానివేదికయు సిద్ధము చేయించి యాతడు చక్రవర్తి కప్పగింపవలెను. అవి పంపుటలో ముమ్మిన్న దన్నదేవుడు ఆలసించి యెరుగడు. అతనికి భ్రమప్రమాదములు నలసతయు నేమాత్రము నిష్టము లేదు. మరి ఒక్క కరణమును ఇంకను రాకున్న నేమి కావలెను? ఇప్పుడేమి చేయవలెను?

తిక్కనసోమయాజులతో మాట్లాడుచునె కరణములు వచ్చిరేమో చూచుటకు రెండుమూడుమారు లాతడు తలయెత్తి ద్వారమువంక చూచెను.

వెంటనే తిక్కనసోమయాజి యా యమాత్యశేఖరు డేదో చిరాకులో నుండి మనస్సులో తొందరపడుచుండె నని గ్రహించెను.

"మహామాత్యా, మీరు పనితొందరలో నున్నసమయమున వచ్చినట్లున్నాను. మరొకప్పుడు దర్శనమునకు వత్తునా?"

పూజ్యుడును వృద్ధబంధువును అగు సోమయాజి చిన్నవాడగు తన్నంత గౌరవముతో సంబోధించుట యన్నమంత్రికి రుచింపలేదు.

"అయ్యో! ఎంత మాట! మీబోటి పెద్దలు వచ్చినప్పుడు పనితొందర యేమిటి? నన్ను మీ ఆజ్ఞానువర్తినిగా భావింపవలెను!"

సోమయాజి కన్నులార్పుచు ప్రశ్నించెను.

"మీ రెవరికొరకో నిరీక్షించుచున్నట్లున్నారే?"

"నేటితో నైదవనాటికి లెక్కలు నివేదికలు చక్రవర్తికి అందీయవలెను. మా కరణము లందరు నీనాడు ఒక్కసారిగా పని చాలించుకొన్నట్లున్నారు! దానికి కారణమును గన్పడుటలేదు. మానము దక్కుట ఎట్లా యని ఆలోచించుచున్నాను. అంతే!"

తిక్కన "మహామాత్యా!—"

అన్నమంత్రి: మీరు నన్ను 'మహామాత్యా' యని సంబోధించుట వింత కలవరము రేపుచున్నది నా అంతరములలో!

తిక్కన: "మహామాత్యులను మ రేమందురు?"

అన్నమంత్రి: "మీ రన్నందుకు కాదు. ఎంద రట్లు నన్ను సంబోధించుట లేదు? అట్లు పిలువబడినప్పు డెన్ని మారులు నాకు సంతుష్టి కలిగియుండలేదు?— కాని మీ రీనాడు నన్నట్లు పిలుచుటచే హృదయములో అశాంతి కలుగుచున్నది."

తిక్కన: "మహాయోగీశ్వరులు మీరు కారణజన్ములై యీ పుట్టువులో మహామంత్రు లైనారు!"

అన్నమంత్రి: "మా అమ్మగారు నాపై ప్రేమాతిశయముచే చెప్పు కథ మీ చెవులబడినదా, స్వామీ? ఈ జన్మములోనే మోక్షము నొందబోవువాడు సర్వసంగపరిత్యాగము చేయక నావలెనే ఈ మహామాత్యపదవీభారము పైన వేసికొనునా?"

తిక్కన: "మహామాత్యా! నాకు చూడగా మహామాత్యపదవి నిర్వహించుటకును మోక్షమున కధికారి యగుటకును విరోధము కనపడదు. కేవలము స్వయం ముక్తుకూడ సచివాగ్రణిగా నుండవచ్చును."

అన్నమంత్రి: "పెద్దలు చెప్పునది కా దనుటకు నాకు సాహసము లేకున్నది కాని నా బుద్ధి కది ఎక్కుటలేదు."

తిక్కన "మహామాత్యా!—శ్రీకృష్ణభగవానుని హృదయములో ఒక్కసారి స్మరించుకొనుడు! ఆ భగవానుడు ధర్మరాజునకు సచివోత్తముడా కాడా?"

అన్నమంత్రి యొక్క క్షణకాలము ఆలోచనాపరుడై మౌనము వహించెను. ఆ క్షణములో నేదో అతని హృదయమున విద్యుత్తువలె మెరసి మాయమైనట్లుండెను. మరుక్షణములో చిరునవ్వుతో వికసించిన ముఖముతో సోమయాజిని ప్రశ్నించెను.

"అయితే, శ్రీకృష్ణభగవానులుకూడ నావలెనే—ఎన్నడైనను కార్యభార మున్నపుడు—కరణములు వేళకు రాలే దని కస్సుబుస్సు లాడెనా?—"

ఆ మాట లనుచునే అన్నమంత్రి పెద్దలతో నట్లనియుండకూడదేమో యని విచారించుచుండెను. ఆమాటలు తిక్కనసోమయాజులకు నొప్పి కలిగించునేమో యని సందేహము కలిగెను. కాని యందుకు మారుగా తిక్కనసోమయాజుల ముఖము చిరునవ్వుతో వికసించుటే కాదు. అప్రయత్నముగా ఆయన నవ్వెనే నవ్వెను. ఆ నవ్వులో ఆయనస్వచ్ఛమైన దంతపంక్తి మెరపుతీగవలె మెరసెను. ఆ నవ్వు ముఖమునుండి వినబడిన మేఘఘోషవలె గంభీరముగా శబ్దించెను.

"మహామాత్యా! శ్రీ కృష్ణభగవానులు ఇంతకంటెను చిరాకుపడెను. మహాభారతసమరము ఉపక్రమించినవేళనుండి అది యుపసంహార మగువేళవరకును అనుక్షణము ఆయన పడిన చిరాకు ఉభయపక్షములలో నెవరును పడలేదు! రణము ప్రారంభింపబోవుచున్నది. పాండవజ్యేష్ఠుడు రథము దిగి పాదచారియై ఎదిరిపైపునకు బయలుదేరెను గదా! అప్పుడు శ్రీకృష్ణు డెట్టి చిరాకు చెందియుండును? భీష్మబాణములు ఆయని వక్షస్థలము చీల్చివేయగా ఎంత బాధకలుగనిది సుదర్శనము చేబూని భీష్మునిపై కుప్పించెను? కర్ణుని శక్తి అర్జునునిపై ప్రయోగింపకుండ చేయుటకు ఎంత ఆలజడిపడెనో? సంశప్తకు లొకమారు ఒక్కపెట్టున అర్జునుని రథముపై బడగా అర్జునుడు కనిపించకపోగా శ్రీకృష్ణభగవానుడే ఎంత పరితపించెను? వ్యాసభగవానులు భగవానుని లీలల నట్లు ప్రదర్శించుట, మరి ఎందుకు?—"

అన్నమంత్రి "మహామంత్రుల నుద్బోధించుటకే!"

తిక్కన "మహామంత్రులనే కాదు, మీబోటి కారణజన్ములను, మాబోటి వైదికకర్మనిష్ఠులను—సమస్తమానవకోటిని!—సరేగాని మహాభారతప్రసంగమాతో తన్మయత నొంది ముందు చెప్పదలచినది చెప్పలేదు!—"

అన్నమంత్రి: "అ దేదో, వెంటనే సెల విండు!"

తిక్కన: "ఏమియు లేదు. కరణములు రాలే దనియే మీ విచార మైనచో మీ రంత చింతింపఁబనిలేదు. నావెంట వచ్చిన శిష్యులు ఎట్టి కష్టపు లెక్కలైనను సిద్ధము చేయగలరు. వారికి ప్రస్తుతము పనిలేదు. వారిని మీ రుపయోగించుకొనవచ్చును."

అన్నమంత్రి సోమయాజివెంట వచ్చిన ఇరువురుశిష్యులవంకను జూచెను. తన యశేషకార్యభారము నీ యిద్దరుశిష్యులును చేయగల రనియే సోమయాజులు తలంచుచున్నారు! పెద్దలతో నా విషయము చెప్పు టెట్లు? వినయముతో మధ్య మధ్య మాట లాపుచు నన్నయదేవు డుపక్రమించెను.

"మీ మంచిమాటకు మిక్కిలి కృతజ్ఞుడను. కాని—ఇప్పుడు—సిద్ధముచేయ వలసిన లెక్కలు ఒక రిద్దరితో తీరునవి కావు. అధమపక్షము—"

తిక్కన: "ఎందరు కావలె మహామాత్యా?"

అన్నమంత్రి: "అసమపక్షము—యిక్కాలి సమర్థులైనచో—అధమపక్షము - పాతికమంది యైనను లేనిది కాదు. అదియుగాక చాలించుకొన్నవారు మొదలా లెక్కతే స్థితిలో నుంచిరోకదా!"

తిక్కన: "మహామాత్యా, నావెంట నూరుగురుశిష్యు లట్టి సమర్థు లున్నారు. అందులో మీరు కావలసినంతమందిని వినియోగింపుడు!"

ఆ మాటలకు అన్నయమంత్రి నిర్ఘాంతపోయెను. ఆతని మనస్సులో నంత సేపుగా నావరించి యున్న చింతానీహార మొక్కసారిగా విరిసెను. తుష్టుడై నవ్వుచు నిట్లనెను.

"నూరుమంది శిష్యులా సోమయాజీ? మీ రందరును ఏకశిలానగరము పట్టుకొనుటకు వండెత్తి రాలేదుగదా!—అందరును ఈ గురునాథునివంటివారే యైనచో ముందు మీ యందరను రాజభటుల కప్పగింపవలెనేమో!"

గురునాథుడును మారనయు చిరునవ్వు నవ్విరి. తిక్కనసోమయాజి నిట్లూర్పు పుచ్చెను! అయినను స్వకార్యవ్యగ్రతలో అన్నమంత్రికి సోమయాజులకు చింతాశల్య ముండెనని స్ఫురింపలేదు.

అంతట సోమయాజియాదేశమున మారన బయలుదేరిపోయి వారి వసతినుండి పాతికమంది కరణముల ఓలిచికొనివచ్చెను. వారు దివాణముముందుకు రాగానే వేద మంత్రములతో సూత్కృముగా స్వస్తి చెప్పి యన్నమంత్రిని ఆశీర్వదించిరి.

ఆ కరణముల యౌదాత్త్యతకు అన్నమంత్రి నిర్ఘాంతపోయెను. ఇన్నాళ్లును తా నెరిగిన కరణములు తన్ను సేవించువారు. మరి వీరో, కేవలము వేదమాతృస్వరూపులై తన్ను ఉద్ధరించుటకు వచ్చిన పుణ్యబ్రాహ్మణమూర్తులు. అప్రయత్నముగా అన్న మంత్రియే వారి కందరకు నెదురుపోయి నమస్కరించి లోనికి తెచ్చెను.

తిక్కనసోమయాజి యా వచ్చిన కరణములకు వారప్పుడు చేయవలసిన కార్య మాదేశించెను. వా రన్నయదేవునివెంట వ్యవహారపుదివాణములో ప్రవేశించిరి. ఆ మందిరము చెక్కుచెదరక యుండెను. పత్రములు దస్త్రములలో స్పష్ట ముగా కనపడుచున్న ముఖపత్రముల సూచికలతో నన్నియు యథాస్థానములలో నున్నవి. ఆ క్రొత్తకరణములు నిస్తంద్రులై యా మందిరము ప్రవేశించిరి. చిరకాల మచ్చట పనిచేయుట కలవాటుపడినవారివలెనే వా రొక్కొక్క రొక్క స్థాన మాక్రమించి పని ప్రారంభించిరి. వీరికి క్రొత్తదనమే లేదేమి?

అన్నదేవునికి పోయిన ప్రాణములు తేచివచ్చిన ట్లయ్యెను. ఇది యంతయు నతనికి కలయా యని విభ్రాంతి కలిగెను. అయితే ఆల డట్లు ఆశ్చర్యపడుచు నాలోచించుట కాతనికి తీరిక లేదు. శీఘ్రముగా కార్యనిమగ్ను డయ్యెను. ఆతడు తన పని ఏకాగ్రచిత్తుడై యొక మహాయోగివలెనే చేయసాగెను.

మధ్యాహ్నకాల మతిక్రమించెను. దివాణమున గడియారమున రెం డెనిమీదుల ఘంటాఘణాత్కారములు మ్రోగెను. అన్నయదేవుడు ఆ ప్రక్కనున్న గదిలో సోమయాజులను వదలివచ్చినసంగతియే మరచినట్లుండెను. ఇదిగో వచ్చును, అదిగో వచ్చును అని తిక్కనసోమయాజి యాతని రాకకై దీర్ఘకాలము నిశ్శబ్దముగా నిరీక్షించెను. గురునాథున కాకలై పుపంచి కోపము వచ్చుచుండెను. మారన తన కభిమానమైన మార్కండేయపురాణములోని ఘట్టములు మననముచేయుచు ఇతరము మరచిపోయెను.

తిక్కనసోమయాజికి అన్నమంత్రి కార్యవ్యగ్రతకు అచ్చెరువయ్యెను. అతడిక పని తీరనిది రాడని నిశ్చయించి మాధ్యాహ్నికకృత్యములకు వేళ యతిక్రమించుచున్నందున వసతికి బయలుదేరుటకు లేచెను. గురునాథుడును లేచెను. మారన నిద్రలోనుండి లేచినవానివలె గురునాథు డుద్బోధింపగా లేచెను. అన్నమంత్రికి చెప్పివెళ్లుట ధర్మముకదా !

"మరల మీ దర్శనమునకు వచ్చెదను మంత్రీశ్వరా !"

ఈ మాటలు అన్నమంత్రీశ్వరుని ఎదుటికి పోయి తిక్కనసోమయాజులు పలికెను. కాని యా మాటలు అన్నమంత్రి వినిపించుకున్నట్లు లేదు. ఏమి చేయుటా యని తిక్కనసోమయాజి ద్వారపార్శ్వమున సందేహించుచు నిలుచబడెను.

అత డట్లు నిలుచున్న ప్రదేశము అన్నమంత్రియంతఃపురములోనివారికి కనబడుచుండెను. సోమయాజులు తమ దివాణములోనికి వచ్చినప్పటినుండియు అన్నమంత్రి తల్లియు నిద్దరు భార్యలు పార్వతియు లకుమాంబయు నాయనను జాగరూకులై కనిపెట్టియుండిరి. అందుచే సోమయాజుల ప్రస్తుతస్థితి వారికి వెంటనే యవగతమయ్యెను.

ఆరేళ్లపిల్ల యొకతె దాసిని వెంట నిడుకొని సోమయాజులకు ప్రత్యక్షమయ్యెను. బాలాత్రిపురసుందరి యీ రూపమున దర్శన మిచ్చినదా యని సోమయాజితలపులో బారుచున్న కేతసవృగా నది——

"తాతగారూ, మా అమ్మగారు—మిమ్ములను లోపలికి తీసికొనిరమ్మన్నారు!"

ఇట్లనుచు నా పిల్ల ప్రేమతో గౌరవముతో సోమయాజుల చేయి పుచ్చుకొని గురునాథునివంక బెదరుబెదరుగను మారనవంక సిగ్గుతోడను చూపులు పరపుచు వారల మువ్వురను అభ్యంతరమందిరములోనికి తోడ్కొనిపోయెను.

ఆట్లానాడు సమ్మెచేసినది అన్నమంత్రికరణములే కాదు. ఆ సమ్మె రాజధానీ నగరమం దంతట సాగెను. రాజమందిరములో దప్ప పెరతావుల నెల్లయెడలను మంత్రిదండనాథసామంతుల వ్యవహారస్థానములందును—కరణము లెవ్వరు పనిలోనికి రాలేదు. అధికరణస్థానములలో లేఖకులు రాకుంటచే విచారణ లాగిపోయెను. పెద్ద వర్తకుల యంగళ్లలోగూడ వ్రాయసకాండ్రు రానందున క్రయవిక్రయములుకూడ ఎక్కువభాగము కట్టువడిపోయినవి.

ఈ యపూర్వసంఘటన మం దెవరికి నర్థము కాలేదు. ఎవరికి వారు తమ కరణములు రాకుండుటకు కారణ మేదో ఉండు నని ఊహించి వారి రాకకై కొంతసేపు నిరీక్షించిరి. ఎంతసేపటికిని రానందున నాశ్చర్యముతో తమ సేవకులను కరణముల యిండ్లకు బంపిరి. ఎవరు వెళ్లినను ఇంటిదగ్గరవారు ఇంటిలో లే రని చెప్పుచుండిరి. ఆ మహానగరములో వా రెక్కడ నుండిరో కనుగొనుట యెట్లు ?

అధికారులకు ప్రభువులకు నాగ్రహము వచ్చుచుండెను. కాని ఏమి చేయగలరు ? వారిలో పలువురు అన్నమంత్రివంటివారైన గారు. వారు సహజముగా లెక్క లాలస్యముచేయ నలవాటుపడినవారు. పైగా, "మా హస్తములు కత్తి పలక పట్ట నేర్చినవి కాని గంటములు పత్రములు పూనుటలో నేర్పుకలవి కావు" అని సగర్వముగా చెప్పికొనుచు వ్యవధి తీసికొనుచుండువారు. వారు చైత్రశుద్ధదశమికి పంపవలసిన లెక్కలు ఏ శ్రావణాంతమునకోగాని పూర్తి కావు. విజయదశమి లెక్కలు శివరాత్రికిగాని కావు. అట్టివారి లెక్కలు పేరుకొనియుండి చాల వెనుకబడియుండుటే గాక అయోమయావస్థలో నుండెడివి. అందుచే నట్టివారు కొంతవరకైన దారికి తెచ్చుటకు నవరాత్రములలో కొత్తకరణములనుగూడ పెట్టుకొని పని చేయించుకొనువారు. ఏది యెట్లున్నను వారు పూర్తిగా తమ కరణములపైననే ఆధారపడియుండెడివారు.

కొంతకాలమునుండి బ్రాహ్మణులలో వేదశాస్త్రాభ్యాసము క్షీణింపసాగినది. అట్టివారికి అగ్రహారములలో వృత్తులును లోపింపసాగినవి. శిష్టులైన బ్రాహ్మణులలో వారికి గౌరవముకూడ బోవుచున్నందున తప్పనిసరిగా వారు మహాపట్టణములకును చిన్నపట్టణములకును చేరుకొనసాగిరి. వారిలో కులధర్మము క్షీణించినను వారి కులాభిమాన మేమియు దగ్గలేదు. వా రందుచే జీవనోపాధికై చేయదగిన వృత్తులు స్వల్పముగా నుండెను. వర్తకము చేయుటకూడ వారికి హీనముగా కనిపించెడిది. ఏమిచేయగలరు ?

వారిలో పలువురు వ్రాయను జదువను చిన్నచిన్న లెక్కలు వేయను నేర్చినవారు. అట్టివారు తాత్కాలికమగు వ్రాయసవృత్తిలో పెక్కురు ప్రవేశింపసాగిరి. ఆ ఉద్యోగములకై అట్టివారిలో చిరకాలముగా స్థిరపడియున్న జైనోద్యోగుల

వా రాశ్రయింపవలసివచ్చుచుండెను. ఐనను ఆ జైనోద్యోగులు ఈ బాపనవ్రాయసగాండ్రను పనిలో చేర్చుకున్నను వృత్తిలోని గుట్టులు బయటపెట్టకుండగనే వారి నుపయోగించుకొనెడివారు. వారు తాము వ్రాసిన పత్రములకు ప్రతులుమాత్రము ముఖ్యముగా వీరిచే వ్రాయించెడివారు. అవియును ముఖ్యమైన వచో కొంతభాగము ఒకరిచేతను కొంతభాగము మరియొకరిచేతను వ్రాయించి దాని పూర్ణస్వరూపము వీరికి తెలియకుండ జేసెడివారు. అట్లు కార్యకలాపము లవగాహనయగుటకు వా రెన్ని ఆటంకములు కలిగించుచున్నను, సూక్ష్మబుద్ధి కల కొందరుమాత్రము ఆ వ్యవహార నిర్వహణమున సమర్థత నెమ్మదిగా రహస్యముగా సంపాదించుచుండిరి. కాని యట్టి పట్టుదల గలవారు కొలదిమందియే కలరు. వా రైనను పైపదవులలో నున్న జైనోద్యోగులవద్ద ఆశ్రయించి యుండవలసివచ్చుటచే తమ ప్రతిభను బయటపెట్టుకొనుటకు జంకుచుండిరి.

చిరకాలముగా పని చేయుచున్న జైనకరణముల పద్ధతికి ఈ బ్రాహ్మణకరణముల వ్యవహారవిధానము కొంచెము భిన్నముగా నుండెడిది. వేదప్రామాణ్య మంగీకరింపని తమకంటె నన్యు లని తెలిపి నిర్దేశించుటకు ఈ బ్రాహ్మణకరణములకు వైదిక కరణము లని వారు పేరుపెట్టిరి. ఆ పేరె కొన్నాళ్లుగా వ్యవహారములోనికి వచ్చినది.

ఇది జైనులు సాగించిన కుట్ర యని చెప్పుట ఎవరికిని తెలియలేదు. వైదిక కరణములు దివాణములకు వచ్చిరి. కాని యక్కడ పెద్దకరణము లెవ్వరును లేకున్నందున వారు సందేహించి తారటలాడుచు వెనుదిరిగిపోవ నుంకించుచుండిరి. అట్టివారు ప్రభువుల కన్నుల బడగా ప్రభువులు వారిని పిలిపించి వ్యవహారము చూడుమని చెప్పుచుండిరి. అయినను వారు తమకు స్వతంత్రముగా పని చేయు సమర్థత లే దనియు చెప్పిన పత్రములు వ్రాయుటే కాని ఎక్కువ చేతకా దనియు చెప్పుకొని తప్పుకొనిరి. వారిలో సమర్థులైనవారికి అది మంచి యదనే. అట్టివారుకూడ తమ్ము చేర దీసిన జైనోద్యోగులకు విరుద్ధముగా ప్రవర్తించుట ధర్మము కా దను ధర్మభీతిచే కొందరును ప్రబలురకు కోపము తెప్పించుట శ్రేయస్కరము కాదను భీతిచే కొందరును పనిలోనికి స్వయముగా దిగుటకు జంకుచుండిరి.

మహాప్రధాను లగు శ్రీమత్ గోవిందనాయకుడును బయ్యనాయకుడును కొంతకాలముగా రాజప్రాసాదములో నున్న తమ కార్యస్థానములనే పని చూచుకొనుచుండిరి. అక్కడి కరణములు పనిలోనికి వచ్చినందున వారి కార్యకలాపముల కెట్టి యాటంకమును గలుగలేదు. కొంతవడికి వారి గృహములయొద్ద గల వ్యవహార శాలలలో కరణములు రాక పని యాగిపోయిన దని వార్త యందుకొనిరి. వారు వెంటనే కంచయనాయకుని పిలిపించి గూఢచారులను పట్టణమం దంతటను పరిసరములను సంచరించి వార్తలు తెప్పించు నేర్పాటు చేసిరి. ఆపిమ్మట తిక్కచమూపతిని సర్వసేనలతో నెల్లయెడల కట్టాయితమై యుండ నిర్దేశించి యే క్షణమున కాక్షణము వార్త లందుకొనుచు ప్రతిక్రియలు ఆజ్ఞాపించుచుండిరి. వృద్ధుడై వ్యాధిచే బలహీన

ముగా నున్న గణపతిదేవుల కీ వార్త తెలిసినచో నావేగము నొందును. రాజవైద్యులు ఎట్టి ఆవేగము కలిగినను వ్యాధి వికటించు నని కఠినముగా శాసించియుండిరి. మహాలయసభనాడు చక్రవర్తికి గలిగిన కలతచే గలిగిన దుర్లక్షణము లింకను శాంతింపలేదు. మహామంత్రు లందుచే గణపతిదేవుల కిది ఎంతమాత్రము తెలియనీకుండ కట్టడి చేసిరి.

రుద్రదేవమహారాజులు నవరాత్రదీక్షలో నుండిరి. వారు శ్రీవిశ్వేశ్వరశంభు దేశికుల యాజ్ఞానుసారము పాడ్యమినాడు కలశస్థాపన చేసిరి; అఖండజ్యోతిని ప్రతిష్ఠించిరి. ఒకవంక సింహధ్వజమును మరియొకవంక వరాహలాంఛనమును ఎత్తి ధ్వజారోహణము నిర్వర్తించిరి. నిత్యమును ప్రాతఃకాలమున రుద్రాభిషేకపురస్సరముగా శివపూజ కావింతురు. మధ్యాహ్నప్రభృతి నియతముగా నాయుధదేవతాపూజ చేయుదురు. రాత్రులందు శివాపూజ నిర్వర్తింతురు. కుమారీపూజలును సువాసిన్యర్చనలును వైభవముగా జరుపుచుండిరి. పూజాసమయములలో వారు కనబరచు భక్తిశ్రద్ధలకు నేకాగ్రతకు నక్కడ చేరెడి విప్రు లందరు నాశ్చర్యచకితు లగుచుండిరి. పవలెట్టి యాహారము వారు భుజింపరు. రాత్రులందైన హవిష్యమే యాహారము! శివశక్తియు శివాశక్తియు నేకాకారమై యీరూపమున నవతరించెనా యని రుద్రదేవమహారాజులు చూపఱకు గనుపట్టుచుండిరి. అట్టివారి కీ దీక్షాకాలము ముగియువరకు రాజకార్యభారము నివేదింపరాదు! రుయ్యమకును కామసానికిని రహస్యముగా మహాప్రధాను లీ వార్త యెరిగించి వారల జాగరూకలుగా నుండ నియమించిరి.

మరి యా సమయమున మహాదేవరాజు తన వ్యవహారశాలకు కరణములు రాలే దనునది గమనించునప్పటికే పదిగడియల ప్రొద్దెక్కెను. తెలిసినవెంటనే అతని కాగ్రహము వచ్చెను. వెంటనే భటులను కరణముల ఇండ్లకు పోయి వారు నెమ్మదిగా చెప్పిన రాకున్న కశాఘాతములు చేసి బలవంతముగా లాగికొనిరమ్మని యాజ్ఞాపించెను. కాని ఏమిచేయుటకైనను వారు కనబడిననేగదా !

నాగదేవుడు ఆయగాండ్లపై యధికారి. గోన గన్నారెడ్డి స్థలసుంకాధికారి. వారి కరణములు రాకుండుటచే వారికి లోకమే తల్లక్రిందులైనట్లుండెను. కాని ఏమి చేయగలరు? ఆ క్రిందటిరోజుననే కాయస్థసేనాను లగు జన్నిగదేవుడును, అతని సోదరులు త్రిపురాంతకుడును, అంబదేవుడును రాజధానికి వచ్చియుండిరి. వారి మండలముల సరిహద్దులలో పల్లవులును పాండ్యులును చోళులును చేయుచున్న యలజడివలన కదలుటకు వీలు చిక్కకపోయిన దనియు అప్పుడు వచ్చుటైనను రాజాజ్ఞ మేరకు వచ్చియుండిరేగాని మండలస్థితి ప్రమాదకరముగా నున్న దనియు మహారాజుకు నివేదించుకొనిరి. వారు మరియును మహారాజు నాజ్ఞ తమకు మండలాంతమున నున్నందున నాలస్యముగా నందిన దనియు వివరించినందున వారిని చక్రవర్తి వినియుదాసీనత వహించెను. ఈ మువ్వురలో అంబదేవుడు సర్వతోముఖమగు ప్రజ్ఞ కలవాడు. యుద్ధవిద్యలో నీ సేనాని సాటిలేని మేటి. అంతియకాక అతడు గణితమున

నద్వితీయుడు. అతడెక్కడ అధికారములో నున్నను భూమి యంతయు 'పెనుంశాకమానదండము'తో చక్కగా కొలిపించి 'సీమనేల'పై న్యాయమైన 'కోరు'ను 'వలిపాలము'పై 'పుట్టిపహిండి'యు క్రమముగా నిర్ణయింప చేయించువాడు. అందుచే భూస్వాములు చెల్లించవలసిన పన్నుకంటె ఎక్కువ కరణములు వ్రాతలు చేయుటకు గాని ఈయవలసిన 'కోరు'గాని 'పుట్టిపహిండి'గాని భూస్వాములు తప్పించుకొనుటకుగాని యతని మండలములో నవకాశ ముండెడిది కాదు. ఈ యంబదేవుడుగూడ నానా తేమియు జేయజాలకపోయెను. జన్నిగదేవ త్రిపురాంతకుల అంబదేవుని కంటె పెద్దవాడైనను ఆతని సమర్థతయందు గౌరవము కలవాడు. ఇతడే అసహాయుడై యున్నందున ప్రస్తుతము ఈనాటికి తానుగా పరిపాలనా కార్యముని నిష్ప్రహాత వహించి ఉదాసను లైరి.

చాళుక్యవీరభద్రేశ్వరుని కరణములుకూడ నానాటికి రాలేదు. అప్పటి కైదు దినములనుండియే యతని దివాణములో చురుకుదనము తగ్గెను. విజయదశమికి కార్య నిర్వహణభారము చక్రవర్తికి నివేదింపవలసిన యాతురత యాతని దివాణమున కున్నట్లే లేదు. ఈనాడు తన కరణములు రామికి కారణముగూడ విచారింపకుండ అతడు తన పారశీకాశ్వ మెక్కి ఎచ్చటికో వెడలిపోయెను.

అట్లే రేచర్ల కామయరెడ్డి, నామయరెడ్డి, మల్లయరెడ్డి, ప్రోలరెడ్డి, మల్లిరెడ్డి దివాణములను కోట కేతరాజు, ఆనెగొంది రామదేవరాయల దివాణములను కరణములు రాలేదు. వారు అలజడి నొందినట్లే లేదు. వారు నగరవీధుల వెంట జవనాశ్వములపై సంచరింపసాగిరి.

వృద్ధు డగు జాయపనాయకునకు ఇప్పుడు అధికారభారము లేదు. పూర్వ మాతడు గణపతిదేవుల గజసైన్యముల కధ్యక్షుడు. ఇప్పుడు చేబ్రోలులో నుండి విశ్రాంతితీసికొనుచుండి రాజధానికి నవరాత్రోత్సవములకు వచ్చెను. ఆతని కున్న స్వల్పకార్యములును నిర్వహించు కరణ మొక్కడే. అతడును ఈనాడు రాకుండుట జాయపనాయకునకు మనస్సునకు విరామ మిచ్చెను. అందుచే తాను రచించిన 'నృత్తరత్నావళి' భాగములు మరల చదువుకొని ఆలోచించుకొనుటకు తీరిక చిక్కెనని సంతోషించుచు నా పనిలో మునిగియుండెను.

అంతలో, బద్దెన యాతనికడకు వచ్చెను. అతనికి పల్నాటిలో పది గ్రామములు కలవు. ఆ చిన్న సంస్థానమునకు పని లక్కువ. ఆతనికిని తన ముగ్గురు కరణము లానాడు రాకుండుట విద్యార్థులకు తుపానుగాలిచే లభించిన ఆటవిడుపువలెనే భాసించెను. వెంటనే యాత డప్పుడు రచించుచున్న సుమతీశతకములోనికి పద్యము లాలోచింపసాగెను. అట్లాలోచించుచునే యాతడు జాయపనాయకునియొద్దకు బోయెను.

జాయపనాయకునకు బద్దెనయందు వాత్సల్యము గలదు. ఆ చిన్నవాని వినయ విధేయతలు జాయపనాయకున కెంతయేని వచ్చెను. మరియు నాతని వయస్సువలన

లేమి, స్వభావమువల్ల నేమి, బిడియపడు స్వభావము కలవాడు. అతడు నలుపు రున్నచో మాట్లాడుటకు జంకును. కాని ఆప్తు లని తెలిసినవారియొద్ద మనస్సు విప్పి మాట్లాడును. అట్టి యేకాంతగోష్ఠిలో నొక్కొక్కతరి నతడు వదరుబోతా యేమి యనునట్లుకూడ మాటాడును. జాయపనాయకునియొద్ద నాతి పట్లు మనసు విప్పి మాటాడును. తనయొద్ద నట్లు నిర్భయముగా—కొంత అతిగా—మాట్లాడుటయు నలువురలో నున్నప్పుడు మౌనముద్ర వహించుటయు నతనికి బద్దనపై ప్రీతి నతిశ యింప జేసెను. వృద్ధుడును రాజబంధువును మహాపదవి వదలినవాడును విద్వాంసు డును సరసుడును ప్రేమాస్పదుడును నగు జాయపనాయకునందు బద్దనకు మిక్కిలి గౌరవము కలదు. అందుచే తన మనస్సు విప్పి మాటాడుట కాతడు తరుచుగా జాయ పను దర్శించును.

వీరిద్దరివలె ఆనాడు కరణములు గానందుకు బరువు తీరినట్లు భావించినవారు మిక్కిలి కొలదిమందియే. పలువురు దానికై యాతన ననుభవించినవారే. ముందు వారు ఎవరికి వారు తమ కరణములుమాత్రమే రాలేదని తలంచి దానికి కారణము లును ప్రతిక్రియలును నూహించుచుండిరి. కాని రాజధానీనగరమందంతటను వ్యవ హారశాలలకు ఆనాడు కరణములు రాలేదను వార్త నెమ్మదిగా మధ్యాహ్నము కాక ముందే ప్రాకిపోయెను. ఆ వార్త యందరికి విభ్రాంతి కలిగించెను.

వారు పూర్వము కులసమ్మె లెరుగుదురు. వానికి రావలసిన కట్టడిలో లోపము జరిగినచో ఆ ఇంటికి ఆ పనివాడు పోడు. ఆ పని చేయు నా కులమువారే పోరు. గ్రామస్థు లందరు నా విషయమున వారికి విరుద్ధముగా వర్తించినచో గ్రామ మంత టను వారా సమ్మె చేయుదురు. చాకలి, మంగలి, కుమ్మరి,—ముఖ్యముగా ఈ కుల ముల సమ్మె లెరుగుదురు. సంఘములో వారికున్న హీనస్థితిచేత ఏ పెద్దపైననైనగాని పెద్దలపైన గాని వారికి తీవ్రముగా ఆగ్రహము కలిగినచో నది చూపుటకు ముందు వెనుకలు దూరము ఆలోచించి సమ్మె సాగించువారు. సమ్మెవరకు వచ్చినతర్వాత ఆ గృహయజమాని గాని ఆ గ్రామస్థులు గాని వెంటనే వారి కష్టము విచారించి న్యాయముగా నలుగురు పెద్దలు చెప్పినట్లు సరిచేసికొనెడివారు.

కాని ఈ సమ్మెయో ? అపూర్వము ! ఇట్టి దెన్నడు నెవ్వరు నెక్కడ నెరుగనిది ! ఇది నిష్కారణమైన సమ్మె. అదియు ఉద్యోగులది ! ఈ సమ్మె చేసిన వారిలో వ్యవహారజ్ఞానము లేనివారు లేరు. అందులో చిన్నవ్రాయసగాండ్రనుండి సామంతమండలేశ్వరపదవుల నధిష్ఠింపదగినవారివరకు గలరు. ఏదో అల్పులు విధిలేక చేయు సమ్మె వీరు చేయు టేమిటి ? ఎందుకు చేసినట్లు ? ముందు వీరికీ యాలో చన ఎట్లు తట్టినది ? ఎవరు చెప్పిరి ?

ఎవ్వరికిని ఏమియు తోచలేదు. అందరును దీనినిగురించి పరిపరివిధములుగా ప్రశ్నించువారే ! ఉత్తర మిచ్చువా రొక్కరును లేరు. చిత్రముగా ఈ కరణములు

ఎక్కడను కనపడనేలేదు. ఏ మైరి? ఒకవిధమైన అవ్యక్త మగు భయము ఏకశిలానగర ప్రజలకే ఆవహించినది.

అంతలో మరి యొక వార్త ఏకశిలానగర మంతట ప్రాకిపోయెను. పైవార్త యంత చిత్రముగనే ఈ వార్తగూడ ప్రతివారును చెప్పుకొనసాగిరి. అన్నియెడలను సమ్మెయున్నది. కాని ఇందులూరి అన్నయమంత్రిదివాణమునమాత్రము ఏమియు అలజడి లేదు. అక్కడ పని చురుకుగా యథాప్రకారము సాగిపోవుచున్నది.

మరి ఎట్లు? ఈ వార్త నమ్మలేక జనములు వచ్చి కొంచెము దూరమున గల రాజమార్గమునకు వచ్చి అన్నయమంత్రివ్యవహారశాలవంక ఒకరి కొకరు చూపుకొనుచు అచ్చటి పని జరుగుచుండుట చూచి యాశ్చర్యపడసాగిరి.

"ఈ అన్నమంత్రి నిన్ననే రాజధానికి వచ్చినాడే! అప్పుడే అతని కరణములను ఏవిధముగా పనిలోనికి రప్పించుకున్నాడు? ఇతడు మహామేధావి!"

మరి కోలనిరుద్రదేవుని దివాణమునన్నో? అతని దివాణములో కరణములు పని చేయుటలేదు. అత డింకను రాజధానికే రాలేదు!



ఆశ్చర్యముతో పలువురు సామంతులును దండనాథులును మంత్రులును ఆ సాయంకాలమున ఇందులూరి అన్నయమంత్రిని చూడబోయిరి. ఇంత చిన్నవాడే యీతడు ? ఇత డీ బాధ లేకుండ నెట్లు తప్పించుకొనగలిగెను ? దీనికి మూలకారణ మేమి ? ఇందుకు చేయదగిన ప్రతిక్రియ ఏ యున్నది ?

అప్పటికే అన్నమంత్రి యానాటి రాజకార్యములు ముగించుకొని భోజనము చేసి యించుక విశ్రాంతితీసికొని సావధానముగా మిత్రులు బంధువులు కవులు గాయకులు నర్తకులు పరివేష్టించియుండ నిష్టకథావినోదంబుల ప్రొద్దుపుచ్చుచుండెను.

మెండుగా వచ్చుటకి జాయపనాయకుడు వచ్చెను. ఆతనికి తాను వ్రాయుచున్న సుమతీశతకములోని పద్యములు వినిపించుచు బద్దెనయు నాతనివెంట నరుదెంచెను. జాయపనాయకునకు యువకు లన్న నెక్కువ యభిమానము. అందును అన్నమంత్రిపై నాతనికి ప్రేమయు గౌరవమును మెండు. ఈ వయసువాని కార్యదక్షతల నాశ్రయించి కాకతిరాజ్యలక్ష్మి చిరకాలము స్థిరముగా నుండగల దని జాయప తరుచుగా ననుచుండును. అన్నయసమక్షమున నున్నపుడు అతివృద్ధుడగు జాయపనాయకునకు యౌవనోత్సాహము కలిగినట్లుండును. రాజధానికి వచ్చినపు డాత డన్నయదివాణమునకు తప్పకుండా పోవుచుండును. అందును ఈనాడు ఎక్కువ ఉత్కంఠతో నాత డన్నమంత్రిని చూడబోయెను.

జాయప రాగానే అన్నయయింట రాచమర్యాదలు సాగినవి. ఆత డంత సుఖోపవిష్టుడై ఠీవిగా గూర్చుండెను. 'నృత్తరత్నావళి' వ్రాసినవా డైనను అతని కదలికలలో నిప్పుడు నృత్తవిద్య రోమమాత్రము కాన్పింపదు. అతివృద్ధు డైనందున నడుము బిగిసిపోయెను. వ్యాయామకర్కశ మగుటచే నాతని శరీరము క్షీణించినను బలహీన మైనను సడలిమాత్రము పోలేదు. నడుముకు మెడయు వంగక నిటారుగా నుండును. అందుచే నతని నిప్పుడు చూచినవారు "ఇతడు నిజముగా నృత్తరత్నావళి స్వయముగా రచించెనా ?" అని సందేహింతురు కాని యతని ముఖములోనుండి త్రోసికొనివచ్చి నాట్యమాడుచుండు నాతని చిరునవ్వులను గమనించినవారి కా సందేహము తీరిపోవును. ఆతని వాక్చమత్కృతి విన్నవారికి నతని హృదయములో నిత్యనృత్య మొనర్చు దివ్యశక్తి ప్రత్యక్షమగును. ఐనను సంభాషణలో అక్షరవిన్యాసమున తొందర లేక ధీరమై గజగమనమునే అనుకరించును. చిరకాలసహవాసముచే గజప్రకృతి యతని ప్రకృతిలో కలసిపోయినది.

యథాచారముగా జరుగు ననామయకుశలప్రశ్నాదిక మైనతర్వాత జాయపనాయకు డిట్లు ప్రారంభించెను; ఆనాటి కరణముల చర్యనుగూర్చి ఎట్టి ప్రసంగమును చేయలేదు.

"అన్నమంత్రీశ్వరా, మన బద్దెన ఈనాడు చెప్పిన క్రొత్తపద్యము విన్నావా?"

ఆ మాట లనుచుండగా జాయపముఖము చిరునవ్వుతో ఇంచుక విప్పారెను. ఆ ప్రశ్నలోని కొంటెతనముమాత్రము గొంతులోగాని ముఖములోగాని వ్యాప్తము కాలేదు. ఆ మాటలు వినుచున్న బద్దెనలో కొంత అశాంతిమాత్రము కనపడెను. జాయపవంకనే చూచుచున్న అన్నమంత్రి కది యేమియు గోచరింపలేదు. అందుచే ప్రాసంగికముగనే భావించి యడిగెను.

అన్నమంత్రి: "ఏదీ? విందాము—"

బద్దెన వెంటనే చదువలేదు. జాయప బద్దెనను సంబోధించి "ఆ పద్యము మహామంత్రులకు వినిపింపు" మనెను. బద్దెనదేహ మంతయు నెర్రవారెను. జంకుతో ముఖ మంతయు ముడుచుకొనెను.

జాయప: "క్రొత్తపెండ్లికూతురువలె సిగ్గుపడెద వేమి? బద్దెనా!—చదువు! ఇంతమంది రసికు లున్నచోట చదువని నీ పద్యము మరి ఎందుకు?"

ఇట్లనుచు నక్కడ చేరిన కవిగాయకాదులను నిర్దేశించెను.

బద్దెన ధైర్యము తెచ్చుకొని గొంతు సవరించుకొనెను. కాని నోట మాట రాలేదు.

జాయప: అన్నమంత్రీశ్వరా, ఆ పిల్ల నట్టువపే రేమి?"

అన్నమంత్రీశ్వరుడు ప్రత్యుత్తర మీయకముందే మేళనాయకుడు వంగి జాయపకు దండముపెట్టి, "దాని పేరు మదాలస బాబూ!" అనెను.

జాయప: "అయితే బద్దెనా, దానిచేత నవవధువును వర్ణించే శ్లోక మొకటి అభినయింపమందునా?—ఏదీ, అది అమరుకములో ఈ శ్లోకము చెప్పుతున్నదా?

"పటాలగ్నే పత్యౌ నమయతి ముఖం జాతవినయా
హఠాశ్లేషం వాంఛత్యపహరతి గాత్రాణి నిభృతమ్—"

మేళనాయకుడు: "చిత్తము స్వామీ! అభినయము పట్టించేదా?—"తంబుర శ్రుతి ప్రారంభించెను. మురజాదులు సరిచూచుకొనుచుండిరి.

జాయప: "శ్రుతి పెట్టినారు. నీవు పద్యము చదివెదవా? దానిని ముగ్ధాభినయము ప్రారంభించు మందునా?"

అన్నమంత్రి చిరునవ్వు నవ్వుచు, "తాతగారు నిన్ను వదలరు. అంత సందేహింతు వెందుకు! వినిపించు మరి!" అనెను.

బద్దెన గొంతు సవరించుకొని రెండు మూడు మారులు ప్రయత్నించి పద్య మిట్లు తుదకు చదివెను.

"పొరుగున బగవాడుండిన
నిరవందగ వ్రాతకాడె యేలిక యైనన్
శరగాపు కొండె మైనను
గరణాలకు బ్రతుకు లేదు గదరా సుమతీ!"

ఆ పద్యము విని యన్నమంత్రి చిరునవ్వు నవ్వుచు, "చదువడములోనే గాని ముగ్ధత్వము పలుకులో కనపడదే! ఎంత గడుసువాడవు బద్దెనా!—ఇందులో సంబుద్ధుడైన సుమతిని నేనేనా?" అని యడిగెను.

జాయప: "కానేకాదు! నేను!"

అన్నమంత్రి: "మీవద్ద నన్నుగూర్చి చెప్పినదా? అన్న[illegible] తెలెంతు సుమతి!"

అంతలో వ్యవధి లేకుండ నొకరి వెంట నొకరు పలువురు సేనానాయకులును సామంతులును మంత్రులును ఇష్టాగోష్ఠి కక్కడ చేరిరి.

జన్నిగదేవుడు, త్రిపురాంతకుడు, అంబదేవుడు కలసి వచ్చిరి. జన్నిగదేవుడు అన్నమంత్రిని ప్రశ్నించెను.

"మంత్రీశ్వరా, నీ వీనాడు రాజకార్యములు ఎట్లు నిర్వర్తింపగలిగితివి?"

అన్నమంత్రి తొణకకుండగా నిట్లు జవాబు చెప్పెను. "మా పెద్దలు అనాదిగా సేవించుచువచ్చిన త్రేతాగ్నులు నా కీనాడు ప్రత్యక్షమై సాయము చేసినవి."

త్రిపురాంతకుడు: "నిజముగా అట్లే కనబడుచున్నది."

అన్నలిద్దరు మాటాడినందున అంబదేవుడు మౌనము వహించి నలుదిక్కులు తేరిపారజూచుచుండెను. నిర్లిప్తుడై మాపట్టుచున్న అన్నమంత్రీ గాతని కాశ్చర్యము కలిగించెను.

అంతలో నక్కడికి మహాదేవరాజు వచ్చెను. అతడు మిక్కిలి స్థూలకాయుడు. కరణములపై నాతనికి కలిగిన కోపము ఇంకను ఏమాత్రమును తగ్గలేదు. అది ముఖము నుండి జారి కూడ పోలేదు. ఆ ఉగ్రరూపముతోడనే యాతడు వేగముగా లోపలికి వచ్చెను. ఆతనికి చేయుచున్న మర్యాదలైన జేయించుకొనకుండ సరాసరి అన్నమంత్రిని ప్రశ్నించెను.

"అన్నమంత్రీ! నీ కరణములకు నీ వెట్లు శాస్తి చేసితి వయ్యా? నావారి నందరినీ పొడిచివేయవలె నని ఉన్నది."

అన్నమంత్రి: "నే నింకా ఏమీ చేయలేదు. వారిని పొడిచివేసిన వ్యవహారములు సాగు టెట్లు?"

మహా: "మరి ఎట్లు సాధించినావు?"

అన్నమంత్రి: "మా పూర్వులు అర్చించిన త్రేతాగ్నులు నన్నీనాడు రక్షించినవి."

అట్లనుచుండగానే గోన గన్నారెడ్డితో గలసి నాగదేవుడు అచ్చటికి వచ్చెను. ఆతడు ఏకశిలానగరపాలకు డగు మేచయనాయకుని యల్లుడు. మల్లమాంబా పతి. ఆత డెంతయు విసుగు వ్యక్త మగుచున్న మొగముతో నచ్చటికి వచ్చెను. రాగానే అన్నమంత్రిని ఇట్లు ప్రశ్నించెను.

"ఈనాడు నా దివాణములో పనిచేయు ఆయగాం డ్లెవ్వరూ రాలేదు. మీరు చిక్కు దిద్దుకొంటి రందురు. ఎట్లు సాధ్యమైనది?"

అన్నమంత్రి: "మా కులదేవత లగు త్రేతాగ్నులే నన్ను కాపాడినారు."

నాగదేవుడు: "ఏమి చిత్రమైన సమాధాన మయ్యా—" అనుచుండగనే, ప్రసాదిత్యనాయడు రుద్రమనాయడు నచ్చటి కరుదెంచిరి. వీరు ప్రసిద్ధు లగు పద్మనాయక సేనానులు. వీరు ముఖ్యముగా ఖడ్గవాదులు. వా రేమి చేయను దోపని స్థితిలో నుండి యచ్చటికి వచ్చిరి. వారును అన్నమంత్రిని ఇతరులవలెనే ప్రశ్నించిరి. అన్నమంత్రియు త్రేతాగ్నులు తనకు సహాయు లైనట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

అందరకు నావిధముగా నాతడు సమాధాన మిచ్చుచుండుట వచ్చినవారల కందరకు నిజము తెలిసికొనవలె నను నుత్కంఠను శతగుణము చేయుచుండెను.

జాయపనాయకుడు సమస్తమును విని విని చివర కందుకొనెను.

జాయప: "ఆ అగ్నుల నింకను, కొంపతీసి, వ్యవహారశాలలోనే ఉంచినారా యేమి?—అచ్చటి పత్రములకు వేడి తగులకుండా జాగ్రత్తచేసినారా?"

అన్నమంత్రి: "ఆ అగ్నులు అమృతమయమైనవి." మహాదేవరాజు అందుకొనెను.

"ఖడ్గవాదము తప్ప మీ వాగ్వాదముల చురుకుదన మెరుగము మేము. అర్థము కాని మాటలు చాలించి సూటిగా చెప్పుడీ!—ఎవరో వైదికవిప్రులు మీ దివాణములోని వ్యవహారము లీనాడు చూచినా రని వింటిని. నిజమా, కాదా?"

అన్నమంత్రి: "మీరు విన్నదానిలో నసత్యము లేదులెండి!"

జన్నిగ: "వైదికకరణములకు త్రేతాగ్నులకు సంబంధ మేమిటి?"

జాయప యందుకొనెను. "మీ రందరూ ఖడ్గవాదులుగదా? మరి కత్తులకూ నిప్పుకూ సంబంధ మున్నదా?"

జన్నిగయు మహాదేవరాజును ప్రసాదిత్యనాయుడును ఒక్కసారిగా 'లేదు' అని పల్కిరి.

జాయప : "అహోహో, మీ తెలివితేట లింతేనా? రెండు కత్తులు కలసినచో నిప్పు పుట్టునా, పుట్టదా?—ఇక ముగ్గురు వైదికబ్రాహ్మణులు కలసినచో త్రేతాగ్ను లుబుటలో నాశ్చర్యమే మున్నది?"

జాయప యట్లు వ్యాఖ్యానముచేయగా సందర్భ మర్థమయిన ట్లందరును నవ్విరి. మహాదేవరాజు తొందరచేసెను.

"ఇంతసేపును చెప్పక మా ప్రాణములు తీసితివి. ఆ ముగ్గురు బ్రాహ్మణులను మాకు నెంటనే చూపించు!"

జన్నిగ : "ఇంకను ఇక్కడనే ఉన్నారా?"

అంతలో జాయపనాయకునకు చిరునవ్వు వచ్చెను.

"బద్దెనా! వైదికకరణములమీద పద్య మేదో చెప్పితివే, ఏదీ?"

బద్దెన తల వంచుకొని చదువుటకు సంకోచింపసాగెను.

జాయప : "చదువ వేమి, బద్దెనా! మరల మదాలసను అభినయము చేయ మనవలెనా?"

బద్దెన : "అక్కరలేదు! జ్ఞాపకము వచ్చుటలేదు.

జాయప : "మూడవ పాదము జ్ఞాపకము చేయుదునా"

బద్దెన : "అక్కడనుండి జ్ఞాపక మున్నది."

జాయప : "చాలులే అక్కడనుండి చదువులే!"

బద్దెన : సిగ్గుపడుచు చదివెను.

"—కరణము వైదికు డైనను
మరణాంతక మగును గాని మానదు సుమతీ!"

అది విని అన్నమంత్రి చిరునవ్వు నవ్వెను. చేరినవా రందరు పరిపరివిధముల ప్రసంగించుచు పెద్దగా నవ్వుకొనసాగిరి.

కొంతవడి యిట్లు సాగినపిమ్మట ఆకస్మికముగా అన్నయముఖమున చింతా మేఘ మావరించిన ట్లయ్యెను. అది తీవ్రతరమై యందరకు స్పష్టముగా గోచరించెను.

అంతట నందరు తా మేమైన నాతని మనస్సు నొప్పించినా మేమో అని పరిపరివిధముల ననునయవాక్యములు పలుకుచు విచారకారణ మడుగసాగిరి. అతడు నెక్కువ మాటాడక ముక్తసరిగా వారించి తప్పించుకొనుచుండెను. వారు గ్రుచ్చి గ్రుచ్చి యడుగగా తుద కత డిట్లనెను :

"బద్దెనలోకానుభవము మీ రంద రెరిగినదే గదా!"

"అతనిది సిద్ధవాక్కు!" అనెను జాయప. మిగిలినవా రందరు అందులో ఏకీభవించిరి.

అన్నయ: "ఈనాడు నా రాచకార్యములకు చిక్కు లేకుండ రక్షించినవి వైదికకరణములే. మరి యీ బద్దెనపద్యము వింటిరి గదా!"

మహాదేవరాజాదుల కా సందర్భము అర్థముకాక ఏమిటని యడిగిరి. అన్నమంత్రి యంతట బద్దెన నా పద్యము చదువు మనెను. అత డా పద్యార్థమునే మరల చదివెను.

అన్నమంత్రి: "విన్నారుగదా? మరణాంతక మైన పని ఈనాడే ప్రారంభించినా నని ఒక్కసారిగా నాకు దిగు లిప్పు డావేశించినది."

చేరినవా రందరు పకపక నవ్విరి.

"బాబూ, మా కందరికీ ఆ మరణాంతకపుపనే సాధించే వీలు చూపి రక్షింప వయ్యా!"

అన్నమంత్రి: "మీకందరికీ కూడనా?"

మహాదేవరాజు: "నీవేనా మహా ప్రాణభయము లేనివాడివి!"

జన్నిగ: "మీ చదువుసంధ్యలు మాకు లేకపోయినా, మేమూ పిరికిపందలము మాత్రము కాము!"

నాగదేవుడు: "మీతోపాటు మేమును ఈ మరణాంతకపు పనికి పూనుకొందుము!"

మహాదేవరాజు: "రాజబంధువులకు నేను పూట!"

ప్రసాదిత్యనాయడు: "పద్మనాయకుల పక్షమున నేను!"

గన్నారెడ్డి: "రెడ్లకు నాది పూచీ!"

నాగదేవుడు! "కమ్మవారిపక్షమున నేను!"

జన్నిగ: "కాయస్థులకు నేను!"

అన్నమంత్రి: "ఇందరు సమ్మతించితిరి. ఐనను శ్రీగణపతిదేవుల పాదపద్మారాధకుల నిందరను ఒక్కసారిగా నీ మరణాంతక మగు పనిలోనికి దింపుటకు నేనుమాత్ర మంగీకరింపను."

అంబదేవుడు: "అన్నమంత్రీశ్వరుడు తప్పించుకొనుటకు మంచి ఎత్తు వేసినాడు!"

నాగదేవుడు: "ఒక యుపాయము చేసినచో?—"

మహాదేవరాజు : "ఏమి టది?"

నాగదేవుడు : "ఏ మున్నది? —బద్దెనా, పోనిండు ఆ పద్యము కొంచెము మార్చరాదా!"

ఎర్రిక : "ఏ మని ?"

నాగదేవుడు: "మరణాంతక మేల యౌను మానకసుమతీ,—అని అనరాదా?"

బద్దెన మాటాడలేదు. అన్నమంత్రియే అందుకొనెను.

"అందరూ పద్యాలు చెప్పేవారే! ఈ మార్పుతో పద్యానికి సరసమైన అర్థమంటూ చిక్కునా ?"

వారల వివాదములో జాయపనాయకుడు అందుకొని నిష్కర్ష చేసెను.

"ఏం అర్థముతో సరసతతో పని లేదు. మన బద్దెన ఋషివంటివాడు. అతని వాక్కునకు తిరుగు లేదు. అతని పద్యములలో అబద్ధము ఉండదు !"

అంతట మిత్రులందరు నా శ్రేతాన్నులను చూపింపు మని అన్నమంత్రి నొత్తిడి చేసిరి. వారితో కొంతవడి సరసపల్లాపములు చేసి తుదకు తన మందిరాంతరములోని కేగి తనవెంట సగౌరవముగా తిక్కనసోమయాజులను గురునాథుని మాదిరి తీసికొని యచ్చటికి వచ్చెను.

— –

తిక్కనసోమయాజి యచ్చటికి వచ్చినంతనే అచ్చట కూడినవా రందరును అప్రయత్నముగా లేచి యాతనికి నమస్కరించిరి. సోమయాజియు వారి నందర నాదరముతో నాశీర్వదించెను. "చిరంజీవ! చిరంజీవ! చిరంజీవ!" ఆయన కీరవాణీరవ మాధురి తిలకించినంతనే వా రందరును అంతవరకు అవలంబించియున్న ఉల్లాసమిశ్రమగు హాస్యభావనను మానిరి. ముఖములు గంభీరములయ్యెను. "తిక్కనసోమయాజీ!" యని వారిలో గుసగుసలు పర్వెను.

బద్దెన సోమయాజుల కెరగి రెండు పాదము లంటి కన్నుల కద్దుకొనెను. ఆతని కా మహాకవిప్రథమదర్శనసమయమున నానందబాష్పము లంకురించెను; దేహము పులకించెను. సోమయాజియు నాతని విశేషాదరకటాక్షదృష్టితో తిలకించి యాశీర్వదించెను.

సభామధ్యమున సోమయాజులను గౌరవోన్నతాసనమున నుపవిష్టు గావించి శిష్యులనుగూడ నాతని సమీపమున గూర్చుండునట్లు అన్నమంత్రి ఏర్పాటుచేసెను. వారల ముగ్గుర నంతట నిర్దేశించుచు మిగిలినవారి కిట్లాతడు చెప్పెను.

"మా పెద్ద లర్పించిన శ్వేతాశ్వములు వాత్రిమంతములై నన్నీనాడు చిక్కులోనుండి తప్పించిన వని చెప్పగా మీరు నమ్మకుందురేమో?—మీకుగూడ నవి ప్రత్యక్షమైనవి చూచుకొనుడు!"

ఆ మాటలకు మారనముఖము సిగ్గుతో నెఱ్ఱవారి వికసించిన దానిమ్మపూవు రంగుతో శోభిల్లెను. గురునాథుని స్థూలకర్కశకాయము మరింత కర్కశమైనట్లు తోచెను. తిక్కనసోమయాజిముఖమున నెట్టి మార్పును లేదు. కనురెప్పలుమాత్రము మూడు నాలుగు మారు లల్లార్చెను. ఇతడు సుఖదుఃఖముల కతీతుడా? మానావమానములు రెండిటిలో తుల్యబుద్ధి కలవాడా? అన్నయమంత్రి తన మిత్రుల నందరను సోమయాజుల కెరుక చేసెను.

ఆ పిమ్మట వృద్ధుడగు జాయపనాయకుడే ముందు తిక్కనను సంబోధించి సంభాషణ కుపక్రమించెను.

"మా బద్దెన విశేషముగా లోకానుభవము కలవాడు. అతడు సుమతీశతకమిప్పుడు చెప్పుచున్నాడు. ఇంత వయస్సు వచ్చిన మాబోంట్లకుగూడ తెలియరాని లోకధర్మము ఈ కుఱ్ఱవాని కట్లె స్ఫురించును!"

తిక్కన: "అది పూర్వజన్మకృతపుణ్యఫలము!"

జాయప: "ఇతని కవితలో అబద్ధము రాదు. అది మా కనుభవమే. ఈమధ్యనే ఒక పద్యము చెప్పినాడు. మీ ఎదుట చదివించుటకు జంకుగా ఉన్నది. అనుమతి ఇచ్చినచో జదువు మందును."

అంతయు చూచిన నాయకు లందరును ఆ మాటలకు ఆశ్చర్యపడుచు నిశ్శబ్దముగా నుండిరి. జాయప వృద్ధుడు, స్వయముగా విద్వాంసుడు, మహాపదవి నిర్వహించినవాడు, చక్రవర్తికి దగ్గరచుట్టము—అతడే మన్నను గొల్లబోవును. ఇతను యుక్తాయుక్తవివేక్షణ గల అత డీవిధముగా నెందుకు మాట్లాడుచున్నాడా యని వారికి ఎంతో బాధ కలుగుచున్నది.

తిక్కన శాంతముగా ప్రత్యుత్తర మిచ్చెను. "నేను మ. శ్రీమంత్రి రాజకార్యములు చూచుకొనుచు వచ్చుచున్నను నా కభిమానము కవిత్వమే. మీబోటి విజ్ఞులు రసజ్ఞులు మెచ్చుకొనుచున్న యీ పడుచువాని పద్యము లాలకించుట నాకు చెవులపండువగా నుండును. జంకు వీటికి ?—మా మారనకూడ ఈమధ్య కవిత్వ మల్లుచున్నాడు. అతనుకూడ విని సంతోషించగలడు."

జాయప : "బద్దెనా, ఇందాకటి పద్యము వినిపింపవయ్యా సోమయాజులకు. ఇట్టి పెద్దలకు వినిపించినప్పుడే నీ కవిత్వము కృతార్థమగును! నీ వాక్కుకూడ అందుచే పవిత్రము కాగలదు!"

బద్దెన తడబడుచు వినయముతో, "ప్రభూ, విద్వన్మహాకవులగు కవిబ్రహ్మల కొద్దనా నా కాపుకవిత్వము వినిపింప సాహసించుటలు!" అనెను.

తిక్కన మాటలు బద్దెనపై అమృతమే ప్రసరింపజేసెను.

"నాయనా, మీకు కాపుకవిత్వమే అలవడినచో ధన్యులే. మొదలు తెలుగెవరి భాష ?—కాపులదేగదా! మాబోంట్లము సంస్కృతసంస్కృతి విడువలేకున్నాము. లోకమునందున్న వివిధముల వారితో కలసి మెలసి యుండుటచేతనే మాబోంట్లకు తెలుగుభాష కొంత విరివిగా నభ్యసించు నవకాశము కలిగినది. నన్నయభట్టారకు లేమన్నారు ? తన్ను లోకజ్ఞుడ నని చెప్పికొని అంతటితో ఊరకొనక శబ్దసిద్ధి లోకము వలన నని సూత్రించలేదా ? తెలుగుభాషే, కాపుభాష !"

సామాజికుల కా మాటలతో ఆనందమై తిక్కన యన్న భయము తీరినది.

జాయప : "విన్నావా ? బద్దెనా ! ఇక సందేహ మెందుకు ?"

బద్దెనకు ఒడలంతయు చెమటలు కారసాగెను. నోటమాట తడబడజొచ్చెను. "పద్యము జ్ఞాపకము లేదు !"

జాయప : "పోనీ, జ్ఞాపక మున్న యా చివరి రెండు పాదములే వినిపింతువు గానిలే !"

ఇక పెద్దవాడు వదలడు. చదువక తప్పదని గుండెకు తడబడుచు బద్దెన యా రెండు పద్యపాదములు చదివివేసెను.

"కరణము వైదికు డైనను
మరణాంతక మగును గాని మానదు సుమతీ !"

సోమయాజులే ముందుగా వినవలెనని యందరకు వ్యగ్రతతోకూడిన కుతూహల మంకురించెను. ఆ పద్యభాగము విని సోమయాజులు సంతోషించినట్లే వారికి తోచెను.

తిక్కన: "ఆ పూర్వార్థ మెట్లున్నదో?"

బద్దెనకు పూర్వార్ధము స్పష్టముగా జ్ఞాపకమున్నను, చదువుట కేమాత్రము నిష్టములేక 'ఎంత ప్రయత్నించినను నోటికి రాకున్నది' అని ఖండితముగా చెప్పివేసెను.

తిక్కన: "ఈయనది నిజముగా సత్యవాక్కనే తోచును. లోకానుభవము గల జాయపనాయకుల వాక్కులోగూడ అబద్ధము రాదు!"

అన్నమంత్రి అంతలో చిరునవ్వుతో అందుకొనెను.

"బాబూ, మీ రీనాడు నాకు వైదికకరణముల ననుగ్రహించినదానిమీద నీతడీ పద్యము చెప్పినాడని తోచును. అయితే, మీ అనుగ్రహముకూడ మరణాంతక మనే మీ సెలవుకూడనా?"

తిక్కన: "ఓయి పిచ్చివాడా, ఇట్లేనా ఆ పద్యము అన్నమంత్రీశ్వరుల కర్థమయినది?"

అన్నమంత్రియంతవానిని ఈవిధముగా సంబోధించుట సోమయాజినోట తప్పనిపించలేదు. అక్కడ నున్నవారి కందరకు అన్నమంత్రి కర్థమయినట్లే అది అర్థమయినది. వారును అట్లే స్పష్టపరచిరి.

తిక్కన: "ఆయనకవిత్వము కాపుకవిత్వ మని ఈసడించినదేనా ఈ మిత్రలోకము అంతాను?"

అన్నమంత్రి: "సోమయాజులవారి శ్రీమదాంధ్రమహాభారతములో కొన్నిఘట్టము లేమైనను మాకు అన్వయించక పోవచ్చును గాని, మాకీ బద్దెనపద్దెమే అర్థము కాలే దండురా?"

తిక్కన: "మహామంత్రీశ్వరుడవు నీవు. వీ రందరు ఉద్దండదండనాథులు! నీకును మిత్రులకును అర్థముకాలే దందునా? కాని కాపుకవిత్వము సరిగా గ్రహించుట కెంత మెలకువ కావలెనో మీకు నాటజేయవలె నని నా ఉద్దేశము!—సరే!—'మరణాంతక మగును' అన్నాడు కాదూ కవి?—అయితే ఆ మరణాంతక మెవరి కవునో మీ రెవరైనా ఆలోచించినారా?"

త్రిపురాంతకుడు: "ఎవరికి మరి?—ఎవరిదగ్గర నుంటే వారికే!"

తిక్కన: "బద్దెన ఎక్కడనైనా ఆ మాట అన్నాడా?—శత్రువులకు మరణాంతక మగును అని ఎందు కన్వయించరాదు?"

ఆ వాక్యముల కందరి ముఖములు వికసించెను. కొందరికి నవ్వుకూడ వచ్చెను.

జాయప: "భేష్! కాపుకవిత్వమునకుకూడ వ్యాఖ్యానముచేయుట మీ సొమ్మే నయ్యా, సోమయాజీ!"

అంతట నన్నెవచో వారందరు వైదికకరణములు మాకు కావలె నంటే మాకు కావలె నని కోరిరి.

అందుపై నిష్టకథాగోష్ఠి కొంతతడవు జరిగినది. తుదకు సోమయాజులు సూచించినట్లు వారందరు నొక నిర్ధారణకు వచ్చిరి.

తిక్కనసోమయాజులవెంట లెక్కలు క్షుణ్ణముగా తెలిసిన బ్రాహ్మణులు నూర్వురుమాత్రమే యుండిరిగదా! వారందరు ప్రస్తుత మీ నాలుగుదినములలో వలసినవారికి అత్యవసరము లగు వ్యవహారములు చూచెదరు. ఇంతలో నయమున గాని భయమున గాని ప్రాతయుద్యోగుల గొందఱనైన పనులకు రప్పింపజాలమా? వ్రాయసవృత్తి యొక్క శాఖపై నాధారపడియుండుట ప్రమాదకరము. ఆరువేలమంది బ్రాహ్మణులకు గ్రామకరిణీకములనుండి పెద్ద యుద్యోగులవరకు గావలసిన లెక్కలు కొలతలు వ్రాతలు అభ్యసింపజేయుటకు ఓరుగల్లులో నొక విద్యాశాల ఈ విజయదశమి నాటికి ప్రారంభింతము. అందులో ఈ నూరుగురు బ్రాహ్మణులే సాయంకాలము లందు అధ్యాపనము గావించుచుందురు. చక్కగా వ్రాయుట చదువుట నేర్చి, సంకలనము వ్యవకలనము గుణనము భాగహారము మాత్రము తెలిసియున్న బ్రాహ్మణు లందరు నీ పాఠశాలలో చేరవచ్చును. ఆరువేలమంది చాలరు. వారిని మూలధనముగా నుంచుకొన్న రెండుసంవత్సరములలో ముప్పదియారువేలమంది సిద్ధమయ్యెదరు. ఇందుకు మహారాజులయు యువరాజులయు అనుమతి పొంది పురమున చేరిన బ్రాహ్మణబృందములలో నీ వార్త ప్రాకునట్లు ప్రకటించి తగు ప్రయత్నము లన్నియు వెంటనే చేయింపవలెను.

అం దున్న మంత్రిసామంతదండనాథు లందరును అది విని పొందిన యానందమునకు మేర లేదు. అన్నమంత్రి యందరిపక్షమున మాటాడుచు తిక్కనసోమయాజులను గురుదక్షిణ కోరుకొమ్మనెను. మిగిలినవారును అట్లే కోరుకొమ్మనిరి.

"ఈ సామ్రాజ్యమునకు మూలస్తంభులైన మీ రందరు సంతోషించుటే మాకు గురుదక్షిణ, అయినను గురుదక్షిణ విద్యాంతమందు గాని ముందు కాదుగదా!"

తిక్కనసోమయాజుల నిరీహ వారందరికి నాయనపై నుదయించిన గౌరవమును శతగుణ మొనర్చెను.

ఆపైని పమ్మె చేసిన కరణముల ప్రస్తావన రాకుండునా? ఆ సంభాషణలో సోమయాజులు కల్పించుకొనలేదు. సల్లాపములకు చేరిన యా దండనాథగోష్ఠి యొక్క క్షణకాలములో రాజ్యవ్యవహారసభగా మారిపోయెను. అన్నమంత్రి యాస్థానములోని కవులు గాయకులు నట్టువలు ఇత్యాదులు సెలవుతీసికొని వెళ్లిరి.

అంబదేవుడు : "మా సోదరులము నిన్ననే రాజధానీనగరమునకు వచ్చి నాము. దీనికి కారణమే యూహింపలేకున్నాము."

అన్నమంత్రి : "నేనును నిన్ననే వచ్చితిని."

నాగదేవుడు : "నిన్న సాయంకాలమువరకు నీ ప్రయత్నమే లేదు. మా వ్యవహారశాలలో స్థితిగతులు ఎట్టి హెచ్చుతగ్గులను లేక క్రమముగానే ఉన్నవి. మా ఆయగాండ్లు నిన్న సాయంత్రమువరకు పనిలో నెట్టి లోపమును చేయలేదని నేను సరిచూచుకొంటిని."

గన్నారెడ్డి : "మా స్థలదుంకముల కోశమును సరిగనే యున్నది."

త్రిపురాంతకుడు : "మేచయనాయకులు ఏమనుచున్నారో ?"

మేచయనాయకులకు నాగదేవు డెల్లుకైనందున ఈ ప్రశ్న నాతనివైపు తిరిగి యడిగెను.

నాగదేవుడు : "నాయకుల నీనాడు నేను దర్శించుటకు పడలేదు. నిన్నరాత్రి వరకు వారి కెట్టి శంకయు నున్నట్లు తోపదు."

అన్నమంత్రి : "మా కరణములు నేను కలిసికొనే యుండనందున మాకు పూర్వపరిస్థితులుకూడ తెలియుటలేదు."

మహాదేవరాజు : "మహాలయసభావిశేషములు అందరు నెరుగుదురా ?"

అంబదేవుడు : "మా కవి యేదో మాచాయగా తెలిసినవి."

మహాదేవరాజు ఆ సభావిశేషములు క్లుప్తముగా వర్ణించెను. ముఖ్యముఖ్య జాయ పనాయకుడు కలుగజేసికొని మాట్లాడెను.

అన్నమంత్రి : "ఇది రాజధానీనగరమునకేనా ? జనపదములలో గూడ వ్యాపించినదా ?"

నాగదేవుడు : "జనపదములలో వ్యాపింపలేదని తోచును. ఈ యుదయమున గూడ బంపిన పత్రిక లెన్నో జనపదములనుండి నే నీ యపరాహ్ణమున నే అందుకొని వచ్చితిని."

అంబదేవుడు : "అది కొంత శుభవార్త !"

అన్నమంత్రి : "శీఘ్రముగా దీనికి ప్రతిక్రియ చేయవలెను."

మహాదేవరాజు : "రాజద్రోహులే ఈ ప్రయత్నము పురికొల్పినారు !"

అందర మనస్సులలో నా తలపే యున్నను ఇతరులు అట్లు వాచ్యముగా చెప్పలేదు.

జాయప: "ప్రభువునకు శిరస్సులో నొక మాద పుట్టును. అది పుట్టినప్పుడు శిరస్సు నటు నిటు లాడించుట పొరపాటే యగును. దానికి వెంటనే ప్రతిక్రియ చేయనిచో ఒకట్రెండు దినములలో నిరోధించుట పట్టి సాధ్యము కాదు!"

త్రిపురాంతకుడు: "జాయపనాయకులు సరిగా సెలవిచ్చినారు."

మహాదేవరాజు: "రుద్రదేవమహారాజుల యౌవరాజ్యాభిషేకమునకు విఘ్నము కలిగింపదలచినవారు పన్నిన పన్నుగడ ఇది!"

ఆ భావమే యందఱకు తోచుచుండెను. కాని వీరభద్రదేవనామ ముచ్చరించుటకు శంకించుచు నెవ్వరు నావిషయ మెత్తలేదు.

అన్నమంత్రి: "ఇది మహాప్రమాదకరమైనది."

జాయప: "ఏపడిన ఒక్క సింధురవ్రజమువలెనే విపరీతనష్టము చేయగలదు."

జన్నిగ: "దీనికి శిక్షకూడ కఠినముగా నుండవలెను."

అన్నమంత్రి: "నిజమే! కాని ఎవరిని శిక్షించుటట్లు? ఎంతమందిని?— అందరను శిక్షించి వ్యవహారములు సాగించు టెట్లు?"

చిరునవ్వుతో జాయప ప్రశ్నించెను. "అన్నమంత్రీశ్వరా! మీ రెన్నడైన వేటాడియెరుగుదురా?"

రాజసేవకై యాతని పూర్వులు శస్త్రధారణ కుపక్రమించిరి. ఇన్నితరములుగా శస్త్రము ధరించినను యుద్ధములలో తప్ప ఆ కుటుంబమువారు శస్త్రప్రయోగము చేసి యెరుగరు. మృగయావినోదము ఇందులూరివారి వంశములో లేదు. అందుచే అన్నమంత్రి తల యెత్తి జాయపునంక జూచి మిన్నకుండెను.

జన్నిగ: "రాజశత్రువుల వేటాడుటలో కొంతకాలముగా మా కాలము గడచిపోవుచున్నది. మృగములు వేటాడిన దినములు మరపుతగులుచున్నవి."

జాయప: "ప్రభుత్వము నెరపువారు వేటాడుచున్నను వేటాడకున్నను మృగప్రకృతి తెలిసియుండవలెను. గజములే కాక ఇతరజంతువులును బహుళముగా మందలుగా జీవించుచు సంచరించుచుండును. ప్రతిమందకు అగ్రేసరమైన దుండును. దానిని పట్టివేసినచో మరియొక అగ్రేసరము వచ్చువరకు ఆ మంద చిందరవందర యగును."

అంబదేవుడు: "జాయపనాయకులు చక్కగా నుపదేశించినారు."

త్రిపురాంతకుడు: "ప్రధానకరణములను బట్టి వెంటనే శిరశ్ఛేదములు చేయింప వీరముఖుల కర్పింపవలెను!"

అందు చేరిన మహామాత్యులకును దండనాథులకును సామంతులకును తమ పరిజనమునకు శిరశ్ఛేదము చేయించు నధికారము కలదు. రాజధానీనగరమున నున్నందున మహారాజులకు ముందు తెలుపవలసిన నియమ మొక్కటే యున్నది. మహారాజాను

మతి యడిగినదే తడవుగ వారికి లభించును. అట్టి యధికార మన్నమంత్రికిని గలదు. ఐనను ఆత డొక్కడును కొంచెము జనుకాడెను.

"వీరిలో కొందరు నిజముగా అనారోగ్యాదికారణములచే రాకుండియుండ వచ్చును. పలువురు చిరకాలముగా విశ్వాసపాత్రులై కొలిచినవారు. వెంటనే ఇట్టి కఠినశిక్ష విధించుట ఉచిత మని తోపదు."

మహాదేవరాజు : "ఎంత పదవిలో నున్నను మీ బాపనగుణము విడువలేదే!"

జాయప : "మహాదేవరాజా! మీ రెప్పుడైనా యజ్ఞశాలకు పోయి పశువును పట్టుట చూచినారా?"

అంబదేవుడు : "వారు కత్తితో పశువుప్రాణము తీయించరు."

జాయప : "నవరంధ్రములు మూయింతురు. అన్నమంత్రీశ్వరుల విధానము బ్రాహ్మణవిధానము! మహాదేవరాజులు తొందరపడుచున్నారు."

అచ్చటివా రందరు పెద్దగా నవ్విరి.

అన్నమంత్రి తుద కిట్లు నిర్ధారణ చేసెను.

"ఈ రాత్రియు రేపునుగూడ వీరందరను తెప్పించుటకు ప్రయత్నింతము. సాధ్యము కానిచో ఇందులో ప్రధానకరణములకుమాత్రము కఠినశిక్షలు విధించి కొలదిమందినిమాత్రమే శిరచ్ఛేదము చేయింప నుత్తరువు లిత్తము."

అచ్చటివా రందరు నందు కంగీకరించిరి. కఠిననిశ్చయములతో వారు ఎవరి మందిరములకు వారు వెడలిపోయిరి.

మరునాడు ఏకశిలానగరములో వీథివీథులను వాడవాడలను వెంటనే పనులలో చేరని కరణములకు కఠినశిక్షలు విధింతుమని వారు ప్రధానుల యనుమతితో చాటింప బంచిరి. అట్లు చాటించి కరణములను రప్పించుటకును పట్టుకొనుటకును సమస్త ప్రయత్నములు చేసిరి. దానితో నానాడు నగర మంతట నలజడి విపరీతమయ్యెను. పలువురు ప్రధానకరణములును ఇతరకరణములును ఇండ్లు వాకిండ్లు భార్యాపుత్రులను వదలి పారిపోయిరి. దొరకినవారిని దొరకినట్లు భటులు బంధించి యధికారుల కప్పగించిరి.

సప్తమినాటి యుదయమునకు పలువురు కరణములు స్వయముగా దివాణములకు వినీతులై వచ్చి సామంతదండనాథులకును మంత్రులకును వందనములు చేసి తమకు భిక్ష వేడికొని పనులు సాగించుటకు ఒప్పుకొనిరి. కాని వారిని నమ్ము టెట్లు?

వారిలో పలువురను పనులలో చేర్చికొనిరి. ప్రధానకార్యాలయములలో తిక్కనసోమయాజివెంట వచ్చిన కరణములకు అగ్రస్థానములు లభించెను. వారికి ప్రాణాపాయము రాకుండ ప్రభువులు భటుల గాపుంచి వారిని వేయి కండ్లతో సంరక్షింపవలసివచ్చెను.

విజయదశమి వచ్చినది !

నవరాత్రోత్సవములు ముగిసినవి. శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల సమక్షమున వారి శిష్యులే కడా కార్యకలాప మంతయు దేవేంద్రవైభవముతో నిర్విఘ్నముగా జరిగించెను. దీక్షాంగోపవాసములచే రుద్రమదేవి ఇంచుక కృశించినను ఒక యపూర్వ తేజస్సుతో నలరారుచుండెను.

గణపతిదేవులకుగూడ నొక్కసారిగా ఆరోగ్యము వచ్చినట్లే కనబడెను. బహుకాలముగా మనస్సును బాధించుచున్న హృదయశల్యము ఉద్ధృత మగుటచే వృద్ధచక్రవర్తికి ముఖములో నూతనవికాస ముదయించెను. క్షీణించిన యాయన శరీరమున గూడ క్రొత్త శక్తి యంకురించెను. కూర్చుండు నోపిక వచ్చినది.

ఈనాడు జరుగనున్న యౌవరాజ్యపట్టాభిషేకమునకు కూడిన జనములతో ఓరుగల్లు నిండిపోయెను. సమస్తమండలములనుండియు మహామండలేశ్వరులు, మండలేశ్వరులు, సామంతులు, మంత్రులు, దండనాయకులు సపరివారముగా నచ్చటికి విచ్చేసిరి. చుట్టుపట్టుల నున్న పరిసరగ్రామములనుండియే గాక దూరస్థజనపదములనుండి కూడ ఆ మహోత్సవము తిలకింప జనులు తండోపతండములుగా సాగిరి.

ఆ ఉత్సవమునకై స్థపతులు విశాలోన్నత మగు నొక మనోజ్ఞమండపము సహస్రస్తంభవిరాజితముగా నిర్మించిరి. ఏకశిలానగరమున సహస్రాధికముగా గల చిత్రకారులు అందరును వివిధవర్ణములతోను చిత్రములతోను స్తంభములను అధోర్ధ్వభాగములను అలంకరించిరి. అందు ఎల్లరు జూడ ననువగు ప్రదేశమున నున్నత మగు నభిషేకవేది యొండు కల్పించిరి.

అంతకుమున్న వేగరుల బంపి చతుస్సముద్రములనుండియు గంగాకృష్ణాగోదావరీ తుంగభద్రాదిపవిత్రనదులనుండియు సువర్ణకలశములలో జలములు తెప్పించి యుంచిరి. అవి వేరువేరుగా నలంకరించిన వేదికలపై నుంచిరి.

అభిషేకోత్సవము ప్రాతఃకాలముననె మంగళతూర్యపురస్సరముగా జయజయ ఘోషలు మిన్నుముట్టుచుండ ప్రారంభమయ్యెను.

అభిషేకవేదిపై సమున్నతాసనమున శ్రీవిశ్వేశ్వరశంభుదేశికు లాసీను లైరి. వారి సమీపముననే ఉన్నతాసనమున గణపతిదేవులును మరియొక భద్రాసనమున రుద్రమదేవియు నుపవిష్టు లైరి. ఆ వేదిసమీపముననే ఉత్తమబహువేదవిప్రులు అపరాగ్నిహోత్రులవలె సమావిష్టులై యుండిరి.

ముందుగా నా విప్రుల యనుజ్ఞ నొంది శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు శ్రీ మహాగణాధిపతిపూజయు స్వస్తిపుణ్యాహవాచనమును మంటపారాధనమును గావించిరి.

సువర్ణకలశములలో సముద్రోదకములను గంగాదినదీతోయములను ఉంచి నవరత్నములు మంత్రపూర్వకముగా నందు నిక్షేపించి అభిషేకోచితమాలికాదిద్రవ్యము లమర్చి సామ్రాజ్యాధిదేవతావాహన మొనర్చి పూజాదికము నిర్వర్తించిరి.

రాజపురోహితు లంతకుమున్న పూజాసంస్కారములు చేసిన వరాహలాంఛిత సువర్ణరత్నపట్ట మొకటి శ్రీగణపతిదేవచక్రవర్తులు స్వహస్తములతో శ్రీరుద్రమదేవిఫాలమున గట్టి యున్నత లాసనశిరస్సున నుంచెను. ఆ శిరస్సుపై సువర్ణచ్ఛత్ర మెత్తబడెను. వేదవిప్రులు స్వస్తివాచన మారంభించిరి. అభిషేకోదకము ఏడు కలశములలో వేర్వేరుగా నుంచబడెను.

అందు ప్రథమకలశము రాజగురువులయొద్దను రెండవది శ్రీగణపతిదేవులయొద్దను ఉంచిరి. మూడవదానియొద్దకు ఇందులూరి అన్నమంత్రిని అప్పటి కందుకూరిని కోలని రుద్రుని రమ్మని యాహ్వానించిరి. నాలవదానియొద్దకు వీరభల్లటదేశికుల బిలిచిరి. మరియొకదానియొద్ద వీరభద్రేశ్వరుని మహాదేవరాజును బాలప్రతాపరుద్రుని నిలిపిరి. ఇంకొక కలశపార్శ్వమున మేచయనాయకుని శ్రీమల్ గోవిందనాయకుని జయ్యనాయకుని జన్నిగదేవుని గన్నారెడ్డిని నాగదేవుని ఉంచ నియమించిరి. చివరదానియొద్ద నిబంధ పౌరజానపదులలో పెద్దలను శ్రేణీపతులను పిలిచిరి.

అట్లు ఆహూతులైనవారి కెల్లరకును చక్రవర్తి రత్నాంబరాభరణాదులు ముందు కట్టబెట్టించెను.

అంతట రాజగురువుల యనుమతితో వేదవిప్రులు సామ్రాజ్యమంత్రపఠనము నారంభించిరి. పూర్వనియమితు లందరు తమయెదుట నుంచిన సువర్ణకలశములనుండి పచ్చని యాకులతో శ్రీరుద్రమదేవి నభిషేకించిరి.

ఈ యభిషేకకలాపము రెండుగడియలసేపు సాగెను. శిరస్సునుండి స్రవించుచున్న యా పవిత్రవారిధారలతో రుద్రమదేవి గంగాధరుడగు రుద్రునివలెనే భాసించెను. ఆ మంటపమున గూడిన మహాజనము లానందముతో జయజయనినాదములు చేయుచుండెను. ఎవరి నిర్ణీతస్థానములలో వారు కదలక కూర్చుండి వేరు ప్రసంగములు మాని యా మహోత్సవమునే తిలకించుచుండిరి.

యౌవరాజ్యపట్టాభిషేకానంతరమున కులపెద్ద లందరకు సువర్ణాక్షతలు పంచిపెట్టిరి. పరంపరాగతముగా నిర్ణీతమై వచ్చుచున్న యాచారక్రమమున వరుసతప్పక వా రొక్కరొక్కరై శ్రీరుద్రమదేవిని సమీపించిరి. ఎవరి యధికారప్రకారము వారామెశిరస్సునను పాదములను నక్షత లుంచిరి. అట్లు వచ్చినవారి కెల్ల గణపతిదేవులు సువర్ణరత్నాంబరాభరణాదులు విరివిగా కట్టబెట్టించుచుండెను. ఈ ఉత్సవము మధ్యాహ్నసమయమువరకు పట్టెను.

అప్పుడు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు ఏదో సెలవీయనున్నా రని సువర్ణదండములు ధరించిన చోపుదారులు కేకలువేసిరి. ఆ మహాసభ యంతయు క్షణమున నిశ్శబ్దమయ్యెను.

"ఈ స్వయంవర సమయమునను శ్రీగణపతిదేవచక్రవర్తులయు ఇందు కూడిన సమస్తమంత్రిసామంతమండలేశ్వరదండనాథపౌరజానపదుల యనుమతితో శ్రీరుద్రమదేవులకు యౌవరాజ్యపట్టాభిషేకము జయప్రదముగా తీర్చినాము. ఈ పవిత్ర దీక్షాసమయమున రాజగురువులు నామకరణము చేయు నాచారము మీ రెరుగనిది కాదు. ఈదినమునుండి ఈయువరాజులు శ్రీ రుద్రదేవమహారాజనామము ధరింతురు గాక! ఇతఃపరం శ్రీరుద్రదేవమహారాజనామ్నా వర్ధస్వ!" యనుచు రాజగురువులు స్వయముగా నా శిరస్సుపై సువర్ణరత్నాక్షత లుంచిరి.

వెంటనే జయజయ శ్రీరుద్రదేవమహారాజ! అను జయఘోషలు మండప మంతట చెలంగెను.

ఆ సమయమున ప్రక్కన నంతఃపురజనము కూరుచున్న యవనికచాటుననుండి మంజుల మగు నొక కలకలము ప్రారంభించెను. అందుండి పలువురు బాలురు బాలికలు చిత్రవిచిత్రోజ్జ్వలవేషములు ధరించి రంగురంగుల పతాకలు గల గడలు పట్టుకొని శ్రీరుద్రమహారాజు నెదుట ప్రత్యక్షమై—

"జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!" అనుచు జయనాద మొనర్చిరి. శ్రావ్యములగు కంఠములతో నిరువురు బాలబాలికలు ముందు చెప్పుచుండగా మిగిలినవారు వారివెంట నిట్లు పఠించిరి.

ధర సింహాసనమై, నభంబు గొడుగై, తద్దేవతల్ భృత్యులై,
పరమామ్నాయము లెల్ల వందిగణమై, బ్రహ్మాండ మాకారమై,
సిరి భార్యామణియై, విరించి కొడుకై, శ్రీగంగ సత్పుత్రియై,
వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా!
జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!

శ్రీ కాకతికరుణాకటాక్షవీక్షణాలంకారా! అరిజనకుముదచంద్రోదయా! ఆశ్రితవిద్వజ్జనాధారా! సత్యభాషాహరిశ్చంద్రా! సంగీతవిద్యానారదా! సాహిత్యవిద్యాచతుర్ముఖా! దానరాధేయా! సంగ్రామధనంజయా! ఒయ్యారికోలాహలా! కదనవిజయమార్తాండా! కలియుగరామా! కలిభీమా! మనుజమందారా!

జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!
శ్రీగణాధీశాయ శివకుమారాయ
నాగముఖతుండాయ నాగభూషాయ
లోకజనవంద్యాయ లోలనేత్రాయ
శ్రీకంఠతనయాయ సృష్టికారాయ – మంగళమ్!
బాగుగా విద్యలకు ప్రౌఢిగా దేవ

నీ గరిమ జగములను నిలిపెతివి భళిర!
కనకాద్రిధీరాయ గణనాయకాయ - మంగళమ్!
గణుతింతు మి మ్మెపుడు గణనాథదేవ!
జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!
సరస్వతి మతి మాకు చాలగా నిమ్మ
పరమభక్తుల నెల్ల పాలించవమ్మ
వల్లకీమృదుపాణి, వరనీలవేణి,
పల్లవారుణపాణి, పరమకల్యాణి,
సమ్మతిగ మము బ్రోవు సద్గుణకదంబ
మమ్మ ధన్యుల జేయుమా శారదాంబ!
జయ! అభిజయీ భవ! దిగ్విజయీ భవ!

ఆ యంధ్రబాలబాలికలు గావించిన విజయదశమీవిజయాశీర్వాదములతో సభ యంతయు నానందతన్మయ మయ్యెను. గణపతిదేవుల కానందబాష్పములే వచ్చెను. శ్రీరుద్రదేవమహారాజు దానిని తలయొగ్గి స్వీకరించెను. రాజాజ్ఞతో వారందరికి నమూల్యము లగు బహుమానములు పంచిపెట్టబడెను.

అంతట వెండికర్రలు ధరించిన చోపుదారు లిట్లు ప్రకటించిరి.

"మీ రందరును మిక్కిలి బడలి యున్నారు. శ్రీగణపతిదేవచక్రవర్తులవారు మీకై యేర్పరచి యుంచిన భోజనశాలలలో సుఖభోజనములు చేసి వారి నానందింప జేయ నాహ్వానించుచున్నారు. ఈ మండపముననే మూడుజాములవేళ పేరోలగము తీరియుందురు. మీ రందరును రావలసినది!"

అది యాలకించి చేరిన జనములు విచ్చిపోయి భోజనశాలలకు చేరిరి. అచ్చట వేలసంఖ్యలుగా సేవకులు వారి మజ్జనభోజనాదులకు సదుపాయములు చేసియుంచిరి. అవసరము లగున వన్నియు ఎవరి కులకట్టుబాట్లకు అనువుగా నిర్వహించియున్నవి. వా రంద రందు పంచభక్ష్యపరమాన్నములతో పరిశుభ్రముగ భుజించి తాంబూలములు సేవించి యించుక విశ్రమించి పేరోలగము దర్శింప సభామండపమునకు చేరి కొనసాగిరి.

సరిగా మూడు జాముల కింకను ఒక గడియ వ్యవధి యుండగనే ఆ విశాలసభామండపము నిండిపోయెను. వేదికకు వెనుక నుండు భద్రాసనములును వానివెనుక నొక యున్నతాసనము నుండెను.

సభాప్రారంభసమయమునకు అరగడియ ముందుగా ఆంధ్రదేశ్యపు మోసాలపై గడియారమున ఖంఖంఖంయను ఇరువదిరెండు గంటలు కొట్టిరి. ఆ ఘంటానినాదము ప్రణవనాదముగ నా సభాభవనము నిండుకొని ప్రతిధ్వనించి మ్రోగెను. ఆ ప్రతిధ్వని ఉపశమించుచుండగా తనవృతా రాజమందిరాంతరమునుండి మంగళతూర్యపంచకము ప్రయాణపర్వముగా నొక్కసారి మ్రోగెను. ఆ మంగళవాద్యములలో నుండి జంటసన్నాయిస్వరము, జంట శ్రోత్ర స్వరములు దిగంతములు వ్యాపించె.

వందిమాగధుల కైవారములు వినవచ్చెను. చోప్రదారులు బహుపరాకులు చెప్పిరి. వారలు పగిడిదివ్వెలు కనవచ్చెను.

శ్రీసాంబసదాశివు నరుగనిండు కేశవస్వయంభూమూర్తుల ననుకరించుచు శ్వేతాతపత్రశోభితులగు శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల వెంట గణపతిదేవులును రుద్రదేవ మహారాజులును చామరగ్రాహిణులు వింజామరలు వీవ ఆ సభామండపము ప్రవేశించిరి. ఒక్కసారిగా సభాసదు లందరు జయజయనినాదములు చేయుచు లేచి నిలుచుండి నమస్కరించిరి.

చక్రవర్తియు యువరాజు శ్రీవిశ్వేశ్వరశంభువులను వేదికవెనుక భాగమున నున్న యున్నతాసనమున సగౌరవముగా నాసీను జేసి వారికి నమస్కరించిరి. అంతట గణపతిదేవులు మహాసభకు చేతులుజోడించి నిలిచెను. అంతలో రాజపురోహితుడు చక్రవర్తుల భద్రాసనమును సంస్కరించి పూజింపగా శ్రీగణపతిదేవులు దానికి నమస్కరించి పరిషదనుజ్ఞ నంది యం దధివసించెను. అట్లే శ్రీరుద్రదేవమహారాజును పరిషద్వందన మాచరించి సంస్కృతపూజిత భద్రాసనమునకు నమస్కరించి యం దుపవిష్టు లయ్యెను.

కార్యధురంధరుడగు దామనామాత్యు డిట్లు ప్రకటించెను:

"స్వస్తి, శ్రీమదపారపారావారపరివృతమహీతలంబున సకలవిద్వజ్జనవినుతంబగు నంధ్రదేశంబునకు విభూషణం బగు ఏకశిలాపురవరంబు నిజరాజధానిగా నొప్పుచున్న శ్రీకాకతిభూపాలక్రమంబున జనవినుతయశోవిలాసుండును విజయలక్ష్మీవిలాసుండును శ్రీమన్మహాదేవరాయపుత్రుండును సదారాధితత్రినేత్రుండును విబుధజనవన వసంతుండును రమణీయసీమంతినీజనమంతుండును సకలజనమనోరంజనుండును ఆరాతిరాజమదభంజనుండును శరణాగతరాజన్యశరణ్యుండును సత్యహరిశ్చంద్రుండును

విభవామరేంద్రుండును వరాహలాంఛనుండును సర్వలోకాశ్రయ శ్రీకాకతికుల పారావారసుధాకరుండును నగు శ్రీగణపతిదేవచక్రవర్తులు శ్రీరుద్రదేవమహారాజులుం గారి కీనాడు యౌవరాజ్యాభిషేకము రాజగురుప్రధానమంత్రిదండనాథ ప్రకృతి సామంతసర్వజనసమక్షంబున జేసి యీ శుభముహూర్తమున పేరోలగము తీర్చి యున్నారు. సమస్తమంత్రి సామంతమండలేశ్వరదండనాథప్రధానాదులును శ్రీరుద్ర దేవమహారాజులయెదుట తత్సేవాప్రతిజ్ఞలు పరిషత్సమక్షమున జేయ చక్రవర్తు లాజ్ఞాపించుచున్నారు."

రాజాజ్ఞ ననుసరించి యందరును ప్రభుభక్తిప్రమాణములు చేసిరి. ముఖ్యు లందరు నొకరి తరువాత నొకరు వచ్చి శ్రీరుద్రదేవమహారాజులకు వందన మాచరించి ఖడ్గము చేత బుచ్చుకొని వారికి తమ సేవకజీవిత మంకిత మొనర్చుచున్నా మని కఠిన ప్రతిజ్ఞలు చేసిరి. ముఖ్యు లందరు సైనపిమ్మట సమస్తప్రకృతులును ఒక్కమారుగా నట్లే ప్రతినలు చేసిరి.

ఆ మహాసభకు శ్రీవీరభద్రేశ్వరుడును కాని యాతని పుత్రకులు గాని రాలేదు. గణపతిదేవులును మహామాత్యులును నది ప్రథమముననే గమనించిరి. వారు ముగ్గురను వా రొకకంట గనిపెట్టుచునే యుండిరి. పట్టాభిషేకమహోత్సవమునకే వారు వత్తురో రారో యని వారు ముందు సంశయించిరి. వా రా సభాసమయమునకు వచ్చియుండిన నీ సాయంకాలమునకు వత్తు రను నూహ వారలకు బలపడె. అంతట వారు సకాలమునకు రాకుంట ప్రమాదజనితమైన యాలస్యము కాదేమో యని కొంతతడవు చింతించిరి.

అంతలో దౌవారికుడు పరిజనముచే చక్రవర్తికి మూడు పత్రములు పంపించెను. అవి కార్యభరణు డగు దామనామాత్యుడు చదువుకొని చక్రవర్తుల శ్రీహస్తముల కందింపజేసెను.

అవి వీరభద్రేశ్వరుడును అతని కుమారు లిద్దరును పంపుకొనిన పత్రములు! వానిలో వారు ముగ్గురును శ్రీ గణపతిదేవుల యనుగ్రహముచే వారికి సంప్రాప్తమైన సమస్తగౌరవములును బిరుదములును ఉద్యోగములును వినయవిధేయతలతో వదలుకొని ప్రభువులకు తిరిగి సమర్పించుకొనిన ట్లుండెను. వీరభద్రేశ్వరుని పత్రములో నొక విశేషముకూడ కలదు. అందు దాను విరక్తుడై సన్యసించు నుద్దేశముతో నున్నందున పేరోలగమునకు వచ్చుట సమంజసము కాదని మాని వేసినట్లు కూడ తెలిపెను.

గణపతిదేవుడు స్వయముగా నా పత్రములు చదువుకొని వారల ముగ్గురను వెంటనే చెరసాలలో పెట్టవలె నను నాజ్ఞ లిఖించి మేచయనాయకున కందించెను. ఆ విజయసభ జరుగుచుండగనే మేచయనాయకు డందుండి వెడలిపోయెను.

అంతట గణపతిదేవులు - రాజసభలోనుండి పర్వతనాయకుని పిలిపించిరి. అతడు నాలుగుమూరల ప్రమాణమును మించిన యత్యున్నతశరీరుడు. అంత పొడవు

మీఁద నాతఁడు లావున్నను సన్నగా కనఁబడును. పూర్వము అగస్త్యుని దర్శనము కాక ముందు వింధ్యపర్వత మిట్లే యుండెనా యనిపించును. వెంటనే యాతఁడు మహారాజులయెదుట నిలిచి వంగి నమస్కరించి నిలుచుండెను. అతని నిలుచున్న తీరులోని ఠీవి రాజసభ నెల్ల యాకర్షించెను.

ఇతని నెందులకు మహారాజులు పిలిపించిరి ? మహారాజుకు అకారణముగా నిగ్రహానుగ్రహములు కలుగుట వారి కెల్లరకు గొంత యనుభవ మున్నది. పర్వతనాయకుని ముఖములో నా క్షణమున నెట్టి భయమును కలుగలేదు. లోతైన కన్నులలోనుండి గణపతిదేవుఁడా నిలిచియున్న వ్యక్తిని కొన్ని క్షణములపాటు తదేకదృష్టితో తిలకించెను. ఆ దృష్టి యాపాదమస్తకము నాతనిలోనుండి చొచ్చుకొని యంతరాంతరములు తిలకించుచున్నట్లుండెను. ఆ చూపునకు నిలువఁగలుగుట సామాన్యులకు కష్టతరము. పర్వతనాయకుఁడు నిశ్చలుఁడై పాలుగారుచు వినయగౌరవగాంభీర్యములు ప్రకటించు ముఖభంగితో రాజాజ్ఞ కెదురుచూచుచుండెను.

"పర్వతనాయకా, యువరాజుల కంగరక్షకుని నియమింపవలసి యున్నది. నిన్నా పదవికి నియోగింప నెన్నితిమి !"

"మహాప్రసాదము !" అనుచు పర్వతనాయకుఁడు గణపతిదేవులయెదుట మోకరించి పాదాభివందన మొనర్చెను.

వెంటనే కార్యభారణుఁడగు దామనామాత్యు డాజ్ఞాపత్రము లిఖించి రాజముద్రాంకితము చేయించి మహారాజుల కందిచ్చెను. అది స్వహస్తముతో మహారాజు పర్వతనాయకున కీయ నాతఁడు దాని రెండుచేతుల నందుకొని కన్నుల కద్దుకొని లేచి శ్రీరుద్రదేవమహారాజులకు నమస్కరించి తన ఖడ్గము నంటి సేవాప్రతిజ్ఞ చేసెను.

అంతట గణపతిదేవుల యాజ్ఞ దామనామాత్యుఁడు వినిపించెను. జన్నిగదేవుని త్రిపురాంతకుని అంబదేవుని వారి ఖడ్గములను తిక్కచమూపతికి వెంటనే యర్పించి మహారాజుల సన్నిధికి రావలసిన దని యాయాజ్ఞ తెలిపెను.

ఆ యాజ్ఞ సభ నంతటిని సమ్మోహితుల జేసెను. ఈ మహాసేనానులపై మహారాజు కాగ్రహము కలిగినదా ? కాకతిసామ్రాజ్యమహాసౌధమునకు మూలస్తంభుల వంటివారే వీరు ! వీరిని గణపతిదేవు లేమి చేయఁదలచినారు ? ఇంతవారి కింత యవమానము చేసిన వారు సహింతురా ? మహాప్రధాను లగు శ్రీమత్ గోవిందనాయకుఁడును బయ్యననాయకుఁడునే అంతరంగములలో నలజడి నొందిరి. సభ నిస్తబ్ధమయ్యెను. ఇది యంతయు త్రుటికాలములో జరిగిపోయెను.

అట్లు నిర్దేశింపఁబడిన మువ్వురు సేనానులును నిలువున నిలుచుండిరి. వరుసగా వారు తిక్కచమూపతిని సమీపించిరి. ముందు జన్నిగదేవుఁడు తన యొరలోనుండి రత్నత్సరువిరాజిత మగు ఖడ్గము తీసి కన్నుల కద్దుకొని నిస్తంద్రుఁడై తిక్కచమూపతి కర్పించెను. ఆతని కన్ను లార్ద్రము లగుట యొక విశేషమా ? ఆతనివెంట త్రిపురాం

తకుడును అంబదేవుడును అట్లే యొనర్చిరి. వారు ముప్వురును ఖడ్గహీనులై శక్తిహీనులగు శివులవలెను నిక్కృత్తశిఖులగు శ్రోత్రియగృహస్థులవలెను నిస్తేజులై యా సభాస్థానమున గనబడిరి. ఆ మహావీరుల నా యవస్థలో చూచుటకుగూడ సభాసదులకు కష్టమనిపించెను.

మరల దామనామాత్యుడు రాజశాసనము వినిపించెను.

“మీరు ముప్వురును శ్రీగణపతిదేవులకు ప్రియతమసేవకులలోనివారు. మహాలయామావాస్యనాటి సభకు రాజధానీనగరమునకు విధిగా రావలసిన దని మీ కాజ్ఞలు పంపబడినవి. అయినను మీరు రాకుంటిరి. మీవంటి ప్రధానపురుషులు రాకుండుటచే నా సభలో లోటుగా కనిపించెను. మీరు ముప్వురును ఈ సభకు మూడు కత్తులవంటివారు. మీరు లేని సభ మీ యిప్పటి మూర్తులవలెనే యుండెను. మీరు రాకుండుటకు కారణమైన ముందుగా నివేదించుకొని యుండలేదు. ఈ మహాసభాసమక్షమున మీరు అందువిషయము చెప్పకొనునది విన్నవించుకొందురుగాక !”

జన్నిగదేవుడు మహాసభకును చక్రవర్తికిని నమస్కరించి వినీతుడై యిట్లు నివేదించెను.

“మా మండలము దక్షిణపు సరిహద్దులు దాటి జటావర్మసుందరపాండ్యునియు కొప్పెరుంజింగనియు సేనలు అలజడిచేయుచున్నవి. అట్టి ప్రమాదస్థితి నెదుర్కొనుచు దూరమున వుండుటచే రాజశాసనము ఆలస్యముగా నాకు జేరినది. అందుచే సకాలమున జేరికొనలేకపోతిని. వచ్చు ప్రయత్నములో నుండుటచే ముందుగా వార్త పంపలేదు.”

త్రిపురాంతకు డిట్లు నివేదించెను.

“మా అన్నగారు జన్నిగదేవుల శాసనముచే సిద్ధయదేవచోడుని సేనలతో బోరుచు సకాలమున రాలేకపోతిని. నాకును రాజశాసన మాలస్యముగా చేరినది. ఎప్పటికప్పుడు రాజధానికి బయలుదేరుచు నాగుచు నున్నందున ముందు వార్త పంపుట పడలేదు.”

అంబదేవు డిట్లు పల్కెను.

“మహారాజా, అన్నగారి శాసనమున నేను రాజశత్రువులు పలువురతో పోరుచుంటిని. ఎఱువమల్లిచోడుని పారద్రోలిన కేశవదేవసోమిదేవుల నెదుర్కొనవలసివచ్చినది. వారల నిర్జించిన అల్లుగంగను, మల్లికార్జునుని, దామోదరుని సేనలు తాకినవి. మహారాజసేవావ్యగ్రుడనై సమయమునకు రాలేకపోతిని. క్షంతవ్యుడను.”

వారల మాటలచే సామ్రాజ్యమున కెట్టి యుపద్రవములు దాపురించినవో సభకు విస్పష్టమయ్యెను. ఇట్లు దీక్షతో రాజసేవ చేయుచున్నవారికీ యగౌరవ మేమి?

వెంటనే గణపతిదేవుల శాసనము దామనామాత్యుడు వినిపించెను.

"మహారాజులు మిమ్ముల నెట్టి యగౌరవమును జేయుట మహారాజులకు సమ్మతము కాదు. మహారాజులు వృద్ధులై విరక్తులై రాజ్యభారము శ్రీరుద్రదేవమహారాజులయందు ప్రతిష్ఠించుచున్నారు. ప్రకృతిసిద్ధముగా వాడిగల మీ ఖడ్గములకు వేసముకూడ చేర్చవలసిన సమయ మాసన్న మైనది. మీరు పేర్కొనిన రాజశత్రువుల నెల్లర శీఘ్రముగా లోగొందు మని శ్రీరుద్రదేవమహారాజులకు ప్రతిజ్ఞాపూర్వకముగా విన్నవించుకొని మీ ఖడ్గములును సమస్తగౌరవములును మీరు పొందవచ్చును."

సభ కొక్కసారిగా భారము తీరిన ట్లయ్యెను. ఈ వృద్ధరాజు కెట్టి నైపుణ్యమున్నది!

అంతట నా కాయస్థసోదరులు మువ్వురును శ్రీరుద్రదేవమహారాజుల కెరగి మరల విజయపరమి రాకమున్న, పాండ్యపల్లవచోళాదిశత్రువుల నెల్లర జేర్కొని, వారి నిర్జింతు మని కఠోరప్రతిజ్ఞలు చేసిరి. శ్రీరుద్రదేవమహారాజులు వారల నెర్రమద్దియల ఆసనముతో నలంకరింపజేసి పిదప బంగారుపళ్లెరములలో వీరతాంబూలము లుంచి అందులో వా ఖడ్గములు కూడను వేర్వేర నునిచి వరుసగా మువ్వురకు బహూకరించెను. వారది మహాప్రసాద మని స్వీకరించి మరల పూర్వప్రతిజ్ఞలు చేసిరి. ఒక్కసారిగా సభ్యులు జయజయనినాదములు చేసిరి. ఆ కాయస్థసేనానుల కది నూతనగౌరవముగనే భాసించెను.

పిమ్మట నా వేరొక రాజశాసనము కార్యభరణు డిట్లు చదివెను.

"ఇందులూరి అన్నమంత్రులును కొలని రుద్రదేవులును మహాలయామావాస్యా సభకు రాకున్నందుకు కారణము మహాసభకు నివేదించుకొందురుగాక!"

ఇది యేమి? వారిని ఖడ్గములు వరించలేదు. ఇం దేదో రహస్య మున్నది!

ఇందులూరి అన్నమంత్రి లేచి మహాసభకు నమస్కరించి చెప్పకొనెను.

"గోదావరినదియు శబరియు విపరీతముగా వరదలు వచ్చి పొంగి మండలముపై బడినవి. గ్రామము లెన్నో మునిగినవి. వేనవేలుగా ప్రజలు నిరాధారులై ప్రాణాపాయస్థితిలో నుండిరి. అల్లాడిపోవుచున్న జనుల బాధ చూచుచు ప్రతిక్రియలు స్వయముగా దగ్గర నుండి చేయింపకుండ కదలి రాలేకపోతిని. ఖనకులకు స్థపతులకు తక్షకులకు ఆజ్ఞ లిచ్చుచు ఆర్తులకు అన్నవస్త్రనివాససౌకర్యములు కలిగించుచు మహారాజులకు క్షమాపణపత్రము ముందుగనే పంపుకొంటిని. స్థితిగతులు కొంత దారిలోనికి వచ్చినతరువాత మిగిలిన కార్యములు రుద్రదేవుల కప్పగించి ముందు రాజదర్శనమునకు వచ్చితిని. కొలని రుద్రుల యాలస్యమునకు గూడ నేనే కారణుడను!"

కొలని రుద్రుడు అన్నమంత్రివాక్యములే ధ్రువపరచెను.

గణపతిదేవుల యాజ్ఞ మరల కార్యభరణుడు వినిపించెను.

"ఇంతవరకూ అన్నమంత్రీశ్వరులు మా ప్రభువులు గాఢ విశ్వాసమున మహా రాజులు వొసగిన కార్యభారము నిర్విఘ్నముగా నెరవేర్చిరి. అన్నమంత్రీశ్వరులు ప్రజాక్షేమమునకై కోరుకొను పని చేసి దాని శ్రీ రుద్రదేవమహారాజులు తీర్చ గలరు. మే మింతటితో ప్రత్యక్షముగా రాజ్యపాలన చేయుట విరమించి శ్రీ రుద్ర దేవమహారాజుల కా భార మిప్పుడే అప్పగించుచున్నాము!"

అంతట గణపతిదేవులు శ్రీ రుద్రదేవమహారాజునకు వజ్రఖచితమగు ముద్రాంగుళీయము సమర్పింప నది రుద్రమహాదేవులు — భక్తితో కన్నుల కద్దు కొని స్వీకరించిరి.

అన్నమంత్రీశ్వరు డ ప్రశ్నించెను.

"మహారాజులు నవరాత్రదీక్షలో నిమగ్నులై యుండిన నొక్కపారిగా మా కర ణములు పనులకు రాక నిలిచిపోయినారు. వారు నిష్కారణముగ నైనారు. వారి నింత వరకు మే మెట్టి చిక్కులు పెట్టక అధికారముతో జూచుచుంటిమి. వారికి బుద్ధి యొక్కసారిగా ఏల పుట్టినదో ఎరుగము. అందుచే ఈ బ్రాహ్మణసముదాయము లోకసంఘ మున పారంపర్యముగా నుండుట పరిపాలనకు ప్రమాదకర మని నిశ్చయమైనది. విచా రించగా పలువురు బ్రాహ్మణులు బ్రాహ్మణవృత్తి యందు సంతృప్తి లేక పరితాపాల ముతో నున్నట్లు మాకు తెలిసినది. అప్పట్టునకేమి పాకశాలయందు దివ్యవ్యవహార రహస్యము తెలిసిన నియోగులు నూరుగురు ఒకకంటికి ఇచ్చుచున్నారు. వారు దక్షులు. వారిచే బ్రాహ్మణులకు కరణపాఠకాల ప్రారంభింపజేయుట ప్రజాక్షేమకర మని మాకు తోచినది. శ్రీ రుద్రదేవమహారాజుల సముఖమున ఈ గోధూళికాపవిత్ర లగ్నమున అందు మంగళపాఠ ముపక్రమింప ననుజ్ఞ యిచ్చుటే నేను అర్థించునది!"

శ్రీ రుద్రదేవమహారాజు ప్రీతివిలోకనములు అన్నమంత్రిపై పరపెను. ఆ మధ్యాహ్నమే వారికి కరణముల యాలజడి నివేదింపబడియుండెను. దానికి ప్రతి క్రియగా అన్నమంత్రి యిది కొంత కుపదేశించుచున్నాడని ఆమె భావించెను. వెంటనె యామె యిట్లు శాసించెను.

"శ్రీగణపతిదేవులు రాజ్యభారము మాపై నుంచిన దినమే! మా ప్రథమశాస నము మా కెంతయు నానందదాయకముగా నున్నది ఈ పాఠాల వెంటనే ప్రారం భింప ననుజ్ఞ యిచ్చుచున్నాము!"

ఇంతలోనే అన్నమంత్రిచే సమాజ్ఞాతులై ఆ మహామండపమునకు ఆ నూరు గురు బ్రాహ్మణులును పరమానందముతో వచ్చి వారి కొరకు ఏర్పరచిన యాసన ములనుపవిష్టులైరి. ఆ పాఠశాలలో నభ్యసింపదలచిన బ్రాహ్మణులను రమ్మన నొక్కసారిగా ఆరువేలుమంది శ్రోత్రియబ్రాహ్మణులు వచ్చిరి. ఉత్తరక్షణములో సోమనాథుడు పరిషదనుజ్ఞ పొంది శ్రీమహాగణాధిపతిప్రార్థన గావించి మంగళపాఠము ధీరగంభీరవాక్కులతో ప్రారంభించెను. ఆనాడు ద్రవ్యసంజ్ఞ, తులామానము,

నామకరణం, ఛాత్రసంజ్ఞ, సంఖ్యాస్థాననిరూపణమును లీలావతీగణితములోని మొదటి పదిశ్లోకములలో అధ్యాపన మొనర్చి మంగళము చెప్పెను.

అంతలో కార్యభారకుడు శ్రీ రుద్రదేవమహారాజుల హస్తములలో కొన్ని పత్రము లుంచెను. అవి చూచి యామె యుత్తరక్షణమున నిట్లు శాసనము చేసెను.

“మా మండలికులును సామంతులును దండనాథులును తమ ప్రధానకరణములను శిక్షింపుటకు చేయుటకు మా యనుమతి వేడుచు పంపిన పత్రము లివి! మా మహామాత్యుల యాజ్ఞాపనము సక్రమబద్ధమే. అయినను ఈ యానందసమయమున ఈ కరణముల నందరిని మేము క్షమించుచున్నాము. అందుచే ఈ యపరాధమునకు బంధింపబడినవారి నెల్లరను విడిపింపవలె నని ఇందుమూలముగా నాజ్ఞాపించుచున్నాము. వారల నందరిని పూర్వోద్యోగములలో చేర్చుకొనుటలో మానుటలో మా మహామాత్యాదుల నిర్ణయమునకే వదలిపెట్టుచున్నాము. ఐనను వారల నందర దయాదృష్టితో వారు చూడగల రని మా విశ్వాసము! మా ప్రజలయం దందరియెడ మా కట్టి సమాన వాత్సల్యమున్నదని సమస్తజనులును దీనితోనైన దెలిసికొందురుగాక !”

ఈ యాజ్ఞ విని యా మహాసభలోని యార్యజనములు సాధువాదము లొనర్చిరి.

అంతలో మేచయనాయకు డచ్చటికి తిరిగి వచ్చెను. ఆతడు తాను వెడలిన కార్యఫలితము శ్రీ గణపతిదేవులకు నివేదింపబోయెను. గణపతిదేవులు వినిపించుకొనలేదు. కార్యభారకుడు రాజ్యభారము వారు శ్రీ రుద్రదేవమహారాజుల కప్పగించి రని చెప్పగా నాతడు దిద్దుకొని శ్రీ రుద్రదేవమహారాజులకు మ్రొక్కి జనాంతికముగా నిట్లు నివేదించెను.

“శ్రీ చాళుక్యవీరభద్రేశ్వరులను హరిహరదేవమురారిదేవులను మహారాజు నాజ్ఞచే బంధింపుటకు వెళ్లితిని. వారు దొరకలేదు. కాని వారికై యాశ్వికు లన్ని దిశల వెదకుచున్నారు. కారాగారమున బంధితులు కొందరు తప్పించుకొని రని తెలియవచ్చినది.’

ఇట్లు నివేదించి యాతడు సెలవుతీసికొని వెళ్లిపోయెను.

పంచతూర్యారవము లొక్కసారి చెలంగెను. బ్రాహ్మణులు స్వస్తివాచనము ప్రారంభించిరి. సభ్యులు జయజయనినాదము లొనర్చిరి. సువర్ణదండధరులు బహుపరాకులతో దారితీసిరి. ముందు దివిటీలు కదలెను. వందిమాగధులు కైవారము లొనర్చిరి. శ్రీ రుద్రదేవమహారాజులు విజయయాత్రోత్సవమునకు బయలుదేరిరి. వారివెంట అన్నమంత్రీశ్వరాదులు వెడలిరి.

ఆ సభామంటపమునకు సమీపముననే యొక విశాలప్రదేశమున నొక జమ్మిచెట్టు కలదు. దానిపైనుండి వివిధశత్రునామము లున్న చిత్రపత్రములు వ్రేలాడగట్టియుండెను. పర్వతనాయకుడు శ్రీ రుద్రదేవమహారాజులకు విల్లు నంబులు నందిం

చెను. వా రం దర్ధచంద్రబాణము సంధించి ఆ వ్రేలాడు పత్రములలో ప్రధానమై ఆకర్షించుచున్న దానిని రెమ్మతోకూడ పడునట్లు ఛేదించిరి. జయజయనినాదములు పిక్కటిల్లెను.

అన్నమంత్రీశ్వరాదివీరులు తమ ఖడ్గములు తీసి యచ్చటి జమ్మిపై నున్న పత్రములు రెమ్మలతో ఛేదించిరి. వారి వీరతావిజృంభణము ఒక్కొక్కరిది ఒక్కొక్క విధముగా భాసించెను. వా రట్లు ఛేదించిన పత్రములు రాజభటులు శ్రీరుద్రదేవ మహారాజుల కందీయ వారివలననుండి య ట్లవి ఛేదించిన వీరులు బహుమానముగా పడసిరి.

జన్నిగదేవునికి ప్రసాదించిన పత్రములపై జటావర్మసుందరపాండ్యకొప్పెరుంజింగల నామము లున్నవి; త్రిపురాంతకునకు సిద్ధయదేవచోడపత్రము వచ్చినది; అంబదేవునకు అనేకపత్రము లబ్బినవి—ఎఱువమల్లిచోడ, కేశవదేవ, సోమిదేవ, అల్లుగంగు, మల్లికార్జున, దామోదర నామము లందున్నవి.

ఇట్లు పవిత్ర మగు జమ్మిపత్రములు సాక్షులుగా నంధ్రోర్వీశసామంతులు కాకతిరాజ్యశత్రువుల దునుమాడగల మను ప్రతిజ్ఞ ఖడ్గధారచే గైకొనిరి.

ఇందులూరి అన్నమంత్రికిని, కొలని రుద్రునికిని లభించిన పత్రము లెవ్వి? శ్రీ రుద్రదేవమహారాజులు ఛేదించిన ప్రధానశత్రు వెవ్వరు?

అంతలో కరదీపికలతో నా విశాలప్రదేశమున క్రమ్ముచున్న చీకటులు విరిసెను.

పారువేట వినోదముగా సాగెను. మందలుమందలుగా మూగిన శత్రుసైన్యములు గొఱ్ఱెలవలె పలాయనమయ్యెను. నానావేషధారులు చేతుల గాజులు ధరించి వచ్చి మహారాజులకు మ్రొక్కిరి.

పండితులకు కవులకు గాయకులకు నటులకు వినోదకులకు మల్లురకు నానా యుద్ధకుశలురకు సగౌరవముగా సాదరముగా పాత్రోచితముగా శ్రీరుద్రదేవమహారాజు లారాత్రి ప్రొద్దుపోవువరకు భూరిసంభావనలు పంచిపెట్టుచునే యుండిరి.

౧౩

ఆశ్వయుజశుద్ధపాడ్యమినాడు వీధిలో పోరాడుచున్నందుకు మేచయనాయకుడు బంధింపజేసిన బొల్లని గండని పంపిన కారాగృహము ఓరుగల్లుకోటలో నుత్తర భాగమున నుండెను. ఆ గృహము నేలపై గట్టినదో భూమ్యంతర్భాగమున గట్టినదో ఏర్పరుపరాకుండెను.

వారిద్దరును ఒకదాని కొకటి సమీపమున గల రెండు వేర్వేరు కొట్లలో నుంచిరి. ఆ సాయంత్రముననే మేచయనాయకుడు వారి వివాదకారణము చెరసాల లోనే విచారించెను. జరిగిన పోరునుగూర్చి ఉభయులు మొత్తముమీద ఒకేవిధముగా జెప్పిరి. అందుచే వేరు సాక్ష్యము అవసరము లేకపోయెను.

నగరరక్షకులు రెండువిధములవారు. అందులో వీరభద్రులలోనివాడు గండడు, వీరముష్టులలోనివాడు బొల్లడు. ఇరువురు వీరసాహసకార్యములకు ప్రసిద్ధులే. నగర రక్షకులే ఇట్లు కలహించిన పాలించు టెట్లు?

బొల్లడు తన కావేశము వచ్చి యట్లు మైమరచి యరచుచుంటి నని చెప్పెను. కాని నాయకు డా మాటలు నమ్మలేకపోయెను. అందుపై దానిగూర్చి యత డెన్ని విధములనో బొల్లని ప్రశ్నించెను. కాని లాభము లేకపోయినది. ఆ దైవతావేశములో తా నేమి మాటాడెనో కూడ తెలియ దని బొల్లడు ప్రత్యుత్తర మిచ్చెను. గ్రుచ్చి గ్రుచ్చి యడిగినకొలదియు నాతడు ఏమాత్రమును తొణకలేదు. దేవత పూనినవాని చేష్టలు మాటలు తరువాత జ్ఞప్తియుండునా?

బొల్లడు 'అసనోకు భరించలే'నని అరచు కేకలు వినగానే తన హృదయములో మంట మండినదనియు రోషము పట్టలేక బొల్లని రాజవీధిలో తన్నితి ననియు నాయకులు రాకున్నా నా రాజద్రోహిని చంపియుందు ననియు తప్పున్న క్షమింపు డనియు గండడు ప్రార్థించెను.

వెంటనే మేచయనాయకుడు గండని బంధవిముక్తుని జేయించి నూరుగురు వీరభద్రుల కధిపతిని గావించి యాజ్ఞాపత్ర మిచ్చెను. మరల నంతట నాయకుడు బొల్లని పరిపరివిధముల ప్రశ్నించి లాభము లేక చెరసాలలో తిరిగి కఠినముగా బంధింపు డని భటుల కాజ్ఞాపించెను. ఆ ట్లావేశము నటించుట కతని నెవరు ప్రేరేపించిరో స్పష్టముగా తెలిసికొను నవకాశము ఆ మేచయకు లేకపోయెను.

“నాయకా, వాని మాటలు విని నా కన్యాయము చేయవద్దు. నేను కొలువులో ఆవేశము పెరిగిఉండగా ఉత్తపుణ్యానికి వాడు నన్ను తన్నినాడు. ముందు నన్ను వాడు రొమ్ములో తన్నినా నని ఒప్పుకున్నాడు కూడను గదా! నన్ను తన్నుటే కాదు. మైలారుదేవునికే అపచారము చేసినాడు వాడు! వానిని విడిపించి నన్ను శిక్షించుట ధర్మమా? నేను రాజద్రోహినా?”

ఇట్లనుచు బొల్లడు తన కొట్టులోనికి భటులవెంట నడచెను. గండడు నాయకునకు వందనము చేసి క్రొత్తయుద్యోగములో చేరుటకు ముఖ్యస్థానమునకు వెడలెను.

బొల్లడా చెరసాలలో నవయుచుండెను. ఆ గదిలోనికి మధ్యాహ్నకాలమున దప్ప వెలుతురు రాదు. అందుచే నెక్కువభాగ మది చీకటికోణమే. త్రావుటకు కావలసిన నీరు రోజు కొకమారు తినుట కన్నముమాత్రము నతనికి ఇచ్చెడివారు. శీఘ్రముగా దృఢగాత్రుడగు నాతడు క్షీణింపసాగెను. మూడుపూటల నన్నము తిన నలవాటుపడిన మహామల్లుడు ఏకభుక్తము చేసి యుండగలడా? మధ్యాహ్న మగు నప్పటికి గాని యన్నము రాదు. ఆ యన్నము సాయంత్రము మూడుజాములకే జీర్ణమైపోవును. రాత్రికి కడుపులో ఆకలిమంట దహింప బ్రారంభించును. ఆకలితో రాత్రి నిద్దుర పట్టదు. నీరు మరల మరల త్రావి పొట్ట నింపుకొనును. తెల్లవారును. దేహము తేలి తేలి పోవును. మిక్కిలి నీరస మనిపించును. క్షణక్షణమును భోజనమునకై నిరీక్షించును. ప్రతిక్షణమును యుగముగా దోచును. తుదకు మధ్యాహ్నమగునప్పటికి ఒక్కబ్రహ్మకల్పమే యయిన ట్లతనికి తోచును. ఇ ట్లెన్నాళ్లు భరింపగలడు?

ఆరుదినము ల ట్లుండునప్పటికి అతని మనస్సులో నాందోళన ప్రారంభించెను. మేచయనాయకునకు వీరభద్రేశ్వరుని రహస్యసభావిషయములు చెప్పివేసినచో?— ఆ మాట మనస్సులో వచ్చినంతనే యాతడు నాలుక కొరుకుకొనెను. ఆ సభారహస్యము దాచియుంతు నని తా నెట్టి ప్రతిజ్ఞ చేసెను? ఈ యాకలిబాధ ఈలోకమున మాత్రమే యుండునది. ప్రతిజ్ఞాభంగము చేసినవారు ఎంతకాలము రౌరవాదినరకములలో నింత కెన్నిరెట్ల బాధ పడవలెనో! నరకవర్ణనలు తాను విన్నవి జ్ఞప్తికి వచ్చెను.

ఆ బిగువుతో నా దినమెల్ల జరిగిపోయెను. మరునాడును బిగువు సడలలేదు. కాని తుదకు మహానవమినాడు ఆకస్మికముగా మరల నా యూహ గట్టిగా అతని మనస్సులో ప్రవేశించెను. ఒకసారి ప్రవేశించిన దౌర్బల్యము నెమ్మదిగా మనస్సును తినివేయక మానదు.

"ఇంత పండుగునాడు నా భార్య ఎంత ఘోషించుచున్నదోకదా? నా పసిపిల్ల నన్ను చూడనిది ఉండలేదు. పాప మది ఎంత దిగులుపడ్డదోకదా! రుద్రమదేవి నాకు చేసిన అపకార మేమి? వీరభద్రదేవులు నాకు ఒరిగించిన దేమి? ఏ మాశించి నే నీ చిక్కులో నిరికినట్లు!—రాజభటులు నా భార్యను బిడ్డను గూడ ఎట్టి బాధలు పెట్టుచున్నారోగదా!—ఆ గండనికి పెద్ద యుద్యోగ మైనది. వాడు మొద లూతకొనునా?—"

ఒక్కసారి గండనిపై కోపము తెరవలె ఉన్మాదరూపమున హృదయములో ఉబికి పొంగెను. బొల్లని భార్య మంగి ఒకనాడాత డింటి కేగునప్పటికి గండనితో మాట్లాడుచుండెను. ఆ మాటలలో విశేషము లేదు. అట్లు మాట్లాడుటలో

త ప్పేమియు లేదు. కాని మంగిముఖములో నొక ఆకర్షక మగు చిరునవ్వును గండని కంఠములోని కొంత స్వాతంత్ర్యమును ఆనా డాతనికి కోపము కలిగించెను. ఆ సాయంత్రము అన్న మాలస్యమయిన దను వంకతో మంగిని వాడు చితుకకొట్టెను. ఇప్పుడు మరల ఆనాడు మంగిముఖములోని చిరునవ్వు గండని స్వాతంత్ర్యకంఠము కన్నులకట్టినట్లు చెవుల బడినట్లు అయ్యెను. అంతవరకును ఆకలితో మండుచున్న యాతని కడుపులో ఒక్కసారి కలపివేసిన ట్లయ్యెను. ఆనా డిక అన్నము వచ్చినను అతడు తినునట్లు కూడ లేదు.

అంతలో నతనికి కూతురుపాటిముఖము జ్ఞప్తికి వచ్చెను. ఒక్క ముహూర్త కాలము దాని రూపము తలచుకొని ముగ్ధుడై నాడు. వారి కులములో ఆ చాయ అరుదు. తాను నల్లనివాడు. మంగి నల్లనిది. కుమార్తె పాటిమాత్రము చామనచాయ. గండనిదికూడ చామనచాయయే. ఇంతవర కెప్పుడును అతని కిట్టి యాలోచన పోలేదు. చెరసాలలో ఇన్నాళ్లు గడపినతర్వాత మేచయనాయకులకు వీరభద్రేశ్వరుని రహస్యములు చెప్పివేయదలచిన సమయములో నీ యాలోచనలు ప్రారంభించెను. స్వామిఘాతుకులకు పరలోకములలో కలుగు యమయాతన యతని కిప్పుడే ప్రారంభించెను.

అట్లు ఆలోచించుచుండగనే అన్నము వచ్చినది. అది భటు డొకచోట నుంచి వెడలిపోయెను. బొల్లనికి అనుదినము అన్నము రాగానే అది తిని వేయుట తప్ప ఇంకొక యాలోచన లేదు. ఈనాడో! అతని కది తినవలె నను నిచ్ఛయే కలుగలేదు. మూడుజాము లైనది. అతని దేహము మిక్కిలి నీరసించిపోయినది. అప్పు డెట్లో ప్రయత్నపూర్వకముగా నత డా యన్నము తిని నీరు త్రావెను. అందుపై గాఢమైన నిద్ర వచ్చినది. అది కలలులేని నిద్ర. కల లున్నచో గండడు మంగితో మాట్లాడు చున్నట్లే వచ్చియుండును.

మరునాడు జాముప్రొద్దెక్కువరకు నత డట్లే నిద్దురపోయెను. ఆ చీకటిగది లోనికి కొంచెము వెలుతురుసూచనలు వచ్చుచున్నందున జాముప్రొద్దెక్కియుండు నని యతనికి తోచెను. ఆ క్రిందటిదినమున మంగిపై కలిగిన అస్పష్ట మగు ననుమాన మంతయు విరిసిపోయెను. ఈ పండుగనాడు భార్యను పిల్లను చూడవలె ననియే యత నికి కోరిక ! వేరు కోరిక లేదు.

మధ్యమధ్య ప్రహర కాచు భటుల నత డెన్నియోమారులు పలుకరించి చూచెను. వారు పలుకరు. అన్నము తెచ్చువానిని పలుకరించెను. అతడును పలుకడు. ఈనాడు మేచయనాయకులను స్వయముగా దర్శింప ననుజ్ఞ వేడితి నని కారాగృహాధి కారికి బొల్ల డాతనిచే వర్తమాన మంపెను. అధికారి యొకడు వచ్చి యాతని గారణ మడిగెను. పరమరహస్య మొకటి యున్న దనియు వారికే తప్ప యితరులకు చెప్ప వలనుపడ దనియు నాత డుత్తరమిచ్చెను. ఇట్టిది తరుచుగా జరుగును. నాయకులకు తెలుపుట కర్తవ్యము. కాని పట్టాభిషేకోత్సవములో ఈనాడు రాజధాని యంతయు

నిమగ్నమై యున్నది. ఇక మేచయనాయకులకు తీరిక యుండునా? వారి వ్యవహార శాలకుమాత్ర మీ యంశము తెలియజేయు పత్రముమాత్ర మంపెను.

ఆవల శ్రీ రుద్రదేవమహారాజులు పట్టాభిషేకమంటపములో మంత్రిసామంత దండనాథులయొద్ద సేవాప్రతిజ్ఞ లందుకొనబోవుచుండిరి. పట్టణ మంతయు నుత్సవములో మహాకోలాహలముగా నుండెను. రాజపురుషులకు తీరిక లేదు. అత్యవసరమగు పరివారము తప్ప మిగిలినవా రందరు పట్టాభిషేకనిర్వహణమునకు అతిథుల పూజలకు నియుక్తులై యుండిరి.

అంతలో పలువురు భటులు చెరసాలయధికారియొద్దకు వచ్చిరి. వారిలో ప్రముఖు డా యధికారి కొక పత్రము ఇచ్చెను. అందులో నిట్లున్నది:

"వెంటనే బొల్లని ఈ భటులవెంట పంపవలసినది!

మేచయనాయకుడు."

ఆ యాజ్ఞ చూచి చెరసాలయధికారి యాశ్చర్యపడెను. తాను వార్త పంపి ఎక్కువతడవు కాలేదు. అయినను ఇట్టి యుత్తరువు లాతనికి వచ్చుట యరుదు. సందేహముతో నత డా పత్రము మరల పరీక్షించెను. మేచయనాయకుని ముద్రిక స్పష్టముగా నందు గాన్పించెను. నాయకుని యాజ్ఞ లొక్కొక్కతరి చిత్రముగా నుండును. అయినను వీకశిలాపురీపాలకు డగు నాతని యాజ్ఞ ధిక్కరించుటకు ఎవరికి ధైర్య ముండును? అందుచే నది శిరసావహింపక తప్పదు. వెంటనే ఆ వచ్చిన భటులవెంట బొల్లని బంపివేసి యైనను అనుమానము తీరక ఒక యాశ్వికునిద్వారా ఆ సంగతి మేచయనాయకునకు తెలియబరచెను.

ఆ వేగరి సభామండపమున కేగునప్పటికి మేచయనాయకు డట లేడు. అతడు వీరభద్రేశ్వరాదులను తెచ్చుట కేగియుండెను. నాయకుడు వ్యర్థప్రయత్నుడై తిరిగి వచ్చుచుండగా నాతనికి వేగరి బొల్లని పంపిన వార్త ఎరిగించెను. నాయకు డది విని యా బొల్లని నతని గొంపోయిన భటులను వెంటనే వెదకి బంధింపజేయు మని కారాగారాధికారికి ఆజ్ఞ పంపి మరల సభామండపము చేరికొనెను.

బొల్లనికొరకు వచ్చిన భటు లాతని గఠినముగా తోలుకొనుచు చెరసాలయొద్దనుండి బయలుదేరిరి. చెరసాల దూరమైనది. ఆశ్వికుడును దూరమయ్యెను. అంతట వా రాతని సభామండపమునకు గొంపోవుటకు మారుగా క్రంతమార్గమునకు బట్టించిరి. బొల్లనికి ప్రాణములు ప్రాణములలో లేవు. భార్యయు పిల్లయు దలపునకు వచ్చిరి. ఒక్క క్షణములో అతని నంటి వచ్చుచున్న భటుల కఠినవైఖరి మారిపోయినది. మరుక్షణములో వా రాతని బంధనములు ఛేదించివేసి శుభ్ర మగు మడుగు వస్త్రములు కట్ట నిచ్చిరి. అతని మొదటి భయ మాశ్చర్యముగను ఆనందముగను మారిపోయెను. కలలో నడచుచున్నట్లే వారు చెప్పినట్లెల్ల చేసెను. వా రాతని కక్కడ నంతకుమున్న సిద్ధముగా నున్న యశ్వమును ఆయుధములు నిచ్చి మానుమకొంచ

మార్గమున చెరువుపడమరనుండి యాజ్ఞ లందు కొమ్మని యా భటులుకూడ తమ వేషములు మార్చుకొని తమ వస్త్రములును బొల్లని వస్త్రములును సమీపమున గల బావిలో పారవేసి వేర్వేరు మార్గముల వెడలిపోయిరి.

అశ్వ మధిష్ఠింపగనే ఆతని కొక ధైర్యము వచ్చెను. చేత నున్న ఖడ్గము ప్రక్కనున్న శూలము నాతనికి మరింత ధైర్యము చేకూర్చెను. మహోత్సవమునకు రాకపోకలు సలుపుచున్న మహాజనములో నాతడు కలసిపోయెను. త న్నెవరు చూతురు ? అయినను ఆతని నెరిగిన వా రెందరో కలరు. మధ్యమధ్య భయ మావేశించుచుండెను. కారాగారబాధ అప్పుడే వదలిన యతనికి మరల నచ్చటికి పోవుటన్న ప్రాణము వదలుటకంటె భయంకరముగా తోచెను. భార్యను కూతును చూడవలయు నని యతని కెంతేని కోరిక పుట్టెను. కేవలము ఆత్మరక్షణకై సమస్తమైన కోరికలు వదలివేసి గోపురద్వారము సమీపించెను. అక్కడ నతడు మిక్కిలి భయపడెను. కాని మహోత్సవములో నాడు సామాన్యనిర్బంధములు లేవు; గోపురము దాటి హనుమకొండమార్గముపట్టిపోయి అచ్చట గల చెరువుపడమటితీరము చేరికొనెను.

అచ్చట నతనికి ముం దెవ్వరును కనుపించలేదు. అత డేమి చేయుటకును తోపక యిటు నటు చూచుచుండెను. ఆ మార్గమున దూరమునుండి రాజభటులు వచ్చుచున్నట్లు కనుపించిరి. అతని మనస్సులోని భయముకొలది వెంటనే యాతడు గుర్రము దిగి నీటిని సమీపించి చెరువులో దాహము తీర్చుకొనుచున్నవానివలె నటించుచు నోరకంట నా దారి జను రాజభటులవంక చూచుచుండెను. ఆ రాజభటులు తమ దారిన దాము ఉత్సవోత్సాహముతో పోవుచు నాతని ననుమానింపనైన లేదు.

వారు దూరము దాటిపోయినంతనే ఆతడును నీటివద్దనుండి లేచి తడిసియైన చేతులును ముఖమును ఉత్తరీయమున నద్దుకొనుచు ఏమి చేయుటా యని యాలోచించుచుండెను. నీటిలోనుండి ఎవరో ఎవరనో పిలుచుచున్నట్లు ధ్వని వినవచ్చెను.

బొల్లడు భయభ్రాంతుడై ఉలిక్కిపడి యా శబ్దము వచ్చినవైపు చూచెను. ఆతడు తనకు కర్తవ్య మాదేశించు సాంకేతికుని కెదురు చూచుచుండియు నా శబ్దము విని ఉలిక్కిపడుటలో నాశ్చర్య మే మున్నది !

ఆవైపున నొక కమలషండము కలదు. అందులోనుండి యొక కమలమే తనవైపుకు జరిగి జరిగి వచ్చుచుండుట బొల్లడు నిర్లక్షించి విభ్రాంతి పొందెను కమల మట్లు నడచివచ్చు టేమి ? అంతలో నా కమలమే పలికినట్లు శబ్దము వి. బడెను. ఆ శబ్దము గాలి నిట్టూర్చినట్లే వినవచ్చెను.

"బొల్లా !"

బొల్లని శరీర మాపాదమస్తకము జలదరించెను. రోమము లన్నియు నిట్టనిలిచిపోయెను. కన్నులు నిలువుగ్రుడ్లుపడిపోయెను.

ఇంతలో కమలములోనుండి చిన్న నవ్వు వినబడెను. ఆ నవ్వు కూడ రెండు గాలులు ఒకదానితో ఒకటి తాకి శబ్దించినట్లే యుండెను. ఆ నవ్విన దా కమలమే.

నవ్వుచున్నవాని హృదయభాగముపై కెగిరిపడుచున్నట్లే ఆ తామరపువ్వు కూడ నీటిపై లేచి పడుచుండెను.

దానితో బొల్లని గుండె లదరిపోయెను. పారిపోవలె ననిపించెనుగాని కాళ్లు నేలపై పాదుకొనిపోయినట్లు స్తంభించినవి.

ఆ సరోవరములోనుండి తరుచుగా నట్లే చిత్రచిత్రశబ్దములు వచ్చుచుండు నని. జనశ్రుతి కలదు. ఒకానొకప్పుడు గీతవాదిత్రనిస్స్వనము వినిపించునట! ఒక్కొక్కతరి నలౌకిక మగు యుద్ధఘోష వినిపించును. ఆ సరోవరము నెవరో గంధర్వు లాశ్రయించియున్నారు. వా రందు రాత్రుల జేయు చర్య లొక కొన్ని దారుణములును మరికొన్నియెడల బహుకారుణ్యోపేతము లయిన వనియు ఎన్నియో సంఘటనలు జనులు కథలుగా చెప్పకొనుచుండువారు. రాత్రులందు ఒంటరిగా సామాన్యజన మెవ్వరు నా సరోవరముచెంతకు బోవ సాహసించెడువారు కారు.

బొల్లనికి పారిపోవలె నను తీవ్రవాంఛ కలిగెను. పదములు ఇచ్ఛానుసారముగా కదలుటలేదు. ఐనను తా నిప్పు డెక్కడికి పోగలడు? భటులు గుర్తించినచో తన కీమారు మరణదండన వేయుదురు. అందును మేచయనాయకుని భటు లెక్కడ లే రనుకొన వీలున్నది!

అంతలో నా పద్మము బొల్లని సమీపించి నిశ్శబ్దముగా నాగిపోయెను. బొల్లడు బెదరుచు నందు చూడగా దాని మధ్యమున నొక పత్రమును అనేక సువర్ణములును ఉండెను.

ఆ సువర్ణము లాతని నెంతయేని నాకర్షించెను. కాని వానిని చేతులతో స్పృశించుటకు గూడ వాడు గడగడలాడుచుండెను. ఇంతలో దూరమునుండి స్వరము వినిపించెను. అది కొంచెము సంగీతమువలె కూడ నుండెను.

“భయపడకు! అవి తీసికొని నొంటూరు వెళ్లుము. నీకు మా రక్ష కలదు. ఇక రెండుగడియలలో ఓరుగల్లుపరిసరము దాటిపోవనిచో నీప్రాణములపై నాశయుండదు!”

ఆ మాటలతో నాతనికి ధైర్యము కలిగెను. ఆ లేఖను సువర్ణములును అతడు పదిలపరచుకొనెను. ముచ్చెమటలు కారుచున్న శరీరముతో నాత డశ్వ మధిరోహించి శీఘ్రగతి బయలుదేరెను.

దూరమున గోపురద్వారమునుండి పలువు రాశ్వికులు ఆగుచు నాగుచు మరల మరల శీఘ్రగతి వచ్చుచున్నట్లాత డుపలక్షించెను. అది తన్ను వెంటాడు భటులని యాతనికి వెరపు కలిగెను.

ఉత్సవసమయ మైనందున ఆనాడు సర్వత్ర రథాశ్వగజశకటాదుల ప్రచారము విస్తారమై సమ్మర్దముగా నుండెను. ఐనను తన గుఱ్ఱపు డెక్కల గుర్తులు అనేక హయపదచిహ్నములతో కలసిపోయి గుర్తింపరానట్లు చేయుచు నెమ్మదిగా నొక ప్రక్కదారికి పట్టించెను.

అభిషేకమండపమున పేరోలగము మహాప్రభావముతో జరుగుచునే యున్నది. సూర్యభగవానుడు ఉదయాదిగా ఆ మహోత్సవమును చూచి చూచి అలసి విశ్రమింపబోవుచున్నాడా అనునట్లు చరమాద్రి కొరగుచుండెను. ఆకాశమున చెదరుచెదరుగా గాడిదమబ్బులు తిరుగుచు సంధ్యారంజితములై దిగంగనను అరుణారుణము గావించుచుండెను. అది అనురాగకృతమో కోపకృతమో ఊహింపశక్యమా?

ఆ సమయమున ఓరుగంటి ప్రాచీద్వారముముందుగల విశాలప్రదేశమున చనుప్త యొక్కటి వచ్చి యాగెను. అందలి సార్థవాహులు ప్రాచీసముద్రతీరములనుండి యమూల్యములగు సరకులు తెచ్చియుండిరి. ఆవైపులనుండి సార్థములు వచ్చి యిప్పటికి రెండుమూడు నెలలు దాటిపోయినది. తూర్పుసముద్రప్రాంతము శాంతముగా లేదు. కొన్నియెడల జటావర్మసుందరపాండ్యుని సేనలును మరికొన్నియెడల కొప్పెరుంజింగని పల్లవసేనలును ఇంకను గొన్నియెడల చోళసేనలును సంచరించుచు ప్రజాపీడ గావించుచుండెను. స్థానికులగు వీరభద్రులును వీరముష్టులును ఆ యలజడి నరికట్టజాలకుండిరి. దారిదోపిడిగాండ్రు ప్రబలిపోయిరి. అట్టివారి కెల్ల గొంటూరుమాండలికుడగు నాగదేవరాజు ప్రాపుగా నుండి వారిని రెచ్చగొట్టుచుండెను.

ఇట్టి స్థితిగతులలో కృషీవలులు తమ క్షేత్రములు దున్నుటకుగాని అందితర వ్యవసాయకార్యములు ప్రారంభించుటకుగాని వెనుకాడుచుండిరి. గ్రామములోని రచ్చచావడి కొకనాడొక భటతండము వచ్చును. వారి నాయకుడొక యాజ్ఞాపత్రము గ్రామాధికారులకు చూపించును. రెడ్డియు కరణమును అది చూచి ఏమి చేయుటా యని యాలోచించుచుందురు. ఆ యాజ్ఞాపత్రములో ఇన్ని సజ్జలు ఇన్ని జొన్నలు ఇన్ని చోళ్లు—అట్లే ఇతరవస్తువులు పంపుడని యుండును. దాని మూల్యము భటులతో పంపియుండలేదు. ఇంతమూల్యమునకు పంపుడని యైన నందుండదు. మూల్యమెట్లు తామప్పగింతురో తెలియరాదు. ఆ గ్రామాధికారులు తమ గ్రామములోని వెలిపొలములనుండి యా సంవత్సరము చెల్లింపవలసిన 'పుట్టిపహిండి' అంతకుమున్నె తమ పైవారగు స్థలాధికారులకు పంపియుండిరి. మరి యెట్లు ఇది పంపుట? ఈ పత్రము మొదలు పంపిన దెవరు?

ఇట్లా గ్రామాధికారు లాలోచించుచుండగనే వచ్చిననాయకుడు తొందరించును. ఏమి: చేయను దోపక వారు తలవరులను గ్రామములోని సంపన్నులయొద్ద కంపి ఎట్లో కష్టపడి వారు కోరిన ద్రవ్యములు సేకరించి యప్పగింతురు. ఆ నాయకుడును తృప్తుడై ఇన్ని వస్తువులు తాను పుచ్చుకొంటి నని పత్రము లిఖింపజేసి యా గ్రామోద్యోగుల కీయగా వారు కొంత తృప్తి నొందుదురు. కానిఇది ఇట్లేల జరిగిన దని గ్రామాధికారులును గ్రామములోని పెద్దలును మథనపడుచుందురు.

ఆ మథన పూర్తి కాకముందె ఆ సాయంత్రమున చీకటిపడిన కొద్దిసేపటికి దివ్వెలు వేసికొని మరి యొక సైనికతండ మా గ్రామముప్రవేశించును. దీని నాయకుడు తన యిచ్చవచ్చినచో తిష్ఠ వేసి తనయొద్దకే గ్రామోద్యోగులను పిలిపించుకొని ఏ యాజ్ఞాపత్రముకూడ చూపకయే సజ్జలు జొన్నలు చోళ్లే గాక వేయిమాడలుకూడ నిమ్మని యాజ్ఞాపించును. గ్రామోద్యోగుల కీమారు ఆలోచించుకొను నవకాశము కూడ నుండదు. ఏదైన చెప్పికొనబోయిన నా నాయకుడు కొట్టవచ్చువానివలె కేకలు వేయును. తుద కెట్లో ధైర్యముచే గ్రామకరణము ఆ నాయకునకు వంగివంగి దండములు పెట్టి తా మా మధ్యాహ్నవేళ నాయకున కిచ్చి పొందిన ద్రవ్యముల పత్రము చూపించును. ఈ నాయకు డది చదివికొనగలుగునో లేదో గాని యా పత్రము చూచినంతనే మిన్నెత్తున లేచి మండిపడి యసభ్యముగా ఆ మధ్యాహ్నము వచ్చిన నాయకుని దిట్టి ఆ గ్రామోద్యోగులను గూడ నట్లే తిట్టుచు చేతిచ్చిన పత్రము చింపి వేయును. తుదకు ప్రహరణములు సిద్ధము కానుండగా నా గ్రామోద్యోగులు ఎట్లో ప్రయత్నించి సామాన్యగృహస్థులు ఇండ్లలో దాచుకొన్న ధాన్యమును వర్తకులయొద్దను గ్రామపంచాయతీలోనను నిలువయున్న వేయిమాడలును వానికి సమర్పించుకొందురు. ఈ నాయకు డవి చేకొని మరల పదితిట్లు గ్రామస్థులను తిట్టి స్వీకారపత్రమైన నీయక వచ్చినదారిం బోవును.

ఆరాత్రియే వేగరులచే నీవార్త స్థలాధికారులకు వారు నివేదించి కొందురు. ఇట్లే ఇతరగ్రామములనుండికూడ జరిగిన వార్తలు అప్పటికే స్థలాధికారులకు చేరి యుండును. స్థలాధికారులు తమకువచ్చిన యలజడివార్తలు ఆశ్వికులచే సీమాధికారులకును, సీమాధికారులు నాడియధికారులకును, వారు మండలాధిపతులకును దెలిపి కొందురు. వాని విచారణ ప్రారంభించునవకాశము కలుగకముందె మరెన్నియో ఇతరగ్రామములను స్థలములందును సీమలలోనను కాక మొదటిగ్రామమందే తిరిగి యట్టిది సంభవించును. ఒక్కొక్కచో గ్రామీణులు ధైర్యము వహించి కూడుకొని యా వచ్చిన భటులను పారద్రోలుదురు. ఒకానొక యెడ రాత్రులందు ఆయుధహస్తులై భటులు గ్రామముపై బడి గృహములు దహనము కావించి స్త్రీబాలవృద్ధుల గూడ నానాహింసలపాలు చేసి చిత్రవధ లొనర్తురు. అందులో పలువురు రెడ్లును కరణములును కాలుసేతులును కన్నులును నాలుకలును ప్రాణములును గోల్పోయిరి. పలువురు పారిపోయిరి. కొందరు ఈయదను కనిపెట్టి యలజడిమూకలలో చేరి సంచరించుచు లాభములు గడింపజొచ్చిరి. గ్రామములలో ప్రారంభించిన యలజడులు నెమ్మదిగా స్థలములు సీమలు నాడులు ముఖ్యస్థానములకే ప్రాకినవి. గొంటూరు మండలాధిపతియే వీనికంతటికి మూలకారణుడను వార్తయు నెమ్మదిగా ప్రవర్తిల్లెను. దానితో భయ మావహిల్లెను.

ఇట్టి స్థితిలో జానపదుల యవస్థ లేమని వర్ణింపగలము? వారు తమ యిండ్లు వాకిండ్లు గొడ్డుగోద విడిచి పోలేరు. విడిచినను ఎక్కడి కేగుదురు? ఎట్లు పోదురు? పోయి యేమి చేయుదురు? ఎట్లు జీవింతురు? ఆ సంవత్సరము జీవనోపాధికి నిలువ

యుంచుకొన్న ధాన్య మిట్లు దొరలపాలో దొంగలపాలో ఐనది. విత్తనములకై యేరి వేరుగా నుంచుకొన్నది కొంత భార్యాశిశువుల యాకలి తీర్చుటకు వ్యయపడినది. కష్టకాలముల కక్కఱకువచ్చు నని నేలలో భద్రముగా దాచుకొన్న ధనము పైకి తీసినను దానితో ధాన్యము వచ్చుతా వేడ నున్నది! అట్లే ఒకప్రక్క కడుపులో మాడుచున్నను, అలవాటుపడియున్నందున వదలలేక, తన భూమినంతయు గాకున్న నొక డొక మఱ్ఱుభూమిని మరియొక డొక ప్రత్తిభూమిని ఇంకొక డొక గడభూమిని దున్ని విత్తనములు చల్లి పైరు పెంచుచుండును. దహించెడి యాకలిబాధను, ఇంకను సర్వసమృద్ధముగా నున్న గోవులక్షీరములు త్రావియో మహిషీక్షీరము సేవించియో, కొంతకొంత చల్లార్చుకొనుచుండును. గొడ్డు మాంసములు తినుట కలవాటుపడినవా రింకను ఆంధ్రభూమిలో స్థిరముగా ప్రవేశింపలేదు. గ్రామములం దెల్లెడల పచ్చిక బీళ్లు సమృద్ధముగా నన్నవి. వాన లున్నంతకాలము వానికి తరుగు లేదు. పశుసంపద యింకను క్షీణింపలేదు. దొరలుగాని దొంగలు తోడుబోతులు గాని గడ్డి తినరుగదా! వారివెంట వచ్చిన యశ్వములు గజములు ఉష్ట్రములు ఒకటిరెన్నాళ్లెంత మేసినను గ్రామములోని గ్రాసమునకు కరవు రాదు.

కాని యిట్టి పశుసంపద యున్నను పశుపతులకు ఆ క్షీరములైనను పూర్తిగా త్రాగగలుగుదు మను నిశ్చయబుద్ధి లేదు. ఒకనికి గోష్ఠమునుండి కడవలలో పాలు వచ్చును. మరి యొకనికి గేదెలపాలు చేరును. ఇంకొక పేదవానియింటికి మేకపాలో గొఱ్ఱెపాలో వచ్చియుండును. ఇండ్లలోని స్త్రీలు కొందరు అవి కాచి తోడువేసి యుందురు. మరికొంద రింకను కాచుచుందురు. ఇంకొకచో నవి కాచు ప్రయత్నములో నుందురు. మఱొక్కచో నాకుంభములు వాకిటనే యుండును. వేరొకరొడ పా లింకను తీయుచునే యుందురు.

అంతలో నొక భటతండ మా గ్రామము వచ్చును. వారి యాజ్ఞచే తోడుకొనుచున్న పాలును కాగినపాలును కాగుచున్నపాలును కాగబోవుపాలును వాకిట నున్న పాలును తీయుచున్న పాలును అన్నియు కలసి యా వచ్చిన భటులపా లగును. ఆ పాలతోపాటు గ్రామములో గల కొన్ని వేటలుగూడ వారిపాలే యగును.

ఇట్లు సంక్షోభము పొందుచున్న ప్రాక్సముద్రతీరమండలములలో చీకటిలో వెలుగువలె గ్రుడ్డిలో మెల్లవలె బ్రాహ్మణాగ్రహారములు అపవాదములై విరాజిల్లుచుండెను. దేవబ్రాహ్మణద్రవ్యము లన్న నవి ముట్టుటకు జన మందరలో తీవ్ర మగు భయము కలదు. బ్రాహ్మణులును విస్తారముగా స్వధర్మము విడువలేదు. వేదశాస్త్రాధ్యయనములు యజనములు నింకను వారు పుష్కలముగా సాగించుకొనుచుండిరి. వారి కెట్టి భయమును లేదు. విద్వాంసు లైనవారికి జీవన మెట్లు గడచు నను చింత లేదు. అగ్రహారములలో పాడిపంటలు సమృద్ధిగా కలవు. అవి ఎవరికి రావలసిన భాగము వారు న్యాయముగా తీసికొనుచుండిరి. ధన మున్న విద్వాంసుడు పరులను ధనమునకై యాచించుట కొప్పుకొనలేదు. యాచనమే నికృష్టమైనది. దరిద్రు డగు విద్వాంసుడు తనకు దాతగా నుండగల సంపన్నుడితడని నిర్ధారణ చేసికొని యతనియొద్ద కరిగి తన

యవసర మెరిగించును. ఆ సంపన్నుడాయనకోరిక తీర్చుటచే తానును తన సంపదయు ధన్యమగు నను నిశ్చయబుద్ధితో నాతనికి కావలసినదానికంటె అధికముగా నీయబోవును. ఆ విద్వాంసు డందులో తన కవసరమైన దానికంటె నొక చిల్లిగవ్వయైన నెక్కువ ముట్టడు. ఇట్టి స్థితిలో బ్రాహ్మణాగ్రహారములలో పాడిపంటలకు తరు గేల యుండును ?

మరియు నా యగ్రహారములలోని స్త్రీపురుషాదులు కేవల కుక్షింభరులు కారు. అతిథులు అభ్యాగతులు ఆతురులు దీనులు ఆపన్నులు అనాథులు—ఎవరు వచ్చినను అగ్రహారికులు నిర్లక్ష్యభావమూనరు. వచ్చినట్టివారికి శుష్క వేదాంత వాక్కు లుపదేశించి పంపివేయరు. స్త్రీలు ఇండ్లలో పనులు చేసికొనుటకు గాని, వచ్చిన పైవారికి వండిపెట్టుటకుగాని ప్రాల్మాలరు.

'వండ నలయదు వేవురు వచ్చిరేని
అన్నపూర్ణకు నుద్దియా నతని గృహిణి'

అని వర్ణింపబడిన ప్రవరుని గృహిణివంటివారే బహుళముగా నా కాలమందలి ఇల్లాండ్రు. అగ్రహారములో ధాన్యగ్రాసము లున్నంతవరకు వచ్చినవా రక్కడనుండి క్షుధార్తులై వెనుదిరిగి పోరు. వేళ తప్పిపోయివచ్చిన దోపిడి మూకలకుకూడ అగ్రహారికు లన్నదానము చేయ వెనుకాడరు. మున్యాశ్రమములలో సహజశత్రువులగు మృగశార్దూలాదులు వైరములు దక్కి యొక్కచో సంచరించెడివని పురాణములలో చదువువాక్యము లానాటికి మనుష్యరూపు లగు మృగశార్దూలములకు మాత్ర మైనను ఇంకను ఆ యగ్రహారములలో ననువర్తించుచుండెను. ఆ దోపిడిగాండ్రు తెల్లవారు వేళ ఆ గ్రామము వదలి పోవుదురు. అట్లు పోవునప్పు డందులో నొక కొందరెవ్వరో అచ్చటి మేకనో గోవునో హరించి వెంట తీసికొనిపోవుదురు. ప్రొద్దు పొడిచిన తర్వాత ఆ గుంపులోని తక్కినవా రది గుర్తించి వెంటనే ఆ తస్కరుల శిక్షించి యా ద్రవ్యము మరల నగ్రహారమునకు చేర్పింతురు.

ఒక్కొక్కచో సాహసించి యొక నాయకుడు కతిపయభటులతో నగ్రహారము ప్రవేశించి యగ్రణిని సమీపించి నమస్కరించును. ఆ యగ్రణి యాతనికి తిరిగి నమస్కారమైన జేయడు; కూర్చుండు మనడు. దానితో నా నాయకునకు కొంత ధైర్యము సడలి తోడివారివంక చూచును. వారు మరొకవైపు చూతురు. కొంతవడికి వారు మరల కూడబలుకుకొందురు. మరల ధైర్యముచేసి యా నాయకుడు ఇంత ద్రవ్యము కావలె నని యగ్రణిని కోరును. ఆయగ్రణి శాంతముగా లోని కేగి పదిల పరచియుంచిన రాగిరేకుల శాసనము బయటికి తెచ్చి యిది సర్వకరపరిహారముగా ఈ మహారాజు మా పెద్దల కిచ్చినా డని చెప్పి దానిపై గల రాజముద్రిక చూపించును. అంతటితో సామాన్యముగా నా నాయకుడు తన భటతండముతో తరలి పోవును. కాక ఒకానొక డేరా జిచ్చె నని ప్రశ్నించును. అంతట నగ్రణి యి ట్లనును:

"ఏ రాజయితే నేమి నీకు? ఇది విన్నావా?

'యథా వ్యాసః:

స్వదత్తాం పరదత్తాం వా యో హరేత వసుంధరామ్,
షష్టిర్వర్షసహస్రాణి విష్ఠాయాం జాయతే క్రిమిః.

మురవలో పురుగులుంటవే, అవి ఎన్నడైనా చూచే ఉందువుగా. అంతకంటె అసహ్యమైన, విష్ఠాయాం, అరవై వేల యేండ్లు పురుగువై పుట్టడము నీకు సమ్మతమయితే మేమంతా మా అగ్నిహోత్రాలు మాత్రము తీసికొని పోతాము. మీరే ఈ అగ్రహారమంతా అనుభవించండిరా, కావలెనంటే భటాచోరా!"

ఆ మాట లనుచుండగనే అగ్రణిముఖములో కోపముతో నొకానొక యగ్ని పుట్టెను. ఇట్లున్నందున ప్రాణమానములు వదలవలసివచ్చు దినము లాసన్నమయినను అప్పటి కింకను రాలేదు. ఆ వచ్చిన భటులకు వారినాయకునకు నొక్కసారిగా భయ మావహిల్లెను. వారు వంగివంగి యా యగ్రణికి నమస్కరించి శాసనపురేకులు కన్నుల కద్దుకొని తుమాపణము చెప్పికొని క్రిక్కురుమిక్కురు మనకుండ ఆ గ్రామము దాటి బ్రతికితి మని యావలపడుదురు.

ఒక్కొక్కయెడ నట్టి నాయకుడు గ్రామములోనికి వచ్చి యచ్చట జరుగు సత్కథాకాలక్షేపము వినీతుడై విని యా యగ్రహారమునకు తాను దోచుకొనివచ్చిన ద్రవ్యము కొంత యీయబోవును. అగ్రణి యది చిరునవ్వు నవ్వుచు నంగీకరింపక నిరాకరించును. నాయకుడు బలవంతము చేయగా తుద కా యగ్రణి దానినార్తులై తన యగ్రహారములో తల దాచుకొన వచ్చిన యాగంతుకుల కిప్పించును. అట్లు తమ యొద్ద దోచుకోబడిన తమద్రవ్యమే తమకు మరల ప్రాప్తించుటయు కద్దు!

ఎక్కడనో కొన్నియెడల అగ్రహారములలో జొరబడి బాధించిన తండములును లేకపోలేదు. అట్టివారికి శీఘ్రకాలములో సంకటములు ప్రాప్తించును. అవి యందువల్లనే ప్రాప్తించినవని వారికి నిశ్చయభావము కలుగును. అట్టి శాస్తియే కలుగు నని యితరులకు వెరపు పుట్టును. ఈవిధముగా భయమువల్లనేమి, భక్తివల్లనేమి, అగ్రహారములు అలజడులు తప్పించుకొనుచుండెను. ఇట్టి పుణ్యగౌరవస్థానములలో నగ్రహారము లుండకున్నా నా కాలమున నప్పుడప్పుడు చెలరేగుచువచ్చిన రాచరికపు కల్లోలములతో తూర్పుతీరభూమి నిర్మానుష్యమై యుండెడిది.

ఈ చనప యట్టి కల్లోలభూయిష్ఠ మగు ప్రాచీసముద్రతీరమునుండి ఓరుగల్లు చేరికొనెను. అసలు మోసలపురమునుండి యొకటియు మోటుపల్లినుండి యొకటియు రెండు చనుపలు బయలుదేరి ఉపనదుల చేరికచే సంపుష్టములగు గంగాయమునా నదులవలె పెద్దపెద్దవై అవి రెండును బెజవాడలో కలసికొని యొకటిగా నేర్పడి యీ రూపము పొందియుండెను.

అందులో మోటుపల్లిలో బయలుదేరిన చనుప ధనద్రోలు చేరునప్పటికే అప్పటికి కొప్పెరుంజింగని సైన్యములు దక్షిణమునుండి త్వరలో రానున్నవని

యలజడిగా నుండెను. అప్పటికే శ్రీమల్లికార్జునపండితారాధ్యులవారి యాగ్రహము నకు గురియై యాధనదుప్రోలు సిరిసంపదలు తూలి కళావిహీనమై యుండెను. దివ్యా యతనములు పాడరియున్నవి. విశాలభవనములలో పెక్కింట అడవి పావురములును గబ్బిలములును నివాసముచేయుచున్నవి. ఉన్నత మంటపములు పండితగోష్ఠులు లేక కేవలముశిలారూపములుగా నున్నవి. వీధులలో జనులు పలుచపలుచగా మాత్రముండిరి. శిథిలమైన కోట ఎంత బాగుచేసినను దృఢపడి యుండలేదు. అందున్న చోడరాజుకు కొప్పెరుంజింగని నెదుర్కొను శక్తి గాని ఉద్దేశము గాని లేదు. అతడు ఆ పల్లవ రాజు సైన్యములు సమీపించినంతనే లొంగిపోయి పల్లవరాజుకు సాయపడుననీ జన శ్రుతి ప్రబలెను. సంపన్నులు తమ ధనధాన్యాదులే మగునో యను భయముతో సాధ్య మైనంతవరకు ధాన్యము దూరమునకును ధనము భూగర్భమునకును చేర్చుచుండిరి. వీధిలో కనబడిన కొద్దిమందిముఖములలో నెత్తురు లేదు.

ఇది ఎరిగి యా సార్థవాహాధ్యక్షుడు కలవరపాటుతో నితర సార్థవాహులతో రహస్యముగా సంప్రదించి తన చమూపను గొంటూరుమార్గము వడివడిగా పట్టించెను. ఆ సార్థము చేబ్రోలువరకు చేరునప్పటికి ఆపైన గొంటూరువైపు పోవుట క్షేమము కాదని యందున్న జాయపనాయకుని బంధువులు వారికి చెప్పిరి. వెనకనూయి, ముందు గోయి! ఆ సార్థవాహాధ్యక్షు డేమి చేయగలడు? వెంటనే అతడు తన సార్థమును కొంచెము వెనకకు త్రిప్పి సమీపముననే గల మంచాలాగ్రహారము చేర్చెను. ఆ యగ్రహారముప్రాపున సార్థమును విశ్రమింపజేసి యచ్చటి స్థలమార్గములను శోధించెను. తుద కాతడు చక్కగా విచారించి తన చమూపను మరియొక మార్గమున పట్టించి యచ్చట గల తుంగభద్ర యను చిన్ననదిని దాటించెను. అంతట వా రెట్లో నెమ్మదిగా తెనాలి చేరుకొనిరి. అచ్చటినుండి కొల్లూరు చేరి యక్కడ కృష్ణానది నుత్తరించి శ్రీకాకుళము చేరవలె నని వారి యూహ.

కాని యప్పటికే కొప్పెరుంజింగనికి ధనదుప్రోలులోని చోడరాజు దాసు డయ్యె ననియు పల్లవసేన రెండుగా చీలి ఒకటి కొల్లూరువద్దను రెండవది వెల్లటూరు వద్దను కృష్ణనుత్తరింప నుంకించుచున్న వనియే కాక తన సార్థముజాడలు చారులవలన నెప్పటికప్పు డాపల్లవులు తెలిసికొనుచున్నా రనికూడా సార్థవాహాధ్యక్షునికి తెలియవచ్చినది. మరియు పల్లవసేనలు గ్రామములను దోచుకొనుచున్నా రనియు వారి కెట్టి దయాదాక్షిణ్యములును లే వనియుగూడ తెలిసినది. సార్థవాహాధ్యక్షుడు కుప్పున కూలిపోయెను. ఎడమప్రక్కను గొంటూరునాగదేవుని దొంగల గుంపులు; కుడిప్రక్కను కొప్పెరుంజింగని పల్లవసేనలు; వెనుక ధనదుప్రోలులోని పిరికిచోడ రాజుబాధ! ఎట్లో ఒక రీతిని కృష్ణానది దాటి బెజవాడ చేరుకొన్న నేగాని తమ సరకులును ప్రాణములును దక్క వని స్పష్టమయ్యెను.

సార్థవాహాధ్యక్షుడు ముఖ్యు లగు నితరసార్థవాహులతో నాలోచించెను. వారు కూడబలుకుకొని ఉన్న అపాయస్థితి సార్థములోనివారి కందరకు తెలుప నిశ్చయించిరి. అది తెలియగానే సార్థములో పలువురు తమ సరకులతో తెనాలిలో

నను ఆ చుట్టుప్రక్కల గ్రామములను సర్దుకొనిరి. సాహసులైన తక్కినవారు పీమై నను ప్రయాణము ముందుకు సాగింపనిశ్చయించిరి. వారు పుష్కలముగా ద్రవ్యము వెచ్చించి యా చుట్టుప్రక్కల గ్రామములనుండి పలువురు భటులను సంపాదించిరి. శీఘ్రగమనమునకై అశ్వములను ఉష్ట్రములను మరికొన్ని విలిచిరి. ముత్యములు పవడ ములు దంతము చందనము కస్తూరి పట్టు నూలు మంజిష్ఠము—ఇత్యాదులగు నమూల్య వస్తుసంచయముతో బేరము చేయు వారలకు ధనము కేమి కొదువ ?

సార్థవాహు లాలోచించుకొని భటుల సముగ్రరక్షణతో శీఘ్రయానమున మధ్యేమార్గముగా ఆ పల్లె చేరి అపల్లె చేరి ఉంపవల్లి చేరుకొనిరి. అక్కడ పర్వత పార్శ్వమున నొక గొప్ప జైనవసతి కలదు. దిగంబరులు తపస్సు చేసికొనుటకై యందు మూడంతస్థులుగా కొండశిల్పులచే నద్భుతముగా తొలుచబడి గుహలు నిర్మింపబడి యుండెను. ఆ ప్రధానవసతి నావరించి మరి యెన్నియో వసతులును గలవు. వానిలో మహావిద్వాంసు లని దిగంతప్రశస్తి గల దిగంబరభిక్షువులు జైనగ్రంథములు పాఠప్రవచనములు చేయుచు సిద్ధసాధనము లొనర్చుచుండిరి. జైనదిగంబరు లందు నివాసములకు ఆ కాలమున 'వసతు'లను నామము సామాన్యముగా ప్రవర్తిల్లుచుండెను.

ఈ సార్థవాహోత్తముడు గొప్ప జినభక్తుడు. అతడు తనవెంట దంతముతో నిర్మించిన గోమఠవిగ్రహమును సగౌరవముగా తెచ్చుకొనుచు నిత్యము పూజించు చుండెను. ఆ విగ్రహ మాతనికి ప్రాణపద మైనది.

అత డుంపవల్లివసతి జేరగనే ముందుగ దంవలి ప్రధానాచార్యుని సందర్శించెను. ఆచార్యుల కాతడు ప్రణమిల్లుచు తనవెంట తెచ్చిన యమూల్యము లగు రత్నములును కాంచనమును కానుకగా నర్పించెను. ఆచార్యు డవి గ్రహించి యన్నిటిని ఆ వసతి కిచ్చివేసి యాతని నాశీర్వదించెను. కుశలప్రశ్నాదికము జరుగుసందర్భమున సార్థవాహోత్తము డా యాచార్యులకు తన సార్థమునవస్థ వర్ణించి శరణార్థియై రక్షింప వేడుకొనెను. ఆ యాచార్యు డాలకించి జాలిపొందెను. జాలిపడి యూరకొనక యారాత్రియే యా సార్థమును కృష్ణావేణ్ణానదిని దాటించుటకు నావికుల బిలిపించి సౌకర్యములు కలిగించెను. ఆ జైనవసతి యప్పటి కింకను గొంటూరునాగదేవుని బాధ పడలేదుకాని శీఘ్రముగా నేమి యాపదయైనను రావచ్చు నని యచ్చటి యాచార్యులు భయపడుచుండిరి.

ముందుగా నిర్ణయించినప్రకారము అర్థరాత్ర మగునప్పటికి సార్థములోనివారు కృష్ణవేణీతీరము చేరుకొని మొదటిజట్టువారు నావ లెక్కిరి. తెల్లవారువరకును ఆ నావలు సార్థము నావలికి దాటించుచుండెను.

తూర్పున తెల్లవారుచున్నది. సార్థములోని వాహనములును భారము లగు సామగ్రులును పడవ లెక్కినవి. ఈ తడవ నావలు దాటినచో సార్థ మంతయు దాటి పోయినట్లే !

పక్షుల కలకలముతోపాటు దక్షిణముగా నొక భయంకరనాదము వినవయ్యెను. తప్పెటలు, తాళములు, శంఖములు సింహ, నాదములు! ఏదో సైన్యమే యటునుండి వచ్చుచుండెను. ఐదువందలమంది కల ఆశ్వికదళము శీఘ్రగతి కృష్ణాతీరము చేరికొనెను.

అప్పటికి చనుపలోని చివరిభాగమువారి నావలు కృష్ణవేణిలో సగము దూర మైనను బోలేదు. సేనానాయకు లా నావల వెనుకకు త్రిప్పుడని నావికులను కఠినముగా శాసించిరి. సంజ్ఞలు కేకలు భయంకరముగా నుండెను. నావికు లేమి చేయను దోపక వెనుకాడుచుండిరి. ఈ సార్థవాహులు రేపటి కావల నెంతదూరమో పోవుదురు. నావికులలో, ఇక్కడనే కాపురములు చేయువారు వారి భార్యలు బిడ్డలు ఇక్కడనే కలరు. వారి ఇళ్లు గొడ్లు గోదలు నిచ్చటనే కలవు. సేనల యాజ్ఞలు ధిక్కరించి వారు బ్రదుకు టెట్లు? సార్థవాహు లెంత ధన మిచ్చినను దాని నేమిచేసి కొందురు తాము?

పడవలలోనివారు నావికులను బ్రతిమాలి భంగపడి విశేషబహూకృతులు చేయుదు మని యాశపెట్టిరి. సేనలవంక చూడవలదని ప్రార్థించిరి. నావికులకుగూడ నొక భయ మున్నది. ఇప్పుడు వెనుకకు త్రిప్పినను సేనలచే తమకు ప్రహరణములు తప్పవు! ప్రస్తుత మావలియొడ్డు చేరి యందే కొన్నాళ్లున్నచో నవంతరకర్తవ్య మాలోచించుకొనవచ్చును. ఎట్లైన నేమి? సార్థమంతయు నుత్తరతీరము చేరు కొనెను. అందులోనివారికి మల్లికార్జునునియు కటకదుర్గయు ప్రాపు సంప్రాప్త మయ్యెను.

మరి యిక మోసలపురమున బయలుదేరిన చనుపమాత్ర మింత యవస్థ పడలేదు. ఆ చనుపలోని సార్థవాహులు విదేశములనుండి వచ్చిన సరకులనే కాక యా చుట్టు ప్రక్కల పద్మసాలెలు నేసిన సన్నని వలిపెములును చిత్రచిత్రవర్ణములతో నద్దిన మనోజ్ఞవస్త్రములును విశేషముగా తెచ్చుచుండిరి. ఆ వస్త్రములును వలిపములును భారతదేశమం దంతటనే కాక దూరమున నున్న యవనరోమక తురుష్క దేశముల గూడ పేరుపడ్డవి. ఆ చనుప ఘంటసాల చేరునప్పటికే దూరమున నలజడులు జరుగుచున్న వార్తలు వచ్చెను. అందుచే వారు శీఘ్రగతి కొలనివీడు చేరుకొన దలంచిరి. అచ్చటికి చేరుకొన్నచో కొలనిరుద్రుని దుర్నిరీక్ష్యము లగు సేన లుండును. కాని యది వర్షాకాలము! కొల్లేటిలో కలియు బుడమేరు ఇత్యాది నదు లపాయకర ములు. వారు సాహసించి శ్రీకాకుళము చేరుకొనిరి. అప్పటి కావలియొడ్డున గల కొల్లూ రను నగ్రహారముసమీపమున కొప్పెరుంజింగని సైన్యములు విడిసియుండి కృష్ణవేణి నుత్తరించు ప్రయత్నములలో నుండె నని వారికి తెలిసినది. వెంట ఆ సార్థవాహులు బయలుదేరి పులి వెంటబడుచున్న మృగములవలె రాత్రింబవళ్లు విశ్రమింపక ఎడతెగని ప్రయాణములు చేసి బెజవాడ చేరుకొనిరి.

మోసలపట్టణమునుండి ఓరుగల్లు పోవుమార్గములో బెజవాడ పెద్దకూడలి! అక్కడ బలమైన కాకతిరాజసేనలు ప్రజారక్షణ చేయగలవు. అక్కడి సేనలను

కాలనివీడులోని సేనలను ఎదుర్కొన జంకియే కొప్పెరుంజింగడు తన పల్లవసేనలతో
దూరదూరమున తూర్పుతీరప్రాంతములనుండి ఈశాన్యముగా దండుపోవుచుండెను.

ఈ రెండు చనుపలు నిప్పటికి ఇరువదిరోజులక్రిందట బెజవాడలో కలసి
కొనెను. వాని యధ్యక్షు లిరువురును కలసియే యాపైన పయనము సాగింప నిశ్చ
యించిరి. వా రిరువురిలో ఎక్కువ యనుభవశాలి యగు మోసలపురసార్థవాహాధ్య
క్షుడే యాపైని సర్వసార్థాధ్యక్షు డయ్యెను.

వారు బెజవాడలో ధాన్యగ్రాసాదులు సంగ్రహించుకొనిరి. క్రయవిక్రయములు
కొన్ని పూర్తిచేసిరి. అంతట వారు బయలుదేరిరి. అచ్చటినుండియైనను మార్గము
శాంతముగా లేదు. సేనలబాధ లేకున్నను దోపిడిగాండ్ర బాధ తప్పలేదు. ఆ దోపిడి
గాండ్రు సామాన్యులా ? వారు సాయుధులు. వారికి వేళ లేదు. నిద్రించుచున్న
సార్థజనములపై నొకపరి పడి కొందరిని చంపి ద్రవ్యము కొంత హరించి పారిపోదురు.
ఇరుకుమార్గములగుండ నెల్లు నెడల నెల్ల వారి బాధ తప్పదు. అట్టి పర్వతమార్గములను
వనమార్గములను అనుసరించి సార్థమేగునప్పు డెల్ల అపాయము నెదుర్కొనవలసినదే.
ఎట్లో వారు జగ్గయ్యపేట చేరుకొనిరి.

అది యనాదిగా పట్టువస్త్రముల నేతకు పేరుపడ్డపేట. అచ్చటి వర్తకు లెం
దరో ఆ చనుపలో చేరి పయనము సాగించిరి.

అంతట కొన్నిదినములకు వారు పాకాల చేరుకొనిరి. అక్కడ కాకతిరాజ
న్యుల స్కంధావారము పెద్ద దొకటి కలదు. అక్కడ నున్న పెద్దచెరువు సౌఖ్య
దాయకముగా ఉన్నది. ఆవైపున నెట్టి యలజడియు లేదు. కాని యక్కడ వర్త
కులు చెల్లించవలసిన సుంకము లెక్కువ. ఐన నేమి ? ఇక్కడ నే భయము లేదని
సార్థవాహులందరు దీర్ఘనిశ్వాసము వదలిరి. వారు సుంకములు సక్రమముగా నన్నియు
చెల్లించిరి. అక్కడనే తమ సరకు లెన్నిటినో పొకడపెట్టిరి. చెల్లించిన సుంకముల
కంటె శతాధికముగా వా రచ్చట లాభము సంపాదించిరి.

అగ్రహారములు వసతులు ఘంటాపథములకు సామాన్యముగా దూరముగా
నుండెడివి. సార్థవాహులు రాజమార్గ మలజడిగా నున్నయెడలనెల్ల సమీపమున
గల అగ్రహారముల నాశ్రయించెడివారు. ఇట్లెన్నొ కడగండ్లు గడచి యా సార్థము
తుదకు ఓరుగల్లు పట్టణము చేరికొని తూర్పుద్వారముముందు నిలిచెను. అచ్చట నప్ప
టికే సిద్ధముగా నున్న స్థలసుంకాధికారులు శీఘ్రగతి సుంకములు నిర్ణయించిరి.
స్థలసుంకాధికారులకును వర్తకులకును భేదాభిప్రాయము రాకుండ నచ్చట శ్రీగణ
పతిదేవుల శిలాశాసనమే యొక టున్నది.

*..................

చందనము—తులం ౧ కి ఫలము.

కర్పూరము—వీశ ౧ కి ౨ చిన్నాలు.

జవాది—మాడపరక.

కస్తూరి—౧౦౦ చిన్నాల ౧క్కి చిన్నము.

.................”

సూర్యు డస్తమించెను. చీకటి పడిపోయెను. సుంకనిర్ణయమును బూర్తి కావచ్చుచుండెను.

అంతట ఏకశిలాపురపాలకు డగు మేచయనాయకుడే స్వయముగా పలువురు భటుల సమూహముతో నా చనుపయొద్ద ప్రత్యక్షమై సార్థవాహాధ్యక్షుని బిలిపించి యాతని యధికారపత్రము లడిగెను.

ఆ యధ్యక్షునికి పాకాల చేరినప్పటినుండియు చనుప కెట్టి భయమును లేదని ధైర్యము నెలకొనెను. రాజధాని చేరుకొన్నప్పటి కాధైర్యము శతగుణ మయ్యెను. అనుభవశాలి యగు నతనికి రాజపురుషు లన్న నెట్టి భయమును లేదు. అందుచే కొంత నిర్లక్ష్యము కలసిన గౌరవముతో నతడు తాను మోసలపురమునుండి తెచ్చిన యధికారపత్రాదులు మేచయ కీయబోయెను. మేచయ యవి స్వయముగా నందుకొనక వెంట నున్న గండని నిర్దేశింప నత డది తీసికొని వెనుకనున్న లేఖకుని చేతి కిచ్చెను. ఆ లేఖకు డవి చదివి వినిపింపబోవుచుండ మేచయనాయకు డాతనిపై తీక్ష్ణదృష్టి ప్రసరింపజేయ నాత డట్టె చదువుట చాలించెను.

ముందుభాగమున నిది జరుగుచున్న సమయముననే యా చనుపవెనుకభాగములో కొంత యలజడి వినవయ్యెను. మరుక్షణమున నలుముఖములనుండి కరదీపికలు ధరించిన రాజభటు లాచనుపను ముట్టడించిరి. ఈ యవినయమునకు సార్థవాహాధ్యక్షుడు నివ్వెరపోయి చూచుచుండెను.

అంతలో రాజభటులు ‘వీరు పారిపోవుటకు ప్రయత్నించుచుండిరి’ అని చెప్పుచు వెనుక నున్న కొందరు బేహారులను బంధించి తెచ్చి మేచయనాయకు నెదుట నిలిపిరి. మేచయ యా బంధితులను తన తర్జనితో నిర్దేశించుచు సార్థవాహాధ్యక్షుని బ్రశ్నించెను.

“వీ రెవరో ఎరుగుదువా?”

అధ్యక్షుడు వెంటనే యుత్తర మిచ్చెను.

“ఎరుగను. వారితో మాకు సంబంధము లేదు.”

మేచయ యా బంధితులవంక తీవ్రముగా తిలకించెను. వారు సార్థవాహాధ్యక్షునివంక ఆశ్చర్యము ప్రకటించు దృష్టులు పరపి మరల మేచయనాయకునివంక వీక్షించిరి.

మేచయ: “మీ రేల పారిపోవుచుంటిరి?”

వారిలో నొకడు: “రాజభటు లింద రొక్కసారి రాగా చూచి భయపడి పారిపోసాగితిమి.”

మేచయ : "రాజశాసనములు సంరక్షించు భటులను జూచిన అనపరాధులు భయపడుదురా ?"

మరియొకడు : "ప్రభూ, రాజభటు లందరు శాసనములు రక్షించువారేనా ? —మేము దారిలో ఎన్ని కడగండ్లపా లయినాము ? అందులో—"

ఇంకొకడు : "దొరా, రాజభటులను జూచి భయపడు నిరపరాధులును పలువు రున్నారు."

మేచయ : ఈ యధ్యక్షునికి తెలియకుండ మీ రీ చనుపలో నేల కలసితిరి ?"

మరల వారు బెదరుచు అధ్యక్షునివంక నొకమారు చూచి నాయకునివంక నొకమారు చూచి యొక్క త్రుటికాలము నిరుత్తరులైరి. అంతట నందులో నొక డి ట్లనెను.

"మా పేళ్లు అధ్యక్షుడు లెక్కలలో ఎక్కించుట మరచెనుకాబోలు !"

అధ్యక్షుడు ఆకస్మికముగా "దుర్మార్గుడా !"యని యందు కొనెను. అంత వరకును ఆ వర్తకవర్యునకు తన యనుమానాస్పదస్థితి గోచరించలేదు.

మేచయ : "ఈ సరకు లేమి ?"

అధ్యక్షుడు : "ఒకటా ? ముత్యములు, పవడములు, దంతములు, మంజిష్ఠము, కప్పురము, జవ్వాది, కస్తూరి, వలిపములు, అద్దకములు, పట్టునూలు, పట్టువస్త్రములు—"

మేచయ : "ఇంత విలువగల సరకులయొద్దకు క్రొత్తవారి నెట్లు రానిచ్చితివి ?"

అధ్యక్షుడు : "వా రెట్లు వచ్చిరో నాకును విచిత్రముగనే యున్నది—అయి నచో మీ సరకు లేవి ?" ఈ చివరి ప్రశ్న యాత డాబంధితుల నడిగెను.

బంధితులు పోయి కొన్ని శకటములు చూపి యివి మా వని చూపిరి. అందులో వలిపములును పట్టువస్త్రములును గలవు.

అధ్యక్షుడు నిర్ఘాంతపోయెను.

ఆ బంధితు లంతట నందలి సరకులను వివరముగా వర్ణింపసాగిరి. దానితో నధ్యక్షుడు నోట మాట రాక నిర్విణ్ణుడై చూడసాగెను.

మేచయ సూక్ష్మముగా నిట్లు పలికెను.

"ఇట్టి సందర్భములలో కొంతకాలము మీ రందరును ఈ సరకులతో సహా రాజభటుల స్వాధీనములో నుండుట యందరకు శ్రేయస్కరము !"

ఆ వర్తకు లందరు నివ్వెరపోయిరి. ఇన్ని గండములు గడచి బయటపడిన మనకు ఓరుగంట నీగతి పట్టిన దేమని వారు తమ విధిని దూరుచు బయలుదేరిన వేళను నిందించు చుండిరి. కొందరు బిగ్గరగా నేడ్వసాగిరి. కాని వా రేమి చేయగలరు ?

రాజభటులు వారి నందర జుట్టుముట్టి మోటుతనము లేని దృఢమార్గమున గోపుర

ద్వారము దాటించి జాగరూకులై చెరసాలకు నడిపించిరి. బంధితులు ప్రత్యేకముగా గంపని భటుల రక్షతో వేరొకప్రదేశమునకు గొంపోబడిరి.

ఇది యపూర్వము! ఒక్కసార్థముసార్థము నే యిట్లు రాజభటులు కొంపోవుట యశ్రుతపూర్వము. ఇంతప్రొద్దువేళ వెన్నెలలో, అనవసరముగా ఇన్ని దివిటీలతో, మేచయనాయకుడే స్వయముగా చెరసాలకు నడిపించుట యూహింపగూడ నలవి కానిది. మేచయనాయకుడు భ్రమపడుటయు ఓరుగంటివారలు భావింపరానిది. కాని ఇందరు వర్తకశ్రేష్ఠులు చెరసాలకు నడచుటకూడ దక్షిణదేశముననే భావింపరానిది!

ఇది యిట్లు జరుగుచుండగనే యారాత్రి రుద్రదేవమహారాజు భద్రదంతావళముపై నధిరోహించి మహావైభవముతో పురవీధుల నూరేగుచు పురకాంత లర్పించు నారతు లందుకొనుచుండెను. చంద్రుడు వెన్నెలలు పూలజల్లువలె కురియుచుండెను. సహస్రాధికమగు రతనాల దివిటీల కాంతిలో నా మహోత్సవము చూడ ఏకశిలానగరము, మహేంద్రు డైరావతము నెక్కి పురమేగు నమరనగరిని దలపించుచుండెను.



"వేశ్యాగృహేషు (సరసో) త్సవజాతచేష్టాః
శబ్దాఽకారి శుకశారి కలోరుశబ్దాః
సర్వాదిశో ముఖరయంతి దివా విటానామ్
కందర్పదర్పతరలార్ణవఘూర్ణచంద్రాః" హనుమకొండశాసనము

ఏకశిలానగరమున నా రాత్రి పండువెన్నెల కాయుచుండెను. వెన్నెలకు తోడై నగరమం దంతట వెలుగుచున్న దివ్వెల కాంతితో ఆ రాత్రి పగలే యనిపించుచుండెను. నగరమంతట సమ్మర్దముగా జనులు సంచరించుచుండిరి. ఐనను అన్నివాడలకంటె ఆనాడు వేశ్యవాటిక యధికజాగృతమై విశిష్టమైన శోభతో నలరారుచుండెను.

ఆ పురమున రాచనగరితర్వాత ఎక్కువ విలాససంపదలుకలది వేశ్యలవాడయే. ఆనాటి వేశ్యల కలాకుశలత యిట్టి దని యూహింపదగినదే కాని వర్ణింప సాధ్యము కాదు. అప్పటి జీవితములో గ్రామమునుండి రాజధానీనగరమువరకు ఎల్లెడల వేశ్యలు ప్రముఖస్థాన మలంకరించుచుండిరి. రాజగురువు లగు శ్రీవిశ్వేశ్వర శంభుదేశికు లొక యగ్రహారము కల్పించుచు అందు పదిమంది నట్టువకత్తెలకును ఇరువురు ముఖరులతోగూడ ఎనిమిదిమంది మద్దలవాదకులకును—ఈ పదునెనిమిదిమందికి ఒక్కొక్కరికి ఒక్కొక్క పుట్టిన్నర భాగ మేర్పాటుచేసెను. ఆంధ్రకవులు ప్రాయికముగా పురవర్ణనములలో ప్రత్యేకము వారవనితావర్ణనము చేర్చుటకు కారణము వారి భోగలాలసత యనదగదు. కర్మిష్ఠి యగు తిక్కనామాత్యుడు అయోధ్యాపురములోని వారవనితల నీవిధముగా వర్ణించినాడు.

"మవ్వంపుమేనుల జవ్వనంబుల కెంపుమిగిలిన చెయ్యుల మెఱుగుపెట్ట
నల్లన మధురంపుసల్లాపరచనకు లేతనవ్వున ననుబూత పూయ
నిడువాలుగనుదోయి నిగ్గుపారు కాంతికి గలికి క్రేగన్నుల నలువుమిగుల
లలితంబు లగు చిత్తముల చతురతలకు సరసంపునడవడి దొరలువుచ్చ
వెరవు గల్గి మనోభవువీరరసము - నిరతముగ గేర్పువాటించి కరువుగట్టి
పోసి చేసిన రూపులపోల్కి వారవనిత - లొప్పుదు రప్పురవరమునందు."

ఇక యోగీశ్వరు డగు ఎఱ్ఱయ వైకుంఠపురములోగూడ స్త్రీలను వర్ణించుచు నక్కడ వారవనిత లుండుట యసంభావ్యము గనుక వారి వర్ణనమే స్ఫురింపజేయుచు నేమన్నాడు ?

"తమ వాడిమాడ్కి కందర్పున కేపని యైన సాధించు దివ్యాస్త్ర మనగ
దమ తియ్యపలుకులు ప్రమదరాగాంబుధి దనరారు మవ్వంపుదరగ లనగ

దము వింత చెయ్వులు కమనీయకోపుల శృంగారతరువు తేజిసుడు లనగ
దము ముద్దునవ్వులు తమకంబు జీకటి విగిలించు నరిదివెన్నెల లనంగ
జొక్కుమందు లనగ సోయగంబులగను - లనగ సుఖము పెక్కు లనగ జాలి
యనుపమానమూర్తులై యుల్లసిల్లుదు - రంబుజాయతాక్షు లప్పురమున."
మరి భక్తాగ్రేసరు డగు పోతన భోగినిని,

"విద్యాసనాథోపేత సౌందర్యచాతుర్యవిఖ్యాత చంచద్గుణోపేత—" యిత్యాదిగా వర్ణించినాడు.

సభాపూజ్యు డగు పెద్దన ప్రవరాఖ్యు డుండు పట్టణమునే వర్ణించుచు—

"అచటి వెలయాండ్రు రంభాదు లైన నోరవు
గా నెకొంసన వారించి కడపగలరు
నాట్యరేఖాకళాధురంధరనిరూఢి..."
అని వెలయాండ్ర నందు చొప్పించినాడు.

మహాభోగమునను మహాయోగమునను స్వానుభవము గల ధూర్జటి భక్తు డగు ధూర్జటి శ్రీకాళహస్తిపురమున కామినీజనుల నిట్లు వర్ణించినాడు.

"పరిచితబంధనైపుణి, నపారకళానుభవప్రసక్తి, నా
దరసవివేకసంపద, సదార్థకవాక్యసుధానుభూతి, మో
హరహితవృత్తి, బ్రస్ఫురదనంగరహస్యవిచారబుద్ధి, న
ప్పురమున గామినీజనులు పొల్తురు రాగిజనంబు వోలికన్."

నిప్పాన దేశమున భరతఖండాచారముల నాకరించు నాచారము లనేకము కలవు. అందు సకలకలాకుశల లగు 'గెషా' స్త్రీలు అనాదిగా గౌరవస్థాన మలంకరించుచుండిరి. ఓరుగంటిలోని వేశ్యవాటిక లెట్టివి? "విద్వేషిభువనవిజిగీషారంభవిజృంభమాణరుఘునస్వజభుజపరాక్రమసముత్సాహనాటకప్రస్తావనా ప్రథమ నాందీశ్లోకంబు లగు వేశ్యవాటికానికటంబులు."

ఆనాటి వేశ్యలు పలువురు బహుకలాకుశలలు. వాత్స్యాయన ఋషి నాగరకవృత్తప్రకరణమున పేర్కొనిన గోష్ఠులు ప్రవర్తింపజేయుట కీ వేశ్యానివేశనములే ఆస్థానములు. శాస్త్రాభ్యాసము బుద్ధిపాటవము వాక్చాతురి సరసప్రవర్తనము ఏకత్ర సమకూడిన జనులు లేనిది యవి యెట్లు సాధ్యమగును? వేశ్యాభవనమునగాని సభామండపాదులందుగాని సమానము లగు విద్య బుద్ధి శీలము విత్తము వయస్సుగల వేశ్యలతో అనురూప మగు ఆలాపనములు ఆసనములు నొనర్చుట గోష్ఠి. ఆసమయముల వారు సమస్యల పూరింతురు. కావ్యసమస్యలు కళాసమస్యలు చర్చింతురు. ఆ చర్చ లైనపిదప పరస్పరానురాగాదరప్రదర్శనమునకై వస్త్రాదిదానము లొనర్చుకొందురు. మరియు ఆ పానకగోష్ఠులు ఒకమా రొకరి యింటను మరొక పర్యాయము మరొకరి యింటను పరస్పరభవనములలో సాగుచుండెడివి. ఆసమయముల మధుమైరేయములనే

గాక వివిధలవణములు ఫలములు తిక్తకటుకామ్లము లగు ఖాద్యములను వేశ్యలచే నారగింపజేసి తా మారగింతురు. మరియు నొక్కొకచో పూర్వాహ్ణమున నీ నాగరకుడు అశ్వముపై నెక్కి ముందువెనుకల వేశ్యల నిడికొని విభవానుసారముగా పరిచారకు లనువేష్టింప బయలువెడలి వనవిహార మొనరించి కోళ్ల గొఱ్ఱెపంకల మేషముల యుద్ధములు దర్శించి ద్యూతముతోడను నాట్యకేళీవిలాసాదులతోడను ప్రొద్దుపుచ్చి యపరాహ్ణవేళయందు తమ వనవిహారము ప్రదర్శించునట్లు శిరఃకర్ణ కంఠ ప్రదేశములలో పూగుత్తులును కిసలయములును అలంకరించుకొని మరల గృహాభిముఖుడై వచ్చుచుండును. గ్రీష్మకాల మైనచో జలక్రీడల కల్లే యేగుదురు. మరియు నాయా పర్వసమయములలో యక్షరాత్రి కౌముదీజాగరము అశోకోత్తంసిక ఇక్షుభంజిక మొదలగు నెన్నియేని గోష్ఠీక్రీడలు ప్రవర్తింపజేయదగిన వున్నవి. ఈ గోష్ఠి సమయములలో ధనవంతు లగు నాగరకులే కాక ధనము కోల్పోయిన విదగ్ధులుకూడ ఉపనాగరకులై పాల్గొనవచ్చును. అంతే కాదు. గ్రామవాసులుగూడ నందు చేరదగుదురు. ఈ గోష్ఠీసందర్భములలో ప్రయోగించు భాషలోకూడ నియమము కలదు. అదియెడ నత్యంతసంస్కృతము కాని అత్యంతము దేశభాషగాని అవలంబింపక మధ్యేమార్గమున ప్రవర్తింపవలెను. లోకవిద్విష్టములును స్వైరవిహారము గలవియు పరహింసాత్మకములును అగు గోష్ఠులను వాత్స్యాయనుడు నిషేధించినాడు. కాని లోకమునం దందరు బుద్ధిమంతులే యుందురా?

విద్యావతు లగు నంగనలు నాగరకుల భోగములకే కాక రాజకీయవ్యవహారములకు గూడ వైభవముగల దేశములలో అవసరమై యుందురు. దూరదేశములలో రాయబారములు జరుపువారు స్వయముగా సమర్థు లగుటయే కాక వారి భార్యలును గూడ విద్యావతులును సుందరాంగులును చతురలును ఐయుండు టవసర మనునది రాజ్యతంత్రజ్ఞులకు క్రొత్త కాదు. పాశ్చాత్యదేశములలో సంపన్నలును విద్యావంతులును నగు యోషిద్రత్నములు విందు లను మిషతో తమ భవనములకు కవులను గాయకులను చిత్రకారులను ప్రభువులను ఆకర్షించి తా మానందించి వారి నానందింపజేయుటయు అట్టి యోషలలో ఒకరి కొకరికి స్పర్థ లుండి ఒకరిని మించి యొకరుండవలె నని ప్రసిద్ధస్త్రీపురుషాదుల నాకర్షించుమార్గము లన్వేషించుచుండుటయు లోకవిదులకు క్రొత్తకాదు. అట్టి గోష్ఠులే కవితాశిల్పప్రపంచమునకే కాక రాజకీయ ప్రపంచమునకుగూడ ఉత్సాహ మొనగూర్చు కేంద్రములుగా నుండును.

భరతదేశమున కులస్త్రీ లెంత విదుషీమణు లైనను వారిని ఇట్టి జనోపయోగకార్యములకు ఉపయోగించు నాచారము లేదు. అందుచే ఈ ప్రయోజనములు సాధించుటకు వారవనిత లుపయోగపడెడువారు. వారకాంతలు వెలయాండ్రే కారు! వారే విదుషీమణులు, కలాకుశలలు, కవిత్వప్రవర్తకలు, విద్వజ్జనాభిమానలు. ఒక్కొక్కచో మహాభక్తురాండ్రు. గీతగోవిందకారు డగు జయదేవుడు భక్తాగ్రేసరు డైనచో ముద్దుపలని యాతనికి భక్తిలో తీసిపోవునా? వారవనితలలో

మహాభక్తురాండ్రు కలరు; యోగినులు కలరు. ఆ యనుభవమున్నందుననే ధూర్జటి కామినులకు యోగినులతో అభేదాధ్యవసాయము చేసినాడు. వారు మరియు రాజ్యతంత్రములో కీలకప్రాయులు. నిర్వీర్యమగు కాలములందును రాజ్యములందును సంఘములందును పూర్వము పటుత్వ మొనగూర్చిన సంస్థలే హీనస్థితిని పొందును. ఆ హీనస్థితినిబట్టి ఉత్తమకాలములలో నున్న యా వ్యవస్థలను నిందింపరాదు. తిక్కనాదిమహాకవులు వేశ్యాజనమున కింతటి ప్రధానస్థాన మిచ్చియుండుట వారి కాకాలమున గల యథోచితస్థానమే. కేవలము భోగలాలసులు శరీరకండూతి తీర్చుకొనుటకే ప్రధానముగా నుపయోగపడు పతితవృత్తి నుద్దేశించి వా రట్లు వర్ణింపలేదు. అందుచే ఏకశిలానగరమందలి వేశ్యవాటికలోనికి కవులు విదగ్ధులే కాక నీతివిదులును పండితులును శిష్టంమన్యులును ప్రవేశింప జంకరాదు. ఒక్కసారి యా వేశ్యల వాడలో లౌల్యము లేకుండ బ్రవేశించి చూచివత్తము. అందులో ఇది మహాపర్వము!

౧౬

ఇది శరదుత్సవసమయము. విజయదశమి. అందులో నీనాడు శ్రీరుద్రదేవమహారాజులకు యౌవరాజ్యపట్టాభిషేక మైనది. దానికై దేశదేశములనుండి ప్రభువులు ధనికులు విద్వాంసులు కవులు గాయకులు నటులు విదూషకులు కళాకుశలురు రాజధానీనగరమున సమావేశ మైరి.

చల్లగా వెన్నెల కాయుచున్నది. వెన్నెలసౌఖ్య మెరిగినవారు వెన్నెల ననుభవింపక నిదురింపగలరా? కాని ఈ వెన్నెలతీపి ఆస్వాదించు టెట్లు? వెన్నెలలో ఏకాంతముగ నెంత సంచరించినదాని యనుభూతి సాధ్యమగునా? అదిగాక వెన్నెల కూడ ఉద్దీపకవస్తువేకాని స్వయముగా రసత్వము పొందదగినది కాదు. అందుచే కౌముదీజాగర మను నుత్సవము ఆ వేళలో యుక్తమైనది. పూర్ణిమాదినములలో నా యుత్సవము సంపూర్ణశోభాయమానముగా నుండునుగాని పదవదశమినాడుగూడ దాని కభ్యంతరము లేదు. ఈ రాత్రి వేశ్యవాటికలో విశేషముగా కౌముదీజాగరమహోత్సవమే ఇంటింట ప్రవర్తిల్లుచుండెను.

ఆ వాడలో ఎన్నో ఉన్నతహర్మ్యములు గలవు. వానిముందు విశాలప్రాంగణము లున్నవి. వాని కనుబంధములుగా గృహోద్యానములు రమ్యమైనవి కలవు. అందులో జలవిహారములకు వాపీతటాకాదు లున్నవి. అందలి జలయంత్రములును జలనాళికలును అసంఖ్యాకములు. మరియు వనవిహారమునకును విశ్రమించుటకును గోష్ఠీవినోదములకును సైకతములును మంటపములును రత్నవితర్దికలును పొదరిండ్లును అచ్చటచ్చట నలంకరింపబడి యున్నవి.

కొన్ని మేడలలో సౌధోపరితలములనే గోష్ఠీప్రసంగములు సాగుచుండెను. కొందరు హర్మ్యాంగణముల గల మండపముల నుపవిష్టులై సంగీతగోష్ఠి సాగించుచుండిరి. కొన్నియెడల నుద్యానములలో బహువితర్దికలపై స్త్రీపురుషు లాసీనులై మధ్యభాగమున ప్రవర్తమాన మగుచున్న నర్తనము తిలకించుచుండిరి. కొన్ని యిండ్ల ముందు ఇసుకతిన్నెలపై నాగరకులు సుఖోపవిష్టులై విటవిదూషకులతో శృంగారహాస్యకాలక్షేపములు కావించుచుండిరి.

అర్ధరాత్ర మగుటకు ఇంకను రెండు గడియ లున్నది. స్వయంభూదేవాలయములోని ఘంటికానాదములతో కలసి రాజమందిరము ముఖసాలపైనుండి గడియారమున పదుమూడుగంటలు గణగణ మ్రోగినవి. శ్రీ రుద్రదేవమహారాజుల భద్రగజోత్సవము పూర్తి యైనది. మంత్రిసామంతదండనాథు లంతవరకు నా యుత్సవమున యువరాజును కొలిచియుండిరి. వా రందరకు నిప్పుడు విడుదులకు బోవ సెల వైనది. జాబిల్లి పశ్చిమాకాశమధ్యమునకు చేరుకొన్నాడు. వేశ్యవాటికలో దీపకాంతి హెచ్చినది. అందు ప్రతియింటను పరిచారికల రాకపోక లెక్కు వైనవి. గోష్ఠీమధ్య

మునుండి వేశ్యలు మధ్యమధ్య లేచివచ్చి వారికి నూతనాజ్ఞ లిచ్చుచున్నారు. ఇంతవఱకును ఉత్సవమువెంట నున్న మహారాజపురుషులు వినోదార్థము వేశ్యవాటికకు చేరు వేళ యైనది. అక్కడ కవి గాయక నటవిటవిదూషకాదులతో వినోదముగా ప్రొద్దుపుచ్చి నాగరకానంద మనుభవింపవలెనను కుతూహలము పెక్కుర కుండును. తమతమ ప్రియప్రభువులను రంజింపజేయుట కై వారవనిత లెంతయేని యుత్సుకత ప్రకటించుచుండిరి.

ఆ వారవనితావాటికలోని గృహములలో నెల్ల నున్నతమైనది మాచల్దేవి సౌధము. ఒక్క రాచనగరు తప్ప ఓరుగల్లున నంత యున్నతసౌధ మింకొకటి లేదు. మాచల్దేవి ప్రౌఢవయస్సున నున్నది. దాని కుటుంబములోనివారు అనాదిగా కాకతీయరాజకుటుంబముతో సంబంధము కలవారు. 'మాచల్దేవి' యనునది కుటుంబమున మూలనాయకురాలి నామము. ఆ నామము వారు పూజ్యతతో మరలమరల రెండుతరములకొకసారి పెట్టుకొనుచువచ్చినారు.

ఈ మాచల్దేవితల్లి గణపతిదేవుల యనుగ్రహము సంపాదించినది. గణపతిదేవులకు కుమారుడు లేడు. మాచల్దేవిని రాజవంశములో నాదరింప సాహసించువారు లేరు. అది సంస్కృతప్రాకృతకావ్యనాటకపురాణేతిహాసము లెన్నియో చదివినది. అలంకారశాస్త్రమునకు నాట్యశాస్త్రమునకు నిధి. చతుష్షష్టికళలలో దానికి అపరిచితమైనది లేదు.

అది యువకులనే గాక వృద్ధులనుగూడ నాకర్షించును. ధనవంతులైనను పేదలైనను బుద్ధిమంతులైనచో దాని కిష్టులే. ఏశాస్త్రములోగాని కళలోగాని ప్రతిభ కలవాని నది తన గోష్ఠికి వచ్చునట్లు చేయును. అది చూచుటకు ప్రతివారికిని సులభసాధ్యగా కనిపించును. అందుచే దాని గృహమున రాత్రి గడపినట్లు పలువురు సగర్వముగా చెప్పుకొనుచుందురు. కాని అది ఎంత సర్వసామాన్యగా కనిపించునో అంత ఆత్మనిగ్రహము కలది. దానికి కామతృష్ణయే లేదను బుద్ధిమంతులును గలరు. మఱికొందరు తాము అడిగినమాత్రముననే యది మోహతృష్ణ తీర్చెనని చెప్పుకొనువారున్నారుగాని యట్టివారు దానిచే నేకాంతమున నిరాకరింపబడి పరిభవింపబడినవారే. అట్లు పరిభవింపబడినవారు మరల దానివద్దకు ఇంకొకనాడు వచ్చినను వారి నది చురచుర చూచి పంపివేయదు. ఏమియు జరుగనట్లే ఆదరముగా వినోదకథాకాలక్షేపము చేయును. దాని ఇంటికి మూగుచుండు నాగరకుల కది యందినట్లే యుండియు నందరానిదై యుండును. దాన దాని యాకర్షణ శతగుణ మగుచుండెను.

మాచల్దేవి యానాడు తన క్రీడోద్యానములో చలువరాతిమండపమున సుపవిష్టయై యున్నది. పలువురు కవులు పండితులు నాగరకులు దానిని పరివేష్టించి యున్నారు. ప్రతివారును కూర్చుండుటకు నగిషీచేసిన పట్టుపరుపులు గల యాసనము లున్నవి. మండపమధ్యమున నొక దంతపీఠిపై నగరువాసించు నగ్నికరండ మున్నది.

పరిచారికలు సభాసదులకందఱకు కస్తూరి పచ్చకర్పూరము కుంకుమము ఇత్యాదులు గుబాళించు తాంబూలము లందీయ వారవి మరల మరలసేవించుచున్నారు. వారిలో నిష్ట మున్నవారికి మధుపాత్రలును వచ్చుచున్నవి.

కొంతతడవు ప్రతిమాల యను క్రీడ సాగినది. ఈ క్రీడలో చేరినవా రందరు మాలికాకారపముగా మంటపములో కూరుచుండిరి. అందులో మాచల్దేవి కాలికిప్రాస! అది శ్రీకారముతో ప్రారంభించిన యొక శ్లోక మెత్తుకొని చదివినది. దాని కంఠమున కు ముగ్ధులై యెల్లరు వినుచుండిరి. అంతలో నా శ్లోకము పూర్తి యైనది. దాని యంత్యాక్షరము 'భ'. ఆమె వామపార్శ్వమున గల నాగరకుడు భ యను నక్షరముతో ప్రారంభించు శ్లోక మొకటి చదివెను. అతడు పూర్తిచేసిన పద్యము నంత్యాక్షరముతో ప్రారంభించు శ్లోకమాతనితర్వాతివాడు చదివెను. ఇట్లు మాలగా శ్లోకములు సాగిపోయినవి. కాని మధ్యమధ్య దుష్కరము లగు నక్షరములతో శ్లోకములు పూర్తి యగును. దానితో ప్రారంభించు శ్లోకము దొరుకదు. తర్వాతవాని కట్టి దందుకొనుట చేతకాకపోవును. అట్టివా డోడిపోయినట్లు ! వాడు ముందు నిర్ణయించుకొన్న విధముగా అపరాధము వెంటనే చెల్లించుకొనవలెను. ఆచెల్లించు నపరాధమునకుకంటె మాలాభంగము చేసినందు కాతనిపై సహృదయులకు కలిగిన యసహ్యమున కాత డెక్కువ పరితపించును. గోష్ఠిలో నందరును శ్లోకములు గాథలు బహుశ్రావ్యముగా పఠించుచుండిరి. ఆ పాఠ్యపద్ధతి గోష్ఠి కెంతయేనియు నానందము సమకూర్చెను. ఓడిపోయినవానిపై మిగిలినవారందరు నొక్కమారు పరపు నవ్వుకలకలము మృదంగనాదముకంటె మనోజ్ఞమై మధ్యమధ్య వినిపించుచున్నది.

ఆపిమ్మట వారు కొంతసేపు ప్రహేళికలు సాగించిరి. మాచల్దేవి యచ్చటివారికీ ప్రహేళిక యొసగెను.

"వనే జాతా వనే త్యక్తా వనే తిష్ఠతి నిత్యశః
పణ్యస్త్రీ నతు సా వేశ్యా యో జానాతి స పండితః"

ఈ విధానమునకే తెలుగునాట పొడుపుకథ లను పేరువచ్చినది. 'ఇంతముండ లేదు, ఇల్లంతా నెత్తురే !'

పై శ్లోకములోని వనశబ్దము నానార్థములు సువ్యక్తములైనందున పలువు రది 'నౌక' అని చెప్పివేసిరి. 'మీరు పండితులే !' యనుచు మాచల్దేవి వారిలో ముందు చెప్పినవానిని కాశ్మీరసేలువతో నలంకరించెను.

ఒక రిట్లు దండ్యాచార్యుల కావ్యాదర్శమునుండి ప్రారంభించిరి.

"అత్రోద్యానే మయాదృష్టా వల్లరీ పంచపల్లవా
పల్లవే పల్లవే తామ్రా యస్యాం కుసుమమంజరీ."

ఆ ప్రారంభించినవాడు ఒక యువకవి. అత డెంతకాలమునుండియో మాచల్దేవియాస్థానమందలి గోష్ఠుల కరుదెంచుచుండును. అత డెప్పుడు వచ్చినను సిగ్గు

పడకుండ మాచల్దేవిముఖాబ్జముననే మాచల్దేవికరాబ్జములనే మాచల్దేవిపదాబ్జములనే దృష్టి నిలిపియుంచును, మాచల్దేవియునతని చూపులకు కోపింపదు. అతని వెకిలిచూపును చూచి నవ్వుకొనుచుండును. ఈ శ్లోక మానాడు చదువగానే మాచల్దేవి పెద్దగానే నవ్వెను.

"అభినవదండిగారూ, మీరు చూచిన యా కల్లరి యీ మాచల్దేవియేనండీ!" అని చెప్పివేసెను. ఆమెపదపల్లవములు కరపల్లవములు అధరపల్లవము నిరంతరము ధ్యానించు నా కవి వెంటనే యొక ముత్యాలహేరు మాచల్దేవికంఠమున నలంకరించెను.

అంతలో ప్రతీహారిణి వచ్చి పెద్దలు వచ్చినా రని మాచల్దేవికి నివేదించెను. మాచల్దేవి స్వయముగా లేచి వారి నెదుర్కొన బోయెను. ఆ వచ్చినది జాయపసేనాపతియును బద్దెనయు. వారి నది యెంతయేని గౌరవాదరములతో నెదుర్కొని తోడి తెచ్చెను. వారినిరువుర మండపముపై సుచితస్థానముల నుపవిష్టుల గావించి శ్రీగంధ మిప్పించి తాంబూలకరండములు స్వయముగా నది వారిముందుంచెను.

జాయప కుశలప్రశ్నాదిక మైనపిమ్మట గోష్ఠీవిశేషములు ప్రశ్నింప వా రానాడు కౌముదీజాగరోత్సవము చేయుచున్నా మని యంతవరకు జరిగినది తెలిపిరి. జాయప సంతోషము వ్యక్తపరచి యిట్లనెను:

"నేను మరొక వినోద మిప్పుడే యూహించితిని. మీలో ఇక్కడ నృత్యము తెలిసినవా రెందరు?"

జాయప యా ప్రశ్న వేయగా నచ్చట నెవ్వరును తమకు వచ్చు ననలేకపోయిరి. మాచల్దేవికే సాహసము లేక యిట్లనెను.

"ప్రభూ, మీఎదుట నాట్యము వచ్చునని ఎవరు చెప్ప సాహసింతురు?"

జాయప: "నే నేమీ పులిని గాను. వినోదమునకు వచ్చినాను. నీకు నాట్యము వచ్చునుతే. మిగిలినవారి కేమాత్రమువచ్చినను చూచి సంతోషింతును—"

ఆమాటలతో నచ్చటివారికి ధైర్యము కలిగెను. మాచల్దేవి చెలికత్తెలే కాక యా గోష్ఠిలో పలువురు పురుషులుకూడ మాకు వచ్చునని ముందుకు వచ్చిరి. బద్దెనయు తనకు వచ్చు ననెను.

జాయప వారి నందర పురుషుడు స్త్రీ, మరల పురుషుడు తర్వాత స్త్రీ, ఇట్లు పర్యాయముగా నిలుచుండ నియమించెను. వారి యందరకాళ్లకు గజ్జెలు శ్రుతికి తంబుర, మృదంగాదులు అరగడియలో సర్వసంపన్న మగు మాచల్దేవిసౌధమునుండి పరిచారికలు తెచ్చి సిద్ధముచేసిరి.

తంబురప్రణవనాదము సాగెను. జాయప పుష్పబాణవిలాసమునుండి యీ శ్లోక మందిచ్చెను.

"కాంతే యాస్యతి దూరదేశమితి మే చింతాపరం జాయతే
లోకానందకరోపి చంద్రవదనే వైరాయతే చంద్రమాః
కించాయం వితనోతి కోకిలకలాలాపో విలాపోదయమ్
ప్రాణానేవ హరంతి హంత నితరాం మారామమందానిలాః"

"ఇది ముందొకరు వచ్చి యభినయింపవలెను. ఇంకొకరీతిగా నదే తర్వాత వారు అభినయింపవలె. అట్లే పరిపరివిధముల నందరు!—ముందు బద్దెన!"

బద్దెన ముం దభినయించెను. తర్వాత నదే యొక యువతి మార్పుతో నభినయించెను. పిమ్మట చిత్రకారు డొక డదే మరియొక విధమున నభినయించెను. ప్రౌఢ యంతట నింకొకతీరున నభినయించెను. గాయకు డంతట నందుకొనెను. లతాతన్వియొకతె యాపిమ్మటను, పూర్వోక్తయువకవి యంతటను వరుసగా నెందరో పరిపరివిధముల నభినయించిరి. అందరలో తుదకు మాచల్దేవి పరిపక్వమోహకముగా నభినయించి మరల శ్లోకములో నొక పద మందుకొని యభినయించెను. తర్వాత వారందరు నొక్కొక్క శ్లోకభాగమే యభినయించిరి. తుదకు మాచల్దేవి నృత్యముతో నందరుకలసి పూర్తి కావించిరి. అంతయు పూర్తి యగునప్పటికి అందరు భరతతన్మయు లైరి.

జాయప: "ఇది నృత్తప్రతిమాల!"

మాచల్దేవి: "నృత్తరత్నావళికర్తలకే ఇట్టి నవ్యప్రతిమాలలు భాసించు చుండును!

అది పూర్తియగుటకు ముందే యాప్రదేశమున నొక యజ్ఞాత పురుషుడు వచ్చి కూరుచుండెను. ఆ వచ్చిన వాడా క్రీడ నెంతో వ్యగ్రుడై తిలకించుచుండెను. అతని నచ్చట చూచినప్పటినుండియు జాయప కేలనో ముళ్లమీద కూరుచున్నట్లుండెను. ఇత డెవడు? ఏ దేశస్థుడు? ముందు తెలుపకుండ లోనికి వచ్చు స్వాతంత్ర్యమెట్లు వచ్చినది? వచ్చినవాని నెట్టి యభ్యంతరము లేకుండ నెట్లుండ నిచ్చిరి? ఇక్కడికి తరుచుగా వచ్చుచున్నవాడా? ప్రథమపర్యాయము నేడే వచ్చెనా? ఎంతకాలము నుండి వచ్చుచున్నాడు? ఈ యాలోచనాపరంపరలో జాయప క్రీడావిలోకనమున మధ్యమధ్య పరాకుపడసాగెను.

మాచల్దేవి యది గ్రహించెను. కాని యాతని యాందోళన మెంతమాత్రము నుపశమింపజేయ యత్నింపలేదు. తా నది గ్రహించినట్లుగూడ జాయపకు తెలియ కుండ ప్రవర్తించెను. నృత్యానంతరమున బద్దెన సిగ్గుపడుచు దిక్కులు తిలకించుచుండెను. అతని కక్కడి కామినుల మనోజ్ఞాకారములు ఆ వెన్నెలకాంతిలో కలసి గంధర్వలోకములో నున్న భ్రాంతి కలిగించెను. వారి నర్మవాక్కులు చెవుల బడి నప్పుడెల్ల ఆ యువకుని చిత్తము భ్రమింపసాగెను. ఉద్రేక మెక్కువైనకొలది యాతని సిగ్గును అతిశయించుచుండెను.

ఆతని సర్వచేష్టలును నూతనపురుషుని నాకర్షించెను. ఆతడు మాటిమాటికి బద్దెనవైపు చూడసాగెను. బద్దెనమాత్ర మాతని గమనించినట్లే లేదు.

ఆ నూతనపురుషుడును సర్వవిధముల జిత్రమైనవాడే! అతడు ధరించిన వస్త్రము లీవైపువివలె నున్నను కట్టిన తొడిగిన విధానములు వేరు. అతని నవ్వు వేరు. అతని మాట వేరు. అతని తీరే వేరు! అతనికి స్త్రీపురుషభేద మున్నట్లే కాన్పింపదు. నడివయసువాడు. కాటుకకన్నులు. పసినిమ్మపండువంటి దేహచ్ఛాయ. కొసదేరిన యున్నతనాసము. విశాలమై మనోజ్ఞమగు ఫాలము. అతడు మాచల్దేవివంక చూచినను దాని చెలికత్తెలవంక చూచినను లౌల్యము కాని కొంకుకాని ద్యోతము కాదు. చిరపరిచితు డగు నాప్తమిత్రమువలెనే అతడు సంచరించుచుండెను.

చంద్రాస్తమయ మయ్యెను. ఆవేళకు సరిగా నచ్చుటికి మేచయనాయకుడు వచ్చెను. మాచల్దేవి యాదరముతో నెదురేగి గౌరవముతో నాతని తోడ్తెచ్చి కూర్చుండజేసెను. మరల నిష్టకథాగోష్ఠి సాగుచుండెను.

అంతలో కొంతవడికి పర్వతనాయకు డరుదెంచెను. ఆతని నూతనోద్యోగమున కందరు నాతని నభినందించిరి.

“మహారాజ్ఞియంగరక్షకులకు ఇప్పటికి తీరిక యైనది కాబోలు!” మాచల్దేవి ప్రశ్నించెను.

అందరును పర్వతనాయకునివంక నీక్షింపసాగిరి. పర్వతనాయకుడు తన్ను కానట్లే మహారాజ్ఞియంగరక్షకు డిక్కడ ఎవరా యని చూచుచున్నట్లు ఆ నూతన పుషునివంక జూడసాగెను.

మరల మాచల్దేవికంఠము వినిపించెను.

“మహారాణుల యంగరక్షకులు పలుకకున్నా రేమి?”

అందరును పర్వతనాయకునివంక జూచిరి. ఆతడు తన్నుగాక యా నూతన పురుషుని నడిగినట్లే యాతనివంక జూచెను.

నూతనపురుషుడు పర్వతనాయకుడు మతిలేనివా డని భావించినట్లు నిరసనము మిశ్రమైన యొక నవ్వు నవ్వెను.

జాయపనాయకుడు సూక్ష్మముగా మాచల్దేవితో నిట్లనెను.

“మాచల్దేవీ, నీకు మతిభ్రమణ మెన్నాళ్లనుండి కలిగినది?”

ఆ మాటలు మాచల్దేవి నుద్దేశించి యన్నట్లున్నను నిజముగా పర్వతనాయకుని వంక నిరసనదృష్టితో చూచుచు నవ్విన యా నూతనపురుషుని నుద్దేశించిన వని తజ్జ్ఞులకు ధ్రువపడెను.

నూతనపురుషుడు: “స్త్రీలకు మతిభ్రమణము సహజముగదా!”

మాచల్దేవి తలయెత్తకుండ మాటాడెను.

"స్వామీ, భ్రమించుటకు నాకు ముందు మతి యున్నదందురా, మీ రుభయులును ?"

చేరినవా రందరు పక్కున నవ్విరి. మరల మాచల్దేవి యందు కొనెను.

"జాయపనాయకులు మతిభ్రమము నొందిన నాకు సరిగా గుర్తు చేసిరి శ్రీరుద్రదేవమహారాజుల యంగరక్షకుల కిప్పటికి తీరిక యైనదా ?"

పర్వతనాయకుడు చిరునవ్వుతో 'అవును !' అనెను.

ఈమారు సభ్యులందరు నూతనపురుషునివంక జూచి నవ్వసాగిరి. శ్రీరుద్రదేవ మహారాజులను మహారాజ్ఞి యన నొప్పునా ?

కౌముదీజాగరణము సాగుచున్నది. వృద్ధుడగు జాయపనాయకునకు కొంచెము కునికిపాట్లు ప్రారంభించెను. పలుమారు లతడెట్లో దేహము సరిచేసికొని లేచు చుండెను. తుద కాతడు బద్దెనతో కలసి బయలుదేరిపోయెను. బద్దెనయు నాచోట నున్న తరుణుల సాహచర్యము వదలలేక వదలలేక కలవరించుచున్నవానివలె జాయప వెంట విధిలేక సాగిపోయెను.

గోష్ఠిలోనివారు ఒకరిపై నొకరు సందేహముతో ప్రవర్తించుట మర్యాదకు భంగము. సరసుడగు నాగరకు డది చేయడు. ఆ నూతనపురుషునికిని పర్వతనాయ కునికిని ఒకరిపైనొకరికి ద్వేషమో అనుమానమో మరియేదియో విరుద్ధభావము మనస్సులలో నంకురించెను. కాని గోష్ఠీమర్యాదకు భంగముకాకుండ ప్రయత్న పూర్వకముగా నా భావము ప్రత్యక్ష మొనరింపకుండిరి.

కొంతవడికి ప్రసంగములతో నందరకు విసువు జనించెను. తెల్లవారుట కింకను ఎనిమిదిగడియల ప్రొద్దున్నట్లు రాచనగరిమోసాలపై గడియారమునుండి గంటలు విననయ్యెను. అప్పుడు ద్యూతమునకై పలక అక్షములు తెప్పించిరి. ఆపై నుమ్మాద్ద్యూతము సాగెను. ఇందు ముఖ్యముగా పర్వతనాయకునకు నూతనపురుషునకు స్పర్థ యతిశయించెను.

ఇం దెంత స్పర్థ ప్రదర్శించుచున్నను నూతనపురుషుడు మనస్సులో తొణకక పందెము లొడ్డుచుండెను. అతడు పెద్దపందెము లొడ్డడు. పర్వతనాయకుడు పెద్ద పందెములు వేయును. ఆతని పందెము లెంత పెద్దవైనను నూతనపురుషుడు జంకడు కాని స్వయముగా నాతడు పెద్దపందె మొడ్డడు.

జూదములో గెలుపోటములు సామాన్యముగా అదృష్టదురదృష్టములపై నాధారపడియుండు నను ప్రథ కలదు. అది పూర్తిగా అపప్రథ కాదు కాని యందులో గూడ స్థిరబుద్ధి కలవారికి గెలుచుట కెక్కువ యవకాశ మున్నది. తొందరపడువారు ఒకానొకప్పుడు విపరీతముగా గెలిచినను సామాన్యముగా నోడిపోవుదురు. తొందర

పాటుచే పర్వతనాయకునికి ద్యూతక్రీడలో ఓటమియే మరలమరల సంభవించెను. ఆతనివద్ద నున్న ధనము అమూల్యాభరణములును అన్నియు నోడిపోయెను. అవి ఒక్కొక్కటే నూతనపురుషుని హస్తగతమగుచున్నకొలదియు నాతనికి గెలువవలెనను వాంఛ తీవ్రము కాజొచ్చెను. దానితోపాటు తొందర హెచ్చెను. అంతట మరల నోడిపోసాగెను. రిక్తుడై పర్వతనాయకుడు మాచల్దేవి నడిగి అప్పుచేసి అదియు నొడ్డి యోడిపోయెను. మరల నాతడు మాచల్దేవి నప్పడిగెను.

మాచల్దేవి యాతని గావనకుండ వారించి తానే యా నూతనపురుషునితో సుహృద్ద్యూతమునకు గడంగెను. చిత్రముగా నాక్రీడలో మాటిమాటికి నూతనపురుషుడే విజితుడు కాసాగెను. మాచల్దేవి పర్వతనాయకు డోడిపోయిన సమస్తద్రవ్యమును ఆభరణములే కాక ఆ నూతనాగతుని ద్రవ్యముకూడ విశేష మొడుచుకొనెను.

ఆసమయమున మరల పర్వతనాయకుడు మాచల్దేవిని తనకు ద్యూతమునకు కొంత యప్పిమ్మని యడిగెను. అది విని నూతనాగతుడు ఏకసక్కెముగా "నీ నూతనోద్యోగము పణముగా పెట్టి నాతో నాడుము !" అనెను.

ఆ మాటలు వినినంతనే పర్వతనాయకుడు కోపోద్దీపితుడై నిలువున లేచెను. కుబుసము కప్పిన కాలసర్పమువలె నాతని యొరలో నున్న ఖడ్గము నాతడు చివ్వున పెరికి యా నూతనపురుషుని దానితో ప్రక్కను చరచెను. అది యాతని ఖడ్గయుద్ధమునకు ఆహ్వానించుట ! ఆ పురుషుడును వెనుకాడక నిలువున నిలుచుండి 'ఇదిగో శాస్తి చేసెదను' అనుచు తన యొరలోనుండి ఖడ్గము తీసెను.

మాచల్దేవియు నందు జేరిన నాగరకులును తీవ్రముగా అలజడి నొందిరి. ఉభయులను వారించుటకు వారెంతయు యత్నించిరి. కాని ఇద్దరును వినలేదు. నూతనపురుషుడు క్షమాపణము చెప్పుకొనడు. పర్వతనాయకుడు ఆతని అవినయము క్షమింపడు. వారి యుత్తరములతో నొకరిపై నొకరికి రోషము పెరుగసాగెను. మాచయనాయకు డందులో నెట్టి జోక్యమును కలిగించుకొనలేదు.

చంద్రాస్తమయమై చాలసే పయినది. చీకటి ఏకశిలానగరవీథుల నెల్లెడ బర్వియుండెను. కాని దివిటీల వెలుగులో మాచల్దేవివసమంతయు దేదీప్యమానముగా వెలుగుచుండెను. అందులో విశాలమై వర్తుల మగు నొక పచ్చికబయలు వారిరువురు చేరిరి. గోష్ఠిలోని సభ్యులుగూడ వారి ననుగమించిరి.

ఆ ప్రదేశము కౌముదీనృత్యమునకు అనువుగా నిర్మించిన విశాలప్రదేశము. చుట్టును ప్రేక్షకులకు చంద్రశిలానిర్మితము లగు శిలావేదిక లున్నవి. ఆ నాట్యరంగమున నీనాడు ఖడ్గనాట్యము సాగినది.

ఇదియును క్రీడాయుద్ధము కాదు. ఒకరినొకరు జయింపవలెనను నిచ్ఛయే కాక ఒకరినొకర రంతమొందింపవలెనను నిచ్ఛలతో వారిరువురు ఆ రంగములో ప్రవేశించిరి. ముందుగా వారుభయులును తమ స్వేచ్ఛచే ఆత్మగౌరవసంరక్షణార్థము

ద్వంద్వయుద్ధము చేయబోవుచున్నా మనియు నందులో నోడినవారిపక్షమున గెలిచినవారిపై నెట్టి చర్యయు తీసికొన నవసరము లేదనియు పత్రములు వ్రాయించి మేచయయొద్ద నుంచిరి. మేచయయే వారిరువురమధ్య మధ్యవర్తిత్వము నెరపెను. ఇద్దరి ఖడ్గములు విషదిగ్ధములు కానట్లు మధ్యవర్తి స్థిరపరచు నవకాశ మప్పుడు లేకున్నందున నాత డిరువురఖడ్గములు ముందు దూరముగా పెట్టించెను. మాచల్దేవియింట పెద్ద యాయుధశాల కలదు. అందుండి మేచయ యనేకఖడ్గములను ఫలకలను తెప్పించి ఎవరికి కావలసినవానిని వారి నేరుకొం డనెను. వారిరువురు ఎవరి కనుకూలమగు ఖడ్గము ఫలక వారు గ్రహించి రంగములో ప్రవేశించిరి. రంగము చుట్టును కరదీపికలు విశేషముగా పట్టించి రంగమున నెట్టి ఛాయలును పడకుండ కల్పింపబడెను.

పర్వతనాయకుడు జూదములో ప్రదర్శించిన తొందరపాటెంతమాత్రమును ఖడ్గయుద్ధములో ప్రదర్శింపలేదు. అందుకు తోడై యాతని యున్నతకాయమును ఆజానుదీర్ఘబాహువులును బహువిధముల నాతని కుపకరింపసాగెను.

నూతనపురుషుడుకూడ ఖడ్గయుద్ధములో నేర్పరియే. అతని కెన్నియో విద్యలతోపాటు ఇదికూడ నభ్యస్తమైనది. ద్యూతములో నున్న జాగరూకత ఖడ్గయుద్ధములో నేమాత్రము నతనియొద్ద గోచరింపలేదు. నేర్పుకంటెను నిలుకడకంటెను అందు రోషమే మిక్కుటమయ్యెను. అదియుగాక ఆతనికి కొంచెము వయస్సు ముదిరిన ట్లున్నది. యుద్ధములో శరీరపాటవముకూడ తక్కువగా కనబడుచుండెను. పావుగడియకే అతడు రొప్పసాగెను.

ఖడ్గయుద్ధవిశారదు డగు పర్వతనాయకున కాతనితో యుద్ధము క్రీడాప్రాయముగా నుండెను. యుద్ధవిద్యలో నింతటి నీచుని తన ఖడ్గముతో తెగనేయుట తనకే యవమానకరమను భావ మతని కుదయించెను. అందుచే నతని నంతమొందించు యత్నము మాని యరగడియకూడ జరుగకపూర్వమే పర్వతనాయకుడా నూతనపురుషుని హస్తములోని ఖడ్గము దూరమున బడిపోవున ట్లెగురవేసి యొక్క దాటున పైకి లంఘించి యాతని క్రింద పడవైచి రొమ్ముపై కాలుంచి కోసివేయుటకు ఆతని శిరోజములు పట్టుకొనెను. చిత్రముగా నా నూతనపురుషుని శిరోజబంధమునకు పర్వతనాయకుని ఖడ్గస్పర్శ కాకముందే ఆ శిరోజము లొక్క కట్టగా నాయకుని ఎడమచేతిలోని కూడివచ్చెను. దానితో సర్వముండితమగు నూతనపురుషుని శిరస్సు చూపర కాశ్చర్యమును అసహ్యమును కొలిపెను.

పర్వతనాయకుడు అట్లు తన చేతిలోనికి వచ్చిన యాతని నిర్జీవకృత్రిమశిరోజబంధమును వికృతాట్టహాసముతో దూరముగా వైచి పండ్లుకొరుకుచు లేచి యవి తన కాలితో మట్టగించెను. అంతలో నూతనపురుషుడు చివ్వున లేచి దూరమున బడిన తన ఖడ్గమునకై రివ్వున పరుగిడెను.

వెంటనే మేచయ యిరువుర నాఘ డని యాజ్ఞాపించెను. మాచల్దేవి యెంతయేని మెలకువ చూపి యప్పటి కానూతనపురుషుని చేతికందిన ఖడ్గము ఒడిసిపట్టుకొని తీసికొనెను. ఆ పట్టులో బల మున్నది. లాలిత్య మున్నది. మూర్ఖించినను నూతన పురుషు డది లాగికొనజాలడు. చూచువారి కామె యది యాతనియొద్దనుండి మర్యాదగా తీసికొన్న ట్లున్నదికాని బలవంతముగా పుచ్చుకొన్నట్లు లేదు. మాచల్దేవికి వాక్చాతురి నృత్యచాతురితోపాటు ఆయుధచాతురికూడ కలదా!

మేచయనాయకుడు ప్రశ్నించెను.

"మాచల్దేవీ, మా కీతనితో ముందుగా పరిచయము చేయలే దేమి?"

మాచల్దేవి బదులు చెప్పెను. "ఇతడు ఒకానొక మహానుభావుడు. మహాయోగి. భగవత్సాక్షాత్కారమే పొందె నందురు."

విజయదశమినాడు రుద్రమదేవి ఎప్పుడో తెల్లవారుజామున నిదుర లేచినది. తదాదిగా భద్రగజోత్సవము పూర్తియగువరకు నామె కొక్క క్షణ మైనను తీరిక లేదు. అనుక్షణమును దేహమునే కాక మనస్సునుగూడ ఆత్మవశమున నుంచు కొనవలసియుండెను. ఒక్క కదలికలోనేని పొరపాటు రాగూడదు. ఒక్కమాటలో ప్రమాదము పనికిరాదు. మహారాజు పరాకుపడిన ప్రజలకు విపరీత నష్టము సంభ వింపవచ్చును. స్వయముగా నా మహారాజుకును ప్రజలలో గౌరవము తగ్గిపోవును. మహారాజు సజీవమగు సుత్సవవిగ్రహ మాయెను !

సామ్రాజ్యమంత్రములు భూదేవులు చెప్పుచుండ గణపతిదేవులును గురు దేవులును మహామంత్రిదేవులును త న్నా నాడు అభిషేకించిరి. అభిషేకప్రారంభమున మహానందతన్మయత యామెకు కలిగినది. కొంతసే పట్లే అభిషేకము చేయగా మొదటియుత్సాహ మామెకు మందగించినది. తుదకు నది తాను నిత్యము సేయు స్నానముగానే తోచినది. దేహమునకు ఉదకస్పర్శమే !

ఆ సాయంకాలవేళ మహాప్రధానసామంతదండనాథులు పేరోలగమున తనకు విధేయత ప్రకటించుచు ప్రతిజ్ఞలు చేయుచుండ ముం దామెకు వీరోత్సాహము కలిగినది. కాని తరువాత తరువాత ఒకేవిధముగా పలువురు ప్రమాణములు చేయుచుండ నవి యంగీకరించుటకూడ విసుగైనది. మధ్యలో వీరభద్రేశ్వరులను బంధించుటకు పంపిన యాజ్ఞ రాకున్నచో కునుకుపాటుకూడ వచ్చి యుండును. ఆ యాజ్ఞ తనకు నూతనముగా ప్రాప్తించిన రాజత్వము ఎంత కర్కశ మైనదో స్పష్టముగా ద్యోతక మొనర్చినది. ఒక్క సారిగా ఆమెసర్వాంగములు సుద్బుద్ధ మైనవి.

ఆ పిమ్మట పారువేట కొంత వినోదము కలిగించినది. ఆ రాత్రి తన్ను భద్రగజముపై మంత్రిసామంతాదులు పరివేష్టించి యూరేగించిరి. భద్రగజాధి రోహణము చేయుచుండ తనకు హృదయములో నావేగము కలిగినది. క్రొత్త గౌరవము లభించువారి కెవరికి అట్టి యావేశము కలుగదు ? చేరిన పెద్దలందరు 'జయ జయ రుద్రదేవ మహారాజ !' యని జయజయనినాదములు చేయగా తన హృదయ ములోనుండి పాదములకును పాదములనుండి శిరస్సునకును అనంతకోటి జయజయ నినాదములు ప్రతిధ్వనించుచు పైకిని క్రిందికిని సంచారములు చేయుచున్నట్లు తోచినవి. మరల జయనినాదములు వినవచ్చినవి. అవి విన్నప్పుడు మొదటి యానం దము లేదు. మరల వినవచ్చినవి. మరల వినవచ్చినవి మరల—మరల -- ఇట్లనేక పర్యాయములు వినవచ్చినకొలదియు ఆమాటల కర్థమే లేనట్లు భాసించినది. అవి కేవల మేవో ధ్వనిమాత్రములుగా భాసించినవి. తుద కీయుత్సవ మెప్పు డయిపోవునను తొందర యావహించినది. ఎట్లో ఉత్సవము పూర్తియైనది. మంత్రిసామంతాదులను సెల విచ్చి పంపివేసినది. అంతటితోనైన నామెకు స్వాతంత్ర్యము చిక్క లేదు.

ఇప్పుడు తాను మూర్ధాభిషిక్తరాజన్యమూర్తి. అంతఃపురములో భోజన నివాసములే కాక శయనీయముకూడ నియమబద్ధముగా గాని స్వీకరింపరాదు. అక్కడ రక్షణకు సర్వసంపన్న మొనర్చి గాని అంగరక్షకుడు సెలవుతీసికొనలేదు.

ఇన్నిటితో రుద్రమ యారాత్రి మిక్కిలి ప్రొద్దుపోయి కాని నిదురింప వీలులేక పోయెను. రాజధర్మముప్రకారము మహారాజు అభ్యంతరమందిరమున నేకాంతముగా నిదురింపవలెను. అతివిశ్వాసపాత్రు లగు రక్షకులే యపు డుండవలెను. వారును దూరమున నుండవలెను. అట్లు నిదురించుటయు స్వల్పకాలమే కర్తవ్యము. అది యును ఆదమరచి నిదురింపరాదు.

రుద్రదేవమహారాజుకు నిదురబుచ్చ పంపెంపుపాటలు పాడిన వైణికులు పర్వతనాయకునివెంటనే సెలవు పుచ్చుకొని వెడలిపోయిరి. దూరమున రయ్యమయూ కామసానియు తమ మందిరములలో నిదురింపబోయిరి.

రుద్రమ శయ్యపై మేను వాల్చగనే నిదురపట్టలేదు. ఒక్కమారు గవాక్షము నుండి కనిపించు స్వయంభూదేవుల దేవాలయశిఖరమువంకను నాలుగుగోపురముల వంకను చూచి భగవద్ధ్యానముచేసినది. స్వయంభూలింగేశ్వరాలయమునకు ఆవల ఉన్నతమైన ఏకశిల కానవచ్చినది. ఆ శిలపై చిన్నజ్యోతి ఉన్నది. జ్యోతికి క్రిందుగా నా శిల బ్రహ్మరక్షస్సువలె భయంకరముగా తోచినది. అంతలో నామెకు నిద్రపట్టినది.

రుద్రమ కొంతపడి అట్లు సుఖనిద్ర నొందెను. ఆమెకు ఒంటబట్టిపోయిన కామందకనీతివాక్యములు చిత్రముగా సుషుప్తిలోగూడ నామె కొక మెలకువ కూర్చెనో! కాక స్వప్నావస్థ సంభవించెనో! ఏమోకాని యామె కిట్లు భాసించెను.

తాను విజన మగు నొక మహారణ్యమార్గమున బోవుచున్నది. అది మిక్కిలి సన్నని దారి. కంటకలతాగుల్మములు పైని కప్పుకొని పడుచుండగా నెమ్మదిగా అవి తప్పించుకొని తాను ముందుకు సాగిపోవుచున్నది. అంతలో నా వనమధ్యమున నిష్కంజలతాతరు వగు విశాలప్రదేశ మొండు చేరికొని యామె నిట్టూర్చుచు పరాకుగా నున్నది. ఆకస్మికముగా నలుగెలకులనుండి భైరవగర్జనములు వినవచ్చినవి.

తా నెన్నిమారులు వేటపోయినది? ఎన్ని రకముల కుక్కల దా నెరుగును? పొడుగుమూతివి గుండ్రని ముఖము కలవి పొడుగుకాళ్లవి ఉన్నతమైనవి పొట్టివి పిక్క బలము కలవి సూక్ష్మముగా పసిపట్టగలవి నడిచేయనివి విలాసార్థమే ఉపయుక్త మగు నవి—ఎన్నిజాతులో ఆమె ఎరుగును. వేటకాండ్రు వాని నెన్నోవిధముల ప్రయోగించి యాఖేటమున దనకు సాయ మొనర్చువారు. వేట కవి యవసరములు, అలంకారములు. మరి యవియే వేటాడబడు వన్యముల కతిభయంకరములు.

నే డీ కుక్కలు పూర్వ మట్లు కావు. నలుమూలలనుండి ఇవి తనపైకే కవియుచున్నవి. ఇప్పుడు తానే వేటాడబడు జంతు వైనట్లున్నది. సేనాధిపు నెదిరించు

సైన్యములవలెనే యవి నీతి తప్పినవి. అంతే కాదు. శునకలక్షణము లామెకు కరతలా మలకములు. అదియు నామె యాచార్యులయొద్ద నృపవిద్యలతోపాటు క్షుణ్ణముగా నభ్యసించినది. ఇవియో ? తా నెన్నడు కనిగాని వినిగాని యున్నవి కావు. శాస్త్ర ములో చదివినట్టివిగూడ కావు. ఇవి యసలు శ్వానములేనా ?

శ్వానములేకాని యివి యీ లోకములో నెవ్వరు నెక్కడ నెన్నడు నెరిగినవి కావు! ఆ స్వర్గలోకమునుండి దిగివచ్చినవా ? పాతాళగహ్వరములనుండి పై కెక్కియే వచ్చినవా, ఇవి మరి ? పెద్ద పెద్ద దేహములు ! ఆ దేహములును నిడుపు లగు రోమములతో దట్టముగా నిండియున్నవి. అవి సమీపించుచున్నంతనే ఒకానొక ఏవగింపు పుట్టి ఒడలు జలదరించుచున్నది. దానితోపాటు ఒక చిత్రమగు భయమును కలిగించుచున్నవి. వీని భాంకారమే వేరు! కుక్క లిట్లెక్కడనేని మొరుగునా ? ఇవి కుక్కలు కావు, పిశాచము లైయుండును. కాక కాలభైరవుడే యీ యాకార ములు దాల్చివచ్చియుండునా ?

"తీక్ష్ణదంష్ట్ర మహాకాయ కల్పాంతదహనోపమ
భైరవాయ నమ స్తుభ్యం............

ఎట్టి యపాయములందైన భయపడకుండుట రుద్రమ చిన్ననాటనుండి యల వరచుకొన్నది. అన్ని భయములకు మూలకారణము ప్రాణభీతి! మృత్యుభయము లేని వారి కేభయము నుండదు. పవిత్రకార్యములు ఉన్నతకార్యములు సత్కీర్తికర కార్య ములు చేయుట కుద్యమించుట యామె నేర్చుకొన్నది. అనృత మన్న హైన్యమన్న జుగుప్స నేర్చుకొన్నది. ఈ శరీరము ఉదాత్తకార్యకరణమున కంకిత మొనర్చుట యామె యలవరచుకొన్నది. రాజోత్తములు తమ సర్వస్వము ప్రజాక్షేమమునకు అర్పిత మొనర్పవలె నను విధి యామెయాచరణలో నున్నది. ఇక నామెకు భయ మేల యుండును ?

నిర్భయముగా నామె యా చుట్టిన శునకముల నదలించెను. ఐనను అవి వెను కాడక పైపైని కవియుచున్నవి. కొన్ని యామెకాళ్లు పీకుటకును మరికొన్ని పార్శ్వములను ఇకకొన్ని బాహువులను ఒకటి శిరస్సునే పట్టుకొనుటకును ఉంకించు చుండెను. రుద్రమకత్తిదూసెను. దానితో నొకదాని తల నరకెను. ఇంకొకదాని ముందుకాళ్లు తెగవేసెను. మరియొకదాని ప్రక్కలు గంటుచేసెను. వేరొకదాని కంఠమున దూసికొనిపోవునట్లు పొడిచివేసెను. కొండొకదాని తలనుండి తోకవరకు చీల్చివైచెను.

కాని చిత్రము! తల తెగినదానికి మరల తల యదుకుకొన్నది. ముందుకాళ్లు పోయినదానికి ముందుకాళ్లదుకుకొన్నవి. బరులు చీలినదానికి బరులు యథా ప్రకారమున్నవి. కంఠములో పోటువడినది స్వస్థమై యున్నది. నిలువున జీలినది నిలువున నిలిచియేయున్నది.

శ్రీరామచంద్రమూర్తి ఎన్నిమారులు తెగనేసినను రావణుని తల లిట్లే మొలచెనా? భీమసేనుడెన్నిసారులు చీల్చిపారవేసినను జరాసంధుని దేహపుచిప్ప లిట్లే యతుకుకొనెనా? ఇవి నిజముగా పాంచభౌతికశరీరము లున్న సారమేయములేనా? కాక కేవల మంధకారమే యీ రూపముల నవతరించెనా?

రుద్రమ మరల వానిని చీల్చివేసెను. మరల నవి కలసికొనెను. మరల నవి యాటోపముతో నామెపై కవియసాగెను. అవి యామెదేహమును కోరలతో చీల్చియేవేసెను. కాని యంత తీక్ష్ణము లగుకోరలతో నవి తన శరీరమును జీల్చుచున్నను తనకు బాధ లేదేమి? తన కాయమునుండి కండలును నెత్తురును వాని నోటి కందుచునేయుండెను. అవి తాకినప్పుడెల్ల తనకు జుగుప్స కలుగుచున్నది. ఎంత జుగుప్స! ధర్మాత్మునకు అనృతముపై కలుగునంత జుగుప్సయే అప్పు డామె కావహించుచున్నది!

ఇది కలయా? నిజమా? ఇంత ప్రత్యక్షముగా చూచుచున్నది చెవులకు వినబడుచున్నది కల యెట్లగును? కలలో నిట్టి యాలోచన లెన్నడైన గలుగునా? ఆమె ఏకాకిని. ఎంత ధీరయైనను, భయమువంటి యొకానొక వృత్తి యామెచిత్తాంచలముల నడుగిడసాగెను. ఆ కుక్కలను నరుకనరుక నామెబాహువు లలసట నొందుచుండెను.

అంతలో నా వనాంచలములయం దొక పురుషమూర్తి గోచరించెను. ఒక్కక్షణకాల మామె యావైపు పేరాసతో చూచెను. మరుక్షణమున జూడగా ఆ పురుషుడే తనపై నా భైరవముల నుసికొలుపుచున్నట్లు ఆమెకు స్పష్టమయ్యెను. ప్రకృతిసిద్ధ మగు వీరావేశముతో నా సారమేయముల సరకుగొనక రుద్రమ ఖడ్గము త్రిప్పుచు నా పురుషునిపై కురికెను.

సమీపింపగా, నేమి యాశ్చర్యము, అది వీరభద్రేశ్వరుని మూర్తి, తన భర్త యాకారమే! ఆమెవిజృంభణ మాకస్మికముగా నాగిపోయినది. అప్రయత్నముగా నామెకంఠమునెంట గంభీరమైన స్వరము వెలువడెను:

"మేచయనాయకా! ఇతని నింకను బంధింపలే దేమి?"

దాని కా వీరభద్రేశ్వరుడు కహకహధ్వానముతో పెద్దపెట్టున నవ్వెను. అది నవ్వా? సకిలింపా?

రుద్రమమాటలును వీరభద్రేశ్వరుని సకిలింపును అంతఃపురమెల్లెడ ప్రతిధ్వనించెను!

* * *

ఇంతవరకును రుద్రమ తాను కన్నులతో చూచుచుంటి ననియు చెవులతో వినుచుంటి ననియునే భావించుచుండెను. కాని యిప్పుడు చూచుచున్న విధానమును

వినుచున్న విధమును వేరు. ఇప్పుడు అంతఃపురమునం దంతట ప్రవృత్తమైన సందడియే వేరువిధముగా వినబడుచున్నది. ఇప్పుడు చూడగా తా నరణ్యములో లేదు. ఆ యరణ్యమధ్యమండలి విశాలప్రదేశము లేదు. తన శయనమందిరములో హంసతూలి కాతల్పమున శయనించి యున్నది. పర్యంకసాలభంజికలు యథాపూర్వముగనే దర్శన మిచ్చుచున్నవి. తన దేహమునుండి యా కుక్కలు కొరికి వేరుచేసిన మాంసభాగము లన్నియు సరిగనే యున్నవి. కుక్కలును లేవు! కాని యామె దృష్టి కెదురుగా వీరభద్రేశ్వరుడుమాత్రము సుఖాసనమున గూర్చుండి యున్నాడు!

అంతలో కామసానియు రుయ్యమయు ఖడ్గములు చేబూని అడావుడిగా నేతెంచిరి. ఉపచారములు చేయు కుబ్జ వారివెంట వారిని కలసికొనవలె నను నావేగముతో ఒక ప్రక్క కొరగి రెండవ కాలు త్వరత్వరగా ఎగురవేయుచు చేత నొక చీపురు ధరించి వచ్చెను. అంతఃపురరక్షకు డగు క్లీబవిదల్లుడును శీఘ్రగమనమున వచ్చెను.

"ఎవరిని బంధింపవలె, తల్లీ ?" యని యా విదల్లుడు ప్రశ్నించెను.

రుద్రమ వీరభద్రేశ్వరునివైపు నిర్దేశించుచు చూచెను. రుద్రమచూపుల నను సరించి యాతడు వీరభద్రేశ్వరుని నక్కడ జూచి యాతనికి నమస్కరించెను. వీర భద్రేశ్వరుడు బంధనార్హు డని యాత డెరుగడు.

కామసాని రోషావేశముతో వీరభద్రేశ్వరు నెన్నియో నిష్ఠురోక్తు లాడెను. వీరభద్రేశ్వరుడు ప్రత్యుత్తర మీయలేదు.

"దొంగవలె ఇక్కడికి వచ్చితి వేమి ?—హంతకుడవా ?—పిలువనిదే వీల ఇట వచ్చితివి ?—పలుకవు, చెవుడా ?—నోరేమైనా పడిపోయినదా?—పిశాచమువా మనిషివా?—"

ఎన్ని యన్నను బదులు పలుకడు. మౌనము !

కామసాని ఖడ్గముతో నాతని పొడువనుంకించి ఎడమచేతితో గొంతు పట్టు కొనెను. అతడు ఎదురుతిరుగలేదు. వెనుదీయలేదు. కామసాని యాతని గొంతుపై చేయివేసినది. కాని గొంతు చేతికి పట్టు చిక్కదే! వీరభద్రేశ్వరుని గొంతులోనికే యామె వ్రేళ్లును చేయియు పోయెను. కాని యామెచేతికి అది తాకిన స్పర్శ జ్ఞానమే లేదే!

"ఇది మనిషి కాదు, పిశాచము!" అని కామసాని కెవ్వున కేకవేయుచు వీర భద్రేశ్వరుని యుదరములో కత్తితో పొడిచెను. కత్తి లోపలికి పోయినది. కాని రక్తము చిమ్మలేదు. ఆ వీరభద్రేశ్వరుని శరీరము చెక్కుచెదరలేదు.

"చచ్చినవారు దయ్యము లగుట ఎరుగుదుము. నీవు బ్రదికియుండియే దయ్యమ నైతివా !"—ఇట్లనుచు కుబ్జ తన చేతిలోని చీపురుతో వీరభద్రేశ్వరుని ఒడలెల

పోదెను. రుద్రమదేవియు రుయ్యమయు నా యగౌరవము జరుగకుండ వారింప బోయిరికాని యందు కవకాశము లేకపోయినది. కుబ్జచేతులే ముంచాయెను.

ఇదియంతయు రుయ్యమ కొండొకతడవు నిర్విణ్ణయై చూచుచుండెను. మరి యొకతడవు ధ్యానించెను. వీరభద్రేశ్వరు డిచ్చటికి వచ్చు మార్గము లేదు. ఇదియొక కల్పితమూర్తి. ఇంతమంది కిది యొక్కసారి భాసించుచుండుట చిత్రమే. ఇంద్రజాల మిట్టిదై యుండు నందురుగదా!

మరుక్షణమున రుయ్యమకు ఒక ప్రతిక్రియ బుద్ధిలో భాసించెను.

"అమ్మా!"

రుద్రమ: "ఏమి తల్లీ?"

రుయ్యమ: "శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులను ఒక్కసారి చిత్తములో దృఢముగా స్మరించుకోవే అమ్మా!—వారు మొన్న నా కొక మహామంత్ర ముపదేశించి ఆపదలో రక్షార్థముమాత్రమే యుపయోగింపు మని యాదేశించినా రమ్మా!"

ఇట్లనుచు నామె రుద్రమశయ్యాసమీపమున గల విభూతి చేనందుకొని యభిమంత్రించి రుద్రమదేవిదేహమున నలదెను. రుద్రమదేవి శ్రీ విశ్వేశ్వరశంభు దేశికుల పాదపద్మముల చిత్తములో ధ్యానించెను.

అంతట న ట్లభిమంత్రిత మగు భూతిని ఒక్క చిటికెడు తీసికొని రుయ్యమ ఎదురుగా నాసనమున సుఖోపవిష్టుడైన వీరభద్రేశ్వరమూర్తిపై చిలుకరించెను.

వెంటనే ఆ వీరభద్రేశ్వరమూర్తి యా గాలిలోనే కలసి పోయెను. ఆసనము వెనుక నున్న చీకటిలోనికే మాయమయిపోయెను!

౧౮

పూర్ణిమనాటికి ఏకశిలానగరమున కొంత సందడి తగ్గెను. త్రిపురాంతకుడును జన్నిగదేవుడును సోదరుడగు నంబదేవునికి తమ మండలముల లెక్క లందజేయు భారముకూడ నప్పజెప్పి మహాసైన్యములతో పల్లవపాండ్యచోళసేనల నెదుర్కొను వీరోత్సాహముతో కదలి చనిరి. పలువురు సామంతులు మండలేశ్వరులు రుద్రదేవ మహారాజుల సెలవుగై కొని తమతమ ముఖ్యస్థానముల కేగిరి. కొలని రుద్రుడు కొలనివీటి కేగెను. అన్నమంత్రికూడ వెడలిపోవ నుంకించెను గాని రాజధానీనగరము విడిచిపోవ నాతనికి రాజానుజ్ఞ రాలేదు.

ఆ మరునాడు శ్రీరుద్రదేవమహారాజు అంతరంగికమందిరమునకు తిక్క చమూపతిని అన్నమంత్రిని అంబదేవుని బిలిపించి యేకాంతమున వారితో మంత్రించు చుండెను. ఆ యేకాంతమందిరము బహుచిత్ర మైనది. అక్కడ గూరుచున్న నగర మంతయు గనబడుచుండును; కూరుచున్నవారును నగరమంతటనుండి కానరావచ్చును గాని గుర్తించు టరుదు.

ఏకశిలానగరమధ్యభాగమున స్వయంభూ తేశ్వరస్వామియాలయ మున్నది. ఆ దేవాలయము నాలుగు గోపురద్వారములును కోటనాలుగుద్వారముల కెదురుగా నున్నవి. ఈశ్వరుడు సర్వతోముఖు డైనను ఈశ్వరాయతనము దక్షిణముఖముగా నున్నది. ఆ మహాయతనమునావరణకు బాహ్యప్రదేశమున దక్షిణభాగమున ఈశ్వరుని మహాసరోవర మున్నది. సరోవరజలములంటి స్వయంభూదేవాలయమునకు ఇన్నూరు విండ్ల దూరమున నాగ్నేయభాగమున నొక మహాశిల కలదు. కోటలో నీశాన్యభాగ మున మరియొక గండశిల కలదుకాని యీ మహాశిలయే యందున్న ఏకైకశిలగా భాసిం చును. పూర్వ మీనగరము చిన్న పల్లెగా నుండునప్పుడే బాటసారు లాసరస్సుచెంత గల తోటలో విడిసెడువారు. అప్పుడు అది ఎక్కడ నున్నదని క్రొత్తవా రడిగినప్పుడు సంస్కృతము వచ్చినవారికి, 'అదిగో ఏకశిల కనబడుచున్నదే యక్కడ!' అని నిర్దేశించువారు; ప్రాకృతులకు, 'అదుగో ఓరుగల్లు కనబడుచోట'సే'అని చూపెడి వారు. అదియే మహాపట్టణ మైనతర్వాత ఏకశిలానగర మైనది. కేవల మది నగరము నడిబొడ్డున లేకున్నను ఉన్నట్లే భాసించును.

ఆ మహైకశిలపైకి బోవుటకు తూర్పున గల చిన్న మార్గమున దప్ప మానవ సాధ్యము కాదు. మిగిలిన యన్నివైపుల నది చెక్కకుండగనే చెక్కివేసినట్లు నునుపుగా ప్రపాతమై ఒడుదుడుకుగా నుండును. అందుచే కోట కట్టునప్పుడే కాకతీయప్రభువులు దానిని ఉపలక్షించి క్రీడాశైలముగా చేసినారు. పైకి దారిగల ప్రాచీదిశను క్రిందిభాగమున క్రీడావనము వేయించి యందు జక్కని లీలామందిర ములు నిర్మించి చుట్టును ఉన్నతప్రాకారము నిర్మించిరి. ఆ దారికి వచ్చువరకు శిలపైకూడ రాతిగోడలు కట్టినారు.

కాకతీయుల క్రీడాశైల మగు నీ యేకశిలయుపరిభాగమున గల మండపములే బహుళముగా వారి మహామంత్రశాలలు. అక్కడ నున్నవారికి కనబడకుండ నెవ్వరు వినగలుగు దూరమునకు వచ్చుట యసాధ్యము. అది నగరమధ్యమున నున్నను నగరోపరి గలదు. అందుచే నచ్చట బహుప్రశాంతముగ నుండును. అచ్చట కూరుచున్నవారి దృష్టి యేకశిలానగరప్రాకారముకూడ దాటి వారికి దూరమున వాయవ్యముగా గోవిందరాజస్వామిగుట్ట కనిపించును; దానికి పడమరగా హనుమకొండకొండలును దాని సమీపముననే శాయంపేటకొండయు చూడవచ్చును. ఇంకను దూరమున ఉనుప రాతిగట్టును పూర్వము హిడింబాశ్రమ మండెడి దని ఐతిహ్యము కల రెండు స్తంభముల యాకారము కల గుట్టయు నందుండి కానవచ్చును. అందున్నవారి మనస్సు లా కారణమున దూరభూములకును నభోవీథులకును బ్రసరింపగలిగి యుండును.

"ఆంధ్రరాజ్యము సరిహద్దులం దెల్లెడల శత్రుదండయాత్రలు మొలకేగినవి. ఇప్పటికి నాలుగైదు సంవత్సరముల క్రిందటనే పరాభూతుడైన ఈ పల్లవకొప్పెరుంజింగనికి మరల పైకిరా ధైర్యము వచ్చినది. ఈమారు జటావర్మసుందరపాండ్యుడు కంచినుండి నెల్లూరువరకు గల భూభాగ మాక్రమించుట ప్రమాదకర మైనది. ఉత్తరమునుండి కళింగులు పిఠాపురమువరకు చొచ్చుకొని వచ్చి దక్షిణమునుండి వచ్చుచున్న కొప్పెరుంజింగనితో కలసికొన నుంకించుచున్నారు. చోళసామంతు లందరు శత్రుసేనలతో చేరుచున్నారు. గొంటూరువిభు డగు నాగదేవుడు శత్రువుల రాక యాధార మొనర్చుకొని కాకతిరాజుల ధిక్కరించుటయే గాక మండలమునం దెల్లెడ నరాజకము చేయుచున్నాడు. ఇక యలజడి లేకున్నట్లు కనుపించునది పశ్చిమ భాగముననే. అందు దక్షిణభాగమున హొయిసలులును ఉత్తరభాగమున యాదవులును మనకు పరమశత్రువులు. అటునుండియే ఈ యంధ్రరాజ్యమునకు మహాప్రళయ మెన్నటికైన రావచ్చును. వారి కెక్కువ క్రోధకారణము లున్నవి. వారి కెక్కువ బలము లున్నవి. వారు పైకి శాంతులుగా కనుపడుచున్నను మనము ఏమరియుండుటకు వీలులేదు. మన రాష్ట్రములో పరిస్థితు లెక్కువ యల్లకల్లోల మైనపిమ్మట పెద్దఎత్తునవచ్చి మనలను ముంచివేయు నిశ్చయములతో వా రుండియుండవలె! రాజధానీనగరములో జైన కరణములు చేసిన సమ్మెతో మన కన్నులు తెరువబడినవి. శత్రుసైన్యము లాకస్మికముగా మనల ముట్టడించిన నీ మట్టికోట మనల గాపాడలేదు. అందును మట్టికోట నంటి కర్ణాటదేశమునుండి వచ్చిన జనులు పలువురు నివాస మేర్పరచుకొని యున్నారు. ఈ జైనకరణముల గృహములును ప్రాయికముగా నచ్చటనే కలవు!—"

ఈవిధముగా తిక్కచమూపతి నివేదించుచుండెను. అన్నమంత్రి యడ్డువచ్చెను.

"ఈ మట్టికోటలోపల నొక శిలాప్రాకారమును మరల రాజమందిరములకు జుట్టు మరియొక శిలాప్రాకారమును నిర్మించుటకు వివరములు సిద్ధముచేయ స్థపతులకు ఆజ్ఞ లీయబడినవిగదా! అవి ఎంతవర కైనవి?"

తిక్కచమూపతి: "అవి మీ యుభయుల యెదుటగూడ నివేదించుటకే మిమ్ముల ద్దర రాజధానీనగరమున మహారాజు లుంచినది!"

అన్నమంత్రి: "మంచిది! ఏవి?"

తిక్కచమూపతి సంకేతముగా చిన్నశంఖ మొకటి మ్రోయించెను. కొంది సేపటిలో రుయ్యమ కొన్ని పటపత్రములతో నచ్చటికి వచ్చెను. అందులో భావిదుర్గ నిర్మాణచిత్రములు లెక్కలు వివరములు ఇత్యాదులు కలవు. అవి తెచ్చిన వ్యక్తి యవి యిచ్చి సెలవు తీసికొని వెళ్ళియుండవలసినది.

కాని చిత్రముగా రుయ్యమ యచ్చటనే కదలక యున్నది. రుద్రమదేవి యైనను వచ్చిన వ్యక్తిని వెళ్ళుమని సంజ్ఞ చేయలేదు. అందుచే నాశ్చర్యముతో అన్నమంత్రి కన్నెత్తి రుయ్యమ్మవంక వీక్షించెను. రుయ్యమ యంతవరకు తనవంకనే ప్రీతిపూర్వకముగా తదేకదృష్టితో విలోకించుచున్నట్లు వెంటనే యాతడు గమనించెను. అతని చూపు తనపై బడినంతనే రుయ్యమ జంకుతో తల త్రిప్పుకొనెను. తా నంతవరకు అన్నమదేవునివంక తత్పరయై చూచుచున్న సంగతియే యామె కంతవరకు తెలియదు. అన్నయగౌరకన్నులలో నపూర్వ మగు నొక కాంతి కలదు. రుయ్యమ సామాన్యముగా పురుషులు తనవంక జూచుచుండిన నేమాత్రమును తిరిగి చూచుటకు జంకెడి అభ్యాసము కలది కాదు. కాని యట్లామె చూచుటలో నెట్టి రౌడ్డితనమును బ్రదర్శింపదు. ఆమెకు స్త్రీపురుషభేదము లేని నిర్లిప్తప్రకృతి గల దను నొక గౌరవభావమే యుదయించును.

కాని యీనా డన్నమంత్రి, "ఇంకను ఎందుకు వెడలి పోలేదు?" అని ప్రశ్నించుచున్నట్లుగా తనవంక జూచినంతనే తనకు మున్నెన్నడు పురుషదృష్టి కలిగించియుండని జంకు ఈనాడు ఇతని దృష్టి కలిగించిన దేమి? తా నాతనివంక నంతసే పేల చూచినది? ఆతని శ్యామాయతదేహము ఉన్నతఘనతంత్రాలికములు నాసము గౌరకన్నులు చూచినచో నెవరికి మరలమరల చూడవలె ననిపింపదు? పూర్వ మెప్పుడు నాతని దివ్యమూర్తి నంత సమీపమున నుండి రుయ్యమ చూచియుండలేదు. అతని చూచుచుండుట నేడు కన్నుల కొక విందుగా ఉన్నది. కాని తా నాతని నంతసేపు చూచుచుండినందుకు ఎంతో సిగ్గుగా నున్నది. తాను చూచుచున్నది ఆతని దృష్టిలోగూడ బడినది. ఆ తలపుతో రుయ్యమదేహమంతయు కుంచుకొనిపోయెను. ముఖ మామె వాల్చినను ఆ ఎర్రని ముఖము వికసించిన కోకనదమువలె మరింత ఎర్ర నయ్యెను.

సిగ్గుపడుచున్న యీ పదునారేండ్ల బాపనపడుచును అన్నమంత్రి తన గౌర కన్నులతో మొదలు కోపము చిరాకులతోడనే చూచెను. కాని యాత డామెసిగ్గు నుపలక్షించినంతట నంతయు నాశ్చర్యముగా మారెను. అంతలో రుద్రమ యన్న మంత్రిసందేహము గమనించి స్పష్టపరచెను.

"అమ్మాయిని నేనే ఉండుమంటిని. ఆమెకీ పత్రాదికములు క్షుణ్ణముగా ముఖస్థ మైనవి!"

ఆ మాటలతో అన్నమంత్రి తృప్తుడై యథాప్రకారము వ్యవహారకాండలో నిమగ్నుడయ్యెను. తిక్కచమూపతి అన్నమదేవునికిని అంబదేవునికిని రాతికోట నిర్మాణము వివరించుచుండెను. మధ్య మధ్య వారలకు గోపురద్వారములు దిడ్డి గవనులు బురుజులు ఎక్కడెక్కడ నుండునో కూడా భూమిపై దూరమున వ్రేలితో చూపి విశదము చేయసాగెను. వారిద్దరును అట్టె సూక్ష్మముగా సర్వము నవగాహన మొనర్చుకొనుచుండిరి.

పెద్దరాతికోట ఎంత యెత్తు? ఎంత లావు? మట్టికోట కెంత దూరము? అది యేయేవాడలమీదుగా వచ్చును? ఎన్ని మందిరములు ఇప్పు డున్నవి తీసివేయవలసి వచ్చును? దీనిని రక్షించుట కెక్కడెక్కడ ఎంతెంత సైన్యము నుంచవలెను? ఎట్టి సేనలు అవి? అగడ్తకు నీరుపెట్టుట యెట్లు? ఇన్ని శిలలు ఎక్కడినుండి వచ్చును? ఎట్లు? దీనికి ఎంతకాలము పట్టును? అది పూర్తియగువరకు రాజమందిరము రక్షించు టెట్లు? ఇట్లే ఎన్నియో ప్రశ్నలు వచ్చెను. వానికి సమాధానములును నిర్ణయమైనవి. ముందు రాజమందిరముల చుట్టును రెండురాతిగోడలును వానిమధ్య నీటిపైకూడ తేలునవై యుండి బరువు లేకుండి బహుకఠినమగు నిటుకలతో దృఢమగు ప్రాకారము మహాశివరాత్రిలోపుగా పూర్తి చేయవలెను. ఈమధ్యనే పెద్దరాతిగోడకు రాళ్లు ఇనుపరాతిగట్టునుండి తెప్పింపవలెను. మూడు సంవత్సరములు కాకముందె శిలాప్రాకారము పూర్తియైతీరవలెను. స్థపతులను శిల్పులను ఎంత ద్రవ్యము వెచ్చించియైనను వేలకొలదిగా దీనికి నియమింపవలెను.

ఆ సంభాషణలో రుద్రమ ఏమియు కల్పించుకొనలేదు. కాని యానాటి కార్యాలోచనమంతయు ప్రత్యక్షరమును ఆమె యవగాహన మొనర్చుకొనుచు హృదయకుహరములో పదిలమొనర్చుకొనుచున్నట్లు అన్నయకును అంబదేవునకును స్పష్టమయ్యెను. ఈ పిల్ల ఎవరు?

ఇది పటాదులు తెచ్చునపుడు రుద్రమను 'అమ్మా!' యని సంబోధించెను. అది మర్యాదపిలుపు కావచ్చును. కాని రుద్రమ దీనిని 'అమ్మాయి'యనియే కుమార్తెవలె నిర్దేశించి పలికినదే! ఈమె కూతురైనచో మన మెరుగకుందుమా? ఈమెకు రుద్రమతో నెట్టి పోలికయు లేదే! పైగా బ్రాహ్మణయువతిగా కనిపించుచున్నదే!

రాతికోట మనోజ్ఞముగా నుండి చూచువారిని ఆంధ్రరాజుల మహైశ్వర్యమునకు విభ్రాంతులను జేయునట్లుకూడ చేయుట యవసరము! అందుపై గూడ కొంత విచారణ సాగినది. స్థపతులు గోపురద్వారములకు పలువిధములుగా రూపచిత్రము లిచ్చిరి. కొన్ని కేవలము బలముగా నుండి మోటుగా నున్నవి. కొన్ని కొంచెము తక్కువబలముగను సున్నితమైన శిల్పసంపదతోడను ఉన్నవి. అవి చూచినకొలదియు చూచువారి నాకర్షింపసాగెను. మరికొన్ని బలిష్ఠమై యుదాత్తశిల్పముతో విరాజిల్లుచున్నవి. అం దందరు నేకగ్రీవముగా మూడవరకమువానిలో చిత్రములు ఉచితములని నిశ్చయించిరి. ఆంధ్రవీరుల మనస్సులవలెనే ఈ కోటకూడ దృఢమును ఉదాత్తి

మునుగా నుండవలె. జిలుగుపనులు కోటగోడలకు ఉచితములు కావు. గోపురద్వారములయొద్ద రెండువైపుల నోరు తెరచి మెడ మలచికొనియున్న సింహవిగ్రహములే పెట్టవలెను. అవి జేగురురాతితో నిర్మింపవలెను!

అంతలో రుద్రమకనుసన్న గైకొని రుయ్యమ యా యేకశిల ద్వారమునొద్దకు బోయెను. ఆమె వెంట కుబ్జ బాలప్రతాపరుద్రు నచ్చటికి తీసికొనివచ్చి వదలి సెలవు తీసికొని పోయెను. కొండపల్లిలో చేసిన కొయ్యగజ మొకటియు అశ్వ మొకటియు ప్రతాప రుద్రుని యాటకచ్చట వదలిపెట్టి పోబడెను. ఆ రెండును మిక్కిలి పెద్దవై బాలు డెక్కుట కనువుగా నుండెను. క్రింద వాని కున్న చక్రములపై నెక్కినవారు నడిపింప వీలుకూడ కలదు.

తిక్కచమూపతి చిరునవ్వుతో ప్రతాపరుద్రదేవుని పలుకరించెను. "ప్రతాప రుద్రదేవా, శ్రీరుద్రదేవమహారాజులు మీ కే మగుదురు?"

ప్రతాప: "అమ్మగారు!"

ఆ మాటతో రుద్రమదేవిలోని మాతృత్వము బయలుపడ పురుషధీరత వదలి చిరునవ్వు నవ్వెను.

తిక్కచమూపతి: "మరి యీ రుయ్యమ?"

ప్రతాపరుద్రదేవుడు మాటాడక రుయ్యమవంక జూచెను. ఆ చూపులో నాతనికి రుయ్యమ యన్న నేమాత్ర మిష్టము లేదని స్పష్ట మయ్యెను. రుద్రమదేవి యందుకొనెను. "రుయ్యమ్మ ప్రతాపరుద్రదేవులకు ఒకకొంత శిక్షాగురువు!"

అంబదేవుడు ప్రశ్నించెను. "ప్రతాపరుద్రదేవులు ఈ గుర్ర మెక్కి స్వారి చేయగలరా?"

"ఓ!" యనుచు ప్రతాపరుద్రు డా కొయ్యగుర్ర మెక్కి కాళ్లతో త్రోసికొనుచు నా కుట్టిమమున శీఘ్రగమనమున సంచరించెను. పిల్లవాని చురుకుదనమున కందరు మెచ్చుకొనిరి.

"మరి గజ మెదురైనచో నేమి చేయుదురు?" ఈ ప్రశ్న తిక్కచమూపతి యడిగెను.

ప్రతాప: "ఏదీ ఎదురు రానిండు!—చూపెదను!"

రుయ్యమ యా పెద్దఏనుగును ఆతనివైపుకు త్రోసెను. దానిని దగ్గరకు రానిచ్చి ప్రతాపరుద్రుడు మెరుపుమెరసినట్లు ఊపున తన గుర్రముముందుకు త్రోసి గజమును ఢీకొనజేసి దానిని వెనుకకు కొట్టివేసెను.

అన్నమదేవుడు: "అయితే ప్రతాపరుద్రులకు కత్తిసాము తెలియునా?"

రుద్రమ: "మీరే పరీక్ష చేయుడు! ప్రతాపరుద్రా! ఏదీ?"

వెంటనే ప్రతాపరుద్రుడు అశ్వము ప్రక్కన వేసియున్న ప్రక్కను వ్రేలాడుచుండి యున్న రెండు కొయ్యకత్తులు తీసికొని యందులో నొకటి యన్నమంత్రి చేత కొమ్మనెను. అన్నమంత్రి యందులో కొంచెము గట్టి తక్కువగా నున్నది తీసికొను చుండగా, 'అది మంచిది కాదు. ఇది తీసికొండు, రండు!' అని ప్రతాపరుద్రుడు బలవంతముగా మంచిది అన్నమంత్రికిచ్చి రెండవది తానుకొని కత్తిసాముకు రమ్మనెను.

అన్నమంత్రి నవ్వుచు 'వాలులేని కత్తితో నేమిచేతు?' అనగా 'ఇప్పుడు తప్పించుకొనక రండి! వాలు అక్కరలేదు లెండి!' అని ప్రతాపరుద్రుడు తొందర చేసెను. అన్నయ యా కత్తి చేకొని చిరునవ్వు నవ్వుచు నిలుచుండెను.

ప్రతాపరుద్రుడు తన కత్తితో నురుసుగా అన్నయపై విజృంభించెను. అన్నయ సంతోషముతో నా బాలుని కత్తిదెబ్బలు తన కత్తితో నెమ్మదిగా నడ్డుచుండెను. ఎంతటికిని అన్నమంత్రి నాతడు కొట్టలేక విసిగి ఒక్కసారిగా అన్నమంత్రిమీదికి కవిసి యాతని బట్టుకొన కుప్పించెను. మంత్రీశ్వరుడు ప్రేమాతిశయముతో వచ్చుచున్న యా బాలుని చేతులలో నెత్తుకొనెను. కాని బాలుడు పోరు చాలింపక కాలుచేతుల నన్నమంత్రిని కుమ్మసాగెను.

అంబదేవుడును, అన్నమంత్రియు నొక్కసారిగా "పిల్లకి మహాదేవరాజుల తొందరయంతయు వచ్చినది!" అనగా రుద్రమదేవి వికసిత ముఖముతో, "అంతే కాదు! మంత్రీశ్వరుల నట్లు పట్టుకొని కొట్టవచ్చునా? వారికి నమస్కరించు!" అనెను.

రుద్రమ యట్లనువరకు నాతడు అన్నమంత్రిని పట్టినపట్టు వదలలేదు. రుద్రమ మాటలు విన్నంతనే యా బాలుడు పోరు చాలించి 'దెబ్బ తగిలినదా?' యని యన్న మంత్రిని పరామర్శ చేయుచు నాతనికి వినీతుడై నమస్కరించెను. ఆ నమస్కరించుటలో నాతడు చూపిన తీవికి అందరు ముగ్ధులైరి.

"చిరంజీవ! ఆయుష్మాన్ !" అనుచు అన్నమంత్రీశ్వరు డాబాలుని దీవించెను.

అంతట రుద్రమదేవి నెమ్మదిగా ప్రతాపరుద్రదేవులను పంపివేసి మంత్రీశ్వరులతో నితరప్రసంగములలోనికి దిగి కొంతసేపు గడపెను. అంతట నామె వారి నిట్లు ప్రశ్నించెను.

"మేము మా సామంతులలో ఒకొనొకరికి అశోకపుష్పములు పంపగా ఆత డవి గ్రహించి కేతకీపుష్పములు పంపినాడు. అందులో నంతరార్థ మేమో మంత్రీశ్వరులు సెలవీయగలరా?"

తిక్కచమూపతియు అన్నమంత్రియు అంబదేవుడును ఒకరి ముఖము లొకరు చూచుకొనిరి.

'అట్లు చేసిన సామంతు డెవడైయుండును?' అనియే వారి మనస్సులలోని ప్రశ్న. కాని ఎట్లడుగగలరు? ఇంచుకతడవు వారు మౌనము వహించిరి. రుద్రమ శరీరము కంపించుచున్నదా? ఎందుకు?

మరల రుద్రమయే నిష్కంపముగా ప్రశ్నించెను.

"కేతకీపుష్పము పూజకు వినియోగింపదగినదేనా ?"

అన్నమంత్రి : "అది శివశాపదూషిత మైనదిగదా ?"

తిక్కచమూపతి : "మీా కా సామంతు డంపిన కేతకీపుష్పములను మేము చూడవచ్చునా ?"

"అవశ్యము !"అనుచు రుద్రమదేవి పలికెను. రుయ్యమ ద్వారమునొద్దకు బోయి సంజ్ఞ చేయగా నొక బంగారుపళ్లెరము గొని కుబ్జ యచ్చటికి వచ్చెను. అందులో మహాలయామావాస్యనాడు వీరభద్రేశ్వరుడు పంపిన మొగలిపూవు లుండెను. ఆ మొగలిపూవులపై రంపములవలె నున్న యాచ్ఛాదనపత్రము లట్లే యున్నవి.

మొగలిపూవులు శీఘ్రముగా వాడిపోవు. ఐనను పదునారుదినములకు వాడు ముఖము చూపుటే కాక ఎండుటకూడ ప్రారంభించును గదా ! అవి క్రొత్తగా పంపినవి కావని యందరు ఎరిగిరి కొనినంత వారికి మనస్సులలో కొంత బరువు తీరిన ట్లయ్యెను. ఆ పూవులపై గల రంపములవంటిపై రేకులే వారియందర దృష్టులు నాకర్షించెను.

"ఇవి పంపుట మహారాజులకు మిక్కిలి యవజ్ఞ చేయుట! రంపమునే స్ఫురింప జేయుచున్నవిగదా ఇవి !" అని అంబదేవుడు నిష్కర్షగా వచించెను.

ఆ పుష్పములను అన్నమంత్రీశ్వరుడు కన్నులతో దూరము నుండి లెక్కించు చుండెను. కాని వానిలో నవి యడ్డుండుటచే సాధ్యము కాకుండెను. రుయ్యమ తల వంచుకొనియే యుండి యది సూక్ష్మముగా గ్రహించి యా పళ్లెరమును సమీపించి, 'అమ్మా, ఇవి యెన్ని ఉన్నవి ?"అని లెక్కింపసాగెను.

రుయ్యమకుశాగ్రబుద్ధికి అన్నమంత్రి రిచ్చవడి యామెవంక తేరిపారచూచు చుండునంతలోననె రుయ్యమ లెక్కించుట పూర్తి చేసి 'పది !'యనెను.

"దశదిశలనుండి యీ రంపములు ప్రయోగింపబడు ననికూడ సంకేతార్థముండునా?"అని బిగ్గరగా అన్నమంత్రి యోచించుచున్నవానివలె పలికెను.

రుయ్యమయు రుద్రమయు నొకరివంక నొకరు చూచుకొనిరి. "మంత్రీశ్వరుల ముందు ఈవిషయము ప్రస్తావింపవలెనా యని ముందు మేము వెనుకాడితిమి. ఇప్పు డొక విశేషము స్ఫురించినది. దశ దిశలు, దశదిశలు!—"అనుచు రుద్రమ యాలోచనలో మునిగి పోయెను.

అంబదేవుడు : "శత్రువులు సేనలతో ఎనిమిదిదిక్కులనుండి రావచ్చును. భూగర్భమునుండి యాకాశమునుండి కూడ కృత్యాప్రయోగములచే శత్రువులు సాధించుటకు ప్రయత్నింపవచ్చును."

అప్పటికే రుద్రమదేవి విజయదశమినాటి రాత్రి తనకు వచ్చిన పీడ కలయు వీరభద్రేశ్వరుని యంధకారమయమూర్తి ప్రత్యక్షమగుటయు తలపున కాక నదియే ధ్యానించుచుండెను.

"ఆ సామంతునకు అశోకములు మీ కేల సంపవలసివచ్చెనో అడుగవచ్చునా?"

ఇట్లు అన్నమంత్రి ప్రశ్నింపగా రుద్రమ ధ్యానభంగమై కలలోనుండి మేల్కాంచినట్లు, "అవును. మా సామంతులకు మేము అశోక మరింతుముగదా!— వారు మమ్ము రంపములతో దశ దిశలనుండి కోయ నుద్యమింతురు కాబోలును!"

అంబదేవుడు వీరావేశముతో పలికెను.

"అట్టి సామంతుని గృహమంతయు నశోకపుష్పములతో నిండియున్నను అతనికి శోకము దూరము కానేరదు!"

తిక్కచమూపతి మొదలనే యా సామంతుడు వీరభద్రేశ్వరు డని యూహించి యుండుటచే నా సంభాషణలో ఎక్కువ కలిగించుకొన వెనుకాడెను.

అట్టి సమయమున మేచయనాయకులు మహారాజదర్శన మపేక్షించుచున్నారని కుబ్జ వచ్చి నివేదించెను. వెంటనే ప్రవేశ పెట్టు రుద్రమ యాజ్ఞాపించెను.

మేచయనాయకుడు వందనాదిక మైనపిమ్మట కొన్ని పత్రములు శ్రీరుద్రదేవ మహారాజుల పాదపీఠమందున పళ్లెరమున నుంచి వినీతుడై నిలుచుండెను.

ఆపత్రము లొకటొకటే రుద్రమదేవి చదువుకొనుచుండెను. చదివినకొలది యామెముఖము వివర్ణము కాజొచ్చెను. ముందు ఆశ్చర్యము పిమ్మట కోపము తర్వాత చెప్పలేని ఆందోళన వరుసగా చూచినవారికి వ్యక్తమయ్యెను. హృదయకుహరములో నెక్కడనో ఆగియున్న పరస్పరవిరుద్ధభావము లెన్నియో దాగక ఆమె ముఖమున తాండవింపజొచ్చెను. మహారాజుహృదయగతభావము లట్లు ముఖమున బింబించుట యరుదు!

"నా విధులు తృప్తిగా నిర్వర్తించుటకు నాకు విశేషాధికారములు కావలె నని మనవిచేయుచున్నాను!" రుద్రమ పత్రములు చూచుట పూర్తియైనంతనే మేచయనాయకు డీ విన్నపము చేసికొనెను.

రుద్రమ దీర్ఘాలోచనము చేయుచు మాటాడలేదు. కొంతసేపు నిరీక్షించి మేచయ మరల నర్థించెను.

"రాజ్యములో నెంతటివారి నైనను బంధించు ననుజ్ఞ నాకు కావలెను. మహామంత్రుల నైనను బంధించు నధికారము దయ చేయవలె నని విన్నవింతును!"

రుద్రమ: "తగిన కారణములు నిరూపించినచో మే మట్టి యనుజ్ఞ యీయమని ఏల సందేహింపవలసివచ్చినది?"

మేచయ : "అట్లయినచో, ఆ పత్రములు చూచితిరిగదా! అన్నమంత్రీశ్వరులను ఇప్పుడే బంధింప ననుజ్ఞ యర్థించుచున్నాను".

అంబదేవుడును తిక్కచమూపతియు నిర్ఘాంతపోయిరి. అన్నమంత్రీశ్వరుడు చలింపలేదు. ఆయన కది చమత్కారముగా తోచెను.

రుయ్యాము కాళ్లు నిలువక జారుచుండెను.

అంతలో రుద్రమదేవి యిట్లనెను.

"మేము మేచయనాయకుల నిశ్చయముతో నేకీభవింపలేకున్నాము. ఈ పత్రములలో సంశయకారణము లున్నవి. కాని నిస్సందేహముగా నేరము నిర్ధారణచేయ నాధారము కనపడదు. ఈ పత్రము లన్నియు శత్రుకల్పితము లై యుండవచ్చును. మా కుటుంబమునందు వంశపారంపర్యముగా వారు చూపిన విశ్వాసమును ఇవి చలింపజేయలేవు!"

ఆ మాటలు విని ఎవరును మాటాడలేదు. అన్నమంత్రికూడ కొంచెము ఆశ్చర్య పడెనుగాని తన్నుగూర్చిన సందేహముగాన అందులో జోక్యము కలిగించుకొనుట యుక్తము కాదని మిన్నకుండెను. మేచయనాయకుడు ఎంతమాత్రమును తన నిశ్చయము మార్చుకొన్నట్లు లేదు.

మెల్లదిగా నాపత్రములు రుద్రమదేవి మేచయ కిచ్చి అన్నమంత్రి కిమ్మనెన నాత డట్లొనర్చెను. ద్రోహికి ద్రోహనిరూపణచేయు పత్రములే మహారాజా లిమ్మనన నత డేమి చేయగలడు?

అన్నమంత్రి యాపత్రములు పరిశీలించుచుండెను. అట్లాతడు చూచుచుండగా నాతని ముఖలక్షణములు రుద్రమ శ్రద్ధతో గమనించుచుండెను. మేచయ నిశ్చలుడై నిలుచుండి ద్రోహిని చూచువిధముగా అన్నయవంక చూచుచుండెను.

అన్నమంత్రి పత్రములు కొన్ని మరలమరల పరిశీలించెను. కొన్ని వెనుకకు ముందుకు త్రిప్పి చూచెను. నిదానముగా యోచించెను. మరల నవి మేచయనాయకున కిచ్చివేసెను.

రుద్రమదేవి యడిగెను: "అన్నమంత్రీశ్వరులు అన్నియు చూచితిరిగదా, ఏమందురు?"

అన్నమంత్రి : "ఆ పత్రములు ఎక్కువభాగము కల్పితములు. సత్యమైన పత్రములును కొన్ని గలవు. వానికి అసత్యపత్రములతో కలిపి చదువనియెడల సదర్థమే యుండును. ఐనను నేనును మేచయనాయకుల యభిమతముతో నేకీభవింతును!"

ఆ మాటలకు మేచయనాయకుడే యులికిపడెను. అతడు దూర మాలోచింపనిది నిశ్చయింపడు. ఆ మాటలతో నాతనికే తన నిశ్చయములో పొరబడియుంటినా యను సంశయము ఉదయించెను.

తిక్కచమూపతియు అంబదేవుడును ఏమియు తోపక అయోమయస్థితిలో పడిపోవుచుండిరి.

రుయ్యమగుండెలు దడదడలాడుచుండెను. ఆమెకన్నులు తిరిగియే పోవు చున్నవి. రుద్రమకంకగాని అన్నదేవునికంకగాని యామె మాటలేక స్వయంభూతేశ్వరుని ఆలయశిఖరముపై నున్న కనకకలశమును తిలకించుచుండెను.

రుద్రమ యడిగెను. "అన్నమంత్రీశ్వరుల యభిప్రాయము వినవింతురా?"

అన్నమంత్రి స్పష్టముచేసెను.

"నా కున్న యధికారము కలవానిపై నింత తీవ్రమగు సందేహ మున్నప్పుడు అది తీరనిది అధికారపదవిలో నుంచుట రాజనీతివిరుద్ధము. ఒక ద్రోహి కారాగారమునుండి మోసముగా తప్పించుకొనిపోవుటకు మా కార్యాలయమునుండి పత్రములు వెళ్ళినట్లు కనబడుచున్నది. మరియు మాకు నాగదేవునితోడను దేవగిరీశుని తోడను ఉత్తరప్రత్యుత్తరములు జరుగుచున్నట్లు కొంత యనుమానము తోచుచున్నది. ఇవిగాక సందేహాస్పద మగు స్థితిలో నున్న మనుమగండగోపాలుని పక్షమువారికి నేను బల మిచ్చుచున్నట్లును కనబడుచున్నది. ఇందులో చివరిదానిలో కొంత సత్యమును లేకపోలేదు.

"నా కీనాడు విశేషముగా రాజ్యతంత్రరహస్యములు తెలిపియున్నారు. అందుచే నన్ను స్వేచ్ఛగా నుండనిచ్చుట యుచితము కాదని నాకే తోచుచున్నది."

రుద్రమ ధీరగంభీరముగా పలికెను.

"మాకు భాసించిన భావమే అన్నమంత్రీశ్వరులును సెలవిచ్చినారు. ఈ విషయమునందే కాక ముందుగూడ ఎన్నో విషయములలో అన్నమంత్రీశ్వరుల సహాయ మర్థించుచుందుము—మేచయనాయకా! అన్నమంత్రీశ్వరుల కొరకు ఏకాంతమందిరము రాజప్రాసాదములో చూచి సిద్ధముచేయింపుము. వారి కెట్టి యవజ్ఞయు లేకుండ రాజబంధువులకువలెనే ఏకాంతమున వారికి మర్యాదలు జరుగునట్లు చూడుము!"

మేచయనాయకుడు సెలవుతీసికొని వెడలిపోయెను.

రుద్రమదేవి అన్నమంత్రీశ్వరుని సంబోధించి యడిగెను.

"మీ రచ్చట నెంతకాల ముండవలెనో! ప్రొద్దుపుచ్చుటకు మీ కెట్టి ఏర్పాట్లు కావలెను?"

అన్నమంత్రీశ్వరు డాలోచించుకొనలేదు. వెంటనే యుత్తర మిచ్చెను.

"నా కీ యధికారపదవిలో వేదవేదాంతచింత చేయు వ్యవధి లేకపోయినది. చతుర్వేదపారగు లగు నలుగురు విప్రులను నాయొద్దకు వచ్చుచు బోవుచుండ ననుజ్ఞ యిచ్చినచో కృతార్థుడ నగుదును!"

రుద్రమ: "మంచిది తప్పక యట్లే చేసెదము. ఇంకేమైన నర్థింతురా?"

అన్నమంత్రి: "ఉన్నది. నామీద కలిగిన సందేహము తిక్కన సోమయాజుల కెట్టి స్వేచ్ఛాభంగమును కలిగింపకుండునుగాక!"

రుద్రమదేవి యడిగెను. "తిక్కనసోమయాజుల సంగతి ఈ పత్రములలో జూచినాము. వారి విషయము తెలిపింతురా?"

అన్నమంత్రి: "వారు మాకు దూరబంధువులు. మనుమగండ గోపాలునియొద్ద చాలకాలము మంత్రీశ్వరులుగా నుండిరి. మహాకవీశ్వరులు. నన్నయభట్టారకులు వ్రాయక వదలిన మహాభారతగ్రంథమును ఆంధ్రావని మోదముం బొరయ జగద్ధితముగా నాంధ్రీకరించుచున్నారు. వారేదో కార్యసిద్ధ్యర్థించి మన రాజధానికి దయచేసి యున్నారు. మనుమగండగోపాలునిపై రాజానుగ్రహము ప్రసరింపజేయు నిచ్ఛ వారికుండి యుండవచ్చును. వారికా చలచిత్తునిపై అపారవాత్సల్య మున్నది. వారే బ్రాహ్మణులకు కరణవిద్య నేర్పు పాఠశాల ప్రారంభించు నిచ్ఛకు మూలకారణులు!"

రుద్రమ: "అన్నమంత్రీశ్వరా, రాజధర్మ మెంత కఠినమైనదో మాకు ఒక దానితర్వాత నొకటి యీ ఐదారుదినములలోననే నిరూపించుచున్నవి. అభిషేకమైనవెంటనే మేము పంపిన మొదటియాజ్ఞ శ్రీవీరభద్రేశ్వరుల బంధించుటకే. మరల మిమ్ము నాడు నిర్బంధములో నుంచవలసివచ్చినది. మీ ఇచ్ఛానుసారము తిక్కన సోమయాజులకు ఈ నగరమున సర్వస్వాతంత్ర్య మీయ కట్టడిచేయుదుము."

అన్నమంత్రీశ్వరుడు "ధన్యోస్మి" యనెను. రుద్రమదేవి శూన్యమువైపు చూడలేకపోయెను. అంబదేవునివంకను తిక్కచమూపతివంకను గూడ చూడలేకపోయెను.

రుద్రమకన్నులు చెమ్మగిల్లుచున్నవో ఏమో, ముఖ మావలకు చప్పున త్రిప్పుకొనెను.

"నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాప్త స్తతో జయ ముదీరయేత్."

శ్రీమహాభారతమ్.

తిక్కనసోమయాజులు అన్నమంత్రీశ్వరుల యింటి కతిథిగా వచ్చియుండెను గదా! ఆయన యిన్నాళ్లు నేమి చేయుచున్నాడు? ఎక్కడ నున్నాడు? సరసనాథుడే మయ్యెను? మారన కెట్లు ప్రొద్దుపోవుచున్నది?

తిక్కనసోమయాజులు తమ సోమిదేవమ్మతో కలసియే ఏకశిలానగరము వచ్చినారు. లేకున్న త్రేతాగ్నులు సాగు టెట్లు? అన్నమంత్రీశ్వరుని భవనమున వారి కొక శాల ప్రత్యేకింపబడి అది సర్వసంపన్నముగా నమర్చబడినది. అందనేకభాగములు గలవు. వానియం దన్నిట నగ్నిహోత్రగృహము పవిత్రమనోజ్ఞము!

ఆమధ్య కొంతకాలము సోమయాజుల మహాభారతాంధ్రీకరణ మాగిపోయినది. నెల్లూర మహాయుద్ధము చెలరేగుచుండగా ఆ పెన్నానదీతీరమునందలి మంటపముపై గూర్చుండి శాంతముగా నాయన రచన సాగించుకొన సాధ్యమగునా? ఒకప్రక్కను వీరభటుల యలజడి రణభేరీభాంకారములు. ఆ శబ్దము లెన్ని చెవుల జొచ్చుచున్నను కొంతవరకు నిర్లిప్తుడై యుండగలుగునేమో కాని, మధ్యమధ్య దీనుల యార్తారవములు విని సోమయాజులు భరించగలరా? అవి చెవులలో పడినంతనే దేహ మంతటను విద్యుద్వేగమున బ్రసరించును. కవిత్వ మాపై నెట్లు సాగును? అందుచే రచన ఆగిపోయినది.

అంతలో ఆయన నెల్లూరుపట్టణమే విడువవలసి వచ్చినది. ఆ పినాకినీనదీపవిత్రవారిలో క్రుంకు లాడుటే మానము కావలసివచ్చినది. మనుమగండగోపాలునిపై నున్న వాత్సల్యముతో నాతనికి సహాయ మర్థించుటకు ఓరుగల్లుకు కరణములతో ప్రయాణము కావలసివచ్చినది. ఆపిమ్మట కొద్దికాలమునకే మనుమసిద్ధి నెల్లూరు పట్టణమును పాండ్యపల్లవసేనలకు వదలివేసి దేశాంతరగతు డయ్యె ననువార్తలు సోమయాజులకు దెలిసెను. అయినను ఓరుగంటికి ప్రయాణ మాతడు ఆపక సాగించెను. అక్కడ అవకాశము చిక్కినంతనే తనతో పరివారముగా వచ్చిన కరణములను అక్కడి ప్రభువులకు ఉపయోగపడునట్లు చేసియుండెను గదా! సమయము వచ్చినప్పుడు మనుమసిద్ధి ఎక్కడ నున్నది యెరిగి చేతనైన యుపకార మాతనికి చేయింపవచ్చును. అంతవరకు నిచ్చట శాంతముగా మహాభారతాంధ్రీకరణము సాగింపవచ్చును. కాని ఎక్కడ గూర్చుండి వ్రాయుట?

అన్నహోత్రశాలలో గూర్చుండి యది సాగింపవచ్చు నని ముందు సోమయాజు లూహించెను. అగ్నిహోత్రునిలో సమస్తదేవతలను ప్రత్యక్షము చేసికొనవచ్చునుగదా! హరిహరనాథుడు మాత్రమందు ఏల సన్నిహితుడు కాడు? నిజమే!

అయినను ఆశ్వయుజశుద్ధఅష్టమినాడు సోమయాజులు స్వయంభూదేవుల దర్శించుట కాలయమున కేగెను. ఆ యాలయావరణమున నే శ్రీ కేశవాలయ మున్నది. ఆ విశాల మగు ప్రాకారమున కంటె యెన్నియేని మనోహరమండపము లున్నవి. ప్రక్కనే స్వయంభూదేవుని సరోవర మున్నది. అక్కడనే ఎదురుగా హరిహర నాథు లేకమైన మూర్తివలె ఏకశిలాబొద్దురాయి భాసించుచు సమీపమున గను పించుచుండును. తుదకు స్వయంభూదేవాలయప్రాంగణమున గల యొక మండపమున గూర్చుండి విజయదశమినాటినుండి శ్రీమహాభారతరచన మరల సాగింప నాయన నిశ్చయించెను. సిద్ధసంకల్పులకు విఘ్నము లుండునా? అట్లే సాగుచున్నది.

తిక్కనసోమయాజులు ఉదయమున సంధ్యావందనాగ్నిహోత్రాదికము నిర్వర్తించుకొని కుశపాణియై తనవెంట గురునాథుడును మారనయు కోశాదికములతో రా పాదచారియై స్వయంభూనికేతనమునకు బయలుదేరి యందు నిరృతిదిక్కున గల మహామండపమున ప్రాచీముఖముగా కూర్చుండి రచన కుపక్రమించును. సమీపమున గురునాథుడు ఉత్తరమునకు తిరిగి యాసీనుడై వ్రాయుచుండును. ఆతనిప్రక్కనే మారన కూర్చుండి ఎదురుగా వ్యాసపీఠమునం దుంచి శ్రీమహాభారతమూలము పఠించుచుండును. అట్లువారు కూర్చుండుటచే వారికి కేశవ శ్రీస్వయంభూనికేతన ములు ఎదురుగా నుండును. ఆ రెండుదేవాలయముల శిఖరములు హరిహరనాథుని రెండు మూర్తులుగను అవల నన్న ఒంటిమిట్ట—ఓరుగల్లు, ఏకశిల—ఆ రెండు మూర్తులు నొకటైన రూపముగను అక్కడ నుండువారికిపొడగట్టును!

ప్రాతఃకాలమున నచ్చటికి వచ్చి మాధ్యాహ్నికములకు వేళయగువరకు శ్రీ మహాభారతరచనము నచ్చట సాగించి యంతట తిరిగి భవనమున కేగి మాధ్యాహ్నికములు నిర్వర్తించి భోజనానంతరము సోమయాజులు కొంచెము విశ్రమింతురు. మరల నంతట దేవాలయప్రాకారమున గల మండపమునకు ప్రాగ్దుటివలెనె వచ్చి సంధ్యాకాల మగువరకు వారు రచన కావింతురు.

ఈనా డుదయమున అనుశాసనికపర్వమున పంచమాశ్వాసము ప్రారంభింప నుండెను. మండపమున నాసీనుడైన యనంతరము సోమయాజి కొంచెముతడవు ధ్యానమగ్నుడై యుండి పిమ్మట నిట్లు పలికెను.

'శ్రీకాళీత్యాదరసుశ్లోకాలోకనవిలాసనుస్థిరభవ నా
శోకముదాద్యపధూతి వ్యాకోశవివేకభవన హరిహరనాథా!'

అట్లు సోమయాజి చెప్పుచుండ నది శ్రద్ధగా చెవియొగ్గి చక్కగా ధారణ చేయుచు గురునాథుడు తాళపత్రముపై గంటములోని రత్నములు గణగణ లాడుచు శ్రావ్యనాదము చేయుచుండ లిఖించెను. అంతట సోమయాజులు శ్రీ కృష్ణద్వైపాయన వేదవ్యాసకృతమహాభారతకోశపూజ నిర్వర్తించి—

'నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.'

అనుచు నరనారాయణులు— సరస్వతిని వ్యాసవాణితో ధ్యానించెను. గుణనాథుడును మారనయును సోమయాజుల ననుసరించిరి.

అంతట మారన వ్యాసమహాభారతకోశబంధము సడలించి పత్రములు వ్యాసపీఠమున రెండుచేతులలో విస్తరించి కావలసినపత్రము దాని కున్న సూత్రముతోడనే పైకి తీసి కన్నుల కద్దుకొని పాఠము ప్రారంభించెను. ఆ కంఠమున నెంత మాధుర్యము! ఎంత శాంతము! ఎంత గాంభీర్యము! ఎంత సామర్థ్యము! బ్రహ్మతేజోనిధి యగు శంకరాచార్యులే యీ రూపమున నవతరించి పఠించుచున్నారా యనిపించును. సోమయాజి తదేకచిత్తుడై పులకించుచు కొంతసేపటికి ఆపు మన్నట్లు మారనకు సంజ్ఞ చేసెను.

ఆపై కొంతసేపు సోమయాజులు మౌనము వహించెను. అందరును మౌనమే! విన్న యాభాగమును తిక్కన మననచేయుచుండెను. ఆ శ్లోకముల యర్థము ముందు ఆయనహృదయములో సుస్థిర మయ్యెను. సుస్థిరమైన యా యర్థ మాతడు మరల మరల నవలోడన మొనర్చెను; మరల మరల మథించెను. ఆ మథనముతో నగ్ని పుట్టెనో యేమో గాని, కొంతసేపున కా యర్థము సోమయాజుల హృదయములో కరగిపోయి రసస్వరూప మందెను. సువర్ణకటక మొకటి మూసలో నుంచి దానిని కుంపటిలో పెట్టి అగ్ని ప్రజ్వలింపజేయగా ద్రవీభూతమై యా సువర్ణకటకము కేవల సువర్ణాకృతి నొందు విధముననే వేదవ్యాసార్థము తిక్కనసోమయాజుల యంతరంగమను మూసలో వేడెక్కి కరగిపోయి స్వచ్ఛసువర్ణాకారమై యొకానొక సామ్యావస్థ నందెను. ఆ స్థితిలో సువర్ణము స్వర్ణకారుని ఇచ్ఛచొప్పున నే యాకారము పొందుటకైనను అనువుగా నుండునుగదా! అట్లే ఆయర్థమును కొంతసేపునకు సోమయాజుల ఇచ్ఛాశక్తిచే సత్త్వ ముద్రేకించి ఆంధ్రవాణీరూపముగా నది యాయన జిహ్వాగ్రమునుండి యుద్గమించెను. సోమయాజుల యమృతవాక్కు లెప్పుడు బయలువెడలునా యను నుత్కంఠతో ఆ మహాత్ముని పెదవులవంక నేకాగ్రదృష్టితో నంతవరకు జూచుచున్న గుణనాథు డొక్కుమ్మడి జాగృతు డయ్యెను. సోమయాజులవాక్కు లిట్లు వెడలినవి.

'దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె!'

ఈ వచనముతోడనే ప్రథమాశ్వాసమును తిక్కనసోమయాజి ప్రారంభించెను. కాని తిక్కననోట నాశబ్దము లుచ్చరింపబడుచుండగా వినుచున్న గుణనాథునకును మారనకును ఆ ఐదుశబ్దములును పంచభూతాత్మక మగు సృష్టిగానే భాసించెను. ఆకాశమునుండి వాయువు, వాయువునుండి యగ్ని, అగ్నినుండి యప్పులు, అప్పులనుండి పృథివి!

దేవా, యని హరిహరనాథుని సంబోధించి పలుకుచున్న సోమయాజుల వాక్కు విన్నవారే ధన్యులు! రామాదిభగవన్నామములే విస్తరించి గానము చేయువా రెందరు లేరు? అట్లే ఆ శబ్దమును సోమయాజులును అనేకభంగుల నుచ్చరించును. ఒక్కొక్కమారు ఒక్కొక్కభంగిగా నది వచ్చును. ద్యోతకస్వభావము వ్యక్తీక

రించుదేవశబ్దమే సోమయాజుల హృదయములో నిత్యస్ఫూర్తితో వెలుగుచు లీనమై ఆయన కక్షిమానపాత్ర మయ్యెను.

అంతట నా మిగిలిన నాలుగుశబ్దములలో ముందు వైశంపాయనని నామమే యాతడు స్మరించును. గతానుగతికముగా చదువుకొనవారికి ఆ శబ్దము ఇతరపురుషుల నామములవలెనే ఒకానొకసంకేతమే కాని వైశంపాయనశబ్దము తిక్కనసోమయాజులకు పూర్వకాలమున నున్న యొకానొక మానవుని నిర్దేశించు సంకేత మగు నామము కాదు. వైశంపాయనుడు ద్వాపరాంతమున యజుశ్శాఖలు లోకమున ప్రవర్తింప జేసిన వ్యాసశిష్యు డగు నొక మహర్షి! తానును యజుశ్శాఖలం దొకానొక డగు కృష్ణయజుశ్శాఖాధ్యాయి. వైశంపాయననామము స్మరించినంతనే తిక్కన సోమయాజుల హృదయములో యజుర్వేదము సాంగముగా భాసించును.

ఆపిమ్మట నాతడు జనమేజయనామ ముచ్చరించును. ఆతడు కలియుగ మవతరించినపిమ్మట భరతసార్వభౌములలో రెండవవాడు. వేదవ్యాసు డీ మహాభారతకథ నేల కథన మొనర్చెను? కలియుగములో, ముఖ్యముగా సార్వభౌములు, దీని నాకర్ణించి భారతధర్మము రక్షించుచు జయము పొందుచుండవలె నను మహాశయముతో నాతడు దీనిని చెప్పినాడు. అందుకే దీని కాతడు జయకావ్య మని పేరు పెట్టినది! ఈ మహాగ్రంథముప్రథమోపదేశము జనమేజయచక్రవర్తికే వ్యాసుడు చేయించినాడు!

ఈ యూహాపరంపరలతో 'జనమేజయునకు' అనునప్పటికి సోమయాజుల హృదయములో తీవ్ర మగు బాధ యంకురించును. ఆ జయమునే నన్నయభట్టారకులు తెలుగువాణిలో రాజరాజునకు ఉపదేశింప ప్రారంభించెను గాని యది సాంతము చేయ లేకపోయెనే! నే నుపదేశింప ప్రారంభింత మన్నను ఇప్పుడు ఆ రాజరాజైన లేడే! అయ్యో, రాజరాజు లేడే, యని హరిహరనాథునకు నివేదించుకొనును. తిక్కనకన్నులలో నీరు క్రమ్ముచున్నట్లె గిర్రునతిరుగుచున్నట్లే యుండ 'ఇట్లు' అను పదము గద్గదస్వరమునవచ్చును.

ఆ పిమ్మట 'అనిరెు' అను పదము నిట్టూర్పు విడిచినట్లే ఆయననోట వెలువడెను!

ఆ యైదుపదములు విన్న గురునాథునకును మారనకును తిక్కన సోమయాజులు ఎంత హృదయభారముతో శ్రీమదాంధ్రమహాభారతరచన కుపక్రమించినారా యను భావ మావేశించును!

ఈ తరక్షణములో సోమయాజి మనస్సు దిటవుచేసికొని యిట్లు సాగించెను.
'అట్లు గంగాత్మజుండు ధర్మాత్మజునకు జెప్పి యిట్లను గౌరవశ్రేష్ఠ పద్మనాభుతో నవ్విధంబున నారదుండు పార్వతీదేవి ప్రశ్న ముపన్యసించి
ఇట్లనిరెు!

ఆ చెప్పినది గురునాథుడు లిఖించుట పూర్తిచేసెను. అంతట సకల మారన వ్యాసభారతపాఠమున కుపక్రమించెను. తిక్కన మహాకావ్యముగా ధ్యానమననము లొనర్చి హృదయములో నా యర్థము కరగించి యాంధ్రచ్ఛందోరూపమున వెలువరించెను.

అట్లు మారన చదువుచుండగా నాదిభాగమున సామాన్యముగా నాంధ్రములో తిక్కనసోమయాజులకు వచనము వెలువడదు. వచనమునకు గద్య యని పేరు. అది గద్దె; ఆసనము; నిలుచుచోటు! సంస్కృతిపఠనము నిలిచినయెడలనెల్ల వచనము వచ్చుచుండుట ప్రకృతిసిద్ధము. ఇట్లు చేయవలెనని కోరి చేసినది కాదు. కవి మనస్సు విశ్రమించు నెడల వచనమే సాధారణముగా వచ్చుట స్వాభావికము!

‘శివుడు పార్వతికి వర్ణాశ్రమాచారముల తెఱఁగెఱిగించు’ ఘట్టముతో నా యుదయమున ప్రారంభమైనది. మధ్యాహ్నమునకప్పటికి ఆ ఘట్టము పూర్తియై ‘శివుడు పార్వతికి దపస్స్వరూపంబు సెప్పు’ఘట్టము సగమయ్యెను. విశ్రమించి మరల వచ్చినపిమ్మట మును సోమయాజి తా నాఉదయమున చెప్పిన భాగము గురునాథుడు వినిపింపగా నాలకించెను. అట్లు వినుచు మరల స్ఫురించిన సవరణలు చేయించెను. కాని యట్టి సవరణలు క్వాచిత్కములు. ఆపైని మరల యథాప్రకారము రచన ప్రారంభించి యాఘట్టము పూర్తిచేసి ‘శివుడు పార్వతికి రాజత్వమహిమాతిశయంబు సెప్పు’ ఘట్టమందుకొని చెప్పుచుండెను.

కేశవస్వయంభూనికేతనములు రెండును ఒకేప్రాకారమధ్యమున గలవు. అందు దక్షిణముఖముగా స్వయంభూదేవాలయమును పశ్చిమముఖముగా కేశవాలయమును ఉన్నవి. ఆ యాలయములలో సాయంకాలపూజకు చాలతడవు ముందుగనే అర్చకులా యాలయముల ద్వారములు తెరచి యందలి యఖండదీపములలో తైలముంచి వత్తులు సరిచేసి ఆగమోక్తులు పఠించుచుండిరి. మధ్యమధ్య భక్తులు స్వయంభూదేశ్వరునకును కేశవస్వామికిని కీర్తననమస్కారాదికము లర్పించి సేవలు చేయించి తీర్థప్రసాదములు గ్రహించి వెడలిపోవుచుండిరి.

అంతలో నాలయప్రాకారమునందంతట నొక సందడి యారంభించెను. అది యలజడి కాదు. అప్రమత్తులై యుండ యత్నించు నర్చకుల సందడి! ఆలయావరణములో నున్న మండపాదులలో విశ్రమించియు సల్లాపములు చేయుచును పనసలు చెప్పుచును శాస్త్రార్థములు చేయుచును నవ్వుచును కేరుచును పలువిధముల నున్న బ్రాహ్మణులు తాము కట్టిన పుట్టములును పైనున్న యుత్తరీయములును సరిచేసికొనుచు స్వయంభూదేవాలయముఖమండపములోనికి శీఘ్రగతి నరుదెంచుచున్న సవ్వడి! శౌచహీను లావలకు తప్పుకొనుచున్న సంభ్రమము! సామాన్యజనులు గౌరవదృష్టులతో ప్రక్కల కొదిగి తొంగిచూచుచున్న కలకలము!

శ్రీరుద్రదేవమహారాజులు క్రీడాశైలమునుండి రాజప్రాసాదమునకు బోవుచు కేశవస్వయంభూనాథుల దర్శించు నిచ్ఛ యదృచ్ఛగా గలిగి యిట్లు వచ్చుచున్నా

రను వార్త వచ్చినది. ఇట్లాకస్మికముగా వారు దేవదర్శనమునకు వచ్చుటయును కద్దు; కాని యది యసాధారణము. అందుచేతనే ఈ సంభ్రమము !

స్వయంభూదేవాలయప్రాకారమునకు దూరమున దండధరుల కేకలు విననైనవి. వందిమాగధులు కైవారములు చేయుచు ప్రక్కలనుండి ఎదురగుచు దారి సాగుచున్నారు. అంతలో దూరముననే శ్రీరుద్రదేవమహారాజులు అశ్వమునుండి దిగి పాదరక్షలు వదలిరి. ముందు తిక్కచమూపతియు మధ్యను శ్రీరుద్రదేవమహారాజులును ఒకప్రక్కను అంబదేవుడు రెండవపార్శ్వమున పర్వతనాయకుడును వచ్చుచుండిరి. అందరు పాదచారులే! అందరును సరోవారితో పాణిపాదశౌచము పొంది దక్షిణద్వారము సమీపించిరి.

ఎత్తైన నాలుగు స్తంభములతో ఉదాత్తరమణీయమగు నాగోపురద్వారము నొద్దకే ఎదురుగా నున్న స్వయంభూదేవాలయమునుండి శివార్చకులును ప్రక్కనున్న కేశవాలయమునుండి వైఖానసులును ఎదురు వచ్చి శ్రీ రుద్రదేవమహారాజులకు రాచమర్యాదలు గావించి లోనికి తీసికొనివచ్చుచుండిరి. వేదవిదులగు బ్రాహ్మణులిరుగెలకుల రెండు బారులుగా తీరి స్వస్తివాచనము ప్రారంభించిరి.

శ్రీరుద్రదేవమహారాజు సపరివారముగా వారి కెల్లరకు దోసిలియొగ్గి నమస్కరించుచు నాలయములు రెంటిటికిని ప్రదక్షిణము చేసి ముందు స్వయంభూస్వామిని దర్శించి పూజ చేయించి మంత్రపుష్పముతో కానుక లర్పించి యాత్మప్రదక్షిణనమస్కారాదికములు కావించిరి. అపిమ్మట కేశవస్వామియాలయములోనికరిగి యట్లే యర్చానమస్కారాదు లర్పించి తీర్థప్రసాదాదులు స్వీకరించిరి.

దేవదర్శనమునకు వచ్చినవారు పూజానంతరము ఆలయమున నించుకతడవు కూరుచుండవలసిన విధి యున్నది. స్వయంభూదేవాలయముఖమండపద్వారమున నున్నతము లగు రెండు గజవిగ్రహములు కలవు. అవి నిగనిగలాడు నల్లరాతిలో తొలిచినవి. వాని కిరుప్రక్కలను దీర్ఘవితర్దికలు కలవు. అందులో నొకటి యాలయము పశ్చిమకుడ్యమునకును రెండవది ప్రాక్కుడ్యమునకును అంటియుండును. ఆ యరుగుల వెనుకను ప్రక్కలను శిల్పులు తీగెలు పూలు సింహములు ఏనుగులు రమణీయముగా తొలిచియుండిరి. వానిలో పడమటిగోడ నానియున్న యరుగుపై శ్రీరుద్రదేవమహారాజులకు మెత్తనై పట్టుకుచ్చులు కల రత్నకంబళి ముంచగా నందామె యుపవిష్ట యయ్యెను. పరివారమును యథార్హముగా కూర్చుండనగువారు కూర్చుండియు నిలుచుండువారు నిలుచుండియు నుండిరి. బ్రాహ్మణబృందము ఆశీర్వచనమున కాయత్తమగుచుండెను. అందుకు అర్చకులు వారికి పుష్పాక్షతాదులు పంచిపెట్టుచుండిరి.

ఆ ప్రదేశమునకు పదివిండ్లదూరముననే తిక్కనసోమయాజులుమహాభారత రచనముచేయుచున్న మండపమున్నది. ఆలయప్రాకారమధ్యమం దున్నవారెల్లరు మహారాజదర్శనముకై సమీపమునకును దవ్వులకును మూగిరి. ఆ మండపములో నున్న యా. ముగ్గురు వ్యక్తులుమాత్రము ఎట్టి యంతరాయమును లేకుండ వారిపని వారు

చేయుచునేయుండిరి. వారికి ఆలయములకు అర్చకులు వచ్చినదిగాని, మహారాజులు వచ్చుచున్నదిగాని వచ్చినసందడిగాని, పూజాదిక మొనర్చినపుడు కలిగిన సంచలనముగాని—ఏదియు పట్టినట్లే లేదు. అందును మహారాజులు ఆలయప్రదక్షిణము చేయునెడ వారికి నాలుగైదు బెంష్ల దూరమునుండియే వెళ్లియుండిరి. అయినను ఆ మువ్వురు నది పట్టించుకొనలేదు. కేవలము శ్రీహరిహరనాథుని భావవీధిలో నిలుపుకొని శ్రీకృష్ణద్వైపాయన వేదవ్యాసవచనము లనువాద చేయువారి కీలోకము కన్నులకు కనబడుచున్నను నిజముగా నది భాసించునా ?

ఆ మువ్వురు మూర్తులును శ్రీరుద్రదేవమహారాజులు ఆలయాకారమున ప్రవేశించినప్పటినుండియు వారి నాకర్షించెను. ఎవరు వీరు ? సాక్షాత్తు బ్రహ్మవిష్ణుమహేశ్వరులే యీ మండపములో గోష్ఠి తీరియున్నారా ? వీరు చేయు ప్రసంగమేమి ? వ్రాయుచున్న గ్రంథ మేమి ? ప్రదక్షిణము చేయుచున్నతరి మధ్య నొకింత యాగి యది యేమో వినవలె నని మహారాజులకు ఉత్కంఠ కలిగెను. కాని అట్టిది రాచమర్యాదకు భంగకరము ! సందడిలో ఏదియు స్పష్టముగా వినరాలేదు.

అప్పుడే అన్నమంత్రీశ్వరులను కారాగృహమునకు రుద్రమ పంపించియుండెను. ఎంత గౌరవముగా పంపినను తా నామహాత్ముని బంపినది కారాగారమునకే గదా ! ఇందులో తా నేదో మహాపరాధము చేయుచున్నా నని యామెకు హృదయములో స్ఫురించుచుండెను. అన్నమంత్రీశ్వరుడు ద్రోహి యగుట యసాధ్యము ! కాని యంత బలమగు సాక్ష్యసాధనములను త్రోసిపుచ్చుట ఎట్లు ? రాజధర్మ మెంత కఠిన మైనది ! ఈ యాలోచనలతో రుద్రమమనస్సు వికలమయ్యెను. ఆ మనోవైక్లబ్యము పదిలపరచుకొను నాశతోడనే ఆమె రాజప్రాసాదమునకు పోవుచుపోవుచు దేవదర్శనార్థ మిప్పు డిట్లాకస్మికముగా వచ్చినది !

పూజానంతరమున ఆ వితర్దికపై నిప్పుడు రుద్రమ యాసీనయైనది. బ్రాహ్మణాశీర్వాద మింకను ప్రారంభింపలేదు. దక్షిణగోపురద్వారబంధములపై గజాంసప్రతిమలపై నామెదృష్టి వ్రాలినది. ఇప్పు డా మండపములోని త్రిమూర్తు లేమి చేయుచున్నారో తెలిసికొనవలె నని కుతూహల మామెకు మరల కలిగినది. శ్రద్ధగా నటువైపుకు చెవు లొరజేసి మనస్సు నటు లగ్న మొనర్చినది. ఈ క్రిందిపద్యము లామెదక్షిణకర్ణ తాడనము గావించెను.

> 'భూసురుల కలుకవుట్టం జేసి నహుషముఖ్యనృపులు సెడుట ప్రసిద్ధం
> బాసురపతి విప్రునలుక గాసిబడెడె తెలచి పడసెగాదె నయనముల్.'
> 'కావున విప్రారాధకు డై వెలయు విభుండు రాష్ట్రి మతని ధనము సై
> న్యావలి బంధుత విప్రుల దీవనలం బొదలు నింత దెల్లము దేవీ !'

రుద్రమ యొక్కమారుగా ఆపాదమస్తకము కంపించెను. స్ఫుటమై మధురమై మంజులమై ఉదాత్తమై ధీరమై తిక్కన సోమయాజుల కంఠము రుద్రమదేవిదక్షిణకర్ణమును తాడనమే చేసెను. ఆ పద్యద్వయము పక్కనుండ నున్న యందర కెంతో

ఆకర్షించెను. ఎవ్వరు మాటాడలేదు. అందరదృష్టులును శ్రవణములును అప్రయత్నముగా నామండపమువంకకే తిరిగెను.

తిక్కన చెప్పిన పద్యములు వెంటనే గురునాథుడు వ్రాయునే గాని యప్పుడు చదివి వినిపెంపడు. అట్లువి వినిపించుట ఉదయమో మధ్యాహ్నమో. మరల రచనకు దొరకొనునప్పుడే అది యభ్యాసము! ఐనను మధ్యమధ్య నెన్నడైనను వ్రాసినవెంటనే గురునాథు డాపద్యములు సోమయాజులకు వినిపించుటయు కద్దు. ఇప్పు డా పద్యములు రెండును గురునాథుడు చదివి వినిపించెను.

రుద్రమ మరల ఉలిక్కిపడినట్లయి యటు తిరిగి చూచెను. అది యప్రయత్నముగా జరిగినది. ముందు చదివినది సోమయాజి. ఆతనిది రుద్రమకు ఈశ్వరమూర్తిగా పరమశాంతముగా కానిపించెను. ఈ రెండవమారు చదువుచున్నది స్థూలకర్కశ కాయుడగు గురు నాథుడు. అనేక రాక్షసులతో యుద్ధములు చేసిచేసి ఒడలు కాయలు కాచిన కేశవస్వామియా ఇతడు? ఇత డింత బిగ్గరగా చదువుచున్నా డేమి? కొట్టవచ్చువానివలెనే చదువుచున్నాడే! కాని యీ కొట్ట వచ్చుటలో గూడ నెంత కారుణ్యము అంతర్గతముగా కలదు! ఒక్క స్వయంభూ తేశ్వరుడు తాను అన్నమదేవుని బంధించుట ప్రమాదకరమని యుపదేశించుట చాలక కాబోలు, కేశవదేవునిచేగూడ నాదేశింపజేయుచున్నాడు! నేను తప్పనిసరియై అన్న మంత్రీశ్వరుల నీనాడు బంధింపజేసితిని గాని అవజ్ఞచేయ నుద్దేశించి కాదే!

'ఐనను ప్రత్యక్షముగా నా కన్వయించు వాక్యములు ఇట్లు పల్కుచున్నవా రెవరు వీరు?'

ఇట్లామె తలంచుచునే యుండగా సోమయాజులవచనవాక్యములు వినబడెను. 'అని నిర్దేశించి కపర్ది గారితో వెండియు.'

'అమ్మా! నన్నుద్దేశించి పల్కినవి కావు. వీ రేదో గ్రంథ కాలక్షేపము చేయుచున్నారు' అని రుద్రమ యనుకొని యాశ్వాసించుకొనుచున్నంతలోనసె మారన వ్యాసభారతపఠన మారంభించెను. ఏ గ్రంథమో రుద్రమకు బోధపడక ప్రశ్నించుచున్నదానివలె ఆమె యా కూడిన విప్రులవంక తిలకించెను. అందులో వృద్ధ బ్రాహ్మణు డామెభావ మెరిగికొని యిట్లనెను.

"అమ్మ—దేవా, శ్రీతిక్కనసోమయాజులు వ్యాసమహాభారతగ్రంథము ఆంధ్రీకరించుచున్నారు. వారిది నెల్లూరు. హరిహరనాథున కది అంకితము చేసినారు గనుక మనవీట నీ కేశవశ్రీస్వయంభూనికేతనకు లున్న యీ యావరణమునకు వచ్చి నిత్యము గ్రంథరచన సాగించుచుందురు. వారు కేవలము బ్రహ్మణ్యమూర్తులే!"

అంతలో బ్రాహ్మణులు ఆశీర్వచనపఠన లందుకొని మంత్రపుష్పాక్షతలు శ్రీరుద్రదేవమహారాజుల శిరస్సున నుంచిరి. మహారాజులును ఆ చేరిన బ్రాహ్మణుల కందరకు భక్తిపూర్వకముగా తాంబూలములలో ఒక్కొక్కరి కొక్కొక్క సువర్ణ మొంచి సత్కరించిరి.

అంత రుద్రమ తన వెంట వచ్చిన యొక లేఖకునియొద్దనుండి యొక భూర్జపత్రమును వ్రాయు తూలికయు నందుకొనెను. ఆ పత్రమునలు మొగముల చక్కని పూజలు రంగురంగులతో దిద్దియుండెను. ఆ పత్రముపై నామె స్వయముగా ముత్యాలవంటి యక్కరములు వ్రాసి దానిక్రింద తన పేరు వ్రాసి రాజముద్రిక వేయించి పత్రము నావలివైపున అభయచిహ్నముగా తన దక్షిణహస్తముద్రను అద్దెను. ఆ పత్ర మంతట నామె పుష్పములలో పెట్టి యా మహాభారతము వ్రాయుచున్న సోమయాజుల కిమ్మని యచ్చటి వృద్ధబ్రాహ్మణున కప్పగించి సపరివారముగా వెడలిపోయెను.

ఆమె వెడలిపోయిన కొద్దిసేపటికే సోమయాజులు ఆ ఘట్టము ముగించి యానాటికి రచనయే చాలించెను.

"ఈనాడు డెబ్బదితొమ్మిది పద్యము లైనవి" అని గుహనాగుడు లెక్క వేసి సంతోషముగా చెప్పెను. సోమయాజుల కాశ్చర్య మయ్యెను. "ఆ హరిహరనాథుల కృప! ఎన్నియైనను బలికింపగలడు!" ఇట్లనుచు, "ఇప్పుడు పూజకు వచ్చివెళ్లిన దెవరో ఎరుగుదురా?" యని సోమయాజి మారనను గుహనాగుని బ్రశ్నించుచుండెను.

ఆసమయమున వృద్ధబ్రాహ్మణుడు తిక్కనసోమయాజుల యొద్దకు వచ్చి, 'శ్రీరుద్రదేవమహారాజులు ఈపత్రము మీకు అనుగ్రహించినారు' అనుచు నది యందిచ్చెను. సోమయాజి యా వృద్ధబ్రాహ్మణునికి నమస్కరించి యది యందుకొని కన్నుల కద్దుకొని ఇట్లు చదువుకొనెను.

"శ్రీరుద్రదేవమహారాజు లిచ్చిన యాభయపత్రిక.

శ్రీ తిక్కనసోమయాజులకు ఏకశిలానగరమున నెందైనను ఏ వేళనైనను నిర్నిరోధముగా సంచరింప ననుజ్ఞ యిచ్చుచున్నాము. వారి సర్వస్వాతంత్ర్యమునకు అభ్యంతరపెట్టినవారు మాచే శిక్షకు పాత్రు లగుదురు.

శ్రీరుద్రదేవమహారాజు"

(వరాహముద్రిక)

వెనుకవైపున అభయహస్తముద్రయు తిక్కనసోమయాజులు తిలకించెను.
"ఆ వచ్చినది రుద్రదేవమహారాజులే, మహారాజులేనా, గుహనాథా?"

తిక్కనసోమయాజు లంత సరోవరము సమీపించి సాయంసంధ్యావందన మాచరించి కేశవశ్రీస్వయంభూదేవులకు మ్రొక్కిరి. అప్పటికే మహారాజుల యాజ్ఞ వృద్ధబ్రాహ్మణుని ముఖమున కలిసిన యర్చకులు ముమ్మటికంటె నినుమడించిన యాదరగౌరవములతో సోమయాజులయెడ బ్రవర్తింపసాగిరి. అక్కడనుండి గృహాభిముఖులై యాయన వెడలుచుండ, ఆ వార్త ఎట్లు నగరమునం దంతట ప్రాకెనో, భటులు రాజపురుషులు—నందరు సోమయాజులకు సగౌరవముగా నమస్కరించుచు తొలగువారే! ఇట్లు మును పెన్నడు లేనంత గౌరవ మానాడు సోమయాజులకు లభించెను.

ఆ మార్పు కించుక వింత నొందుచు సోమయాజులు ఇంటికి రాగానే అన్నమంత్రీశ్వరులను ఏకాంతవాసమునకు పంపిన వార్తయు వారికి తెలిసెను.

అన్నమంత్రి భార్యలు పార్వతియు లకుమాంబయు సోమయాజులకు చింతాక్రాంతహృదయములతో నమస్కరించి దీవన లందిరి. కాని యా యన్నమంత్రి సత్తముని తల్లి గౌరమమాత్రము సోమయాజుల ఎదుటకు రాలేకపోయెను. 'కారణజన్ము డగు మహాయోగికి ఈ దశ ప్రాప్తించు టేమిటి?' అని ఆమె మాటిమాటికి ననుకొనును. కన్నీరు వదలును.

ఇంట నున్నవా రందరును చింతాక్రాంతహృదయు లై యుండిరి. కాని యం దొక్కరును ఆ విషయము ప్రస్తావింపరు. కారణ మేమని ప్రసంగించుకొనరు. ఇంటికి వచ్చినవారికి యథాపూర్వముగా గౌరవాదరములలో మార్పు చూపరు.

అన్నమంత్రీశ్వరుని ఆరేళ్ల చిన్నకుమార్తెకు మాత్ర మావార్త తెలియదు. కాని అది యందరి ముఖభంగులు చూచుచు నేదో విశేష మున్న దని యూహించెను. కాని దాని కెవ్వరును రహస్యము చెప్పలేదు. ఆ పిల్ల దిగులుపడిపోవునని యట్లు పార్వతి శాసించెను.

ఆ పిల్ల సోమయాజుల కెదురుగా వచ్చి యాయనచేయి ప్రేమతో పుచ్చుకుని, 'తాతగారూ, మా నాన్నగారు ఇంకా రాలే దేమి?' అని ప్రశ్నింపసాగెను.

సోమయాజులు ఆదరముతో నా పిల్లదేహము నిమురుచు నేమి చెప్పవలెనో తోపక మిన్నకుండెను. ఆయనకలవరము గురునాథుడును మారనయు గ్రహించిరి.

బాలకు అప్పటికి మారన యన్న సిగ్గును గురునాథుడన్న భయమును బోయినవి. వారు ఆ పిల్లను నెమ్మదిగా మరిపించుచు మాటలలోనికి దింపిరి.

నిర్లిప్తు డగు సోమయాజులనుగూడ ఆపిల్ల మాటలు కలవరపరచసాగెను. తానే అన్నమంత్రీశ్వరుల నిర్బంధమునకు కారకుడ నేమో అను అనుమానమును సోమయాజుల కంకురించెను. చాల పసిమాటలు చెవులలో మాటిమాటికి దూరుచుండుటచే సోమయాజు లారాత్రి భోజనము చేయలేకపోయెను. రాత్రియంతయు నాపిల్ల 'తాతగారూ, మా నాన్నగారు రాలే దేమి?' అని తన్ను ప్రశ్నించుచున్నట్లే తలపోయుచు సోమయాజు లారాత్రి జాగరణమే చేసెను.

౨౦

దినము లట్లే గడచిపోవుచున్నవి. సోమయాజుల మహాభాగవతరచనమును అట్లే సాగిపోవుచుండెను. కరణపాఠశాలలో జేరిన బ్రాహ్మణులు ముం దనుకున్న కంటె శీఘ్రముగా నా లెక్కల లోతుపాతులు గ్రహించుచుండిరి. వారికి రాత్రిం బవళ్ళదే పని!

విజయదశమినాడు పట్టాభిషేకానంతరమున జరిగిన పేరోలగమున సమ్మె చేసిన జైనకరణముల నందరను క్షమించుచు శ్రీ రుద్రదేవమహారాజు చేసిన శాసనముతో ఆ కరణసంఘములో చీలిక లుదయించెను. అంతటితో నొక సంచలనమును ఏర్పడెను.

తాము చేసినది అపూర్వ మగు నపరాధము. ఒకానొక యా వేశమే త మ్మం దుకు ప్రేరేచినది. రాజధానీనగరమం దెల్లెడ నందర సామంతుల మంత్రుల దండ నాథుల కార్యభరణుల వ్యవహారశాలలలో నిందరు నొక్కసారిగా పనికి పోకుండు టేమి? ఎవరైన తమ కవమాన మొనర్చిరా? భత్యములలో గాని వేతనములలో గాని తమ కేమైన లోటు చేసిరా? లేదే! అయినచో తమకు కోపకారణ మేమి?

యువరాజుగా హరిహరదేవు డైన నేమి, రుద్రమ్మ యైన నేమి, మనకు? ఇన్ని దినములును హరిహరదేవుడు గాని వీరభద్రేశ్వరుడు గాని మన కేమి యొరిగించిరి? రుద్రమ్మ మనకు చేసిన యపకార మేమి? గణపతిదేవులకు తన కూతుసవతిపిల్లలపై కంటె కూతుపై ప్రేమయుండుటలో తప్పేమి? మరియు దన కుమార్తె దౌహిత్రు నిపైమాత్రము ఆయనకు ప్రేమ యుండుటలో అసాధారణ మేమి?

అబద్ధము లగు వేదములు మన్వాదిస్మృతులు ప్రమాణములుగా భ్రాంతిపడు వైదికులకు స్త్రీ రాజ్యము చేయుట కొంత వింత కావచ్చును. కాని మన జైనులలో స్త్రీలకు భర్తవలన వచ్చు నాస్తియందే సంపూర్ణ మగు అధికారము కలదే! అర్హతనీతి ఏమనుచున్నది?

'అనపత్యే మృతే పత్యౌ సర్వస్య స్వామినీ వధూః'

మరియు నదియే,

'విధవా హి విభక్తాచే ద్వ్యయం కుర్యా ద్యథేచ్ఛయా
ప్రతిషేద్ధా నకో ప్యత్ర దాయాదశ్చ కథంచన'.

అని శాసించుచున్నదే! అదియు గాక శ్రీరుద్రమదేవులకు గణపతిదేవుల వలన నీసామ్రాజ్యము సంక్రమించుచున్నది. అందుచే నది యామెకు సౌదాయిక మగు స్త్రీధనము. అది రేపు ఆమె తనయిష్టమువచ్చినవారికి దానము చేయవచ్చును. అర్హతనీతి యట్టిదానిగురించి ఇట్లు చెప్పుటలేదా?

'ఏతత్ స్త్రీధన మాదాతుం నశక్తః కోపి సర్వథా
భాగానర్హం యతః ప్రోక్తం సర్వై ర్నీతివిశారదైః'

అందుచే మన నీతిప్రకారముగా స్త్రీలకు తమకు వచ్చు నాస్తియం దెల్ల జీవితాంత మగు స్వత్వమే కాక సర్వస్వాత్త్వము గలదు. మన కేల కష్టము, వారు మనధర్మమే యవలంబించినపుడు! ఉన్నచో వేదవాదుల కట్టి భ్రాంతు లుండ వచ్చునుగాక!

పూజ్యు లగు వీరభల్లటదేశికులకు రాజసభలో నేదో అవమానము జరిగిన దని ఘోషించినారు. కాని నిజముగా వారి కేమి యవమానము జరిగినది? వారికి తోచిన ధర్మము వారు ప్రవచనము చేసినారు. వారిది స్వభావసిద్ధముగా తొందరవాక్కు! కొంచెము కటువుగా పలికినారు. రాజసభలో మంత్రిసామంతాదు లాకాఠిన్యము సైరింతురా? వారుమాత్రము శ్రీవీరభల్లటదేశికుల నేమన్నారు? వారి వాక్పారుష్యమును కొంత విమర్శించినారు.

అయినా యువరాజు కావలసినది మా కుమారుడన్న మాకుమారుడే యని వివదించుచున్నది మహాదేవరాజును, వీరభద్రేశ్వరులును. అందులో వీరభద్రేశ్వరుడే విశ్వేశ్వరశంభువును ధర్మము నిర్ధారణచేయు మని యర్థించెను. ఆయనకు దోచినది ఇరువురకు గాకుండ మధ్యమార్గము సూచించినాడు. అది చక్రవర్తికి సమ్మతమైనది. మంత్రిసామంతదండనాథులు పలువురకును అది నచ్చినది. మధ్య మన కెందుకు? ఆ వీరభల్లటదేశికులే మరల పట్టాభిషేకసమయమున ఆ రుద్రమదేవుల నొక కలశము చేతగొని యభిషేకించెనే!

మనము చేసిన యపరాధములకు శిక్షలు విధించుటలో ప్రభువుల తప్పేమియు లేదు. శ్రీరుద్రదేవమహారాజులు మనల నందరబంధవిముక్తుల గావించి పలువుర కంఠములే కాపాడినారు! అధికారులకు క్షమాపణము చెప్పికొని యథాప్రకారము మన వృత్తులు స్వీకరించుట యుత్తమపద్ధతి!

జైనకరణములలో పలువురు పైవిధముగా తలంచి యనేకవిధముల నధికారుల క్షమాభిక్ష వేడికొని పూర్వపదవులలో జేరిరి. కాని అందులో నత్యున్నత పదములం దున్నవారికి పలువుర కొక చిక్కు వచ్చెను. వ్యవహారశాలకు తాము రాకున్న దినములలో ఆ ప్రధానపదవులు నెల్లూరినుండి వచ్చిన యా పాకనాటి బ్రాహ్మణకరణములకు అప్పటికే స్థిరపడిపోయెను. వారిని తొలగించి మరల వీరికి ప్రాతయున్నతోద్యోగము లిచ్చుటకు అధికారు లనుమతింపలేదు. అందుచే తాము పూర్వము ఉన్నతాధికారము నెరపినచోటనే ఇప్పుడు ద్వితీయస్థాన మాక్రమింప వలసివచ్చినది. అది యట్టివారికి చిన్నతన మనిపించెను. వారితల కొట్టివేసినట్లే వారి కది భాసించెను. కొందరు స్వయంకృతాపరాధ మని యందుకు తల లొగ్గిరి. కాని పలువు రందు కియ్యకొనక పనులు చాలించికొనిరి.

అన్నమంత్రీశ్వరుని ప్రధానకరణ మగు నాగాచారికి కరణసంఘమున విశేష గౌరవమును పలుకుబడియు గలదు. కరణములు సమ్మెచేయవలె నను నపూర్వవిషయ మూహించినదియు నతడే. అతడు తన తల దక్కదని తెలిసి విజయదశమి వెళ్లువరకును

బయటపడలేదు. ఆ మరునాడు పతకము జంకుచు అన్నమంత్రికి వాగ్దానముచేసెను పోయెను. అతని కక్కడ స్థానము కనబడలేదు. అంతట నాతడు అన్నమంత్రిని దర్శించెను.

అతనిని గాంచినంతనే అన్నమంత్రి జీతబత్తెములు లెక్కలు వేయు కరణమును పిలిపించి వెంటనే నాగాచారికి రావలసియున్న జీతబత్తెములను లెక్కకట్టించి యాతనిముందు పెట్టించెను. నాగాచారికి మాట్లాడుటకు కారణము కలుగలేదు. అన్నమంత్రి కింకను ఏదో మనవిచేయవలెనని యున్నట్లు నాగాచారి యనుమానించుచు నక్కడనే నిలబడెను.

“లెక్కలో తక్కువైన దన్నదా?—ఏమి?” అని యతని లెక్క వేసిన కరణమునొద్ద గల పత్రములు అన్నమంత్రి తీసికొని చదువసాగెను.

అది చూచిన నాగాచారికి కోపము ఆగలేదు. ఉద్రేకము కలిగెను.

“మంత్రీశ్వరా, మీరు పెద్దలు. ఇన్నాళ్ళు మీకడ బానిసగల యుద్యోగము ఒక్కసారిగా తోసివేయుట శ్రేయస్కరమనియే ఎంచుదురా?” అని యాతడు ప్రశ్న వేసెను. అతని సర్వాంగము వణకుచుండెను.

అన్నమంత్రీశ్వరుడు ప్రత్యుత్తర మీయలేదు. చిరునవ్వు మాత్రము నవ్వెను.

ప్రత్యుత్తరమునకై నాగాచారి కొంతతడవు నిరీక్షించెను. అన్నమంత్రి యా గణితము పూర్తిచేసి యావల నుంచి మరుమాటాడక మొదలు తాను చేయుచుండిన పనిలో నిమగ్న మయ్యెను. కొంతసేపక్కడనే నాగాచారి యుట్టే నిరీక్షించెను. ఇంకను అట్లే యున్నచో బవిరిసీడు వచ్చి తన్ను బయటికి బలవంతముగా తీసికొనిపోవును. అది తెలిసిన నాగాచారి ‘సెలవు తీసికొందును!’ అని నిర్లక్ష్యముగా పలుకుచు తన కిచ్చిన ద్రవ్య మచ్చటనే వదలి వెడలిపోయెను.

సర్వమును అన్నమంత్రి పరీక్షించుచునే యుండెను. నాగాచారి వెళ్లినదేతడవుగా ఆతడు తన యాశ్వికభటుడగు బవిరిసీని పిలిపించి యా ద్రవ్యము నిర్దేశించి యది నాగాచారియింటియొద్ద నిచ్చి రమ్మని పంపెను. ఆత డాద్రవ్యము నాగాచారి ఇంటికి చేరకముందే అక్కడ చేర్చి వచ్చి మంత్రీశ్వరునకు నివేదించెను.

నాగాచారివలెనే కొంచె మించుమించుగా ఎందరో ప్రధానకరణములును పెద్దకరణములును తమ యుద్యోగములు పోగొట్టుకొనిరి. వారితోపాటు వారి నాశ్రయించుకున్న చిల్లరవ్రాయసకాండ్రును బలువురు మరల తిరిగి పూర్వపు పనులలో జేరుట కిచ్చగింపలేదు.

తాటాకులపై గంటము చెక్కుకొనిపోయినదే గదా లేఖనము సిద్ధించునది! రాగిరేకులపై లేఖనముకూడ శాణము చిరుసుత్తియ సహాయముతో కొంచెము హెచ్చుతగ్గుగా నట్లు ప్రసరించుటవలననే గదా సాధ్యపడునది! తాటాకులపైనను రేకులపైనను అక్షరములు లిఖింపబడును. మరి శిలలపై నక్షరములును రూపములే తొలువబడును. సుత్తెదెబ్బలతో టంకము శిలలపై రూపకల్పన చేసి శిలలను గంధారపు బొమ్మలనుగా మార్చివేయును. ఆ పనియే కొంచెము భేదముతో చేసిన దారువులును

ఉలిచే బాకితల సహాయమున అనేకరూపాంతరము లొంది సజీవము లగును. స్వర్ణాదిలోహములను కరగించి ఆభరణవిగ్రహాదిస్వరూపములను పొందించుటకూడ పై కార్యములకు తుల్యమైనదే. ఈ విద్యలన్నిటికి సారూప్య మున్నది. కాని యీ యన్ని విద్యలలో ఒక్కొక్కదానిలో ప్రత్యేకప్రావీణ్యము అభ్యాసముచే సంపాదింపవలెను. అంతే! వ్రాయసకాండ్రు వ్రాయసవృత్తితోపాటు దారు శిలాస్వర్ణాదులలో నొకటిగాని కొన్నిగాని యన్నియుగాని యభ్యసించుట యలవాటు. ఆ యన్నిటిలో వ్రాయసవృత్తి సులభముగా కనబడును. కాని కళాకుశలు రగు నా జైనకరణముల హస్తములలో లిఖించు తాళపత్రములు గూడ నొక యపూర్వ శోభతో విరాజిల్లుచుండెను.

మరియు నొక విశేషము కలదు. అప్పటికే చాలకాలమునుండి దక్షిణదేశమున భూర్జపత్రములమీద వ్రాయుటకూడ వాడుకలోనికి వచ్చినది. దానియందు జైనకరణములకు విశేషమభిమానము. భూర్జపత్రముపై గంటము సాగదు. దానిపై తూలికలతోనే వ్రాయవలెను. వ్రాయుటకు ముందు వారు ఆపత్రమును రంగు రంగుల తీవలతో పుష్పలతో నలంకరించి వానిపై బంగారు వెండి హరిద్రా కుంకుమములు ఒత్యాను లద్ది వ్రాతకు ఆయత్తము చేయుదురు. అట్లు పత్రము శోభాయమానముగా దిద్ది గాని యందుపై వారు వ్రాయ దొరకొనరు. వ్రాత యనునది పత్రములపై చదువుటకుమాత్ర ముపయోగించు సంకేతము లగు కొన్నిరూపములను ఉంచుటకాదు. అవి సంకేతములే కాదు. అవి అక్షరములు! దేవసదనములో పూజామూర్తు లెట్లో పత్రముపై వ్రాసిన యక్షరము లట్లు! దేవసదనము లలంకరించినట్లే పత్రములను చూచువారికి ఆకర్షకముగా నుండవలెను. జైనమతమున నీ సృష్టియు నిత్యమే. దానికి నాశము లేదు. సిద్ధిపొందదగిన జీవులకు ఈ శరీరమే అందుకు సాధనము. అందుచే ఈ శరీరమును పరిశుభ్రముగా పవిత్రముగా ఉజ్జ్వలముగా నుంచవలెను. అందుచే వారు వ్రాయు పత్రములు అందలి యక్షరములు రమణీయోజ్జ్వలములుగా నుండవలెను. మరి యా పత్రములు గ్రథనము చేయు కోశములుగూడ చూచువారికి పూజ్యభావము సద్యస్స్ఫూర్తిగా కలిగింపవలెను. వ్రాయుటకూడ ఒక శిల్పమే, ఒక కళయే! ఆ విషయము జైనుల గ్రంథములు చూచినవారికే అవగత మగును.

ప్రధానకరణములు పలువురు మిక్కిలి ధనవంతులు. వారికి జీవనములకు వ్రాయసవృత్తిపై నాధారపడవలసిన యవసరము లేదు. వా రనేకశిల్పములందే కాక స్థాపత్యమునందుగూడ సమర్థులు. అందులో ఎవరి కభిమాన మున్న కార్యములు వారు చేయగలరు. ఆంధ్రరాజ్యమున గాకున్న వారు దేవగిరికి పోగలరు. కళింగమున వారికి బహుమానములు లభించును. హొయిసలబల్లాల రాజ్యమునను చోళపాండ్యకేరళాదిదేశములలోనను వారిని నెత్తినపెట్టుకొందురు. అందుచే కొందరు నిర్లక్ష్యముగా నంధ్రదేశము వదలి నలుదిశలకు సద్దుకొనిరి. కొందరు స్వస్థానములు వదలలేక అచ్చటనే నిలిచి స్వర్ణకారాదివృత్తులలో స్థిరపడసాగిరి.

అట్లు నిలిచిపోయినవారికి పలువురకు చిరకాలము వ్రాయసవృత్తిలో చేతులు మెలగినందున కఠినము లగు స్వర్ణదారుశైలాదులలో నంత నిపుణముగా వారి హస్తములు ప్రసరింపకుండెను. వ్రాయసవృత్తిలో నున్నపుడు సంపాదనము తక్కువైనను సంఘములో నొక గౌరవ మెక్కువ యుండెను. ఆ గౌరవ మిప్పుడు వారికి పోయినది. తమకంటె తక్కువవా రని ఇన్నాళ్లు తలచినవారితో సమానముగానైన ఇప్పుడు ఆ కర్మలలో నైపుణి వీరికి కుదురలేదు. అట్టి సామాన్యకరణములకు తమ వ్రాయసవృత్తితోపాటు జీవనాధారమే పోయినట్లయినది. వారికి అంధ్రరాజు మీదను వారి మంత్రిసామంతదండనాథులమీదను అంతరంగములలో తీవ్రమైన కోపము చెలరేగినది. కాని యేమి చేయగలరు? అట్టివారికి నాగాచారివంటి ప్రధాన కరణములు ప్రభువుపై ద్వేషము వృద్ధియగునట్లు ప్రేరేపుచుండిరి. అమాయకు లగు నట్టి పేదలు ఉద్రేకపూరితులై సమయము చిక్కినప్పుడు అకార్యములు చేయసాగిరి. వారిలో పట్టుబడినవారికి రాజపురుషులు శిక్షలు విధించుచుండిరి. అట్లు వారు పొందు శిక్ష లతిశయించుచున్నకొలదియు వారికి ప్రభుత్వముపై ద్వేష మభివృద్ధి నొందసాగినది. అందుపై నల్లరులు పెరిగినవి. శిక్షలు పొందినవారు తాము చేసిన దోషములు తలపోయుట మాని, రాజపురుషులు విధించు శిక్షలే భావించుచు, వారికి పక్షపాత మారోపింపసాగిరి. మున్నెన్నడు లేనిది కాకతీయ ప్రభువులకు జైనులపై ద్వేషము జన్మించిన దని యొక ప్రథ వారు ప్రవర్తింపజేసిరి. వినాశకాలే విపరీతబుద్ధిః!

ఇట్లు పురుషులే కాక స్త్రీలుకూడ ప్రభువులను ఆడిపోయసాగిరి. అట్టి యపప్రథ యొకసారి లోకములో ప్రవర్తమానమైనచో దాని నెవ్వ రాపగలరు. దొరలించిన చక్రమువలెనే అదియు సాగిపోయెను. చౌర్యము చేసినవారికి కరచ్ఛేదనము సామాన్యశిక్ష! ఆ శిక్ష పొందినది ఒరుడైనచో నెవ్వరు నేమియు ననుకొనరు. కాని అది జైనచోరునికే తటస్థించిన వారిలోవారు 'మరల వీని నొకనిని గూడ శిక్షించుచున్నారు. మన కిక తలలు నిలువవు. పాప మిత డెంత మంచివాడు! ఇట్టివానినా రాజపురుషులు శిక్షించుట? వినాశకాలే విపరీతబుద్ధిః!' ఇట్లని యనుకొందురు. అట్టి మాటలు వినిన జైనేతరులు గూడ, 'కాబోలు పాప'మని జాలి నొందుదురు. ఇట్టి యపప్రథలు నాగాచారి సర్వవిధముల పట్టణమున పొక్కునట్లు చేయుచుండెను.

కాని యీ వ్రాయసకాండ్ర రోషమంతయు ముఖ్యముగా బ్రాహ్మణకరణ పాఠశాలపై కేంద్రీకరించెను. "ఇది మహాప్రమాదము! వీరికి అబద్ధ మగు వేదమును గంగిరెద్దువలె తల లాడించుచు అప్పగించుట మాత్రమే వచ్చును. ఎంతవారితోనైనను వారికంటె తామే అధికుల మైనట్లు ప్రవర్తింతురు. దౌర్భాగ్యవశమున నట్టి మూఢులకే ఈ రాజ్యమున విశేషగౌరవము కలదు. వీ రేమి వ్రాయగలరు? వ్రాసినను అందముగా వ్రాయుట ఎన్ని జన్మముల నభ్యసించిన వీరికి రాగలదు? ఈ ఛాందసులకు లెక్క లేమి యవగతము కాగలవు? రాజ్యతంత్రము

మీ క్షేమమేమగును? మీరి ఫలము ప్రభువులు త్వరలోనే తెలిసికొందురు. అప్పుడు వారే మనతో [illegible] కట్టుదురు. తొందర ఏమి?—"

ఇట్లు వారిలో [illegible] మందురు. ఒక వంక 'తొందర యేమి?' యనుచునే యుందురు. మరియొకప్రక్కను వారి చిత్తములు అలజడిచెందుచునే యుండును; వారి కన్నులలోని తొందర స్పష్టముగా వారి దేహములలో నాపాద మస్తకము ప్రతిఫలించుచునే యుండును. ప్రభువులను, బ్రాహ్మణకరణములను నోరార తిట్టుకొని, తిట్టుమన్నకొలదియు వారికి వారిపై ద్వేష మతిశయించును.

కరణ పాఠశాలలలో చేరిన బ్రాహ్మణులు వారికి వీధిలో కనబడినచో వారిని ఏవో విధములుగా వారు పరిహాసము చేయుదురు. వారికి వినిపించునట్లు తమలో తాము తిట్టుదురు. వారు పెట్టుకొనిన పిల్లజుట్టులను శిరస్సులపై ప్రకాశించు శిఖలనో పైనుండి త్రిప్పి యిప్పుడు చెంపలలో ఎగురవేసి యుండి లాగుదురు. వారు వెనుకకు తిరిగి చూచినతోడనే లోపల నవ్వుకొనుచు కిలకిల నవ్వుదురు. ఒంటరిగా వారు దొరకినయెడల నట్టివారిని అటునిటు చూచి ప్రహరించి సందుగొందులలో దూరి పారిపోవుదురు. అందుచే ఈ క్రొత్తగా లెక్కలు నేర్చుకొను వారు ఒంటరిగా చీకటివేళల నగర వీధుల సంచరించుటయే ప్రమాదభూయిష్ఠమయ్యెను.

వారు చెప్పుకొను పాఠములు ప్రారంభించుట సామాన్యముగా మధ్యాహ్నము నుండియే. ప్రతిదినము నూతనాటికరణములందరు నా పాఠశాలలకు వచ్చుచుండుటకు వారికి తీరుబడి లేదు. అందుచే కొందరే వచ్చుచుందురు. ఆ పాఠశాలలును ఒక్కచో లేవు. స్వయంభూదేవాలయ ప్రాంగణమునను, ఏకవీరాదేవి, చముడేశ్వరీ శక్తి, భైరవస్వామి, మసానమ్మ, కామునసామి, పాండవుల గుడి, వీరభద్రేశ్వరుడు, మాహురమ్మ, కామవల్లి, మహాలక్ష్మి, కాకతిమ్మ—ఇత్యాది దేవతల యాతనము లందును, కొన్ని కరణపాఠశాలలు పెట్టిరి. మరికొన్ని పెద్ద ధర్మసత్రముల మధ్య భాగమున గల మండువాలచుట్టును సాగుచున్నవి. అయినను అవి చాలవు. ఆరు వేలమంది చదువుచుండిరాయె! కొన్ని కొన్ని పాఠశాలలు నగరములో మధ్యమధ్య గల విశాలప్రదేశములలో తాత్కాలికము లగు, వెదురు తాటియాకు కొబ్బరియాకు రెల్లు అడవియాకు మొదలగు పరికరములతో నిర్మింపబడినవి. వాని కెల్లప్పుడును అవసర మగుచు వచ్చిన తడకలు సిద్ధముచేయుచు మేదరవాడ రాత్రింబవళ్లు పని చేయుచు తీరిక లేకుండెను.

ఇట్లు తాత్కాలికము లగు సాధనములతో నిర్మింపబడిన పాఠశాలలు ఉద్యోగములు పోయిన చిల్లరకరణములకు కన్నులు కుట్టించుచుండెను. ఈ రాత్రి బ్రాహ్మణ వాడలో నట్టి పాఠశాల యొకటి పరశురామప్రీతి యగును. ఇంకొకటి రేపు అక్కలవాడలో కూలిపోవును. మరునాడింకొకయెడ గల పాఠశాలకప్పు తెల్లవారు నప్పటికి కనబడదు. ఇట్లు పరిపరివిధముల నా పాఠశాలలు సాగకుండ విఘ్నము లొనర్చుట కా దుండగులు ప్రయత్నించుచుండిరి.

అయినను నానావిగ్రహములు ప్రభువుల యభిమానమును నున్నందున ఆ పాఠశాలలో విద్యాబోధనమునకు కట్టిదిట్టమైన నిరోధము కలుగకుండ నవి సాగిపోవు చుండెను. దహనమైన పాఠశాలకంటె బలిష్ఠములగు భవనము మరునాటికే అక్కడ సిద్ధమగును. కూలిపోయినది నిలువబడును; తప్పిపోయినవారికి ఉద్యానవనము మరల సరియగును. పైపెచ్చు రాత్రింబవళ్ళు వానిని రక్షించుచుండుటకు భటులు నియమింపబడిరి. వారును ఆ శాలలపై దుర్మార్గుల యత్నాలెవరును కలిగిన వారిని పట్టి దండింపసాగిరి.

ఈ పాఠశాలల కన్నిటికి మూలకారణము అన్నమంత్రి. అన్నమంత్రిపై ముఖ్యముగా వారి ద్వేషము లగ్నమగుటలో ఆశ్చర్యము లేదు. అందును అతనిపై ప్రత్యేకముగ ద్వేష మూనిన నాగాచారి నిజముగా నాగావతారమే, ఆశీవిషమే, పన్నగమే, కర్కోటక స్వరూపమే, ద్విజిహ్వాకారమే! అతడు దీర్ఘక్రోధుడు. అత డూహించిన విధమున తన్ను అన్నమంత్రి యవమానించినపిమ్మట వారము దినములైన తిరుగకముందే ఆ మంత్రి రాజమందిరములో బంధితుడయ్యెను. ఇంకను ఆ శిక్ష చాలదు. అతని నిర్బంధము ఎంత చిత్రముగా నున్నది! అతని కన్ని మర్యాదలును జరుగుచున్నవి. అయినను అతడు నగరమునందు నాయంతటివాడు లేడని గొప్ప విఱుచుకొని యిప్పుడు తిరుగాడుట లేదు. రాచనగరు వదలి బయటకు వచ్చుట లేదు. తన యింటికైనను వచ్చి చూచిపోవుట లేదు. అతని భార్య బిడ్డలుగాని తల్లి సాక్షీదేవిగాని ముద్దులకూతురగు బాలాంబగాని యాతని చూడబోవుట లేదు. ధాంపిను లగు నలువురు బ్రాహ్మణులుమాత్రము రాకపోకలు సలుపుచున్నారు. ఇప్పు డన్న మంత్రికూడ వారితోపాటు గంగిరెద్దువలె తల యాడించుట అభ్యసించుచున్నాడందురు. అది కారాగారమున నుంచుట కాదా? కాకున్న నాతనిపై నభిమానముచే నతనికి తగినట్లు శృంఖలములు తగిలింపలేదు; తల తరుగలేదు. బంగారుపంజరములో చిక్కుకొని నట్లయినాడు. మహారాజుల దక్షిణభుజమ నని విఱ్ఱవీగిన యాతడు నేడు రాజద్రోహిగనే పరిగణింపబడుచున్నాడు!

కాని యీ ప్రభువుల బుద్ధు లర్థము కావు. చాంచల్యము, పక్షపాతము, దురభిమానము, ఆశ్రితవాత్సల్యము వారిని నానామార్గముల లాగుచుండును. అన్నమంత్రి రాజద్రోహి యైనచో ఆ తిక్కన ఏల కాడు? అతనివెంట వచ్చిన యా పాకనాటికరణములు నూర్వురు నేల కారు? ఆ తిక్కన చెవులకు తగిలించుకొన్న కుండలములు, ముఖమున ప్రకటించు దొంగ మార్దవము, ఆ కరణములు మాటిమాటికి చేయు స్వస్తివాచనమంత్రములును ప్రభువులను దిగ్భ్రాంతుల గావించినవి. అన్నమంత్రికి వారి కాశ్రయ మిచ్చినందుకే శిక్షయు. ఆ యాతని యాశ్రితులకే ఈ ఆదరాభిమానములును, సూటిగా నాలోచింపగల మాబోంట్ల కర్థ మగునా?

ఈ విధముగా నాగాచారియు నతని మిత్రులును సహచరులును ఆలోచించుకొనుచుందురు. కాని వారి యాలోచన తెగదు. తిక్కనపై ద్వేషము పెరుగును. అది వారివెంట నున్న చిల్లరకరణములకు ప్రాకును. ఏమి యా ధైర్యము ఈ తిక్క

నకు! మహారాజుల యభయహస్తమే తన్నెల్లప్పుడు రక్షింప గలదని కాబోలు వాతని యతిశయము!

తిక్కనసోమయాజియు తనవెంట గురునాథుడును మారనయు ననుసరింపగా అన్నమంత్రిగృహమునుండి కేశవశ్రీస్వయంభూదేవాలయములయొద్దకు నిస్తంద్రులై నడచిపోవుచుండుట అనుదినము చూచుచూచి వారిలో కొందర కంతకంతకు భరింప రాని దయ్యెను.

ఒకనాటి సాయంకాలమున సోమయాజి యానాటి శ్రీమహాభారతరచనము ముగించుకొని స్వయంభూసరోవరములో వార్చి దేవదర్శనము కావించుకొని తిరిగి యింటికి వచ్చుచుండెను. యథాప్రకారము మారనగురునాథులు మాత్ర మాయన వెంట నుండిరి. వైకరణములచే ప్రేరేపింపబడిన కొందరు కర్ణాటకులు మదిరాపాన మత్తులై వారి కెదురు వచ్చుచుండిరి. ఆ త్రిమూర్తులకును ఉన్న రాజానుగ్రహము నాగరకు లెల్లరు నెరిగియున్నందున నందరును, పెద్దలుగాని పిన్నలుగాని, ఎట్టివా రైనను ఎదురైనయెడ గౌరవముతో వారికి దారివిడిచి ప్రక్కకు తొలగు చుండుట పరిపాటియైనది. ఆనాడు తిక్కనసోమయాజియు మిక్కిలి చింతా పరుడై యడుగులు వేయుచుండెను.

'అన్నమంత్రీశ్వరున కీ నిర్బంధ మేమి? నా కీవిశేషగౌరవ మేమి? ఈ నగరమున నెందు బోవుట కైనను సర్వస్వాతంత్ర్యము నాకు మహారాజులు దయచేసినారు. కాని నా కెం దేగవలసిన యవసర మున్నది? నా త్రేతాగ్నిశాలయు కేశవశ్రీస్వయంభూనికేతనములును గాక వే రెందు బోవ పని యున్నది! అన్నమంత్రినిగూడ నేను చూచిరావచ్చును. కాని చూచి యేమి చేయుదును? సామ్రాజ్య పట్టాభిషిక్తు లగు మహారాజుచే శిక్షితుడైన యన్నమంత్రీశ్వరుల నైనను మాబోంట్లము దర్శింపవచ్చునా? దోషము కాదా? అతడు నిర్దోషియే అట్లు నిర్దోషి యని మరల మహారాజులచే నిశ్చితమగువరకు నట్టివానిని మాబోంట్లము చూడరాదు! ఎంత కష్టమగు వ్రతము! అదియును గాక అన్నమంత్రిని నేను చూచి వచ్చుచుండుట యుక్తమును గాదు. మహారాజుల యాజ్ఞలు చిత్రములై యగమ్యగోచరములుగా నుండును. నే నీ యనుమతి నాధారము చేసికొని అన్నమంత్రియొద్దకు రాకపోకలు సల్పుచుందునేమో పరీక్షించుటకుగూడ నిట్టి సర్వస్వాతంత్ర్యము మహారాజులు నా కిచ్చియుండవచ్చును.—'

ఈవిధముగా సోమయాజి చింతించుచుండెను. కాళ్లు మాత్రము సుపరిచిత మగు రాజమార్గమున సాగిపోవుచుండెను. కృష్ణపక్షము! చీకటిగా నున్నది. ప్రక్క నున్న మందిరములనుండి దీపముల వెలుగు రాజమార్గమును మధ్యమధ్య తునుకలుతునుకలుగా పడుచు భాసింపజేయుచుండెను.

వా రప్పు డొక చీకటిసందులోనికి చొచ్చియుండిరి. సోమయాజి యాలోచనలో నుండి బాహ్యప్రపంచ మెరుగకుండెను. ఆకస్మికముగా తన చుట్టును

గండడనోకేకముగా పెద్దవ్వా [illegible] చూచుచున్నట్లు [illegible] నట్లు సోమయాజి చుట్టును పరికించెను.

ముందు త్రాగి వచ్చుచున్న కర్ణాటకులు [illegible] కొట్టుటకై అన్నిదిక్కులనుండి [illegible] కేకలు వేయుచు మారనపై కర్రలు విసరుచుండిరి. ఆయనపై గురి చూచిన దెబ్బలన్నియు [illegible] కాచుకొనుచుండెను. గురునాథుడు సింహమువలె [illegible] క్రుమ్ముచు త్రోయుచు [illegible]. [illegible] ఆయన నాల్గుప్రక్కలనుండి యా త్రాగుబోతుల మూకలో [illegible]. [illegible] దిగివచ్చి కారవసేనలు చెల్లాచెదరు చేయుచు [illegible] తన చర్యతో ప్రత్యక్ష[illegible]. [illegible] త్రోయుచు త్రోపులవు ఒక్కొక్కసారి నలుగురు, ఐదుగురు, [illegible] కట్టలు కట్టుకొనిగా [illegible] నొకరు పడి నేల కరచుచుండిరి. ఆ [illegible] దెబ్బలు తప్పు కొనుచు ఎట్లో సుకుమారుడు [illegible] మారనపైకి [illegible] కవియ ప్రయత్నించుచుండిరి. వారు కొట్టుచున్న దెబ్బలతో మారనదేహ మంతయు కమలిపోయెను. అత డెంతసేపటికిని తిక్కన [illegible] దెబ్బలు [illegible] కాచు కొనుటయేగాని తన్ను రక్షించుకొనుటకుగాని యా త్రాగుబోతులను శిక్షించుటకు గాని యత్నింపలేదు. సోమయాజి నిస్తంద్రుడై నిలుచుండెను.

అంతలో గురునాథుడు వచ్చి చూచి మహోగ్రుడయ్యెను. మారన సోమయాజుల నిక రక్షింపజాలమని స్పష్టమయ్యెను. ఆ గుంపులో నొకరియొద్దనుండి యొక దండమును గురునాథుడు బలవంతముగా లాగికొని అది మిక్కిలి చాకచక్యముతో త్రిప్పుచు సోమయాజుల చుట్టు ప్రదక్షిణము చేయసాగెను. ఆ దండె మాతని చేతిలో కాలదండమువలెనే భయంకరమై తాండవింపసాగెను. ఆ యాటోపమునకు ఆ కర్ణాటకుల గుంపు తాళలేక చెదరిపోజొచ్చెను.

సరిగా ఆసమయమున నొక్కసారిగా అన్నిదిక్కులనుండి శంఖారవములు మారుమ్రోగినవి. మారనను వీరభద్రులతో గండడు గుంపును చుట్టుముట్టెను. వీరభద్రులను చూచినంతనే పారిపోవ దారిలేక ఆ కర్ణాటకులు నిలువున నిలువబడి పోయిరి. త్రావిన మత్తు ఒక్కసారిగా వీరభద్రులు ప్రయోగించిన కశాఘాతము లతో వారికి వదలిపోయినది!

రౌద్రమూర్తియై ఇంకను కర్ర త్రిప్పుచునే యున్న గురునాథునకు గండడు వినీతుడై మ్రొక్కి శాంతింపు డని ప్రార్థించెను. అప్పటికిగాని రాజభటులు వచ్చినా రని గురునాథునకు తెలియలేదు. అప్పుడు రోజుచు త్రిప్పుచున్న కర్ర యాపి యాతడు నిలువబడెను. గండ డామువ్వురను పరామర్శించి ఆ కర్ణాటకుల గుంపులో నున్న నలువదిమందిలో నొక్కరినిగూడ తప్పించుకొనిపోనీయక పాశములతో దృఢముగా బంధింప జేసి చెరసాలకు తీసికొనిపోయెను.

గురునాథుని సైదండసహాయముతో మారన ఎట్లో ఇల్లుచేరెను. తిక్కన సోమయాజి మారనపై కరుణార్ద్రమగు దృక్కులు పరపుచు నతని దెబ్బలు తన యమృతహస్తముతో నిమురుచు తోడ నడచెను.

ఇంటికి చేరగనే మారన నిలువలేక తూలి పడిపోయెను. అన్నమంత్రియింటిలోనివా రందరును మారనచుట్టు మూగి గురునాథునివలన జరిగిన వృత్తాంతమంతయు దెలిసికొనిరి. అందరును మారనకు సమస్తవిధము లగు నుపచారములు చేయసాగిరి.

కాలమున కెంత వైపరీత్యము వచ్చినది! రాజధానీనగరవీథులలో అన్నమంత్రీశ్వరునికి పూజ్యు లగు నతిథులను త్రాగుబోతులు చుట్టుముట్టి కొట్ట సాహసించుటా!

అన్నమంత్రీశ్వరుని కుమార్తె బాలాంబ మారనను ఆ స్థితిలో చూచినంతనే బావురు మని యేడ్చుచు నతనియొద్దనే నిలిచిపోయెను. మారనకు శీఘ్రముగనే స్మృతి వచ్చినది. ఎంత చెప్పినను ఆ రాత్రి బాల అన్నము నీరు ముట్టలేదు. నిద్దురపోలేదు. మారన యున్న చోటినుండి ఈవలకు రాలేదు. మారనబాధకంటె ఆ ఆరేళ్లపిల్ల యా వేదన చూచినవారికి కడుపు తరుగుకొనిపోవునట్లుగా చేసెను. అది మాటిమాటికి 'తాతగారూ, తాతగారూ,—' అని సోమయాజిని పిలుచుచు ఆ సాయంత్రము జరిగిన వృత్తాంత మడుగును. విసుగు లేకుండ గురునాథు డాదరముతో నది యడిగినదానికెల్ల ప్రత్యుత్తర మొసగుచుండెను.

'మా నాన్నగారు చూచిన ఆ నీచులను ప్రాణములతో పోనిచ్చెడివారా?— తాతగారూ, నాన్నగారు ఎక్కడ నున్నారు?' బాల యట్లు ప్రశ్నింపగా గురునాథుని కన్నుల నీరు గారెను. సోమయాజులకే కన్నులు ఆర్ద్రములై మొగ మావలకు త్రిప్పుకొనెను.

———

౨౧

‘ణమో అరిహంతాణం ణమో సిద్ధాణం ణమో ఆయరియాణం
ణమో ఉవజ్ఝాయాణం ణమో లోఏ సవ్వసాహూణం[1]’

పంచనమస్కారమంత్రము.

కార్తికమాసము వచ్చినది. ఈ మాసము స్మార్తులును శైవులును వైష్ణవులును పరమపవిత్రముగా భావింతురు. జైనులకు గూడ దీపావళి మహాపర్వసమయము. అది వారి సంవత్సరాది. ఆనాడు మహావైభవముతో వారు లక్ష్మీపూజ గావించి తదాది కార్తికమాసమున లక్ష్మీమహోత్సవములు వైభవముగా జేయుదురు. అందుచే వారికిని కార్తికమాసము మహాపర్వమే!

ఏకశిలానగరమున ఆగ్నేయదిశను మట్టికోటప్రాకారమున నొక చిన్నగుట్టవంటి గండశైలము కలదు కదా! రాజులు క్రీడాశైలముగా చేసికొన్న గండశిలకంటె నిది మిక్కిలి చిన్నది. అందుచే నిది చేరువకు బోయిన గాని కన్నులకు కనిపింపదు. ఈ గండశిల నంటి జైనసిద్ధుల వసతి యొకటి యేర్పడె కదా. ఆ శిల నానుకొని దాని చుట్టును ఎన్నియో చిన్న చిన్న గదులు గల మందిరములు నిర్మింపబడినవి. ఒక్కొక్క గదిలో ఒక్కొక్క జైనశ్రావకుడు వాసము చేయుచు నందు తపస్సు చేసికొను చుండును.

అర్హత్‌స్థితి నధిగమించుట జైనులలో సర్వోత్తమస్థితి. వారును రెండువిధములు. అందు మొదటివారు తీర్థంకరులు. అట్టివా రింతవరకు ఇరువదినలుగురు మాత్రమే అవతరించిరి. జైనధర్మము క్షీణప్రాయమైనప్పుడెల్ల అట్టివారు దాని నుద్ధరించి చతుర్విధ మగు జైనసంఘమును స్థాపింతురు. ఆ తీర్థంకరులలో ప్రథముడు ఋషభనాథుడు. వారిని నాథశబ్దాంతముగా స్మరించుటయు కలదు. ఆ ప్రథమతీర్థంకరుని నందుచే ఆదినాథు డని వ్యవహరించుటయు జైనసంప్రదాయము. ఇరువది నాల్గవ తీర్థంకరుడు వర్ధమానమహావీరుడు. రెండవవిధమువారిని కేవలు లందురు. వీరును తీర్థంకరులవలెనే ఆత్మకు గల నాలుగు కషాయములను నిర్జించి కర్మబంధమును త్రెంచివేసికొని ఆత్మను స్వస్వరూపమును బొందించుట యను మోక్షమును పొందినవారే. దగ్ధమైన బీజమునుండి ఎన్నడైన మొలక యంకురించునా? వారు కర్మబీజము దగ్ధము చేసినవారు. అందుచే వారికి భవాంకురము పుట్టదు. ఇట్లు కర్మక్షయము చేయుటచేతనే అట్టివా డీశ్వరు డగును. అంతియే కాని నిత్యముక్తుడును సనాతనుడును నగు వేరొక యీశ్వరుడున్నా డని వా రంగీకరింపరు.

---

1. అర్హతులకు నమస్కారము. సిద్ధులకు నమస్కారము. ఆచార్యులకు నమస్కారము. ఉపాధ్యాయులకు నమస్కారము. లోకమునందు సర్వసాధువులకు నమస్కారము!

'కేవలు' డగుటకు రెండుమార్గము లున్నవి. అందులో నొకటి దగ్గర దారియే కాని బహుకష్టసాధ్య మైనది. ఇది జైనసన్యాసు లవలంబించు సాధుచరిత్రము. రెండవమార్గము సులభమైనదే కాని దానివలన బహుకాలమునకు గాని సిద్ధి లభింపదు. ఇది సామాన్యు లనుష్ఠించు గృహస్థధర్మము.

ఇప్పటికి సంవత్సరమునుండియు ఆ జైనవసతిలో నొక మూలనున్న గదిలో ఒక సాధువు వాసము చేయుచుండెనట. అత డిన్నినాళ్లును తలుపులు తీయకుండు నని నియమము చేసి ఆ గదిలోనే ఉండెనట. ఇన్నినాళ్లును అతడు బయటికి వచ్చియుండుటగాని లోపలి కేగుచుండుట గాని ఆ వసతిలో నెవ్వరును ఎరిగి యుండలేదట. ఈ సంవత్సరకాలమునుండియు ఆ గదిద్వారము ఎల్లప్పుడు లోపలను బయటను బంధింపబడియే యుండును. ఒకొక్కమారు అందులోనుండి ఘంటానాదము వినవచ్చును. మరియొకతరి దివ్యగాంధర్వము వినిపించును. ఇక కొన్ని సమయములలో అంతర్గర్భితమైన ప్రణవనాదమె యందుండి వెలువడుచుండును. ఆ సాధువును సేవించుటకై ఇంద్రాదులును యక్షగంధర్వులును వచ్చుచుందు రని చెప్పుకొందురు. ఆ వసతిలోని పరిచారకులు తామా గదిలోనుండి వింత సంభాషణలు పలుమారు వింటిమని చెప్పుదురు. జైనశ్రావకులు పలువురు అర్ధరాత్రపూజ కావింతురు. అట్టి పూజ తాము చేయుచుండగా కొన్ని చీకటిరాత్రులందు ఆ గది దేదీప్యమాన మగు నక్షత్రరూపము పొంది యాకాశవీథిలోని కెగిరిపోయి కనరాకుండుట కన్నులార తాము చూచితి మని యక్కడి శ్రమణులు చెప్పుచుందురు. అట్లు చెప్పుచు వారే తాము ప్రత్యక్షముగా చూచిన యా యమానుషవిశేషము ఎట్లు సాధ్య మయ్యె నని పరస్పరము తర్కించుకొందురు. దీర్ఘముగా వారు సమస్త విషయములు సమన్వయించి యీ గదిలో నున్న సాధువు పంచభూతములను తన వశము చేసికొని వాని కతీతుడైన యొక మహాసిద్ధపురుషు డని నిశ్చయము చేసిరి.

ఈ మహామహుని మహత్త్వవిశేషములు దినమున కొక క్రొత్త రీతిగా ఆశ్వయుజమాసకృష్ణపక్షమునుండి ఏకశిలానగరమం దెల్లెడల వ్యాపించుచుండెను. జనసమూహమున నా సిద్ధుని దర్శింపవలె నను నుత్కంఠ విపరీత మయ్యెను. సిద్ధుని దర్శించి ఏమిచేయుదురో వా రాలోచింపరు. అదియొక వెఱ్ఱి. వర్ణమతవివక్షత లేకుండ పౌరులు ఆ సిద్ధుని దర్శనమునకై ఆ వసతికి మూగసాగిరి. కాని ఎప్పుడును ఆ సిద్ధు డుండు గదితలుపులు వేసియేయుండును. దాని సమీపమున కైనను ఎవ్వరిని రానీయరు. కాని ఎట్టి సాధనము లేకుండ మహాత్ముల దర్శనము చేసినంత మాత్రముననే కృతార్థత నొందదలంచు జనసమూహములను ధన్యులు కాకుండ ఎవ రడ్డగలరు ! ఆ సిద్ధుని చూడకపోయినను ఆ సిద్ధుని గదిసమీపమున కైన బోనీయకున్నను దూరమునుండియే వా రాత డుండు గది దర్శించియే లోపల నున్న మహాసిద్ధునికి నమస్కరించి చెంపలు వేసికొని కృతార్థులై వెడలిపోవుచుందురు. మరికొందరికి ఆ గదిలోనుండి ప్రణవనాదము వినిపించును. కొందరి కా గోడలలోపల దివ్యతేజస్సు స్పష్టముగా భాసించును. అట్టివారు ప్రక్కనున్నవారితో 'అదుగో! దివ్యకాంతి

కనబడుట లేదా, ఎంత బాగున్నది!' యందురు. ఆ ప్రక్కనున్నవారికి అట్టి కాంతి యేమియు గోచరింపదు. వారికి వట్టి గోడలే కనిపించును. అందుచే వారు తమ పాపిష్టజన్మములకు తమ్ము నిందించుకొందురు. అట్లు తలంచుచుండగనే వారిలో నొకడు 'ఆ గదిలో గాజుగుప్పెలోని దీపమువలెనే ఒకానొక హిమావృతకాంతి కనిపించుచున్న'దనును. మరి యొకడు కన్నులు మూసికొనుచు, 'మంచుకప్పిన కాంతి యేమి, కోటిసూర్యుల కాంతి యదిగో, చూడలేకున్నాను. కనులు మిరుమిట్లు గొలుపుచున్నవి!' అని పలుకును. వేరొకని కందులో మహాగ్నియే మండుచున్నట్లు కనిపించును. ఇంకొకరి కన్నులకంటె చెవులు సూక్ష్మమైనవి. అందుచే వానికి సంగీతము వినిపించును. ఒకరికి దివ్యధూపముల వాసన ఘ్రాణముల ప్రవేశించును. మరియొకరు, 'ఏమి యీ యామోదము! ఈ లోకములో ఏ పూవు కిట్టి సుగంధము కలదు?' అని ప్రశ్నింతురు. ఇంకొకడు 'అయ్యో, అదిగో పులి!' అని పెద్దగా నార్చి మూర్ఛిల్లును. 'పాప మితని కెట్టి పాపష్టియూహ వచ్చినదో, శిక్ష పొందినాడు!' అని ప్రక్కవా రందురు. ఆ పాపిష్టిమనుష్యుని జూచినందున తమ పుణ్యపురుషత్వము వారి కతిశయించును. వారా మూర్ఛితునిపై జాలినొంది యతని చెవులలో 'ణమో అరిహంతాణం...' ఇత్యాది పంచనమస్కార ముచ్చరించి యతనిని తేర్చి నెమ్మదిగా నావలకు తీసికొనిపోవుదురు. ఇట్లు భయమును భక్తియు జనసమూహములో నా సిద్ధునియెడ దినదినప్రవర్ధమానము కాజొచ్చెను.

సిద్ధుని జూచు నవకాశము చిక్కనందున భక్తుల కా గదిపై గౌరవము ప్రారంభించెను. ముందు కొందరు ఆ గదిముందు దానికి శీతాతపములు తగులకుండ వెదురుతడకలతో ఆచ్ఛాదనము నిర్మింపజేసిరి. ఆ పిమ్మట రెండుమూడుదినములలో నచ్చటికి చూడవచ్చిన ధనవంతు డది చూచి వెంటనే శిల్పుల నియమించి దృఢ మగు శిలాప్రాకారమును మండపమును నిర్మింపజేసెను. మరియొకడు దానిప్రక్కనే యారామ మొకటి వేయించెను. భక్తుల భక్తి యతిశయించినకొలదియు నా గదిలో -నున్న సిద్ధమూర్తిని దర్శించు నవకాశము దూరదూరమగుచుండెను.

ఇట్లుండ జైనసంవత్సరాదిప్రాంతమున ఆ సిద్ధమూర్తి భక్తులకు దర్శన మీయనున్నాడని యొక వార్త నగరమంతట వ్యాపించెను. దీపావళిఅమావాస్యనాడు వసతిలో మహోత్సవము జరుగును. పద్మాక్షీయాలయమున హనుమకొండలో గొప్ప పూజలు జరుగును. ఆనాడు ఈ వసతినుండి యావల రెండు క్రోశముల దూరమున నున్న పద్మాక్షీయాలయమువరకు జైనభక్తులు బారులు తీరి పోవుచుండిరి. జైనులకు ఉష్ణీషబంధము ఒక పవిత్ర మగు సంస్కారమువంటిది. ఉష్ణీషబంధము చేసినపిమ్మట కుమారునికి గూడ నింటిలో పూర్వము లేని స్థాన మేర్పడును. నలుగురిలో నట్టివానికి గౌరవమును ఉండును. అందుచే వారికి ఉష్ణీషధారణము నియతము. వారును రంగు రంగుల వస్త్రములు పట్టువి, నూలువి, జరివి, అద్దకములవి తలల మనోహరాకారముల ధరించి బారులు బారులుగా రాకపోకలు చేయుచుండ ఓరుగల్లునుండి హనుమకొండవరకు ఒక్కసారిగా ఊర్ధ్వలోకములనుండి సాధుపురుషులు పద్మాక్షీదేవిని సేవించుటకును సిద్ధుని దర్శించుటకును దిగివచ్చిరా యనిపించుచుండెను.

ఆనాడు సిద్ధదర్శన మగు నని పౌరజానపదులలో నొక సంచలన ముదయించెను. అత డుండు గడిసమీపమున గల శిలాతలమున ధ్యానమగ్నుడై దర్శన మిచ్చు ననియు వార్త ప్రాకెను. జన మానాడు విశేషముగా వసతియందు కూడిరి. కాని యానాడు వారి కాతనిదర్శనము కాలేదు. కాని వారి కాశ పోలేదు. పాడ్యమి, విదియ, తదియ, చవితి—నాల్గు నర్ధరాత్రమువరకు భక్తు లాభాగ్యమునకు వేచియుండిరి. కాని ఆ మహామహుని దర్శనము వారికి ప్రాప్తింపలేదు.

అట్లు దినదినము నిరాశాహతులై వెనుదిరిగి భక్తులు వెడలుచుండిరి. వారి యుత్సాహ మెన్నాళ్లు నిలువగలదు? పంచమినాడు సాయంత్రము వచ్చినవారి జనసంఖ్య తగ్గిపోయినది. ఆ వచ్చినవారును తలలు పైకెత్తి ఆ గండశిలాతలమును చూచి చూచి హతాశులై అందులో పలువురు తమ యిండ్లకు వెళ్లిపోయిరి. దూరమున ఉన్నతమైన శిఖరావలంబి యగు ఆంధ్రరాజుమోసాలపై గడియారమున నుండి పన్నెండుమారులు ఘంటానాదము మ్రోగి అస్పష్టముగా వినవచ్చెను.

అప్పు డాకస్మికముగా నా గండశిలాతలముపై ఒకమూర్తి కనపడిన ట్లయ్యెను. ఏదో యొక మూర్తి యేమి? యోగసమాధినిష్ఠు డగు నా మహాయోగిమూర్తియే ప్రత్యక్ష మయ్యెను. ఎన్నాళ్లకు భక్తుల కోరిక సిద్ధించినది. ఆ దర్శనభాగ్యమునకు నోచుకొన్న యా కొలదిమందిలోనుండియే హర్షనాదము లుప్పతిల్లెను. కొందరు ఆ సిద్ధునికి మ్రొక్కవా రైరి. కొందరు 'రక్షించు తండ్రీ, రక్షించు' అనువారును, 'ధన్యులము ధన్యులము!' అనుకొనువారును—ఇట్లు వివిధ భావ లాడుచు కోలాహలము చేయసాగిరి. కొందరు ధూపము లర్పించిరి. దీపదర్శనము జైనాచారము కాకపోయినను ఆ వచ్చిన వారిలో కొందరు దీపములును సమర్పించిరి. కొందరు పుష్పాంజలు లర్పించిరి, కొందరు టెంకాయలు కొట్టిరి. కొందరు పచ్చకర్పూర ముతో మంగళారాత్రికము లిచ్చిరి. కొందరు పాటలు పాడిరి. కొందరు భజనలు సాగించిరి. కొందరు జయజయధ్వానము లొనర్చిరి. కొందరు బహుపరాకులు ప్రారంభించిరి.

అంతలో నా సిద్ధుడు వారి నందర నాశీర్వదించుచున్నట్లు తన దక్షిణహస్తము నెత్తెను. దానితో నక్కడ నున్న కొలదిజనమును పొంగిపోయి పరవశులే యైరి.

వా రట్లు చూచుచునే యుండిరి. వారు చూచుచుండగనే అంతలో నాసిద్ధు డంతర్హితు డయ్యెను!

ఇత డెట్లు శిలపైకి వచ్చెను? మరల ఎట్లు పోయెను? ఎక్కడ నుండి వచ్చెను? ఎందు బోయెను? ఇప్పు డేయెడ గలడు? ఏమి మహత్త్వము! ఏమి మహత్త్వము!—మన కీనాటికి మరల దర్శన మగునా?—కొంతసేపు ఆశలేకుండ నిరీక్షించి యోగిని పరిపరివిధముల గీర్తించుచు ఎవరియిండ్లకు వారు వెడలిపోయిరి.

మరునాడు వసతికి జనులు పొరలబడి వచ్చిరి. కాని యానాడు వారికి సిద్ధుని దర్శనము కాలేదు. అట్లే మరికొన్నాళ్లును కాలేదు. కాని దశమినాడు మరల పూర్వమువలెనే ఆ యోగి భక్తులకు దర్శన మొసగెను!

ఇట్లు రెండుమారు లాతఁడు దర్శన మిచ్చెను. ఎందరో యతని జూచిరి. అయినను ఆతని రూపమునుగూర్చి ఒకరు చెప్పినట్లు మరి యొకరు చెప్పరు. ఒకరు బాలునివలె నున్నా డందురు. ఒకరు ఒడ లంతయు సడలిపోయి పండువృద్ధువలె స్పష్టముగా గోచరించె నందురు. ఒకరు నిండుయౌవనములో నుండి స్ఫురద్రూపిగా కనబడె నందురు. ఒక రాతఁడు శ్వేతాంబరము ధరియించియుండె నందురు. ఒకఁడు, ఈ దిగంబరజైనుల వసతిలోనికి శ్వేతాంబరభిక్షు వెట్లు వచ్చును, దిగంబరుఁడుగనే కనిపించె' నని వాదించెను. ఒకఁడు 'శ్వేతాంబరుఁడు కాఁడు, దిగంబరుఁడు కాఁడు! అసలు భిక్షువే కాదు. శిరస్సుపై ధగధగలాడు నక్షీణమును దాని క్రింద నల్లని శిరోజములును పెద్దమీసమును స్పష్టముగా నేను చూచితి' నని నిష్కర్ష చేయును. ఒక రాతఁడు 'నల్లనివా' డనగా విని, 'అయ్యో, మీకు కన్ను లేమైనా జబ్బా? అంత ధగధగలాడుచు తెల్లగా నుండెనే!' అని ఇంకొక రందురు.

అందరును దూరమునుండి చూచినవారే! చీకటివేళ చూచిన వారే! ఎవరి యూహప్రకారము వారికి ఆ మహాసిద్ధుని రూపము భాసించుటలో నాశ్చర్య మేమి!

అదియును గాక అర్హతులకు రూప మేమిటి? ఒక నిర్ణీతమైన రూపము సామాన్యమానవులకు గాని సిద్ధుల కట్టిదానితో నిమిత్త మేమి? అర్హతులు నిజముగా శరీరము లేనివారే! వారు నిర్జరులు! సామాన్యవ్యవహారదృష్టిచేమాత్రమే వారు శరీరము కలవారు. ఆ శరీరము 'ఔదారికమే'. అది వేయిసూర్యుల కాంతి కలది. మన కంట్లకు ఎన్నిరూపములతో నైన నది భాసింపవచ్చును—ఇట్లచ్చట చేరిన జైనవిద్వాంసు డొకఁడు స్వరూపనిష్కర్ష చేసి యందరకు సంశయనివృత్తి కావించెను.

దీనిచే ఆ జైనవసతిపై జనసమూహమున గౌరవాదరప్రపత్తులు విశేష మయ్యెను. అయితే దురదృష్టవశమున నాకాలముననే రాజపురుషుల దృష్టి యా వసతిలో కొన్ని భాగములపై కఠినముగా ప్రసరించెను. అందుకు కారణము వారికి ఆ సిద్ధునిపై గాని వసతిలోని ఇతరయతులపై గాని ఏలాటి సందేహమును గలిగి కాదు సుమా!

మరి యది యెట్లు సంభవించెను?

౨౨

శ్రీరుద్రదేవమహారాజు ఏకశిలానగరమునకు బలిష్ఠమగు శిలాప్రాకారమొకటి వెంటనే నిర్మింప నిశ్చయించెనుగదా! ఆ నిశ్చయమైనవాది సంభారములు చురుకుగా చేర్పింపబడుచుండెను. స్థపతులును మాపకులును సూత్రధారులును కరణములును ముందు ఆ శిలాప్రాకారమునకును దాని కందకమునకును కావలసిన ప్రదేశము నిర్ణయించి గుర్తులు వేయుచుండిరి. ఆ గుర్తించిన ప్రదేశములలో పలువురు పేదలయొక్క కొందరు ధనవంతులయొక్క గృహారామక్షేత్రములు పడినందున అవి తీసివేయవలసివచ్చెను. వారివారికి రాజపురుషులు వేరు నివాసప్రదేశములు చూపి మరల నిండ్లు కట్టుకొనుటకు వస్తురూపమునను ధనరూపమునను సహాయము చేయ నేర్పాట్లు చేయుచుండిరి. ధనవంతులకును అట్లే యథోచితముగా నష్టపరిహారము గావించుచుండిరి. ఇవియన్నియు లెక్కలు వేయగా బహుద్రవ్యము కావలసివచ్చెను. ఐనను ఎంతవ్యయమునకైనను వెనుదీయక పనులు వెంటవెంటనే సాగింపవలసినదని రాజాజ్ఞయయ్యెను.

ముందనుకొన్నవిధముగా ఓరుగల్లుకు దూరమున గల ఇనుపరాతిగుట్టనుండి గండశిలలు రేయింబవళ్లు బండ్లమీదను యంత్రములమీదను యథోచితస్థానములకు చేరుచున్నవి.

కట్టవలచిన ప్రాకారకుడ్యమునకు ఈవైపున నావైపున రెండువైపుల రెండు రాతిగోడలు కట్టి ఆ రెండురాతిగోడల మధ్యనున్న భాగమంతయు మట్టితో పూరించి అంతయు నొకటే శిలాప్రాకారముగా చేయుట దాని నిర్మాణపద్ధతి! ఈ పద్ధతి యవలంబించుటచే నెన్నియో సౌలభ్యములు చేకూరెను. అంతయు శిలలతో నిర్మించినచో ఎన్నియో పర్వతములే కొట్టి తెప్పించినగాని పనిపూర్తి కాదు. అది ఎప్పటికి సాధ్య మగును? అదిగాక కోటగోడ మధ్యభాగమున మట్టియే యున్న రాకపోకలకు ఏకాలమునందైనను ఏవేళనైనను ఎక్కువ సౌకర్య ముండును. అదియునుగాక కందకము త్రవ్వగా వచ్చిన మట్టి ఏమి చేయుట? అది దూరము చేర్చుట అధికవ్యయప్రయాసలతో కూడినపని. అట్లు కాక అది కందకముప్రక్కనే పోసినచో నది యొక కొండవలె పెరిగి స్థలమాక్రమించుటయే కాక దండెత్తివచ్చు శత్రువుల సైన్యములకు గోడగా నేర్పడి వారికి రక్షణ కుపయోగపడవచ్చును. మరియు వర్షాదులకా మట్టి కారి కందకములోనికి కొట్టుకొనివచ్చి పూడ్చివేయుచుండును. అందుచే కందకమును తరుచుగా మరలమరల త్రవ్వింపవలసిన పని యేర్పడగలదు. రెండు రాతిగోడల మధ్యప్రదేశమును ఆ మట్టితోడనే పూడ్చివేసినచో అన్నివిధముల సులభమగును.

అందుచే నగడ్తయు శిలాప్రాకారనిర్మాణమును ఒక్కపర్యాయమే ప్రారంభింపబడెను. అగడ్త త్రవ్వించుటలో నా స్థలమున గండశిలలున్నట్లు కనుగొన

బడెను. వెంటనే స్థపతు లాశిలను పరీక్షించి దానిచే ప్రాకారనిర్మాణమునకు వాడుకొనవచ్చు నని నిర్ధారణచేసిరి. కందకప్రదేశము పొడుగున త్రవ్వి పరీక్షింపగా నట్టి శిలలు దొరకెను. దానితో దూరమార్గమున నున్న పర్వతశ్రేణులనుండి గండ శిలలు తెప్పింపవలసిన యవసరము తప్పిపోయినది. కందకప్రదేశములో దొరకిన ఆ శిలలే మహారాజుపాలిటికి రత్నముల గనిగా భాసించెను. ఇందువలన వ్యయప్రయాసలు తగ్గిపోయినవి. ఇది రుద్రదేవమహారాజులకు గొప్ప లాభకరముగా స్థపతులు నిర్ధారణచేసిరి. పనికూడ శీఘ్రముగా సాంతమగు నవకాశము చిక్కినది.

శ్రీరుద్రదేవమహారాజుల యదృష్ట మంతటితో నాగలేదు. ఆ కందకము త్రవ్వుచుండగా అచ్చట నిజముగా బంగారు వెండి రత్నములు గల్గిన నిధులుగూడ ఎన్నియో దొరకినవి. అవియన్నియు రాజకోశమునకు చేరెను. ఈ నా డొక నిధి దొరికిన దని యందరు నాశ్చర్యపడుచుండ నంతలో మఱియొకచోట ఇంకొక నిధి కనుపించును. శ్రీరుద్రదేవమహారాజుల యదృష్టమును జ్యోతిష్కుల యద్భుతప్రజ్ఞను ప్రజలందరు శ్లాఘింపజొచ్చిరి. అవిశ్రమముగా విశేష ధనము లభించుటచే శిలాప్రాకార నిర్మాణ మంతయు నా దొరకిన నిధుల ద్రవ్యముతోనే జరిగిపోవచ్చు నని తోచెను. అట్లువిశేషధనము లభ్యమైనందున మహారాజా ధనమంతయు తానే అనుభవింప దలంపలేదు. పరిఖాప్రాకారములక్రింద తమ గృహారామములు కోల్పోయినవారి కందరకు మునుపటికంటె రెట్టింపుగా ధనము బహూకరించుటకును పని వారికి బత్తెము లెక్కువచేయుటకును మహారాజు శాసించెను. దానితో ప్రజలందరు, పెద్దలును, పిన్నలును, శ్రీరుద్రదేవమహారాజుల వితరణను వేనోళ్ల శ్లాఘించుచు యథాధికారముగా వారి కాశీర్వాదములును నమస్కారములును గావించుచుండిరి.

ఇట్లు అగడ్తక్రింద రావలసిన స్థలములో మన జైనవసతిలో నొక ప్రక్కను ఊరక పడియున్న కొంతస్థలముకూడ పడినది. అది మాపకులు కొలతవేయగా సూత్రధారుల సాయముతో స్థపతులు దాని వేరుచేసి గుర్తింపజేసిరి. కరణములు దానికి పరిహారముగా నెంతధనము చెల్లింపవలసియుండునోకూడా లెక్కలు కట్టి నిర్ధారణ చేసిరి. అట్లు కాక వసతియధికారులు అంతస్థలమే కావలె నని కోరికొన్నను ఆవలి వైపున నంత స్థలమును సంపాదించి వసతి కిప్పించుటకును రాజపురుషు లేర్పాట్లు కావించిరి.

రాజపురుషు లట్లు గుర్తించి మేకులు పాతిపోయిన మరుసటినాటి యుదయమున నక్కడ జూడ సరిగా నేమినాథతీర్థంకరునివిగ్రహ మా ప్రదేశమున వెలసియుం అదియును క్రొత్తగా పెట్టినట్లు లేదు. భూమిలోనుండియే పగులగొట్టుకొని పైకివచ్చినదా యన్నట్లు చూపరకు తోచుచుండెను. విగ్రహము వెలసినచో పూజించు భక్తు లేమి కొదువ? రాజపురుషు లక్కడికి వచ్చునప్పటికి నేమినాథదేవుని పూజించుటకు భక్తులు తండోపతండములుగనే వచ్చుచుండిరి.

అది చూచి రాజపురుషుల కేమియు దోచలేదు. వెంటనే వారు ఆ వసతి ప్రధానాచార్యు డగు సిద్ధనందిని దర్శించి నమస్కరించి విషయము నివేదించిరి.

సిద్ధనంద్యాచార్యులు మిక్కిలి వృద్ధులు. ఆయనకీ లోకముతో నిజముగా సంబంధమే లేదు. చిరకాలము సిద్ధసాధన లొనర్చి అర్హతపదవి నొందుటకు అధికృతుడై జైనపరిభాషలో సర్వకషాయములు వదలి నిర్జరుడైయున్నాడు. కర్మబంధము నాయన తూలించుకొనెను. వసతిలోని యాచార్యులందెల్ల నాయన వృద్ధుడైనందునను పూజ్యుడైనందునను తప్పనిసరిగా నా వసతికి ప్రధానియయ్యెను. కాని యా వసతివ్యవహారములలో నాయన జోక్యముకలిగించుకొనుట ఎన్నడో చాలించెను. అందుచే ఇతర దిగంబరులుపూజ్యుడగు సిద్ధనంద్యాచార్యుల పత్రములను ముద్రికయు చేకొని వ్యవహరించుచుండిరి.

ఇట్టి స్థితిలో రాజపురుషులు సిద్ధనంద్యాచార్యులకు ఈ వ్యవహారము నివేదింపగా నాయన మాటాడలేదు. ఈ వ్యవహారవిషయము ఆయనమనస్సుకు పట్టినట్లే లేదు. ఆయన చేసిన సంజ్ఞలకువసతివ్యవహర్తలతో సంప్రదింపు డని యర్థమైనట్లు ప్రక్క నున్నవారు చెప్పిరి. అంతట రాజపురుషులు ఆ ప్రధానాచార్యులకు మ్రొక్కి వ్యవహారశాలకు బోయిరి.

ఆ వసతివ్యవహారశాలలో పలువురు కరణములును మువ్వురు శ్రమణులును గలరు. ఆ మువ్వురు శ్రమణులే వసతివ్యవహారములు ఇప్పుడు చూచుచున్నవారు. రాజపురుషులు సగౌరవముగా వారికి మ్రొక్కి అగడ్తకు గుర్తించిన ప్రదేశమును అప్పగించవలసినదిగా కోరిరి.

కాని యీ వ్యవహర్తల భంగి యపూర్వముగా నుండెను.

"ఏది ఎట్లున్నను అక్కడ వెలసిన నేమినాథస్వామిని ఎవరు తీయగలరు?"

"నిగ్రహానుగ్రహసమర్థులగు మీరే దాని కుపాయ మూహింపవలెను. ఇంత రాజకార్యము ఆగిపోవు టెట్లు?—అదికాక అది క్రొత్తగా గుర్తించినతర్వాత అక్కడ పెట్టినదేగదా!"

"మేము పెట్టిన దని యందురా? పాపచింతలు శమించుగాక!"

"మీరు పెట్టిన దనలేము. ఏవరో తెల్లవారుసరి కక్కడపెట్టిరి. పరిఖకు విఘ్నము వచ్చినది!"

"ఒకరు పెట్టిన నట్టి మూర్తి నిలుచునా? అక్కడ పరిఖత్రవ్వుట తీర్థంకరులకు సమ్మతము కాదేమో!"

ఇట్లెంత చెప్పినను ఆ వ్యవహర్తలు రాజపురుషులకు ఆటంకములు చెప్పిరి.

"ఇది దేవస్వము. మా వసతికి మహారాజుపూర్వులు దీని నెన్నడో దానము చేసిరి. దానము చేసినదానిని మరల తీసికొనుట ధర్మమా? అదికాక తీర్థంకరులకు అంకితమైన ప్రదేశములో ఒక్క నూదిమోపుమేరయైనను వదలివేయుటకు గాని మార్చుటకుగాని మా కేమి యధికారము కలదు? మేము ధనము చేతులతోనైన స్పృశింపమే. అట్టిచో పరధనము లపేక్షింతుమా? ఇక మమ్మను తీర్థంకరుల ద్రవ్య

మునే ముట్టమని మీరు కోరదురా? అట్లు చేసి జన్మజన్మలలో విధిగా వచ్చు బాధలు మేము పడజాలము !—"

ఈవిధముగా నున్న దావ్యవహర్తల వైఖరి మొత్తముమీద! రాజపురుషు లెన్నివిధముల జెప్పినను వారు వినలేదు. అవల దానికి రెండింతలు స్థలము ఇప్పింతు మన్నను వా రంగీకరింపలేదు. విశేషధన మిప్పింతు మనిరి. వారు వినలేదు. తుదకు ఆ నేమినాథవిగ్రహమును అక్కడ తెల్లవారుసరికి పెట్టించినవారు కూడ వీరే యని రాజపురుషులకు మనస్సులలో నిశ్చయభావ ముదయించెను.

ఆ రాతికోటనిర్మాణకార్యక్రమమునకు సర్వాధికారిగా అంబదేవుని శ్రీరుద్ర దేవమహారాజు నియమించియుండెను. ఆ వసతితో వచ్చిన చిక్కు రాజపురుషులు వెంటనే సర్వాధికారి యగు నంబదేవునికి నివేదించిరి. అంబదేవుడు ఒక్కకొంత తడవు ఆలోచించెను. ముందు తనకు స్థపతులు చూపియుండిన కోట అగడ్త ఇత్యాదుల నిర్మాణచిత్రములలో నది యా వసతి నాని పోవుచున్నట్టే జ్ఞాపక మున్నది కాని వసతిప్రదేశముపైనుండి పోవుచున్నట్లు లేదు. ఆ జైనవసతియే కాదు. ఏ దేవస్థలమునుగూడ ఆక్రమింపవలసిన యగత్యము లేకుండనే వా రది సిద్ధము చేసియుండిరి. అందుచే ముందు అంబదేవుడు మరల నా నిర్మాణపటములు తెప్పించి పరీక్షించెను. తన స్మృతిలో భ్రాంతి లేదు. పరిఖకు కొంచెము ఎడముగనే వసతిప్రదేశ మున్నది. అట్లయినచో ఆ స్థలములోనికి వసతిప్రదేశ మెట్లు వచ్చినది? వ్రాయసకాండ్ర తప్పా? ఎక్కడ నున్న దాతప్పు?

ఆ వెంటనే అతడు జైనవసతి కిచ్చిన దానశాసనప్రతి తెప్పించి పరీక్షించెను. మరునాడే దానిప్రకారము వసతిస్థలమును కొలిపించి దాని సీమలు నిర్ధారణచేసి గుర్తులు పెట్టించెను. ముందు స్థపతు లిచ్చిన పటముల స్వరూపములో తప్పులేదు. ఇప్పుడు వసతిప్రదేశ మని వసతిపెద్దలు వివదించుచున్న ప్రదేశము వసతిది కాదని స్పష్టపడెను. ఊరక ఆ ప్రదేశ మున్నసమయమున వసతివారు ఆక్రమించినట్లు అక్కడ నొక మొక్క, ఇక్కడ నొక స్తంభము పాతి తమ దనుచుండిరి. ఇప్పుడు ప్రాకారనిర్మాణమునకు విఘ్నము కలిగించు దురుద్దేశముతో నేమినాథుని విగ్రహ మొకటి నిలువబెట్టినట్లున్నారు. ఒక్కసారిగా నంబదేవునకు రోషము ప్రకోపించెను.

వెంటనే అతడు వసతియధికారులకు ఆ ప్రదేశమును ఆరునది గడియలలోపల రాజపురుషులకు నిరాటంకముగా నప్పగింపవలసినదని ఆజ్ఞాపత్ర మంపెను.

ఆ వసతియధికారు లది లక్ష్యము చేయలేదు. సిద్ధుని యోగమహిమాదిగా తమ వసతికి జనసామాన్యములో పెరుగుచున్న భక్తిప్రపత్తులు వారి కన్నులకు కొంచెము మైకము కలిగించినవి. అందులోవారి కాపత్రము కార్తిక శుద్ధ దశమినాడందెను. ఆ క్రిందటి దినమునాడే సిద్ధుడు జనులకు గుట్టపై దర్శన మిచ్చియుండెను. ఈనాడు

భక్తులు తండోపతండములుగా అక్కడ మూగుచుండిరి. వారిలో కొందరు వసతి చుట్టును ప్రదక్షిణములు చేయుచుండిరి. మరికొందరు వివాదగ్రస్తమగు ప్రదేశమున గల నేమినాథవిగ్రహమునకు కానుక లర్పించుచుండిరి. ఆ యుత్సవము ఉదయము నుండి సాయంకాలమువరకే కాక రాత్రియందంతట సాగిపోయెను. వారిలో పలువురు ఏకాదశిఉపవాసము చేసినవారే. ఆ రాత్రి వారికి జాగరణమును సిద్ధించెను. ఆ రాత్రి జనములో ఆవేశము పెరిగిపోయెను. భజనలు ప్రబలినవి. అక్కడ జనములు ఇసుక వేసిన రాలన ట్లుండిరి.

ఆ జనసమూహములను జూచుచున్న కొలదియు వసతియధికారులకు నిర్లక్ష్యమెక్కువయ్యెను. ఈ సందర్భములో వసతియధికారులు స్వయముగా నా నేమినాథవిగ్రహము తీసివేయుదురా? తీసివేయదలచినను తీసివేయగలరా? ఇదంతయు అంబదేవుడు సూక్ష్మముగా గ్రహించెను. తీవ్రముగా నాలోచించెను; దృఢముగా నిశ్చయించెను. కాలస్యవధి గడచినపిమ్మట ఒక్క క్షణమైనను ఆలసింపక ఆ విగ్రహమును తీసివేయింపవలెను! దేవతావిగ్రహమును తీసివేయుటకు సామాన్యముగా పనివారు వెనుకాడుదురు. వసతియధికారులు స్వయముగా తీసివేయరు. రాజపురుషులు తీసివేయించనిచో రాజగౌరవము చులకన యగును. ఇందులో తాను అక్రమమేమియు జేయుటలేదు. వసతిలోనివారి దుస్తంత్రమును పరిహరించులే!

పనివారిలో ముఖ్యముగా రెండువిధములవారు కలరు. శిలలు చెక్కుటలో ఎక్కువ నేర్పుగలవారు చాలవరకు జినాభిమానులును జైనభక్తులును. కాని వారిలో కూడ కొందరు బసవమతము స్వీకరించిన లింగబలిజలుకూడ కలరు. ఖనకులు విస్తారముగా బసవమతము స్వీకరించిన వీరశైవులే. ఆ వసతితో వివాదకలిగిన ప్రదేశమున మరునాడు పనిచేయుటకు ప్రత్యేకముగ బసవమతస్థు లున్న తండములనే నియోగింపనా రాత్రి అంబదేవుడు రహస్యముగా నాజ్ఞ లిచ్చెను.

ఆ మరునాడు సరిగా మధ్యాహ్న మగుసరికి స్వయముగా నంబదేవు డే భటులతో నా ప్రదేశమునకు వచ్చెను. సరిగా నప్పటికి వసతియధికారులకు ఆజ్ఞాపత్రము చేరి అరువదిగడియ లైనది. నేమినాథవిగ్రహ మట్లే యుండెను. అడ్డు లన్నియు దొలగించి యక్కడ సూత్రధారులు సూత్రించినప్రకారము కందకము త్రవ్వించి వేయుటకు అంబదేవుడు స్థపతుల కాజ్ఞాపించెను.

ఒక ప్రక్కను నేమినాథపూజలు జరుగుచునేయుండెను. సమీపమున బని చేయుచున్న లింగబలిజల మధ్యనుండి 'హరహర మహాదేవ!' అను సింహనాదము భూనభోంతరముల నిండిపోయెను. కొందరు నృత్యపరు లైరి. కొందరు పండితారాధ్యచరిత్రమునుండి వరుస లందుకొనిరి.

'నల్లవో! నల్లవో! నగరాజరాజ!
మల్లయా! మల్లయా! మహనీయతేజ!
పరమపాతకకోట్లు భస్మమై తూలు
సిరిగిరిమల్లన్న శరణన్న జాలు!

శంకరదాసయ్య శంకమాంబయ్య
బంకయ్య దేవరాత్రిసంకయ్య శివునా!
ఏలేసుకేతయ్య చెంగొ కాంతయ్య
మోళిగమారయ్య మున్నయ్య శివునా!"

కన్నడభక్తుల పదము యిటు సాగెను.

"అజగణ్ణదేవయ్య! ... మాదిరాజయ్య
రాజభోగదేవయ్య! శివ దేవ ... !

*   *   *   *

హబ్బుత్త, కొబ్బుత్త, ... మాడుత్త.
పబ్బత కొడయుం ... భక్తి మాడిరి ...
పాడుత్త, యాడుత్త, ... నుత్త, ... త్తి
మాడిభో! సిరిగిరిమల్లికార్జునా.

*   *   *   *

హరహర! శివశివ! శివునా నీ దయా
సిరిగిరిమల్లయ్య శివ తెల్సిందయ్యా!"

*   *   *   *

ఆరెభాష మాటాడు మహారాష్ట్రభక్తులీ పదము నడచిరి.

"ప్రబ్బసంతాపసంసారనాటకనె
ప్రబ్బతమల్లయ్య ప్రబ్బజ్ఞ గాతొం!
అమ్మా మగాపుణ్య హరిజాంచిత్త
అమ్మా మహాభక్త అఖిలసమేశ్వరి!"
అరువదేశముభక్తులీ పదమును నడచిరి.

*   *   *   *

"అఱువత్తుమూవరు కార్తికనాయకనె
మఱునాలు మరియాదమల్లికార్జుననె
ఆలాలగంపనే యాదియణ్రవనె
చూలియే మల్లికార్జునని యన్నవనె!
యెల్ల యిల్లాదానె యెజ్జుముళ్లవనె
చొల్లవల్లాదానె మల్లికార్జునని!

*   *   *   *

వారిలో సంస్కృతము కొంచె మభ్యసించినవారు ఈ పదసముంతుకొని పాడసాగిరి.

"మల్లికామాలికామస్తకాభరణ
మల్లికార్జునదేవ మామేవ పాహి!
మల్లికాఘనసార మందారదేహ
మల్లికార్జునదేవ మామేవ పాహి!
మల్లికార్జునయశోమండితశాంత
మల్లికార్జునదేవ మామేవ పాహి!"

* * * *

ఈవిధముగా ఆంధ్రమునను కర్ణాటకమునను ఆరెభాషను అరవమునను సంస్కృతమందును పండితారాధ్యచరిత్రములోని పదములు కీర్తించుచు భక్తియు వీరమును ఆవేశించిన యా జంగమలింగమూర్తులు పలుగులు పారలు దూలములు మోకులు తీసికొని ఉద్భటాటోపముతో కుప్పించుచు అచ్చటికి వచ్చుచుండిరి.

అది చూచి నేమినాథు నర్చించుచున్న జినభక్తులుగూడ నానావిధవీరాలాపము లాడుచు వారి నెదుర్కొన నుంకించుచుండిరి. అంతకు మున్న అక్కడ తన నూరుగురువీరభద్రులతో సిద్ధముగా నున్న గండడు అంబదేవుని యాజ్ఞచే ఆ జినభక్తుల మందలించి యంబదేవుని యాజ్ఞ యందరు వినునట్లు ప్రకటించెను. దానితో జినభక్తు లేమియు జేయ సాహసింపక పలువిధముల విలపించుచు తిట్టుచు తొలగిరి. లింగబలిజలు నిరాటంకముగా నా ప్రదేశమున ప్రవేశించి కందకభాగము త్రవ్వివేయుచుండిరి. కొందరా నేమినాథవిగ్రహమును ఎత్తివేయుటకు దూలములకు మోకులు పూనించి యా విగ్రహమునకు కట్టి దూలములకు బుజము లానించి శివభక్తులు 'హరహరమహాదేవ శంభో!' అని ఊపుగా ఎత్తుచుండిరి.

అప్పు డాదారిన బోవు వ్యక్తి యొక డిట్లు పాడెను.

"కృతకృత్య వరివళిగెను వైజకవ్వ
పతి ధిక్కరించి సద్భక్తి పెక్కువను
జనుదెంచి చనుదెంచి చక్కన వసది
గని భవాలయ మని కరములు మొగుప
నట జినప్రతిమయూ పప్పుడే వ్రస్సి
పటపట వ్రక్కలై పడగ మధ్యమున
వైజనాథుం డుమావరు డుదయింప
వైజకవ్వయు వికస్వరభక్తిమహిమ
వసుధ జైనుం డను వార్తయు నడప
నెసగునా డీజైను లెక్కడ ననిరి?"

ఆతఁడా ద్విపదలు పలుకుచుండగనే శిక్షకర్తలు నేమినాథప్రతిమను ఎత్తి వేసిరి. ఆ యావేశములో దాని రూపు లేకుండ ఛిన్నభిన్నము లగునట్లు మారమున దాని బారవేసెడివారే! కాని రాజపురుషులు అంతకుమున్నే వారించుచుండి జాగ్రత్తగా వసతిస్థలములో సంచరింపవలసిన దని ఖండితముగా నాజ్ఞాపించుటచే వారు రాజాజ్ఞలకు కట్టుపడి యట్లు చేసిరి. నేమినాథప్రతిమకు ప్రమాదము రాకుండ తప్పిపోయెను.

అంతలో నప్పుడొక మహాద్భుతము జరిగెను. నేమినాథుని విగ్రహము తీసి వేసినచోటనే ఒక మహాశివలింగము నూర్ధ్వభాగము ప్రత్యక్ష మాయెను!



"శ్రీకంఠాయ నమోనమో నతసురజ్యేష్ఠాయ రుద్రాయ లిం
గాకారాయ నమోనమో విగతసంసారాయ శాంతాయ చం
ద్రాకల్పాయ నమోనమో దురితసంహారాయ తే యంచు ని
న్నాకాంక్షం బ్రణుతించు మానవుడు నీవై యుండు సర్వేశ్వరా!"

(సర్వేశ్వరశతకము)

శివలింగ మచ్చట నట్లు తలవని తలంపుగా అద్భుతముగా నుద్భవించినంతనే భక్తుల కప్పుడు కలిగిన యావేశమునకు మేరయుండునా? ప్రక్కను పోవుచు పండితారాధ్యచరిత్రమునుండి వైజకవ్వగాథ స్మృతికి తెచ్చిన వ్యక్తి ఎవరో కూడ వారు పరికింపలేదు. పనివారు తమలో నొకడే యది చదివెనేమో యనియు తలంచియుండవచ్చును.

ఆ లింగమూర్తిని జూచినంతనే భక్తులు పలుగులు పారలు దూరమున నుంచిరి. ఆ మూర్తిచుట్టు నున్న మట్టి ఆ సాధనములతో త్రవ్వినచో లింగమూర్తికి దెబ్బ తగులదా? అందుచే వారు దాని చుట్టునున్న మట్టిని చేతులతోడను వ్రేళ్లతోడనే పెకలింపసాగిరి. లింగమూర్తిరూపము ఎక్కువెక్కువగా ప్రత్యక్ష మగుచుండెను. అదియును తెల్లగా ప్రకాశించుచున్న జ్యోతిర్మయమగు స్ఫాటికలింగము! అద్దములో చుట్టు నున్నవారి మూర్తులు ప్రతిఫలించుచు సహస్రలింగమూర్తిగనే భాసించుచుండెను.

"ఈ మహాలింగమూర్తిని జైనహతకులు దొంగిలి తెచ్చి తమ నేమినాథవిగ్రహముక్రింద కుసిరాయిగా ఉపయోగించినారా?—వీరి నేమి చేసిన పాపము లేదు!—" ఇట్టి రోషవచనములు వారు సాగించిరి. కాని యా మహాలింగముచుట్టు నున్న మట్టి తొలగించుటలో వారికి రోషావేశము నొందుటకుగూడ తీరిక లేక పోయెను.

ఆ శివలింగము చాలభాగము బయటపడినది. అట్లు లింగోద్భవమైన కాలమునకే సరిగా ఒక నూలెనపురుషుడు వచ్చి, 'శ్రీకంఠాయ నమో నమో—' ఇత్యాదిక పద్యమును పఠించుచు ఆ స్ఫాటికలింగమున కతిభక్తితో ముమ్మారు ప్రదక్షిణ మొనర్చి సాష్టాంగదండప్రణామ మాచరించెను. అతడు లింగబలిజలలోనివాడు కాడు. నృపతులలోనివాడును గాడు. రాజపురుషులలోనివాడు గాని రాజభటులలోనివాడు గాని కాడు! దారిని బోవుచు వైజకవ్వకథ భక్తుల స్మృతికి దెచ్చిన వ్యక్తి యతడే! అతడు చూచినంతనే ఆరాధ్యబ్రాహ్మణుడుగా కనిపించుచుండెను.

అతని యాకారమే చూపర నాకర్షించుచుండెను. ఎరుపుకలసిన పచ్చని శరీరచ్ఛాయ! విశాలము లగు నాతని కన్నులు అర్ధనిమీలితములై అనవరతశివధ్యానమును వ్యక్తముచేయుచున్నవి. అతని శిరస్సునను కంఠమునను బాహువులను కర

ములను రుద్రాక్షమాలలు భూషణములుగా విరాజిల్లుచుండెను. దేహమంతయు విభూతిరేఖలు తీర్చియున్నవి. అతని విశాలవక్షస్థలముపై బంగారుకవచమువలె ప్రాణలింగమూర్తి వ్రేలుచు ప్రక్క నున్న బ్రహ్మసూత్రముతో కొట్లాడుచున్నది. ఒకానొక విలక్షణమగు దివ్యతేజస్సు అతని దేహమున శోభిల్లుచునున్నది.

ఆ యారాధ్యదేవుని జూచినంతనే అక్కడి భక్తులకు ఒంటిరూపమున అవతరించిన సాక్షాత్తు శివుడే ఇతడనిపించెను. భక్తులందరు శివలింగమునకు మ్రొక్కువారును ఆ యారాధ్యదేవునకు మ్రొక్కువారును మరల శివలింగమునకును మరల నారాధ్యదేవునకును మ్రొక్కువారునుగా నుండిరి. సమీపమున నున్న కూపములనుండి భక్తులు కుంభములతో జలము తెచ్చి యా యారాధ్యదేవుని కందియ్య మొదలిడిరి. ఆతడా ఘటము లందుకొని శతరుద్రీయము మంత్రగంభీరస్వరమున చెప్పుచు లింగాభిషేకము కావింపసాగెను.

అట్లు భక్తులెన్ని ఘటములు తెచ్చినను అవి తీసికొని విసుగువిరామము లేక యా జలము లభిషేకించుచునే యుండెడి నాతడు. సహస్రాధికముగా ఘటములు తెచ్చి యాతని కిచ్చిరి. రెండుచేతుల రెండు ఘటము లందుకొని అందలి జలములతో నాతడా లింగము నభిషేకించుచునేయుండెను. అతనికి అలసటయే లేదు. ఘటములోని నీరైపోనిది ఎత్తిన చేయి క్రిందికి దింపడు. నీరైపోయినపిమ్మట ఒక్క క్షణమైనను ఆ కుంభము తన చేతిలో నుంచుకొనక ఇచ్చివేసి మరియొక టందుకొని యభిషేకించును. ఇన్ని ఘటము లందుకొనుచున్నను అతని చేయి ఇంచుకంతయు కంపింపదు. అవి బాహువులా, ఇనుపకమ్ములా? దేహము సొలయదు. పైపెచ్చు క్షణక్షణమును బాహువులలో శక్తి యెక్కువగుచున్నట్లు తోచుచుండెను. తేజస్సును అతిశయించుచుండెను. సాక్షాత్తు శివసన్నిధానములో శివార్చనలో భక్తులకు దేహభాన ముండునా? అభిషేకజలము ప్రవాహములు కట్టి యా త్రవ్వుచున్న యగడ్తను ఇప్పుడే నింపివేయునా యనిపించుచుండెను.

అంతలో భక్తులకు పూజచేయ నిచ్ఛ జనించినది. జనసమూహములలో నీ మార్పు లెట్లుదయించునో చెప్పలేము. అనేకకోట్ల సూక్ష్మజీవులు కలసి మనుష్య దేహమై ప్రత్యేకవ్యక్తిగా కనిపించుట లేదా? అట్లే అనేకజనులు కలసినప్పుడు ఆ సమూహమే ఒక మహాపురుషుడుగా వ్యక్తిత్వము నొందునేమో! ఆ సమూహపురుషునికి నూతనేచ్ఛలు జనించును. ఆ సమూహములోనివారందరు ఆ సంఘపురుషేచ్ఛలు నిర్వర్తించు నంగములుగా మారిపోవుదురు.

పూజ చేయవలెనని యా సమూహపురుషునకు ఇచ్ఛ జనించినంతనే ఎక్కడనుండి తెచ్చిరోగాని వివిధగంధములు పసుపుకుంకుమము పుష్పములు అందీయసాగిరి. వచ్చినవివచ్చినట్లా యారాధ్యదేవుడు వానితో నా శివలింగము నలంకరింపసాగెను. ఆతడప్రయత్నముగనే అవి లింగమున కర్పించును. కాని యవి యొక్క మనోజ్ఞరూపమును దాల్చి లింగమూర్తి నలంకరించెను.

అంతలో భక్తులు ధూపములు దీపములు నందియసాగిరి. ఆయారాధ్యుడు అవియెల్ల శివున కర్పించెను. ఒక్కొక్క యర్చన జరుగుచున్నకొలది శివలింగమునకును ఆ యారాధ్యదేవునకును ఒక్కొక్క కళావిశేష ముదయించుచుండెను. అంతట నైవేద్యములు రాసాగెను. ఎన్నివిధముల ఫలములు? ఎన్ని పళ్లు? లెక్కలేదు. వచ్చినవి వచ్చినట్లెల్ల ఆతడు అవి భవునకు నివేదించి ప్రసాదము భక్తులకు పంచి పెట్టసాగెను.

ఇట్లు కోలాహలముగా శివపూజ సాగెను. ఇన్నాళ్లు నెన్నడు నేమినాథవిగ్రహమున కింత వైభవముగా పూజలు సాగియుండలేదు!

కాని అంబదేవున కిప్పుడు మరియొక చిక్కు వచ్చెను. ఈ శివలింగ మిచ్చటనే ఉన్నచో రాజాజ్ఞప్రకారము అగ్రహ్ర పూర్తియగు టెట్లు? ఇందర కింత యావేశముగా ఉన్నపుడు దానిని తొలగించుట సాధ్యమా? అదియు గాక స్వయముగా నంబదేవుడును గొప్పశివభక్తుడు. వారివంశములో అనూచానముగా శ్రీశైల మల్లేశ్వరుడు కులదైవముగా నుండెను.

అంబదేవుడు కొంతతడవు చింతించెను. సదాశివుని హృదయములో ధ్యానించెను. ఒక్క యూహ అప్డు ఆతనికి స్ఫురించెను.

వెంటనే అంబదేవుడు తన పై యుత్తరీయమును తీసి నడుముకు కట్టెను. అపై నాతడు వినీతుడై యా లింగమునకును ఆ పూజ్యపురుషునకును ప్రదక్షిణ మొనర్చి సాష్టాంగదండప్రణామ మాచరించెను. అందరును వినయవినమ్రులై దూరము తొలగి నిలుచుండిరి. అంబదేవుడు లేచి భక్తితో నా పుణ్యపురుషుని ప్రశ్నించెను.

"స్వామీ, మీరు నాకు జూడ ప్రత్యక్షమైన శివాకారమున గనుపించుచున్నారు. మీరు మానవులయినచో మీ నామధేయము సెలవిత్తురా?"

"అన్నమయ్య యందురు."

అంబదేవుడు: "మీ గ్రామము?"

అన్నమయ్య: "ముందు గోదావరీతీరమున పట్టిసము. ప్రస్తుతము పల్నాట సత్రశాల నివాసము!"

అంబదేవుడు ద్విగుణీకృత మగు గౌరవముతో, "సర్వేశ్వరశతకము చెప్పిన యథావాక్కుల అన్నమార్యులు మీరే యని యూహింపవచ్చునా?" అని యడిగెను.

ఆ పుణ్యపురుషుడు అవు నన్నట్లు చిరునవ్వు నవ్వుచు నిట్లనెను. "మొదల నుండి యథావాక్కుల అనునది మా ఇంటిపేరుగా లేదు!"

అంబదేవుడు: "ఏమైన నేమి? మీరు యథావాక్కుల వారే! మీరు వైజకవ్యకథాభాగము చదువగానే ఈ జైనవిగ్రహపీఠములోనుండి ఈశ్వరు డుద్భవించినాడు. వైజకవ్యవాక్కుల నుద్భవించిన ఈశ్వరుడు వైజనాథు డయినట్లే మీ వాక్కులు సత్యముచేయ నవతరించిన ఈ లింగదేవుని అన్నమేశ్వరుడని పిలుచుటకు మా కనుజ్ఞ యిత్తురా?"

అన్నమారాధ్యులవారి నామమును వారి సర్వేశ్వరశతకమును గూర్చియును అక్కడ నున్న భక్తులు పలువురు వినియుండిరి. ఆతడా శతకములోని పద్యములు ఒక్కొక్క దాని నొక తాళపత్రముపై వ్రాసి కృష్ణాప్రవాహమున వేసి ఎదురీదివచ్చిన పత్రములు గ్రంథముగా గ్రుచ్చుచు అట్టు పత్రమేదేని ఎదురీది రాకున్న గండకత్తెర వైచుకొని కంఠము తెగవేసికొనుటకు కఠోరప్రతిజ్ఞ చేసి చెప్పిన శతకము ఆ సర్వేశ్వరశతకము ! ఇప్పటి కాతడది వ్రాసి పదునాల్గేండ్లయినది. ఆ ప్రతీతి యానాడు రాజ్యమంతట భక్తలోకములో మారుమ్రోగిపోయినది. ఆయనయశస్సు ముందే దశదిశలు ప్రాకియుండుటచే నా మహానుభావుడే ఈ నాడిట్లిక్కడికి దయచేసినాడని తెలిసినంతనే భక్తులకు కలిగిన యత్యాశ్చర్యములు ఏమనివర్ణింపగలము ! ఆ మహామహుని వారెంతగా అర్చించిరో చెప్పనేల్లా ?

అంబదేవుడు: "తమ పాదవిన్యాసముచే ఈ ఏకశిలాపురము పవిత్రముచేయుటకు నిమిత్తము ప్రశ్నింపవచ్చునా ?"

అన్నమారాధ్యులు చిరునవ్వు నవ్వెను. "సర్వేశ్వరేచ్ఛ! ఈ మహాలింగమే నాకు కలలో కానుపించి నన్నిటు లాగికొనివచ్చెను ! ఇటు వచ్చువరకు నాపై పెద్ద బరు వున్నట్లు తోచినది !"

ఒక్కమారుగా ఆ మాటలకు భక్తులలో జయజయనినాదములు పిక్కటిల్లెను. అంబదేవు డిట్లు విన్నవించెను.

"ఆరాధ్యదేవా ! ఈ అన్నమేశ్వరునికి దివ్యాయతనము కట్టింప స్వయంభూదేవాలయసమీపమున వెంటనే సర్వసన్నాహములు గావింతును. అందు కనుజ్ఞ యిత్తురా ?"

ఆ కూడిన జనములో కొందరికి ఆ శివలింగ మక్కడనుండి తరలించుట కిష్టము లేదు. ఇత డొక స్వయంభూతేశ్వరుడు ! ఇట్టి మహాలింగమును కదలించుటా ? కదలింపదలచినను మనుష్యమాత్రుల కది సాధ్యపడునా ?

యథావాక్కుల అన్నమయ్యమాత్రము మాటాడలేదు. కరములు మోడ్చి ఆ శివలింగమునకు నమస్కరించుచు నాతడించుకతడవు ధ్యాననిమీలితలోచనుడై యుండెను. అందరును అన్నమయ్యవంక తిలకించుచు మౌనముగా నుండిరి. అంతటి జనసమూహమునను ఒక్కరును సడిచేయలేదు.

అంతలో అన్నమయ్యవాక్కున ఈ పద్యము నృత్యమేచేసెను.

'రారా, స్ఫాటికలింగ ! నీ కుదురునన్ రత్నాలు సొన్నాలు వో
నీరా ! నీ కవి యేల రయ్య ? పడికా పిట్లుండి యీ బస్తిప్రా
కారం బూనుచు నారుబైల నిలువన్ నీ కర్మ మేమయ్య ? అ

శోభ్భ ! రారా, చలివేయురా యిట, స్వయంభూదేవపార్శ్వంబునన్—'

ఆ పద్యము విన్న చేతనవుగా అంబదేవుడు ఆనందాతిశయముతో, "అన్నమారాధ్యుల యాజ్ఞ యైనది ! ఈ లింగమూర్తిని స్వయంభూదేవని కేతనము ప్రాకారమున కీశాన్యభాగమునకు చేర్పింపుడు !" అని యాజ్ఞ యిచ్చి ముందు వేగరుల బంపి యక్కడ మంటపస్తంభములు నిల్పి వానిపై పలకలు వేసి యాయతనము జాము లోపల సిద్ధముచేయ నాజ్ఞాపించెను.

ఒక్కసారిగా శివభక్తులందరు జయజయనాదములు చేయుచు భక్తితో ప్రేమతో నా శివలింగము నక్కడనుండి పెకలింప ప్రయత్నించిరి. వారు తమ బాహువులతో, పలువురు పుత్రులు తండ్రిని ఆలింగనము చేసికొనునట్లే, ఆ లింగమూర్తిని పొదివి లేపజూచిరి. ఆ తాకిడికి ఊపుకు పాదునుండి కదలినది గాని అసలులింగము ఎంతకును విడి రాలేదు. టెంకాయలు కొట్టిరి. నైవేద్యములు చెల్లించిరి. బహువిధముల తరలింపులు పాడిరి. లాభము లేకపోయినది.

అది చూచి అంబదేవుడు అన్నమయ్యను ప్రార్థించెను.

"ఆరాధ్యదేవా, అంతశ్శుద్ధి కల మీరు పట్టిననే గాని ఈ స్ఫాటికలింగమూర్తి కదలదు !"

యథావాక్కుల అన్నమయ్య స్ఫాటికలింగమునకు ప్రదక్షిణ మాచరించి మ్రొక్కెను. అంతట నాతడు లింగమును సమీపించి తన వామబాహువును ఆ లింగ శిరస్సుపైనుండి రానిచ్చి కుడిచేతితో గడ్డము పట్టుకొని, చెప్పినమాట వినక మారాము చేయు పిల్లవానిని బ్రతిమాలునట్లే, బ్రతిమాలసాగెను.

'లేవయ్యా, నను గన్న తండ్రి, వినరా, లెక్కింపరా యన్న ప
ల్కేవాక్యంబులు, లేడులే వసదిలో కీలింప బాణుండు, నీ
సేవాసక్తులు కూడి రిందు గదలిం చేబుద్ధి, మారాముచే
సే వేమయ్యా !—ఎరుంగవో యవల మా చేతల్ ప్రకోపించినన్'

అట్లు బ్రతిమాలి అన్నమయ్య యా స్ఫాటికలింగమును కదలించెను. లేవననుచున్నట్లుగా ఆ స్ఫాటికలింగము ఈ ప్రక్కకు నా ప్రక్కకు కదలాడెను. మరల నట్లే రెండుమూడుమారులు అతడు బ్రతిమాలుచు లింగమును కదలించెను. మరల నట్లే లేవననుచున్నట్లు లింగమూర్తి తల యాడించెను.

అంతవరకు పరమశాంతమూర్తిగా నున్న అన్నమయ్యకు ఏదో ఆవేశ మంకురించినది. ఓషధులు కనబడకపోగా సంజీవిపర్వతము పెరుక నుద్యోగించిన హనుమంతునివలెనే యాతడొక్కసారి పెరిగినట్లు విజృంభించినాడు. లేచిరమ్మని

హుంకరించుచు అన్నమయ్య తన విశాలవక్షస్థలము లింగమున కానించి సుదీర్ఘము లగు తన రెండుబాహుశాఖలతో నా లింగమూర్తిని ప్రేమతో భక్తితో ప్రాణికతో ఆవేశముతో రోషముతో దృఢముగా చుట్టిపట్టి బంధించినాడు! హుమ్మని యూర్చినాడు! ఘీంకారముచేయుచు మహాగజము కరముతో లాగునట్లే ఆతడు దాని నొక్కలాగు లాగినాడు!

పాదు కదలి విచ్చిపోయినది. అల్లరిచేసిన పిల్లవాడు కోపించిన తండ్రిచేతుల లోనికి వచ్చినట్లుగానే ఆ లింగమూర్తి అన్నమయ్యచేతులలోనికి వచ్చినాడు! మహానందావేశముతో బొటబొట నాతని కన్నులవెంట నీరు కారి యా స్ఫాటికలింగ మునకు ఉష్ణోదకస్నాన మాచరించెను!

భక్తులు ఆవేశముతో శివనినాదములు చెలంగ ధూపదీపము లిచ్చి నానావిధ నైవేద్యము లర్పించిరి.

ఆ యథావాక్కుల అన్నమయ్యకన్నీరే రత్నములుగా సొన్నాలుగా మారి రూపొందినదో, కాక అక్కడ కుదురులోనే అవి యున్నవో గాని యా లింగ మెత్తిన పాదులో రత్నములు స్వర్ణములు నున్న రాశి కానవచ్చినది. చూచినవారి యాశ్చర్యమునకు మేర లేదు. లింగమూర్తి కదలకముందే అన్నమారాధ్యులు రత్నాలు సొన్నాలు ఉన్నవని ప్రస్తావించియుండెనే? ఈయన నిజముగా దివ్య పురుషుడే, యథావాక్కు?

ఆ రత్నస్వర్ణముల రాశి వెంటనే అంబదేవుడు శ్రద్ధగా తీయించి వేరుగా నుంచినాడు!

అప్పటికే నవనందులు పూనిన శకట మొకటి సర్వాలంకృతమై సిద్ధమైనది. అందుపై నా స్ఫాటికలింగముతోపాటు అన్నమయ్య ఆరోహించినాడు. ఆ శక టముననే పాదులోనుండి తీసినరత్నములు సొన్నాలు ఉంచి తరలించునట్లు అంబ దేవు డాజ్ఞాపించెను.

అంతకుము న్నెన్నడు ఏకశిలానగరపౌరులు చూచిగానివిని గాని ఎరుగని యొక మహోత్సవము పురవీధుల నూరేగెను!

ఆనాటి కిక అగడ్తపని యాగిపోయినది. ఆ పనిలో నున్న భక్తులే కాక నగరమున మూలమూలల వాడవాడల గల శివభక్తులెల్లరు స్త్రీలు పురుషులు ఆబాలగో పాలము నక్కడ చేరిరి. సొన్నాయివాద్యముల జట్టులు సిద్ధమై ఒకని మించవలె నని ఒకరై వాయించుచుండిరి. అందుల డోళ్లశబ్దములు వినువారి హృదయములలో ప్రమథగణములు పదవిన్యాసములనే యనుకరించు నొక యదురుతో కలసిన యానందము కలిగించుచుండెను. వాని కెదురై ఖడ్గములు చెప్పుచు కొందరు సాము

చుండిరి. బహుప్రదేశముల నారసములు గ్రుచ్చుకొని నటించువారు మరికొందరు! భక్తుల కథలు పాడువా రింకను గొందరు. అందును ప్రాచీనభక్తులు జైనుల పరిభవించిన కథలు విశేషముగా సాగినవి. పొట్లచెరువులో దేవరదాసయ్య జైనతర్కము కొట్టి వారి ఐదువందలవసదులు ప్రచ్చివేయించిన కథ! కోవూరిలో జైనులు తమ మంత్రమహిమచే మఱ్ఱిచెట్టును కాల్పగా గోవూరిబ్రహ్మయ్య వీరగణమును స్మరించి సర్వమంత్రమూల మగు మంత్రరాజ మనుష్ఠించి భస్మమైన యామఱ్ఱిని మరల నిలిపి యా యూరిలోని వసదులు ప్రచ్చివేయించిన కథ! ఏకాంతరామయ్య అబ్బలూరిలో జైనుల నుక్కడగించి ఆ పురి వసది యానాడే పడిపోవునట్లు కఠోర శాప మొసగిన కథ!—ఇట్లు కథకులు కథలు చెప్పుచుండగా తాళములు మ్రోగించుచు చప్పటలు కొట్టుచు భజనలు చేయువారు వేరొకకొందరు! మరియు గొందరు వేదసూక్తములు పఠించువారు! ఆవేశముతో వెఱ్ఱికేకలు వేయువారు మరికొందరు! అందరును స్ఫాటికలింగమును అన్నమారాధ్యులను పరమభక్తితో నర్చించువారే!

యథావాక్కుల అన్నమయ్య! యథావాక్కుల అన్నమయ్య! వీరిది సిద్ధవాక్కు! ఇట్టివారే యథావాక్కులవారు! ఇట్టి యథావాక్కులు అందరకు ఆరాధ్యులు కారా మరి? వీరు వైజకవ్వకథ పఠింపగానే జైనప్రతిమపాదునుండి ఈ స్ఫాటికలింగము ఉద్భవించినది. ఆనాడు వైజనాథుడు పుట్టిన నీనాడు ఈ అన్నమేశ్వరుడే వెలసినాడు! ఈ కుదురులో రత్నాలుసొమ్ములు ఉన్నవని ముందే వీరు చెప్పుచు శివుని ప్రార్థించినారు. ఆ పద్యములో అన్నట్లే లింగము పాదులోనుండి రత్నస్వర్ణరాసులే పుట్టుకొనివచ్చినవి. ఎంత మహానుభావు డీ యథావాక్కు! అంతేనా? ఇందరము కలసి పెకలింపలేని మహాలింగము నీత డొక్కడే తన రెండు బాహువులతో పెకలించినాడు. స్థాణు వగు శివుడే ఈ భక్తుని కోపమునకు భయపడి అదరి బెదరి అల్లరిచేసిన పిల్లవానివలెనే అన్నమయ్యతండ్రిచేతిలోనికి వచ్చినాడు!

ఇట్లు పరిపరివిధముల నందరు పొగడువారే! ఆ చేరినవారికి నిజముగా లింగమూర్తియందు ఎక్కువ భక్తియో, అన్నమయ్యయం దెక్కువ భక్తియో రూపింపరాకుండెను.

ఆ మహోత్సవము ఏకశిలానగరవీధులం దెల్లెడ సాగెను. ఇంటింట నారతు లిచ్చువారే! ఆనాడు ఆ ఏకశిలానగరమే కైలాస మన్నట్లు ఆ ఉత్సవము చూచిన వారికి భాసించెను. ఆ యుత్సవములో నున్నవారును తాము కైలాసములో నున్న ప్రమథగణముల మనియే తలంచుచుండిరి.

సూర్యాస్తమయ మయ్యెను. దీపములు వెలిగించువేళ వచ్చెను. వెన్నెల రాత్రియే అది! ఐన నేమి? దివిటీలు లేనిది రాత్రియుత్సవము శోభగా నుండునా? దివ్వెలు అసంఖ్యాకముగా కొనిరాబడినవి. కనబడిన కఱ్ఱలు దివిటీకఱ్ఱలుగా మారెను. ఏదూపైన వస్త్రములు వానికి చుట్టు గుడ్డలయ్యెను. అందుకు ఇది విలువగలది ఇది

చాకడి యను విచక్షణ లేదు. ఎన్నో పట్టువస్త్రములే దివిటీలకు చుట్టిరి. మరి వానికి తైలమో! అన్ని రకముల తైలములు నేతులుగూడ ఉపయోగించిరి. ఆ దివిటీలు పట్టువారికి గూడ కులవివక్షలేదు; పెద్దలు చిన్నలు అనుభేదము లేదు. సదాశివునికి ఏ సేవచేసిన నీచ మనిపించుకొనును! అంబదేవుడే యొక దివిటీ గొని శివునిముందు సాగు వీరభద్రావతారమట్లు ఆ శకటముముందు పాదచారియై నడచెను. ఎవరు నెట్టి ప్రయత్నము ముందుగాచేయ నవసరము లేకుండగనే సద్యస్స్ఫూర్తితో సర్వము మహావైభవముగా జరిగిపోవుచుండెను.

నగరవీధుల తిరిగితిరిగి యా యుత్సవము మహారాజమందిరముమోసాల ముందు 'శోభనాల బావికిని' 'గడియారాల బావికి'ని మధ్య యొక్కింత నిలిచినది. అక్కడ వాద్యములు ఘోషించెను. నృత్యములు సాగెను. జయజయఘోషలు చెలరేగెను. సంగీతములు ప్రవర్తిల్లెను. రాజమందిరమునుండి రుయ్యమ కొందరు దాసదాసీజనులతో వచ్చెను. దాసదాసీజనము లింగమూర్తికి రాజసదనమునుండి వచ్చిన కానుక లర్పించిరి. రుయ్యమ స్వయముగా అన్నమలింగమునకు ఆరాత్రికము దర్శింపజేసి మంగళగీతము పాడెను.

రాజమందిరముప్రక్కనే స్వయంభూదేవాలయప్రాకారము! లింగోద్భవ కాలము సమీపించుచున్నది! ఆసమయమున నా యుత్సవము స్వయంభూనికేతనమును సమీపించెను!

ఆ మహాప్రాకారమునకు నలువైపుల విశాల మగు వీథులును నాలుగుమూలల విశాలము లగు నాలుగు చత్వరములును గలవు. ఆ యాలయమునకు ఆ ఉత్సవము ముమ్మారు ప్రదక్షిణించి తిరిగెను. అప్పటికి దాని యీశాన్యభాగమున అన్నమ లింగమునకు చక్కని చిన్న యాలయము సిద్ధమై యున్నది. ఓరుగల్లుశిల్పులకు అవధి యేమిటి? ఆ యాలయముముందు ఆ ఊరేగింపు మహార్భాటముతో నాగినది.

అన్నమారాధ్యుడు బండిపైనుండి క్రిందికి దిగెను. ముందాతడొక దివ్వె గొని యా నూతనాలయమున నెల్లెడ దాని త్రిప్పెను. నూతనాలయమునకు ఈ సంస్కార మవసరము. దానితో ఆయాలయము నాశ్రయించి యున్న భూత ప్రేతపిశాచాదులు వదలి వేరొక యాచ్ఛాదనము చూచుకొనును. అంతట అన్నమయ్య స్వయముగా స్వయంభూసరోవారి కనకకుంభములతో తెచ్చి యానూతనాలయమెల్లెడ సమంత్రకముగా ప్రోక్షించెను. అంతటనక్కడ లింగమూర్తిని ప్రతిష్ఠించుటకు సిద్ధముచేసియున్న గర్తములో బండిలో లింగమువెంట వసదిప్రక్కనున్న లింగముపాదునుండి తెచ్చిన రత్నములును స్వర్ణములును అంబదేవుని యాజ్ఞతో నిక్షేపించి యాతడు రత్నశిలాన్యాస మొనర్చెను. దారిలో కానుకలుగా వచ్చిన స్వర్ణాదు లన్నియుగూడ నందే యాత డుంచెను. అప్పుడు మరియును చేరిన భక్తులెల్లరు యథాశక్తిగా నాగర్తములో తమ కానుక లుంచిరి. ఇక లింగమూర్తిని ప్రతిష్ఠించుటే మిగిలియున్నది.

అన్నమారాధ్యులు ఇంచుకతడవు చింతించెను. ధాన్యస్వర్ణాద్యధివాసములు లింగమూర్తికి కాలేదే! మరియు ననేకసంస్కారములు కాలేదే! ఇట్టి సందేహములు అన్నమారాధ్యుల కంకురించియుండవచ్చును. పరక్షణములో నా సంశయములు పటాపంచలయ్యెను. సిద్ధలింగమూర్తికి మానవకృతసంస్కారములు కావలెనని తలంచుట ఎంత భ్రాంతి! అన్నమయ్యా, నీ కెంత అజ్ఞానమయ్యా? మరల నింకొక సంశయ మతని కుదయించియుండవచ్చును. ఈ లింగమూర్తి ఎంతకాలముగా ఆ జైనవసది నానియుండెనో గదా! ఆ నేమినాథప్రతిమపృష్ఠము క్రింద నలిగిపోయియుండెనుగదా! అయ్యో, స్ఫాటికలింగమూర్తి మైలపడలేదా? అన్నమయ్యకు జైనులపై గల ద్వేషముచే నీ సందేహము పోవుటకు ఎక్కువ వ్యవధి కావలసివచ్చెను. నిత్యపవిత్రు డగు శంకరునికి మైల సోకు టేమి? మైల సోకినచో ఈ స్ఫాటికమూర్తి ఇట్లు దేదీప్యమానముగా ప్రకాశింపగలదా? ఏమి యజ్ఞానమయ్యా నీకు? భక్తులు తెచ్చిన సహస్రాధికఘటములతో నీవు స్వయముగా లింగమూర్తి నభిషేకించితివి. దానితో నైన నీ మనస్సులోని మాలిన్యము పోలేదటయ్యా? లింగోద్భవకాల మైనది! ఆకాశమువంక అన్నమయ్య చూచి లింగోద్భవకాలమైనట్లు నిశ్చయించినాడు. అన్ని సందేహములును దానితో విరిసిపోయినవి.

సరిగా లింగోద్భవకాలమున అన్నమయ్య స్వయముగా నాస్ఫాటికలింగమూర్తిని శకటముపైనుండి తెచ్చి యా యాలయమున ప్రతిష్ఠించి భక్తులందర యనుమతితో నా లింగనికి అన్నమేశ్వరు డని నామకరణము చేసి పూజించి తీర్థప్రసాదములు భక్తులకు పంచిపెట్టెను. ఆ యారాధ్యదేవుడు తన శతకములోనుండి యీ పద్యము స్పష్టముగా శ్రావ్యముగా నిట్లు పఠించెను.

"బలవంతుండును దుర్బలుండును మహాప్రౌఢుండు మూఢుండునుం
గులజుండుం గులహీనజాతుడు ఘనక్రూరుండు శాంతాతిని
శ్చలచిత్తుండును నొక్కరూప మది నీ సద్భక్తి చిత్తంబులో
పల వర్ధిల్లినమీద నేవిధమునం భావింప సర్వేశ్వరా!"

౨౪

అనుకొననివిఘ్నముగా నిదియంతయు జరిగిపోయినది. మాత్ర మాలోచించి గాని యే పనియు జేయ దొరకొనని యంబదేవునికి ఆనాడు జరిగినది చూడగా నద్భుత మయ్యెను. శ్రీరుద్రదేవమహారాజులకు దక్షిణభుజ మీత డని లోకులెల్ల దన్ను కీర్తించుచుండిరి. తనతో నా గౌరవము పంచుకొనుట కిప్పుడు అన్నమంత్రీశ్వరుడు గౌరవ స్థానమున నైన లేడు. అట్టి తానుగూడ ఈనాడు ఈశ్వరేచ్ఛకు బద్ధుడై సూత్రధారుని చేతిలోని తోలుబొమ్మవలెనే ఆడవలసివచ్చినదిగదా! తలచుకొన్నకొలది అతనికే విభ్రమము కలుగసాగినది. ఈ విచిత్రసంఘటనచే నా ప్రదేశమున కోటకును అగడ్తకును అంతరాయము రాకుండ విరిసిపోయినది. ఈశ్వరకృప యుండవలెనుగదా! పాపమన్న మంత్రీశ్వరుడు ఈశ్వరకృప యున్నచో నీ స్థితిలో నుండునా? అంబదేవుడును అన్నమంత్రియు కొంచె మెచ్చుతగ్గుగా ఒకయీడువారే. వారిరువురు మిత్రులే. ఐనను అంబదేవునకు రాజాదరమున దన కిప్పుడు ప్రత్యర్థి లేకుండుటకు అంతరాంతరములలో సంతోషము లేకపోలేదు!

వసతిపక్షమున వ్యవహరించుచున్నవారు మొదటినుండియునిక్కడ యగడ్త త్రవ్వకుండ జేయుటకు చేసిన ప్రయత్న మాతనిహృదయమున నొక గట్టి పట్టుదల కలిగించెను. 'మర్యాదగా నెన్నివిధముల జెప్పినను మాట వినక నిర్లక్ష్యము చేసిరే వీరు! వీరి నెట్లైనను సాధించితీరవలెను!'

ఇట్లని నిశ్చయించి యా మరునాడే ఆ వసదికి సంబంధించిన పత్రములును శాసనాదులును స్వయముగా పరిశీలించి దగ్గరనుండి కొలతలు వేయించెను. అట్లు సరిచూడగా తుదకు ఇన్నాళ్లును వసదిలోనిభాగముగా పరిగణింపబడుచున్న ప్రదేశములో నాలుగవవంతు వసతి కెన్నడు నీయబడియుండలేదని ధ్రువపడెను. కరణములు వారి కనుకూలు రైనందున నది బయట పెట్టకుండ కప్పిపెట్టి యుండిరి. అట్లు అనధికారముగా నాక్రమించిన ప్రదేశమున జైనసాధువులకు తపస్సు కనువుగా ధ్యానశాలలుకూడ నిర్మింపబడియుండెను. అంబదేవుని కీ విషయము నిర్ధారణ మైన వెంటనే యాతడాయా ప్రదేశముల వర్ణించి యవి వెంటనే అప్పగింపవలె నని రాజాజ్ఞ యావసతి యధికారుల కందజేసెను.

దానితో నా వసదిలో పెత్తనదారులకు కలవర ముదయించెను. నేమినాథుని విగ్రహమునకైన యగౌరవమును కన్నులార తిలకించినపిమ్మట మొండితనము ఇక సాగదని వారు నిశ్చయించిరి. అంబదేవునితో విరోధము పెట్టుకొని మనగలమా యను భయము వారి నావేశించెను. అప్పటి వ్యావహారికు లాలోచించి నాగాచారిని పిలిపించి సర్వ మాతనికి నివేదింప నిశ్చయించి యాతనికి రమ్మని వార్త నంపిరి.

నాగాచారి వచ్చి పత్రము లన్నియు వివరముగా పరీక్షించెను. వసతి కట్టుకొనుటకు ప్రాచీనప్రభువు లిచ్చిన శాసనములు అందులో వసది కిచ్చిన ఎల్లలు సీమలు

మరల మరల పరిశీలించెను. మిగిలిన గుర్తులు చాలవర కిప్పుడు మారిపోయియుండు టచే గుర్తింప సాధ్యపడకున్నవి. మరికొన్ని ఇవి కావు అవి యనియు, అవికా వివియనియు వాదించుటకు వీలుగా నున్నవి. కాని యా రాతిగుట్ట సరిహద్దు కాదనుట ఎట్లు? అది మాత్రము సాధ్యము కాదు! గుట్ట మారిపోయిన దనవలెను. కాని అది ఎవ్వరు నమ్మెదరు? పైగా వానిలో నుదహరించిన ఎనిమిది దిక్కులలో మూడుదిశల నాగుట్టయే సీమగా ఉన్నది. ఆ దానములో నాగుట్ట యిమిడియుండ లేదని శాసన ములో స్పష్టమగు వాక్కులున్నవి. అందుచే నా శాసనాధారములపై వ్యవహరించుట సాధ్యముకానిపని. వ్యవహారజ్ఞులతో నాలోచింపక ఆ నేమినాథవిగ్రహమును రహస్యముగా నొకచోట పెట్టుట, ఆ పెట్టిన భూఖండము తమకు దాన మీయబడిన దని ముందు మొండిగా వాదించుట, అధికారులను ధిక్కరించుట వీనివలన నేమి నాథ విగ్రహ మచ్చట తామే నిశీథమున ప్రతిష్ఠించితి మను సందేహము ధ్రువపరచుట— ఈకర్మకాండమంతయు నా వసదివ్యవహర్తల మూర్ఖతను స్పష్టపరచుచున్నది. అందును ఆవల ఇంకొకరు ఇంకొకరు కాదే! అది అంబదేవుడే! ఆతని కుశాగ్ర బుద్ధిని వ్యవహారదక్షతను కార్యదీక్షను ఎదుర్కొవలసివచ్చినది! ముందే ఆతనితో మర్యాదగా 'మాక్రింద నిది చాలకాలముగా నున్నది. మీదయ వచ్చినట్లు చేయుడు' అని విన్నవించుకొన్నచో కార్య మింత మించెడిది కాదు. ఆతడు ఎదిరించినవారిపై మిక్కిలి పట్టుదలతో వ్యవహరించును. కార్యరంగమున బ్రవేశించినయెడల ఎట్టి పొర సందును రానీయక నవరంధ్రములు బిగించివేయును. నాగాచారి వివరించువరకు అంబ దేవుని యాజ్ఞలలోని ఇతరసూక్ష్మవిషయములు ఆ వసదివ్యవహర్తలకు దెలియను గూడ తెలియలేదు. ఈయాజ్ఞలు నిర్వర్తింపబడిన వసతిలో చాల భూభాగము పోవు టే కాదు; అందులోని మందిరములు పోవుటే కాదు; ముందు ఈ వసతికి బయటినుండి రాకపోకలు గూడ స్తంభించిపోవును. అందుపై వసతిలోని సాధువులు వసతియే వదలి పోయి వేరొక నివాసము చూచుకొనవలసిన పరిస్థితు లేర్పడును.

నాగాచారి యట్లు వివరించినంతనే ఆ వసదివ్యవహర్తలు ముందు నమ్మలేక పోయిరి. అతడు చెప్పినది నిజమే యని వారి కర్థమైనమీదట కోపము ఒక్కసారిగా ముంచెత్తుకొని వచ్చినది. కాని ఏమి చేయగలరు? ఎంత కష్టపడి వ్యయపడి తరతర ములుగా నిర్మించుకొనివచ్చిన యీ భవనములు విశ్రాంతిశాలలు ధర్మసత్రములు విడిచి పోవలసినదేనా? 'అంబదేవుని శాంతింపజేయు మార్గము లేదా?'

నాగాచారి: "అది మన మొదటి బిగువుతోడనే బిగిసికొనిపోయినది. లాభము లేదు!"

ఆ మాటలతో వారికి అధైర్యమే ఆవేశించినది. 'మరి యిప్పుడు చేయ దగిన దేమి?'

అదియే నాగాచారి సుదీర్ఘముగా నాలోచించెను. కొంతవడికి నిశ్చయించి వసదికరణమును బిలిపించి శ్రీరుద్రదేవమహారాజులకు జైనవసది కధ్యక్షులగు సిద్ధనందుల

వారు పంపుకొను విజ్ఞాపనపత్రమును లిఖింప నాజ్ఞాపించి తా నాతనికి అందుంపవలసిన విషయములు చెప్ప నారంభించెను.

ఆ పత్రములో ముందు శ్రీరుద్రదేవమహారాజులయు వారి పూర్వులయు నిష్పక్షపాతబుద్ధియు ధర్మనిరతియు నగ్గడించి ఈ వసతినాయకులు ప్రభువుల ఐశ్వర్యాభివృద్ధులకై అనాదిగా చేయుచున్న తపస్సును వర్ణించెను.

అంతట వ్యవహారసందర్భములు వివరింప ప్రారంభించెను. ఆ వసదికై కాకతీయ వంశప్రభువులకు ఉండుచు వచ్చిన భక్తిశ్రద్ధలచే వారెన్నియో దానములు చేసి యుండిరి. అందులో చాలవరకు సాక్ష్యముగా చూపుటకు ప్రభువుల శాసనములును పత్రములును ఉన్నవి. కాని కొన్ని ప్రదేశములు ప్రభువు లాతావునకు వచ్చి కన్నులతో చూపి నిర్దేశించి యిచ్చినవే కాని లిఖిత మగు నాధారములు అట్టివానికి లేవు. ప్రభువులు స్వయముగా వాగ్రూపముగా దాన మొనర్చిన ప్రదేశములకు లిఖితప్రమాణ మిండని యరించుట వారి కపచారము చేయుటకదా! అట్టి ప్రదేశములు వసది యను భవములో చిరకాలముగా నుండుటే గాని అందు కాధారముగా లిఖితశాసనములు లేవు.

అట్లు వసదికి దాన మీయబడి లిఖితాధారము లేని యొకానొక ప్రదేశమున చిరకాలముక్రిందట మా పూర్వాచార్యులు నేమినాథవిగ్రహము ప్రతిష్ఠింపదలచి యొక పాదు చేసి అందు రత్నములు సువర్ణములు నిక్షేపించి దానిపై చిహ్నముగా నొక స్ఫాటికశిల స్థాపించియుండిరి. అందుకు విగ్రహముకూడ నెన్నడో సిద్ధమయ్యెను. కాని ఇతరములగు చిక్కులచే నా ప్రతిష్ఠ యప్పటిలో నాగిపోయినది.

సరిగా నా స్థలమే ఇప్పుడు ప్రభువులు నిర్మించుచున్న శిలాప్రాకారము నగడలోనికి కావలసివచ్చినదట. ఆ పవిత్రప్రదేశముమాత్రము ఆ యగడ్తమధ్యము ననే ఉండనిచ్చునట్లు విన్నవించుకొనిన సరిపోయెడిది. మే మప్పుడు మౌనదీక్షలో నుంటిమి. ఆ సమయమున విషయపరిజ్ఞానము లేని యితరులు తొందరపడి మూర్ఖించి యా స్థలము రాజపురుషుల కప్పగించుటకు నిరాకరించి యచ్చట పూర్వము మేము ప్రతిష్ఠింపదలచిన నేమినాథమూర్తిని అర్ధరాత్రమున ప్రతిష్ఠించినారు. అందుపై రాజపురుషు లాగ్రహించి బలవంతముగా నా పవిత్రమూర్తిని తొలగించి యాప్రదేశము త్రవ్వించిరి. అంతలో ఆ పనికై నియోగింపబడిన జినద్వేషులు మూర్తిక్రింద నున్న స్ఫాటికశిలను లింగమూర్తి యని యాఘోషించి దానిని దానితోపాటు అందుక్రింద స్థాపితమైన యా రత్నసువర్ణరాసులను ఎత్తించుకొని వేరుప్రదేశమునకు చేర్చినారు. దీనితో మా వసది తలకొట్టినట్లయినది.

రాజపురుషులు ఈ అలుసు చూచుకొని యిప్పుడు అధికారపత్రములు లేకుండ అనాదిగా వసదిక్రింద నున్న ప్రదేశములను అందు మేము నిర్మించుకొన్న సమస్తభవనాదికములతోసహా స్వాధీనపరచవలసిన దని ఆజ్ఞాపించినారు. ఈ యాజ్ఞలను అంబదేవులయంత ప్రధానపురుషులు ప్రవర్తింపజేసినారు. ఈ యాజ్ఞలచే నిక్కపై

వసదికి రాకపోకలు గూడ జేయు నవకాశ ముండదు. సాధువుల తపస్సునకును తీర్థంకరమూర్తుల పూజాదికములకును భక్తుల సేవలకును భంగము వాటిల్లును.

వసది యిట్టి ప్రమాదావస్థలో నున్నది. ఎవరో అజ్ఞానులు చేసిన చిన్న పొరపాటుకు వసదిపై నింత యాగ్రహించుట ధర్మమా? వెంటనే ప్రభువులు వసది ననుగ్రహించి యాయాజ్ఞలు సరచేసి మా రత్నసువర్ణములను స్ఫాటికశిలయును మా కిప్పింప వేడుదుము. మీకు తీర్థంకరుల ప్రసాదముచే ఆయురారోగ్యైశ్వర్యములు వర్ధిల్లుగాక!

ఇది యా వినతి సారాంశము! అంతయు ప్రభుభక్తితోడను గంభీరవాక్కులతోడను నిండియున్నది. దీనికి శుద్ధప్రతి ఎట్టి మనోజ్ఞమగు పత్రముపై నే రంగులతో వ్రాయవలెనో కూడ నాగాచారియే కరణమునకు స్పష్టముగా తెలిపెను. మరియు నా పత్రము పూజ్యులగు సిద్ధనంద్యాచార్యులవారి పేరనే పంపుటకు గూడ నాతడు నిర్ణయించెను.

కాని యా పత్రము సిద్ధనంద్యాచార్యులయొద్దకు తీసికొనిపోగా దానిపై తన నామ ముంచుటకు వారు నిరాకరించిరి. నిర్జరుడగు తన కెందు కిది? ఇంతవరకు తా నేమి వ్యవహరించుచుండెను? ఇది మాత్రము తనయొద్ద కేల తీసికొనిరావలెను? ఆ పత్రమును కరణము వినిపించినను ఆయన యది వినిపించుకొనలేదు. వ్యవహర్తల కది సాధించుట కష్ట మయ్యెను. వారంద రాలోచించుకొని యారాత్రి సిద్ధనంద్యాచార్యులు నిదురపోయి లేచి కలతనిద్దురలో నున్న సమయము కనిపెట్టి యేదో సాకు చెప్పి ఆయనకు తెలిసియు తెలియకుండ నున్న సమయమున నందుపై నాయననామ మంకితము చేయించుకొని తమయొద్ద నున్న ఆయనముద్రికతో ముద్రించిరి.

మరియు నా పత్రమును ఎవరు ఏవేళ ఏవిధముగా శ్రీ రుద్రదేవమహారాజులకు నివేదింపవలెనో కూడ నాగాచారియే నిర్దేశించెను. ఆ వసతిపెద్దలును అతని యుపదేశమును సర్వథా సంభావించి అక్షరశః పరిపాలించిరి.

ఆనాటి పూర్వాహ్ణసమయమున శ్రీ రుద్రదేవమహారాజు ధర్మాసన మధిష్ఠించి యుండెను. అప్పుడు ఆ వసదిప్రధానకరణము కొందరు శ్రేణీపతులను వెంట గొనిపోయి వసదియధ్యక్షుని వినతిపత్రమును మహారాజులకు నివేదించెను. సిద్ధనంద్యాచార్యుల నామము చూచినంతనే యా పత్రమును మహారాజు కన్నుల కద్దుకొని యా పత్రమంతయు పరిశీలించెను. అందులోని రహస్యమంతయు నామె కవగత మయ్యెను. ఆ వినతిపత్రమును దానితోపాటు నివేదించిన ఇతరపత్రములను ప్రక్కనున్న కార్యధురీణుడగు దామనామాత్యునకు చూడ నిచ్చెను. దామనామాత్యు డవి చూచి యిట్లనెను.

“మహారాజా, దేవరవారు ముందు అంబదేవులతో నీ విషయము సంప్రదించి రేపటిదినమున నాజ్ఞ లిచ్చుట మే లని నాబుద్ధికి దోచుచున్నది.”

వసదిప్రధానకరణ మా మాటలు విని నిలువున నీరైపోయెను. అయినను రుద్రదేవు లేమందురో?

శ్రీ రుద్రదేవమహారాజులు దామనామాత్యుల యుద్దేశముతో శోకిభవించిరి. 'మాకును నదే భాసించినది.' అనిరి.

అంతట కార్యభరణుడు వసతిపక్షమున వచ్చినవారిని మరునాడు రావలసిన దనియు ఇంకను దానికి సంబంధించిన పత్రములును సాక్ష్యములును ఉన్నచో తెచ్చి కొనవలసిన దనియు వారికి రాజాజ్ఞ వినిపించెను. వినీతులై నమస్కరించుచు వారును సెలవుతీసికొనిరి.

వారి గుండెలలో రాయిపడినట్లైయెనది. అంబదేవునితో మహారాజు లాలోచించిన కార్య మనుకూలపడనిచ్చునా ?

జరిగిన దంతయు వ్యవహర్తలు నాగాచారి కా సాయంత్రమే తెలిపిరి. ఆతడది విని వారివలె నధైర్యపడలేదు. అది మన కనుకూలించు సూచనయే అని నాగాచారి వారికి ధైర్యము చెప్పెను. అంబదేవుని యాజ్ఞలు మార్పుచేయ దలచియుండుటచేతనే ఆతనితో చెప్పి యాతని తృప్తిపరచుటకే శ్రీ రుద్రమహారాజు లట్లు శాసించిరని యాతడు సూచించెను. ఐనను ఎటుపోయి ఎటువచ్చునో యని ఇంకను సంపాదింపదగిన పత్రములను సాక్ష్యమును ఆతడు వారికి చెప్పి సిద్ధము చేయించెను.

ఆ వసతిలోని సాధువు లందరు నా నా డుపవసించి యారాత్రియంతయు దమ యిష్టనాథుల ప్రార్థించుచు జాగరములు సల్పిరి.

మొత్తముమీద నాగాచారి యూహించినట్లే అంతయు నడచెను. ఇట్లు వినీతులై వసదియధికారులు తన్ను అర్థించినపుడు కఠినముగా నుండుట యుక్తము కాదని మహారాజు తలంచెను. వసదివా రెన్నడో కట్టుకొన్న భవనములు కూడ వదలి వెళ్లుడనుట అన్యాయముగా అందరకు తోపకమానదు. అదియునుగాక ఈ పత్రములు సిద్ధనంద్యాచార్యుల పుణ్యనామముతో నంకితము లైనవి. వారిమాటలు సులభముగా త్రోసివేయుట కూడనిపని. అయినను వసదివారు రాజకార్యమునకు నిర్లక్ష్యముగా విఘ్నమాచరింప నుద్యమించినపుడు అంబదేవుడు చేసిన ప్రతిక్రియకూడ శ్లాఘ్యమైనదే! రాజసేవలో నాతడు చూపిన నైపుణి ప్రత్యేకముగా ప్రశంసార్హమైనది.

అట్టి విశ్వాసపాత్రులును సమర్థులును అగు రాజసేవకుల కట్టి మనస్తాపమును కలిగించుట యుక్తము కాదు. అందుచే రుద్రమ యా సాయంత్రమే అంబదేవుని తన సన్నిధికి పిలిపించి విషయ మేమని యడిగెను. అతడు జరిగిన దంతయు వివరించెను. ఆమెకు స్వయముగా తెలియనివి ఆమె యూహించినట్లే జరిగినవని అంబదేవునిముఖమున దెలిసికొనెను. అంబదేవు డంతయు జెప్పినపిమ్మట రుద్రమ సిద్ధనంద్యాచార్యులు పంపిన వినతిపత్ర మాతని కిచ్చి చూడు మనెను.

అంబదేవు డది చూచి చిరునవ్వు నవ్వుకొనుచు, 'ఇందుపై మహారాజుల యాజ్ఞ యేమి?' అని ప్రశ్నించెను. అది యాలోచించుటకే ఆతని బిలిపించితి నని యామె యుత్తర మిచ్చెను.

అంబదేవుడు యోజించెను. తుద కాత డిట్లనెను.

"స్వామీ, తమరు వసదిపై నెంత కరుణయైన జూపవచ్చును. కాని యీ రత్నములును సువర్ణములును స్ఫాటికబాణమునుమాత్రము—"

శ్రీ రుద్రదేవమహారాజు మధ్యలో నడ్డుతగిలి యందుకొనెను. "అవి వేరుగా వైభవముగా ప్రతిష్ఠాపిత మైనవిగదా! వాని గదలింప వీలులేదు. ఆ విషయమే ఎట్లు చేయుటా యనియే ముఖ్యముగా మేము యోజించుచున్నాము. మీ యుద్దేశ మేమి?"

అంబదేవుడు: "స్వామీ, ఏ మున్నది? ఆ ప్రదేశము వారి దని నిర్ధారణచేయ దగిన యాధార మేమియు లేదు. అగడ్త త్రవ్వించుటలో మన కింకను ఎన్ని రత్నములు సువర్ణములు దొరకియుండలేదు? వాని నన్నిటిని జేసినట్లే ప్రభువుల చిత్తము ప్రకారము వీనిని గూడ నుపయోగింపవచ్చును. ఈ వ్యవహారమునకు మూలకారణ భూతమగు నాప్రదేశము మాత్రము వదలక తక్కిన ప్రదేశములును మార్గములును వసదివారికి స్థిరపరచుచు ప్రభువులు కరుణింపవచ్చునేమో!"

రుద్రమ: "అంబదేవా, మీబోటి ప్రభుభక్తిపరాయణులు ప్రవర్తింపజేసిన యాజ్ఞలు న్యాయమైనవై యుండగా అట్టివానిని మేము తారుమారుచేయుట సమంజసమా యని యాలోచించుచున్నాము."

అంబదేవుడు వినయముతో నిట్లు విన్నవించెను.

"మహారాజా, మాబోటి ప్రభుసేవకులు కఠినముగా రాజద్రవ్యమును గాపాడుచు నాజ్ఞలు ప్రవర్తింపజేయుచునే యుండవలెను. అయితే నిగ్రహానుగ్రహసమర్థు లగు ప్రభువులు మా కఠినశాసనములను కారుణ్యముతో జతచేసి జనరంజకముగా ప్రవర్తింపజేయుటయు రాజధర్మము గదా!"

రుద్రదేవమహారాజు అంబదేవుని వ్యాఖ్యానమున కెంతయు నానందించెను. ఆపిమ్మట నామె పరిఖాశిలాప్రాకారనిర్మాణాదులసంగతులు ప్రస్తావించి యితర రాజకార్యములును మాట్లాడి యాతని బంపివేసెను.

మరునాడు సింహాసనమున శ్రీరుద్రదేవమహారాజు కూర్చుండి వసతిశుద్ధికారులు తెచ్చిన నూతనపత్రములును సాక్ష్యములును శ్రద్ధగా పరిశీలించెను. వానిచే నగడ్తక్రిందికి వచ్చిన ప్రదేశము వసది కీయబడిన దని క్రొత్తగా నేమియు ఋజువు కాలేదు. అట్టి ప్రయత్నముకూడ చేయవలదనియు నాగాచారి సూచించియే యుండును. ఒక్కొక్క సంపాదించుటకు కొంత వదలుకొనవలెను!

ఆనాడు శ్రీరుద్రదేవమహారాజు ఆ విషయమున నాజ్ఞ ప్రవర్తింపజేసి వసదివారి కది తెలియబరచెను. ఆ యాజ్ఞ మొదటినుండి తుదవరకు కేవలము మహారాజులకు వసదిపైగల యభిమానముచే కరుణచే నచ్చటి శ్రమణులపై భక్తిచే ప్రవర్తింపజేసినట్లే యున్నది. కాని వసదివారు చెప్పిన వాద మే విషయమునను అంగీకరించినట్లు లేదు. ఆ యాజ్ఞలో గర్భితముగా నొకానొక కాఠిన్యము కూడ నిమిడియున్నది. వసతి యాశ్రమములో ప్రస్తుత మున్న స్థలములకు అందున్న దర్మశాలలకు భవనములకు మందిరములకు మార్గమునకు ఎట్టి యవరోధమును ఉండదు. కాని యికముందు

అంగుళముమేరయైనను వారు రాజానుమతి లేకుండ నాక్రమింప వీలుండదు. కాని ఇప్పటికే ఆక్రమింపబడిన ప్రదేశములకు భయము లేకుండ నట్టి ప్రదేశము లప్పుడే క్రొత్తగా ఇచ్చుచున్నట్లు ఆ శాసన ముండెను. ఇందువలన వసతిప్రక్క నున్న గుట్టలో ముప్పాతికభాగము వసతివారు వదలుకొనవలసివచ్చెను. మరి యొక నగ క్రింద పడిపోయిన దన్న ప్రదేశము ఎన్నకును వసదివని వాడించుటకైన వీలులేనిది. అందుచే అక్కడ లభించిన రత్నములు సువర్ణములు లింగమూర్తియు వారు తమవని కోరుటకు ఆధారము లేకేలేదు. వానివిషయమున సంబదేవులు ప్రవర్తింపజేసిన యాజ్ఞలకు ఎట్టి మార్పును లేదు. అయితే ఆ తొలగించిన నేమినాథమూర్తి యుక్తమగు ప్రదేశములో వసతివారు ముందు ప్రతిష్ఠింపవలచి శ్రీ రుద్రదేవమహారాజులకు మనవి చేసికొన్నచో నప్పుడు బొక్కసమునుండి యుక్త మని తోచిన ద్రవ్యము జినదేవులపై మహారాజుల కున్న గౌరవముచే కట్నముగా సమర్పించుకొనగలరు!

ఆ శాసనముతో వసతివారు బయటపడితి మని నిట్టూర్పు విడిచి నాగాచారి మంత్రమును శ్లాఘించి యాతని నాశీర్వదించి బహుమతు లొసంగిరి. కాని బయటికి మాత్రము మా రత్నసువర్ణరాసులు అన్యాయముగా జంగములు ఎత్తుకొనిపోయి రని వారు గోలచేయుచునే యుండిరి. కాని వారి కక్కడ నిజముగా రత్నములు సువర్ణములు నిక్షేపింపబడియున్నవని తెలిసియుండెనా?

చిత్రముగా కార్తికపూర్ణిమనాటికి వసతిలో నింతకాలముగా నున్న మహాయోగి యదృశ్యుడయ్యె ననియు నాత డుండెడి గది తెరచి శూన్యముగా నున్న దనియు ప్రకటిత మయ్యెను. భక్తులందరు నక్కడ జేరి 'ఇదిగో ఈ గదియే!—ఆ శిలాతలమే యా మహానుభావుడు కూర్చున్న ప్రదేశము! ఎక్కడికి వెళ్లెనో కదా మహాత్ముడు!' ఇట్లనుచు తీర్థప్రజగా జనులు వచ్చి యా గది చూడసాగిరి. ఏ మున్నది?— ఆ గది శూన్యము!

'నేమినాథవిగ్రహము తీసివేయించిన యవినయము భరింపలేక ఆ మహాయోగి సల్లేఖనము చేసికొన శ్రవణబెల్గోళాక్షేత్రమునకు గోమతీశ్వరవిగ్రహసన్నిధికి వెళ్లి యుండును!'

ఇట్లొక భక్తు డూహించినాడు! అన్ని యూహల కంటె నది యుక్తముగా తోచినది. తదాది . అదియే అందరు అవలంబించి ప్రవర్తింపజేసిరి. అందుపై నాయన బయలుదేరివెళ్లుట చూచినామనువారుకూడ వచ్చిరి. ఒకరు పాదచారియై వెడలె ననిరి. మరియొకరు గగనమార్గముననే పోయె ననిరి. ఏది యెట్లున్నను జైనులలో సల్లేఖనము తరుచుగా జరుగుచుండెను. అది వేదమార్గానుయాయుల ప్రాయోపవేశము ననుకరించును. సల్లేఖనముచేయు జైనులు ప్రాణాంతమువరకు ఆహారము ముట్టక స్థిరచిత్తముతో శుద్ధబుద్ధైకస్వభావమగు నిజశుద్ధాత్మస్వరూపమునే ధ్యానించుచు దేహత్యాగము చేయుదురు. ఇది మోక్షమే ప్రాప్తింపజేయు నని జైనాగమములు తెలుపుచున్నవి.

అర్ధరాత్రము దాటి యైదు గడియ లైనది. మూడవయామము ఐపోయిన దని యామికు డింకను నగరమున ప్రచురించుచు తిరుగనారంభించుటకు తడ వున్నది. ఓరుగంటి పురజను లందరును గాఢనిద్రలో దేలుచుండిరి.

ఆసమయమున మున్నెన్నడు నా నగరవాసులు వినియెరుగని యొక శబ్ద మానాడు నగరమున విననయ్యెను. ఆ నగరవాసులు శతాధికము లగు వాద్యవిశేషము లెరుగుదురు. కాని ఇది వా రెరిగిన యే వాద్యశబ్దమును గాదు. ఇనుపకడియములు ఇనుపగంటలు తగిలించియున్న యినుపబ్రద్దలు కలిపి యాడించుటచే ఆ కడియ ములు గంటలు ఆ బ్రద్దలకు తగిలి పుట్టెడు నొక వింత శబ్దము! ఆ శబ్దములో నాదము లేదు. నిండుదనము లేదు. అది కేవలము ఒక చప్పిడి చప్పుడు! చెవులలో కఠోరముగా ప్రవేశించి ఏవ కలిగించు ధ్వని! అట్టి చప్పుడు చేయగల సాధనమును ఎవరో గాయక మహాశత్రువు కనిపెట్టియుండును. ఆ చప్పు డీనాడు నిశ్శబ్దముగా నున్న యానగర మున మొదటిసారి వినవచ్చినది. ఆ ధ్వని చాలదో యన్నట్లు మధ్యమధ్య బెట్టున్న మరియొక సాధనమును గిరగిర త్రిప్పుచుండగా పుట్టెడి కరకరశబ్దమును దానికి తోడగు చుండెను!

అది భయంకరమైన శబ్దము కాదు. గంభీర మైనది కాదు. శ్రావ్యమైనది కానే కాదు. అది యొక చపటశబ్దము. పట్టి చప్పిడి మ్రోత! అర్ధసౌష్ఠవము గాని శబ్దగాంభీ ర్యము గాని ఔచితి గాని లయగాని లేని వచనరచనవలెనే పేలవ మైనది. దాని పేలవ గుణమే ఒక్కసారిగా నా నగరమున గల యశేషజనులను ఆ అపరరాత్ర వేళ మేలు కొలిపినది. అది ఎంత పేలవ మైనను చౌకకవుల కవిత్వమువలె నిరంతరముగా వచ్చు చున్న దా శబ్దము! ఆ శబ్ద మట్లు ఎడతెగక చెవులలో చొచ్చుచుండుటచే ఊపిరి సలుపనిచ్చుట లేదు. అది వినవలె నని యెవ్వరికి నిచ్ఛ లేదు. కాని దాని నెవ్వరును వినకుండ నుండలేరు. వినకుండ నుండదలచినకొలదియు నది బలవంతముగా వీనుల జొచ్చుచుండెను. నిదురపోదలచినవారిని నిదురపోనీయ దది. ఆ శబ్ద మట్టిది! నిదు రించువారిని లేపును; లేచినవారిని మరి నిదురపోనీయదు. మరి యే యన్యశబ్దమును లేని సమయమునగుటచే ఏకశిలానగరప్రాకారమధ్యభాగమంతటిని ఆ శబ్దమే బల వంతముగా నాక్రమించుకొనెను. అందులో మధ్యమధ్య వచ్చు నా కిరకిరశబ్దము ప్రాణులను కొరుకుచున్న రాక్షసుని దంతములు చేయు శబ్దమునే తలపించుచుండెను. సర్వము నాయసశబ్దము! ఈ వేళ ఇనుపగజ్జెలతల్లి ఎక్కడనుండి వచ్చినదో ఏకశిలానగ రములోనికి!

ఆ శబ్దముతో పాటు ఆ శబ్దముకంటె కటువైన కంఠ మొకటి మధ్య వినిపిం చును. ఆ యాయసశబ్దము ఒక్క శ్రుతిలో నైన మ్రోయదు. ఏ క్షణమున కా క్షణ

మానవు శ్రుతి మారుచుండును. మరి యా కంఠమో! ఆ ఇనుపత్రాకలోని యపశ్రుతి భేదములనైనను అనుగమింప దాకంఠము! ఆ కంఠమును ఆ వాదనమును పరస్పర శత్రువు లగు సేనాను లిద్దరు ఒకేసేనలోని భటులను నడపుచున్నట్లే యుండెను.

ఆ రెండిటికి తోడుగా నా రెండిటితోఁగూడ కలియక తనతోఁ దానుగూడ కలియక వీక్షణమున కౌక్షణము స్వతంత్రమై విజృంభించు అతినూతన మగు పాటకూడ ఒకటి సాగెను.

“అల్లా చల్లా చూపు తల్లీ పిల్లలు మీరు పరిఢిల్లావలె చల్లాగా ఇల్లల్ల తల్లీపిల్లా మీరు చల్లాగా వర్ధిల్లవల్లా ఇల్లా అల్లా ఎల్లాకాలము మీరు తల్లీపిల్లా ఢిల్లీ అల్లా మళ్ళీ మళ్ళీ తల్లీపిల్లా ఇల్లా——!”

ఈ పరిక్రాంతపాట ఆ అప్రశుతుల నోటికి వచ్చినట్లెల్ల వర్ధిల్లిపోవుచుండెను. ఆ మాటల కూర్పునకు స్పష్టమైన యర్థము లేదు. ఆ పాటలోని మాటలుమాత్రము మంచి వినిపించును. కాని యా మాటల మంచితనమే పాట కొక దుష్టార్థము కల్పించుచుండెను. ఆ కంఠమును ఆ యాయసశబ్దమును నిశాచరులు తిరుగు నా యపరరాత్రి సమయమున ఒకచోఁ గూడకున్నచోఁ నా పాటలోని మాటల కా విపరీతార్థము స్ఫురింపదేమో!

ఆ శబ్దమును పాటయు ముందు ఓరుగంటి పశ్చిమోత్తరదిశను పుట్టినవి. వాయవ్యమునుండి యవి అట్లట్లు తిరిగి ఉత్తరపుదిక్కునకు వచ్చినవి. మధ్యమధ్య నవి యాగును. మరల ప్రారంభించును. ఆ శబ్దము ఒక దిక్కుగా పోవుట లేదు. ముందు వెనుకలకు పోవును, వచ్చును. ప్రక్కలకు జరుగును. ఇటు పోవును. అటు వచ్చును. కాని మొత్తముమీద వాయవ్యమునుండి ఉత్తరమునకు, ఉత్తరమునుండి తూర్పునకు, తూర్పునుండి దక్షిణమునకు, అక్కడనుండి పశ్చిమమునకు —— తుదకు అది పుట్టిన వాయవ్యమునకు బోయి యక్కడనే తెల్లవారకముందే అడగిపోయినది. అది నిశాచరుడగు నొక బైరాగి భైక్షుకచాలనము!

ఆ శబ్దము వాయవ్యమున సముద్గతమైనవెంటనే తన యింటిలో నిదురపోవుచున్న గండనికి మెలకువ వచ్చినది. పట్టణమున నెవ్వరికి నిద్దురపట్టనిది అతని కపలు పట్టునా? అతడు త్రుళ్లిపడియే నిద్ర మేల్కాంచెను. అది కొంతసేపాత డాలకించెను. మధ్యమధ్య నాగుట ఇటునటు పోవుట అతనికి అనుమానము కలిగించెను. క్షణక్షణము నాతని యనుమానము పెరిగిపోసాగినది. తుద కది యాతడు పట్టలేక పోయెను.

గండడు శయ్యనుండి లేచెను. ధట్టి బిగించెను. ఒరలో చురకత్తి సరిచేసికొనెను. చేతిలో చిక్కని దండ మొకటి ధరించెను. రొమ్మునకు తగడును శిరస్సునకు శిరస్త్రాణమును తగల్చుకొనెను. తనపైనల్లని యంగీ యొకటి కప్పుకొని బయలుదేరెను.

ఈ ప్రయత్నము లన్నియు జూచుచున్న యాతని భార్య ఏమియు మాటాడలేదు. అతనికి పెద్ద యుద్యోగమైనప్పటినుండియు నాతని చర్య లన్నియు దానికి

వింతగానే ఉండుచున్నవి. పూర్వము తన ప్రతాపము ప్రగల్భముగా చెప్పుకొనుచుండువాడు. ఒక్కొక్కతరి దానికి వినుటకు వినుగుపుట్టినను తన మల్లయుద్ధ విశేషములు వర్ణించుచునేయుండెను. అతని దేహమున గలిగిన దెబ్బలకు ఉపచారము చేయుటే గాని మల్లక్రీడ దాని కేమి పట్టును? ఈ యుద్యోగ మైనప్పటినుండి యాతని వాక్కు కట్టువడినది. వెనుకటికంటె నిప్పు డెక్కువసేపు తన పనిపై సంచరించును. ఇంటికి వచ్చినపిమ్మట ఇంటి విషయములే కాని బయటి విషయములు మాటాడడు. పరిపరివిధముల నది భర్తనుగూర్చి సందేహించెను. కాని యేమియు నడుగ సాహసింపదు. ఎదురు చెప్పదు. ముగ్ధ మగు ముఖముతో ముగ్ధ మగు చూపులతో నాతని ప్రశ్నించును. అతడు ప్రత్యుత్తర మీయడు. ఈ యపరరాత్రివేళ నాతడు చేయుచున్న సన్నాహము గమనించి యది యట్టి చూపులతోడనే ప్రశ్నించెను. అందుకు గండడు తలుపు వేసికొను మని చెప్పుటే కాని మరుమాటాడక బయలు దేరెను.

వీథిలోనికి వచ్చి ఆ శబ్దము వచ్చుచున్న దెక్కడో ఆలకించెను. అది నిర్లక్షించి వెంటనే అటువైపు కాతడు నిశ్శబ్దముగా కదలెను. ఒకచోటికి చేరగా ఆ శబ్దము తనవైపుకే వచ్చుచున్న ట్లాతనికి తోచెను. గండడు చప్పున ప్రక్కనున్న సందులోనికి పోయి యందొక యింటిచాటున దాగుకొని యా శబ్దము దాటిపోవు వరకు నచ్చటనే ఆగియుండెను.

ఇనుపకడియము లున్న ఇనుపపట్టె లాడించుచు మధ్యమధ్య నింకొకటి గిరగిర త్రిప్పుచు ఒక భిక్షుకు డా శబ్దములు చేయుచున్నా డని గండడు నిర్లక్షించెను. ఆతని తలపై నొక యుష్ణీషమున్నది. ఒంటిపై చింపిరియంగీ యున్నది. వెంట నొక భిక్షాపాత్ర మున్నది. అది మనుష్యకపాలమా? కాక టెంకాయచిప్పయా? అతడు నెమ్మదిగా నడుగులు వైచుచు నిర్భయముగా సాగిపోవుచుండెను.

ఆ భిక్షుకుని జూచినంతనే వ్యర్థముగా నింతదూర మేల వచ్చితి నని గండని కనిపించెను. భిక్షచేయువారు అనేకవిధములుగా నుందురు. ఎవరివేళ వారిది, ఎవరి వేషము వారిది! అందులో నిదియు నొక విధము. ఇక నింటికి పోవచ్చును. పాప మింటివద్ద తన భార్య తనకై దిగులుతో నెదురుచూచుచుండును. అందును ఈనా డది ఎక్కువదీనముగా జూచిన ట్లాతని కిప్పుడు స్ఫురించినది. అయినను ఇంతదూరము వచ్చి యూతని ననుగమింపక వెనదిరిగిపోవు టేల? కొంతతడ వాతడు తటపటాయించెను. ఎట్టకేల కాత డా భిక్షుకుననుగమించుటకే నిశ్చయించెను. అట్లు నిశ్చయించినపిమ్మట జాగరూకత వదలకయే వెంట నంటెను.

ఆ నగరమునం దెందరు సంపన్నులు లేరు? కాని యా భిక్షుకు డట్టి సంపన్నులగువారి యిండ్లకడ నెక్కడను ఆగుటలేదు. అత డాగునది పేదల కుటీరముల వద్దనే. అతడు వచ్చుచున్న శబ్దము దరిసినంతనే ఆ యింటివారు లేచి భిక్షము పెట్టుటకు సిద్ధముగా నుందురు. శ్రద్ధగా వారు తాము తిను జొన్నలో, రాగులో,

సజ్జలో ఆతనికి చెప్పి యర్పింతురు. అవి యన్నియు నాతఁ డొక్క పాత్రముననే స్వీకరించి దీవించును. దానికి తోడుగా దక్షిణగా వారొక పణముగూడ నర్పింతురు.

అతఁ డట్లు చేరుచున్న కుటీరములు సామాన్యముగా చిరకాల ముండెడు నివాసమున్నవారివి కావు. వారు చర్మములు ఇనుమువంటి పదార్థములతో వ్యాపారము చేయుటకు ఉత్తరభూములనుండి వచ్చిన చిల్లరవ్యాపారులును పనివారును ఐయుండిరి. అట్టివారి గృహములు ఏకశిలానగరమున నెన్నియో లేవు. ఉన్నవి కొంచెమును అక్కడక్కడ దూరదూరముల నున్నవి. అతఁ డా యిండ్లయొద్దకే పోవుచుండెను. ఆ యిండ్లయొద్దగూడ నాతఁ డెక్కడనో ఒకచోట తప్ప ఎక్కువసేపు ఆగడు. భిక్షగైకొని వారి నాశీర్వదించుటే తడవు సామాన్యముగా. కొన్నియెడల మాత్రము ఇంటివారేవో ప్రశ్నలడుగుచున్నట్లుండురు. ఆ ప్రశ్నలుకూడ గండనికి వినబడ్డవరకు శాకునికులను జ్యోతిషికులను అడుగు ప్రశ్నలే. కొందరుమాత్రము తమ పిల్లలకో, పెద్దలకో జబ్బుగా నున్నదనియు దానికి ప్రతిక్రియ కావలెననియు నర్థించుచున్నట్లుండెను. అతఁడు వారి కేదియో అభిమంత్రించి యిచ్చుచుండును. అవి వేరులు కాబోలు!

ఈతని వెన్నంటుట యనవసర మని ముం దాలోచించిన గండనికి ఇతఁ డన్ని గృహములకును చిరపరిచితునివలె పోవుట చూచి నాశ్చర్య మయ్యెను. దానితో సందేహమును బల మయ్యెను. అతఁడు సంచరించు తావులును ముఖ్యముగా వెలిపాలెము నను దాని సమీపప్రదేశములనే కలవు. ఆతఁడు జూదమాడు ప్రదేశములను త్రాగుబోతుల కూటములను దొమ్మరిసానుల యిండ్లను గూడ మధ్యమధ్య ప్రవేశించుచుండెను.

ఇట్లా బైరాగి వెళ్లివెళ్లి బొల్లని యింటియొద్ద నాగెను. అది చూడగానే గండనికి కాళ్లు స్తంభించినవి! ఏమిది!

నిశీథమున నగరమున నజ్ఞాతముగా సంచరించుట కథలలో సామాన్యముగా చదువునంత సులభము కాదు. ఆ బైరాగి కేమి! అతఁడు రహస్యముగా సంచరించుట లేదు. ఆ యినుపకడియముల చప్పుడుకు దారిలో నున్న పాములు జెర్రులు భయపడి పారిపోవును. ఆ చప్పుడు దూరమున విన్నంతనే ఊరిలోని కుక్కలు మొరుగుచు లేచి యాతని వెన్నంటును. గృహస్థులు తలుపులుతీసి ప్రశ్నింతురు. అతఁడు ఉత్తరము పలుకకుండ వెడలిపోవును. కాని యాతఁడు పెద్దచప్పుడు చేయుచు అందరను ఆశీర్వదించుచు వెళ్లుచున్నాడు. గనుక ఎవరో పిచ్చివాడో బిచ్చగాడో యనుకొని సరిపుచ్చుకొందురు.

కాని యాతని రహస్యముగా వెన్నంటిపోవు గండని దారియంత తేలికయా! బైరాగివెంట బడి పడి మొరిగి మొరిగి విసివినకుక్కలు వెనుకకు వచ్చును. ఇంతలో గండని నల్లని యంగీ కప్పుకొని చేత దండము ధరించిన యాకారము చూచినచో ఆ కుక్కలు నూతనావేశముతో నాతనిపై కవియవా! దానితో బైరాగికి తన్నెవరో

అనుగమించుచున్నా రని తెలిసిపోవదా? అట్లు తెలిసిపోయినచో తాను వెన్నంటి యేమి రహస్యము తెలిసికొనజాలును?

మరియు లేచిన గృహస్థులు బైరాగిని ప్రశ్నింతురుగదా! ఆతడు ప్రత్యుత్తర మీయకపోగా వా రిటు నటు చూచుచు కాలదివ్యవధానములో నచ్చటికి వచ్చిన గండని వారు ప్రశ్నింపకుందురా? 'ఆ ముందు పోయిన దెవరు?—అతని వెంటబడు చున్నట్లున్నావే-అత డేమైన దొంగయా?—అసలు నీ వెవరవు?' ఆ ప్రశ్నలకు తాను ప్రత్యుత్తర మీయనిచో ఆ గృహస్థుడు ఊరుకొనడు; ప్రక్కయిండ్లవారిని లేపును. అందరు కలసి యాతని చుట్టుముట్టి తోచిన ప్రశ్నలెల్ల సాగింతురు. అల్లరి యగును. అది బైరాగికి వినబడకుండునా? అట్టిది వినబడకుండునంతదూరములో నుండి వెళ్లుద మన్న ఆ బైరాగి యాగు ప్రదేశములు గుర్తించు టెట్లు? ఆతని మాటలు విను టెట్లు? అదిగాక ఆతని నీ సందర్భమున సరిగా ననుగమించుటయే సాధ్యపడదు.

ఈ చిక్కు లన్నియు ముందుగనే గండ డూహించియే తగు మెలకువతో సంచరించుచుండెను. రహస్యముగా నగరమున నిశాసంచార మొనర్చు నేర్పు మేచయనాయకుని వ్యవహారకాలలో తద్విదు లాతనికి కొంత ప్రతపరచియే యుండిరి. అది స్వానుభవముతో గట్టిచేసికొనవలెను. ఇప్పటికి పది పన్నెండుమారు లాతడా పనియందు నియుక్తు డగుటచే కొంతవర కారితేరినాడు.

ముందు బైరాగివెంట బడి మెఱుగుచున్న కుక్కలను జాగరూకుడై కనిపెట్టి వాని రాకపోకలు పరీక్షించుచు గండడు వానికళ్ల బడకుండ నెమ్మదిగా దాటిపోవు చుండెను.

గృహయజమానులు తలుపుతీయుచున్న చప్పుడు ముందుగానే గమనించి బయటికి వచ్చినవారి కెదురుపడకుండ తప్పుకొనుచుండెను. ఎంత జాగరూకుడై సంచరించి నను ఏదో యొక కుక్కకంట బడకుండ నుండుట సాధ్యమా? అది మొఱుగకుండునా? ఒక యింటియజమాని బయటికి వచ్చుచున్నా డని మరియొకయెడ దాగి యున్న నచ్చట గల యింటియజమాని యాకస్మికముగా తలుపుతీసి బయటికి వచ్చును. ఈ రెండవవాని కాతడు కంటబడకుండ నుండు టెట్లు? ఆతడు ప్రశ్నింపక యూరకుండునా? జవాబు చెప్పక పోవు టెట్లు? అట్టివి మధ్యమధ్య తటస్థించెను. 'యామికుడను! వీరభద్రుడను! వైద్యునికొరకు పోవుచున్నాను. తెల్లవారిన దనుకొంటిని!' అని తడవ కొక కొత్తవిధముగా అనుమానమునకు తావీయకుండ నెమ్మదిగా చెప్పి యాతడు దాటిపోవుచుండెను. బైరాగిని గూర్చి యెవరైన నడిగిన 'ఎవరో తెలియదు. మొష్టివాడుగా నున్నాడు' అనును. కొన్నిమారులు యామికులును వీరభద్రులును కనబడిరి. వారికి సంకేతశబ్దము పలికి తప్పించుకొనవలెను. లేకున్న నతని శిరస్త్రాణము చూచి నిలువ జేయుదురు. మేచయనాయకు తల్లక్రిందులు చేసి 'యచమే' యని నెమ్మదిగా చెప్పిన వారు మార్గాదక వెళ్లి పోవుదురు.

పలుమారు గండడు తాను వెంటాడుచున్నట్లా బైరాగికి తెలిసియుండు నని భయపడెను. కాని యా ముందుపోవువా డెట్టియనుమానమును చెందుచున్నట్లే కన పడలేదు. అతడు వెనుదిరిగి చూచుట గాని దిక్కులు చూచుట గాని ఏమియు చేయుటలేదు. అతనిని ఎవరైనను వెంటాడుచున్నట్లాతనికి తెలిసినను లక్ష్యము చేయువానివలె గూడ లే డాతడు! అన్నిటికంటె గండని కాకలే ధైర్యము. అంతటి పిశాచశబ్దము చేసికొనుచు పోవువానికి వెనుక తా నాడు సన్నమాటలు విని పించునా ?

బొల్లని భార్యయగు మంగిని గండడీ మధ్య చూచియుండలేదు. గండనికి బొల్లనికి మల్లయుద్ధమున స్పర్ధ ఏర్పడినది. కాని వారికి ఎట్టి విరోధమును పూర్వము లేదు. వారిద్దరకుటుంబములకును చిరకాలముగా మైత్రి కలదు. పూర్వము హనుమ కొండలో వా రుండునెడ వారి యిండ్లు మిక్కిలి దగ్గర. అప్పుడా రెండుకుటుంబ ములకు సాహచర్య ముండెను. బొల్లని తల్లియు గండని తల్లియు అక్కచెల్లెండ్రవలె మైత్రితో మెలగుచుండెడివారు. గండడును బొల్లడునుగూడ మల్లయుద్ధము కర్ర సాము ఒక జెట్టిగరిడీలోననే నేర్చియుండిరి. విద్య నేర్చునప్పుడే వారిరువురకు స్పర్ధయేర్పడెను గాని విరోధము లేదు. ఇతరగరిడీవారితో పోరుటలో వారిద్దరు నొక్కటియే! మరియు మల్లయుద్ధమునను కర్రసాములోనను గాని ఏ యితరవిష యమునను వారికి స్పర్ధకూడ నుండెడిది కాదు. అయితే వారికి వయస్సు ముదిరిన కొలదియు ఒకరిపై నొకరికి గల ప్రేమానుబంధము తగ్గిపోయి స్పర్ధయే బలపడిపోవు చుండెను. అట్లయినను వారి కుటుంబముల మధ్య రాకపోకలు కట్టువడలేదు.

బొల్లడెక్కువ మాటకారి కాడు. కారునలుపు. 'అతని దేహము వ్యాయామము చేసినకొలదియు కండలు పెరిగిపోసాగెను. పొట్టకూడ పెరిగిపోవుచున్నది. దేహ ముతోపాటుగా అతని మాటలుకూడ మోటువారిపోసాగినవి. అతడు మాట్లాడుట చూచినవా రా మాటలు నోటినుండి వచ్చుచున్నట్లు కాక రొమ్ములోనుండియో కంఠమునుండియో సరాసరి బయటికి వెడలుచున్నట్లు తలంతురు.

గండడు వ్యాయామముచేసినకొలది యాతని దేహము గట్టిపడుచు రాగిశలాక వలె మారజొచ్చెను. అది సమముగా సమవిభక్తాంగముగా వర్ధిల్లుచున్నది. అస లత నిది చామనచాయ. వయస్సు మీరుచున్నకొలది అతని దేహచ్ఛాయ మారుచు ఇతడు పచ్చనివాడా, ఎఱ్ఱనివాడా యను సందేహము కలిగించుచు మిసమిసలాడుచు శరీ రము పెరుగుచుండెను. వారి వాడలలో నాత డెక్కువ యందగాడై యాకర్షకముగా నుండువాడు.

మరియు గండడు ప్రతివారితో మాటాడును. మాటాడినప్పుడు ఇతరులను నొప్పింపని పరిహాస ముండును. అతడు మనసార నవ్వును. అతడు నవ్వినప్పు డాతని తెల్లని పెద్ద పండ్లు బయట పడును. ఇతరులను నవ్వించును. వారి కులములలో స్త్రీలు

పరపురుషుఃతో మాట్లాడుటలో ఎట్టి క్రొత్తయు చూపరు. స్త్రీపురుషులకు ఇతర కులములలో నున్న మూకము వారి కులములలో లేదు. నలుగురలో నున్నప్పుడు గాని ఒంటరిగా నున్నప్పుడుగాని వారా భేదము పాటింపరు. అందును గండని కుటుంబమునకును బొల్లని కుటుంబమునకును చిరకాలమైత్రి కలదాయెను! గండడు స్వతంత్రముగా బొల్లని భార్యను పలుకరించును. దానితో పరియాచకము లాడును. దాని కూతురు పాటియు గండడు వచ్చిన నతనిపై కెగబ్రాకి నెత్తి కెక్కును. గండనికి ఇంకను పిల్లలు పుట్టలేదు. అందుచే పాటిచనువు అతనికి విశేషానందము కలిగించును.

కాని కెరన్నవరాత్రములలో తా మిద్దరు వీథిలో పోరాడుకొన్న తరువాత గండనికి బొల్లని యింటివైపుకు వెళ్లుటకే ముఖము చెల్లలేదు. ఆ పోట్లాటయంతయు నావేశములో జరిగిపోయినది కాని తర్వాత జరిగిన విషయములను బట్టి బొల్లడు రాజద్రోహులలో చేరినాడని స్పష్టమయ్యెను. విద్రోహులు కాక అతని నా కారాగారమునుండి యంత చాకచక్యముగా తప్పించువా రెవరు? ముందు బొల్లడు చెఱలో పడుటకును ఇప్పుడు దేశములు పట్టుటకును కారకు డెవరు? తానే గదా! పాపము, మంగి ఎంత దిగులుపడుచున్నదోగదా! ఆ పిల్లపాటి అన్నపానములే మానివేసి యుండును. వారి ముఖములు తానే మొగము పెట్టుకొని చూడగలడు!

ఇప్పుడా బైరాగి బొల్లని యింటియొద్ద నాగుటయు అప్పటికే మంగి సిద్ధముగా నుండి బయటికి వచ్చుటయు గండని కాశ్చర్యమయ్యెను. అతని ప్రాణము లొకసారి యాగిపోయినట్లై యయ్యెను.

ఒక పంచచాటున నుండి గండడు వారి చర్యలు చూచుచు మాటలు వినుచుండెను. ధైర్యముచేసి యాతడు కొంచెముదగ్గరకే పోయెను.

పాటి బయటికి రాలేదు. మంగి తల దువ్వుకొనలేదు. అది కొంతకాలముగా తిండికూడ సరిగా తినుచున్నట్లు లేదు. దాని మాటలు నీరసమగు కంఠమునుండి దీనముగా వచ్చుచున్నట్లు వినిపించెను.

“బాబా, నిన్న ఇంటిలో మేము తిండి తినలేదు. పిల్ల జ్వరముతో ఉన్నది. మీ కేమి పెట్టగలను, బాబా!”

గండని గుండె లామాటలకు తరుగుకొనిపోయెను. తన కిప్పుడు భత్యము వేతనము నెక్కువయినవి. పిల్లలు లేరు. ఈ ధనమంతయు దా నేమి చేసికొనును! మరునాడు పోయి మంగిని చూచి కొంత ధన సహాయము చేయ నాతడు నిశ్చయించెను. ఈ యాలోచన క్షణములో సాగిపోయెను. మనోవేగము గదా! అంతలో బాబా మాటలు వినబడెను.

“పిల్లా, మీబోటివారి యిండ్లకు మేము దీవించుటకు వత్తుము గాని మాకు డబ్బుతో పనిలేదు. గాలి తినియే జీవింపగలము!”

"బాబా, మా కష్టము లెప్పటికి గట్టెక్కగలవు ?"

మంగిప్రశ్నకు బైరాగి కొంతతడ వాలోచించెను. భగవంతుని నడుగుచున్న వానివలెనే అత డాకాశమువంక తల యెత్తెను. కొంతసేపటి కాత డిట్లనెను.

"నీవు నీ పెనిమిటిసంగతి యడుగుచున్నావు. అత డిప్పుడు దూరమున గన బడుచున్నాడు. సుఖముగా సంతోషముగా నున్నాడు. అతని కిప్పుడే ఎన్నియో రత్నములు సువర్ణములు లభించినవి——"

"మంగి నిట్టూర్పు విడచినది."

"అయ్యో, ఎంత సంపాదించి ఏమి లాభము? మే మిట్లు మాడుచున్నాము—— మరి ఎవరికైనా కట్టుకొనినాడా, బాబా !"

"లేదు, లేదు !"

మరల బైరాగియే మాట్లాడెను. "రోజూ ఆతడు భార్యకోసము పిల్లకోసము కలవరించును. దిగులుతో సగమైనాడు. ఇక్కడికి వచ్చినచో అతని ప్రాణములు దక్కవు !"

"అతడు చేసిన తప్పేమో నా కెవరూ చెప్పరు. కావలసినవారుకూడ నా దగ్గరకు వచ్చుటకే వెనుకాడుచున్నారు. ఏమి చేసినాడో మీ రైనను చెప్పరా, బాబా!"

"ఏమైన నేమి ? నీ కష్టములు గట్టెక్కుటకు చాలాకాలము పట్టును."

"ఇన్నాళ్లూ బ్రదకడ మెట్లు, బాబా ?"

మాకు దీనులకు సహాయము చేయుటే పని! భగవంతుడు మాకు కోరిన ద్రవ్య మిచ్చును !"

ఇట్లనుచు నా బైరాగి తన రెండుచేతులు పైకెత్తెను. అతని దోసిలి నిండి బరు వెక్కిన ట్లయ్యెను. "భగవంతు డిచ్చినది నీకే!" నని యతడు మంగిని ఒడి పట్టుమని తన దోసిలి ఒడిలో క్రుమ్మరించెను.

మంగి తెల్లవోయి చూచుచుండెను. గండనికి స్పష్టముగా ఇంటివాకిలినుండి వచ్చుచున్న లోపల కునికిపడు దీపపు వెలుతురులో సువర్ణములే కన్నులఎదుట మెర సెను. మరుసటిక్షణమున బైరాగి కనబడలేదు. అతని ఇనుపపట్టెల శబ్దముకు వినబడుట లేదు. అత డెటువోయెనో గండనికి కనబడలేదు.

గండనికి భక్తియు భయమును ఏకకాలమున నుదయించెను. ఈ బైరాగి ఎవరో సర్వజ్ఞుడు! తాను వెన్నాడుచున్న సంగతియే అట్టివా డెరుగకుండునా ? అప్పుడే అతనికి,మంగిఎదుట బడి పాటిజ్వరముసంగతి విచారింపవలెనని ఎంతేని కోరిక అతిశ యించినది. కాని యది సర్వవిధముల ననుచితము. ఇట్టి యపరరాత్రసమయమున అసలే పనికిరాదు !

ఇట్లాత డాలోచించుచుండగనే దూరమున నా యినుపగజ్జెల చప్పుడును కిర్రుశబ్దమును విననయ్యెను. కలలోనుండి లేచినవానివలె ఆత డా శబ్దమాలకించెను. 'రా, చేతనైతే రా!' అని తన్నా శబ్దము ధిక్కరించి పిలుచుచున్నట్లే యాతని కది తోచెను. అభ్యాసవశమున నాతడు లేచి ఆ శబ్దము వచ్చుచున్న మార్గమంటి పోయెను. అది చిన్న రాతిగుట్టయొద్ద నున్న జైనవసదివైపునుండి వచ్చుచున్న దని యత డూహించెను. గండ డటు వెళ్లుచుండ మరల నది యాగిపోయెను.

ఎటు పోవలెనో పాలుపోక గండడు విచారించుచు ఆలకించుచు ఒకచో నిలుచుండెను. అంతలో నతనికి తన కుడిచెవి ప్రక్కగా దూసికొని యొక బాణము పోయిన ట్లయ్యెను. ఏదైన రెక్కలపురువా ఇది? అంతలో ఎడమచెవిప్రక్కగా మరల నట్టి శబ్దమే యయ్యెను! ఇక నది యేమని యాలోచించుకొను తడవు లేదు. ఈమా రది తన తలమీదనే పడును! వెనుకనుండి వచ్చుచున్నట్లున్నవవి! వెనుక తనకు ఆచ్ఛాదన మేమియు లేదు!

వెంటనే చురుకుగా నాతడు వెనుదిరిగి కర్రత్రిప్పుటకు ఉద్యుక్తుడగుచుండెను. అంతలో నొక బాణము వచ్చి బలముగా నాతని రొమ్మున తాకెను. అదృష్టవశమున నాత డాదినమున రొమ్ముతగడు వేసికొనియుండెను. లేనిచో నతని ప్రాణ మక్కడ ఆనాడు పోవలసినదే! అధికారుల యాజ్ఞలు చిన్నవిషయములలో కూడ పాలించుట ఎంత శ్రేయస్కరము!

ఇప్పు డేమి చేయవచ్చును! వెంటనే ఆతడు నేలపై పడిపోయినట్లై పడియుండి ప్రక్కకు పడిపోయిన బాణమును పట్టుకొనెను. కొంచెముతడ వట్లే యాగి పిమ్మట లేచి పారిపోవలె నని యాతని యాలోచన. ఆపైని బాణములు పడుట యాగిపోయినది. ఎవరో వచ్చుచున్న యలికిడి సమీపమున విననయ్యెను.

చిత్రమైన భయ మాతని నావేశించెను. ఒక్కసారిగా నాతడు లేచి సందుగొందుల దూరి పరుగుతీసెను. ఆ చీకటిలో గురితప్పక మనుష్యమాత్రు లట్లు బాణప్రయోగము చేయుగలరా? ఆ బాణములు వదలినదియు తన్ను పట్టవచ్చుచున్నదియు పిశాచము లనియే ఆతని నమ్మకము! మనుష్యు లని యనుకొన్న నంత భయపడువాడు కాడు!

అట్లు పరుగువారిన గండడు మేచయనాయకుని వ్యవహారశాలకు బోయిగాని వెనుదిరిగి చూడలేదు. అంతవరకు నతడు అరవనైన అరవలేదు.

ఆత డక్కడికి చేరునప్పటికి ఇంకను తెల్లవారలేదు. ద్వారమున కాపున్న భటులు 'ఎవరు? ఎవరు?' అని అరచుచున్నను మాటాడక గండడు పిచ్చికేక

చేయుచు భవనములోనికి జొరబడుచుండెను. కావలివారిలో నొకడు శూలమును రెండవవాడు ఖడ్గమును ఎత్తిరి. వారవి యాతనిపై ప్రయోగించెడివారే కాని అంతలో గండని గుర్తించి దింపిరి.

ఆ పిచ్చికేక విని మేచయనాయకుడే ప్రక్క నున్న యాత్మమందిరమునుండి బయటికి వచ్చెను.

గండని చేతిలో బాణ మట్లే యున్నది. ముందు మేచయ యాతని చేతిలోని బాణ మందుకొని పరీక్షించెను.

దానిపై సన్నగా స్పష్టముగా 'హ. హ.' యను నక్షరములు లిఖింపబడి యుండెను.

౨౬

శ్రీ రుద్రదేవమహారాజులు పట్టాభిషిక్తులై రెండు నెల లైనది. మార్గశీర్ష మాసము నగపడుచున్నది. ఆ మహారాజు యౌవరాజ్యమునకు పట్టాభిషిక్తు డగునప్పటికి రాజ్యమంతయు నల్లకల్లోలముగా నున్నది గదా! కళింగసేనలు ఎంతవరకు వచ్చినవి? కొప్పెరుంజింగ డేవరు? జటావర్మసుందరపాండ్య డేవరు? వారిసేన లెంతవరకు సాగినవి? చోళు లేమి చేయుచున్నారు? మనుమగండగోపాలు డేమయ్యెను? గొంటూరు నాగదేవుని యలజడి ఎట్లున్నది? బల్లాలరాజ్యపాలకు లేమి చేయుచున్నారు? దేవగిరి యాదవరాజ్యపరిస్థితు లేమి?

జన్నిగదేవుడును త్రిపురాంతకుడును ప్రతిజ్ఞలు చేసి వెడలిరిగదా! వారేమి చేసిరి? కొలని రుద్రుడు సేనలతో వెడలెను గదా! అత డేమి చేసెను?

ఆంధ్రభాష మాటాడువారి దేశము పవిత్రస్వరూపము నొకమారు స్మరింతము! పూర్వము శ్రీ రుద్రదేవులయు, తరువాత నాతనితమ్మునికుమారుడగు గణపతిదేవులయు, నేడు శ్రీ రుద్రదేవమహారాజులయు దృష్టి ఈ విశాలాంధ్రభూభాగము నందే ప్రధానముగా ప్రసరించెను. వారు ఆంధ్రోర్వీశులు! వారలకు ఇతరుల భూభాగము లాక్రమింపవలె నను దురాశ లేదు. కాని యీ యాంధ్రభూభాగము నితరు లేమాత్ర మాక్రమింప యత్నించినను దానిని వారు సైరింపకుండిరి.

ఈ తెలుగుభూమికి నడిబొడ్డు శ్రీశైలము! ఆ యమ్మ తూర్పుముఖముగా కూర్చుండి ఉదయభానునికై ఎల్లప్పుడు తన దీర్ఘబాహువులు రెండును చాచియుంచును. ప్రాచీసముద్రతీరభూమి నంటియున్న యా కఠినము లగు పర్వతశ్రేణులే యామె దీర్ఘబాహువులు. ఆమె దక్షిణబాహువు తిరుమల దాటి పాలారు నదివరకు ప్రసరించును. వామబాహువు సింహగిరి దాటి మహానది నొరయుచున్నది. ఆమె పృష్ఠభాగమున మంగళాసనమై కళ్యాణకటక మున్నది.

హొయిసలులును యాదవులును కాకతీయరాజ్యమున ప్రస్తుతమెట్టి యాక్రమణమును చేయలేదు. అందుచే కొంతవిశ్రాంతిగా రుద్రమ కూర్చుండగలిగినది.

ఇక దక్షిణదేశమున పరిస్థితు లిట్లున్నవి. చోళసింహాసనమును రాజరాజనరేంద్రుని కుమారు డగు రాజేంద్రదేవు డధిష్ఠించి కులోత్తుంగచోళచక్రవర్తినామము ధరించి ఆంధ్రచోళపాండ్యకేరళదేశములనే గాక సింహళము శ్రీవిషయము మలయము ఇత్యాదిదేశములనుగూడ మహావైభవముతో పాలించియుండెను. కాని యా సమర్థత యతనితోడనే అంతరించెను. నేడు చోళసామ్రాజ్యసింహాసన మధిష్ఠించిన మూడవ రాజేంద్రచోళుడు అసమర్థుడు. అందుచే నాతని సామంతులు పలువురు స్వతంత్రులై యతనితోడను తమలో తాము నుపోరుచు వచ్చిరి. అట్టివారిలో కాక

తీయరాజ్యముతోడను ఆంధ్రదేశముతోడను జోక్యము కలిగించుకొన్నవారిద్దరు మాత్రమే. వారు జటావర్మసుందరపాండ్యుడును, కొప్పెరుంజింగడును!

కొప్పెరుంజింగ డనునది ద్రావిడపదము. దానికి పెద్దరాజు సింగము అని యర్థము చెప్పవచ్చును. అతని సంస్కృతశాసనములలో నదియే మహారాజసింహు డని రూపము పొందుచు వచ్చినది. అతడు చేదిమండలము * నేలుచుండిన కాడవ వంశజు డగు పల్లవరాజు. ఇతని తండ్రిపేరు కూడ కొప్పెరుంజింగదేవుడే. అతని కాలముననే చోళసామ్రాజ్యము బలహీనము కాగా, నాతడు చోళరాజుపై నెదురు తిరిగి నిర్జించి యాతని బంధితుని జేసియుండెను. కాని శీఘ్రముగా చోళరాజునకు మిత్రుడగు కర్ణాటనరసింహరాజు ఆ కొప్పెరుంజింగదేవుని జయించి చోళరాజును బంధవిముక్తుని గావించెను. కాని యా తండ్రి కొప్పెరుంజింగనితో మన చరిత్రకు సంబంధము లేదు.

ఆంధ్రదేశముతో సంబంధ మున్న యాతనికుమారు డగు కొప్పెరుంజింగడు చిదంబరేశ్వరునికి భక్తుడు. అందుచే నాతడు తాను 'కనకసభాపతి సర్వకార్యసర్వ కాలనిర్వాహకుడ' నని బిరుదనామము సగర్వముగా వహించెను. మరియు 'ఖడ్గమల్ల, నిశ్శంకమల్ల, వాల్ బలప్పెరుమాళ్', మొదలగు ప్రతాపనామము లాతని పరాక్రమము తెలుపును. అతడు వీరు డగుటయే కాక భరతశాస్త్రమును సాహిత్యమును చక్కగా నభ్యసించి, 'భరతమల్ల, సాహిత్యరత్నాకర', ఇత్యాదిగా అన్వర్థబిరుదములు కూడ పొందెను. ఇతడు ముందు కాంచీపురమున ప్రతిష్ఠితుడై యున్న మనుమ గండగోపాలనామాంకితు డగు మనుమసిద్ధిని అటనుండి నెల్లూరునకు పారద్రోలి కంచిలో తా నభిషిక్తు డయ్యెను. కాని యాతనిని గణపతిదేవచక్రవర్తి నిర్జించి తన సామంతునిగా నొనర్చుకొని యుండెను. అది జరిగి యిప్పటికి తొమ్మిది పది సంవత్సరము లైనది.

గణపతిదేవునిచే పరాభూతు డైనపిమ్మట ఈ తొమ్మిదిపది సంవత్సరములును అత డూరకుండలేదు. అతడు నెమ్మదినెమ్మదిగా బలము చేకూర్చుకొనుచు స్వాతంత్ర్యము నవలంబించుచుండెను. ఆతని విజృంభణ మరికట్టుట వృద్ధు డైన గణపతిదేవునకు సాధ్యము కాకుండెను. కాని యంతలో కొప్పెరుంజింగని కొక యుపద్రవము సంభవించినది. ఇప్పటికి రెండేండ్లక్రిందట మధుర ప్రభువగు జటావర్మసుందరపాండ్యుడు తన ప్రభువగు మూడవ రాజేంద్రచోళుని ధిక్కరించి యుత్తరముగా దండెత్తి వచ్చి, కంచిని ముట్టడించి, కొప్పెరుంజింగని జయించి, యాతని వలన హేమరాసులను అనేకమత్తగజములను హయరత్నములను గొని పుష్కలముగా ధాన్యము పండు విశాలరాజ్యమును హరించెను. కొంతకాల మింకను పెనగులాడుటకు కొప్పెరుంజింగనికి శక్తి కలదు. కాని యాతడు జటావర్మసుందరపాండ్యునితో సంధి చేసికొనుటయే నీతిగా దలచెను. అందుచే వారికి సంధి యయ్యెను. దాన కొప్పెరుం

---

* ఇప్పటి ఉత్తరార్కాటుమండలమునకు సరిపోవును.

జింగనికి పోయిన తన రాజ్యమును హేమరాసులును గజాశ్వాదులును తిరిగి సంప్రాప్త మయ్యెను. ఆ సంధితోపాటు ఆంధ్రరాజ్యమునకు మహోపద్రవమే సంభవ మయ్యెను. ఆ సంధివలన ఆ పల్లవపాండ్య ప్రభువు లిరువురు నేకీభవించి ముందు ప్రాచ్యాంధ్ర సముద్రతీరభూమి నాక్రమింప నిశ్చయించిరి.

అది సాధించుటకు వారిరువురకు కావలసినంత భూసైన్య మున్నది. కాని దానికి తోడుగా విస్తార మగు నౌకాబల మున్నగాని వారి ప్రయత్నము సిద్ధింప నేరదు. అట్టి నౌకాబలము వారికి లేదు. అది లేనందున కాకతీయుల ప్రచండనౌకాబలము వారి కెన్న డేనియు నిక్కట్లు కలిగింపగలదు. ముందుకు తమ సేనలు సాగిపోవుచున్న యెడ ఆ బలముల వెనుకనుండి కాకతీయసేనానులు దారు లరికట్టవచ్చును. అట్టి విష యమున తమసేనలకు సహాయము అందుట కష్టసాధ్య మగును. ఆ కారణమున వారు ముందు తాము కూడ కొంత నౌకాసైన్యము శ్రద్ధగా కూర్చుకొన నారంభించిరి. ఆ ప్రయత్నము వారి కంత కష్టము లేకుండనే సాధ్య మయ్యెను.

చోళసామ్రాజ్యబలము క్షీణించుచున్నప్పటినుండియు తూర్పు సముద్రతీర మున సముద్రదస్యులు బలసిపోయిరి. విదేశములనుండి వచ్చు నావలను ఈ ఓడదొంగలు పట్టుకొని వారి ద్రవ్యమును సరకులను దోచుకొనసాగిరి. ఇక ఒడ్డుపట్టినట్టియు తుపా మచే దెబ్బతిన్నట్టియు నావలలోని సరకులకు దిక్కుదివాణమే లేకుండెను. ఇట్లు అల్లకల్లోలముగా నున్న సమయమున గణపతిదేవచక్రవర్తి తూర్పుసముద్రతీరమును జయించియుండెను. అప్పు డా ర్తరక్షణుడగు నా మహారాజు దస్యుల నందర తరిమి తరిమి, వారి రహస్యస్థానము లెల్ల గాలించి యాక్రమించి, వారి నెల్ల నేమించి యుండెను. అంతట నాతడు ముఖ్యములగు రేవుపట్టణములలో తన జలసుంకాధికారుల నిలిపి పరిపాలనము చక్కజేసెను. క్రమముగా నాతడు కూపకుల్క మెంక్కటి తక్క మిగిలిన శుల్కము లన్నియు తీసివేసి, సరిగా సుంకము చెల్లునట్లు కట్టడి చేసియుం డెను. ఈ శాసనములు పరిపాలించి దస్యుబాధ నరికట్టుటకు ఆతడు రాజనౌకాబలము నయ్యెయెడల నిలిపి తీరభూమిని రక్షించుచుండ నియమించెను. ఉత్తరమున కోరంగి నుండి గోదావరీముఖద్వారములం దెల్లెడల గణపతినావలు ప్రత్యేకముగా నొక నావధ్యక్షునిక్రిందనుండి సముద్రయానము చేయువారిని సంరక్షించుచుండెను. మరల మోసలపట్టణము మొదలు, కృష్ణానదీముఖద్వారములం దెల్లెడల దిరుగుచు గణపతి నావలు కొన్ని మరియొక నావధ్యక్షుని వశమున నుండెను. మరియు నొక నావధ్య క్షుడు మోటుపల్లివాడరేవు మొదలుకొని కొత్తపట్టణము రామపట్టణములమీదుగా వెల్లూరుసమీపమందలి కృష్ణాపట్టణమువరకు గల తీరభూమిని రక్షించుచుండెను. ఈ నావధ్యక్షుని ముఖ్యస్థానము మోటుపల్లి. మోటుపల్లిలో నుండు నావధ్యక్షుడు సిద్ధయదేవచోడుడు!

ఇట్లు తీరభూమి సరిచేసి రేవుపట్టణములం దెల్లెడ విదేశవర్తకులకు తన యభయ శాసనములు శిలాస్తంభములపై గణపతిదేవుడు చెక్కింపజేసెను. అందుచే దూర

మన మన్నె మలయాము [illegible] అరబ్బు దేశము ఐగుప్తు దేశముల తోడను [illegible] దేశాలతోను కూడ [illegible] వ్యాపారము సాగుచుండెను. ఈ [illegible] సముద్రయానముల [illegible] కట్టించి [illegible]. అది యెట్టి [illegible]?

ఆ కొంగలలో [illegible] చోళ [illegible] సముద్ర [illegible] మండలాలు [illegible] చేసి [illegible] చేయుచుండిరి. [illegible] ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రపంచమే!

ఆ సముద్రచోళప్రభువులతో [illegible] గనికిని ఇష్టము పని కలిగినది. వా రాచోళుల రావించి మంతనము లాడి [illegible] సాయముతో [illegible] కొంత సంపాదించిరి. ఆంధ్రసముద్రతీరమున వారికి పంటలు సమృద్ధముగా [illegible]. ఆ ప్రదేశములను [illegible] విశేషములనుండి [illegible] సముద్రమునకు [illegible] ఆ [illegible] నావికులను [illegible]?

ఈ విధముగ నా నా ప్రపల్లవులు చోళనావికులతో వ్యాపారములు సాగించుచు ఆంధ్రసముద్రతీరమండలముల గల మండలాధిపతులతో గూడ వ్యాపారములు సాగించిరి. పూర్వము రాజరాజనరేంద్రుని కుమారుడగు రాజేంద్రదేవుడు వేంగిమండలముతోపాటు చోళరాజ్యమునకు చక్రవర్తియై కులోత్తుంగచోళనామము ధరించి చోళులలో నొకడైనప్పటినుండియు, చోళరాజ్యభాగ లను పలువురు తెలుగు మాండలికులు ఆంధ్రతీరభూమికి పాలకులుగా నుండిరి. వీరిని తెలుగుచోడు లనియు వ్యవహరించుట కద్దు. వీరికి చోళచక్రవర్తులతో సంబంధములు తెగియు తెగకుండి నవి. కాకతీయుల మహాసైన్యములు వచ్చినప్పుడు వా రా ప్రభువుల దాసులగుదురు. ఆ సైన్యము లటుపోయినపిదప దక్షిణమునుండి మహాబలశాలు రెవరైన వచ్చిన వారికి మరల లొంగిపోదురు. ఎవరి యొత్తిడియు లేకున్నచో మేమే స్వతంత్రుల మందురు. మన్యమున్న వీలయినచో చొరవ చేసికొని దక్షిణమున కాంచీమండలమును తొండమండలమును నాక్రమింతురు. ఈ తెలుగుచోడులలో ప్రముఖులు నెల్లూరు ప్రభువులు. అందులో మనుమసిద్ధి తండ్రియగు తిక్కరాజునుగూర్చి తిక్కనామాత్యు డిట్లు వర్ణించియుండెను.

"శంభురాజాదిప్రశస్తారిమండలికము జేర్చి యేలడె కంచిపురము
జేదిమండలము గానిగ జేసి కౌశవపతి నియ్యకొలుపడె పలచమునకు
రాయగండగోపాలు నరాతిభీయదరాయపెండారబిరుదాభిరాము సుభయ

రాయచూడాంక ఘంటియరాయ డిక్కధరణివిభుబోల రాజుల కరిది కాదె.

"కమలాప్తప్రతిమానమూర్తి యగు నా కర్ణాటసోమేశు దు
ర్దమదోర్గర్వము రూపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిన్ జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్యనా
మము దక్కంగొని తిక్కభూవిభుడు సామర్థ్యంబు చెల్లింపడే!"

ఈ పద్యములలో తిక్కనామాత్యుడు వర్ణించినది ఈ కొప్పెరుంజింగని తండ్రి యగు పూర్వోక్తు డగు కొప్పెరుంజింగని కాలమున జరిగిన చోళరాజ్యకల్లోలమే. ఆ కొప్పెరుంజింగడే ఇందు వర్ణించిన కాళవపతి! తిక్కభూపతిపిమ్మట అతని కుమారు డగు మనుమసిద్ధి నెల్లూరుపాలకు డయ్యెను. అతడు చిన్నతనముననే పరాక్రమము చూపినాడు.

"ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌర్యం బొప్ప గర్ణాటద
ర్పవిఘాతంబు నొనర్చి వైరిమనుజేంద్రశ్రేణికిన్ గొంగనా
నకనిం జొక్కని యున్నయట్టి విజయక్ష్మాధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళనమన్మసిద్ధి యని ప్రాయేటం బ్రగాఢోద్ధతిన్."

మరియు పొత్తపినాడు, కొణిదెన, మోటుపల్లి, కందుకూరు వెలనాడులలో ఎక్కువభాగము ఇట్టి తెలుగుచోడుల పాలనముననే కలదు.

ఈ స్థితిలో పల్లవపాండ్యు లిద్దరు ముందు మనుమసిద్ధితో రాయబారములు సాగించిరి. అత డటు రాజేంద్రచోళరాజును సమర్థింపవలెనో, ఇటు గణపతిదేవుల మైత్రి యర్థింపవలెనో నిశ్చయింపలేని స్థితిలో నప్పు డుండెను. ఎటు చేయుటకును పాలుపోక మౌనము వహించి యత డుండగా అది కనిపెట్టి పల్లవపాండ్యసేనలు ఒక్కుమ్మడిగా వచ్చి నెల్లూరు ముట్టడించెను. మనుమసిద్ధి తాను స్వయముగా నా సైన్యములను ప్రతిఘటింప శక్తుడు కాడు. అతని కా యాపత్సమయమున నేమి చేయను దోపలేదు. ముందు గణపతిదేవుల సహాయ మర్థింప నాతడు నిశ్చయించెను; అందుకై తిక్కనసోమయాజుల సాహాయ్యము వేడెను. అప్పుడు సోమయాజులు అమాత్యవ్యవహారములు చూచుట చాలించుకొని యనుదినము పినాకినీనదీస్నానము చేయుచు హరిహరనాథుని సమక్షమున మహాభారతరచన సాగించుచుండెను. ఆ మహానుభావునికి రాజ్యతంత్రములలో నిప్పుడు సంబంధము కలిగించుకొను నిచ్ఛ లేదు. అయినను మనుమసిద్ధిపై గల వాత్సల్యముచే కాదనలేక నూరుగురు కరణములను దీసికొని అతడు ఓరుగల్లుకు ప్రయాణ మయ్యెను. త్రేతాగ్నులు వెంటగొని సోమయాజి బ్రాహ్మణబృందముతో పురి వెడలిపోవుచుండ ముట్టడించిన యా సైన్యములు నిరోధింపలేదు. యుద్ధసమయముల నట్లు వైదికనిష్ఠల గల బ్రాహ్మణులు ప్రశాంతప్రదేశములకు వెడలిపోవుటయు, వారి నిరుపక్షములవారును బాధింపకుండుటయు యుద్ధ

ధర్మమున పరిపాటిగా నా కాలమున నుండెను. అందువ కొప్పెరుంజింగడు పండిత పక్షపాతి.

సోమయాజుల నిట్లు మోమోటపెట్టి ఓరుగల్లుకు పంపియుండెను. గాని అచటనుండి వెంటనే సహాయము తనకు వచ్చునను నాశ మనుమసిద్ధికి లేదు. ఓరుగల్లుప్రభువులకు కొంతకాలముగా శక్తి క్షీణించినది. రాజధానిలోననే అలజడులు జరుగవచ్చునని జనశ్రుతి వ్యాపించియుండెను. ఒకనాడాకస్మికముగా మనుమసిద్ధిహృదయమున భయ మావేశించెను. వెంటనే యాతను కోట విడిచి దుర్గమమార్గమున యెక్కడికో వెడలిపోయెను. ఈ వార్తయు నెల్లూరు మండలము దాటిపోయిన కొలది దినములకే సోమయాజులకు చేరెను. అయినను సోమయాజులు తన ప్రయాణము నాపలేదు.

మనుమసిద్ధి కోట విడిచిపోయినంతనే అక్కడి సేనలు పల్లవపాండ్యసేనలకు లొంగిపోయెను. కొప్పెరుంజింగడును జటావర్మ సుందరపాండ్యుడును నెల్లూరు నాక్రమించి దోచుకొని తమ సైనికులకును నావికులకును ధనము పంచిపెట్టిరి. ఆ మిత్రులు కొంతకాలమువరకు తమ సేనలకు సంపన్నమగు నెల్లూరుపరిసరములు కొల్లగొట్టుటకు వా రనుజ్ఞ యిచ్చిరి. అట్లు దోపిడి పూర్తియైన పిమ్మట వారు క్రమపరిపాలన మారంభించిరి.

నెల్లూరుమండలముతో వారి యాశ తీరలేదు. తూర్పుసముద్ర ప్రాంతమందలి మాండలికు లందరితో వారు శీఘ్రముగా సంబంధము లేర్పరచుకొనిరి. గొంటూరు నాగదేవుడు వారి కనుకూలు డయ్యెను. కండుకూరు, పొత్తపినాడు, కొణిదెన, మోటుపల్లి, వెలనాడులలోని చోళులు వారికి సహాయులుగా నంగీకరించిరి. అందులో మోటుపల్లిలో నావాధ్యక్షు డగు సిద్ధయదేవచోడుడు స్వతంత్రుడైనట్లు ప్రకటించి యక్కడి సుంకము లెక్కువ చేసి కప్పము రాజకోశమున కంపుటే చాలించెను.

ఆ సమయముననే పల్లవపాండ్యులు కాళింగులతో గూఢ మంతనములు చేసిరి. కాళింగులకు అనాదిగా మంచి నౌకాబలము కలదు. వారి నౌకాబలము పల్లవపాండ్యులు సేకరించిన చోళమండలనౌకాబలములతో గోదావరీముఖద్వారమున కలసికొనుటకును, ఆ బలములతోపాటు ఉభయుల భూసైన్యములును ద్రాక్షారామ భీమేశ్వరమున గలసికొనుటకును వారు నిర్ణయించుకొనిరి. ఈ విషయమున సముద్రతీర మంతయు కాకతీయుల పాలననుండి తప్పింపవలెనని వారల యూహ! ఆపిమ్మట స్థితిగతులనుబట్టి కర్తవ్య మాలోచించుకొనవచ్చునని వారు నిర్ధారణ చేసిరి. కాళింగులు పల్లవ పాండ్యుల దోపిడిమూకలసాయముతో నా భూభాగము తామే ఆక్రమింపవచ్చు ననియు, పల్లవపాండ్యులు దోపిడిచేసినయనంతర మందు ఉండబోరనియు తలంచిరి. పల్లవపాండ్యులకు జిగీషయు ధనాశయునే గాని వేరు చింతలు లేవు.

జటావర్మసుందరపాండ్యుడు తన సేనలతో నెల్లూరనే నిలిచి కొప్పెరుంజింగని మహాసైన్యములతో ద్రాక్షారామమువరకు దండు సాగింప బంపెను. అంతలో ఏకశిలా నగరవార్తలు వారికి శీఘ్రముగా తెలియవచ్చెను. 'ఇప్పు డొక యువతి కాకతీయ సింహాసన మధిష్ఠించినది! ఆమెభర్తయు పలువురు బలవంతు లగు సామంతులును ఆమెను ప్రతిఘటించుచున్నారు.' ఇది తెలిసినవెంటనే అందరకు ఏకశిలానగరము నే ముట్టడింపగల మను ధైర్యము కలిగినది.

నెల్లూరునుండి బయలుదేరిన కొప్పెరుంజింగడు రణనీతివిశారదుడు. ఎక్కువ ప్రతిష్టంభనము రాదని యాతడు తలంచినమార్గముననే తన దండు సాగించెను. అతడు ముందుకు సాగుచున్నకొలదియు నౌకాసేనలు గూడ ముందుకు సాగుచుండెను. వారు నెల్లూరునుండి కొంతదవ్వు ఉత్తరముగా ప్రయాణము సాగించిరి. ఆ పిమ్మట సముద్రతీరము తూర్పుకు తిరుగును. అందుచే నా సేనలును తూర్పునకే తిరిగెను.

ముం దాతడు కందుకూరు చేరెను. అంతట మోటుపల్లిలో తన కిష్టుడను సిద్ధయదేవచోడుని వదలి, యాతడు వెలనాటికి రాజధాని యగు తనదవోలు అను నామాంతరము గల ధనదప్రోలికి వచ్చెను. అక్కడి చోళప్రభువు పూర్వనిర్ణీతసంకేతము ననుసరించి కొప్పెరుంజింగని సేనలు వచ్చినంతనే వశు డయ్యెను. పిమ్మట శీఘ్రముగా నాతడు తన సేనలు రెండుగా జీల్చి, గొంటూరి నాగదేవుని మండలము పరిహరించి, కృష్ణానదిని కొల్లూరునొద్ద నొక సేనయు వెల్లటూరువద్ద రెండవసేనయు నుత్తరింప నాజ్ఞాపించెను.

ఆ రెండుదళములు నట్లు కృష్ణను దాటి విజయవాటికను కొలనివీడుమార్గమును, అక్కడ బలమైన సేన లుండు నని పరిహరించి మోసలపట్టణముపై కేగెను. రెండువైపులనుండి ఈరెండు వాహినులే కాక సముద్రమునుండి నౌకాబలముకూడ వచ్చి మోసలపురమును ముట్టడించెను. దానికి తాళజాలక అచ్చటి నావధ్యక్షుడు పలాయితుడై కొలనివీడు చేరుకొనెను. మోసలపురము పల్లవరాజుల హస్తగత మయ్యెను.

కొప్పెరుంజింగ డంత తన పల్లవసేనలతో సంపన్న మగు నా భూభాగమును దోచుకొనుచు గోదావరీముఖద్వారమువైపునకు తన సేనల గదలించుచుండెను.

సరిగా నిట్టిసమయమున కాకతీయసేనాను లగు కొలనిరుద్రు డొకవైపునను జన్నిగదేవుడు త్రిపురాంతకుడు మరియొకవైపునను మహాసేనలతో నీ బహిశ్శత్రువులను అంతరశ్శత్రువులను అడచు ప్రయత్నముతో బయలువెడలిరి. అంబదేవుడును అన్నమంత్రియు నింకను రాజధానీనగరముననే ఉండిరిగదా!

ఆ ముగ్గురుసేనానులును తమలో తాము నితర కాకతీయసేనానులతోడను రుద్రదేవమహారాజుతోడను సంప్రదించియే బయలుదేరియుండిరి. కొలనిరుద్రుడు కొలనివీడు చేరి యా చుట్టుపట్టుల గల దుర్గముల నన్నిటిని బలపరచి యటువైపులకు

రొమ్పెరుంబెరుంగని కాపాడునేనలు కాకుండ నిరిక్ష్టకలెను. అంతియే కాదు. [illegible] నంటి నమ్మియున్న కాకతీయులు [illegible] వారికి [illegible] కుండ [illegible] అర్పించవలెను. ఈవిధముగా వారికి కాకతీయ కాపాడునేనలు [illegible] కాకుండ చేయ్యవలెను.

కాని యుద్ధకాలము. అది [illegible] [illegible] కాకుండ [illegible] నను, కాకతీయ [illegible] కలిసినచో కాకతీయ [illegible] [illegible] వృద్ధి యగును. [illegible] [illegible] వలెను. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] కాదు. ఆ [illegible] కాకతీయనేనాపతుల [illegible] చేసికొనవలెను. అట్లు చేసినచో పల్లవ పాండ్యులను [illegible] ; కాకతీయ బలములకు జయము సులభసాధ్యమగును.

ముందు పట్టవలసినది నెల్లూరా, మోటుపల్లియా ? ఏదియైనను ఈ సాహసకార్యమునకు పూనుకొనగలుగువారెవరు ? అది సాధింపగలవారెవరు ?

అప్పటికే కొల్లేరుండెడి కాకతీయనేనలు [illegible] [illegible] వారి [illegible] [illegible] [illegible] మోటుపల్లి [illegible] [illegible] [illegible] మోటుపల్లి [illegible] [illegible] [illegible] [illegible] మోటుపల్లి చేజిక్కించుకొనినవారికే ఆంధ్రసముద్రతీరప్రభుత్వము ! అందుచే మోటుపల్లిపై వంసెత్తుటకే వారు తుదకు నిశ్చయించిరి.

ఈ సాహసకార్యమునకు త్రిపురాంతకుడు పూనుకొనెను. వారి కుటుంబములో గంగయసాహిణినాటినుండియే బహత్తరాతుసబిరుదము కలదు. దక్షిణదేశం గనితరువాత త్రిపురాంతకునికే ఈ రాతుసబిరుదము వచ్చినది. రాతుసైకసాధ్యమగు ఈ మహాకార్యము త్రిపురాంతకునిపైననే పడినది.

త్రిపురాంతకు డీ యుద్ధచర్య కుపక్రమింపబోవుముందు అతడు తన సోదరు డగు జన్నిగదేవునితో కలసి శ్రీశైలము చేరి యచ్చట మల్లికార్జునస్వామిని భ్రమరాంబను సేవించి వెనుకటి మ్రొక్కులు తీర్చుకొని మరల క్రొత్త మ్రొక్కులు మ్రొక్కు కొనెను. భ్రమరాంబామల్లికార్జునుల ప్రసాదము వడసి యాతడు ప్రచండసైన్యము లతో బయలుదేరెను.

జన్నిగదేవుడు నెల్లూరినుండి పాండ్యసేనలు బయలుదేరినచో వానిని నిరోధించుటకు మాత్రమే సిద్ధముగా నుండెను. అత డిప్పుడు ముందుగా నెట్టి పోరునకును తానుగా దిగకుండునట్లు నిర్ణయము చేసికొనెను.

త్రిపురాంతకుడు మోటుపల్లిపై బడుటకు అద్దంకిమీదుగా ప్రయాణమయ్యెను. అద్దంకిలో కాకతీయులకు సారంగు డను మహారాష్ట్రసామంతు డొక డుండెను.

అతనికిని నెల్లూరుచోడులకును విరోధము. పూర్వము మీ సారంగునికిని మనుమసిద్ధికిని పోరు కలిగెను. అందులో మనుమసిద్ధిసేనలు జయించెను.

"శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంకురశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁగేదవించుకయు మాహారాష్ట్రసామంతు సా
రంగుం దోలి తురంగముం గొనిన సంగ్రామంబునం దృప్త స
ప్తాంగస్ఫారయశుండు మన్మవిభుపంపై చన్న సైన్యంబులన్."

తెలుగుచోడులు పలువురు పాండ్యపల్లవులతో మైత్రి నెరపినందున, ఈ మహారాష్ట్రసామంతుడు కాకతీయప్రభువులకు నమ్మిన బంటుగా నుండెను. అందుచే త్రిపురాంతకుడు అద్దంకిమండలముమీదుగా మెరపువెరసినట్లే మోటుపల్లిపై బడెను.

పూర్వనిర్ణీత మగు సంకేతముప్రకారము గోదావరీముఖద్వారమునుండి కాకతీయనౌకాసేన యొకటి త్రిపురాంతకుడు మోటుపల్లి చేరునాటి క్రిందటిరాత్రికే అక్కడికి చేరి యా రేవును ముట్టడించెను.

అప్పుడు మోటుపల్లిలో ఎట్టి యుద్ధప్రయత్నము లేదు. ఆవల నెల్లూర పాండ్యసేన లున్నవి. ఇటు కొప్పెరుంజింగడు నిరాటంకముగా గోదావరివైపునకు సాగిపోవుచుండెను. ఓరుగల్లులో అబల సింహాసన మెక్కినది. మరి భయ మేమి? సిద్ధయదేవచోడ డందుచే నిర్భయముగా ప్రమత్తుడై యుండెను. అతని సేనలుగూడ క్రమశిక్షణ లేక దోపిడిమూకలై పోయినవి. చోరమండలములోని నావికుల దుర్వృత్తులు మోటుపల్లికి గూడ ప్రాకినవి.

మోటుపల్లిలోనివారు తెల్లవారి చూచునప్పటికి దూరమున వరాహధ్వజములు గాలికి ఉత్సాహముతో నాడుచుండ కాకతీయ నౌకలు తెరచాప లెత్తి దివ్యవిహంగములవలె నడయాడుచు కనిపించెను. వాయువుగూడ ముట్టడించిన యా నావలకు అనుకూలముగను, రేవులోని నావలకు వ్యతిరేకముగను ఉన్నది.

మోటుపల్లిరేవులోని నావికులు తత్తరముతో తమ నావలు సిద్ధము చేయసాగిరి. కాని యీమధ్య ఆ నావలలోని నావికులును సైనికులును, దోపిడికిని భోగములకును అలవాటుపడియున్నందున, వారు తమ నిర్ణీతస్థానములు వదలి దూరస్థలముల కేగియుండిరి. వారిలో కొందరు పానశాలలలోనను, కొందరు యవనభోగగృహములందును తాము అన్యాయముగా సంపాదించిన ద్రవ్యము వెచ్చించుచుండిరి. అందుచే కొన్ని నావలకు పనివారు లేరు. ఒక నావకు కూపకస్తంభమే కనబడదు. మరియొకదాని కడి విరిగిపోయియుండును. ఒకదాని తెడ్లు కనబడవు. మరియొకదానికి తెడ్లు దూర్చు చెంపలు విరిగియుండును. ఆది బాగుచేయు దారుశిల్పులు కనబడరు. రేవులో ఇట్లు గందరగోళముగా నున్నది. దూరమున నడయాడుచున్న కాకతీయనౌకలు చేరువకు

వచ్చుచున్నట్లుండెను. అంతకంతకు రేవులో అలజడి యెక్కువయ్యెను. ఇచ్చట నున్న ఏబది నౌకలలో నొక్కటియు పోరుకు సిద్ధము కాలేకపోయెను.

ఆ సమయముననే సరిగా త్రిపురాంతకుని సేనలు మోటుపల్లి పట్టణపు గోడ లను ముట్టడించి భయంకరముగా రణశంఖములు మ్రోయించెను. ఆ రణశంఖధ్వను లను 'త్రిపురాంతక, త్రిపురాంతక, త్రిపురాంతక' యని సైనికులు నామమును ఘోషించుచున్నట్లే వినవచ్చెను. సేనల యుద్ధకోలాహలముకంటె ఆ రణశంఖధ్వాన ముచే తీవ్రతరముగా నుండెను. కోటలో నున్నవారికి గుండెలు దడదడలాడిపోయెను.

ఆ దుర్గము దుర్గముగానే లేదు. కందకములలో నీరు సరిగా లేదు. కోట గోడలపై భటులు యథాస్థానములో కాపు లేరు. ఉన్న కొలదిమందియు త్రావి మత్తిల్లినవారును నిద్రించువారునునై యుండిరి. సహజముగా కొన్ని దినములుగా పట్టు వడిన యలవాటులు ఒక్క నాటిలో పోవునా?

త్రిపురాంతకుని కాశ్చర్య మయ్యెను. అతనికి మోటుపల్లిలోని అశ్రద్ధ కొంత వరకు చారులవలన తెలిసియే యుండెను. కాని యింతవరకుకూడ నింత ప్రశాంతముగా నుండు నని యూహించియుండలేదు. ఏమైన నేమి? అతని భటులను ప్రతిఘటించు వారే లేరన్నట్లుండెను. అందుచే అపరాహ్ణమునకే మోటుపల్లి కోటను త్రిపురాంత కుని సేన ఆక్రమించెను. వెంటనే కోటపై నిసరధ్వజము లన్నియు దిగగొట్టించి కాకతీయప్రభువుల వరాహధ్వజముల అంతకంటె కొంచెము క్రిందుగా తన కుట్యాంగధ్వజమును త్రిపురాంతకుడు ఎత్తించెను.

సిద్ధయదేవచోడుడు తప్పించుకొని పారిపోవుటకుగూడ నవకాశము లేకపోయె నడి. కతిపయభటులతో త్రిపురాంతకుడే రాజభవన మేడలపల వెదకివెదకి సిద్ధయదేవ చోడని పట్టుకొని, కేశములు గ్రహించి నేలకు దిగలాగి, శిరస్సుపై కాలూని భయంకరమూర్తియై యాతని తల తెగనరకెను. వెంటనే త్రిపురాంతకుని యాజ్ఞలం పాలించి సైనికులు రక్తమోడుచున్న సిద్ధయదేవచోడని శిరస్సును మొండెమును రెంటి టిని రెండు పొడుగుపాటి శూలములకు గ్రుచ్చి, వేలానగరముగోపురద్వారమునకు ఇరుప్రక్కల నెత్తుగా నిలిపిరి. అది చూచి వేలానగరములోని సేనలు గూడ భయ భ్రాంతములై లొంగిపోయెను.

గోదావరీముఖద్వారమునుండి వచ్చిన కాకతీయనౌకలు ముప్పదియే! మోటు పల్లి వేలానగరమున ఏబదినౌకలు కలవు. అందుచే కాకతీయనౌకలకు వేలానగరము లోని నౌకలను జయింపగల శక్తి లేదు. అవి బెదరించి త్రిపురాంతకుని ముట్టడికి సాయముచేయుటకు మాత్రమే ఉద్దేశింపబడినవి. అవి స్వయముగా పోరుటకు కవి యుటలేదు. వేలానగరములోని నౌకలు తీవ్రముగా విజృంభించినచో నవి పారిపోవు టకు తగు ప్రయత్నముననే యుండెను.

కాని యిప్పటి స్థితిగతులు మారిపోయినవి. ఆకస్మికముగా వరాహధ్వజము

కోటపై ఖడ్గాంకధ్వజముతోపాటు గాలికి ఉత్సాహముతో నాడుచున్నది. కాకతీయనౌకలకు రమ్మని సంజ్ఞలు కోటనుండి స్పష్టముగా సంకేతితమార్గమున కానవచ్చెను. కాకతీయనౌకలకు వాయు వింకను అనుకూలముగనే వీచుచున్నది. పోటు కూడ ప్రారంభించినది. ఉత్సాహముతో నా నౌక లొక్క పరుగున వేలానగరములోని ఉప్పుటేరులలో జొరబడెను. అక్కడ నున్న ఏబదినౌకలును ఎదురాడకుండ కాకతీయనౌకలకు స్వాధీన మయ్యెను. త్రిపురాంతకుని రాక్షససాహసము ఫలించెను.

వెంటనే ఆతడు మోటుపల్లి పట్టుకొన్నవార్త శ్రీరుద్రదేవమహారాజునకును జన్నిగదేవునకును అంచెలమీద వేగరులచే తెలియజేసెను. కోటలో నామమాత్రముగనే ఆతడు విజయోత్సవము జేసెను. మోటుపల్లిస్థితి అయోమయముగా నున్నది. పాండ్యసేనలు గాని కాడవసేనలు కాని ఎప్పుడైన రావచ్చును. చుట్టుప్రక్కల నున్న మాండలికు లెవ్వరైనను దండెత్తవచ్చును. చోరనావికుల నావలను ఊర కొనునా? వేలానగరమును మోటుపల్లిదుర్గమును ఎట్టి శత్రువులనైన నెదుర్కొనగలుగు సన్నాహము లొనర్పవలసి యున్నది. అవసరమైన చర్యలు ఆతడు కఠినముగా తీసికొని, స్వయముగా నచ్చటి స్థలదుర్గమును జలదుర్గమును బలపరచెను. సైనికులును నావికులును రాత్రింబవళ్లు జాగరూకులై వేయికళ్ళతో జలమార్గములను భూమార్గములను గాచుచుండిరి. వేలానగరమున గణపతిదేవుల యభయశాసనము పునఃప్రతిష్ఠిత మయ్యెను. త్రిపురాంతకు డామండలమునం దెల్లెడ నలజడులు లేకుండ శీఘ్రముగా నిరోధించెను.

ఇకముం దాతడు చేయవలసిన పని నిర్ణీతము కాలేదు. జన్నిగదేవుడు ముందు పాండ్యసేనల నెదుర్కొనుచూ, కొప్పెరుంజింగని వెన్నాడుచూ, నిర్ధరింపలేకుండెను. అంబదేవుడు రాజధానినుండి మహాసేనతో ఇంకను రావలసియుండెను. కోలని రుద్రుడు కాళింగసేనల నెంతవరకు ప్రతిఘటింపగలడు? వానిపైన త్రిపురాంతకుని భావిచర్య లాధారపడియుండును.

కాకతీయసైన్యములు నిశ్చయముగా దాటిపోయి మోటుపల్లి పట్టుకొనిన వార్త మెరపుమెరసినట్లు తీరభూములనెల్లెడ ప్రాకిపోయెను. అది విన్నవారు ముందు నమ్మలేకపోయిరి. మరలమరల నా వార్తయే వచ్చి ధ్రువపడినపిమ్మట అక్కడి నాగరకులును జానపదులును బ్రదికితి మని నిట్టూర్పులు విడిచిరి.

ఈవిధముగా రుద్రదేవమహారాజునొద్ద ఆమె సేనానాయకులు విజయదశమినాడు కైకొన్న ప్రతిజ్ఞలలోనెల్ల ముందుగా త్రిపురాంతకుడే తన ప్రతిన అక్షరశః సిద్ధయదేవచోడని తల నరకి పాలించెను. ఆతడు మహారాజుకు పంపిన విజయపత్రముతోపాటు, ఆ నాడు తనకు వచ్చిన జమ్మిపత్రమును, సూత్రముతో కట్టిన సిద్ధయదేవ నామాంకితపట్టమును గూడ పంపుట మరవలేదు.

వోరంటుపల్లి విజయవార్త చేరినవెంటనే శ్రీరుద్రదేవమహారాజు స్వయముగా శ్రీ గణపతిదేవుల దర్శించి వారి కా శుభవార్త ముందుగా నెరిగించెను. విజయదశమి నాడు రాజ్యభారము కుమార్తె కప్పగించినవాడి గణపతిదేవుల యారోగ్యము బాగు పడజొచ్చెను. శరీరవార్ధక్యము క్షీణించిపోయినదినములలోగూడ ఆయనబుద్ధిలోని చురుకుదనముమాత్రము ఏమాత్రము క్షీణించి యుండలేదు. శ్రీ రుద్రమదేవుల యభిషేకము నిశ్చితమానంతరపు భావిప్రభువును గూర్చిన చింత నిరంతరమాతని వేధించుచుండెను. ఆ విచారమంతయు రాజగురువులగు శ్రీ విశ్వేశ్వరశంభువుల సదసన్నిర్ణయముతో అట్టె విరిసిపోయెను. శ్రీగురువుల యాదేశానుసారము తాను చేసిన నిర్ణయము ప్రకృతు లంగీకరించిరి. దానితో చక్రవర్తిమనస్సు స్వస్థమయ్యెను. మనస్స్వాస్థ్యముతోపాటు శరీరమునకు ఓజస్సు ప్రారంభించెను. పట్టాభిషేకానంతర మది మరింత స్థిరపడసాగెను.

కాని తదాది గణపతిదేవులు రాజ్యకార్యములలో జోక్యము కలిగించుకొనుట లేదు. కొంతకాలము రుద్రమ ప్రధానకార్యములలో తానే స్వయముగా పితృదేవుల దర్శించి వారిని కర్తవ్య మేమో ఉపదేశింప నర్థించుచుండెను. అట్లు కుమార్తె చెప్పుచున్న విషయము లన్నియు శాంతముగా నాతఁ డాలకించును. తుదకు నుపదేశ మర్థించినప్పుడు వేరేమియు పలుకక ‘శివేచ్ఛ నిర్వర్తింపుము’ అని మాత్రమే ఉపదేశించును. ఎన్నిమారు లడిగినను ఆతఁడు, ‘శివేచ్ఛ చేయుము’ ‘శివాజ్ఞ పాలింపుము’ ఇత్యాదిగా ఒకే యర్థ మిచ్చు నుపదేశము చేయుచుండెను.

అనాదిగా భరతఖండములో రాజపుత్రులు అన్వీక్షికితోపాటు వేదవేదాంగముల సారమును సాహిత్యరహస్యములను చతుష్షష్టికళలను సూక్ష్మముగా నభ్యసించుచుండిరి. అదియు ఋషితుల్యులును అనుభవశాలురు నగు మహానుభావులే వారి కుపదేశించుచుండుటచే ఆ రాజపుత్రులకు భారతీయధర్మము దృఢముగా నబ్బుచుండెను. అందుచే వారు తమకు సులభసాధ్యములగు భోగములందు లౌల్యమును అధికారమునందు దుర్మదమును పరిహరించి ప్రవర్తింపగలుగుచుండిరి. వారు నిర్లిప్తులు. వారికి జనకమహారాజు ఆదర్శప్రభువుగా భాసించుచుండెను. వారును దాన రాజర్షులే. ఆంతరంగికకార్యములలో నిష్కపటబుద్ధితో గూడిన ధర్మవిచక్షణయు వైదేశికవ్యవహారములలో దక్షతయు వారికి సహజముగా నలవడుచుండెను. రాజ్యతంత్రనిర్వహణము వారు లోకవిధిగా తలంచి యందు పాల్గొనుచుండిరి.

ఇట్టి విద్య నేర్చినవారిలో కొందరు విద్యానంతరముననే విరక్తులగుచు రాజ్యతంత్రము నిర్వహించు నిచ్ఛలేనివారై తమ తమ్ములకో మరియొకరికో రాజ్య

భార మప్పగించి మునివృత్తి కాలముగడప ననము చేసుటయు కద్దు. అట్టిది అరుదు. కాని వార్ధకము వచ్చినపిమ్మట సమర్థుడగు తమ్ముడో కుమారుడో ఉన్నచో అట్టి వానికి రాజ్యభార మప్పగించి తాము వనప్రస్థులగుటమాత్రము సర్వసామాన్యమే. అట్లు పరులకు రాజ్యభార మప్పగించినపిమ్మట వారు మరల రాజ్యతంత్రములో జోక్యము పూర్తిగా మానుకొనుచుండిరి. వారికి బ్రహ్మచర్యముననే ఉపదిష్టమై, రాజ్యభారము వహించిన దినములలో విస్మృతము కాకున్న, అధ్యాత్మవిద్య నిప్పుడు వారు సాధింప నిరంతరసాధన చేయుచుందురు. రాత్రిందివమును భగవద్ధ్యానము, సత్కథాకాలక్షేపములు, అధ్యాత్మచింతనములతో వారు కాలము గడపుచుందురు. వనమునకు వెళ్లినను, పురమున నున్నను వారు వనప్రస్థులే. అట్టి వనప్రస్థవృత్తినే గణపతిదేవచక్రవర్తి విజయదశమినాటినుండి సాగించుచుండెను.

ఆ కారణముననే రుద్రమ ముందు ఎన్నిమారులు రాజకార్యములు నివేదించినను అతడు విని 'శివాజ్ఞ నెరవేర్పు' మనియే ఉపదేశించుచుండెను. కొన్ని పర్యాయములు మరలమరల నట్లే జరిగిన పిమ్మట రుద్రమయు వారికి రాజకార్యములు నివేదించుటయే మానెను. భగవత్కాలక్షేపముతో ప్రొద్దుపుచ్చు పితృదేవులను వారు సన్యసించిన రాజ్యపు చింతలతో మరల బాధించు టేల? కాని వారు శివేచ్ఛ నెరవేర్పు మని పలుమారులు ఉపదేశించినదిమాత్రము ఆమెహృదయములో దృఢముగా నాటుకొనిపోయెను. ఏ ముఖ్య కార్యమున నిశ్చయము చేయవలసివచ్చినను ఆమె శాంతముగా 'ఇందులో శివేచ్ఛ ఎట్లుండును?' అనియే విచారణ చేసి మరి నిశ్చయించును.

త్రిపురాంతకుడు మోటుపల్లి గొనినవార్త సామాన్యవార్త కాదు. అది మహాసాహసకార్యము. ఇప్పటికి ఐదారుసంవత్సరములుగా కాకతీయదండనాథులు తలపెట్టలేకుండిన గంపెకార్యము! ముందు రుద్రమసేనానులు సమర్థింపబోవు వీరవిహారనాటకమునకు ఇది నాంది. అదియును ఇంత శీఘ్రముగా నిర్వహింపబడుట యద్భుతములలో నెల్ల అద్భుతము. అన్నిటికంటె ప్రధానమైనది ఇది శ్రీరుద్రదేవమహారాజుల ప్రథమవిజయము!

అందుచే వార్త విన్నంతనే రుద్రమ యానందతన్మయత నొంది ముందుగా పోయి పితృదేవుల కది ఎరిగించెను. ఈమధ్య రాజకార్యములు ఆమె గణపతిదేవుల కెరిగింపకుండెను గాని ఈ శుభవార్త ఎరిగింపకుండగలదా? వారి కీవార్త ఎరిగించి వారి యాశీర్వచనము పొందవలె ననియే ముం దామెకు స్ఫురించెను. వెంటనే యామె స్వయముగా పితృదేవుల దర్శించి శుభవార్త నివేదించెను.

గణపతిదేవు లావార్త పరమశాంతముగా నాలకించి తన ప్రసన్నదృష్టి రుద్రమపై నాపాదమస్తకము ప్రసరింపజేసి మ్రొక్కియున్న యామెను ఆశీర్వదించి లేవదీసెను. అపిమ్మట తన ఓవరి గవాక్షమునుండి తన దృష్టిని ఏకశిలానగరవీథులపై

ప్రసరింపజేసెను. అం దెక్కడను మహోత్సవచిహ్నము లాతనికి గోచరింపలేదు. ఈమారు 'శివాజ్ఞ నెరవేర్పు'మను వాక్యములు ఆయన నోట రాలేదు. అట్లు వచ్చునని కూడ రుద్రమ భావింపలేదు.

'నగరమున విజయోత్సవము ప్రకటించితిరా?'

గణపతిదేవు లాదేశింపలేదు; ప్రశ్నించిరి. అంతవరకు రుద్రమ దేవియు వను కొనియుండలేదు. ఎవరిని ఆలోచింపలేదు వార్త తెలిసిన వెంటనే, ఆ శుభవార్త తండ్రి కెరిగింపవలె నని పరుగెత్తుకొనిపోవు పిల్లవానివలెనే రుద్రమయూ వచ్చి ఆ ట్లాతని కీవార్త యెరిగించియుండెను. గణపతిదేవు లిప్పు డీ ప్రశ్న వేయగా రుద్రమకు వెంటనే కర్తవ్యము స్ఫురించినది. వారు ప్రశ్నయే వేసినను అది యొక ఆదేశమే. గణపతిదేవు లట్లాదేశింపకున్నచో నామె యమాత్యమంత్రులతో నాలోచించి గాని యీ వార్త నగరములో ప్రకటించుటకు మాత్రము కూడ నిశ్చయించి యుండెను. కాని యిప్పు డట్టిది అవసరము లేదు. ఆ ప్రశ్నయే ఆదేశముగా గ్రహించి యామె వెంటనే మహాప్రధాను లగు గోవిందనాయకుని బయ్యననాయకుని తిక్కసేనాపతిని అంబదేవుని పిలిపించి వారెల్లర కీ శుభవార్త గణపతిదేవుల సమక్షముననే ఎరిగించి మూడుదినములు విజయోత్సవములు రాజధానీనగరమునను ముఖ్యముఖ్యములగు ప్రధాన నగరములను మహావైభవముతో జరుప నాజ్ఞాపించెను. వారందరు శ్రీరుద్రదేవ మహారాజులకు జయాభినందనములు చేయుచుండ గణపతిదేవులు ప్రమోదభరితులై తిలకించుచుండిరి. వారంతట సెలవు తీసికొని యుత్సవసన్నాహములు చేయ బయలు వెడలిరి.

ఆ పిమ్మట కొద్దిసేపటిలో గజశాలనుండి గజఘటలు ఘంటానాదములతో బయలుదేరినవి. 'వీటన్ పీఁకుల నెల్ల నేనుగులపై విస్ఫారఘంటాస్వనం జాటం బంపి వేర్కి' త్రిపురాంతకుని 'జయాశ్చర్యంబు!'

ఆ యుత్సవములో వీరప్రదర్శనకార్యక్రమమెల్ల అంబదేవుని కప్పగింప బడెను. ఏకశిలానగరమున కుత్తరపార్శ్వమున మానుమకొండకు నొక పెద్దసరోవరము కలదు. దానిని 'భద్రి చెరువు' అని పిలుచుటయు కద్దు. దాని తూర్పుతీరమున పొడుగునను రాచవారి బాహ్యోద్యానము కలదు. అందు పటకుటీరాదులు నిర్మించుకొనిన రాజసైన్యముల స్కంధావార మున్నది. ఇప్పు డా స్కంధావారమంతయు నంబదేవుని యాజ్ఞలచే నొక్కుమ్మడిగా యాతాయాతజనవ్రాతముతోడను గజాశ్వ రథములతోడను సందడించుచు సన్నద్ధమై యుండెను.

ఆ సాయంత్రమున నందుండి వీరభటసాహస్రములు బారులుతీరి యూరేగసాగిరి. ముందు స్వలంకృతము లగు గజఘటలు, ఆ పిమ్మట చిత్రవర్ణములు గలిగి కనులు మిరుమిట్లు గొలిపించు గౌసెనలతో నలంకరింపబడిన యశ్వము లధిరోహించిన యాశ్విక దళములును, వానికి మధ్యమధ్య ప్రధానసేనాపతుల యాందోళికలును రథములును

సాగుచుండెను. అందరికిని ముఖ్యముగా సమున్నతగజముపై ముత్యాలుకూర్చిన అంబారీలో త్రిపురాంతకుని రూపము గంభీరమనోజ్ఞముగా చిత్రించిన పటమును, దాని ప్రక్కనే అంబదేవుడును ఉండి ఊరేగుచుండిరి. ఆ వెంక మరల రథములు ఆందోళికలు అశ్వికదళములు గజఘటలు వచ్చుచుండెను. ఉత్సవముబారునను పదాతులు, ఖడ్గశూలాద్యాయుధధరులు ధనుర్ధరులు వరాహధ్వజహస్తులు, నై సాగుచుండిరి. మరియు వీణావేణువాద్యములును సన్నాయిలును మ్రోయించుచు నడుమ నడుమ పలువురు [illegible]లుచుండిరి. నట్టువకత్తెలు మోట పల్లిజనము వీరరస ముట్టిపడునట్లు అభినయించుచు చూపరనాకర్షించుచుండిరి.

చత్వరములందెల్ల చలువచప్పరము లున్నవి. అందు త్రిపురాంతకుని పటమున్న భద్రగజముపై పుష్పవృష్టి కురియుచుండెను. నగరమంతయు ముత్యాల రంగవల్లులు తీర్చబడియుండెను. వీథులెల్ల మంగళపత్రములతో పుష్పముల తోరణములతో నలంకృతములై యున్నవి. ఆ యూరేగింపు పట్టణమెల్లెడలసాగి జయజయనినాదములు మిన్నుముట్టుచుండ రాజప్రాసాదముముందున్న విశాలప్రదేశమున నాగెను.

అప్పుడు రాజమందిరములోనుండి సువాసినులు పూర్ణకుంభములతో నెదురువచ్చి మంగళారాత్రికము లిచ్చిరి. అంతలో రాజభవనాట్టాలకమునుండి ఉన్నతాసనమున నున్న శ్రీ రుద్రదేవమహారాజులు దర్శన మిచ్చిరి.

వెంటనే ఆందోళికలు దింపబడెను. ఒక్కసారిగా నాందోళికలనుండియు రథములనుండియు ప్రధానదండనాథులు దిగి రుద్రదేవమహారాజులకు నతు లొనర్చిరి. త్రిపురాంతకుని పటముతో నంబదేవు డున్న భద్రగజము మావటీనిచే ప్రేరితమై రుద్రదేవమహారాజుల కెదురై మోకరించెను. అంతట నొక్కసారి నిశ్శబ్దమయ్యెను. అంబదేవుడు మహారాజులకు గొంతెత్తి జయజయనాదము లొనర్చెను. ఒక్కసారిగా నలుదిక్కుల ఘంటానాదములు పిక్కటిల్లెను.

ఆ రాత్రి మిక్కిలి ప్రొద్దుపోవువరకు వీరవినోదము లచ్చట సాగెను. అశ్వక్రీడలు, గజక్రీడలు, ఖడ్గయుద్ధములు, బాణప్రయోగములు, శూలకుంతాదిసాధనలు బహువిధముల ప్రదర్శింపబడెను. మల్లయుద్ధములు జరిగినవి. గండడీనాడు సులభముగా ప్రతిమల్లుర నెల్లర నోడించెను. అతడు పచ్చిత్రభిక్షుకుని వెన్నంటిపోయిననాటి రాత్రియనుభవముతో నాతనికి రెండుమూడునాళ్లు ఆందోళనమంది మనస్థిమితము లేకుండెను. కాని యిప్పటి కాతడు స్వస్థుడైనాడు. బొల్లడు దేశాంతరగతుడైన దాదిగండని నెదిరించు ప్రతిమల్లుడే లేడు. పలువురు బొల్లనిగూర్చి యీనాడు మనస్సులలో స్మరించిరి.

ఆ మరునాడు మధ్యాహ్నమునుండి యపూర్వమగు నాటకప్రదర్శన మొకటి సాగినది. స్వయంభూదేవుని సరోవరమున క్రీడార్థము కొన్ని నావ లుండును. అం

దొకదానిని చక్కగా అలంకరించి స్వయంభూదేవుని యుత్సవసమయములలో ఉత్సవవిగ్రహముల నుంచి సరోవరవిహారము చేయించు నాచారము గలదు. ఆ సరోవరమున గల క్రీడానౌకలను నేడు యుద్ధనౌకల నలంకరించున ట్లలంకరించిరి. అంతట మోటుపల్లిలో జరిగిన సముద్రయుద్ధమును నేలపై యుద్ధమును జూచిన జనసమూహము సమక్షమున అద్భుతముగా ప్రదర్శింపబడెను.

ఆ చెరువుపక్కనున్న చిన్నచిన్న తీరము నాని చాలనావలు నిద్దురపోవు చున్నట్లే నిలిచియున్నవి. వాని కెట్టి యలంకారములును లేవు. అందలి నావికులును సైనికులును ఆ రేవునందే కృత్యములతో గానవినోదములతో క్రీడలతో లోకాభిరామాయణములతో ప్రొద్దుపుచ్చుచుండిరి.

ఇక నీటియొడ్డున, స్వయంభూదేవాలయముపక్కనున్న చెరువునుండి అల్ప సంఖ్యాకములగు నావలు బయలుదేరినవి. అవి చక్కగా నలంకృతములై ధ్వజములతో నిండియుండి కోలాహలముతో కదలుచున్నవి. ధ్వజములు గాలి కల్లాడు చుండగా అవి బయలుదేరుటలోనే ఒక ఉత్సాహము వ్యక్తమయ్యెను.

ఈ స్వయంభూదేవుని నావలు సమీపించినంతనే గల నావ లన్నియు కదలక నిలుచున్నవి. కాని యవి యిదివరకు నిలుచుండుటచే జలము నావలలో కలయుటకు ప్రారంభించినది. సంగ్రామమునకు అవి సిద్ధముగా లేమియు కానవచ్చినవి. కాని ఒకదానికి చుక్కాని లేదు; మరియొకదానికి చాపకట్టుకొయ్య లేదు; కొన్నిటికి తెడ్లు లేవు; కొన్నిటికి తెడ్లుబాహ్య మేకులు లేవు; మరికొన్నిటికి తెరచాపలే కనబడవు. నావికులు కొన్నిటి తెరచాపలు పరచుకొని వానిపై నిదురించుచుండిరి. వారు నిద్రలోనుండి తత్తరముతో లేచి చాపలు కొడికి తగిలింపబోవుచుండ నవి జారి నీటిలోబడి తడిసిపోవుచున్నవి. భటులవద్ద విల్లున్న నంబు లుండవు; అంబులున్న విండ్లుండవు. ఇట్టి గందరగోళములో నున్న యా శత్రునావలను స్వయంభూనౌకలు చుట్టుముట్టెను.

ఆసమయముననే త్రిపురాంతకుని పటమున్న భద్రగజముపై నంబదేవు డుండి సేనతో నావలి యొడ్డున గల పటకుటీరములపైబడెను. వానినెల్ల నాతడు శీఘ్రముగ చుట్టుముట్టి స్వాధీనమొనర్చుకొని యందున్న సిద్ధయదేవుని బంధించెను.

ఆ సిద్ధయదేవుని ప్రదర్శించుటకు, ఆతని యాకారము ఎరిగినవారు నిజముగా నాతడే ప్రత్యక్షముగా కనబడుచున్నాడని భ్రాంతిపడినంత చక్కగా, నాతని బొమ్మ యొకటి చేయబడెను. ఆ క్రిందటిరాత్రియంతయు మేలుకొనియుండి ఓరుగంటి మోహరివాడలోని కుట్రపుపనివారు పలువురు కలసి గడ్డితో నా బొమ్మ చేసి దానిపై మట్టి పూసి రంగులు చిత్రించిరి.

అట్లు చేయబడిన సిద్ధయదేవుని ప్రతికృతిని అంబదేవుడు శిరచ్ఛేదము చేయించి

దాని మొండెమును తలయు చెరియొక ప్రక్కను ఆవలి రేవుమొగను ఎత్తుగా నిలుపునట్లు చేసెను.

అంతట స్వయంభూనౌకలు ఆవలి యొడ్డున గల శత్రునౌకల నెల్ల స్వాధీనమొనర్చుకొని యందలి నావికులను భటులను బంధించెను.

మోటుపల్లి విజయయుద్ధనాటక మీ విధముగా ప్రదర్శింపబడుచుండ దానిని విలోకించుటకై శ్రీరుద్రదేవమహారాజు ఆ సరోవరము నానియున్న ఏకశిలాక్రీడానగరమున పేరోలగము తీర్చియుండెను. ఆమె ప్రక్కనే మహాధ్వజస్తంభమువలె నంగరక్షకుడగు పర్వతనాయకుడు సర్వాయుధోపేతుడై నిశ్చలముగా నిలిచియుండెను. ప్రక్కనే బాలప్రతాపరుద్రదేవు లధివసించియుండిరి. శ్రీమహా గోవిందనాయకుడు, బయ్యనవాయకుడు, తిక్కచమూపతి, జాయప, బద్దెన, మహాదేవరాజు, స్థలసుంకాధికారి యగు గోనగన్నారెడ్డి, ఆయసగాండ్ల యధికారి యగు నాగదేవుడు, రేచర్లకామయ, నామయ, మల్లయ, గణపిరెడ్డి, మర్రెడ్డి, కోటకేతరాజును మరియును పెక్కు రున్నతాధికారులు నందు యథోచితస్థానము నలంకరించి యుత్సవము తిలకించుచుండిరి. నాగరకు లగు జనులందరు నా సరోవరపశ్చిమతీరమున గుంపులు గుంపులుగా కూడి యా వినోదము నుత్సాహముతో తిలకించుచుండిరి.

మోటుపల్లి స్థలజలదుర్గములను పట్టుకొనుట ప్రదర్శించిన పిమ్మట అంబదేవుడు ఏనుగుపైనుండి దిగివచ్చి, త్రిపురాంతకుని ప్రతికృతిని, అతడు పంపిన జమ్మిరెమ్మను, సిద్ధయదేవనామాంకితపత్రమును, వినీతుడై మహారాజులకు అర్పించెను. ఒక్కసారిగా జయజయనినాదములు క్రీడాపర్వతమున నుప్పతిల్లి సరోవరము నుత్తరతీరమున గల రాజభటసందోహమునను, దక్షిణతీరమున గల నావలయందును అచ్చటి వీరులందును, పశ్చిమమున గల ప్రేక్షకనాగరలోకమునందును ప్రతిధ్వనించెను.

అప్పుడు శ్రీ రుద్రదేవమహారాజు లేచి స్వయముగా త్రిపురాంతకుని పటము శిరస్త్రాణముపై నా జమ్మిరెమ్మయు సిద్ధయదేవనామాంకితపత్రమును అలంకరించెను. మరియు త్రిపురాంతకునికి పూర్వ మున్న బిరుదావళికి తోడుగా ఈనాడు, 'సిద్ధయదేవచోడతలగొండుగండ' అను బిరుదము సభాసమక్షమున మహారాజు ప్రసాదించెను.

మూడవనాటి యుత్సవములు బహుమతులు పంచిపెట్టుటతో ఎక్కువభాగము సరిపోయెను. ఆ రాత్రి వీధినాటకములు బొమ్మలాటలు చత్వరమున కొక్కటిగా ప్రవర్తిల్లుచుండెను.

ఈ మూడునాళ్లును నగరమంతయు మహోల్లాసముతో నుండెను. కాని ప్రతిదినమును అపరరాత్రవేళ సంగీతములో నపశ్రుతివలె నొక భిక్షుకుని కంఠస్వరము వీధివీధుల వాడవాడల ప్రసరించుచుండెను.

"అల్లోజ్యేష్ఠం శ్రేష్ఠం పరమం పూర్ణం బ్రహ్మాణమల్లాం
అల్లో రసూలమహామదరకం వరస్య అల్లో!"

* * * *

"ఇల్లా కబర ఇల్లా కబర ఇల్లల్లేతి
ఇల్లాల్లాః ఇల్లా ఇల్లల్లా!"

ఈవిధముగా తెగని తీగవలె నానాస్తోత్రపరంపర సాగిపోవుచుండెను.

మరియు నొకవంక విజయోత్సవములు సాగుచున్నవి. భద్రసరోవరతీరమున గల స్కంధావారమునను పాఖాలసరోవరతీరమునందలి స్కంధావారమునను కదలిక యతిశయించెను. కాకతీయవీరభటులందరకు వారివారి స్కంధావారములకు చేరికొని సర్వసన్నద్ధులైయుండవలసిన యాజ్ఞ లయ్యెను. పడవాండ్లు చేయు సన్నాహములు వృద్ధినొందుచుండెను. ఉత్సవము లయిపోయినమరునాడు ఓరుగల్లువీథులన్నియు శాంతము లయ్యెను.

ఆనాటి తెల్లవారుజామున భద్రసరోవరతీరమున దివిటీలు అసంఖ్యాకముగా కానవచ్చెను. దేవత లప్పుడప్పుడు ఆ సరోవరజలములలోనికి దిగివచ్చి తమస్వర్గముల నవతరించుచుందురను జనప్రథ కలదు. ఈనా డక్కడనుండి యనేకసహస్రసంఖ్యలగు సేనలు కదలెను. అట్లు వారముదినములలో నటనుండి రెండులక్షలసేన కదలెను. దానికి అంబదేవుడు సర్వాధికారి. మరి రెండులక్షలసేన పాఖాలనుండి బయలుదేరెను. దానికి ఆదిదమ్మ యధికారి.

ఆ సేనలు కదలిపోయినపిమ్మట ఓరుగల్లునగరము నిర్మానుష్యమే ఐనదా యనునట్లుండెను. కోటగోడలు కట్టుట సాగుచునే యుండెను. ఇప్పుడందులో అంబదేవుని స్థానమున గోనగన్నారెడ్డి నియమితుడై యా వ్యవహారములు నిర్వహించుచుండెను.

గండనికి సైన్యములో చేరవలెనను నుత్సాహము కలిగినది. మేచయ యాతని క్షేమ మర్థించి దూర మంపివేయదలంచికూడ నుండెను. గండని నూరుమంది యుద్ధవీరుల కధికారిని జేసి తన స్కంధావారరక్షకభటులలో నుంచి నియమించి యంబదేవుడు వెంట గొంపోయెను.

రుద్రమ్మయ్యయు ఇప్పటికి కొంతకాలముగా మనస్స్వాస్థ్యము లేనిదానివలెనే కనబడు చున్నది. నాట్రాంబ పిలిపించినంతనే ఆ పిల్ల యామెయొద్దకు శీఘ్రముగా బోవును. ఆమె చెప్పిన సర్వకార్యములు సక్రమముగా నిర్వహించును; అడిగిన ప్రశ్నల కన్నిటికి సాదరముతో గౌరవముతో నుత్తరము లిచ్చును. కాని తాను స్వయముగానే విషయమునను పూర్వమువలె చొరవ కలిగించుకొని మాటాడదు. అది గమనించిన రుద్రమ, వయస్సులోని మార్పువల్ల నట్లు ప్రవర్తించుచున్నదేమో, యని సరిపెట్టు కొనుచుండెను.

కాని ఆ సరిపెట్టుకొనుట అంతకంతకు సాధ్యపడుట లేదు. రుయ్యమ్మ మాట లలో వెనుకటి యుత్సాహమే ఇప్పుడు లేదు. ఒక్కొక్కమారు మాటలమధ్యలో ముఖ మొకలకు త్రిప్పుకొనును. ఏల? మరల నిటు తనకు సమ్ముఖముగా త్రిప్పు కొనులోపల నామె చీరచెరగు ముఖమున ప్రసరించియుండును. ముఖమున కలిగిన స్వేదము తుడిచికొనినదా? అంత తాపము లేదే! అటుగాక ముఖమున చెరగిన తిలకము గాని, కన్నుల చెదరిన కాటుక గాని, చెక్కుల రేగిన కురులు గాని సవరించు కొన్నదా? లేదే! మరి యేమి? కన్నీరు కార్చినదా? అప్రయత్నముగా ఆగక వచ్చిన కన్నీరు అద్దుకొని, మరి రాకుండ ముఖము బిగించుకొని, ఇటువైపునకు తిరిగినదా? పాప మీ పిల్లకు దుఃఖకారణ మేమైయుండును?

రుద్రమ పలుమారు సూచనగా నడిగి చూచెను. కాని యా బ్రాహ్మణబాల చిరునవ్వుతో హాస్యవచనములతో తప్పించుకొనుచుండెను. రుద్రమ్మ నిజమే కావచ్చునని యనుకొనును. కాని కాదేమో యని సంశయమును ఆమెకు వదలదు.

రుద్రమకు యౌవరాజ్యాభిషేకమే చేసినను గణపతిదేవులు సర్వరాజ్య భారము నామెపై నుంచుటచే నామెకు మహారాజ్యప్రాప్తియే యైనది. రాజ్య ప్రాప్తితోపాటు భర్తృవియోగమును భర్తతో విరోధమునుగూడ నామెకు సంభ వించినవి. అది తాను వాంఛింపలేదు. మీదుమిక్కిలి యట్టి యవస్థ రాకుండ నివారించుటకును ఆమె హృదయపూర్వకముగా ప్రయత్నించినది. కాని యా ప్రయత్నము విఫలమైనది. రాజధర్మము పాలించుటకు తా నిప్పుడు భర్తను విడువ వలసివచ్చినది. ఇట్టి దురవస్థపాలయినవారు పూర్వ మెవరైన గలరా?

శ్రీరఘురాముడు ఆత్మాధికప్రియ యగు ధర్మపత్నిని ప్రజాభిప్రాయముకొరకు విడనాడవలసివచ్చెనుగదా! పాప మాత డాబాధ యెట్లు భరింపగలిగెనో! తనభర్త యధర్మ మాచరింప డను నఖండవిశ్వాసము గల సీతామహాదేవి శ్రీరామాజ్ఞనుగూర్చి యేమని తలంచినదో గదా! విధికృతము! విధికృత మిట్లే ఏల సంభవింపవలెను?

ప్రజారంజనార్థము శ్రీరామచంద్రుడు నిరపరాధ యగు ధర్మపత్నిని వివాస మున కంపినాడు. కాని నే నిప్పుడు ప్రజాక్షేమమునిమిత్తము అపరాధి యగు వీరభద్రేశ్వరుల శిక్షింపవలసివచ్చినది. భార్యయు భర్తయు వివాహసంస్కారముచే

నేకదేహములకలవా రిలో కలిసి కొద్దిపాటు లంచుకొన్నా! వీరభద్రేశ్వరులను శిక్షించుట యన్న వారియందు దున్న సాయధర్మభావమును బాపి యుద్ధభూమియందు శిక్షించుట యగునా! శ్రీరాములు చేసినట్లు తమ్ముని పిల్చి రథమెక్కించి విజనారణ్యమున విడిచిరమ్మని పంచుటకంటెఁ జెడు గాదే ఇది! రణరంగమున బోర నెదిర్చినా, నాయకు కయ్యమున రహస్య మార్గమునకో, నా యుక్తిశక్తులు గాలిపోనే గాని వారిని భంజించి శిక్షింపవలెనే! అట్టిసమయమున నా కొరకు ప్రాణము లొసంగినవారి నెట్లు మరువగలను? వారి ప్రాణములకే మూలమైన నా మనోబలమునకు తోడు పడి నాశమొందిరే!

ఇట్లు కొంతసేపు తలంచును. అంతలో ఏదో స్మరణకు వచ్చిన దానివలె నాతనికి ప్రవృత్తమైన యుద్ధమును స్మృతిలో జూచును. అందు తా నెట్లోడెనో ఆమె కిప్పటికిని అవగతము కాదు. అట్టి ఘనస్వయంవర ప్రదర్శనమున గూడ నాతనికి తా నెట్లు తీసిపోయెనో ఆమె కింతవరకు నర్థము కాలేదు. తాను వీరభద్రేశ్వరులచే విజితురాలయ్యె నని మన్యవర్తులు ప్రకటించిరి. వారు పక్షపాతము చూపిరా? పెద్దల నంతమాట యను టెట్లు? ఎట్లైన నేమి? తాను వీరభద్రేశ్వరవిజితయే! విజితయే!

స్వయంవరసమయమున నా యుద్ధమున దా నెట్టి చాపల్యము పొందినదియు జూపలేదు. జయింపవలె ననియే తా నాతనితో పోరినది. ఆతడు జయింపవలె నను నిచ్ఛ తన కింతమాత్రము నప్పుడు లేదే! అలనియుండు తన కెట్టి నెపమును గలిగియుండలేదు. పైపెచ్చు ఇతడు నాతో సమానముగా నెదిరించి నిలువగలడా యను దీమసమే తన్నావేశించియుండెనే! తనకంటె విద్యలో గాని ప్రావీణ్యములో గాని అభ్యాసములో గాని వీరభద్రేశ్వరు డెక్కుడు కాడు కాని మరి యాతడే మున్ను జయశాలి యయ్యెనే! ఆతడే వీర్యపణమున తన్ను ఒడుచుకొని హక్కుగా పొందగలిగెనే! విధికృతము! విధి వీరభద్రేశ్వరులకే ఆనాడు తోడైనది. మరి యీనాడు విధి మాలో నెవరికి తోడగునో గదా! ఈనాడు ధర్మము నాపక్షమున నున్నది. నేను శివేచ్ఛ నిర్వర్తింప బూనియున్నాను. మరి విధియాత్రయు శివేచ్ఛల ననుసరింపదా!

ఇప్పుడు వా రెక్కడ నున్నారు? ఏమైరి? ఇప్పటికి ఇంకను ఈ రాజధానీ నగరము విడిచిపోయినట్లు తోచదు. ఒకచోట నొక మారువేషమున నున్నా రని చారులు జాడలు తీయునప్పటికి వా రాస్థానమును స్థలమును మార్చుచున్నారు. నూరు కన్నులతో కనిపెట్టియుండు మేచయనాయకుని భటులనే వారు కనుబ్రామి చున్నారు. ఆ భటులలోగూడ కొందరు వారి కంతరంగములలో బంధులై యుందురా?

ఏది యేమైనను తాను వీరభద్రేశ్వరులపత్ని. వారిరువురకు వివాహమాదిగా నొండొరులపై దంపతులకు సామాన్యముగానుండు ననుబంధమే ఏర్పడెను గాని కథలలో చెప్పుకొనునట్లు ఎవరికిని విపరీతవ్యామోహము ఎన్నడును కలుగలేదు. వారి కొకరి కొకరిపై నొక గౌరవభావము కలదు. అంతే!

కొంతవడికి వీరభద్రేశ్వరునితో తాను సుఖముగా గడపినదినములు జ్ఞప్తికి వచ్చును. వా రన్న పల్కులు చేసిన చేతలు స్మృతిలో బారును. అవి యేమియు

నంత ప్రధానమైనవి కావు. ఇంతకాలముజ్ఞప్తియం దుంచుకొన నవసర మున్నవి కావు. ఒక చిన్నమాట, ఒక సన్నని చూపు, ఒక చిరునవ్వు, ముఖములో నొకమారు కలిగిన వైవర్ణ్యము, మరియొకమారు అకారణముగా వారు ధరించినమౌనము!— మ ప్పదియెనిమిదిసంవత్సరముల సంసారములో నిట్టి వెన్ని యుండును! వీరభద్రేశ్వరుల కెప్పుడు సౌమ్యత లేదు. ఎప్పుడును కర్కశులే. వారి సహవాసమును మొదటినుండియు కరకు వారితోడనే.

ఉత్తరదేశములో సంచరించిననాళ్లలో తాము కావించిన క్రూరకృత్యము లెన్నియో వారు ఉత్సాహముతో తనకు వర్ణించిన దెన్నిమారులు! అవి విన్నంతనే తన హృదయమున శూలములతో పొడిచిన ట్లుండెడిది. వారు తాము తలంచిన కార్యము సాధించుటకు ఎట్టి కఠినకృత్యము చేయుటకును వెనుకాడరు. వారికి దయాదాక్షిణ్యములు లేవు. ధర్మాధర్మవిచక్షణ లేదు. అట్టివారు ఆ మహాసభలో ధర్మనిర్ణయము చేయు డని ధర్మస్వరూపులగు శ్రీ విశ్వేశ్వరశంభుదేశికుల నర్థించుట తన కెంతయో వెగటుగా దోచినది! ధర్మనిష్ఠులగువారి నోట ధర్మవాక్యములు శోభాయమానములుగా నుండును. పాపము, వీరభల్లటదేశికు లెంత మోటుగా చెప్పినను వారిమాటలు పూర్తిగా ధర్మబాహ్యము లనజెల్లదు. కాని యెట్టి ధర్మనిష్ఠయు లేని వీరభద్రేశ్వరులు ఆ యవకాశము పురస్కరించుకొని, ధర్మపన్నములు పలుకుచు, నంతవరకు మౌనము దాల్చియున్న శ్రీరాజగురువులను ధర్మనిర్ణయము చేయ నర్థించుట సభలో నందరకును కష్ట మనిపించినది. తనకు ఒడలే మండిపోయినది. అయ్యో, ఇట్టివానికి పత్ని నైతినే యనిపించినది. పత్నికి భర్తపై నెంతకోపము రా దగునో అంతకోపమును దనకు వచ్చినది.

తుద కా సాహసప్రశ్నము గుహాంతరమున సుఖముగా నిద్రపోవుచున్న సింహమును కదలించుటయే యైనది. ఆ మహాసభలో మహాప్రభువులు ప్రధానులు పండితులు అనేకు లుండిరి. వా రెవ్వరికిని స్ఫురింపని ధర్మసూక్ష్మము శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులకు స్ఫురించినది. అది వారి యాత్మవాణి, శివవాక్కు! ఈ మారైన విధి నా కనుకూలింపకుండునా?

శ్రీ గురువుల యాదేశముచే నీ రాజ్యభారము భరింప నీనాడు నేను తల యొగ్గినాను. నాకు ప్రభుత్వము నెరపవలెనని యెట్టి బులబాటమును లేదు. రాజ్యాంతమున నరకము ధ్రువ మందురు. ఇప్పుడే నేను నరకయాతన కొంత చవిచూచుచున్నాను.

పాప మా యన్నమంత్రిని నే నెందుకు బంధింప ననుజ్ఞ యిచ్చినట్లు! సాక్ష్యమున్న దనియే కదా! అది యంతయు మిథ్యాకల్పితసాక్ష్య మని నా విశ్వాసము. ఆ మంత్రీశ్వరుడే తన్ను బంధించుట యుక్త మని శాంతముగా నియోగించెనే! ఆయన ముఖము చూచినంతనే నిర్దోషి యని ముఖమున వ్రాసియున్నట్లు కనబడుచుండెనే! అట్టివానిని నిర్బంధములో నుంచిన నా పాపమునకు నిష్కృతి యేమి యుండును? ఆయన నిర్దోషి యని యెప్పుడు నిర్ధారితమగును? ఎట్లు?

వీరభద్రేశ్వరులకు నిండుపట్టు గాని యిప్పటికిమాత్రము మించిపోయిన దేమి? ఈ దాగుడుమూత లాడి యీ సామ్రాజ్యమును, తన్ను, తన కుమారులను అపాయములపాలు చేయక ఎదుటబడినచో, వారికి కఠినముగా శిక్ష విధింప దనకు సాధ్యమగునా? మహారణము చేసి విజితుడైన శత్రువునే పాదాక్రాంతు డైనచో క్షమించి వాని పదవి మరల వాని కిచ్చి విడిచిపుచ్చుట క్షత్రియాచారమే! ఇక తాను తన భర్త విషయమున వేరుధర్మ మవలంబించుట సాధ్యమా? అది తెలిసియున్నందుననే వీరభద్రు లింత నిష్కరుణముగా ప్రవర్తించుచుండవలెను.

వారితో నాకు గలిగిన యీ ఎడబాటు రుయ్యమ్మ కెంతో కష్టముగా నున్నది. కన్నకూతు రగు ముమ్మడమ్మకే అట్లు లేదు. ఇదియు నొక విచిత్రవిషయము! నేను పదిమాసములు మోసి కన్నముమ్మడమ్మకన్న రుయ్యమ్మకు మాపై నింత స్నేహ మేల? నాకును ముమ్మడమ్మపైని గన్న దృఢతర మగు ననుబంధము రుయ్యమ్మపై గలుగు టేల? కన్నమోహముకన్న పెంచినమోహ మెక్కువ యందు రిట్టిదే కాబోలును!

వీరభద్రేశ్వరులతో వియోగము ప్రాప్తించిననాటినుండియు నెమ్మది నెమ్మదిగా నాకు రుయ్యమ్మమనస్సును దూరమగుచున్నది. ప్రతాపరుద్రకుమారుని సాహచర్యము కూడ రుయ్యమలోటు తీర్పలేకున్నది. ఆ పిల్లకు హృదయాంతరమున నేదో బాధ యున్నది!

ఈ విధముగా నాలోచించుకొనుచు రుద్రమ యొకనాటి ప్రాతఃకాలమున దనమందిరములో గూర్చుండియుండి వాతాయనములనుండి స్వయంభూదేవాలయ శిఖరమును పరధ్యానముగా తిలకించుచుండెను. అన్నిశబ్దములను పరిహరించి యామె చెవులలో సన్నగా నొక వీణానాదము వినబడినట్లయినది. అంతలో దీన మగు నొక కంఠస్వరముకూడ దానితో సమ్మిళితమై వినవచ్చెను.

'దఇఅ రహిఓ అహిఅం దుహిఓ విరహాణుగఓ పరిమంథరఓ
గిరికాణణఏ కుసుముజ్జలఏ గఅజూహవఈ ఝిఅ ఝీణగఈ.'*

దానితర్వాత ఎన్నియో దీనము లగు గీతములు వినవచ్చెను. తుదకు మరల నిట్లు వినవచ్చెను.

"త్వం జీవితం త్వమసి మే హృదయం ద్వితీయమ్
త్వం కౌముదీ నయనయో రమృతం త్వమంగే—"

ఆ పద్యము పూర్తికాదు. మరల మరల నా పద్యార్థమే యాకంఠమునుండి వినవచ్చుచున్నది.

---

* కాళిదాసుని విక్రమోర్వశీయము. సంస్కృతచ్ఛాయ:
'దయితారహితో ఽధికం దుఃఖితో, విరహానుగతః పరిమంథరః
గిరికాననకే కుసుమోజ్జ్వలకే, గజయూథపతిః పశ్య క్షీణగతిః.'

రుద్రమ యాలకించెను. అది యెవరికంత మనసునో యనుమాన మామెకు ముందు కలుగలేదు. అందుచే నూరక వినుచుండెను. అంతలో నాకస్మికముగా నది రుయ్యమకంత మని యామెకు స్ఫురించినది. రుద్రమ కాశ్చర్య మయ్యెను. ఎన్నడో దీనిని తగినవరున కిచ్చి వివాహము చేసియుండవలసిన యీ బ్రాహ్మణకన్యకు ఇంత వరకు వివాహము చేయవలెననియైన నేను తలపెట్టియుండలేదు. కన్న తల్లిదండ్రులు లేనిలోటు నేను తీర్చితి ననుకొంటిని. కాని యెంత భ్రమ! నా కాపిల్లపై గల మమకారముచే నెడలేక దాని పసిమనస్సు రాజకార్యములలోనికి దింపి ప్రకృతిసిద్ధమగు భర్తృసమాగమేచ్ఛకు దూరురాలినిగా నొనర్చితిని!

ఇప్పుడీ పిల్ల యూరకే యిట్లు నోటికి వచ్చిన పద్యములు పాటలు పాడుచున్నదా? కాక యెవరియందైనను దీని మనస్సు లగ్నమైనదా? ఈ మధ్య దీని ప్రవర్తనలో నెక్కువ మార్పు కనిపించుచున్నదే!—

ఇట్లనుకొనుచు రుద్రమ యప్రయత్నముగా సమీపముననే కల రుయ్యమ్మ మందిరమునకు బయలుదేరెను.

౨౮

ఆనాడు క్రీడాశైలశిఖరమున ఓరుగల్లుకోటశిలాప్రాకారనిర్మాణవిషయమును ప్రసంగించుటకయి రుద్రమదేవితో మాటాడుచున్న యన్నమంత్రిని సమీపమున నుండి చూచినదాది, అతని రూపము రయ్యామచిత్తమున హత్తుకొనిపోయెను. అతడామెపై ముందుగా నాదరపూర్వకముగ దృష్టి నైనను బరపియుండలేదు. పైగా ముందు ఒకానొక తీవ్రమైన దృష్టినే పరపియుండెను.

“ఇంకను ఇక్కడనే కూర్చున్నా వేమి? ఇల్లి పోలే దేమి?” అను వర్ధనతో నొక పరిచారికపై పరుష దృష్టియే యది! కాని యాతడు పరచిన యా తీవ్రదృష్టియో, చిత్రమేమో కాని, రయ్యామహృదయములో నవమల్లికాశరకము బలవంతముగా ప్రవేశించినట్లు ప్రవేశించి కలవరపెట్టినది. ఆపై నా యువతి కచ్చట నిలుచుటే కొంతవడి కష్టమయినది. కాని ప్రయత్నపూర్వకముగా నెట్లో నిలుపరించుకొనగలిగినది. అన్నమంత్రి శ్యామాయితదేహమును ఆయనగౌరకన్నులలోని యపూర్వకాంతియు మాటిమాటి కానాడు రయ్యామదృష్టిని బలముగా నాకర్షించెను.

ఆనాడే అన్నమంత్రీశ్వరుని తప్పనిసరియై నిర్బంధములో నుంచుటకు రుద్రమ యాజ్ఞలిచ్చుచున్న సందర్భమున రయ్యామ నిర్ఘాంతపడిపోయెను. సుఖస్వప్నమునుండి బలవంతముగా మేలుకొనినట్లే యైనది. తుదకు తుదకు అన్నమంత్రికిని రుద్రమకును జరుగుచున్న సంభాషణమే ఆమె వినజాలకపోయినది. ఆమాటల ధ్వనియు నామె చెవుల బడినట్లే లేదు. ఎదుట నున్న యా యన్నమంత్రీశ్వరుడు ఒక గంధర్వమూర్తి గానే ఆమె కప్పుడు భాసించెను.

“ఇతడు బ్రహ్మదేవుడు. ఇతడే హరి. ఇతడే హరుడు! ఇతడే అగ్ని. ఇతడే సూర్యుడు—ఇతడే సర్వదేవతామూర్తి! పరదైవము!”

ఇట్లనుచు రయ్యామ తలంచుచునే యుండెను. అన్నమంత్రి యటనుండి నిర్బంధమునకు తీసికొనిపోబడెను.

అంతట రుద్రమ రాజమందిరమునకు గదలినది. రయ్యామ చిత్తరువులోని బొమ్మవలెనే కదలలేకపోయెను. రుద్రమయు తనవెంట నామెను రమ్మనకుండనే తన మనస్సులోని యాందోళనతో తాను కదలిపోయినది.

ఆనాటినుండి రయ్యామమనస్సు మనస్సులో లేదు. తనమనస్సులోని బాధ ఎవ్వరితో చెప్పుకొనగలదు? పురుషమూర్తియందు పురుషభావ మీనాడే తనకు మొదటిపర్యాయ ముదయించినది. అన్నమంత్రి దూరమైనదాది యాతనిరూప మామెకు నిత్యసన్నిహిత మయ్యెను.

ఆ మూర్తి తనయెదుట కూర్చుండి తన్ను కొంతవడి తీవ్రముగా చూచుచున్న ట్లుండును. కొంతవడి యాశ్చర్యముతో కొంతచులకనగా చూచిన ట్లుండును. ఆ

మూర్తి రొట్లు చూచినట్లున్నను. 'నీవు యువతివి! నీవు చిన్నదానవు!' అని మాటి మాటికి నిష్కర్ష చేసి చెప్పుచున్నట్లే యుండును.

రాత్రింబవళ్లు నన్నమంత్రిధీరమూర్తి యామెచిత్తమున హత్తుకొని విడువదయ్యెను. అదియు నామూర్తిని తన మనస్సున బారకుండ నుంచవలె నని యెట్టి ప్రయత్నమును జేయదు. ఆ మూర్తినే రుయ్యమ తన సర్వాంగముతో సర్వాత్మనా పొదివి ధ్యానింపసాగినది.

"అట్టి పురుషమూర్తిని మా యమ్మయే నిర్బంధమున కంపినది. అమ్మ నేమన గలను? ఆమె కెంత బాధ కలిగినదో! నాకుగూడ కలిగెడి బాధ యామెకు తెలియ జేసి అమ్మను మరింత వ్యథపెట్టరాదు. మరి ఎవరితో నాబాధ చెప్పికొందును?"

ఇట్లు కొన్నాళ్లు గడచిపోయినవి. రుయ్యమ తన మందిరమున నేకాంతముగా నొక గదిలో కూర్చుండి యేకశిలపై నానాడు శిలాప్రాకారనిర్మాణాదులవిషయమున జరిగిన చర్చలనే మననముచేయుచు మధ్యమధ్య అన్నమంత్రి యన్నమాటలు జ్ఞాపకము తెచ్చుకొనుచుండెను. ఆ సమయమున ఒక ప్రక్కనుండి శ్రావ్యమై కొందరు కంఠములు కలిపి వేదమంత్రములు పఠించుచున్న శబ్దము వినవైనది. ఆ నాదము ఆమె కొక అనిర్వాచ్యమగు మనశ్శాంతిని గలిగింపగా దానియందే తన చిత్తము లీన మొనర్చి వినుచున్నది. సంస్కృతకావ్యభాష యామెకు బాగుగా నలవడినది కాని వేదభాష రాదు. ఆ మంత్రము లాకారణమున నర్థమైన ట్లుండియు నామెకు సరిగా నర్థమగుట లేదు. ఐనను అర్థమైనభాగమును కానిభాగమునుగూడ ఆమెకు సమానముగనే హృదయావేగమును శాంతింపజేయుచుండెను.

కొంతవడికి వేదపాఠ మాగిపోయినది. రుయ్యమగుండె లే యాకస్మికముగా నాగిన ట్లయ్యెను!

అంతలో వేదమంత్రములే విద్యార్థికి పాఠము చెప్పుచున్నశబ్ద మావైపున నుండియే వచ్చుచుండెను. అధ్యాపకుడు మంత్రములో కొన్నిపదములు కలిపి యొక సారి పలుకును. అది వెంటనే విద్యార్థి రెండుమారు లుచ్చరించును. పిమ్మట గురువు పైభాగ మందుకొని ఒకమా రనును. అదియే విద్యార్థి రెండుమారు లనును. అట్లు మంత్రములో కొంతభాగ మైనపిమ్మట నదియంతయు కలిపి అధ్యాపకు డొకసారి చెప్పును. అదియంతయు కలిపి విద్యార్థి రెండుమారులు చెప్పును. ఆపిమ్మట మరల పైపదములు కొన్ని కలిపి గురువు పలుకుట, విద్యార్థి యవి రెండుమారులు తిరిగి పలుకుట—ఇదేవిధముగా పాఠము సాగిపోవుచుండెను. ఎవరో వేదవిద్యార్థి పాఠము చెప్పుకొనుచున్నాడని యాదరభావముతో రుయ్యమ యాపాఠ మాలకించుచుండెను.

వేదవిద్యార్థుల కంఠములలో సామాన్యముగా నొక యవ్యక్తమగు మాధుర్య ముండును. గురువుకంఠములో గాంభీర్య ముండును. అది వయస్సులోని భేదము. బాలురయు వయస్సుముదురని యువకులయు కంఠములు యువతుల కంఠములవలెనే హెచ్చుస్థాయిలో సులభముగా ప్రసరించును. అట్లు ప్రసరించు విద్యార్థికంఠమువలె

లేడీ చెప్పుకొను విద్యార్థికంఠము! స్వాధ్యాయము చెప్పుచున్న గురుని కంఠమువలెనే యీ విద్యార్థికంఠమును మంద్రగంభీరముగానుండి నిండుతనము గలిగి. పరిణతుడగు వాని కంఠధ్వనివలెనే వినవచ్చుచుండెను సింహగర్జనము రెండు గిరిగహ్వరములనుండి మారుమోగుచున్నట్లే ఉదాత్తతరమై యీ విద్యార్థికంఠము వినవచ్చుచున్నది.

అంతకు రుయ్యమ యాశ్చర్యపడుచుండునంతలోనను ఆ విద్యార్థికంఠము తాను మున్నెన్నడో విన్నదానివలె తోచెను. ఎక్కడ విన్నది? ఎక్కడ విన్నది? ఎప్పుడు?—అ పరమేశ్వరమూర్తిది కాదా ఇది?

అంతవరకు తాను విశ్రమించియుండిన యాసనమునుండి రుయ్యమ చివాలున లేచి గవాక్షమునొద్దకు బోయి యా స్వరమువచ్చుచున్న దిక్కుకు దృష్టి సారించెను. ఆమెకన్నులే పండినవి. ఆమెవీనులే ధన్యమైనవి.

అటు సమీపమున నున్న యుద్యానమున నొక మర్రిచెట్టునీడను అధ్యాపకుడు తూర్పుముఖముగా కూర్చుండి వేదపాఠము చెప్పుచుండెను. ఆ విద్యార్థి వినీతుడై ఉత్తరాభిముఖముగా బాసిపెట్టు వేసికొని కూర్చుండి రెండుచేతులు కట్టుకొని తన ముందు తదేకనిష్ఠుడై చూచుచు దేహము నిశ్చలముగా నుంచుకొని పాఠము నంత చెప్పుకొనుచుండెను. ఆ చెప్పుకొనుచున్న విద్యార్థి నిజముగా నన్నమంత్రీశ్వరుడే! అన్నమంత్రీశ్వరుడే! అతనికి గాక లోకమున మరొకరికి అంత శక్తి యుండునా? స్పష్టముగా నా మహానుభావుని కంఠమే యది! అనుమానము లేదు. అత డానాడు వేదవేదాంతచింతనమునకు నలుగురు వేదవిదులను పంపు మని యర్థించియుండెను గదా! ఇట్టి మహానుభావులు కారణజన్ములు! వారికి నిర్బంధ ముండునా? శ్రీదేవీభాగవతమున జీవన్ముక్తు డగు జనకమహారాజు శ్రీశుకుల కేమని నివేదించినాడు?

> 'బంధనము బంధన మటందు బ్రాహ్మణేంద్ర,
> యాత్మ బంధింప దరమె నిరంజనంబు?'

అన్నమంత్రి సరిగా రుయ్యమ కెదురుగనే తిరిగి కూర్చుండియుండెను. ఆ గవాక్షమునొద్ద నిలుచున్న రుయ్యమ్మ కదలలేకపోయినది. తదేకదృష్టితో నది యన్నమంత్రివంకనే చూడసాగినది.

రుయ్యమ్మ యాలోచించుకొనెను. తన హృదయములో పదిలము చేసికొన్న అన్నమంత్రీశ్వరుని మూర్తి యుజ్జ్వలముగా నున్నదా? ఆతని యీ ప్రత్యక్షమూర్తి యుజ్జ్వలముగా నున్నదా? సామాన్యముగా ప్రేమచే భక్తిచే మనము మన ప్రియులయు పూజ్యులయు మూర్తులు మనస్సులలో కల్పించుకొనునవి అట్టివారి ప్రత్యక్షమూర్తులకంటె నుత్తమములుగా నుండును. కాని రుయ్యమ పోల్చుకొనగా, తాను మనస్సులో కల్పించుకొనిన యా మంత్రిమూర్తికంటె ప్రత్యక్షమైన యాయనదివ్యమూర్తి ఉజ్జ్వలతరముగా నున్నట్లున్నది! ఈమహానుభావుడు మహామంత్రిపదవినుండి తొలగింపబడెను. పూజ్యురా లగు గౌరమ్మతల్లినుండి వేరుచేయబడినాడు. భర్తృరాం ద్రగు పతి లిద్దరకు దూరమయినాడు. ప్రాణపదయగు కుమారి బాలకు

గూఢ మానవులే చెప్పుదు. ఇట్టి కృష్ణ నిర్బంధములో నున్నను నాతని నిర్లిప్తభావ మేమి? వాస్తవముగా సన్న్యసించుటకు నీకెంత శ్రద్ధయుండెనో, అట్టి శ్రద్ధతో నా శిష్యుడు రాజ్యపాలనము చేయుటలో చూపుచున్నాడు. శ్రీకృష్ణుడు సాంకేతికముగ [illegible] ప్రసంగించి యుండెనా?

విశాలముగ నున్న గవాక్షము నుండి యామె తన చూపు నటునుండి మరల్పలేక పోయినది. అట కొంత దూరమునందే కూర్చుండియున్నాడు. తాను నిలిచియున్న గవాక్షము విశాలమైనది. అయినను అతడు నా వంక చూచుటలేదు. అంతఃపురమువైపునకు తలయెత్తి చూచుట యే లేదు. అందుచే నాతడెటువంక చూచెడు. పారమైన విస్మృతి యందు నాతడు తానున్న వైపు చూచుటయే లేదు.

అనాటనుండియు నప్రయత్నముగా రుయ్యమ యా గవాక్షమునొద్దకు బోయి అన్నమంత్రివర్యులు తరచుగా విలోకింపసాగినది. ఏపని చేయుచున్నను అన్నమంత్రి తన యాదాస్థకుండ నుండెనాయెడు: వేదవిదు లగు నా నలువురు బ్రాహ్మణుల తో నాతడు రాజ్యాంగమును గూర్చి కాలక్షేపము చేయును. కొంతతడవు వేదపాఠము చెప్పుకొని పిమ్మట నాతడు వేదాంతపాఠము నుపక్రమించును. వేదపాఠము చెప్పు నధ్యాపకుడొకడు, వేదాంతము చెప్పునది వేరొకరు. మధ్యాహ్నభోజన మైనంతట కొంతసేపు విశ్రమించి వేదశ్రవణముచేయుచు వేదమంత్రార్థము వినును. ఇది చెప్పునది మూడవయధ్యాపకుడు. నాల్గవ యధ్యాపకుడు శ్రౌతప్రయోగము చెప్పుచు దర్శపౌర్ణమాస్యలు ప్రారంభించెను. మేధావి యగు నా మంత్రీశ్వరున కొక్కమారు చెప్పినది మరచుటయున్నట్లు లేదు. అధ్యాపకులతో లేని సమయములం దల నాతడు చెప్పుకొన్న వేదపాఠము వల్లెవేయుచునో వేదాంతపాఠము చింతన చేయుచునో గడపుచుండెను. ఆ నలుగు రధ్యాపకులకును వేదవేదాంతవిద్యాసాధన తప్ప వేరుచింతలు లేనట్లే యుండెను. చూచుచున్న రుయ్యమ్మకు అక్కడ ఋషిపాశ్రమము వెలసినదా యనిపించుచుండెను.

మధ్యమధ్య వచ్చు ననధ్యయనదినములలో మాత్రము కొంచెము భేదము రుయ్యమ దృష్టిని పడకపోలేదు. ఆ దినముల వేదవేదాంతపాఠములు గాని దర్శపౌర్ణమాస్యల పాఠముగాని యుండవు. కొంతసేపు తక్కినరోజులలో చెప్పుకొనిన పాఠములు వల్లె వేసి చింతనచేయును. కాని యాదినములలో నాతనికి కొంత వ్యవధి చిక్కును. అట్టి సమయముల నాతడు తరచుగా నా చిన్నవనములో నిటు నటు పచారుచేయుచు ప్రొద్దుపుచ్చును. మధ్యమధ్య నత డేదో దీర్ఘముగా నాలోచించుచున్నాడా యని పించును. పాపము, పార్వతియు లకుమాంబయు నాతని మనస్సున బాధిరా యని రుయ్యమ తలంచును. కాక, బాలయే తలపునకు వచ్చినదా యని యనుమానించును. కాని యాతడుమాత్రము అంతఃపురమువంక తలయెత్తి చూడడు.

కాని యటువైపు తలయెత్తి చూడదగ దని యెంత యనుకొన్నను, తనవైపే గౌరవాదరములతో నొక సుకుమారకన్యక నిరంతరము చూచుచున్నచో, నది యాతని కెప్పటికిని తెలియకుండుట సాధ్యమగునా? రుయ్యమ్మ చూచుచుండగ పోయినను

రుయ్యమ్మ యాత్మయంతయు నన్నమంత్రిపైననే వ్రాలియుండ నాతని కది తెలియకుండు టెట్లు? భావములుకూడ స్పర్శకంటె నెక్కువ గట్టిగా స్పష్టముగా నవతలి వారిపైకి ప్రసరించి తాకి ఉత్పన్నముల నొనర్చును. చేతులతో చేయు స్పర్శకంటెను భావస్పర్శయే తీవ్రమైనది. గాఢమైనది, తీక్ష్ణమైనది, స్థూలశరీరమునకుకంటె సూక్ష్మశరీరమునకువ్యాప్తి యెక్కువగదా! సూక్ష్మమునకుకంటె కారణశరీరమునకు వ్యాప్తి విస్తారము; అది అనంతమే!

రుయ్యమ్మ స్థూలశరీరము దాని గదిలోని కిటికీవద్దనే నిలుచుండియున్నది. మరి దాని సూక్ష్మశరీరమే పోయెనో, కారణశరీరమే పోయెనో గాని, యది పరధ్యానముగా నున్న యన్నమంత్రీశ్వరుని గాఢముగా తట్టినట్లు స్పృశించినది. అతడప్రయత్నముగా తల యెత్తినాడు. రుయ్యమ్మ కనబడినది.

రుయ్యమ్మకు ఒక్కసారిగా సిగ్గువచ్చినది; భయము వేసినది. కాని చింతాపరుడైయున్నట్లున్న యన్నమంత్రీశ్వరుని దృష్టిపథములోనుండి యావలకు పోలేకపోయినది. అతని దృష్టి దాని రెండుకాళ్లను కదలకుండ బంధించినట్లయ్యెను. ఆమె కేమి చేయను తోపలేదు; రెండుచేతులు భక్తిభావములో జోడించి యాతనికి నమస్కరించినది. ఆమె కన్నీళ్లే ఏకధారగా కార్చినది.

అన్నమంత్రి యామెనమస్కృతిని చూచి తన దక్షిణహస్త మెత్తి యాశీర్వదించెను. పిమ్మట, దానికన్నీళ్లని కంచెవారమునుంచి కూడ కనబడినవేమో, అతడు తల వంచుకొని మరల చింతాపరు డయ్యెను. కొంతసేపటి కాతడు అవలికే పోయెను.

రుయ్యమ్మ తన ధైర్యమునకు తానే యాశ్చర్యపడెను. కాని తాను అన్నమంత్రికి నమస్కరించినందుకు తా నొక తప్పు చేసినా నను భావము దానికి కలుగలేదు. తా నందుచే ధన్యనైతి ననియే యది తలంచెను. తాను చేసినదానిలో ననుచితమే మున్నది? పూజ్యు డగు మంత్రీశ్వరు డతడు. తనకు పూర్వము ఏకశిల మంత్రాలోచనలో కొంత పరిచితు డైనవాడు. అట్టివాడు కనబడినపు డది నమస్కరింపక యెట్లుండగలదు? అనుచిత మేమియు లేదు. పైగా నమస్కరింపకుండుట యనుచితము! మరి తాను కన్నీళ్లు కార్చనేల? అవును. అంతటివాడు నిర్బంధములో నుండ చూచిన నెవరికి కన్నీరు రాదు?

ఆనా డాతడు తనవంక జూచెను. తన్ను ఆదరముతో దీవించెను. కాని మరునాడు మరల నట్లే యాతడు తనవంక కటాక్షించునా? రుయ్యమ గవాక్షముచెంత నుండి నిరీక్షించెను. మరల తన కెదురుగానే కూర్చుండి యన్నమంత్రి యధ్యయనము చేయుచుండెను. ఆ యోగీశ్వరుని కీనాడు రుయ్యమ్మ కనబడలేదు. మరునాడును నట్లే ఐనది. ఆ మరునాడును నట్లే ఐనది. తర్వాతినాడును అంతే!

మరల ననధ్యయనము వచ్చిననాడు గాని రుయ్యమ్మకు మరల నన్నమంత్రీశ్వరుని యాశీర్వచనభాగ్యము లభింపలేదు. ఈమా రనధ్యయనములు మూడు! చతుర్దశి, అమావాస్య, పాడ్యమి. అనధ్యయనములు మూడైనను ఒక్కనాడే ఆమె కాభాగ్యము!

ఉపహీనభావునికి లాభ్యము లేదు. తన భక్తికి తుష్టుడై తన్ను అస్వామిపన్నుడు అను గ్రహించుచున్నాడు! ఎల్ల కష్టములు గడచిపోయినవి!

ఈనాడు అనన్యగానము! ఈ ఉపవనమున జాగాగా అన్న మంత్రీశ్వరుడు ఆ వనములో సంచరించుచున్నాడు. చూడగానే ఆ డీనాడు చింత క్రాంతస్వాద యుడై భారముతో నున్నాడని రుయ్యమకు తోచినది. వెంటనే వీణ తీసికొన్నది. అప్రయత్నముగా నది విక్రమోర్వశీయనాటకమునుండి పూరోక్తశ్లోకము గానము చేసినది.

"దఇఆ రహిఓ అహిఅం దుహిఓ విరహాణుగఓ పరిమంథరఓ
గిరికాణణఏ కుసుముజ్జలఏ గఅ జూహవఈ ఉఅఅఘుణగఈ"

ఆపిమ్మట దీనముగా మరియు కొన్ని గీతములు పాడెను. తుదకు—

'త్వం జీవితం త్వమసి మే హృదయం ద్వితీయమ్
త్వం కౌముదీ నయనయో రమృతం త్వ మంగే—'

ఆ రెండుపాదములే మరలమరల పాడుచు నది వీణ వాయించుచుండెను. కిటికీ తెరచియే యున్నది. ఆవల వనములో అన్నమంత్రి దీర్ఘాలోచనతో బంధితుడైన సింహామువలెనే వడివడి నిటునటు తిరుగుచుండెను.

ఆ గదితలుపు రుయ్యమ్మ బంధించియుండలేదు. ఆ గదిలోని కెవ్వరును దాని యనుజ్ఞ లేనిది రారు. అయినను తానేమి తప్పుచేయుచున్నది, తలుపు బంధించుటకు? అందుచే నా గవాక్షమునొద్ద నది నిలుచుండువేళలగూడ ముందుగా నా గది తలుపు గడియవేయు నభ్యాసము లేదు. ఈనాడును తలుపు దగ్గరకు లాగియే యుండెనుగాని, గడియ వేసియుండలేదు.

అది యెంతసేపు పాడినదో! దాని కన్నులవెంట నేకధారగా నీరు కారుచున్నది! కంఠము గద్గద మగుచున్నది! నోట పాట యాడుటలేదు. నాలుక తిరుగక తడబడుచున్నది. తొడపైనుండి వీణ నేలకు జారిపోవుచున్నది.

*　　　　*　　　　*　　　　*

ఎప్పుడు రుద్రమ తలుపు త్రోసికొని వచ్చినదోగూడ రుయ్యమ గమనింపలేదు. రుద్రమకూడ మొందు తెలుపనిది యా లోపలి కెన్నడు రాదు. సరిగా రుయ్యమ్మ నోట పాట యాగిపోవుచున్న సమయమునందే రుద్రమ్మ యా పిల్లశిరస్సు తన యెడి లోనికి చేర్చికొని యాదరముతో నాలింగనము చేసికొనెను.

రుయ్యమ్మ మాట్లాడక యప్రయత్నముగా వెక్కివెక్కి యేడువసాగెను.

రుద్రమ్మ గదిలోనికి వచ్చుచుండగనే, ఆమెదృష్టి యావల వనములో చింతాక్రాంతుడై తిరుగుచున్న యన్నమంత్రిపై బడినది. పెరపు పెరసిన ట్లామెకు ఏకములై జరిగిన స్వప్నవిషయములు భాసించినవి. ఇన్నాళ్లు రుయ్యమచక్రవర్తిన

మునకు కారణమును, ఇప్పటివరకు నది పాడుచున్న పాటల యాథార్థ్యమును, ఈ పట్టరాని దుఃఖముస్వభావమును, రుద్రమ్మ కొక్కసారిగా తెలిసివచ్చినది.

"అమ్మాయీ, నిన్నెంత వ్యథపెట్టినానే, తల్లీ!" ఇట్లనుచున్న రుద్రమకే కన్నీటిబొట్లు విశాలనేత్రములలో మిలమిలలాడె.

"నీ వేమి చేసినా వమ్మా!" అనుచు మరల రుయ్యమ్మ వెక్కివెక్కి యేడువసాగినది.

ఆ తల్లికి బిడ్డకు ఎక్కువ సంభాషణ జరగలేదు. వారికి ఒండొరులను, ఒండొరుల భావములు ఒకరిమాపులతోడనే ఒకరికి, నోటితో చెప్పినకంటె స్పష్టముగా వ్యక్తము లయ్యెను. ఎన్నాళ్లు చెప్పికొనిన వారి హృదయాంతరభావములు వ్యక్తములగును?

కొంతతడవునకు రుద్రమ్మ లేచి సమీపమున గల భూర్జపత్రమును తూలికయు దీసికొని యం దిట్లు వ్రాసెను.

"మా ప్రియతనయ రుయ్యమ్మకు అనుగ్రహించిన యనుజ్ఞాపత్రిక."

నీ యిచ్ఛ వచ్చినప్పుడు ఈ పత్రిక గొని ఇంగులూరి అన్నమంత్రీశ్వరులకు సర్వస్వాతంత్ర్యము కలిగించి పూర్వపదవిలో ప్రతిష్ఠాపించుటకు ఇందుమూలముగా నీకు సర్వాధికారము నొసంగుచున్నాను.

(ముద్రిక) శ్రీ రుద్రదేవమహారాజా.

ఆ పత్ర మొకమారు చదువుకొని రుద్రమ్మ యది రుయ్యమ్మ కొసంగెను.

రుయ్యమ్మ కన్నీటిజాలంలలోనుండి యది చదువుకొని నిర్ఘాంతపోయి పత్రికను కన్నుల కద్దుకొనెను.

రుయ్యమ్మ: "అమ్మా!—"

రుద్రమ్మ: "ఏమే, తల్లీ?"

రుయ్యమ్మ: "న న్నిట్లు పరీక్షచేసెద వేమమ్మా?"

రుద్రమ్మ: "పరీక్ష యేమిటమ్మా?—నీకు అన్నమంత్రీశ్వరులు బంధవిముక్తులై పూర్వపదవిలో నుండుట సమ్మతము గాదటమ్మా?"

రుయ్యమ్మ: "మరి నీకో?"

రుద్రమ్మ: "నాకును సమ్మతమే! లేకున్న నీపత్రిక నీ కేల యిత్తును?"

రుయ్యమ్మ: "ఐతే ఈ భారము నాపై నేల పెట్టవలె?"

రుద్రమ్మ: "నీబాధ చూడలేక అది తీర్చుటకు ఈ యనుమతి యిచ్చినాను."

రుయ్యమ్మ: "ఈ యనుమతితో నా బాధ తీరునా?— నీకు బంధించుట యవసరమని తోచి బంధించినవారిని నేను విడిపించుచుదానసా, అమ్మా!"

రుద్రమ్మ: "నాకుమాత్ర మా మహానుభావుని బంధించుట సమ్మతమటమ్మా? నా పదవిచే నాచేతులు కట్టుబడినవి. అందుచే నీ కీయధికార మిచ్చితిని. ఇది శివాజ్ఞ యని నిశ్చయించియే చేసితిని."

రుయ్యమ్మ: "అమ్మా, నీ అనుగ్రహమునకు నేను ధన్యురాల నయితిని. అది శివేచ్ఛయు నగుగాక! అయినను అన్నమంత్రీశ్వరులపై గల సర్వసంశయములు తీరి పోవువరకు, నేనుకూడ నీపత్రము నుపయోగింప నిచ్చగింపను. నాపై నీ కున్న యనురాగముచే నిది యిచ్చినను, మన ప్రేమానుబంధములు రాజకార్యముల కడ్డురానిచ్చుటకు నేను సమ్మతింపను.

రుద్రమ్మ రుయ్యమను గాఢాలింగనమే చేసికొన్నది.

"నీవంటి తల్లిని ఎవరైనా కనియుండిరమ్మా? నిన్ను కూతు రనుచున్నందుకే నేను ధన్యురాలనే!"

రుయ్యమ్మ: "ఎంతమాటమ్మా! అన్నమంత్రీశ్వరులపై సందేహము కలిగించిన పత్రములు న న్నొకమారు పరిశీలింపనిత్తువా తల్లీ?"

రుద్రమ్మ: "అవశ్యముగా! ఇప్పుడే పంపు నేర్పాటు గావించెదను."

శాంతవడి వారు మౌనము వహించి యొకరినొకరు ప్రేమాతిశయముతో చూచుకొనుచుండిరి. రుద్రమ్మ ముందు మాట్లాడినది.

"అమ్మాయీ, అన్నమంత్రీశ్వరుల గృహమునకు బోయి వారి కుటుంబమును ఓదార్చిరావలె నని యున్నది. నీవు కూడ వత్తువా?—వారి పిల్ల బాల పుట్టినరోజు పండుగయట రేపు!"

రుయ్యమ్మ: "అవశ్యముగా!"

30

బ్బాల కారేండ్లు నిండినవి. ఏడవయేడు ప్రవేశించినది. ప్రతిసంవత్సరమును దాని పుట్టినరోజుపండుగ మహోత్సవముగా చేయు నలవాటు; ఈ సంవత్సరము పండుగ చేయుటా మానుటా యను శంక పార్వతికిని లకుమమ్మకును ముందు కలిగినది. గౌరీదేవిని వా రడిగిరి. ఆ తల్లి నిష్కర్ష చేసినది.

“మా తండ్రి అన్నయ్యకు ఇష్టమైన యీ యుత్సవము మాన వీలులేదు. వా డెక్కడ నున్నను వానికి భేదము లేదు. ఇంతకును మనకే అజ్ఞానముచేత భేదము!”

గౌరీదేవి యప్పుడే అక్కడికి వచ్చిన తిక్కనసోమయాజుల కీ విషయము చెప్పి, “పెద్దదానను, ఇందులో అవ్యక్త మేమైన నున్నదా?” యని ప్రశ్నించెను. సోమయాజులు పరమానందముతో నా మెనిశ్చయమును శ్లాఘించెను.

పూర్వ మేవిధముగా నా పండుగ చేయువారో ఇప్పుడును అదేవిధముగా నన్ని యేర్పాట్లును సాగినవి. పూర్వము ఎవ రెవరికి ఏఏవిధముగా పిలుపులు పంపుచుండిరో, అట్లే యీమారును పిలుపులు వెళ్లినవి. రాజమందిరమునకుగూడ యథాపూర్వముగా రెండురోజులుముందుగా లకుమమ్మ స్వయముగా వెళ్లి తగువారినందర నాహ్వానించి వచ్చినది.

అన్నమంత్రిదివాణమున పూర్వపు మర్యాద లన్నియు ఇన్నాళ్లును జరుగుచునేయుండెను. అన్నమంత్రీశ్వరుడు పట్టణము విడిచియున్నరోజులలో సమస్తము నెట్లుండెడిదో, ఇప్పు డట్లున్నది. వ్యవహారశాలలో మాత్ర మొక చిన్న మార్పు వచ్చినది. అక్కడ అన్నమంత్రిస్థానము శూన్యముగ నుండును. దాని సమీపమున తిక్కచమూపతి కూర్చుండి వ్యవహారములు చూచుచుండును.

అన్నమంత్రిదివాణమున నిత్యమును మ్రోయు మంగళతూర్యములే కాక ఈనాడు మరియు కొన్ని మంగళవాద్యములు మ్రోయుచున్నవి. రెండుగడియల ప్రొద్దెక్కినప్పటినుండియు సువాసిను లుకుమారికలు సర్వాలంకృతలై ఫలపుష్ప వస్త్రాభరణాది బహుమానములతో దివాణమునకు వచ్చుచున్నారు. పలువురు పల్లకులలో మేనాలలో వచ్చుచుండిరి. అవియు ముత్యాల పల్లకులు, రత్నాలపల్లకులు పచ్చలపల్లకులు! కొందరు కాలినడకనే వచ్చుచుండిరి. వచ్చినవారి నందరను అన్నమంత్రి రెండవభార్య లకుమమ్మ స్వయముగా నెదుర్కొని యాదరముతో లోనికి తీసికొనిపోవుచున్నది.

మరియు వేదవిదు లగు బ్రాహ్మణులు వందలకొలదియు నచ్చటి కాహూతులై వచ్చుచున్నారు. వారి నందరను గురునాథుడును, దెబ్బలబాధనుండి బాగుగా తేరుకొనిన మారనయు నెదురువోయి సగౌరవముగా లోనికి వెంటతీసికొని వెళ్లి యుచితస్థానముల గూర్చుండజేయుచున్నారు. ఆసభలో తిక్కనసోమయాజులు పవిత్రాసనమున నుపవిష్టులై యుండిరి.

శాంతసేపైనది. నగరమందలి ప్రధానులును దండనాథులును శ్రేణీపతులును బహువిధములగు వాహనములపై నక్కడికంత రాదొడగిరి. అన్నమంత్రి మేనమరది యగు పర్వతమల్లు వారి నందర యథోచితమర్యాదలతో లోనికి తీసికొనిపోవుచుండెను. రాజమహేంద్రపాలకు డగు నీపర్వతమల్లు ఈ యుత్సవమునిమిత్తము ప్రత్యేకముగా పిలిపింపబడెను.

ఈ మహోత్సవమునకై గృహోపవనభూమిమధ్యమున నొక విశాలమగు మండపము నిర్మించి దానిని తోరణములతో పల్లవములతో పుష్పములతో ఫలములతో పటములతో ధ్వజములతో నానావిధముల నలంకరించిరి. అందుకు మోహరివాడనుండి నూర్గురు కుట్రపుపనివారు నియుక్తులై వారముదినములుగా రాత్రింబవళ్లు విరామములేక పనిచేయుచుండిరి.

ఆ మండపశిరోభాగమున నొక యున్నతవేది కలదు. అందు మనోజ్ఞమగు పీఠమున చీనాంశుకమున వివిధవర్ణములతో ఉజ్జ్వలముగా బాలాయంత్రము లిఖింపబడియున్నది. దానివెనుక పంచలోహములతో నిర్మించిన ఆరేళ్ల బాలాకుమారివిగ్రహమును నిలిపిరి. వానిముందు సర్వాలంకృతయైన పార్వతీదేవి, అన్నమంత్రిజ్యేష్ఠపత్ని, ఉపవిష్టయై బాలాచక్రార్చనము చేయుచుండెను. ఆమెకు దక్షిణభాగమున వంశగురువగు పురోహితుడు అర్చనకలాపము నామెకు నందించుచు జరిపించుచుండెను. ఆ సమీపముననె బాల కూర్చుండి శ్రద్ధగా పూజ తిలకించుచున్నది.

బాల కానాడు అభ్యంగనము చేయించి దాని కురులు ధూపాదికములతో నార్చినను బాగుగా నారలేదు. అందుచే దానికి జడ వదులువదులుగా నల్లి పూలు పలుచనగా తురిమిరి. దాని పాపటలో చందురురేఖయు, చెవులకు పచ్చలపోగులును, ముక్కున కెంపుపొదిగి ముత్యము వ్రేలాడు బులాకియు, మెడలో సువర్ణరత్నహారమును దాని చివర వ్రేలుచు పచ్చలపదకమును, నడుముకు రవ్వలయొడ్డాణమును, చేతులకు కంకణములును, దండలకు పురులును అలంకరించిరి. దాని కాళ్లకు వెండి కడియములును హంసల అందెలును ఉన్నవి. దాని కటియందొక పట్టుపావడయు పైన నొక చొక్కాయియు ధరించి యాపై నద్దకముల జిలుగువస్త్రము ఉత్తరీయముగా వేసికొన్నది. పాదములకు పసుపులత్తుక లలదియున్నవి. ముఖమున కల్యాణపు తిలక మున్నది. కన్నుల కాటుకరేఖలు తీరియున్నవి. చేతులకును మెడను గందపు బొట్లున్నవి. దానిమ్మపూవువంటి దాని దేహకాంతి యాకాశవకాశముల నగుణ కిరణములు పరపుచున్నట్లు భావించుచున్నది. చూడగా ప్రత్యక్షముగా నవతరించిన బాలాదేవతయా యిది యనిపించుచు, చూపరను మంత్రముగ్ధుల గావించుచుండెను.

ఆ యుత్సవము చూడవచ్చిన స్త్రీపురుషులకును బాలబాలికలకును తామే కార్యమునకై యెక్కడ కూడితిమో విదితమే. వారెట్టి సడియు జేయుట లేదు. బాలాదేవతయా పీఠమున నావాహితయై యున్నదని వారందరెరుగుదురు. ఎదుట్టా పరదేవత నిలిచియున్నవిధముననె వారెల్లరు భక్తివినమ్రులై యుండిరి.

అన్నమంత్రిదివాణముతోరణము నెదుట రెండు పల్లకు లాగినవి! ముందున్నది ముత్యాల పల్లకి. అందుండి రుయ్యమ్మ సర్వభూషణవిభూషితయై నిత్యషోడశవార్షికయగు శ్రీదేవివలెనే యవతరించినది. ఆ వెనుక నున్నది బంగారు పొదిగిన పచ్చల పల్లకి. అందుండి రుద్రాంబయే దిగినది. శ్రీ రుద్రమదేవమహారాజు కాదా దిగినది! స్త్రీవేషమున నున్న రుద్రాంబయే ఈమె! పురుషవేషమున నున్నప్పుడీమెకు ఎంత వీరవిలాసమో, స్త్రీవేషమున నున్నయెడ నంత లాలిత్య మున్నది యీమెలో. ఈశ్వరునివలెనే స్త్రీపుంభేదములకు నతీతయగు నొక మహాశక్తియా యీమె!

బాల పుట్టినరోజు పండుగలకు రుద్రమ్మ వెళ్లుచుండు నాచారము కలదు!

అయితే యిప్పుడామెకు యౌవరాజ్యాభిషేక మైనది. అదియునుగాక అన్నమంత్రీశ్వరులయం దామె కిప్పుడనుగ్రహము తప్పియుండ నున్నదాయెను. రుద్రమ్మ యీనాడు వచ్చునని యెక్కడివారనుకొనలేదు. ఐనను వచ్చెనట నామెను యథార్థముగా గౌరవించుటకు సర్వసన్నాహములను చేసియుంచిరి. వారిని లకుమాంబ ఎదుర్కొని, లోనికి దీసికొనిపోయెను. వెంట వచ్చిన భటులను వాకిటనే యుంచి పర్వతనాయకునితోడను దాసీజనులతో మాత్రము రుయ్యమతో గలసి రుద్రమ లోనికి వచ్చెను. అంగరక్షకుడగు పర్వతనాయకునిగూడ మండపద్వారమునొద్ద నిలిపి వారాభ్యంతర మందిరములోని కేగిరి. రుద్రమకు రాచమర్యాద లన్నియు నడచినవి. ఆమెకు గౌరమ్మ ఎదుటబడినంతనే పూజ్యురాలగు నామెకు కుమారితయుబోలె నమస్కరింపగా నామె రుద్రమను దీవించెను.

“మహారాజు వైతివి నీవు వత్తువో రావో అనుకొంటి నమ్మా; వచ్చినను ఎట్లు వత్తువో అనుకొంటిని. ఎప్పటివలెనే వచ్చినావే! పరమానంద మైనదే, తల్లీ!—ఇట్టి దానికి శీఘ్రముగానే సర్వశత్రువులు వశు లయ్యెదరులే!—మరి యీ యమ్మాయి ఎవరు?”

ఇట్లనుచు గౌరమ రుయ్యమను నిర్దేశించెను.

రుద్రాంబ: “నా పుత్రిక రుయ్యమ్మ!—మిమ్ము నందర జూచిపోవుటకు వచ్చినది.”

రుయ్యమ్మ గౌరమ్మకు పాదాభివందనము చేసెను. ఆ వృద్ధురాలు ఈడు వచ్చిన యీ పిల్ల యింకను కన్యయే యని వెంటనే గమనించి “శీఘ్రమేవ కల్యాణప్రాప్తిరస్తు!” అని దీవించుచు, “సాక్షాత్తు శ్రీదేవివలె కళకళలాడుచున్నది యీ పిల్ల! నీ అల్లుడెవరో మహాఅదృష్టశాలి కావలె, తల్లీ” అనెను.

‘మా యల్లుని నిప్పుడే చూతువులే యమ్మా;’ యని రుద్రమ మౌనము దాల్చెను. అంతట పూజామండపమున వేదికసమీపమున దనకు ప్రత్యేకముగా నిర్దిష్టమయిన భద్రాసనమున రుద్రమ యుపవేశించెను. ఆమెసమీపముననే రుయ్యమయు నాసీన యయ్యెను.

రుద్రమ్మ యచ్చటికి వచ్చుటయు, ఆవేషమున వచ్చుటయు, నక్కడ కూడిన ప్రధానమంత్రి మండలమున కంతయు నాశ్చర్యమయ్యెను. వారిలో పలువురు ఈ ఉత్సవమున కీనాడు అన్నమంత్రియింటికి పోవుట మానవటా యని వితర్కించుకొని ఎట్లో సరిపెట్టుకొని వచ్చినవారే. రాజద్రోహిగా బంధితుడైనవానియింటికి రాజపురుషు లతిథులుగా పోవుట సమంజసమా? ఐనను అన్నమంత్రి బంధనములో కొన్ని చిత్రము లున్నవి. అతనియింటికొద్ద మంత్రిలాంఛనములు పోలేదు. అతనికి నిర్బంధములోగూడ వేదాధ్యయనమునకు సౌకర్యము లేర్పరుపబడినవి. కేవలము శిక్షితుడైనవానికి శిక్ష తీరనిది వేదాధ్యయనము నిషిద్ధముగదా! సంకేతములను బట్టి యన్నమంత్రిపై రాజానుగ్రహము తొలగియుండలే దని వారు తుదకు నిశ్చయించి యీ యుత్సవమునకు వచ్చియుండిరి. అందుచే రుద్రాంబ యీయపూర్వవేషముతో నచ్చటికి వచ్చుట వారి నందర దిగ్భ్రాంతులగా జేసెను. చిరుగాలి ప్రసరించినట్లు మండప మంతట గుసగుసలు ప్రసరించి యడగిపోయినవి.

అంతలో మేనా మోసికొని వచ్చు బోయీల మ్రోత వినిపించినది. అది యన్నమంత్రి తోరణముముం దాగినది. వచ్చినది స్త్రీజనమని లకుమమ్మయు, ఎవరో యని గురునాథమారనలును పర్వతమల్లును ఒక్కమారె ఎదురుపోయిరి. ఆ మేనాలో నుండి యన్నమంత్రీశ్వరుడే దిగెను.

ఎదురుపోయిన యీ నలువురును తెల్లపోయిరి. లకుమమ్మ మరుక్షణముననే తేరుకొని యాతనిపాదము లంటి నమస్కరించి ఆనందబాష్పములు కార్చుచూ పాదములు కడిగి యా మహాత్ముని పాదోదకము శిరస్సున జల్లుకొనెను. మారనకును గురునాథునకును ఏమిచేయవలెనో తోచలేదు. అన్నమంత్రియే వా రిరువురను తన రెండు పార్శ్వములకు బిలిచి, వారి కైదండతో నడచుచు, పర్వతమల్లుపై ప్రసన్నదృష్టి బరపుచు మండపము ప్రవేశించెను.

అన్నమంత్రి చూడగా నప్పుడే నగరాంతరము పనిమీదపోయి యింటికి తిరిగి వచ్చినవానివలెనే కనబడుచుండెను. ముఖమున నెట్టి దైన్యముగాని చింతగాని లేదు. కోప మసలే లేదు. అప్పుడే బంధవిముక్తుడైనవాని కుండు విస్రబ్ధభావమును ముఖమున నేమాత్రము దోచుట లేదు. మండపములో నున్న సదస్యులందరు తమ కన్నులు తాము నమ్మలేకపోయిరి. అతడు సరాసరి పూజావేదికయొద్దకు వచ్చి యావాహిత యగు పరదేవతకు నమస్కరించెను.

పూజ కావించుచున్న పార్వతీదేవి తన దృష్టిప్రసారముననే భర్తృపాదాభివందనము చేసెను. బాల పరుగెత్తుకొని వచ్చి తండ్రిపాదములు పట్టుకొని కాళ్లు చుట్టువేసికొన్నది. అన్నమంత్రియు దాని శిరస్సును చుబుకమును పుణుకుచు నాదరించి సౌమ్యముగా దానిని యథాస్థానమున గూర్చుండజేసెను. అంతట నాతడు స్వాతంత్ర్యముగా లోనికి బోయి తల్లికి పాదాభివందనము చేసి వెంటనే తిరిగి పూజామండపమునకు వచ్చి, తానును ఆయింటికి పిలువగా వచ్చిన యతిథివలెనే అందుపవిష్టు

డాయెను. అత డెవ్వరిని పలుకరింపలేదు. తల వంచుకొని ధ్యానవ్యగ్రుడై యుండెను.

అంతట నచ్చట కుమారీపూజ యను మహోత్సవము ప్రారంభించెను. ఈ పూజ సంవత్సరము దాటి పదిసంవత్సరములు దాటకున్న కన్యకలకు చేయుదురు. సంవత్సరము దాటనివారు పూజాదులవిశేష మేమాత్ర మెరుగరు గనుక పూజకు యోగ్యులు కారు. పదిసంవత్సరములు దాటిన కన్యలును ఈపూజకును అర్హులు కారని శాసింపబడినది. అందుచే నక్కడ చేరియున్న కన్యకలలో కుమారీపూజకు యోగ్యులైనవారి నందరిని ఆ విశాలవేదికపై నున్న ప్రత్యేకాసనములమీదికి రావించి బాలతోపాటు కూర్చుండజేసిరి. అంతట వారి నందరను నానావతారములు పొందిన పరదేవతనుగా భావించి, యమూల్యములగు బంగారుపట్టువస్త్రములతో నలంకరించి, పూజ లొనర్చి అమృతపాత్ర లిచ్చి నివేదించి, యథాశాస్త్రముగా పార్వతీదేవి స్వయముగా కుమారిపూజ నిర్వర్తించెను. ఆ కుమారీపూజ చూచుచున్న సదస్యులెల్లరు తాము ధన్యులమైతి మని వ్యగ్రచిత్తులై యామహోత్సవము తిలకించుచుండిరి.

కుమారికల నందరను పూజించినపిమ్మట వారిని యథాస్థానములకు బంపి యామెబాలాచక్రార్చనము పూర్తిచేయుచుండెను. అర్చనావసానమున పార్వతీదేవి పురోహితుని నిర్దేశమున అమృతపాత్ర ముందుగా అన్నమంత్రీశ్వరున కర్పించి పిమ్మట తాను గ్రహించెను. సదస్యుల కందరకు తీర్థప్రసాదములు పంచిపెట్టిరి భూసురు లందరు బహువిధముల నాశీర్వచనము లొనర్చిరి. వారు వేదమంత్రము లుచ్చరించుచుండ వారితో నన్నమంత్రీశ్వరుడును తన కంఠము కలిపి పార్వతీదేవిని బాలను ఆశీర్వదించెను.

నృత్యగీతాదిసమర్పణము వచ్చెను. ఆసమయమున మదాలస మాచల్దేవిసాయముతో పవిత్రమనోజ్ఞమగు విధముగా లలితోపాఖ్యానమునుండి కామసంజీవనము నభినయించి పరదేవత కర్పించెను.

ఆ మహోత్సవమున కానాడు రుద్రమ్మరాకయు అన్నమంత్రిరాకయు నపూర్వశోభ చేకూర్చెను. వచ్చిన యతిథుల కందరకు నాపూట మహావైభవముగా విందు జరిగెను. అన్నమంత్రి మహాభవనము అంతమంది యతిథుల నర్చించుటచే ధన్యమయినదని తలంచుచున్నట్లు కనిపించెను. అతిథులును పరదేవతాప్రసాదము తమ కానాడు ప్రాప్తించినందుచే కృతార్థుల మైతి మనుకొనిరి.

ఆనాడు బాలకు రుద్రమ్మ తెచ్చి యర్పించిన కట్నములు అమూల్యము లైనవి. మరియు నితరులు తెచ్చిన బహుమానములతో నన్నమంత్రీశ్వరుని గృహమంతయు బంగారు వెండి వస్త్రములతోడను అమూల్యాభరణములతోను నిండిపోయెను. ఆ సాయంత్రము ఉత్సవము పూర్తియగునప్పటికి అతిథుల కర్పించిన గౌరవపుకానుకలతో రెండింతలు బంగారు వెండి వస్త్రాదులు వెచ్చింపబడెను.

చిత్రముగా రుయ్యమ్మ యానా డాయింటిలోని పిల్లవలెనే కలసిపోయినది. అది చూచుచున్న అన్నమంత్రికి ఆశ్చర్యముతోపాటు చిత్రచిత్రమైన యూహలు హృదయములో నాట్యమాడజొచ్చెను. మారనపై బాలకు కలుగుచున్న అవ్యాజానురాగమును అన్నమంత్రిహృదయమునకు ఎక్కినది.

భోజనతాంబూలాదికము లైనంతట అతిథులలో పురుషులందరు నొక్కరొక్కరే బయలుదేరి తమతము నివాసముల కరిగిరి. స్త్రీలును కన్యకలును మాత్రము ఆసాయంత్రము పేరంటమునకై యందే నిలిచిపోయిరి. అట్లు నిలిచినవారిలో రుద్రమయు రుయ్యమయు గలరు.

ఆ నాడచ్చట నన్నమంత్రియు నతిథులలో నొకనివలెనే సంచరించెను. భోజనాదిక మైనపిమ్మట నతిథు లందరును బయలుదేరి వెళ్లుచుండగా వారితో నాతడును బయలుదేరెను. వెళ్లుటకుముందు అతడు లోపలికి పోయి సూక్ష్మముగా తల్లికి నమస్కరించెను. గౌరమ యాతని లేవదీసి కౌగిలించుకొని దీవించెను. ఆ సమయమున రుద్రమ్మ సమీపముననే యుండెను. తల్లియొద్దను రుద్రమహారాజులయొద్దను సెలవు తీసికొని, నమస్కరించిన పార్వతిని లకుమమ్మను దీవించి, బాలను ముద్దాడి, యన్నమంత్రి బయలుదేరెను.

బాల మనస్సు చిన్నపుచ్చుకొనకుండుటకును దానిని తండ్రి దీవించు నవకాశ మిచ్చుటకును ఆతనికి రుద్రమ స్వేచ్ఛానుజ్ఞాపత్రముతో మేనా యిచ్చి పంపియుండెను. దాని ననుసరించి యాత డీనా డిక్కడికి వచ్చియుండెను. ఇప్పుడు ఉత్సవము ఐపోయినది. తన కిక నిక్కడ పని లేదు. కాన మరల సిద్ధముగా నున్న మేనాపై ప్రత్యేకముగా తనకు నిర్ణీతమై యుండిన కారాగారమున కాతడు బయలుదేరి వెళ్లెను. ఇక్కడ నున్నంతసేపును అతడు చింతతో లేడు. ఉత్సాహముగనే యుండెను. ఇప్పుడు కారాగారమునకు తిరిగి వెళ్లునప్పుడును అతని కెట్టి చింతయు లేదు ఇక్కడ నున్నంతసేపును ఆతడు సామాన్యపుగౌరవప్రీతివచనములు తప్ప విశేష మెవరితోడను మాటాడలేదు.

వచ్చిన యతిథులకును అన్నమంత్రియింటిలోనివారికిని అదియొక యింద్రజాలముగనే తోచినది. నిజముగా నా వచ్చినది యన్నమంత్రీశ్వరు డేనా? అత డిన్నాళ్లకింటికి వచ్చియు పూజ్యురా లగు తల్లితో నేకాంతమున మాటాడలేదు. పత్నులతో మాటాడలేదు. బాలతోనైన నెక్కువ మాటాడలేదు. పర్వతమల్లుతో గాని యితర బంధువులతో గాని సంభాషింపలేదు. యజమాని యాదరించునట్లు అతిథులను గూడ పలుకరింపలేదు. తిక్కనసోమయాజులను గూడ ముక్తసరిగా తప్ప పలుకరింపలేదే! వచ్చినది నిజముగా నన్నమంత్రియేనా? ఇంద్రజాలమా?

ఇన్నాళ్లును అన్నమంత్రివ్యవహారకాలలో వ్యవహారములు చూచుచున్న తిక్కచమూపతికి మాత్రము ఏలనో ఆ నాడు మనశ్శాంతియే లేదు. వ్యవహారకాలలో

నతని కానాడు అందిన పత్రములు కలవరము కలిగించెను. దానికి తోడుగా మారన్న యా యింటికుమారునివలెనే ప్రవర్తించుచుండుట యాతనికి సంక్షోభమే కలిగించెను.

ఇప్పటికి పదియేండ్లక్రిందట తిక్కచమూపతియేకైకపుత్రుడు ఆరేండ్లవాడు, కనబడకుండ బోయెను. ఇప్పుడాతడు జీవించియున్నచో మారనయీడుండును! ఇంతవాడే యైయుండును! నాకా భాగ్యమేదీ?

ఆ నాడాతడు చూచిన పత్రములు అన్నమంత్రిపైనను మారనపైనను గూడ సందేహములు దృఢపరచునవే! ఏమి చేయగలడు? ఆ రాత్రి రుద్రమ నిజభవనమునకు చేరినపిమ్మట, తిక్కచమూపతి రాజసేవకు బయల్దేఱి యా పత్రములన్నియు రుద్రదేవ మహారాజులకు నివేదించెను.

ఇట్లు సాహసించి త్రిపురాంతకుడాకస్మికముగా మోటుపల్లి పట్టుకొనినంతనే, నెల్లూర నున్న జటావర్మసుందరపాండ్యునకును గోదావరి దరియుచున్న కొప్పెరంజిగనికిని ఆశ్చర్యమయ్యెను. ఒకరివార్త లొకరికి ఇన్నాళ్లు నిరంతరముగా వచ్చుచున్న విప్పుడు నెమ్మది నెమ్మదిగా రాకుండ బంధించిపోవుచుండెను. దానితో వారిరువురకు సమగ్రముగా సంప్రదించుకొనునవకాశము లేకుండ తప్పిపోయినది.

ఈ విధముగా శత్రువులకు చిక్కాకు కలిగించినను, త్రిపురాంతకునకు గాని జన్నిగదేవునకు గాని మనస్స్వాస్థ్యము కలుగలేదు. వారిరువుర చుట్టును శత్రువుల మండలములే కలవు. అటు నెల్లూరునుండి సుందరపాండ్యుడెత్తి రావచ్చును. ఇటు గోదావరీతీరము పరిచుచున్న కొప్పెరుంజింగని సేనలు వెనుదిరిగి రావచ్చును. ఉత్తరమున మోసలపట్టణము రేవు కొప్పెరుంజింగని సేనల యధీనమున నున్నది. దక్షిణమున నెల్లూరుసమీపమున కృష్ణాపట్టణము రేవు సుందరపాండ్యుని స్వాధీనమున నున్నది. ఇట్లు రెండువైపులనుండి నౌకాసైన్యములును కాడవపాండ్యసేనలును ఒక్కసారిగా మోటుపల్లిపై విజృంభించిన త్రిపురాంతకుడు నిలువలేడు; జన్నిగదేవుని సేనలును ఆ నాలుగు సేనాప్రవాహములను అరికట్టి నిలువలేవు. అదియును గాక గొంటూరుమాండలికుడగు నాగదేవుడును, ధనదుప్రోలులోని చోడపతియు కొణిదెన చోళులును—అందరును శత్రుపక్షములోనివారుగనే ఉండిరి. వీనియన్నిటికి తోడుగా ఈశాన్యమునుండి కాళింగసేనలు కొలని రుద్రుని ధిక్కరించి రావచ్చును. అందుచే త్రిపురాంతకుడును జన్నిగయు ప్రమాదావస్థలో నున్నారు.

ఈ స్థితిగతులు వారిద్దరు పరికించినారు. కాని వారిద్దరికిని గుండెనిబ్బర మెక్కువ. జన్నిగదేవుడు తన మూలబలమును వినుకొండలో నుంచి, శీఘ్రగాములగు నాశ్విక దళములను ఉత్తరమున గొంటూరుమండలముపైకిని కొణిదెనపైకిని, దక్షిణమున కనిగిరి కందుకూరులపైకిని పంపుచు నిరంతరసంచాలనము చేయించుచుండెను. అందుచే నెవరికిని అతనియొద్ద నెంతబల మున్నదో నిశ్చయింపరాకుండెను. అతనిసేనలకు శత్రుసేనల బలాబలములు ఈ దళములద్వారా తెలియవచ్చుచుండెను.

త్రిపురాంతకుడు అద్దంకిమీదుగా వినుకొండతో తనకు సంబంధము తెగిపోకుండుటకు సమస్తప్రయత్నములు చేయుచు, ఆమార్గమున నున్న కోటలను పట్టణములను సేన లుంచి, గోడలు కట్టించియు, కందకములు త్రవ్వించియు బలపరచుచుండెను. మరియు తన చేజిక్కిన మోటుపల్లి నౌకలను యుద్ధమునకు ఆయితము చేయించి వానిని నావికులతోడను ధనుర్ధరులతోడను పూరించి వీలుచిక్కినప్పుడు గోదావరిసేనలతో కలసి మోసలపట్టణము రేవు పట్టుకొనుట కాంక్షించుచుండెను.

కాని ఆ సోదరు లిద్దఱును వారి ప్రాణము లరచేతులలో బిగబట్టుకొని మేక పోతుగాంభీర్యముతోడనే చరించుచుండిరి.

ఆ సమయమున సరిగా ఓరుగల్లునుండి రెండుమహాసేనలు బయలుదేరి శీఘ్ర ప్రయాణముల సాగుచున్న వను వార్త జన్నిగకు తెలిసినది. ఆ మహావాహినులలో నొకటి యంబదేవుని యాధిపత్యమున తమ సహాయమునకే వచ్చుచున్నది జన్నిగ యీవార్త వెంటనే త్రిపురాంతకున కెఱిగించి సేనాచలనమునకు నిశ్చయించెను. ఆ చలనము శీఘ్రముగా చేయవలెను! కాని ఎటు పోవలెను?

ముందు నెల్లూరుపై బడిన లాభము లేదు. అక్కడ నున్న సుందరపాండ్యసేనలు బలవత్తర మైనవి. అదియును దూరము. అటు తాను ప్రయాణము సాగించినచో తన్ను ఎలయించుటకు పాండ్యసేనలు కొంచెము వెనుదీసినను ఎన్నాళ్లకో గాని యది తేలదు.

అందుచే రాజ్యమధ్యమునకు చొచ్చుకొని వచ్చిన కొప్పెరుంజింగని ముందు సాధింపవలెను. ఇది సుఖతరము. అత్యావసరము! రాజ్యగర్భములో ప్రవేశించిన శత్రువు నచ్చట దీర్ఘకాల ముండనిచ్చుట క్షేమము కాదు. మరియు వసిష్ఠగోదావరి నాతని దాటనిచ్చి, సప్తగోదావరముల మధ్య చేరనిచ్చిన నాతనికి స్థైర్యము చేకూరును. గోదావరిపాయలు దాటి యాతని నిర్జించుట కష్టము. అతనికి అహారపదార్థములు బయటినుండి రాకుండ నరికట్టినను, సస్యశ్యామలమైన ఫల[illegible]మగు నాప్రదేశమున నాతనికి అహారపదార్థములును సులభముగా లభ్యములగును. బంగారువంటి యచ్చటి క్షేత్రములు ఈ పల్లవసింహమునలజడి కాగలేవు! కావున ముందు కొప్పెరుంజింగనివైపుకే తన మూలబలము మరల్ప జన్నిగ నిశ్చయించెను.

తన యుద్ధయాత్రకు అవసరమైన ప్రయత్నములన్నియు నతడు ముందుగా పూర్తి కావించెను. దాని నడకకు, తిథులతో సహా, చలన కార్యక్రమము నిర్ధారణచేసెను. ఇవి యన్నియు త్రిపురాంతకునకును వచ్చుచున్న అంబదేవునకును ముందుగ రహస్యముగా శీఘ్రగాములగు దూతలచే తెలియజేసి వారి సమ్మతి పొందెను. దక్షిణమునుండి పాండ్యసేన లొకవేళ కదలివచ్చినచో, వానిని ఎట్లెదుర్కొనవలెనో, ఎక్కడ నెదుర్కొనవలెనోకూడ, ముందుగా నిర్ధరించి తమ్ముడగు నంబదేవునకు తన శాసనము తెలియజేసెను.

శీఘ్రముగా తాను గోదావరి దరియుటకు కొణిదెనగొంటూరులమీదుగా సీతానగరము చేరి కృష్ణ నుత్తరించి బెజవాడ చేరుకొనవలెను. కాని యా రెండు మండలములును శత్రువులచేతులలో నున్నవి. అందుచే నించుక దూరపుమార్గమైనను, పల్నాడుమీదుగా నమరావతి చేరి, యక్కడ కృష్ణ నుత్తరించి యాత్ర సాగింప నాతడు నిశ్చయించెను. ఈ దారిన బోయినచో నతని సేనలకు వామపార్శ్వమున నెట్టి భయము నుండదు. కాని కుడివైపున కొణిదెన చోళులును గొంటూరు నాగదేవుని మూకలును గలవు. వానివలన తన సేనాచలనములకు కొంత యాటంకము కలుగ

వచ్చును. అందుచే నాతడు తనసేనలో చిన్నభాగములు రెండు వేరుచేసి, యందులో నొకటి కొణిదెనపైకిని, రెండవది గొంటూరుపైకిని పంపెను. ఆ సేనలు కొణిదెనగాని గొంటూరుగాని పట్టప్రవేశించినవి కావు. అక్కడిసేనలు జన్నిగవూలబలములపై రాకుండ నరికట్టుటకు ఉద్దేశింపబడినవే. ఈ జాగ్రత్తతో జన్నిగదేవుడు తన మహాసేన కదలించెను.

అంబదేవుని సేన తన్ను కలియకముందే ఇట్లు యాత్రసాగింప జన్నిగదేవుడు సాహసించుటకు మరియొక ధైర్యకారణమును చేకూరియున్నది. ఆవల కొలని రుద్రుడు అప్పటికి కొలనువీడు దుర్భేద్యముగా దృఢపరచి, తన మహాసేనతో నిడుదవోలుమీదుగా రాజమహేంద్రవరము చేర, యక్కడినుండి సాహసించి పీఠికాపురము ప్రవేశించి యచ్చట విడిసెను. తాను వచ్చినదారిని నూతన సైన్యము లాయత్తము లొనర్చి, దుర్గములు సర్వసంపన్నములు చేసి, అప్రమత్తులగు వాహినీపతుల నాయాయెడల స్థాపించి, కొప్పెరుంజింగ ఇటువైపుకు కదలకుండునట్లు బలపరచెను. ఆతని ప్రయత్నములు సఫలమగుటవలననే కొప్పెరుంజింగని సేన లెంతకును తమ నౌకలను దూరమున సముద్రములో దాచుకొనుచు, తీరమువెంట ఈశాన్యాభిముఖముగా సాగుచుండెను.

ఇట్లు మార్గము నిష్కంటక మొనర్చి కొలనిరుద్రుడు పీఠికాపురము చేరి కళింగ సేనలు దండెత్తినచో నెదుర్కొనుటకు సిద్ధపడుచుండెను. అందుచే ప్రస్తుతము కాకతీయుల కోరంగిరేవు సురక్షితమయ్యెను. కాని రుద్రుని సేనలపై నొక్కసారిగా కళింగసేనలును కాడవసేనలును రెండువైపులనుండి వచ్చి పడినచో నిలువలేవు. ముందు నిర్ధరించినప్రకారముగా నాతనికి అన్నమంత్రీశ్వరునిప్రాపు రావలసియుండెను. కాని యది రాలేదు. పైపెచ్చు ఆతడు నిర్బంధములో నున్న వార్తయు కొలనిరుద్రునికి చేరెను.

ఏందువల్ల అన్నమంత్రిని బంధించినారు? రాజద్రోహు లాతనిపై కొండెములు చెప్పియుందురు. దోషము లంటని యా మహానుభావునిపై వేసిన దోషములు ఎన్నాళ్లు నిలుచును? కాని యది తనపైగూడ ప్రసరించునా? అందుచే దనకు రావలసిన సహాయసేనలు రాకుండబోవునా? ఏమైన నేమి? ముందుగా నిర్ణీతమైన కార్యక్రమ మనుసరించి తాను తనవిధి నిర్వర్తింపవలెను! అట్లునిశ్చయించి యాతడు తన విధి నిర్వహించెను.

ఇట్లుండ మోటుపల్లి త్రిపురాంతకుని స్వాధీనమగుటయు, ఓరుగల్లునుండి రెండు మహాసేనలు బయలుదేరుటయు నాతనికి తెలియవచ్చెను. అందులో ఆదిదమ్మ యధీనమున పాఖాలనుండి కదలిన సేన తన సహాయమునకే వచ్చుచున్నది. భేద మొక్కటే! పరమేశ్వరమూర్తి యగు అన్నమంత్రీశ్వరుడు ఆ సేనవెంట వచ్చుచుండ లేదు. అతని స్థానమున ఆదిదమ్మ వచ్చుచున్నాడు. అతడును మంచివాడే, సమర్థుడే! కాని అన్నమంత్రీశ్వరునకు త్రిభువనములలో ఎవ రీడు?

ఆదిదమ్మ వచ్చుచున్న వార్తతో కొలనిరుద్రుని మనస్సునకు నెమ్మది కలిగినది. వెంటనే యాతడు కోరంగి వెళ్లి యక్కడి కాకతీయనావాధ్యక్షుని గలసికొని యవసరము లగు సర్వసన్నాహములు చేయ నుత్తరువు లిచ్చెను. ఆ నావాధ్యక్షుడు ముఖ్యముగా సముద్రము మీదినుండి కొప్పెరుంజింగనికి కాళింగుల సహాయముగాని పాండ్యులసహాయముగాని రాకుండ నరికట్టుచుండవలెను.

ఈ యేర్పాట్లు చేసి రుద్రుడు తిరిగి పిఠాపురమువచ్చి ఆదిదమ్మసేనల రాకకై నిరీక్షించుచుండెను. ఆ సేనలు వచ్చినవెంటనే ఆతని స్వాధీనమున పిఠాపురప్రాంత ముంచి యవసరమైన సేనలతో సాగి తాను కాళింగసేనల నెదుర్కొనుటకు కొలని రుద్రుడు నిశ్చయించెను.



౩౧

భారతఖండముమీదికి పలుమారులు విదేశీయులు దండయాత్రలు సలిపిరి. ఆ వచ్చిన వారు విదేశీయులే గాక విజాతీయులును విగ్రహద్వేష్యులును! అట్లగుటచే భరతభూమిలోని జనమందరును వారికొక్కటియే: తురీయాశ్రమము లేమి, వానప్రస్థు లేమి, రోగులేమి, విద్వాంసులేమి, తస్కరులేమి, ధనవంతులేమి, పేదవారలేమి, పెద్దలేమి, పిన్నలేమి — అందరు నొక్కటియే! భరతభూమిలోని జనమును తమ కత్తుల కెరచేయుట వారి కొక యాట. పిల్లలు గండుచీమలను పట్టుకొని నలిపివేయుదురు; తూనీగల రెండురెక్కలు పట్టుకొని తోకకు దారములు కట్టి ఎగురవేయుదురు; పక్షులు చెట్లపై గూళ్లలో పెట్టిన గ్రుడ్లను, వదలిపోయిన చిన్నపిల్లలను అపహరించి, పెద్దపక్షులు వచ్చి యవి చూచుకొని ఆ చెట్టుచుట్టును అల్లాడుచు ఎగురుచుండగా చూచి ఆనందముతో గంతులు వేయుచు, ఆ యల్లాడు పక్షులపై రాళ్లు రువ్వుచుందురు. సరిగా నట్లే, విదేశములనుండి వచ్చిన శత్రువులకు ఈ దేశప్రజలను బాధించుటకూడ నొక క్రీడయే!

కాని భరతఖండములో నొక రాజు మరియొక రాజుపై దండెత్తిపోయినప్పుడు అట్లు కాదు. ఈ దండయాత్రలు రాజులకును రాజులకును సంబంధించినవియే; యుద్ధము చేయుట ఎదుర్కొనిన సేనలతోడనే! ప్రజలతో విరోధము లేదు. మహాయుద్ధము జరుగుచున్నచోటికి సమీపప్రదేశములనే కృషీవలులు శాంతముగా తమ పొలములు దున్నుకొనుచునో, అందు విత్తులు చల్లుకొనుచునో, అందుండి నూర్చిన పంట తెచ్చుకొనుచునో శాంతముగా నుందురు; వివాహములు జరుగుచుండును; ఋజ్వలు నిరాటంకముగా తమ చేయుయజ్ఞములు కొనసాగించుకొనుచుందురు.

అంతే కాదు: యాత్రచేయు మహాసేనలతోకూడ పండితులు కవులు గాయకులు నటులు విదూషకులు బహువిధవినోదకులు కలసి నడచుచుందురు. వారికిని ఆ సేన నడచుచున్న యాయాప్రదేశములనున్న విద్వాంసులతోడను వినోదకులతోడను చర్చలు, గోష్ఠులు, వివాదములు ప్రవర్తమానము లగును. వారును ఎవరి కున్న అధికారముకొలది వారా సేనాజనము నాకర్షించి బహుమానము లందుచుందురు. ఈ విధముగా సేనాచలనమూలమున నొక ప్రాంతమందలి కవినటగాయకాదు లితరప్రాంతములలోని రీతులు అనుకరించుట అభ్యసించుట సాధ్యపడుచుండెను. ఈవిధముగా వివిధప్రాంతీయసంస్కృతులకు ఏకభావము సమకూరుచుండెను. మధ్య మధ్య వారిలో వారికి స్పర్ధలు పెరుగును. సభలు జరుగును. విద్యాప్రదర్శనమొనర్చి మెప్పించి గెలిచినవారు జయపత్రము లందుటయు కద్దు.

అందును క్రొప్పెరుంజింగని యాంధ్రదేశదండయాత్ర విశిష్టమైనది. అతనిలో చిత్రముగా రెండువిరుద్ధప్రకృతులు మిశ్రమైయున్నవి. అతని సైనికులు బహు

క్రూరులు. అతడు వారు చేయు ఘాతుకకృత్యములు వారింపడు. అయినను అతడు మాత్రము బహుసౌమ్యుడు; సరసుడు; దయాస్వభావము కలవాడు; లలితకళలందు విశేషాదరము కలవాడు. ఇంతియ కాదు. అతడు స్వయముగా కర్మిష్ఠి. అందుచే నాతడు సాగ్నికుడై దండయాత్రలకు వెళ్లుచుండువాడు. ఆ యగ్నితర్పణమునకును, మధ్య మధ్య వచ్చు నైమిత్తికములకును, శాంతిపౌష్టికాదికములకును, పురోహితులును పలువురు ఋత్విక్కులును ఆ సేనవెంట నేగుచుండువారు. మఱియు నాతడు స్వయముగా విద్వాంసుడు. అతడు 'ఖడ్గమల్లుడే' కాక 'భరతమల్లుడు' కూడను! 'నిశ్శంకమల్లుడే' కాక 'సాహిత్యరత్నాకరుడు' కూడను. అతనికి విశేషముగా నాటకములం దభిమానము. 'నాటకాంతం సాహిత్య' మందురు గదా! అతనివెంట నెల్లప్పుడును 'యక్షగాన'విశారదు లగు కర్ణాటకులయు, 'తెరుకూత్తు' నేర్చిన తమిళులయు, సంస్కృతనాటకప్రయోగకుశలులగు కేరళులయు నట్యబృందములు వచ్చుచుండెడివి. పర్వసమయములందును వేడుక కలిగినప్పుడును అతడు వారి నాటకములు ప్రదర్శింప జేసి తన సామంతమంత్రిదండనాథులతో కలసి చూచుచుండువాడు. వానిని చూచుటకు ఆయా ప్రదేశములం దున్న విద్వాంసులను రసికులనుగూడ నాహ్వానించుచుండువాడు. మధురమైన పదార్థము ఒంటరిగా భుజింపకూడదుగదా!

ఆంధ్రదేశప్రజలకు కన్నడభాషలో నున్న 'యక్షగాన'ములును తమిళములో నున్న 'తెరుకూత్తు'లును బాగుగా నర్థము కావుగనుక అవి వారి కంత నచ్చవు. అందుచే ఆ ప్రదర్శనములకు ఇతరుల నెక్కువ యాహ్వానించువాడు కాదు. కాని కేరళబ్రాహ్మణులు ప్రదర్శించు సంస్కృతనాటకములు తిలకించుటకుమాత్రము విరివిగా ఆంధ్రదేశమందలి కవులను పండితులను అత డాహ్వానించుచుండెను. తెలుగు దేశములో ప్రవేశించినప్పటినుండియు ఈ సంస్కృతనాటకప్రదర్శనములే ఎక్కువ చేయింపసాగెను.

అందుచే నిప్పుడు తిరువనంతపురమునుండి వచ్చి తన్నాశ్రయించి వచ్చుచున్న మళయాళబ్రాహ్మణనటబృందమునకు పని ఎక్కువ పడినది. వారు ప్రదర్శించు సంస్కృతనాటకముల కర్త ఎవరో ఎవరికిని తెలియదు. కర్త యొకడో పలువురో కూడ తెలియదు. ఆ నాటకములలో కొన్ని పెద్దవి, కొన్ని మిక్కిలి చిన్నవి. సమయానుకూలముగా ఉన్న వ్యవధినిబట్టి యందులో నేదే నొకటి ప్రదర్శింప ననువుగా నుండెను. వాని భరతవాక్యము లన్నింట రాజసింహు డను బిరుదనామము గల రాజాభివృద్ధిని ఆశించుచుండును.

"హన్త సర్వే ప్రపన్నాః స్మః ప్రవృద్ధకులసంగ్రహాః,
ఇమా మపి మహీం కృత్స్నాం రాజసింహః ప్రశాస్తు నః!"

ఇత్యాదివిధముగా నవి యుండును. కొప్పెరుంజింగడుకూడ రాజసింహబిరుదాంకితుడే కదా! తన ప్రతాపనామమున కర్థము పెద్దరాజసింహు డనియే కదా!

ఈ కారణముచే నా నాటకముల సంపదతనికి విశేషపక్షపాతము కలదు. అదియుగాక ఆ నాటకములును ప్రాచీనములైనవి. అందలి కవిత్వము ఆర్షవాక్కులకు దగ్గరగా నుండును. రంగస్థలమున ప్రదర్శించుట కవి యెంతయు తగియుండి సామాజికుల కానందము కలిగించును. అందులో 'అభిషేకము', 'ప్రతిమ' ఇత్యాదులు రామాయణ కథానాటకములు. 'పంచరాత్రము' 'మధ్యమవ్యాయోగము,' 'కర్ణభారము,' 'దూతవాక్యము', 'దూతఘటోత్కచము' 'ఊరుభంగము'!—ఇత్యాదులు భారత కథానాటకములు. ఈ నాటకములు దక్షిణదేశమునందెల్లెడ వ్యాప్తిలో నుండి పండిత పామరులకు ఆదరపాత్రములుగా నుండెను. అందుచే నీ నాటకప్రదర్శనము లాతడు సగర్వముగా తిలకించువాడు; ప్రదర్శనాంతమున వానినిగూర్చి యాహూతులైన పండితులను ప్రశ్నించుచుండువాడు. వారు నాటకమును తత్ప్రదర్శనమును పొగడినచో నాతడు పొంగుచుండును.

అయితే ఆంధ్రదేశము ప్రవేశించినదాదిగా నాతని యనుభవము విచిత్రముగా నుండెను. అది యాతని కాశ్చర్యము కలిగించినది. ఆ సంస్కృతనాటకచక్ర మిక్కడి విద్వజ్జనమునకు అభిమానపాత్ర మగుటలేదు. ఆ నాటకములలో బహువిషయముల లక్షణవిరుద్ధాంశములు కలవు. భాషలో అపాణినీయప్రయోగములు అనేకములు కలవు. అది తనకును తెలియును. ద్రావిడపండితులకును ఎరుకయే. ఐనను అవి తనకును తా నెరిగిన ద్రావిడవిద్వాంసులకును రసభంగము కలిగించుటకు మారుగా, ఒక యపూర్వమగు రుచియే కలిగించుచుండెను. నిత్యకర్మ లొనరించు వారికి జాతాశౌచము వచ్చినప్పుడు తత్కర్మలనుండి విశ్రాంతి కలిగి వారిలో నలసులగు కర్మిష్ఠులకు కలుగు సుఖమువంటి సుఖమది. ధర్మిష్ఠుడు స్వల్పవిషయములలో మధ్య మధ్య ధర్మాతిక్రమణము చేయుటవలెనే అంత గర్హ్యముగా నవి కనపడియుండలేదు. పైపెచ్చు ఆదర్శపాత్రము లగుచుండెను.

కాని యీ యాంధ్రదేశములో నట్లు కాదు! వారి దృష్టి యా దోషముల పైననే ప్రసరింపసాగినది. వారు దోషైకదృక్కులా? కారే! అందులో వారికి మోమోటము లేదు. మహారాజు లన్న వారికి భయము లేదు. రాజాస్థానములలో వారి కట్టి గౌరవము లుండెను. వారి ప్రవృత్తులు కూడ నంత పూజార్హములు!

కాప్పెరుంజింగడు పూర్వము నెల్లూర విజయాభిషేకము చేయించుకొనెను. ఆ సమయమున కేరళనటబృందమువారు కాప్పెరుంజింగని యాస్థానమున నతనితో వచ్చిన కవిపండితులయు, నెల్లూరుప్రాంతములనుండి యాహూతులై వచ్చిన కవిపండితఋత్విక్కులయు సమక్షమున రంగనాయకస్వామియాలయప్రాంగణమున 'అభిషేక'నాటకము ప్రదర్శించుచుండిరి.

ప్రథమాంకము పూర్తికాబోవుచుండెను. వాని కోరికపై ఆచమనార్థము హనుమంతుడు నిష్క్రమించి జలము గొని తెచ్చెను. వెంటనే సామాజికులలో నాంధ్రపండితులు ఆశ్చర్యపడుచు లేచి సభలో నిలుచుండి యుపహాస్యము వ్యక్త మొనర్చిరి.

ఆవెంటనే వాలిమరణము రంగముపై ప్రదర్శింపబడెను. గంగాదిసప్తపుణ్యానదులను అక్కడ ఆవాహనచేసినను వారికి తృప్తికలిగింపలేదు. అది చూచి ఒక్కక్షణమైనను అక్కడ నిలువక ఒక్కుమ్మడిగా హాహాకారములు చేయుచు నా యాంధ్ర పండితులు సభనుండి వెడలిపోయిరి.

అది చూచిన కొప్పెరుంజింగనికి రోషావేశము కలిగినది. ఆ లేచిపోవుచున్న పండితమూర్తుల నతడు తిలకించెను. వారు అగ్నులవలె తేజోమూర్తులు; నిర్భయులు. వారి స్ఫూర్తులు చూచి యతఁడేమియు ననలేకపోయెను. తాను 'సాహిత్యరత్నాకరుఁ'డను బిరుదము ధరించెనే! లక్షణవిరుద్ధాంశము ప్రదర్శింపబడినప్పుడు పండితులు ఏవగించుకొన్న తా నేమనగలడు!

ఆంధ్రదేశమునం దెచ్చటనైనను లక్షణభ్రంశము కలిగినయెడల నిటువంటి సంఘటనలే సంభవించుచువచ్చెను. రంగస్థలముపై యుద్ధము చూపినచోట్లను, క్రీడానిద్రాదులు ప్రదర్శించినపుడును, ఆంధ్రసామాజికులలో నిట్టే కలవరము బయలుదేరుచుండెను. చెరుకూరులో నిత్యాగ్నిహోత్రులను వేయిబ్రాహ్మణకుటుంబము లుండెను. అందులో వేదవేదాంగవిదులు బహుశతములుగా నుండిరి. ఆనాటిసభ దేవేంద్రసభవలెనే శోభాయమానముగా నుండెను. ఆ నాటకములో అపాణినీయ ప్రయోగములు వచ్చినవి. అవి విన్నప్పుడెల్ల ఆ యూరిపండితులు చెవులు మూసికొని యావలికి వెళ్ళి యాచమనము చేసి వచ్చిరి. కొప్పెరుంజింగ డేమియు ననలేకపోయెను.

కృష్ణానది నుత్తరింపబోవుచు కొప్పెరుంజింగడు కొల్లూరులో విడిసెను. అంతమంది పండితప్రకాండు లున్న గ్రామము కృష్ణాతీరమున లేదు. అక్కడ కేరళనటులు ప్రతిమానాటకము ప్రదర్శించిరి. కొప్పెరుంజింగని యాహ్వాన మంగీకరించి యా యగ్రహారమునందలి పండితులా నాటకము చూడ వచ్చిరి. ముందు సూత్రధార ప్రవేశమునకే వారించుక యాక్షేపించిరి. స్థాపన పూర్తియైనది. అందులో నాటక ప్రస్తావములలో నుండునట్లు కవిపేరు లేదు. 'ఇతడు అనామకుడా?' అని పరిహాసము వచ్చునట్లు హేళనగా నచ్చటివారు ప్రశ్నించిరి. ఆ పిమ్మట రామాయణ కథాసందర్భమునంతగా మార్పుచేసి ప్రదర్శించుట యా పండితులకు రుచింపలేదు. 'రామకథ ఇంత మార్పు చేసియుండుటచే ఈ కవి స్వనామగోపనము చేసికొన్నట్లున్నాడు!' అనివేసిరి.

కొప్పెరుంజింగనికి కోపము వచ్చినది. 'ఆంధ్రులు శుష్కమీమాంసకులు!' అని సభలో నాతడని వెకిలిగా నవ్వెను.

కొల్లూరులో నీ యనుభవమైనతర్వాత కొంతకాలముపాటు అతడు సంస్కృత నాటకప్రదర్శనమునే చాలించెను. ప్రదర్శింపజేసినను ఆంధ్రపండితుల నందు కాహ్వానించుట మానుకొనెను.

ఇప్పు డాతడు గోదావరీతీరము సమీపించుచున్నాడు. ఇక్కడ వేదవిదులు శాస్త్రకోవిదులు సరసులు మహాకవులు సహస్రాధికముగా నున్నారని యాతడు విని యుండెను. మరల సంస్కృతనాటక మొకటి యీ ప్రాంతముల ప్రదర్శింపజేసి, తన నాటకసమాజమువారు ఇక్కడి పండితులమెప్పు పొందవలె నని యత డెంతేనియు గాంక్షించెను. "పెన్నాతీరవాసులకు కొంచెము ఎక్కువ! కృష్ణాతీరపండితులకు తలలలో కృష్ణస్మృతిక పాతుకొనిపోయినది! ఈ సప్తగోదావరపవిత్రతీరమునందలి పండితు లట్లు కారు! ఈ బారి కావేరీవారివలెనే పద్ధమైనది. ఈ నీరు త్రాగువారు రసజ్ఞులు. ఇక్కడి పండితుల మెప్పుతో, నా భరతమల్ల సాహిత్యరత్నాకరబిరుదములు స్థిరపరచుకొనవలెను"—ఈవిధముగా నాతనికి ఉబలాటము అతిశయించినది.

పుష్యమాసప్రవేశమునకు అతడు గోదావరిశాఖలలో నొకటియగు వసిష్ఠయొద్దకు చేరుకొనెను. అప్పటికే త్రిపురాంతకుడు మోటుపల్లి పట్టుకొనిన వార్త యాతనికి తెలిసినది. కొలనిరుద్రుడు పిఠాపురమున విడిసిన వార్తయు తెలిసినది. ఇప్పుడు జన్నిగదేవుని సేనలు కదలుచున్న వార్తయు తెలిసినది. కాని యాతడు బహుధైర్యశాలి. అతనికి తన సేనపై నచంచలమగు విశ్వాసము కలదు. పైగా తనకు తోడుగా నెల్లూర సుందరపాండ్యుని సేనలును, ఉత్తరమున కళింగసేనలును కలవు; వాని కన్నిటికి తోడుగా చోళనాకాబలము లున్నవి. ఇవి యేవియు లేకున్నను, తా నొక్కడే ఒకవంక జన్నిగను రెండవవంక కొలనిరుద్రుని ప్రతిఘటింపగలడు. ఆంధ్రసేనలన్న నొక లెక్క కాదు. తాను ముందు ఆంధ్రదేశపండితులను నిర్జింపవలెను. ఈ గోదావరీతీరవాసు లగు పండితులకు తన యాస్థానవిద్వదతిశయము ప్రదర్శించి తన మహిమ ప్రకటింపవలెను. అప్పుడుగాని తన విజయయాత్ర సార్థకము కాదు!

అతడు వైకుంఠైకాదశి నరసాపురములో గడపదలచెను. అందు కాతడు ముందుగనే తన యాస్థానపండితులందరను ఆనాటి సభకు జాగరూకులుగా నుండ నాజ్ఞాపించెను. ఆ ముక్కోటిఏకాదశినాటిరాత్రి కేరళనటబృందమును 'ఊరుభంగ' నాటకము ప్రదర్శింప సిద్ధముగా నుండబంచెను.

ఆ నా డాత డుపవసించి పూజాదులతో గడపును. ఆ రాత్రికి నాటకప్రదర్శనము జరుగును. మరునాడు ద్వాదశిపారణచేసి, మహాసభ చేసి విద్వాంసుల మహాదాశీర్వచనము పొంది, వారిని వైభవముగా సత్కరించి తాను గోదావరి నుత్తరింప బ్రారంభించును. అందుకై యా చుట్టుపట్టుల నున్న వేదవిదులను పండితులను కవులను అందరను దశమినాటికే తన స్కంధావారమునకు రావలసిన దని యాహ్వానము లంపెను.

ఆ యాహ్వానములును చిత్ర మైనవి. అందులో గౌరవము కలదు. కాని వాని ననుసరించి పోకున్నచో శిక్షించునేమో యను భయముకూడ నందరకును కలదు. ఈ

కొప్పెరుంజింగడు రావణాసురునివంటివా డని ప్రథ యొకటి ప్రాకిపోయెను. అందుచేతనే ప్రతినాయకుల గుణాతిశయములు వర్ణనము చేయు నాటకము లాతని కభిమానములట-యను వాడుకయు వారిలో ప్రబలినది. ఏమైనను అతడు పండితపక్షపాతి! పండితుల నాతడు సన్మానించినట్లు ఇంకొకడు చేయలేడు. కాని కోపము వచ్చినచో నత డేమిచేయునో !—రావణాసురుడు !

భయమున నేమి, భక్తిచే నేమి, గోదావరీతీరమున గల వేదవిదులు, పండితులు, కవులు దశమినాటి సాయంత్రమునకే నరసాపురముసమీపమున కొప్పెరుంజింగని స్కంధావారమునకు చేరుకొనిరి. తణుకు, ఆచంట, పాలకొల్లు, ఆకివీడు, భీమవరము —ఇత్యాదిప్రదేశములనుండి పండితు లనేకులు వచ్చిరి.

ఆ వచ్చినవారిలో వెద్రిరాలను నగ్రహారమున కగ్రణి యగు కేశన యను ఛాందసకవియు నొకడు !

వైకుంఠైకాదశినాడు పూజాదికదీక్షలు నిర్వర్తించి, మరునాడు మహాసభ చేసి కోప్పెరుంజింగడు పశ్చిమగోదావరి నుత్తరింప నిశ్చయించియుండెనుగదా! తానొకటి తలచిన దైవము నదే యెల్లప్పుడును తలచునా?

పుష్యశుద్ధదశమినాటికే అతని వాహినులు మొగలితుర్రు కీవల నున్న స్కంధావారములనుండి కదలి గోదావరీతీరము చేరుకొని నది నుత్తరించుటకు సర్వసన్నాహములు చేయ నాయితమగుచుండుటకు నిర్ణీతమయినది. అందుకుగాను వారమురోజుల నుండియు ముందుగా చుట్టుపట్టుల నన్ని రేవులనుండి దొరకిన పడవ లన్నిటిని బలవంతముగా సేకరించి యావలియొడ్డున నిలుపసాగిరి.

ఇట్లుండ నవమినాటిసాయంత్రమునకే జన్నిగమహావాహిని సమీపించుచున్నదని కోప్పెరుంజింగని శిబిరమునకు శీఘ్రవార్తాహరులు వార్తలు తెచ్చిరి. ఆపైని గంటగంటకు కాకతీయాశ్వికదళముల యలజడి ఎక్కువ కాజొచ్చెను. ఇది తన్ను పశ్చిమగోదావరితరింపకుండ నాటంకపరచుటకుమాత్ర ముద్దేశింపబడినదా? లేక యీ జన్నిగదేవుడు మహాయుద్ధము చేయుటకే సంకల్పించినాడా? అతని కింత సాహస ముండునా? ఏమైన నేమి? జన్నిగను శిక్షింపకుండ పశ్చిమగోదావరి నుత్తరించుటకు కోప్పెరుంజింగడు ఇచ్ఛగింపలేదు. ఒకవేళ నట్లు చేయ నిచ్ఛగించినను అది సాధ్యపడదు. జన్నిగ మహాయుద్ధమున కుపక్రమింపక దోబూచులాడుచు కాలయాపన చేయ యత్నించినను తానే తన సేనలతో నాతడు జన్నిగను తాక నిశ్చయించెను. అదియు శీఘ్రముగా జరిగిపోవలెను. ఈప్రయత్న మంతటిలోనను తాను ముందు చేయ సంకల్పించిన వైకుంఠైకాదశీవ్రతోత్సవముల కాటంక ముండగూడదు. వీలైనచో ద్వాదశిపారణమైనవెంటనే మహాసభ చేసి మొదల ననుకొన్నట్లు తాను గోదావరి నుత్తరింపవలెను. అది తన మహత్త్వమును ప్రకటించును.

ఇట్లాతడు నిశ్చయించుచుండునంతలోననె ఆ నవమినాటిరాత్రికే మరియొక వార్తయు నాతనికి చేరెను. అతని ప్రధానసేనలు ఎక్కువగా మొగలితుర్రు సమీపమున గలవు; అతనితోపాటు సమీపమున సముద్రముపై చోలనౌకాబలముకూడ సాగుచున్నదిగదా! ఆ నౌకలు చిన్న చిన్న కూటములుగా నేర్పడి సముద్రమున ముందును వెనుకను ఆవలను రక్షణకై తిరుగుచుండెను. ఆ నావల కన్నిటికి దూరమున క్రొత్త నావలు కొనవచ్చినవి. మొగలితుర్రువాడరేవును మూడువైపులను ఆ మహానావలు క్రమ్ముకొనుచున్నట్లున్నవి. అట్లు దూరమున కనబడిననావలు వర్తకులవగుటకు వీలులేదు. అన్ని నౌకాకూటములును తమకు నావ లెన్నో కనబడిన వని వార్తలు తెచ్చి

నవి. అందుచే నవి యుద్ధకాంక్షతో వచ్చిన కాకతీయసేవలే యైయుండవలెను. ఈవార్త యానాటి యర్ధరాత్రమునకు స్థిరపడెను.

అటు సముద్రముమీదను ఇటు భూమిమీదను ఒకే సమయమున తానిప్పుడు రణమునకు సంసిద్ధుడు కావలె నని కొప్పెరుంజింగనికి స్పష్టపడినది. అతని సేనలు ఉభయత్ర సుశిక్షితములే! కాపున్న చోళనావాబలముల నెల్లప్పుడు నమ్మి యుండరాదు.

ఇంతవరకు గోదావరీతరణమునకై సర్వసన్నాహములు జరిగియుండెను. అందుచే శిబిరములోని సామగ్రి చాలభాగము కట్టివేయబడి బండ్ల కెత్తుటకు సిద్ధముగా నుండియుండెను. శత్రుభూభాగమున మహాసైన్య మొకటి మహానదీతరణము చేయుట సులభసాధ్యమా? స్వల్పసేనమాత్రమే అవసరమైన చిన్న పోరులకు సిద్ధముగా నున్నది. మిగిలినదంతయు ప్రయాణసన్నాహముతో నున్నది.

నవమియపరరాత్రమున నాకస్మికముగా కొప్పెరుంజింగడు తన వాహినీపతుల నందర బిలిపించి యాంతరంగికసభ చేసెను. దానికి చోళనౌకాధిపతులును వచ్చిరి. అందరు నాలోచించిరి ప్రయాణప్రయత్నములు వెంటనే నిలిపివేసి మహాయుద్ధమునకు శీఘ్రగతి సర్వసేనల నాయితముచేయ నిశ్చయమైనది.

శత్రుబలములను తృణీకరింపరాదు. అందును జన్నిగదేవుడు సామాన్యుడు కాడు. అతని నెదిరించుటకు జంకరాదు; అప్రమత్తులమై యుండనురాదు. తెలుగు తీరభూమిపై దండు సాగించినప్పటినుండియు ఎప్పుడో ఒకమారు మహాయుద్ధము తప్పదని కొప్పెరుంజింగనికి మొదటినుండియు తెలియును. కాని యాతడు చేతనైనంతవరకు నాంధ్రభూభాగమున చొచ్చుకొనిపోయినపిమ్మటగాని, యట్టి మహాయుద్ధము చేయ నెంచలేదు. అందుచే నింతవరకు నతడెట్టి చిల్లరయుద్ధములను చిక్కుకొనకుండ, ఆటంకములేని మార్గముల సాగిపోవుచుండెను. దక్షారామభీమేశ్వరుడాతని ప్రధానగమ్యస్థానము. అనాదిగా చాళుక్యప్రభువుల కులదైవ మాతడు! చాళుక్యులనాటినుండి వచ్చిన పూజ్యత కాకతీయులకాలమునగూడ నాదైవతమునకు పోలేదు. అందుచే ఆంధ్రభూమిపై దండెత్తిన కాళింగులు కాని చోళులు గాని పల్లవులు గాని తమ దృష్టిని దక్షారామముపై ముందుగా నిలుపుచుండువారు.

దాక్షారామ మిప్పుడు చేరువయైనది. సప్తగోదావరము దాటినచో దాక్షారామము చేరినట్లే! గోదావరీమహానదియే యడ్డు! ఇంతవరకు తన సేన కెట్టి తీవ్ర ప్రతిఘటనయు లేనందున నాతని కాడవసేనలకు కాకతీయబలములపై నిర్లక్ష్యభావ మేర్పడినది. అట్టి భావము సైనికుల కుత్సాహము కలిగించుటకు ఉపయోగపడునుగాని దానిలో ప్రమాద మున్నది. కొప్పెరుంజింగడు తనసేనాపతులకు సర్వము వివరించెను. ఇప్పుడు మహాయుద్ధము తటస్థించినది. తమ సేనల యతిశయము ప్రదర్శింపవలసిన తరుణ మిదియే!

చిత్రముగా తెల్లవారునప్పటికే కొప్పెరుంజింగని సేన ప్రయాణసన్నాహములు కట్టిపెట్టి యుద్ధమునకు సిద్ధమగుచుండెను. తూర్యారవములు మనోజ్ఞభయంకరముగా మొరయసాగినవి. సైనికులు దళాధిపతులు ధ్వజము లాకాశము నిండున ట్లెగుర వేసిరి. ఖడ్గములు, శూలములు, పరిఘములు, గదలు, ధనుర్బాణములు కట్టాయిత మొనర్చిరి. ఆ కాడవసేనలలో ఏనుగులు తక్కువ, అశ్వము లెక్కువ. ఉన్న యా కొద్దిపాటి గజములను దళమునకును దళమునకును మధ్యమధ్య యుద్ధసన్నద్ధములుగా తీర్చిరి. పోరుకు సిద్ధమై దళములుగా నున్న యాశ్వికసైనికులే కాక సేనారక్షణకును వార్తాహరణమునకును ఆశ్వికులే యెల్లెడ సంచరించుచుండిరి. ఇట్లు దశమినాటి మధ్యాహ్నమునకే కొప్పెరుంజింగని సేనలు యుద్ధమునకు సిద్ధమయ్యెను.

ఆ మహారాజసింహుడు అన్ని యాజ్ఞలును తన సేనాపతులకు ముందుగనే ఇచ్చియుంచెను. ఇక నాతడు తన శిబిరమున నేకాంతముగా నుండవచ్చును; శాంతముగా తాను సంకల్పించినట్లుగా నేకాదశీవ్రతము పూర్తిచేసికొనవచ్చును. ఇంతమంది గోదావరీతీరపండితులను పిలిపించి, యిప్పుడు యుద్ధము వచ్చిన దని వారిని పొమ్మనునా? ఇక్కడి పండితులకు తనతో వచ్చిన పండితుల యతిశయము చూపవలెనని గదా యాతని యుత్సాహము! 'విద్వానేవ విజానాతి విద్వజ్జనపరిశ్రమమ్!' తన కెంత యదృష్టము! తన సేనలు కాకతీయసేనాబలములను భూమిమీదను సముద్రము మీదను ఎదిరించి నిర్జించుసమయముననే సరిగా, తాను పండితసభ చేసి, యాంధ్రపండితవరేణ్యులకు తన ప్రతిభను ప్రదర్శించు నవకాశము చేకూరినది. యుద్ధములో విజయమునకుకంటెను కూడ ఆంధ్రపండితమహాజయమునకై యా కొప్పెరుంజింగడు పసివానివలెనే ఉబలాటపడుచుండెను!

౩౪

అంబదేవుడు మహాసేనతో వచ్చుచున్నాడను నిశ్చయవార్త తెలియగనే జన్నిగ తన మహాసేనతో కొప్పెరుంజింగని వెంటనంటి యాతడు గోదావరి దాటక మున్న తలపడవలె నని బయలుదేరెను గదా! అత డనుకొన్నట్లు పల్నాడుమీదుగా సులభముగా నమరావతియొద్ద కృష్ణానది నాతని సేన యుత్తరించెను. అక్కడ నతని సేనలో నొక పెద్దభాగము నాతడు మోసలపురముపై కంపి మిగిలినసేనతో కొప్పెరుంజింగనివెంట సాగెను. అట్లాతడు తన సేనను విభజించుటలో గజఘటల నెక్కువ భాగము తనతోడనే యుంచుకొనెను. నదీతీరముల జరుగు యుద్ధములలో గజఘట లెక్కువ యుపకరించును. అదియును గాక ఆంధ్రసేనలో కెల్ల బలిష్ఠమగు నంగమే గజబలము! రుద్రదేవుని కాలముననూ, గణపతిదేవుల కాలముననూ, కాకతిప్రభువుల గజబలములే సందిగ్ధసమయములలో వారికి విజయములు సమకూర్చియుండెను. అందుచే నాంధ్రప్రభువులు గజసేనలు వృద్ధిచేయుచు, వానివిషయమున విశేషశ్రద్ధ తీసికొనుచుండిరి. ఆంధ్రసేనలలోనే గజఘట లెక్కువ. ఆ బలమును జన్నిగదేవుడును ఆంధ్రసైనికాచారప్రకారము సుశిక్షితముగా నుంచి, సర్వబలములకును బలముగను, రక్షగను, సహాయముగను ఉండునట్లు ఏర్పాట్లు చేసెను.

అతడు గోదావరీతీరము దరియునప్పటికి అతనితో నరువదివేలసైన్యమే కలదు. కొప్పెరుంజింగని సేన లన్నియు గలసి పదునెనిమిదిలక్ష లుండు నను ప్రవాదము ప్రబలియుండెను; కాని నిజముగా నాతని భూసేనలో యుద్ధము చేయు యోధులు లక్షవరకుమాత్రమే యుండవచ్చు నని యాతనికి విశ్వాసపాత్రమగు వార్తలు వచ్చియుండెను. జన్నిగ బయలువెడలునప్పుడు కొప్పెరుంజింగని సేనలు దోపిడిమూక లనియే యాతడు తలచిన మాట నిజము. కాని తర్వాత వచ్చిన వార్తలవలన నవి యట్లు కాక సుశిక్షితము లని రూఢి యైనది. అందుచే నాతనికి జాగరూకత ఎక్కువయ్యెను. సరిగా నది దాటుప్రయత్నములో నున్నప్పుడే కాడవసేనలను తాను తాక నిశ్చయించి నదియు నందువల్లనే! నదీసంతరణప్రయత్నములో నున్న సేనలు యుద్ధసన్నద్ధములుగా నుండవు. అట్టి సమయమున సులభముగా వానిని కలవరపరచవచ్చును. ఎక్కువ సేన లున్న కొప్పెరుంజింగని సేనలలో కొన్ని యుద్ధమునకు సన్నద్ధము కాలేవు. ఈవిధముగా చేసిన తన సేనలు సంఖ్యాబలమున తక్కువైనను ప్రయోగబలమున దీసిపోవు. అదియుగాక, తన గజఘటలను సక్రమముగా ప్రయోగించినచో తాను జయింపగలడు!

ఏమైనను, బలవంతుడైన శత్రువుతో, తక్కువ సంఖ్యగల సేనలతో, నాతడు తలపడ నుంకించుట సాహసమే! కాని జన్నిగమాత్రము 'బ్రహ్మరాక్షస' బిరుదధారులైనవారి వంశములోనివాడేగదా!

ఈ ప్రయత్నమునకుతోడు, జన్నిగ తన జయమునకు, అనుకూలపడుటకు ఇతర సన్నాహము లెన్నియో చేయబంచియుండెను! ఆసమయమునకే యావల మోసల పట్టణమును, తాను పంపిన సేన భూమార్గముననూ, తన సోదరుడగు త్రిపురాంతకుడు మోటుపల్లి నుండి ప్రచండనౌకాబలముతో దాని వాడరేవును రోధించును.

మరియును ఆసమయముననే, కొప్పెరుంజింగనివెంట వచ్చుచున్న సముద్ర నౌకాబలమును కోరంగిరేవునుండి బలీయములగు కాకతీయనౌకాబలములు తాకును. కోరంగినౌకలు పెద్దవియు బలిష్ఠములైనవియు; చోళనౌకలు చిన్నవియు చురుకైనవియు! కోరంగినౌకలు సంఖ్యలో తక్కువ; చోళనౌకల సంఖ్య యధికము. అందుచే చోళనౌకలు గెలువలేనిచో తేలికగా పారిపోగలవు. ఆంధ్రనౌకలు గెలిచిన గెలువవలెను; లేనిచో పారిపోలేవు. అందుచే నవి యెట్లైనను సాహసించి గెలువనేవలెను.

ఇవి యన్నియు గాక, అతడు ముందుగనే తాను కొప్పెరుంజింగనితో తలపడ నిశ్చయించినరోజు నిర్ధారణచేసి యప్పటికైనను కొన్ని యాశ్వికదళములను వసిష్ఠ గోదావరిపడమటియొడ్డునకు పంపవలసిన దని యంబదేవునకును ఆదిదమ్మళునకును వార్త లంపియుండెను. అట్లే కొలనిరుద్రునికి వసిష్ఠగోదావరియావలితీరమున దూరముగా కొన్నిసేనలను సిద్ధముచేసి యుంచగోరెను. మరియు రాజమహేంద్రవరము నుండి గోదావరిమీదుగా ఐదువందల నదీతరణులు ధనుర్ధరులగు నారువేల సైనికులతో నరసాపురప్రాంతమున కా సమయమునకే వచ్చునట్లు ఏర్పాటు జరిగియుండెను.

ఈవిధముగా కొప్పెరుంజింగని సేనలను దిగ్బంధముచేసి సర్వనాశనము చేయవలె నని యాంధ్రసేనాను లూహించిరి. ఎన్ని సన్నాహములు చేసినను, సర్వమును కాడవమూలబలమును జన్నిగసేనలు నిర్జించుటపై నాధారపడియున్నది. అది తాను సాధింపజాలనిచో మిగిలిన ప్రయత్నము లన్నియు వృథ కాగలవు. అది జన్నిగ మనస్సున దృఢముగా నాటినది. అత డందుచే మిక్కిలి యప్రమత్తుడై ప్రతిచిన్న విషయమునుగూడ ముందుగనే యాలోచించి నిర్ధరించియుంచెను.

కొప్పెరుంజింగని సేనలు మొగలితుర్రునకును నరసాపురమునకును మధ్య స్కంధావారములలో నున్నవి. పుష్యశుద్ధనవమినాటి సాయంకాలమునకే ఆ సేనల పశ్చిమభాగమునకు జన్నిగ సేనలతో చేరుకొనెను. కాని యాతడు వెంటనే కాడవ సేనలతో తలపడదలపలేదు. దశమినాడు తన సేనల కాతడు పూర్తిగా విశ్రాంతి యీదలచెను. అవి దీర్ఘప్రయాణములతో నలసియున్నవి. మహాయుద్ధమునకు ముందు ఒక్కరోజు విశ్రాంతి యొసగినచో సైనికులకు నూతనశక్తి యుదయించును. కాని తా నానాడు సైనికులకు విశ్రాంతి యీదలచినవానివలె శత్రువులకు తోపనీయరాదు. అందుకై యాతడు కొన్ని యశ్వసైన్యముల కదలికలతో నవమినాటి రాత్రియు దశమినాడెల్లను శత్రుసేనల నలజడి చేయించుచునేయుండెను. కొప్పెరుంజింగని సేనలును యుద్ధమున కానాడు సర్వసిద్ధముగా లేవు.

వైకుంఠైకాదశి వచ్చినది! ఇంకను సూర్యోదయమున కైదుగడియల వ్యవధి యున్నది. సరిగా పవిత్రతమమగు బ్రాహ్మముహూర్తము! జన్నిగస్కంధావారమున గడియారమున ఇరువదియైదు ఘంటలు మ్రోగినవి. పూర్వనిర్ణీతవిధమున సేనలు యథాస్థానముల నిలిచినవి. అర్ధచంద్రవ్యూహమున నా సేన లున్నవి. రెండు శృంగములను బలిష్ఠములగు నాశ్వికదళములు కలవు. వెన్నుదన్ని యాంధ్రధానుష్క

ఉన్నారు. సేనలకెల్ల మధ్యభాగమున ముందుప్రక్కను పర్వతపంక్తివలెనే గజఘటలు పన్నియున్నవి. ప్రతిఏనుగుపైనను పలువురు ధనుర్ధరులు కలరు. ఒక గజమునకును ఒక గజమునకును మధ్య వాని రక్షకై శూలఖడ్గాద్యాయుధధారులగు యోధులు బారులు తీరి యున్నారు.

జన్నిగ తన పటకుటీరమునకు ప్రధానదండనాథులను పిలిపించెను. అచ్చట నంతకుమున్న జన్నిగగురువరులగు శాంతపూర్వశివదేశికులు శివపూజ నిర్వర్తించి యుండిరి. జన్నిగయు నతని దండనాథులును శివతీర్థప్రసాదములు భక్తితో గ్రహించి శివగురువులకు మ్రొక్కి వారి యాశీర్వాదములు వడసిరి. శివగురువుల సన్నిధానమున జన్నిగ తన దండనాథులతో నిట్లనెను:

"నేడు మహాపర్వము. వైకుంఠైకాదశి! మన భాగ్యవశముననే ఈనాడు మనకీ మహాయుద్ధము సంప్రాప్తమైనది. ఈనాడు జయించి తిరిగివచ్చినవారికి శ్రీశివగురువుల శ్రీపాదదర్శనసౌభాగ్యము ప్రాప్తించును. రణభూమిలో ప్రాణము లర్పించినవారికి వీరస్వర్గసౌఖ్యము లభించును. అందును వైకుంఠైకాదశినాడు శ్రీరుద్రదేవమహారాజుల సేవలో నది ప్రాపించినవారిపుణ్యము అగణ్యము! జయ రుద్రదేవమహారాజ!"

దండనాథులందరు జయజయనినాదములు చేసి స్వస్థానములకు జయలువెడలి తమ తమ క్రిందివారి నట్లే యుద్బోధించిరి. వీరోత్సాహములతో నందరును, ఎవరి వివాహమహోత్సవమునకు వారు కదలుచున్నట్లేయుండిరి. వరాహధ్వజములును ఖట్వాంగధ్వజములును ప్రభాతకాలపు చిరుగాలుల కల్లలలాడుచుండెను.

జన్నిగస్కంధావారమున రణదుందుభి ముమ్మారు మ్రోసెను. జన్నిగ తన పరిచరులతో శ్రవణము లొగ్గి యాలకించెను. మరునిముషమున దూరమున నార్ధిపైనుండి, దీని ప్రతిధ్వనియో యన్నట్లు, ముమ్మారు దుందుభినాదము వినవచ్చెను. అది యావల నాకాసేనలు సర్వాయితమై యున్నట్లు సంకేతము!

అది వినవచ్చినవెంటనే జన్నిగ సేనాచలనమున కుత్తరువు లిచ్చి, గజారోహణమునకు పూర్వము పఠింపవలసిన మంత్రముల నాతని పురోహితుడు పఠించినవెంటనే, అతడు తన భద్రగజము నధిరోహించెను. ఒక్కపెట్టున శంఖములు భేరులు పణవములు ఆనకములు గోముఖములు ఇత్యాదివాద్యముల ధ్వనులు దిక్కుల బోరుకలగాను, ఆవల నావలపైనుండియు నట్టి ధ్వనులే మారుమ్రోసెను. గజబృంహితములు, హయహేషలు, వీరుల సింహనాదములు మిన్నుముట్టెను.

జన్నిగసేన కదలెను. అది యొక నిబ్బరమైన కదలిక! తొందర లేదు; జాగు లేదు. దృఢసంకల్పముతో కూడిన యుత్సాహమే యావాహిని నావేశించెను. ఆ సేనలో ప్రధానబలమగు గజముల గమనమునే దాని ధీరగంభీరగమన మనుకరించుచుండెను.

ఆవల కాకతీయనాకలును అర్ధచంద్రవ్యూహమునే పన్ని మొగలిళుత్రువాడ రేవుపైకి మహోత్సాహముతో సాగినవి.

౩౫

జన్నిగసేనలు కొప్పెరుంజింగని సేనలను తాకెను. ధీరగంభీరమైన యా యాంధ్ర సేనల తాకునకు కాడవసేనలు దడదడలాడిపోయెను. "ఏమిది! దురుసుదనము లేని యీ వాహినితాపు మన సేనల నింత యలజడిపరచిన దేమి! అశ్వములు బెదరిపోయినవి. గజములు చెదరినవి పదాతులు చిందర వందర యయినారు. ఏమిది!—ఇట్లనుచు కాడవసేనానులు చీకాకుపడిరి.

కాని యుద్ధానుభవముగల యాసేనానులకు వెంటనే కారణము తత్ప్రతిక్రియయు స్ఫురించినవి. 'ఇది పర్వతములవంటి గజముల తాపు! దీనికి ఎదురు నిలిచిన లాభము లేదు. చురుకుగ తప్పించుకొనుచు ప్రక్కపోటులు సాగింపవలెను" ఇట్లాలోచించి సుశిక్షితులగు వారి సైనికులకు జన్నిగసేనల సెదుర్కొను నుపాయములతో నాతవాజ్ఞలు ప్రవర్తింపజేసిరి.

ఆ సేనలును జామ్రుప్రొద్దెక్కునప్పటికి నిలువద్రొక్కుకొనెను. మరికొంతసేపటికి ఎదురుదెబ్బ తీయు నేర్పులవరచుకొనెను. ఈవిధముగా రెండుమూడు క్రోశముల వెడల్పుగల మేరను ఆ రెండుసేనలును తలపడి పోరుచుండెను.

ఆ సమయముననే అవల సముద్రముపై యుద్ధము సాగుచుండెను. కోగంగి నుండి వచ్చిన కాకతీయనావలును బలమున గజములనే యనుకరించుచుండెను. గజయూథమువలెనే అవియు ధీరగంభీరగమనముతో మొగలిత్రుళ్ళవారిరేవుపైకి సాగుచుండెను. చిన్నవగు చోళనావలు ఆ నావల సందులనుండి తప్పించుకొని వెనుకకు చేరవలెనని ప్రయత్నింపసాగెను. కాకతీయనావల మొదటివరుసలో పెద్ద సందులు గలవు. ఆ సందుల మధ్యలనుండి చోళనావలు వానిని దాటిపోవ బయలుదేరెను.

ఎదురుగా నున్నంతవరకు వానిని కాకతీయనావ లేమియు చేయుక యూరకొనెను. దానితో చోళనావలకు ధైర్య మెక్కువయ్యెను. ముందుకు సాగి యవి మెమ్మదిగా కాకతీయనావల మొదటి శ్రేణిమధ్యకు చేరుకొనెను.

అంతవరకు నిదురపోవుచున్నట్లున్న కాకతీయనావలు ఒక్కసారిగా నుద్బుద్ధము లయినట్లయినవి. పెద్దనావలు కదలునప్పుడు జలములో "ఓటు" లేచును. అది పెద్ద వడివల్ల కలుగు ప్రవాహవేగము. ఆ ఓటులో చిన్నావలు నిలువలేవు. తమ నావల కదలికచే పుట్టు ఓటు శత్రునావలను ముంచివేయువిధముగా కాకతీయనావలు దగ్గరకు చేరికొనసాగినవి. ఆ కదలికతో సముద్రములో లేచిన ఓటుకు చోళనావలు కొన్ని గిరగిర తిరిగి మునిగినవి. కొన్ని నిలువలేక యిటునటు కొట్టుకొనుచున్నవి. వానిని నిలువబట్టుకొనుట చోళనావికులకు సాధ్యమగుటలేదు. అంతలో కాకతీనావల నుండి ధనుర్ధరులు శరప్రయోగము చేసి యా నావికులను అందలి యోధులను నొప్పింపసాగిరి. చోళనావలలోని ధానుష్కులు బాణమోచనముచేయుట కనువుగా వారికి నావల కదలికచే కాకుండుటలేదు!

ఇట్లు పలునావలు బాధపడినను ఏవో కొన్ని చోళనావలు మొదటి శ్రేణిలోని కాకతీయనావల సందులనుండి యావల బడినవి. కాని చిత్రముగా ఆ సందులకు ఎదురుగా నూటిగా కాకతీయుల రెండవశ్రేణినావ లున్నవి. అవి యీ చోళనావలను తాక నవసరమే లేకపోయినది. వానిదగ్గరకు వచ్చినంతనే, లేచిన సముద్రపు పోటుకు చోళనావలు తలక్రిందు లైనవి. ఇట్లానాడు చోళనావలు చేసిన మొదటి ప్రయత్నము వ్యర్థమైనది.

పాటుసమయము చోళనావల కనుకూలము. అట్టి పాటువేళ చేసిన ప్రయత్నమే యిట్లు వ్యర్థమైనది. ఈనాడు ఏకాదశిగనుక జాము ప్రొద్దెక్కినపిమ్మట పోటు ప్రారంభించును. ఆ సమయమున దమప్రయత్నము సఫలము కాదు. మూడుజాములవరకు మరల పాటుకు తిరుగదు. అంతవరకును చోళనావలు ఆత్మరక్షణకు తప్ప తాముగా పోరు సాగించుటకు మరి యెట్టి ప్రయత్నమును చేయక మానుకొనెను. అవియు కాకతీయనౌకాయుద్ధవిధాన మవగతము చేసికొనెను. అందుచే నప్పటినుండి యవి కాకతీయనావల సందులకుమాత్రము పోక, ఎదురువచ్చుచున్నట్టే యుండి, ప్రక్కలకును వెనుకకును జరుగుచు చురుకుగా సంచార మొనర్చుచు కాకతీయనావలను, అక్కడ నొకవ్రేటు ఇక్కడ నొకవ్రేటు, వేయుటకు ప్రయత్నించుచుండెను!

ఇట్లు కాడవసేనలును ఆంధ్రసేనలును నేలమీదను సముద్రముమీదను మహాయుద్ధములు చేయుచున్నవి. అట్టి సమయమున కొప్పెరుంజింగడు తన శిబిరములో శ్రద్ధగా ఏకాదశీమహోత్సవము సాగించుచుండెను. ఆ శిబిరమునకు తూర్పున వసిష్ఠగోదావరియే యగడ్తగా నున్నది. మిగిలిన మూడుదిక్కులను తాత్కాలికముగా చిన్నకోటవలె కట్టి బలిష్ఠములగు సేనలు కాపున్నవి. పూజాదికములకు ప్రత్యేకముగా నాహ్వానింపబడినవారు తప్ప దానిలోని కెవ్వరికిని చొర ననుమతి లేదు. ఆ శిబిరము కూడను మనోజ్ఞములగు చిత్రవిచిత్రవర్ణములు గల పటకుటీరములతో చిన్న నగరమునే యనుకరించుచుండెను.

మహారాజసింహాపరనాముడగు నా కొప్పెరుంజింగడును, ఆనాడు బ్రాహ్మముహూర్తముననే మేల్కాంచెను. అతని పూర్తిపేరు, 'అవనియాళప్పిరందకొప్పెరుంజింగదేవుడు.' దీనికి అర్థము "అవని నేల బుట్టిన రాజు పెదసింగదేవుడు." ఇతని సంస్కృతశాసనములలో నదే "అవన్యవనోద్భవమహారాజసింహ" యను రూపము ధరించినది. ఆ శాసనములలో "సకలభువనచక్రవర్తి, శ్రీరాపగా దక్షిణనాయక, పెన్నానదీనాథ, కావేరీకాముక" ఇత్యాది బిరుదములును గలవు. మరియు నాతనికి చిదంబరేశ్వరునియందు భక్తి మిక్కుటము. అక్కడి ముగ్గురు నటరాజులలో నాతనికి కనకసభాపతి యిష్టదైవము. అందుచే నాతడు "కనకసభాపతి సర్వకార్య సర్వకాలనిర్వాహక" అను బిరుదమును సగర్వముగా వహించెను. అతడు మరియు "ఖడ్గమల్ల, నిశ్శంకమల్ల, వాళ్ బలప్పెరుమాళ్, భరతమల్ల, సాహిత్యరత్నాకర" ఇత్యాది బిరుదనామములుగూడ ధరించెను. ఈ బిరుదములే యాతని స్వభావములోని సర్వతోముఖత ద్యోతక మొనర్చును.

ఆవల, తనకు సమీపముననే, తన సేనానులు నేలమీదను నీటిమీదను రెండు మహాయుద్ధములు సాగించుచుండిరి. తాను స్వయముగా శత్రుభూగర్భమునకు చొచ్చుకొని వచ్చియున్నాడు. ఎక్కడనే యపాయము దాగుకొని యున్నదో! అయిన నేమి? తాను తన సేనానులకు సర్వవిధములగు నాజ్ఞలను ప్రవర్తింపజేసియుండెను. ఆవల నెట్టి యలజడియు లేని సమయమున నుండెడి మనశ్శాంతితోడనే, ఆ మహారాజసింహు డీనాడు ముక్కోటిఏకాదశిమహోత్సవము తన శిబిరములో జరుపుచుండెను. సాహిత్యవ్యసనితయు కళావ్యసనితయు గలవారికే అట్టిది సాధ్యమగును. మహాయోగు లెట్టి సందడియందును శాంతము వహింపగలుగుదురు.

సామాన్యముగా కొప్పెరుంజింగని పురోహితుడే యాతని యిష్టదైవమునకు నిత్యపూజ చేయును. ఈనాడు మహాపర్వమైనందున, నాతడు పురోహితుని బ్రహ్మస్థానమున గూర్చుండజేసి, తానే స్వయముగా కనకసభాపతినటరాజపూజ నిర్వర్తించుచుండెను. అప్పు డాతనిని ద్రావిడకేరళకర్ణాటదేశాగతవిద్వాంసు లెందరో పరివేష్టించియుండిరి. మరియు గోదావరీతీరవాసు లగు నాంధ్రపండితు లెందరో ఆ పరిషత్తుకు ఆహూతులై వచ్చి సభ నలంకరించియుండిరి. ఆ యుదయమున పూజావైభవము శ్రోత్రియాతిశయముతో నొప్పారెను. రుద్రాభిషేకము సర్వసంపన్నముగా జరిగెను. మంత్రపుష్పసమయమున ద్రావిడాంధ్రకేరళకర్ణాటపండితులు ఒకరితో నొకరి స్వరములు కలిపి శ్రావ్యముగా వేదమంత్రములు పఠించిరి. అచ్చట నందరకు నభేదభావమే గోచరమయ్యెను. పూజావసానమునకు ముందుగా అక్కడ మంటపమున నావాహితుడైన చిదంబరేశ్వరుని సమక్షమున ప్రాతఃకాలపూజాంగముగా వేదవేదాంగశ్రవణము ప్రవర్తిల్లెను. అందును అందరును నొకే విధమున నన్యోన్యసహకారముతో మెలగిరి. ఇంత దూరదూరదేశములనుండి సమాగతులై ఏకత్ర సమావిష్టులైన యా పండితబాహుళ్యము వేదవేదాంగములలో ఒకేవిధముగ ప్రవర్తించెను. ఆపిమ్మట శాస్త్రార్థములు సాగినవి.

వేదార్థప్రవచనమును వేదాంతచర్చయు సాగినవి. ఆ వెంటనే యక్కడిపండితులు ముత్తెరగులైరి. ఆ భేదమును ఆంధ్రద్రావిడాది దేశభేదమున వచ్చినది కాదు. ఆసేతుహిమాచలము పవిత్రకర్మభూమిగా నెంచువారికి, ఈమధ్య నవాంతరదేశాభిమాన మేమి? వారి కట్టిభేదము లేనే లేదు. వారి కున్నది మతభేద మొక్కటే.

రాజసింహునితో వచ్చిన పండితులలో కొలదిమంది శ్రీవైష్ణవులు, కొందరు శైవులు, పెక్కురు స్మార్తులు. గోదావరీతీరపండితు లెక్కువభాగము స్మార్తులే. వైష్ణవమును శైవమును అక్కడికింకను ఎక్కువగా ప్రాకియుండలేదు. కాని వారిలో గూడ శ్రీవైష్ణవులును శైవులును గలరు. కాని యా ప్రాంతముల ప్రబలురగు ఆంధ్రస్మార్తపండితులతో వారు సామాన్యముగా వివాదమునకు సాహసించువారు కారు. వివాదగ్రస్తము కాని భాగముల వ్యాఖ్యానములతోడనే సభలలో సరిపెట్టుకొని, వారి యంతేవాసులకు పాఠప్రవచనములలో మాత్రమే వివాదభాగములు వివరించువారు.

కాని యీనాడు దక్షిణదేశాగతులైన నూతన శ్రీవైష్ణవపండితుల యండ చూచుకొని, యీనాటి సభలో నాంధ్రశ్రీవైష్ణవులు విజృంభించిరి. ఆ సభలో వివాదము ముందు ఎత్తుకొన్నదే ఆంధ్రశ్రీవైష్ణవపండితులు! వారి వాదమును ద్రావిడశైవపండితులు ఖండించిరి. వెంటనే ద్రావిడ శ్రీవైష్ణవపండితు లందుకొని, శైవులను నిందించుచు, మధ్య స్మార్తులపై గూడ కొన్ని విసరులు విసరిరి. ఒక్కసారిగా నాంధ్రకేరళ ద్రావిడకర్ణాటస్మార్తపండితులు వా రుభయులమీద నేకధాటిని విజృంభించిరి. అది యొక రణరంగమేయయ్యెను. ఈ రణము రెండుముఖములుగా గాక మూడుముఖములుగాను, మధ్య ద్వైతులు కూడిన నాలుగుముఖములుగాను సాగిపోవుచుండెను.

ఏ పక్షమున వాదించువారైనను వేదవేదాంగవిదులే. వానియందు పరమ ప్రామాణ్య మున్నవారే; అందరును కుశాగ్రబుద్ధులే! బహుసభల వాదించిన యనుభవ మున్నవారే! ఒకరి యుక్తికంటె నొకరి యుక్తి బలవత్తర మనిపించుచుండెను. స్థూలబుద్ధితో విచారింప శ్రుతివాక్యములకు పరస్పరవైరుధ్య మున్నట్లు భాసించును. వారందరకు నన్నియు పరమప్రమాణములే. ఆ వాక్యముల నన్నిటిని సమన్వయము చేసి, వానికి ఏకవాక్యత కూర్చుటలో, ఈ మతభేదములు వచ్చినవి. ఒక్కొక్కరికి ఒక్కొక్క శ్రుతియందు గాఢాభిమానము దానినిబట్టి వారు మిగిలిన శ్రుతివాక్యముల యర్థము సమన్వయింతురు. ద్వాపరయుగాంతముననే భేదభావము లుదయించెను. అట్టివాని నెల్ల వారించుచు, జైమినియు బాదరాయణుడును, ధర్మసూత్రములను బ్రహ్మసూత్రములను నిబంధించిరి. ఆ సూత్రముల నూతగొని వచ్చుచుండగా, మరల మతభేదము లంకురించినవి. బ్రహ్మసూత్రములకు సంబంధించినంతవరకు, నట్టి వెల్ల మరల వారించి, శ్రీవిద్యాశంకరులు ప్రస్థానత్రయభాష్యములు నిబంధించిరి. మరల నిప్పటికి నూటయేబది రెండువందల సంవత్సరముల క్రిందటినుండియు విశిష్టాద్వైత భాష్యములు, శివాద్వైతభాష్యములు, ద్వైతభాష్యములు వెలసి శాంకరభాష్యములను ఖండింపసాగినవి అట్లు ఖండించువారికి, శంకరులకు పూర్వులగు వృత్తికారులును, వ్యాసజైమినులకంటె ప్రాచీను లగు కపిలగౌతమాదులును, ఆధారభూతు లగుచుండిరి. కాని యొకచిత్రము! శాంకరమతానుయాయుల సంఖ్యాబల మెక్కువ. ఇతరమతస్థులును ప్రధానముగా శాంకరమతమునే ఖండించుచుండిరి. శ్రీమద్రామానుజుల శ్రీభాష్యములో శాంకరమతము ఖండించుటకు ముందు శాంకరమతనిర్వచనమునకే చాలగ్రంథము నడచినది. ఇట్లు పండితసభలలో మహాయుద్ధములే యా కాలమున ప్రవర్తిల్లుచుండెను.

అట్టి మహాయుద్ధమే, యీనాడు కొప్పెరుంజింగని పూజావసానసమయమున, కనకసభాపతి నటరాజస్వామియాస్థానమున గూడిన పరిషత్తులో, ప్రవృత్తమైనది. వాదప్రతివాదములన్నియు దేవవాణిలోనే సాగుచున్నవి. కొప్పెరుంజింగనికి సంస్కృతము బాగుగా వచ్చును. నిత్యనైమిత్తికములకు కావలసినంతవరకు మాత్రమే వేదమంత్రము లాతడు చెప్పికొని వల్లించెను. మంచి సాహిత్యవేత్త! సాహిత్యమునకు

సన్నిహితమగు భరతశాస్త్రమతకు క్షుణ్ణముగా నభ్యసించెను. కాని యాతని కితర శాస్త్రములలో గాఢప్రవేశము లేదు. కాని యా పండితులు చేసికొనుచున్న వాద క్రమమును చక్కగా నవగాహనము చేసికొని, సూక్ష్మముగా ననుసరింపగల డతడు. అందుచే నాతడు తన్మయుడై యా వాదము నాలకించుచుండెను.

ఈ గోదావరిపండితులు కేవలవిద్వాంసులే కాక స్వయముగా ననుష్ఠాత లగు మహాయజ్వలు. వారు నిత్యము నర్చించు నగ్నిభట్టారకుడు వారి శరీరములం దెల్ల ఆవేశించియుండి, వారి మూర్తులకు తేజస్సు నావహింపజేసెను. వారి బుద్ధులు సూక్ష్మమైనవి; వాక్కులలో మాధుర్యముతో పాటు అచంచల మగు దార్ఢ్య మున్నది. ఎదిరివాదము నొప్పుకొనుచున్నట్లే దూరము సాగించి, యక్కడ మొగ్గవే యింతురు. ఎదిరివారు మోటుగను దురుసుగను మాటాడుచున్న కొలదియు, వారు పరమ శాంతముగా నుండి, ఎదిరిమాట తడబాటు పట్టుకొని సాగదీయుదురు. తాము తప్ప బడరు. వెర్రిరా లను నగ్రహారమున కగ్రణి యగు కేతనయు మధ్యమధ్య అందు పాల్గొనుచుండెను.

అంతలో కేతన కొక యూహ తోచినది. అతని కిట్లు కొప్పెరుంజింగడు ఈ పండితచర్చను శ్రద్ధతో నాలకించుచుండుట యెంతయేని ఆనందము కలిగించెను. అందరకు నావల రెండు మహాయుద్ధములు జరుగుచున్న వని తెలియును. అంత మహా యుద్ధములకు మూల కారణ మగు నీ రాజసింహున కింత నిబ్బర మేమి? ఏమియు నంటనివానివలెనే ఈ పండితపరిషత్తులోని శాస్త్రార్థములు వినుచున్నా డితడు!

"పూర్వము జనకమహారాజు మిథిలాపట్టణమంతయు దగ్ధమగుచున్నను నిర్లిప్తుడై యుండెనట! ఇప్పుడు మరల నీ నాడు ఆ విదేహుని నిర్లిప్తత ఈ రాజసింహుని లో చూచుచున్నాము!"

ఇట్లు కేతన యనెను. దానితో సభయంతయు వికసించెను. రాజసింహుని ముఖవికసనము అతిశయించెను. అది చూచి గోదావరిపండితు లందరు నదియే యందు కొనిరి. వారు ప్రత్యక్షముగా నది ముఖస్తుతిరూపముగా విస్తరింపక, వాదములలో సందర్భవశమున కొప్పెరుంజింగని జనకునితో పోల్చినట్లు ధ్వనింపజేయుచుండిరి. కొప్పెరుంజింగనికి ఆనందము క్షణక్షణ మతిశయింపసాగెను. వీరిని కేపట్లు గౌర వించుటా యని పరిపరివిధముల నాలోచించుచుండెను.

మధ్యాహ్నమైనది! ఆవల యుద్ధములును, రాజసింహునకును జన్నిగకును, కొంతవడి గెలుపుగా కొంతవడి ఓటమిగా నుండెను. ఆ యుద్ధములును గజముల సైన్య మునకును హయముల తీక్ష్ణతకును మధ్య జరుగుచున్న యుద్ధముగనే యుండెను. ఏవి గెలుచును, గజములా, అశ్వములా?

రాజసింహుని సేనానుల కంతవరకు నాత్మవిశ్వాసము పోలేదు. సముద్రముపైని గాని భూమిమీద గాని, తా మోడిపోదుమేమో యను నాలోచనయే, వారి కంత

వరకు లేదు. రాజసింహుని యాజ్ఞలంతవరకు వారు పాలించుచుండిరి. కాని యిప్పుడు వారికి యుద్ధక్రమము రాజసింహునకు నివేదించుట మంచి దని తోచినది. ముఖ్య సేనాపతులు తమలో తా మాలోచించుకొనిరి. యుద్ధస్థితి సమగ్రముగా రాజసింహునకు తెలిపి, యవసర మగుచో, నూతనాజ్ఞలు పడయుట మంచి దని వారందరు నేకగ్రీవముగా నిశ్చయించిరి. రాజసింహుని నిర్ణయములందు వారికి గాఢవిశ్వాసము కలదు. అట్లే వా రాతనికి యుద్ధరంగమునుండి వార్త యంపిరి.

సేనాపతులు పంపిన వార్తాహరుడు రాజసింహుని శిబిరమునకు వచ్చెను. ఆతనికి లోనికి రా ననుజ్ఞ రాలేదు. జనకమహారాజువలె నున్న కొప్పెరుంజింగనికి, మధ్యలో యుద్ధవార్తలు నివేదింప వార్తాహరుడు వచ్చె నని యేని చెప్పుట కెవరు సాహసింతురు ? కాళ్లు కాలిన పిల్లులవలెనే పరిచారకులు కొంద రాతని యెదుట తారటలాడిరి. కాని లాభము లేకపోయెను. అవకాశము కలుగలేదు.

తుదకు వా రాలోచించుకొని, ప్రమాదసమయమున మ్రోయించుటకు పూర్వమే నిర్ణీతమైన యొకానొక శంఖనాదము వా రప్పుడు నగరివాకిట గావించిరి. అప్పుడు మూడుజాములు కావచ్చుచున్నది. రాజసింహు డది యాలకించెను. గోదావరిపండితులు తన్ను జనకునివలె నిర్లిప్తు డని వర్ణించియుండిరే ! ఇప్పుడు సంభ్రమము ప్రదర్శించు టెట్లు ?

వ్యవహారదక్షు డగు నాతడు నెమ్మదిగా, అకాల మయినదను నెపమున, నా పూటకు శాస్త్రార్థములు చాలింపజేసి పూజాపరిసమాప్తి గావించెను. మరల సాయంకాల పూజ జరుగు ననియు నాసమయమున "ఊరుభంగ"మను రూపకము కేరళనటులు ప్రదర్శింతురనియు, నా పిమ్మట నా రాత్రి జాగరణము చేయుచు శాస్త్రార్థగములు సాగింపవలె ననియు, పండితుల నందరి రావలసినదనియు సాదరగౌరవములతో నాహ్వానించి వారలను విడుదులకు పంపజేసెను.

కొప్పెరుంజింగ డంత చీనాంశుకనిర్మితమగు తన యేకాంతమందిరమున జేరి సేనాపతులు పంపిన వార్తాహరుని బిలిపించి విషయము తెలిసికొనెను. అంతలో శీఘ్రగతి మరి యిద్దరు వేగరులు వచ్చి నూతనవార్తలు నివేదించిరి.

రణరంగములనుండి వచ్చిన వార్తలు కొప్పెరుంజింగనికి ఒక్కసారిగా నావేగమే కలిగించెను. ఆతడు నిజముగా నావార్తలు నమ్మలేకపోయెను.

పాటు ప్రారంభము చూచుకొని అప్పుడే చోళనావలు కోరంగినావలపైకి బయలుదేరినవి. ఈ మాటు ప్రయత్నము ముమ్మరముగా సాగుచున్నది. కాని వాయువుమాత్రము చోళనావల కనుకూలముగా లేదు. ఈ ప్రయత్నము విఫలమైనచో చోళనావలు వెనుకకు తిరిగివచ్చు నని విశ్వాసములేదు.

ఇక భూసేనల యుద్ధము మాత్ర మిప్పటికి సమముగా నున్నది. ఆంధ్రగజముల తాకుడు ముందు కాడవసేనలు కలగినను, తెప్పరిల్లుకొని మూత్కమార్గములు గ్రహించి

యాంధ్రసేనలను చీకాకుపరచుచుండెను. మరియు వారొక ప్రయత్నము చేసిరి. ఒక పెద్ద యశ్వదళమును చుట్టుమార్గమున పంపి జన్నిగసేనలను వెనుకవైపునుండి ఢీకొన బ్రయత్నించిరి. కాని యట్టి ప్రయత్నము జరుగవచ్చు నని ముందుగనే జన్నిగ యూహించి, ప్రతిఘటించుటకు వేరుగా నాతఁ డాశ్వికదళముల నుంచెను. అందుచే కాడవసేనలు ఎన్నిమారులు వెనుకవైపుకు రావలె నని యత్నించినను, ఆ యత్నములన్నియు నరికట్టబడెను.

కాడవహయదళములు ఒకటి మారి మరియొకటి యుద్ధనాసీరమునకు దూకుచుండెను. ఐనను సాయంత్రము మూడుజాము లగునప్పటికి మొత్తముమీద నవి యన్నియు నలసిన ట్లున్నవి. అశ్వములు సుకుమారప్రాణులు. గజము లట్లు కావు. అందును ఆంధ్రగజములు ఈనాడు కడుపులనిండ మద్యము సేవించినవి. అలసినప్పుడెల్ల వానికి మరల మద్యము పుష్కలముగా పోయించి యుద్ధముఖమునకు దెచ్చుచుండిరి. మద్యసేవనమువలన కొంతవడికి వచ్చు నీరసభావము, ఈ ఏనుగుల నెప్పటి కావేశించును? సాయంకాల మగులోపల నది వచ్చునెడల, కాడవసేనలు జయించుట సాధ్యము. లేనిచో కొప్పెరుంజింగడు ఆత్మరక్షణప్రయత్నములో నుండవలెను!

కొప్పెరుంజింగ డా వార్త కాశ్చర్యపడెను. హృదయములో నధైర్య మావేశించెను. పూర్వ మాతడు గణపతిదేవచక్రవర్తులచే జితుడయ్యెను. మరల నిప్పటికి రెండేళ్ల క్రిందట పాండ్యసేనలచే నిర్జితుడయ్యెను. కాని యాతఁ డెన్నడును తన రాజసింహాత గోల్పోయియుండలేదు; దర్పము గోల్పోలేదు.

వెంటనే యాతడు తీక్ష్ణముగా నాలోచించెను. వెంటనే యాతడు వసిష్ఠగోదావరి యావలకు, తన రక్షణకై కొన్ని సేనల దాటియుండ నాజ్ఞాపించి, యావల సముద్రతీరమున సంకేతస్థలమున తన్ను తీసికొనిపోవుటకు కొన్ని చోళనావలను వేచియుండ నియమించెను. అంతట నాతఁ డెన్నియో విషయము లాలోచించి తన సేనానుల కుత్తరువులు పంపెను. అందులో శతఘ్నులను ప్రయోగించుట యొకటి! ఈ ప్రయత్నము లన్నియు విఫలములై, తన భూసేనల కీనాడు అపజయము సంభవించున ట్లున్నయెడల వెనుదగ్గి, సేనలను విచ్చిపోనీయక, వసిష్ఠగోదావరి ననుసరించి యుత్తరముగా ప్రయాణము చేసి శీఘ్రగమనమున మోసలపురము చేరికొనవలసిన దని యాజ్ఞాపించి, తానుగూడ సముద్రమార్గమున మోసలపురమే చేరికొందు నని తెలియజేసెను.

సూర్యాస్తమయము కాబోవుచున్నది! సముద్రముపై యుద్ధ మే విధముగా సాగుచున్నదో నమ్మకమైన వార్త రాలేదు. ఇటు నటుగా నున్నది! ఈవల గజములు మాత్రము నిస్సార మగుచున్నవనియు, రాజసింహుని యాజ్ఞలు పాలించినపిమ్మట హయదళములు తేరుకొనుచున్న వనియు, భయపడ నవసరము లేదనియు, కాడవసేనానులు తమ ప్రభువునకు సంతోషవార్త లంపిరి.

అది విని కొప్పెరుంజింగడు చిదంబరేశ్వరుడగు కనకసభాపతి నటరాజ స్వామికి మనసా వందన మాచరించెను!

ఇక నాంధ్రపండితులకు తాను నిజముగా జనకమహారాజునకు తుల్యుడ ననియే ప్రదర్శింప నాతడు నిశ్చయించెను. అప్పటికే పండితు లాతని పూజాస్థానమునకు ఒక్కొ రొక్కరె చేరికొనుచుండిరి. కేరళనటులు "ఊరుభంగ" రూపకప్రదర్శనమునకు సిద్ధముగా నుండిరి.

సంధ్యావేళ కాగానే కొప్పెరుంజింగడు శుచియై సంధ్యావందనోపాసనాదికము నిర్వర్తించి సాయంకాలపూజ ప్రారంభించెను. అదియు నాతడు లఘువుగా చేసి సాయంకాలపూజాంగముగా వేదవేదాంగాదిశ్రవణము సూక్ష్మముగా కానిచ్చెను. శ్రీమద్రామాయణ మహాభారతభాగవతశ్రవణ మైనది. అపిమ్మట పురోహితు డిట్లనెను.

"శ్రీ మదఖండభూమండల బ్రహ్మాండనాయక, సచ్చిదానంద విగ్రహా, ఆశ్రిత సంరక్షణార్థకృతావతారదివ్యమంగళవిగ్రహా, చిదంబరమహాక్షేత్రనిజాధివాస, సర్వపుణ్యక్షేత్రాధివాస, శ్రీ కనకసభాపతిమహాస్వామిన్, శ్రీమద్రాజసింహపరమస్వామిన్, సంధ్యాతాండవకుశల, నటరాజశేఖర, సాయంకాలపూజాంగత్వేన శ్రీ దేవీభాగవతశ్రవణానంతరం ఊరుభంగరూపక భరతప్రయోగ మవధారయ !"

గోదావరిపండితులలో "ఊరుభంగము ! ఊరుభంగము ! ఊరుభంగము !" అని యా రూపకనామము పలుమా రుచ్చరింపబడుచున్నది. అట్లని వారు ముఖములు చిట్లించి చప్పరింతురు. "ఇవల మహాయుద్ధములు జరుగుచుండగా నీ యమంగళనామము గల రూపకమే ప్రదర్శనమునకు వీరికి దొరికినదా ?"

కేరళనటులు రంగస్థలము సర్వసన్నద్ధము చేసియుండిరి. నేపథ్యమున దివ్యజ్యోతి వెలిగెను. నటులు "జాతవేదసే" ఇత్యాదిమంత్రములు తెరచాటున సుస్వరముగా పఠించిరి. ఆ నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశించెను.

౩౬

* "భీష్మద్రోణతటాం జయద్రథజలాం గాంధారరాజహ్రదాం
కర్ణద్రౌణికృపోర్మినక్రమకరాం దుర్యోధనస్రోతసమ్
తీర్ణః శత్రునదీం శరాసిసికతాం యేన ప్లవే నార్జునః
శత్రూణాం తరణేషు వః సభగవా నస్తు ప్లవః కేశవః"

సూత్రధారుడు ప్రవేశించుచునే యీ మంగళశ్లోకము పఠించెను. అది చదువుచుండగనే గోదావరిపండితులు లొకరిమొగము లొకరు ఒక్కక్షణమాత్రము చూచుకొనిరి.

'నాంద్యంతమున సూత్రధారుడు ప్రవేశింపవలసినది; సూత్రధారుడే నాందీశ్లోకము చదువుచున్నాడేమి?'

'ఇది కేరళదేశాచారము కావచ్చును.'

'అక్కడ నెన్నియో విపరీతాచారములు కలవని జనప్రథ కలదుగదా! ఇదియు నట్టివానిలో నొకటి కావచ్చును.'

ఇట్లనుచు వారు సరిపెట్టుకొనుచుండిరి.

అంతలో నా శ్లోకము సమాప్తమయినది. దానితో వారికి ముందు కలిగిన సందేహము లన్నియు తీరిపోయినవి. సభయంతయు నొక్కమారుగా వికసించినది. అంతవరకును ఈ సమయమున అమంగళనామము గల ఊరుభంగము ప్రదర్శించుట యేమి యని యందరు శంకించినవారే! ఇప్పుడా సభలోనే ఆ మంగళశ్లోకార్థము అవగతము కాగానే, సాధు సాధుస్వనములు వెలువడినవి. 'సాహిత్యరత్నాకరుడు గనుకనే రాజసింహు డీనాడు ఈ రూపకప్రదర్శనమును చేయ నాజ్ఞాపించెను. పవిత్రగోదావరి నీత డుత్తరింపవలసియున్నాడు. రెండు శత్రువాహినుల నుత్తరింపవలసి యున్నాడు,పాపము!'

వారా మంగళశ్లోకములోని యాశీర్వచనముతో నేకీభవింపనూ లేదు; దానిని కాదననూ లేదు.

సూత్రధారుడు, 'ఆర్యమహాశయులకు ఒక మనవి.....అరే, ఏమి టిది, ఏదో కోలాహలముగా వినబడుచున్నది!' అనెను.

---

* ఈ ప్రకరణమున ఊరుభంగరూపకప్రదర్శనము విశేషముగా కలదు. అందుకు అంతటను సంస్కృతమూలమే వాడుట ఉచితము. అయినను పాఠకుల సౌలభ్యము నిమిత్తము ఈ మంగళశ్లోకమును చివరకొంచెమును తప్ప మిగిలిన భాగములు తెలుగులోని కనువదించి గ్రహింపబడినవి.

ఇట్లాతడనుచుండగనే నిజముగా అవల రణరంగమునుండియుద్ధకోలాహలమే వినవచ్చెను. ఇట్లావల నిజముగా యుద్ధముజరుగుచున్న సమయమున నే ఈ నాటక ప్రదర్శనము చేయుటచే నాట్యవస్తువు సత్యముగా నిప్పుడు జరుగుచున్నదాయన్నట్లు, గట్టిగా భాసింపజేసెను. సూత్రధారుడును పారిపార్శ్వకుడును తమ సంభాషణలో కురుపాండవుల మహాయుద్ధము వంత్యదశను వర్ణించిరి.

"ఈ వీరపురుషులందరు ఎందు కిలా సంభ్రమముతో పరిభ్రమించుచున్నారు ! ......అన్యోన్యాయుధప్రహారముతో మత్తదంతావళదంతాభిఘాతములతో గాయపడి, నెత్తురోడుచున్న తమ బలిష్ఠశరీరములను స్వర్గసంపాదనకై సమరమఖాగ్నికుండములో నిట్టనిలువున హోమముచేయ సంకల్పించి సాగినట్లున్నారు...సమంతపంచకము రాచపీనుగులతో నిండి భయంకరముగా నున్నది..... భీమదుర్యోధనులు తలపడి హోరాహోరి పోరుచున్నారు. దెబ్బలు తగిలి, తొండములు తలలు కాళ్లు తెగిపడిన యేనుగులతో గుర్రములతో రాజులతో యోధులతో చిందరవందరై, యుద్ధభూమియంతయు, చినిగిపోయిన సంకీర్ణచిత్రపటములాగున కనిపించుచున్నది !..."

దానికి గోదావరిపండితు లెంతయు ప్రీతులై యిట్లు మెచ్చుకొనసాగిరి. 'ఏమి యత్యంతరమణీయమైన యుపమానము ! ఈ రాజసింహుడు నిజముగా భరతతుల్యుడే, సాహిత్యరత్నాకరుడే !'

ఆ నాటికప్రస్తాపనతో నా సభ సంపూర్ణముగ వికసించెను. అది చూచిన కోప్పెరుంజింగని మోమును వికసించెను. 'ఈ గోదావరిపండితులు రసజ్ఞులు! కృష్ణాతీరమునందలి వల్లని బండుమట్టివారు కారు, పెన్నాప్రవాహతీరపు దుడుకుబోతులును గారు!'

అంతట రంగస్థలముపై ముగ్గురు నటులు ప్రవేశించి కురుసంగ్రామరంగము వర్ణింపసాగిరి.

"ఈ సమరాశ్రమము పగ ప్రజ్వలింపజేయు కటాహము...శౌర్యము ప్రకటించి అసువులు వాసిన మహాయోధులను అప్సరసలు వరించు స్వయంవరమంటపము!"

ఏమి యీ కవియూహలు ! భటుడు వర్ణన సాగించుచుండెను.

"అంతకాలములో రాజసింహులు సుఖముగా దీర్ఘనిద్ర చెందు వీరశయ్య !"

ఈ వర్ణనము సభకు కటువుగా తోచినది. కాని తక్కినవర్ణనములో నది పరిసిపోయినది. భటుడు సాగించెను.

"ఈ యజ్ఞములో కొండలవంటి యేనుగుల తొండములే యూపస్తంభములు; బాణములే పరిస్తరింపబడిన దర్భలు ; కూలిన యేనుగులే యజ్ఞవేదికలు; భగభగమండు పగలే అగ్నులు; రథకేతనములే విమానవితానములు; సింహనాదములే ఉచ్చైస్స్వనముతో చదువబడుచున్న మంత్రములు !"

ఈ వర్ణనముతో నా కవియార్ష వాక్కులకు సభయంతయు పులకరించెను; రాజసింహుడు ఆనందతన్మయుడయ్యెను.

"అదిగో, మదపుటేనుగు, యుద్ధభూమిలోనికి ఐరావతములాగున పరుగిడి వచ్చి నిలిచినది, చూచినారా? అది నానావిధయుద్ధసామగ్రితో సజ్జితమై, రాజసింహుల యాయుధాగారమువలె గోచరించుచున్నది. అయ్యో, చూచుచుండగనే ఆ యేనుగు శత్రువులబాణముల దెబ్బలకు తల తిరిగి, కవచము బ్రద్దలై, యుద్ధసామగ్రితోసహా మహావీరుడువలె, కన్నులు మూసి వ్రణములోనుండి నెత్తురు ధారలుగా కారుచుండగా, నేల గూలినది!"

ఏమిది? ఈ నాటకమున పాత్రలు వర్ణించుచున్నది ప్రదర్శించుచున్న రూపకమునందియా? అవల ప్రవృత్తమగుచున్న యా మహాయుద్ధమునే వర్ణించుచున్నారా, రాజసింహులకు? భటుడు సాగించుచుండెను.

"హాహా! భయంకరము! ఘోరము! తెగిపడిన ఏనుగుల గుర్రముల భటుల రక్త ప్రవాహములతో నిండిపోయి, చెల్లాచెదురుగా పడిన చర్మములతో చామరములతో తోమరములతో శరములతో కుంతములతో కవచకబంధాదులతో అల్లకల్లోలమై శక్తిప్రాసహాటక భిండిపాల శూల ముసల ముద్గర వరాహకర్ణ కణప కర్పణత్రాసి గదాది నానావిధయోధాయుధసమూహములతో సమాకీర్ణమైయున్న యీ సమంతపంచకము, అబ్బ, చూడలేము! ఘోరము! భయంకరము!"

* * * *

"ఇట్టి దారుణస్థితిలోకూడ రాజులు తమ స్వాభావికశోభావైభవము పోగొట్టుకొనకుండగనే శోభిల్లుచున్నారు, గమనించినారా?"

ఈ మాటలు వినుచున్న సదస్యులకు ప్రత్యక్షముగా నెదుట రాజసింహుని పూజావైభవము పొడగట్టుచున్నందున వా రెంతయు మెచ్చుకొనసాగిరి. అతిశయోక్తిగా కనిపించు కవుల వర్ణనలుకూడ తరచుగా స్వభావోక్తులే!

"వీరాధివీరులైన యిట్టి క్షత్రియవీరులనుగూడ మృత్యువులో గొనుచున్నదే!"

* * * *

"అయ్యో, మృత్యుదేవత క్షత్రియులనుగూడ మ్రింగివేయునా?"

ఆ మాట్లాడు రంగముపై భటునితోపాటు, సదస్యులును గోదావరిపండితులును, జాలి నొందుచు నిట్టూర్పులు విడిచిరి. వారు చూపుచున్న శ్రద్ధకు కొప్పెరజింగడు ఉప్పొంగిపోవుచుండెను.

"ఏమి యీ చప్పుడు?.. ఉరుములా?...పిడుగులు పడి కొండలను పిండి పిండి చేసివేయుచున్నవా?... ప్రచండవాయువు వీచి భూమి బ్రద్దలైపోవుచున్నదా?... ప్రచండమైన వాయువుతో కల్లోలమై లేచి ఉప్పొంగి, సముద్రము మందరగిరి కంద

రాంతరస్థలములప పసులబొడిచి, ఉల్లోలమై భయంకరముగా హోరుపెట్టుచున్నదా? ఏదో పోయి తెలిసికొందము !”

పై వాక్యము లనుచు నా ముగ్గురు భటులును రంగస్థలమున పరిక్రమించుచుండిరి. సరిగా నాసమయముననే నక్కడ సమీపభూమిలో రణకోలాహలము భయంకరముగా వినవచ్చెను. సముద్రముపైనుండి కూడ భీమ మగు నౌకానౌక యపూర్వరవము వినవచ్చెను. ఉప్పెన వచ్చినట్లే వసిష్ఠగోదావరిలోగూడ మహాతరంగ మొకటి లేచెను.

ఏమి టిది, రూపకప్రదర్శనమేనా ? నిజముగా రూపకములో వర్ణించినట్లుగానే చుట్టును జరుగుచున్నదే! ఈ రూపకకర్త సాక్షాత్తుగా ఋషి, సత్యవాక్కు !

అంతట నాభటులు భీమదుర్యోధనుల గదాయుద్ధమును, అప్పుడు జరుగుచున్నది చూచుచున్నట్లే, వర్ణించిరి. అందులో భీమసేనుని బలాతిశయము, దుర్యోధనుని కౌశల్యాతిశయము, అద్భుతముగా వర్ణింపబడుచుండెను. సరిగా గజమునకు అశ్వమునకు యుద్ధమే! ఒకదానికి బల మెక్కువ. ఒకదానికి చురుకుదన మెక్కువ! అవల జన్నిగ గజసేనలకు కొప్పెరుంజింగని యశ్వసేనలకు జరుగుచున్న యుద్ధము వంటిదే! అల్లావల కోరంగి కాకతి పెద్ద నావలకు చోళుల చిన్న నావలకు జరుగుచున్న నౌకాయుద్ధమువంటిదే, యిదియు !

“అడుగో, రాజరాజు రత్నకిరీటము కదలునట్లు తల పంకించి, క్రోధవిస్ఫారిత రక్తనేత్రయుగళముతో పొంచి, భీమసేనుని పదసంధిబంధములో కొట్టుటకు శరీరము వంచి, జాగ్రత్తగా భీమసేనుని చుట్టుముట్టుచున్నాడు. ఉత్క్షిప్తమైన అతని చేతిలోని గద, ఎదిరి నెత్తురుతో తడిసియున్నది. చూచినారా, అది కైలాసపర్వతశిఖరాగ్రమునుండి లేచిన ఇంద్రధనుస్సువలె మెరయుచున్నది !”

ఆ వర్ణనమధ్యములో నా యుపమానము గోదావరిపండితులను ముగ్ధులనే చేసినది !

“రాజరాజు భీమసేనుని కొట్టనేకొట్టినాడు. చూడండి! అతని నుదురు బ్రద్దలై రక్తము చింది పారుచున్నది. రెండు బుజాలూ విరిగిపోయినట్లే! దెబ్బలతో బ్రద్దలై భీముని యెదురొమ్ము నెత్తురుముద్ద యైనది.”

ఆ సభలో ఒక్కసారిగా భీమసేనుని దీనావస్థకు జాలి ఎక్కువైనది. కొందరు కన్నీళ్లు కార్చినారు. గోదావరిపండితులు పలువురు తమవెంట నున్న ఒక్కపరపు కోట తెల్లని కంచు కొమ్ముచెంబులనుండి, జలము గ్రహించి చెమ్మగిల్లిన తమ కన్నులు తుడిచికొనిరి.

“వృకోదరుడు మరల భయంకరమైన తన గద గిరగిర త్రిప్పుచు, సింహనాదము చేయుచు, వల్గనతో దుర్యోధనునిపై తలపడినాడు. దుర్యోధనుడో, భీముని భుజములు తన గదతో చితుకగొట్టి, యతని ప్రయత్నము విఫలముచేసి,

చాతురీగతితో భీమునకు అందకుండగా చిత్రచిత్రగతులతో తిరుగుచు, గదాఘాతములతో నాతని నొప్పించుచున్నాడు. గదాయుద్ధములో సుశిక్షితుడును అద్వితీయుడునుగదా రాజరాజు! అయినా, భీమసేనుడు మహాబలశాలి. అతని కా దెబ్బలు లెక్కా?"

"అదుగో, రాజరాజు భీమసేనుని తలమీద తన గదతో కొట్టినాడు. తల పగిలి, రక్తప్రవాహములో తడిసిపోయిన శరీరముతో సత్తువ తూలి, పాండవ మధ్యముడు పిడుగు పడి, పగిలి, తునులబడి, స్రవించుచున్న ధాతువులతో మేరు పర్వతమువలె సభాలున నేల గూలుచున్నాడు."

"అది చూచి వ్యాసుడు ముక్కున వ్రేలు వేసికొని దిగాలుపడి చూచుచు, అలా నిలబడిపోయినాడు!"

"ధర్మరాజు దిగులుపడి పొగిలిపోవుచున్నాడు. విదురుడు కన్నీరుపెట్టుచున్నాడు..."

మరి యీ గోదావరిపండితసామాజికులకుమాత్రము కన్నీ గాగునా? ఆ పిమ్మట శ్రీకృష్ణుని సంజ్ఞగొని భీమసేనుడు లేని రోషాపిక తెచ్చుకొని తలపడుట వర్ణింపబడినది.

"భీమదుర్యోధనులకు మళ్ళీ గదాయుద్ధము ప్రారంభమయినది. అదుగో, భీమసేనుడు, అరచేతులు నేలపై రాచి తుడిచికొని, భుజము లప్పళించి, అవుడు గరచి, క్రోధోద్రేకముతో, బలముకొలది ప్రలయకాలాంబుదమువలె గర్జించి, దుర్యోధనునితో తలపడినాడు...ఆఁ ఆఁ, చూచినారా! అతడు ధర్మము విచారింపక, యుద్ధనీతి గోతిలో త్రోసివేసి, కృష్ణుని సంజ్ఞానుసారముగా గురిచూచి, గదతో రాజరాజుతొడలమీద కొట్టుచున్నాడు...

"అయ్యో! అయ్యో! కురురాజు తొడలు విరిగి నేలగూలినాడు!"

* * * *

"కృష్ణద్వైపాయనుడు అదరి ఎగిరిపడినాడు!"

ఆపిమ్మట హలాయుధుని కోపమును, పాండవులు భీమసేనుని పొదివి యావలికి తీసికొనిపోవుటయు వర్ణింపబడినది. ఈ విష్కంభము పూర్తియగునప్పటికి సామాజికులకందరకు ఒక్కసారిగా అభిమానము దుర్యోధనుని పక్షమునకు మరలినది.

మరల ప్రదర్శనము ప్రారంభించినది. భీముని వక్షస్థలము తన నాగలితో దున్నివేయ నుంకించు బలరాముని రాజరాజే, "పూజ్యుడా, హలాయుధుడా! శాంతించు! శాంతించు!" మనుటతో నా యభిమానము బలపడినది. ఆపిమ్మట దుర్యోధనబలరాముల సంభాషణము సాగుటతో నది యతిశయించినది. ఆ తర్వాత

దుర్యోధనుని రణరంగములో వెదకికొనుచు ధృతరాష్ట్రుడును, గాంధారియు, రాజమహిషులగు పౌరవియు మాలవియు, కుమారుడగు దుర్జయుడును ప్రవేశించి నాటకము సాగునప్పటికి సామాజికుల కందరకు నిర్వేద మావహించినది. వారి కీనాటకమున రసమేమో ఆలోచన లేదు. ఇందు నాయకు డెవరో ప్రతినాయకు డెవరో ఆలోచన లేదు.

"ధృతరాష్ట్రుడు : కుమారా, రా ! కన్నతండ్రిని. ఒక్కమారు నాకు అభివాదనము చేయి !"

"దుర్యోధనుడు : ఇదిగో వచ్చుచున్నాను. [లేవబోయి లేవలేక పడిపోవును] అక్కటా ! ఇది నాకు మరియొక దెబ్బ ! దుర్భరదుర్గతి ! భీమసేనుడు తన ఇనుప గదతో చితుకగొట్టి, నేలపై పడవేసి, జుట్టు పట్టుకొని యీడ్చినప్పుడే తొడలతోపాటు, లేచి పితృపాదాభివందనముకూడా నాకు కానిదై పోయినది !"

ఆ మాటలతో సామాజికులు దుర్యోధనుని యకార్యములన్నియు మరచి, యతని ధర్మిష్ఠతయందే బుద్ధి నిలుపసాగిరి. ఎంత పితృభక్తి ఇతనికి !

అంతట కుమారు డగు దుర్జయుడే, యా యంధకారములో దుర్యోధనుని గనుగొని, ఇంటికి రమ్మని కోరుచు, తొడలు విరిగినవని తెలియక ఆ పసివాడు ఆప్యాయముగా తండ్రిని తొడలమీద తన్ను కూర్చుండనిమ్మని తొడలపై నెక్కబోవును. ఈ సన్నివేశముతో సభలో నందరు నేకధారగా కన్నీరుగార్చిరి.

ధృతరాష్ట్రాదులతో సంభాషణలో దుర్యోధనుడు తల్లి నిట్లు ప్రార్థించును.

"వీరమాతా, నమస్కారపూర్వకముగా, నిన్ను ప్రార్థించుచున్నా నమ్మా !— ఏ లవలేశమైనా నేను పుణ్యముచేసికొని ఉన్నచో, జన్మాంతరములోగూడ నీవే నా జననివి అగుదువుగాక !"

ఏమి యితని మాతృభక్తి ! సభ్యులందరు దుర్యోధనునిపక్షమే యైరి. ఈ రూపకమునకు నాయకు డే దుర్యోధనుడా ? భీమసేను డే ప్రతినాయకుడా ? శ్రీకృష్ణు డే ప్రతినాయకుడా ? మన మెరిగిన నాటకలక్షణము లన్నియు తారుమారగుచున్నవి. ఏమైనను ఈ ప్రయోగము హృదయస్పర్శిగా నున్నది !

తుదకు అశ్వత్థామ ప్రవేశించెను. ప్రవేశించుచునే అత డిట్లనెను :

"సజ్జమైన కార్ముకముతో దుర్యోధనమహారాజు ప్రారంభించిన యుద్ధయజ్ఞమును, అధ్వర్యుడు అశ్వమేధమునువలె మరల నే నుపక్రమించి, తుదముట్టింపబోవుచున్నాను."

* * * *

"మా పితృపాదులకు తిలతర్పణ మిచ్చుకొనుచు, నేను దూరముగా నున్న సమయములో, శత్రువులు కురుకులతిలకు డైన దుర్యోధనుని వంచించి కూల్చివేసినారు...

"ఇప్పు డీ దుర్యోధనమహారాజు అస్తగిరిశిఖరాగ్రభాగముమీదనుండి క్రమ్ము కొన్న సంధ్యారాగములో పశ్చిమసూర్యునివలె నస్తమింపబోవుచున్నాడు!"

చివర కాత డిట్లనెను:

"దుర్జయ! ఇతస్తావత్.

"పితృవిక్రమదాయాద్యే రాజ్యే భుజబలార్జితే
వినాభిషేకం రాజా త్వం విప్రోక్తై ర్వచనై ర్భవ!"

ఇంతవరకును గోదావరిపండితులు రూపకరసాకృష్టులై, మహాప్రవాహములోవలె కొట్టుకొనిపోవుచుండిరి. కాని యీయశ్వత్థామవాక్యములతో నందరికి ఆశ్చర్య మైనది. తట్టిలేపినట్లు ఒక్కసారిగా వారి చిత్తము లుద్బుద్ధము లైనవి. ఎవడీ దుర్జయుడు? అభిషేకము లేకుండ బ్రాహ్మణవాక్యము ప్రసరించుటేమి? దురభిమానమోహితులైన యశ్వత్థామవంటి బ్రాహ్మణుల వాక్యములకు పటుత్వ ముండునా?

ఇట్లు వారు ఆలోచించుచుండగనే సరిగా, దుర్యోధనుడు చివరి వాక్యములు ప్రారంభించి సాగించుచుండెను.

"...ఊర్వశ్యాదయోఽప్సరసో మా మభిగతాః. ఇమే మహా
ర్ణవా మూర్తిమంతః. ఏతా గంగాప్రభృతయో మహానద్యః
ఏష సహస్రహంసప్రయుక్తో మాం నేతుం వీరవాహీవిమానః
కాలేన ప్రేషితః. అయ మయ మాగచ్ఛామి!"

స్వర్గగతు డయ్యెను!

ఈ మాటలు సాగుచుండగనే, గోదావరిపండితులలో క్షణక్షణము కలవరపాటు వృద్ధిపొందసాగెను. 'రంగముమీదనే మరణము ప్రదర్శించెదరా, ఏమి!— అయ్యో! రంగముమీదనే!—' అనుచు వారు కత్తరములో తమ కొమ్ముచెంబులు చేతులతో నందుకొనుచు, లేచుచుండిరి.

దుర్యోధనుని స్వర్గప్రయాణము ప్రదర్శింపనే ప్రదర్శింపబడెను. గోదావరిపండితులలో హాహాకారములే ఒక్కసారిగా పుట్టినేల యురిమినట్లు ఆ సభామధ్యమును దడదడలాడించెను.

౩౭

క్రణక్షణము పెరుగుచున్న ఆనందముతో నిప్పటికి పరవశతయే పొందియున్న కాళ్ళేరుంజింగడు తా నిప్పుడు చూచుచున్నది. నమ్మలేకపోయెను. కోపముతో నాపండితులవంక నాతడు క్రూరార్థకమగు చూపు చూచుచుండెను. తెర పడినది. రూపకప్రదర్శనము పూర్తి కాలేదు !

గోదావరిపండితులు సంభ్రమముతో వెడలిపోవుచుండిరి. ఒకరితో చెప్పరు. ఆగరు. అందరును కూడబలుకుకొన్నవారివలెనే ఒక్కసారి బయలుదేరిరి. కాని యీ ఛాందసులు అట్లు ముందుగా కూడబలుకుకొని యుండుట కవకాశము లేదు. వారికి కోపమే వచ్చినది! కాళ్ళేరుంజింగనికిని కోపము వచ్చినది. అతడు రావణాసురునివంటివాడు గదా ! అతనికిని రావణుని కోపమువలెనే వచ్చినది. వాల్మీకి రావణునికి కోపము వచ్చినప్పుడు 'రేజుర్వింశతి దృష్టయః' అని వర్ణించెను. కాళ్ళేరుంజింగనికి రెండు కన్నులే యున్నను, అవియే ఇరువదికన్నులవలె నుండినవి ! అట్టి రావణునికోపమును గూడ ఈ గోదావరిపండితుల కోపము అతిశయించినది. వారు కాళ్ళేరుంజింగని కోపమును లెక్కచేయలేదు ! బయలు దేరిరి !

ఎక్కడికి వెళ్లగలరు ? ద్వారపాలురు వారిని బయటికి పోనీయక యడ్డగించిరి!

వెర్రికాలను నగ్రహారమున కగ్రణి యగు ఛాందసకవి కేతన కాళ్ళేరుంజింగని దిక్కు తిరిగి యిట్లనెను :

"మహాసంతోషమైనది, రాజసింహా, మహాసంతోషము ! రంగస్థలమున మరణప్రదర్శనము చేయుటచే నీ కూడినసభ కంతయు నాశౌచము వచ్చినది. మమ్మును గోదావరిలో స్నానముచేయ బోనిండు ! ఇంత మహాపర్వమున నెంత పని జరిగినది ! అయ్యో, రేమి యీ యాగడము ! ఎంతసేపు ఈ మైలగుడ్డలతో నిట్లు పడియుందుము !"

పుష్యమాసపు చలి ! ఈ బ్రాహ్మణులు ఉపవాసముచేసిన శ్రమతో నున్నారు. ఉత్తరపుగాలి ప్రారంభమైనది. ఈ చలిలో ఈ రాత్రివేళ నిందరు గోదావరిలో స్నానమున కుపక్రమించుచున్నారు ! కాళ్ళేరుంజింగని రాక్షసప్రకృతి ప్రకోపించినది. కోపము పట్టలేకపోయెను. అద్భుతమైన భరతవాక్య మంగళము తనకు ప్రాప్తము కాకుండ విఘ్నము కావించినారు. ఈ రూపకమున భరతవాక్యముగా బలదేవుడు ఈశ్లోకపాదమును చదువును.

"గాం పాతు నో నరపతిః శమితారిపక్షః"

మరియు దానికి తోడుగా పంచరాత్రమను మరియొక రూపకమునుండి యీ క్రింది శ్లోకార్థమును చదివింప కాళ్ళేరుంజింగడు సూత్రధారుని శాసించియుండెను.

"ఇమామపి మహీం కృత్స్నాం రాజసింహః ప్రశాస్తు నః !"

దాని కొరత డక్కడి సామాజికుల యంగీకారము పొందదలచి యుండెను. అతని మహోత్సాహమును వీ రిప్పుడు భంగపరచియుండిరి. రూపకము త్వరలో పూర్తి కానున్నది. పావుగడియకూడ పట్టదు. భరతవాక్యపాద మంతముగా గల యొక్క శ్లోకమే మిగులు. ఈ బ్రాహ్మణులు తనకు సిద్ధముగా నున్న మంగళమును కాకుండ పాడుచేసినారు !

'ఈ రసహీను లగు నాంధ్రబ్రాహ్మణుల నందరిని ముక్కలుముక్కలుగా నరకివేయింప నాజ్ఞాపింతును !!

ఈవిధముగా నాజ్ఞాపింప నాలుకలో పలుకులు కదలుచుండెను. ఆ కోపావేశముతోపాటు, చిత్రముగా నొక భయావేశమును అతనిని పూనెను. స్నానము చేసి శౌచము నొందగోరుచు తొందరపడుచున్న యాబ్రాహ్మణోత్తముల చాదస్తము చూచెను వారందరు నప్పటికే తమ జన్నిదములు కావళముగా వేసికొనిరి. అతని కంఠలో పట్టరాని నవ్వే వచ్చెను. వారి ముఖములలో వ్యక్తమగు స్నానవ్యగ్రతకు అతడు వికృతముగా నవ్వెను.

"వెళ్లండి !"

రాజసింహుని నోట నరకివేయు డని యాజ్ఞ వచ్చు నను నూహతోడనే ద్వారపాలురు ఖడ్గము లెత్తి సిద్ధముగా నుండిరి. రెండు రెప్పపాట్ల కాలములో నా బ్రాహ్మణు లందరు నరుకబడి నరకలోకమునకు వెళ్లియుండెడివారే ! రాజసింహుని యాజ్ఞ రాగానే భృత్యులందరు నొక్కసారిగా ఖడ్గములు దింపి దారి విడిచిరి,

బండె విడిచిన వృషభసమూహమువలెనే ఆ గోదావరిపండితులందరు ఒక్కపెట్టున వసిష్ఠగోదావరికి ఆశౌచనివృత్తిస్నానమునకు సంభ్రమమున బయలువెడలిరి !

ఇక రూపకప్రదర్శనము సాగించుటాకి తెరలోనుండి నటులు వచ్చుటకు సిద్ధముగా నుండిరి. సూత్రధారుడు కొప్పెరుంజింగని యనుజ్ఞకై యెదురుచూచుచుండెను.

అట్టి సైగ చేయబోవుచు, కొప్పెరుంజింగడు తనతో వచ్చినకన్నడ ద్రావిడ పండితులవంక చూచెను. వారి మనస్సులును అందోళన చెందుచున్నవి. వారక్కడ మళ్లమీద కూర్చున్నవారై యుండిరి. గోదావరిబ్రాహ్మణుల ధర్మనిర్ణయము వారికిని ఎక్కినది. వారు నిర్వచించిన యాశౌచము వారి మనస్సులకును పట్టినది. వారి యజ్ఞోపవీతములును నివీతము లైనవి. కొప్పెరుంజింగ డిట్టిది జరుగునని కలలో కూడ తలపలేదు. అతని చూపు చూచి యా ద్రావిడపండితులలో నొక డామాట ధైర్యము చేసి యనివేసెను.

కొప్పెరుంజింగనికి కాళ్ళాడలేదు. ఇట్టిది జరుగు ననియాత డూహింపలేదు. అతనికి ధర్మమం దభిమాన మున్నది. దైవభక్తి యున్నది. యథాశాస్త్రీయముగా పూజ నిర్వర్తింపవలె నను నాస్థ యున్నది. అతనికే అనుమానము కలిగినది !

“అయ్యో, కనకసభాపతిపూజ పూర్తి కాలేదే! అయ్యో!—మధ్యలో నాశౌచము వచ్చినది. కర్తవ్య మేమి?...”

పూజామధ్యములో వచ్చిన యాశౌచము పూజ పూర్తిగావించుటకు అడ్డువచ్చునా! ఇది యవాంతరముగా వచ్చినది కాదు; భరతప్రయోగమునే వేతుగార తెచ్చిపెట్టుకొన్నది. ఇది చూచిన నటరాజస్వామి క్రుద్ధుడై యుండునా? ఆ మహాదేవునికి, నిత్యశ్మశానసంచారికికూడ, మనతోపాటు నశౌచము గదా! కొప్పెరుంజింగడు ఈ సందేహములతో చూడగా ఎదుర నున్న నటరాజస్వామి కళావిహీనుడైనట్లు కన్పించెను. గోదావరి బ్రాహ్మణుల ధర్మనిర్ణయమును నటరాజస్వామియే శిరసావహించినట్లు కనబడెను.

“అయ్యో! ప్రదర్శనము పూర్తికాలేదు. నటరాజస్వామిని భరతప్రయోగమవధరింపు మని అది పూర్తిచేయక లేచుటా? పూజ పూర్తిచేయుటా? పూజ పూర్తి కాకుండ లేచుటా?”

ఇట్లాలోచించుచు తన పురోహితునివంకను ద్రావిడాదిపండితులవంకను తిరిగెను. ద్రావిడపండితులును తానములాడ వ్యగ్రులై తమ యాసనములనుండి కదలుచుండిరి. అతని మాటలు నోటిలోనే నిలిచిపోయెను.

అతని శిబిరముబయట భయంకరనాదము లుప్పతిల్లెను. పరమప్రమాదము సూచించు ఘంటానాదములును శంఖనాదములును భేరీనాదములును కొట్టవచ్చినట్లు వినవైనవి. అవల సముద్రయుద్ధమును ఈవల నేలపై యుద్ధమును తన చుట్టు శిబిర రక్షణమును—ఈ మూడును తనకు ప్రతికూలము కానిది ఆ ఘోషలు వినరావు!

మహాధైర్యశాలి యగు కొప్పెరుంజింగనికి భయమే ఆవేశించినది. తాను ఉదయమునుండియు జనకమహారాజునంతవాడ ననుకొనెను. అట్లందరు ననుకొనవలె నని ప్రవర్తించెను. ఈ క్షణములో నది యంతయు ఒక్కసారిగా నతడు మరచిపోయెను.

నాటకము పూర్తికాలేదు. భరతవాక్యము చెప్పలేదు. ఇష్టదైవతసాయంకాల పూజ పూర్తి కాలేదు. వ్రత సమాప్తి కాలేదు. తాను ఆహ్వానించిన భూసురుల పూజ కాలేదు. ఆ పూజామందిరము వెలుపల కవచితమై సర్వాయుధసజ్జితమై యున్న తన మత్తగజము నాతడధిరోహించెను. ఆత డేమి చేయునో తెలియక యాతని పురోహితుడు వెంటనడచియుండెను. అతడు గజారోహణ మంత్రము ప్రారంభింపక మున్నె, కొప్పెరుంజింగడు దానిపైని తత్తరముతో నెక్కి వేసెను.

నడిమింట చంద్రుడు చల్లని వెన్నెలలు గాయుచు చలిని మరింత తీవ్రము చేయుచున్నాడు. ఉత్తరపుగాలి జనులను వడకించి వేయుచున్నది.

కొప్పెరుంజింగని శిబిరమంతయు నల్లకల్లోలముగా నున్నది. ఆత డేకాంతముగా నున్న శిబిరమునే పెద్ద యశ్వదళ మొకటి తాకినది. దాని నాతని సైనికులు

ప్రతిఘటించుచున్నారు. కాని శత్రుప్రోద్ధతిని వారాపలేకున్నారు. ఏమి చేయుటో, ఎటు పోవుటో తోచక ఆత డాలోచించుచు నొక్కక్షణ మాగెను.

అశ్వికవార్తాహరు డొక్కడు యుద్ధవార్త తెచ్చెను. "ఆంధ్రగజముల కెట్లో నూతనశక్తి వచ్చినది. మన యశ్వదళములు విచ్చిపోయినవి. మన సేనానాయకులు వాని నాపలేకున్నారు!"

ఆ వార్తాహరుని వెంటనే మరియొక వేగరి వచ్చి, సముద్రయుద్ధములో చోళనావలు కాకతీయనావలకు తాళలేక మునిగిపోయినవి పోగా, తక్కినవి పారిపోయిన వనియు, వాడరేవులోనికి కాకతీయనౌకలు విజయగర్వముతో ప్రవేశించుచున్న వనియు, మరియొక వార్త తెలిపెను.

తన శిబిరమును ముట్టడించిన యశ్వదళముకూడ, అన్ని యాటంకములను అతిక్రమించి, లోనికి త్రోసికొని వచ్చుచుండెను. వెంటనే రాజసింహుడు తన ప్రధానపరివారమును తరులపై వసిష్ఠగోదావరి నుత్తరింప నాజ్ఞాపించి, యతడు తన మత్తగజమును ఏకాంతస్థలమున గోదావరిలో దింపెను. పాలికగజములు ప్రవాహమధ్యమునకు పోయి యాత డించుక వెనుదిరిగి చూచెను. అతని పరివారమును రాణివాసజనమును పడవలలో బయలుదేరవలసియుండెను. కాని పడవలు బయలుదేరుచున్న జాడయే లేదు. చూడగా నీవలియొడ్డున పడవలే లేవు! ఐదువందలకు పైగా ఆత డిటువైపున నదీతరణమునకు పడవలు సమకూర్చి యుంచెను. అం దొకటియు నిప్పు డిటువైపున లేదు! ఏమైనవి? తన పరిజనము నెట్లు రాగలదు?

చూచుచుండ నాతని పరిజనులు కాని పడవలుకాని యాతనికి కనిపింపలేదు. కాని, ఆతడు వదలిన యొడ్డుపై నొక యాశ్వికుడు చూడనయ్యెను. ఆత డెక్కినది సామాన్యాశ్వము కాదు. ఆ యెక్కినవా డెవరో మహారాజై యుండవలెను. ఆతడును నీటిలో ఎవరికొరకో వెదకుచున్నట్లు కనిపించెను. తన్నే వెదకుచున్నాడేమో! ఇటు నటు నొడ్డుపై నాతడా యశ్వమును కొంత త్రిప్పెను. అంతలో నాతడు కొప్పెరుంజింగని గజమును నీటిలో నుపలక్షించిన ట్లున్నాడు! ఆ యాశ్వికుడు వెంటనే నోట నురుగులు గార్చుచున్న తన యాజానేయమును వసిష్ఠగోదావరిలోనికి దింపెను. అదియు చురుకుగా నీదుకొనివచ్చుచున్నది.

అది చూచి కొప్పెరుంజింగడు తన మత్తగజమును వెనుకకు త్రిప్పెను. ఆ రౌతుని తురగమును సమీపించినది. అప్పుడా వసిష్ఠ గోదావరీప్రవాహమధ్యమున, గజ మధిష్ఠించియున్న కొప్పెరుంజింగనికిని, ఆ యాశ్వికునికిని ద్వంద్వయుద్ధము ప్రవర్తిల్లెను.

ఆ యేనుగు పెద్దగా ఘీంకరించి, తొండ మెత్తి యాహయమును దానిపై నాశ్వికుని నొక్క బలమైన పోటు పొడవబోయెను. ఆ గుర్రము హేషచేయుచు మెలకువగా ప్రక్కకు తొలగినది. [illegible] నా దెబ్బ తప్పెను. అప్పుడే

ఆ యాశ్వికుడు, ఆ గజమును కవచముచే ననావృతమగు భాగము వెదకి గురిచూచి పొడిచి నొప్పించెను. ఆ సమయమున కొప్పెరుంజింగడు నిడివి యగు తన శూలముతో నా యాశ్వికుని రొమ్ముపై పొడిచెను. కాని యక్కడ కవచ మున్నందున శూలము ఖంగు మని మ్రోగెను. గుఱ్ఱముపైనుండి యా తాపుకు కొంచెము వెనుకకు తగ్గియు నాతడు మరల తన యాసనమున కుదురుకొనెను. అట్లు కుదురుకొని, వెంటనే యతడు బుసలుకొట్టుచు రోషావేశముతో, కొప్పెరుంజింగని తన శూలముతో పొడువజూచెను. కాని యాతని కొక చేత గుఱ్ఱపుకళ్లె మున్నది. ఒంటి చేతితో శూలప్రయోగము బలముగా చేయలేడు. ఏనుగుపై నున్న కొప్పెరుంజింగనికి రెండు చేతులును ప్రయోగమునకు అనువుగనే యుండెను. కాని యాతడు ఆనాటి యుపవాస శ్రమతో బడలియున్నాడు. దానికి తోడు తన సేనలు పరాజయము నొందినవను వార్తతో నిరుత్సాహుడై యున్నాడు. పైపెచ్చు అతని రాణివాస స్త్రీలుకూడ శత్రువశ మైన ట్లున్నారు. పైగా కవచావృత మైన దేహముతో నాతని గజము నీటిలో సుఖముగా కదలుట లేదు. అందులో దానికి కలిగిన శూలఘాతముచే మర్మస్థానము నొచ్చిన ట్లున్నది.

"ఎవ డీయాశ్వికుడు? నాకు పూర్వపరిచితుడుగా కనబడుచున్నాడే? ఎక్కడి పరిచయము?"

వారిద్దరికిని ఆ నీటిలో జరుగుచున్న ద్వంద్వయుద్ధము గందరగోళముగా నున్నది. అంతలో వారిద్దరు నన్యోన్యశూలఘాతములతో తమ వాహనములనుండి పడిపోయిరి. నీటిలో నట్లు పడిపోయినను వారిద్దఱు పోరు చాలింపలేదు.

ఇద్దరును కవచాచ్ఛాదితగాత్రులే! నిరాయుధులయ్యు వారిద్దరు నొకరి నొకరు చంపివేసికొను నుత్కంఠతో నీటిలో కలసికొనిరి. కాని వారి దేహము లాడుటలేదు. కాలుచేతులు కదలుటలేదు. కవచముల బరువుతో నీటిలో తేలనే లేకున్నారు! ఇద్దరను పాటుకు తిరిగిన వసిష్ఠగోదావరీ జలప్రవాహము మహాసముద్రమువైపునకు లాగివేయుచున్నది! ఒకరినొకరు చంపుకొనఁ గలసినవా రిద్దరు, నొకరు మునిగిపోకుండ నొకరిని అప్రయత్నముగా ఊతగొన కౌగలించుకొనుచుండిరి. ఆ యాలింగనము మృత్యుదేవతయాలింగనమువలెనే యిరువురకు నున్నది. దానిచే నిరువురు నీటిలోనికి పోవుచు, నీరు గ్రుటకలు వేయసాగిరి. ఆ మహాప్రవాహమున వా రేమి యుద్ధముచేయగలరు?

సృష్టికి పూర్వము శ్రీమహావిష్ణువు అసహాయుడై నిరామయమైన సముద్ర జలమధ్యమున మధుకైటభులతో ఐదువేలసంవత్సరములు ఒకే బిగువున మల్లయుద్ధము చేసెనట! కాని యీ వీరు లీ వసిష్ఠగోదావరిలో నైదునిముషములు గూడ యుద్ధము చేయలేకపోయిరి.

వా రిద్దరి కాయములును చలికి బిగిసికొనిపోయినవి. అవయవము లాడుట లేదు! పవిత్రమగు వాసిష్ఠగోదావరీజలములలో నా వైకుంఠైకాదశీమహాపర్వమున వారిద్దరికి నొక్కసారిగా స్మృతిపోయినది!

౩౮

ఏకశిలానగరమున శిలాప్రాకారనిర్మాణము చురుకుగా సాగిపోవుచున్నది.

కేశవశ్రీస్వయంభూనికేతనములలో వైకుంఠైకాదశి మహోత్సవముగా జరుగును. అక్కడ కేశవభక్తులకును స్వయంభూశేశ్వరభక్తులకును విరోధము లేదు. పలువురు ఉభయభక్తులు. అక్కడ నేపర్వమునందును ఉభయదేవాలయములలో పూజలు విశేషముగా జరుగును. ఒక్కటే భేదము! ఆ పర్వము, విష్ణుదేవప్రీతికరమైనచో కేశవాలయమున పూజ ప్రధానము, శివప్రీతికరమైనచో స్వయంభూదేవాలయమున పూజ ప్రధానము. కేశవాలయమున నర్చకులు వైఖానసులు; స్వయంభూదేవాలయమున నర్చకులు శివార్చకులు. అనాదిగా స్మార్తులు అభిమానించు దేవాలయములలో నిదే యాచారము!

గణపతిదేవులు చిన్నతనమున దేవగిరిలో చెరసాలలో నున్న దినములందు ఓరుగల్లును కాకతీయసామ్రాజ్యమును మిక్కిలి యలజడిగా నుండెను. అప్పుడు దానికి పొరుగున నున్న హొయిసల బల్లాలరాజ్యమట్లు కాక శాంతముగా నుండెను. అందుచే కాకతీయరాజ్యములోని చాతుర్వర్ణ్యప్రజలు పలువురు హొయిసలుల రాజ్యములో తలదాచుకొనబోయిరి. అక్కడ నప్పుడు శ్రీవైష్ణవమతము ప్రబలముగా నుండెను. శ్రీమద్రామానుజులను స్వయముగా చూచినవారును, వారి కైంకర్యముచే ధన్యులైనవారును, వారి యుపదేశములు ఆలకించినవారును, వృద్ధవైష్ణవు లప్పుడు సహస్రాధికముగా నక్కడ నుండిరి. అట్టివారి భక్తిప్రపత్తులచే ముగ్ధులై, వారి తేజఃప్రభావములకు మురిసి, వారి వాదపటిమచే నాకృష్టులై, యక్కడి చాతుర్వర్ణ్యజనమును రామానుజమతము విరివిగా నవలంబింపసాగెను. అక్కడివారితోపాటు కాకతీయరాజ్యమునుండి వెళ్లిన ప్రజలును పలువు రామత మవలంబించి వైష్ణవులైరి.

శ్రీవైష్ణవుల బల మతిశయించినయెడల నెల్ల, అనాదిగా వైఖానసు లర్చకులుగా నున్న దేవాలయములలో, ఈ నూతనవైష్ణవుల ప్రాబల్యము నెమ్మది నెమ్మదిగా నెక్కువకాజొచ్చెను. దానితోపాటు పన్నిద్దరాళ్వారుల ప్రతిష్ఠలు ప్రారంభించెను. పూర్వము ద్రావిడవేదపారాయణము భక్తులైనవారు కొందర రభిమానముతో నా దేవాలయములలోగూడ జేసెడివారు. కాని యప్పు డది యితరస్తోత్రములు చదువుచున్నట్లే అందులో నొకటిగా నుండెడిది. తర్వాత తర్వాత నది నియతముగా చేయవలె నను విధి నెమ్మదిగా కొన్ని దేవాలయములలోని కెక్కసాగెను. కైంకర్యాదులలో వైదికమంత్రములను వదలి ద్రావిడపాశురములు ప్రయోగించుటకు వైఖానసు లిష్టపడుచుండుటలేదు.

వైఖానసులకును ఈ నూతనవైష్ణవులకును నిలువుబొట్టును విష్ణుభక్తియు సమానమే యైనను ఎన్నియో అవాంతరభేదములు కలవు. ఆ బొట్టులోకూడ వైఖానసులకు క్రింద పాద ముండదు. నూతనవైష్ణవులలో పలువురకు పాద ముండును. కొందర

కుండదు. తిరుచూర్ణపురంగులోకూడ భేదము లుండును. వితంతువులు జుట్టు తీయిం చుటలోనను, భగవదారాధనలో ఘంటావాదనము చేయుటయందును ఆచారభేద ములు కలవు. వడఘువైశాఖ ఇంకను బాగుగా వృద్ధికానందున నూతనవైష్ణవుల యాచారములు మొత్తముమీద వైఖానసుల పద్ధతులకు విరుద్ధముగానే ఉన్నవి. ఈ నూతనులు ఏకాదశీశ్రాద్ధవర్జనము చేయుట, దేవతారాధనములో ఘంటావాదనము చేయకుండుట, సహగమనము చేయని వితంతువులు కేశము లుంచుకొనుట యిట్టి యాచారముల నవలంబించుచుండుటచే, వైఖానసుల కెక్కువ కష్టముగా నుండ సాగెను.

ఈ చిన్న చిన్న యాచారము లెట్లున్నను, వారి భేదములలో ముఖ్య మైనది చక్రాంకణము! వైఖానసులు గర్భచక్రాంకణము చేసికొందురు. అనగా వైఖానసస్త్రీ గర్భవతిగా నుండగానే, అష్టమమాసమున కొన్ని హోమా దికములు చేసి, శంఖచక్రాంకితమై సంస్కృతమైన పాయసమును ఆమెచే ప్రాశన చేయింతురు. ఈవిధముగా గర్భమునందలి శిశువునకు చక్రాంకణమగును. అది కానివారు దేవాలయాదులలో భగవదారాధనకు అనర్హు లని వారి సిద్ధాంతము!

ఈ విధముగా నాగర్భవైష్ణవులు కాక, నూతనముగా వైష్ణవము పుచ్చుకొ న్నవారికి గర్భచక్రాంకణము లేదుగదా! మొదలు చక్రాంకణమే లేకుండెను. శ్రీమద్రామానుజులు తప్తచక్రాంకణము నంగీకరించె ననియు నంగీకరింపనే లేదనియు రెండువాదములు ప్రబలియుండెను. కాని మొత్తముమీద కొంతకాలమునుండి ఈ నూతనవైష్ణవులు తప్తచక్రాంకణము చేయించుకొనుట పరిపాటి యైనది. తప్తచక్రాంకణ మనగా, తప్తమైన వస్తువుతో రెండు భుజములమీదను శంఖ చక్రచిహ్నములు శాశ్వతముగా నుండునట్లు వేయించుకొనుట. ఇది యొకానొక మంత్రసంస్కారముతో జరుగును. ముఖ్యముగా ఈ సంస్కారమే ఈ నూతన వైష్ణవులను వైఖానసులనుండి వేరుచేసి గుర్తించుటకు అనువైన బాహ్యచిహ్నముగా నుండెను.

కాకతీయసామ్రాజ్యమున గణపతిదేవులు కొంతి నెలకొల్పినకాదిగా, బల్లాల కర్ణాటకరాజ్యమున పూర్వము తలదాచుకొనబోయిన కాకతీయప్రజలు పలువురు మరల స్వస్థానములకు నెమ్మదిగా చేరికొనసాగిరి. వారివెంట నీ రామానుజమతమును కాకతీయరాజ్యమున బలపడజొచ్చెను. అక్కడ వైష్ణవమత మవలంబించిన బ్రాహ్మ ణులు శ్రీవైష్ణవసంజ్ఞతో తిరిగి వచ్చిరి. వారిలో పలువురు వేదవేదాంగవిదు లుండిరి. ఎన్నియో సంబంధముల బురస్కరించుకొని కర్ణాటులగు శ్రీవైష్ణవులును, ఉద్దండులగువారు, కొంద రిచ్చటికి వచ్చిరి. వారితోపాటు శ్రీవైష్ణవుల ప్రాభవ మును కాకతీయసామ్రాజ్యమున నతిశయింపజొచ్చినది. వారి కిక్కడి శాస్త్ర పండితులతోడను శైవులతోడను వివాదములు పెరుగజొచ్చినవి. వైఖానసులు ఎక్కువభాగము భగవత్కైంకర్యములలో నియుక్తులై యుండుటచే వారిలో నితర

విద్వత్పరిశ్రమ బహుకాలముగా క్షీణించియుండెను. కాని యిప్పుడు విష్ణుపారమ్యము సమర్థించు శ్రీవైష్ణవపండితుల యందు వారికి కొంత నూతనచైతన్యము కలిగించెను. దానితోపాటు వారిపై శ్రీవైష్ణవుల యొత్తిడియు ప్రారంభించినది.

కేశవస్వామి యాలయమునకుగూడ శ్రీవైష్ణవులు వచ్చుచుండిరి; గాని యచ్చటి యాచారములను మార్చుటకు ఇంతవరకు నెప్పుడును వారు ప్రయత్నించియుండలేదు. వా రచ్చటికి వచ్చి మహాభక్తితో ద్రావిడపాశురములు పఠింతురు. దాని కెవరి కేమి యభ్యంతరము ?

వైకుంఠైకాదశి ధనుర్మాసమున పుష్యశుద్ధైకాదశినాడు వచ్చును. ఆ పర్వనిర్ణయములో స్మార్తులకు శ్రీవైష్ణవులకు వైఖానసులకు నీషద్భేదము లున్నవి. ఒక్కొక్కరోజు హెచ్చుతగ్గులు వచ్చును. శ్రీవైష్ణవులు సందేహము కలిగినచో శ్రీరంగక్షేత్రమునందలి నిర్ణయమును పాటింతురు. ఈ సంవత్సర మట్టి భేదము వచ్చినది. స్మార్తులకైన మరునాడు శ్రీవైష్ణవుల కైనది. ఇప్పటికి వారము దినములనుండియు నా దేవాలయావరణములో వాదప్రతివాదములు సాగుచుండెను. వైఖానసులు మొత్తముమీద స్మార్తపక్షమే యవలంబించిరి. ఈ సందడిలో తిక్కనసోమయాజుల మహాభారతరచన సరిగా సాగుచుండుటలేదు.

కేశవస్వామియాలయములోని యర్చకులు వైఖానసు లైనందునను, వారందరును స్మార్తనిర్ణయము ననుసరించువారైనందున, ఈనాడే వైకుంఠైకాదశీ మహోత్సవము వారు జరుపుచుండిరి. శ్రీవైష్ణవుల కది కంటకముగా నున్నది గాని యేమి చేయగలరు ?

త్వరలో నుత్తరాయణపుణ్యకాలము రానున్నది ! దానికై ముందుగనే ఈనాడు విశ్వమూర్తి యగు శ్రీమహావిష్ణువు ఉత్తరద్వారము తెరపించి భక్తులకు దర్శన మిచ్చును. ఇక నారాయణునితోపాటు భక్తులును ఉత్తరాయణము తిలకింప సిద్ధముగా నుందురు. దానినే స్మార్తులు ముక్కోటిఏకాదశి యందురు. దాని కాపే రెట్లు వచ్చెనో, ఆపదముల కూర్పు ఎట్లు సాధ్యమో, చెప్పలేము; కాని ఆపేరుకు అశేషమగు నాంధ్రలోకమే సాక్ష్యము. ఎన్ని యర్థములైనను దాని కూహింపవచ్చును.

మనోజ్ఞముగా మంగళతూర్యారవములు మ్రోగుచుండ బ్రహ్మరథ మెక్కి, శ్రీకేశవస్వామి తెల్లవారుజాముననే భక్తులకు ఉత్తరద్వారదర్శన మిచ్చి, మహావైభవముతో విశాలమగు దేవాలయావరణమున నూరేగుచుండెను. భక్తులు తండోపతండములుగ మూగి యాయుత్సవవిగ్రహములకు కానుక లర్పించుచుండిరి. భూచక్రగొడుగులు సాగుచుండ, అర్చకులు వింజామరలు వీచుచుండ చలువచప్పరములో సర్వాభరణభూషితుడైయున్న యా కేశవస్వామిని ఆనాడు చూచినవారివే కన్నులు !

ఆ సమయమున స్వయంభూదేవాలయమునగూడ విశేషముగా నభిషేకార్చనలు జరుగుచుండెను. ఆ సమీపముననే నూతనప్రతిష్ఠితుడగు నన్నమేశ్వరుని యాలయమున యథాశాక్కుల అన్నమయ్యయు రుద్రాభిషేకము నిర్వర్తించుచుండెను. ఆ యాలయముఖమండపమున శివభక్తులు గుంపులుగా మూగి భక్తివినమ్రులై ప్రమథగణములవలెనే యలరారుచుండిరి.

అట్టి సమయమున నూతనవైష్ణవుల తండ మొకటి భజనచేయుచు నాలయప్రదక్షిణము చేయుచుండెను. కేశవశ్రీస్వయంభూదేవాలయము సావరణము నలుచదరముగా నుండి ఒక్కొక్కప్రక్కను రమారమి రెండు వందలవిండ్లప్రమాణముండును. సరోవరమున్నవైపున గాక మిగిలిన మూడువైపులను రాజవీధి కావల జనసంకులములగు గృహముల శ్రేణులు కలవు. ఆ ప్రాకారము భజనచేయుచు చుట్టివచ్చునప్పటికి నాలుగు గడియలు పట్టును.

ఆ శ్రీవైష్ణవుల కానాడు వైకుంఠైకాదశి కానందున లోపల నూరేగుచున్న కేశవస్వామిని దర్శింపవలె నను నత్సుకత లేదు. ఆ నూతనవైష్ణవతండమునకు అగ్రేసరుడై శ్రీవైష్ణవు డొక్కడు నడచుచుండెను. ఎరుపు కలసిన పచ్చనిదేహముపై దీర్చిన ద్వాదశోర్ధ్వపుండ్రములును ఆతని దేహశోభను మరింత యతిశయింపజేయుచుండెను. అందును రెండుభుజములందును తేలియున్న తప్తచక్రాంకణములు చూడ శ్రీమహావిష్ణువే యీరూపమున నవతరించెనా యనిపించుచుండెను. ఆతడు చూడగా నీదేశపువాడుగా లేడు. కర్ణాటదేశమునుండి క్రొత్తగా వచ్చినవానివలె నున్నాడు. కర్ణాటదేశమున వైష్ణవులును శైవులును ఒకరినొకరు దూషించుకొనట పరిపాటి. శివాతిశయము చెప్పవలె నన్న విష్ణువును దూషించుటయు, విష్ణ్వతిశయము చెప్పుటకు శివనింద చేయుటయు నచ్చటి యాచారము. వారికి పరపక్షులపై నుండు ద్వేషము, ఎదిరి యిష్టదైవములను తెగడుచుండుటతో శాంతించుచుండెను.

ఆ కర్ణాటశ్రీవైష్ణవు డీ క్రిందివిధముగా నందుకొని పాడుచుండ నాగుంపులోనివా రాతనివెంట నది యట్లే ఉచ్చరింపసాగిరి :

“నీ పాదోద్భవనీరము శిరమున
నిత్యము దాల్చుట నీలకంధరుని
పునుకలపేరులు పూసిన బూదియు
పూనిన పుర్రెయు పూతము లయినవి ;
కొలుతుము కేశవ, కులిశధ్వజహల
కలితభవచ్ఛిత్ క్రమపదద్వయి !

* * * *

“భద్రప్రద నీ పదములు పాడుట
రుద్రాంశాంచితరుద్రభూచరుం

డష్టైశ్వర్యము లంది మానుకొని
నడుగుచు తిరిపెం బవని జరించుట ;
నారాయణ నీ నామసహస్రము
శ్రీరాజితముగ జిహ్వ భజింతును !

*   *   *

"కమలనయన నీ కారుణ్యామృత
విమలకటాక్షము విరిసి పర్వటను
సుకృతి యగుచు నాసురసేవ్యుం డగు
వికృతాంబరు డౌ వికటన యనుడును,
సారసపత్రవిశాలవిలోకము
నీ రమ్యాకృతి నిరతము చూపుము !

ఈ భజనపరులు అన్నమేశ్వరుని యాలయముముందుకు వచ్చి యీ పాట యావేశముతో పాడుచుండిరి. అందును చివరిభాగము ముమ్మారు పాడిరి. 'అసురసేవ్యుడు' 'అసురసేవ్యుడు' 'ఆసురసేవ్యుడు !'

అన్నమేశ్వరుని యాలయముముందర నున్న శివభక్తులు అది మొదటిమారు వినిరయే హుంకరించిరి. ఆ పాట లోపల నభిషేక మొనరించుచున్న అన్నమయ్యకు గూడ వినబడినది. వాకిట ప్రమథులు చేసిన హుంకారమును ఆయనకు వినబడినది.

రెండవమారు విని వారు మరల హుంకరించిరి. రెండవమారును ఆ పాటయు, వాకిట ప్రమథుల హుంకారమును, యథావాక్కుల అన్నమయ్యకు వినబడినవి. అసురసేవ్యుని దలపించుటలో నాతనికి అసురప్రకృతి ప్రకోపించినది. రోషము పిచ్చలించినది. కాని యది యాతడు నిగ్రహించుకొనుచుండెను.

మూడవమారు ఆ పాట వారు పాడిరి. మూడవమారు అది విని ప్రమథులు హుంకరించిరి. మూడవమారును అన్నమయ్య కవి వినబడినవి !

రుద్రాభిషేకము చేయుచున్న యథావాక్కుల అన్నమయ్యకు అభిషేకభంగ మైనది. ఒక్కసారిగా నాతడు క్రోధదుర్నిరీక్ష్యు డయినాడు. అతని దేహమే పొంగి యా చిన్న దేవాలయమంతయు నిండినట్లయ్యెను. ఒక్కమా రాతడు వెనుదిరిగి చూచెను ! చూచెను. అంతే !

అతడు తన ఫాలభాగమున మూడు విభూతిరేఖలు తీర్చియుండెను. వాని మధ్యభాగమున నాత డంతవరకు కుంకుమము పెట్టుకొని యుండలేదు. లోపలి నుండి రక్తమే స్రవించెనో, మరి యేమయ్యెనో గాని, ఆ మూడు విభూతిరేఖల మధ్య

భాగమున ముందు ఎఱ్ఱగా చెమర్చిన ట్లయ్యెను; ఉత్తరక్షణమున నచ్చట కుంకుమాంకిత మయ్యెను; అంతలో నందుండి రక్తమే స్రవించుచున్న ట్లుండెను.

రక్తము కాదది! రక్తమురంగుగా నున్నను అది క్రిందికి పారుటలేదు. గొట్టముతో చిమ్మినట్లు ముందుకు ప్రసరించుచున్నది. అది యొక కాంతిప్రసారము! అగ్నిప్రసారమే! సాంబసదాశివుని వికటాంబకము శ్రీవైష్ణవులు తలపించుటచే నది యా భక్తాగ్రేసరుని నొసట ప్రత్యక్షమైనది.

అక్కడ మూగియుండిన శివభక్తులకే భయమైనది. వారు రెండుచేతులు శిరోగ్రముల జోడించి "హర హర మహాదేవ శంభో!" యని మాటిమాటికి గొంతెత్తి యరచుచు మ్రొక్కుచు ఆ కాంతిపుంజమునకు తొలగి దారి యిచ్చిరి. ఆ కాంతి పుంజముకూడ గంగాయమునానదీప్రవాహములవలె రెండై, సూటిగా పోయి వాకిట శివనింద చేయుచున్న శ్రీవైష్ణవాగ్రేసరుని రెండుకన్నులలోకే ప్రవేశించెను! ఏమైనదో! ఆ శ్రీవైష్ణవుడు రెండుకన్నులు మూసెను! ఆత డంతట నిలువలేక నే పోయి కన్నులు తిరిగి నారాయణస్మరణము చేయుచు క్రిందబడిపోయెను.

అన్నమయ్య యల్లే వెనుదిరిగి చూచుచుండెను. ఆతని భ్రూమధ్యమునుండి పొంగి స్రవించుచున్న యా తేజోధార యా వైష్ణవతండముపై నెల్ల ప్రసరించుచుండెను. అది ప్రసరించినచోట నెల్ల అది కాల్చివేయుచుండెను. దానితో నా నూతనవైష్ణవతండమున వా రెల్లరు వీపులు కాలినవారును బుజములు మాడినవారును రొమ్ము లంటుకొనినవారును నైరి.

'హరి హరీ!' 'నారాయణ, నారాయణ!' 'రంగనాథా! రంగనాథా! రంగనాథా!'

ఏమున్న నేమి? గజేంద్రుని పరిపాలించిన యా వైకుంఠధాముడు, లక్ష్మీదేవితోకూడి యాడుచున్న చతురంగక్రీడ చాలింపలేదు. ఆతని నయనములే సూర్యచంద్రులు! అందులో నొకటగు చంద్రనయనమున నేదో నలుసు పడినట్లయి యాత డిప్పు డా కన్ను శ్రీచేలాంచలముతో తుడిచికొనుచుండబోలును!

లంకలో అగ్ని ముట్టుకొన్న హనుమంతుని తోకవలెనే అన్నమయ్య ఫాలాగ్నియు ప్రసరింపసాగెను. దాని కాగలేక చెల్లాచెదరై వైష్ణవులు భజన చాలించి పారిపోయిరి.

వారి కగ్రేసరు డగు నా రంగనాథు డచ్చటనే పడియుండెను!

ఆనాటి గొంటూరు చిన్న పట్టణము. ఆ పట్టణమంతయు ఎఱ్ఱచెరువను నొక పెద్ద చెరువుకు తూర్పుననే ఉన్నది. అందులో నొక కోట కలదు. అది మట్టి కోటయే కాని రాతికంటెను కఠినమైన మట్టి. ఆ మట్టిలో కలిపిన పాళ్లు, దానితో సిద్ధముచేసిన పాకము ఆ కోట కట్టిన ప్రధానశిల్పులకు వంశానుక్రమముగా వచ్చుచుండిన రహస్యము! పనివారిచేతనే వా రా పనియంతయు చేయింతురు గాని యా రహస్య మితరులకు తెలియనీయరు. ఆ కోటగోడలకు ఆ ఎఱ్ఱచెఱువునీరేగాని, ఒక్కచుక్కయైనను వేరునీరు వాడలేదు. ఆ కోటయగడ్తకు గూడ ఆ ఎఱ్ఱచెరువు నీరే పెట్టుచుండెడివారు! కోటలో నున్న జలాశయములకు గూడ నీ యెఱ్ఱచెరువు నీరే వెళ్లుచుండబోలును! గొంటూరుకు వాయవ్యభాగమున నంతయు నెఱ్ఱనేల. ఆ ఎఱ్ఱనేలనుండ ప్రక్కలకొండలపై వర్షించిన నీరు ప్రవహించి వచ్చుటచే రాగివలె నెఱ్ఱనై అందులో కలియుటచే దానికి ఎఱ్ఱచెరువను పేరు వచ్చినది. రాగివంటి ఎఱ్ఱనేలనుండి ప్రవహించు నీటిప్రభావము ఎరిగియున్నందుననే కావచ్చు, రాజమహేంద్రవరము ఇత్యాదిప్రదేశములలో గూడ, నిట్టి పుట్టకోటలే గట్టియుండిరి.

ఎఱ్ఱచెరువుకు పశ్చిమమున పెద్ద యరణ్యము కలదు. అందులో ననాదిగా ఇతరవృక్షములతోపాటు పెద్ద తేకుమ్రానులుకూడ పెరుగుచుండెను. తేకుచెట్ల యాకులు నలిపినచో చేతు లెఱ్ఱపడును. అది గ్రహించినశిల్పులు ఆ యాకులు సేకరించి చిత్రకారుల కవసరమగు వర్ణము లెన్నియో కల్పించెడివారు. ఆ తేకుకలప కూడ శ్రేష్ఠమై యెన్నియో విధముల దారుశిల్పాదులకు వారి కుపయోగపడుచుండెను. అందుచే గొంటూరు శిల్పులకును చిత్రకారులకును ఆవాసమయ్యెను. తేకుశబ్దమునకు రూపాంతర మగు తేకునుండియే తేకువశబ్దము కూడ బుట్టినది. గొంటూరిశిల్పులకు తేకువకూడ విశేషము!

ఎఱ్ఱచెరువుకు నీరువచ్చు కొండకాలువ వానుకొని, యీ యడవిలో కొంత కాలముగా బాబాజీల మఠ మొకటి వెలసెను. గౌడదేశమునుండి వచ్చిన వైష్ణవ బ్రాహ్మణులకు బాబాజీలనియు, వారి మఠములకు బాబాజీమఠములనియు నాంధ్రదేశములో పేరు వెలసినది. ఆ మఠములలోని పెద్దలను శిష్యులు 'బాబాజీ' యని వారి భాషలో గౌరవార్థముగా సంబోధించుటచేతను నిర్దేశించుటచేతనే ఆ పేళ్లు కలిగినవని తోచును. గణపతిదేవులయు రుద్రమదేవులయు రాజగురువు లగు విశ్వేశ్వర శంభుదేశికులు గూడ గౌడులే. వారు గౌడరాఢమఠాధ్యక్షులు. కాని వారు శైవాభిమానము గల స్మార్తులు. గొంటూరులోని బాబాజీలు వైష్ణవాభిమానముగల స్మార్తులు. ఈ గౌడశైవులకును గౌడవైష్ణవులకును ద్రావిడ కర్ణాటములందలి శైవవైష్ణవులతో పెట్టి పొత్తును లేదు!

ఈ బాబాజీమఠము ఎఱ్ఱచెరువుకు పశ్చిమమున అర్ధక్రోశము దూరమున గలదు. ఆ యడవిలోననే కొంతభాగము[illegible]చెట్లు నరకించి యక్కడ[illegible]మఠము నిర్మించిరి.

గౌడదేశీయులకు జగన్నాథస్వామి ఇష్టదైవము. ఆ మఠ మక్కడ స్థాపించిన మొదటిబాబాజీ యగు శ్యామలదాసు, అందులో జగన్నాథస్వామికి చిన్నయాలయ మొకటి ప్రతిష్ఠించియుండెను. అట్లామఠముక్రిందికి ఆక్రమణలోనికి వచ్చిన ప్రదేశము నాతడు గొంటూరుప్రభువులచే నగ్రహారముగా పొందుటవలన, దానికి శ్యామలదాసుఅగ్రహారమని పేరు వచ్చెను. ఆ మఠమున కాని ఉత్తరమున నొక చిన్నచెరువు నాతడు త్రవ్వించెను. దానిలోనికి ఎర్రచెరువులోనికి పోవు కొండ కాలువనుండియే చిన్నతూము పెట్టి నీరు పెట్టుచుండిరి. ఆ యగ్రహారప్రజల కది నీటివసతియై యుపయోగపడుచుండెను. ఆ చెరువుకు బాబాజీమఠముచెరు వను పేరు వెలసెను.

ఆ మఠమునకు తూర్పుద్వారమునొద్ద నొకటియు, పశ్చిమద్వారమునొద్ద నొకటియు ఆచ్ఛాదనము లేని హనుమద్విగ్రహములు ప్రతిష్ఠింపబడినవి. ఇవిగాక అక్కడ ననాదిగా జగన్నాథస్వామియాలయమునకు పశ్చిమమున ఏబదిపిండ్ల దూరమున, ఆకాశమే యాచ్ఛాదనముగా గల యొక గణపతివిగ్రహము కలదు. ఆ విగ్రహముక్రింద పెద్ద నిక్షేపము లున్నవనికూడ నొక ప్రతీతి యుండెను.

ఆ మఠము స్థాపించిన శ్యామలదాసుబాబాజీకి, అక్కడనుండి యా గణపతివిగ్రహమును మరియొకచోటికి మార్పింపజూచుచుండగా, నాతని కిష్టదైవ మగు జగన్నాథుడు స్వప్నములో కనబడి యాతని వల దని వారించె నట. తదాదిగా దాని నెవ్వరును కదలింపగూడ దని యాతడు కట్టడిచేసెను.

ఐనను ఆయనతర్వాత మఠాధిపతియైన బాబాజీకి ఆ విగ్రహముక్రింద నున్న నిధి తీయించ నిచ్ఛ కలిగినది. ఆతడును మంత్రతంత్రదక్షుడు. ఆ పని కాతడు తలపెట్టి పెద్దతంతు చేయించి, యచ్చట నొకరాత్రివేళ మహిషాదుల బలి యిప్పించె నట. ఆపిమ్మట నా విగ్రహము పెకలింప నాత డాజ్ఞ యిచ్చెను.

ఆ విగ్రహము కదలింప భూమిపై మొదటి పలుగుదెబ్బ పడినది. ఆ పలుగు వేసిన పరిచారకుడు ఆపాదమస్తకము కంపించుచు పడిపోయెను. అచ్చటనే యున్న బాబాజీయును వెంటనే స్మృతితప్పి పడిపోయెనట! ఆతనినోటివెంట కొంచెము రక్తముకూడ వచ్చెనట! ఆతడు జీవించెను. పరిచారకుడును బ్రదికెనుగాని వానికి పిచ్చియెత్తెను. ఆ పిచ్చివానిమాటలే యా రహస్యము లోకములో పొక్కుటకు కారణము! ఆ పిమ్మట గణపతిని కదలించు ప్రయత్న మాగిపోయినది. బాబాజీ యక్కడ నిత్యపూజ చేయ నొక పూజారిని నియమించెను. తదాదిగా చుట్టుపట్టుల జనములకు ఆ గణపతిపై భక్తిగౌరవము లతిశయించెను. ఆ మహాలక్ష్మిగణపతికి పూజ లతిశయించెను.

ఈ బాబాజీలందరును గోసాయీలు. వారికి వివాహములు లేవు. కాని ద్రవిడ సన్యాసులకును వీరికిని భేదములు కలవు. వీరు శిరస్సులు ముండనము చేయించు కొనరు. శిరోజములు దీర్ఘముగా పెరిగిపోయి జడలుకట్టియుండుటచే వీరు జడదారులు.

వారి గడ్డములును మీసములును పొడుగుగా పెరిగియుండును. ఆ పరంపరలో తరుచుగా స్థాపకుడగు శ్యామలదాసునామము వచ్చుచుండెను. ఇప్పు డున్న బాబాజీ నామమును శ్యామలదాసే. అతడు మిక్కిలి సత్త్వసంపన్ను డనియు మహత్త్వము కలవాడనియు ప్రతీతి కలదు.

ధనుర్మాసములో నా బాబాజీమఠమున జగన్నాథార్చనము మహావైభవముగా జరుగును. అది చిన్నపల్లెయే యైనను ఆ యుత్సవమునకు దగ్గర నున్న గొంటూరి పౌరులును, అవల నల్లచెరువు నానియున్న గ్రామప్రజలును, చుట్టుపట్టుల గ్రామముల జనములును విశేషముగా నక్కడ చేరుచుందురు.

ఈ నా డక్కడ వైకుంఠైకాదశీపర్వము మహోత్సవముగా జరుగుచున్నది గొంటూరు నాగదేవుడు బాబాజీమఠములో నున్న మహాలక్ష్మీగణపతికి భక్తుడు. ఆతనికి జగన్నాథస్వామియందును శ్యామలదాసునందునుగూడ విశేషముగా భక్తిశ్రద్ధలు కలవు. ఆ బాబాజీ కతడు సర్వవిధముల సౌకర్యములు కలిగించుచు విరివిగా కానుక లర్పించుచుండెను.

గొంటూరునాగదేవుడు కొంతకాలమునుండి గణపతిదేవుల ధిక్కరించెను. అది యా బాబాజీ పట్టించుకొనలేదు. కాని యిప్పు డాతడు దోపిడులు చేయించుచుండె ననియు తెలియవచ్చుచున్నది. అది తెలిసినప్పటినుండియు పూజ్యుడగు నా బాబాజీకి కష్టముగా తోచుచుండెను. కాని ఏమని చెప్పగలడు?

ఈ మఠములో పెద్ద యతిథిశాలలు కలవు. గోసాయీలు ఎవరు వచ్చినను వారి కందులో భోజనాదిసర్వసౌకర్యములు నా మఠమువారు నియతముగా చేయుచుండిరి. ఆ యతిథిశాలలును మహాభవనములు. అవి గొంటూరివిభు లర్పించిన ధనముతోడనే పెక్కు కట్టబడినవి. ఒక్కొక్కసారి గొంటూరి నాగదేవునికి అతిథు లెక్కువయినచో నందులో కొందర నాతడు బాబాజీమఠములోని యతిథిభవనములలో నుంచుటయు కద్దు. ఆ భవనములును మఠమునకు వెనుకవైపున పశ్చిమపు చివర నున్నందున, అక్కడ రాజాతిథులుండి వారును వారి పరివారములును రాకపోకలు చేయుచున్నను, మఠములోని నిత్యకర్మకలాపముల కెట్టి యాటంకము నుండెడిది కాదు.

ఈ మధ్య గొంటూరు నాగదేవుని యతిథిశాల లన్నియు నాతని గౌరవాతిథులతో నిండిపోయినవి. నాగదేవుని మిత్రు లెందరో అక్కడికి వచ్చియుండిరి, ఎఱువమల్లిచోడుడు, కేశవదేవుడు, సోమిదేవుడు, అల్లుగంగు, మల్లికార్జునుడు, దామోదరుడు— మరియు నెందరో గొప్పపరివారములతో వచ్చియుండిరి. వారందరు మండలాధిపతులే; అందరును గణపతిదేవులను ధిక్కరించుచున్నవారే! గొంటూరుకు సమీపమున నుండు కొణిదెన మొదలగు ప్రదేశములకు పాలకులే యందరును!

వారి కందరకును జన్నిగసేనల కదలికలు తెలిసినవి. అంబదేవుని మహాసైన్యము వచ్చుచున్నట్లు బాగుగా తెలిసినట్లు తోచదు. అవల నెల్లూరుజటావర్మ

సుందరపాండ్యునియొద్దనుండి వారల కందరకు రాయబారములు వచ్చినవి. వా రిప్పు డేమి చేయుట ?

వారిలో నొక్కొక్కరు ప్రత్యేకముగా అటు జటావర్మసుందరపాండ్యుని గాని, ఇటు కాకతీయమహాసేనలనుగాని, ప్రతిఘటింపలేరు. వారందరు ఏకముఖముగా నున్నను, ఆ పనులు సాధించలేరు. కాని వా రేకముఖముగా నున్న, నెవ్వరైనను వారితో జాగరూకులై సంచరింపవలసియుండును. వా రొకరితో కలసిన రెండవ వారికి జయము కష్ట మగును.

అట్టివారు సామాన్యముగా తమకు దగ్గరవారితోకంటె దూరమువారితో కలియుట కిచ్చగింతురు. కాకతీయులతో గలసినచో వారికి చిన్నమండలేశ్వర పదవులే స్థిరము లగును. కాని దక్షిణమునుండి దండెత్తివచ్చుచున్న పాండ్య కాడవులతో కలసి కాకతీయులను చీకాకొనరించిన వారికి లాభము. ఈ పాండ్య కాడవు లిందుల నెక్కువకాల ముండబోరు. వారితో కలసి జయించినచో అచిర కాలమున తమకు స్వతంత్ర మగు పెద్దమండలాధిపత్యములు ప్రాప్తించును. ఎవరిని తా మిప్పుడు చేరవలె ? ఎట్లు చేరవలె ?

కాకతీయులతో వారి సంబంధము ఇప్పటికే ప్రతిమించిపోయినది. కాని పాండ్యులను నమ్మదగునా ? నమ్మకుండి చేయున దేమి ? పాండ్యుడు వారలను తొందరపెట్టుచున్నాడు. వెంటనే నిశ్చయముచేయకున్నచో నాతని వాహినిముందు తమ్ము నే ముంచివేయవచ్చును. ఇటు కాకతీయులకు అటు పాండ్యకాడవులకు, కానివా రగుదురు !

మొత్తముమీద వారు సుందరపాండ్యుని జేరుటకే నిశ్చయించిరి కాని యాతడు ఈమధ్య పంపుచున్న వార్తలు వారికి అలజడి కలిగించుచున్నవి. అవి మిత్రరాజులకు పంపుచున్నట్లుగా లేవు. చక్రవర్తి తన సామంతులకు పంపుచున్న యాజ్ఞలవలె కనబడుచున్నవి. ఈ పాండ్యుని దాసుల మగుటకేనా, మనము కాకతీయ చక్రవర్తులను ధిక్కరించినది ?

అదికాక కాడవసేనలనుగూర్చియు, పాండ్యసేనలనుగూర్చియు అతిశయోక్తు లతో కూడిన వార్తలు వచ్చుచుండెను. కాడవసేనలే పదునెనిమిదిలక్షలని వారు వినిరి. కొప్పెరుంజింగని సేనాచలనములను వారి వార్తాహరులు చూచియుండిరి. కొందరు ఒకటిరెండులక్షలకంటె పరివార ముండదని వారికి చెప్పిరి. వారు నమ్మ దగినవారే కాని పలువురు వేగరులు పదునెనిమిది లక్షలే యనిరి. కొప్పెరుంజింగని సేనలు దారిలో వేయుచు పోయిన ప్రథలే అట్టివారు స్వీకరించి చెప్పుచుండిరి.

మరి యిక నాతని జయించిన పాండ్యసేనల సంఖ్య ఎంత ? అది యసంఖ్యా కమే యనియు శ్రీరాముని వానరసేనలవలెనే కోట్ల సంఖ్యలతో నున్నదనియు వాడుకలు ప్రబలెను. వాని నిజానిజములు తెలిసికొను టెట్లు ?

ఇంత మహాసైన్యములను నవలక్షధనుర్ధరులు మాత్రమే కల కాకతీయసేన యెదుర్కొనగలదా? అందుకు ఇప్పుడు గణపతిదేవులు వృద్ధులైనారు; వారి దుహిత రుద్రమ రాజ్యభారము వహించినది. పురుషసాహసము వహించినంతమాత్రమున స్త్రీకి పౌరుషము వచ్చునా? అదియును గాక నామె భర్తయే యామెను ప్రతిఘటించుచున్నాడు; ఆమెకుమారులె వ్యతిరేకమైరి; సమర్థులగు పలువురు మండలేశ్వరు లెదురుతిరిగిరి. పైనుండి ఒకవైపున కళింగసేనలు, మరియొకవైపున కాడవపాండ్య సేనలు రాజ్యములోనికి చొచ్చుకొని వచ్చినవి. తమకు చేరిన రహస్యవార్తలను బట్టి యొకవైపునుండి హొయిసలబల్లాలసేనలును మరియొకవైపునుండి దేవగిరియాదవ సేనలును కాకతీయసామ్రాజ్యముపై శీఘ్రముగా దండెత్తనున్నవి. కాకతీయ సామ్రాజ్యము మునుగుటకు సిద్ధముగా నున్న నౌకవలె నున్న దిప్పుడు! అత్యగత్యముగ చేసికొనగోరువారు దానిని యెంత శీఘ్రముగా నార్జించిన నంత మేలు! ఈ విధముగా వారు మంతనములు చేయుచుండిరి.

ఈ మధ్య చాలకాలముగా బొల్లడు గొంటూరులోననే యున్నాడు. అతడిప్పుడు గొంటూరు నాగదేవుని దక్షిణహస్తము! అతని దేహమునకు వెనుక నుండెడి స్థౌల్యము కొంత తగ్గినది. ఇప్పు డాతడు ఖడ్గసాధనమునను బాణప్రయోగమునను శూలాద్యాయుధ విద్యలను చతురుడు; ఆరితేరిన యాశ్వికుడు. శతములను సహస్రములను యోధులను చాకచక్యముతో నడిపింపగల సమర్థుడు. నాగదేవుని మూకలతో గూడి యాతడు విశేషధన మార్జించియుండెను. ఎందరో స్త్రీ లాతని నాకర్షించి తమ వలలో వేసికొనజూచిరి. కాని యాతడు స్త్రీలవంక కన్నెత్తి చూడడు. స్త్రీముఖము ప్రమాదవశమున నాతనికంట బడినచో నాతడు భయపడి పారిపోవ యత్నించువానివలెనే యుండును.

ఇదియే కాక ఆతనిలో కొన్ని విపరీతమైన గుణములు కలవు. జనమధ్యమున నందరు నుల్లాసముగా నున్నప్పు డాతనికి నడుమ నడుమ గుబులువలె ఆవేశించును. అప్పు డాత డెవ్వరితోడను మాట్లాడడు. ఎవరైన పలుకరించిన చీదరించుకొనును. అంతలో నాతడు భయపడుచున్నవానివలె బెదరుచూపులు చూచుచు పారిపోవును. ఆతని కున్మాదమా?

వైకుంఠైకాదశిసాయంకాలమున జగన్నాథస్వామియాలయమునందు కర్ణాట దేశమునుండి వచ్చిన యొక వేశ్యల మేళము నాట్యముచేయుచుండెను. దానికి నాగదేవుడును ఆతని మిత్రులును ఆహూతులై వచ్చియుండిరి. నాగదేవునితో బొల్లడును వచ్చి గౌరవాసనమున నాసీనుడయ్యెను.

ఆ మేళమునుండి యిద్దరు వేశ్యలు ముందుకు వచ్చి గొండ్లి సలుపుచుండిరి. వారిలో నొకతె మాటిమాటికి బొల్లనిపై తన కటాక్షములు పరపసాగినది. అది చూచిన యచ్చటి సామాజికులు ముసిముసి నవ్వులు నవ్వసాగిరి.

బొల్లని సుఖము పాలిపోయెను. అకస్మికముగా నాతని దేహము బిగిసికొని పోవుచున్నట్లయ్యెను. అతఁడా నట్టువకత్తెలకంక తదేకదృష్టితో చూడసాగెను.

మరల నంతలో నాతనిలో పెద్ద మార్పు వచ్చెను. లాగిపట్టిన కళ్లెము సడలినచో పరుగుదారు నశ్వమువలెను, ఒడ్డుకట్ట తెగిపోయిన నదీప్రవాహమువలెనే అతఁడు చూడఁదొడఁగెను. సభలోనుండి యాతఁ డాకస్మికముగా లేచి, శీఘ్రముగా నాగదేవునికి నమస్కరించి సెలవు తీసికొని, ఆ చీకటిలో నొంటరిగా వెడలి పోయెను. ఆతని యనాత్మీయ స్వభావము నెరిగినదియే గనుక నెవ్వరు నేమియు ననలేదు.

అతఁ డొంటరిగా నరణ్యమధ్యమునుండ పోయి పోయి యక్కడికి క్రోశము దూరమున నున్న నల్లచెరువుకట్టకు పోయి, దాని మఱుఁగుమ్మునకు నాతఁడు చేరుకొనెను. ఆ చెరువునకు దూరమున నున్న కొండలపై కురిసిన వర్షపునీరు నల్లనేలమీఁదుగ పారుచు వచ్చి ఆ చెరువులో కలయును. ఆ నీటిరంగుచే దానికి నల్లచెరువని పేరు వచ్చినది. ఇది చాల పెద్దచెరువు. దీని నీటిక్రింద కొంతభూమి దక్షిణభాగమున పల్లపు సాగు చేయఁబడుచున్నది. అక్కడి పంట మిక్కిలి శ్రేష్ఠమైనది. ఈ చెరువు నిండఁగా మిగిలిన నీరు, ఆ మఱుఁగుమ్మునుండియే యవల నొక క్రోశముదూరమున నున్న బుడంపాడుచెఱువులోనికి చేరుచున్నది.

బొల్లఁడు తఱుచుగా ఒంటరిగా చేరుకొనునది ఆ మఱుఁగుమ్ముసమీపమునకే! అక్కడికి కెవ్వరును రాత్రులు రారు. అక్కడ పెద్ద చింతలును, మఱ్ఱిచెట్లును, మేడిమ్రానులును క్రమ్ముకొని భయంకరముగా నుండును. రాత్రు లక్కడ కీచురాళ్ల ధ్వని చెవులకు గింగురుమనును. గొంటూరిలో ననాదిగా కబోదిపక్షు లెక్కువ. ఈ పక్షులు అన్నిగ్రామములను ఉండవు. అవి ఎక్కడ నున్నను గుంపులుగా కలసి నివసించును. అవి గబ్బిలములవలె చెట్లకు వ్రేలాడును. కాని గబ్బిలములకంటె మిక్కిలి పెద్దవి. వానికి ఎత్తుగా పెరిగిన చింతచెట్లెక్కువ యభిమానమగు స్థావరములు. ఆ చెట్లపై చూచిన పగ లెక్కువ కనిపింపవు. కాని సాయంత్ర మగునప్పటికి ఒక చిత్రమగు కీచునాదము చేయుచు నవి చెట్లకు వచ్చి వ్రేలాడును. అవి యప్పుడు చూచినచో ఆకున కొక్కటిచొప్పున నున్నట్లు కనబడును. ప్రొద్దు పోవువరకు వాని భయంకరసంగీతము సాగుచునే యుండును. తుద కవి నిద్రించును. రాత్రు లెప్పుడో తప్ప యవి యరవవు. మరల తెల్లవారుజామున ఆ నాదము ప్రారంభించును. చుట్టుప్రక్కల నరక్రోశమువరకు దానితో మతిగలవారికి మతులు చెడిపోవును. వర్షమునకు భూమిలోనుండి పసులబడి వచ్చి నాదముచేయు కప్పల బెకబెకలనే అది మించిపోవును. ఆ చెట్లచుట్టును వందలు వేలుగా నవి సంచరించు చుండును. దీనికంతటికి తాళమువలె నెదుర నల్లచెరువులో మధ్యమధ్య నెగిరిపడు పెనుమీలశబ్దము వినవచ్చును.

మతిగలవారికి మతిపోగొట్టు నీ ప్రేమాతలు మతిపోయిన బొల్లని కొంక వింత శాంతము నొనగూర్చును. అతని పదము లీనాడును అప్రయత్నముగా నాతని నీ మరుగొమ్మనొద్దకే తీసికొనివచ్చినవి.

అతడు మరుగొమ్మకు పడమరదిమ్మెపై కూర్చుండెను. దానికి సమీపముననే ఉన్న యొక చిన్న పుల్లరేగుపొదపై నాతని దృష్టి ప్రాలినది.

ఆపొదక్రిందనే గొంటూరులో నాతనికి గల సర్వము నిక్షిప్తమైయున్నది. అందులో బంగారము వెండియే కాదున్నది, అమూల్యము లగు రత్నములు కూడ గలవు. స్త్రీల ముఖము చూచినప్పుడెల్ల అతనికి తనభార్య జ్ఞాపకమువచ్చును. దానివెంటనె కుమార్తె జ్ఞాపకమువచ్చును. వారితో చెప్పకుండ గూడ తానిట్లు పారిపోయివచ్చెను. వారు దారిద్ర్యముతో బాధపడుచున్నా రను వార్తమాత్రము పూర్వము వచ్చియుండెను. వెంటనే తాను వారికి చేర్పగలందులకు సువర్ణము లెన్నియో పంపియుండెను. కాని యవి చేరినవార్త రాలేదు. భార్యయు పిల్లయు తలపున బారినప్పుడెల్ల ఈ ధనరాశి తలపున బాగును. అతని కిప్పు డదియే భార్య; అదియే పిల్ల ! అది చూచుకొని కొంత మనశ్శాంతి తెచ్చుకొనును.

కాని ఈనా డాతని కట్టి మనశ్శాంతి కలుగలేదు. గొండ్లిలో తనవైపు చూపులు మాటిమాటికి పరపిన యువతి తా నెప్పుడో హనుమకొండలోనో ఓరుగల్లు లోనో చూచినదానివలె నున్నది. ఎంత ప్రయత్నించినను అతని కది ఎవరో జ్ఞప్తికి వచ్చుటలేదు. కాని యది తనవైపు కటాక్షము పరపినప్పుడెల్ల ఏకశిలానగర మాతనిమనస్సున స్పష్టముగా పారజొచ్చినది. ఏకశిలానగర మంతయు హృదయములో చిత్రమువలె అంకితమైనది. ఆ నగరవీధులు తన హృదయములో గీతలుగీతలుగా పడి కోసివేయుచుండెను. ఆ గీతలు పోయిపోయి యాతని గృహాంగణముముందు ఆగి పోవుచున్నవి. ఆ రేఖల కోతల కాతని హృదయములో రక్తము స్రవించుచున్నట్లే యున్నదతనికి !

అందులో నాత డప్పు డున్నది పాటిప్రదేశము. అక్కడ పూర్వ మేదో పల్లె యుండి పాడుపడియుండును. అక్కడ మట్టి పాటికి తిరిగియున్నది. మట్టి పాటి ప్రదేశములు గొంటూరుచుట్టు నెన్నియేని గలవు — బుడగపాడు, బొంతపాడు, అనంతారపుపాడు, లేమల్లెపాడు, కొరిటెపాడు— !

ఈ పాటిప్రదేశములలో పూర్వ మెట్టి గ్రామము లుండెడివో; ఎట్టి మనుష్యు లుండినారో ! ఎట్టి కష్టసుఖము లనుభవించియుండిరో ? ఎవరైనను తనవలె కష్ట మనుభవించియుండిరో ?

తన కుమార్తె పేరు పాటి! సజీవమై కలకలలాడుచు తన్ను ప్రేమాతిశయముతో పిలుచుచు కేరిపలాడుచూతురు 'పాటి'ని వదలి ఈ పాటిగడ్డను చూచి సంతోషించ వలెనా ? ఈ పాడు పాటినేల, నా ముద్దులపాటికి ప్రతియా ? ఛీ !

అతనికి కన్నీరు ఏకధారగా కారసాగెను. అప్రయత్నముగా నాతడు బిగ్గరగా నేడ్వసాగెను. ఎగయు టూర్పులతో మాటిమాటికి నాతడు 'పాటీ, పాటీ', యనుచును మధ్యమధ్య భార్యను తలచుకొని 'మంగీ'యనుచును తన ధనమెల్ల నిక్షేపించిన పాటిగడ్డను కౌగిలించుకొని రోదింపసాగెను.

"ఎందుకీ కర్మము నాకు పట్టినది ?"

ఇట్లాతడు మనస్సున అనుకొనెనో, బిగ్గరగా ననుకొనెనో ఆతనికి తెలియదు. కాని దానికి ప్రత్యుత్తరమువలె ఈ రెండుమాటలును స్పష్టముగా వినవచ్చెను.

'ఆడసోకు !'

వ్రేటుకడిన పులివలెనే, కుబుసము విడిచిన త్రాచువలెనే, ఆత డొక్కుమ్మడి లేచెను. నలుదిక్కులు చూచెను. ఎవ్వరును లేరు. తనమనస్సులోని భ్రాంతియే !

వెంటనే ఆతనికి నవరాత్రోత్సవప్రారంభదినమున తాను 'ఆడసోకు సోకినది' అని గణముపూనినట్లు నటించుట యొల్ల జ్ఞప్తికి వచ్చినది. ఆనాడు గండనితో పోరాటమును జ్ఞప్తికి వచ్చినది. ఈ పల్కినది అశరీరవాక్కు, నిజమే పలికినది. 'నాకీ కర్మ పట్టినందుకు కారణము ఆడసోకుగాడెవరయో !'

కాని తా నిప్పుడు వెనుకంజ వేయ వీలులేదు. ఎప్పటికైనను మంగిని పాటిని ఇక్కడికి పిలిపించుకొనవలెను. కాని ఎన్నాళ్లకు ?

'ఎన్నాళ్లకు ?' అని ప్రతిశబ్దమే వినవచ్చెను. మరల మొదట విన్న కంఠధ్వనియే ! ఈ యశరీరవాణి సర్వజ్ఞముగా కనబడుచున్నదే ! మరల ననుమానముతో దిక్కుల గలయజూచెను. ఎవరును గనపడలేదు. గుబురుగా కప్పియున్న చెట్ల సందులలోనుండి మధ్య మధ్య చంద్రకాంతి పడుచు, ఆ ప్రదేశమును తన్ను వెక్కిరించుచున్నట్లుండెను.

చింతచెట్లపై కబోదిపక్షులుకూడ నిశ్శబ్దమైనవి. ఆత డింకను విచారపరుడై యాలోచించుచుండెను. ఏకశిలానగరమే ఆతని హృదయములో పరివర్తనమగుచుండెను. ఇంటివైపు బుద్ధి మరలినది. ఈమారు మరల ఆకాశవాణి వినబడినది.

"బొల్లా ?"

బొల్లనికి భయము లేదు. ఆత డిట్లు ప్రశ్నించెను :

"ఎవరది ?"

వెంటనే జవాబు వచ్చెను.

"నీ నేస్తము !"

బొల్లని కా కంఠ మిప్పుడు స్పష్టముగా గుర్తుకువచ్చినది. అది గండని కంఠము. తన ప్రాణశత్రువుకంఠము !

బొల్లడు తనయొరనుండి ఖడ్గము పెరికి యా శబ్దమువచ్చిన వైపునకు పోయెను. ఈమారు అవలనిక్కనుండి ధ్వని వినవచ్చెను.

“లాభము లేదు. నూరుగురు భటులు ఈ ప్రదేశమును చుట్టుముట్టి యున్నారు. తప్పించుకొనలేవు!”

బొల్లడు నమ్మలేదు. వెంటనే ఒక ఈల వినబడెను. అనేక బాణము లొక్కసారి ఆకాశములోనికి పోయిన ధ్వని యయ్యెను. కపోతపక్షులన్నియు లేచి చెట్లను ప్రదక్షిణము చేయుచు నరవసాగినవి. బొల్లడు కుప్పవలె కూలిపోయెను.

“నన్నొక్కసారిగా చంపివేయరాదా?”

స్వర మిట్లు వినబడెను.

“నీతో పనియున్నది. దారిద్ర్యముతో బాధపడుచున్న మంగిని ఆకట నవసి యున్న పాటిని చూచిన నేను నీపై కఠినదనము చూపలేకున్నాను!”

బొల్లనికి కన్నీరు ఏకధారగా కారెను. ఒకప్రక్కను కోపము వచ్చుచుండెను.

“నన్నేమి చేయుమందువు?”

“ముందా కత్తి విరిచి దూరముగా పారవేయుము!”

అ యాజ్ఞలు కుమార్తె పాటియు భార్య మంగియు చేయుచున్నట్లే యాతనికి తోచెను. వెంటనే అత డా పని చేసెను. మరల గండనివాక్కు వినవచ్చెను.

“దీనితో నా యర్ధరాత్రమున రహస్యమందిరములో ఖడ్గసాక్షిగా చేసిన ప్రతిజ్ఞవలన విడివడినావు!”

ఈ మాట లనుచునే గండ డాతని కెదురుపడెను. అప్రయత్నముగా నాతడు గండనిపైకి లంఘింప కాలు కదల్చెను. కాని గండ యాకారము పరమశాంతముగా ధైర్యముతో నచలముగా నున్నది. అది చూడగానే లేచుచున్న బొల్లని కాళ్లు భూమిలోనికి దిగబడిపోయెను.

గండడు ఆదరముతో నాతని కౌగలించుకొనెను. బొల్లనికిని చిన్ననాటిప్రేమ యొక్కసారిగ నుద్బుద్ధమైనది. ఆతడు పిల్లవలె గండని ప్రేమకు లొంగిపోయి బావురుమని ఏడ్వసాగెను. ఏడుపు తగ్గినతర్వాత పాటిసంగతియు మంగిసంగతియు ఎన్నియో ప్రశ్నలాతడు వేసెను. నిశాచరయోగి వెంటనంటిన రాత్రి వారి యింటి యొద్ద జరిగినది గండడు కొంత యాతనికి చెప్పెను. అప్పుడు పాటికి వచ్చిన జ్వరము నెమ్మదియైనదని తాను ఆతర్వాత తెలిసికొనిన వార్తకూడ ఆతడు చెప్పెను.

బొల్లనికి గండని సర్వజ్ఞత ఎరిగినంతనే యాశ్చర్యమయ్యెను. పరమరహస్యముగా తాము చేసికొనిన ప్రతిజ్ఞ లెట్లు తెలిసినవి? తమలో నెవరైన తిరిగిపోయిరా?

ఆ పిమ్మట గండడు బొల్లని తనవెంట బయలుదేరమని చెప్పి తన పరివారము నకుగూడ వెంటరమ్మని యాజ్ఞాపించెను.

ఆనాటియర్ధరాత్రసమయమునకు గండడు బొల్లని వెంటగొనిపోయి సమీపమునసే కల కాకతీయస్కంధావారమున అంబదేవుని ముందు నిలువబెట్టెను.

అంబదేవుని సేనలు నిద్రించుచున్నవి. కాని యాతడు ప్రబుద్ధుడైయుండెను. ఆతనిముందెన్నియో పత్రము లున్నవి. పెద్దపటముకు ఉన్నది.

బొల్లడు నమస్కరించి నిలుచుండగనే, అంబదేవుడు ఆ పటమును బొల్లనికి చూపి యెన్నియో ప్రశ్నలు వేసెను. తన్నాతడు బంధితునిగా గాక నిజసేవకునివలె చూచుచుండుట బొల్లని కాశ్చర్యమైనది. అతడును తడవుకొనకుండగ నా పరిసరము లన్నియు వివరించి చెప్పసాగెను.

"ఏలురుమల్లిచోడ డెక్కడ? అతని పరివార మెంత? కేశవదేవుడు? అతని పరివారము? సోమిదేవుడు? అల్లుగంగు? మల్లికార్జునుడు? దామోదరుడు? నాగదేవుడు?"

ప్రశ్నల కన్నింటికి బొల్లడు ప్రత్యుత్తరము లిచ్చెను. కొంతవడికి అంబదేవుడు గండని సంబోధించెను:

"బొల్లడిచ్చిన యుత్తరములు నిజములని రేపు ధ్రువమైనచో నీమనవి విచారింతుము. అంతవరకు నీతని దృఢముగా బంధింపుము!"

కోప్పెరుంజింగడు కన్నులు తెరచి చూచునప్పటికి తా నొక చక్కని పటకుటీరమున సుఖశయ్యపై నున్నట్లు తెలిసికొనెను. అతని యిద్దరు రాణులును ఎదుట సుఖాసనములపై సుపవిష్టలై యుండిరి. అతడు తన కన్నులే నమ్మలేకపోయెను.

"నేను ఏలోకములో నున్నాను? పవిత్రగోదావరిలో చివరగ్రుటక వేయుచునే పైకి లేచి, ప్రాణములు నిలుపుకొనుటకు అప్రయత్నముగా, అంతవరకు నాతో యుద్ధము చేయుచున్న యాశ్వికయోధుని కంఠమునే ఊతగా కౌగలించుకొంటిని. ఆ యోధు డిప్పు డేమైనాడు? — నే నిప్పుడు వీరస్వర్గములోనే ఉన్నానా? అయ్యో! నీటిలో మునిగి దుర్మరణము పొందిన నాకు వీరస్వర్గము కూడ ప్రాప్తించునా? — కాక నేను కలగనుచున్నానా? — లేక జన్నిగతో యుద్ధమును, ఏకాదశీవ్రతమహోత్సవములు, ఊరుభంగప్రదర్శనము, కనకసభాపతిపూజాభంగము, అవియే స్వప్నములా? — వీరు నిజముగా నా రాణులే! ఎవరో పుణ్యాత్ములు గోదావరిలో మునిగిపోవుచున్న నన్ను ఒడ్డుకు చేర్చియుందురా? — కాని, — కాని, — కాని, —"

ఈ తలపులన్నియు నాతడు కన్నులు తెరచిన యుత్తర క్షణముననే ఒక్క త్రుటికాలములో అతని మనస్సున విద్యుద్వేగముతో ప్రసరించినవి. అతడు కన్నులు తెరచుట చూచి, అంతవరకును మిక్కిలి భయాందోళనములు పడుచున్న యాతని రాణు లిద్దరు లేచి దగ్గరకు వచ్చి ఏమి కావలె నని ప్రశ్నించిరి.

తన కేమి కావలెను? మిక్కిలి నీరసముగా నున్నాడు. అతనికా క్రిందటిదిన మెల్ల నాహారము లేదు. ఆపైన గాఢపరిశ్రమతో నలసిపోయెను. నోటివెంట మాట కూడ వచ్చుట లేదు. కాని అతని మనస్సుమాత్రము చక్కగ పనిచేయుచున్నది. అప్పటికి సూర్యోదయమై చాలానే పయిన ట్లున్నది. ద్వాదశిపారణకు వేళ యతిక్రమించుచున్న దని యాతనికి తోచినది. కనకసభాపతిప్రసాద మాతడు ఇప్పుడు పారణచేయవలె. అతికష్టముమీద నాతడు నోరు పెకల్చుకొని 'ప్రసాదము' అనగలిగెను.

వెంటనే అతని రాణులు ఇద్దరు నాతనిచే ముఖశౌచము చేయించి, పాణి పాదములు జలముతో తుడిచి అద్ది, ముఖమున విభూతిరేఖలు తీర్చి, ఒక కొమ్ము చెంబుతో గోక్షీరము నాతని యంగిట నుంచిరి. దానితో నాతనికి కొంచెము సత్తువ వచ్చినది.

మరుక్షణమున నాతనికి సర్వము నవగతమైనది. అతని రాణులు తనయందు ఎంత ప్రేమగలవారైనను, స్వయముగా నెన్నడు నుపచారములు చేసినవారు కారు. అన్నియు దాసదాసీజనములచేతనే చేయించువారు. అట్టివా రీనాడు ఉపచారములు చేసిరి. ఆ చేసినవి స్వల్పమైనవే. అయినను వారవి సరిగా చేయుట చేతకాక

చేసిరి. వారు పనిచేయుట నేర్చినవారు కారు. తాను తన పత్నులతో కూడ శత్రువుల చేజిక్కినమాట ధ్రువము. అయితే ఆ శత్రువు అంతఃపురగౌరవము దూషించు దుర్మార్గుడు మాత్రము కాదు!

విషయము తెలిసిపోయినది. ఇక తన పరాజయవార్త ప్రత్యక్షముగా అడిగి తెలిసికొను టేల? అందు కాతనికి ధైర్యము చాలలేదు. అంతలో నాతడు త్రావిన పాలవలన వచ్చిన శక్తితోపాటు ఆతని కొక విధమగు మత్తును వచ్చినది. మరల నాతడు కన్నులు మూసెను. మరల రాణులు భయవిహ్వలలై యాతని కనిపెట్టి యుండిరి.

*　　　*　　　*　　　*　　　*

కొంచెము స్వాస్థ్యతస్థగా ఆసమయమునకే, కొప్పెరుంజింగనితో జలయుద్ధముచేసిన ఆశ్వికయోధుడును మరియొక పటకుటీరములో శయ్యపై పవ్వళించి యుండి కన్నులు తెరచెను. ఆ పటకుటీరము చిత్రవర్ణపటచిత్రితమై సర్వవిధముల కళకళలాడుచుండెను. నలువురు పరిచారకులు దీనమైన చూపులతో ఆతని కెప్పుడు స్మృతివచ్చునో యని వ్యగ్రులై నిరీక్షించుచుండిరి. ఆతడు కన్నులు తెరచినదే తడవుగా వారు సూక్ష్మముగా నాతనికి ముఖశౌచము చేయించి, తేనెతో కలిపిన గోక్షీరము త్రావించిరి. అతడు తన పరిచారకులను గుర్తించినంతనే, తన్ను గోదావరిలో మునిగిపోవుచుండ తన మిత్రు లుద్ధరించిరని తెలిసికొనెను.

అంతలో తాను గోదావరిలో మునిగిపోవుచు చివరిక్షణమున అప్రయత్నముగ తన శత్రువగు కొప్పెరుంజింగని కంఠాశ్లేషము చేసికొన్నమాట ఆతని మనస్సునకప్పుడు స్ఫురించినది. ఆ యోధున కా తలపుతో పెదవులపై చిరునవ్వు చిందులాడెను. అది చూచి యాతని పరిజనుల ముఖములును విప్పారినవి. ఆ యోధుడు మరల కన్నులు మూసెను.

*　　　*　　　*　　　*　　　*

ఈ వార్త శీఘ్రమే పరిజనులు జన్నిగకు తెలియజేసిరి. ఆయోధు లిద్దరు నిప్పు డున్నది వాసిష్ఠగోదావరికి తూర్పుతీరముననే. మొత్తముమీద కొప్పెరుంజింగడు సిద్ధసంకల్పుడే యనవలెను. ఆతడు రెండు రణరంగములలో సంపూర్ణముగా పరాభూతు డయ్యెను. ఐననేమి? అతఁ డానాడు వసిష్ఠగోదావరిని తరింప సంకల్పించినాడు. ద్వాదశగడియలు రాగానే ఆతడు నిజముగా గోదావరీ తరణము చేసినాడు. ఎట్లైననేమి! నదిలో మునిగి ప్రాణావశిష్టుడైయుండె నాతఁ డావలియొడ్డు కా రాత్రియే చేర్చబడి యుండెను.

ఆ యోధు లున్న ప్రదేశము ఆ క్రిందటిదినమున నిర్జనముగా నుండెను. ఆ సమీపమున చేపలుపట్టి జీవించు కైవర్తుల పల్లెపాలెములు తప్ప మరేమియు లేవు. ఇప్పు డక్కడ పటకుటీరములతో నొక మహాపట్టణమే తీరియున్నది. అదియు

నొక పద్మాకారమున నున్నది. పద్మవ్యూహ మన నిట్టే యుండబోలు! ఆ శిబిర మంతటను వరాహధ్వజములు మెరయుచు ఉల్లాసముతో చిరుగాలి కెరటములాడు చున్నవి. ఆ పద్మాకారస్కంధావారమున కర్ణికాస్థానములో విశాలమై మనోజ్ఞ చిత్రపటచిత్రితమై చీనాంశుకవినిర్మితమగు నొక పటమందిరమున్నది. అందులో నిప్పుడు శ్రీరుద్రదేవమహారాజు కొలువుండెను. శ్రీ రుద్రదేవమహారాజే! అవును. శ్రీరుద్రదేవమహారాజే! శ్రీ రుద్రదేవమహారాజునకే ఆ పద్మవ్యూహమంతటను జయ జయనినాదములు చెలరేగుచుండెను.

అప్పుడక్కడికి శ్రీరుద్రదేవమహారాజులు వేంచేసియుండుట జన్నిగదేవునకే ఆశ్చర్యమైనది. వారు వత్తురను వార్త యాతనికి రాలేదు. "మహారాజు లెంత సాహసము చేసిరి! ఈవల రెండు మహాయుద్ధములు గెలుపోటములతో సాగుచున్న సమయముననే మహారాజులు స్వయముగా ఆ రణరంగముల కంత సమీపభూమిలోనికి వచ్చుట ఎంత ప్రమాదకరము! ఆ యుద్ధములలో ఓటమి సంభవించియుండినచో మహారాజుల కెట్టి యపాయము దాపురించి యుండెడిదో కదా! అయితే శ్రీశైల మల్లికార్జునుని ప్రసాదముచే సర్వముననుకూలమైనది. శ్రీగిరికి యాత్రచేయు భక్తులకు అనువుగా సోపానములు కట్టింతును!" ఇట్లు జన్నిగ తలంచి మ్రొక్కుకొనెను.

శ్రీరుద్రదేవమహారాజులు దక్షవాటిభీమేశ్వరుని దర్శించి ఎంతకాలమో యినది. వివాహమైన క్రొత్తలో వీరభద్రేశ్వరునితో గలసి యామె యా మహాలింగమును దర్శించి యుండెను. ఆపిమ్మట కొద్దికాలమునకే ఆమెగర్భమున ముమ్మడమ్మ పడెను. ఇప్పుడామెకు తన్ను వీరభద్రేశ్వరులు చేసిన మోసమే యా దేవునకు నివేదింప నిచ్చ జనించెనో, కాక ఆ గోదావరీవారిపరిపూతములైన యా ప్రాంతపు పుణ్యక్షేత్రములు దర్శించిరావలెనను కాంక్ష జనించెనో! కుబ్జవిష్ణువర్ధనచాళుక్యుడు వేంగీరాజ్యమునకు స్వతంత్రప్రభువైన కాలమునకు కొంచెము తర్వాతి కాలమునుండియే ఆంధ్రరాజులకు దాక్షారామభీమేశ్వరుడు కులదైవమైనాడు. ఆంధ్రరాజ్యము పరిపాలించు వారును, ఆంధ్రరాజ్యము జయింపదలచిన యన్యరాజులును తమ దృష్టి భీమేశ్వరునిపై సారించుచుండిరి. ఆంధ్రయావద్రాజ్యమునకు నూతనముగా నభిషిక్తమైన శ్రీరుద్రదేవ మహారాజులకు కూడ నందుచే భీమేశ్వరుని సేవవలెననుసంకల్పము కలిగినదేమో! ఏమైన నేమి? ఆమె గణపతిదేవుల యనుజ్ఞయు నాశీర్వచనమును పొంది బయలుదేరినది. అట్లు కదలుటకుముందు ఆమె రుయ్యమ్మకు విశేషాధికారము లిచ్చి యిట్లు కదలినది. దాని ఫలితముల నామె దూరమాలోచించినట్లు తోచదు.

జన్నిగసేనలు కొప్పెరుంజింగని సేవలను తాకి యుద్ధముచేయునప్పుడే రాజమహేంద్రపురమునుండి రెండువందల నావలలోనొక సైన్యము వచ్చుటకు నిర్ణీతమైనది గదా! ఆ నావలకును సేనకును శ్రీరుద్రదేవమహారాజే యాధిపత్యము వహించెను. ఏకాదశినాడు పగలెల్ల ఆ నావలన్నియు నరసాపురమునకు కొంచెము ఎగువ పాయల గోదావరిమలుపులో దాగుకొని యుండెను. సాధారణముగా నాదారిన

వచ్చుచు బోవుచుండు నావల రాకపోకలను వారు వెంటనే కట్టువడజేసిరి. ఆవల యుద్ధము సాగుచున్నందున వాని రాకపోకలు కట్టువడుట ఎట్టి సంశయమును కలిగింపలేదు. మహారాజులతో నిన్ని నావలు తమ కింత సమీపమునకు వచ్చియున్న వార్త రహస్యముగా నుండిపోయెను; అది కాడవసేనలకు పొక్కలేదు. ఎప్పటి కప్పుడు యుద్ధగతిమాత్రము శ్రీరుద్రదేవమహారాజులకు తెలియవచ్చుచున్నది.

ఏకాదశినాటి సూర్యాస్తమయ మగుచుండగా నా దాగిననావ లొక్కసారిగా నరసాపురముపైకి బయలుదేరినవి. సరిగా వానికి వాయుసంచారము మనుకూలముగా నున్నది.

వానితోపాటుగనే, అంబదేవుడు పంపియుండిన పదివేల యాశ్వికదళ మొకటి కూడ, సంకేతితప్రకారము భూమిమీద బయలుదేరినది. ఈదళము ముఖ్యముగా మూడు పనులు నిర్వర్తింపవలసియుండెను. జన్నిగసేనలు చిక్కులోనున్న వానికి సహాయ మగుటకు మూలబలమువలె నుండవలెను! జన్నిగసేనలు జయించుచున్నచో పారిపోవుచున్న శత్రుబలములను అరికట్టి దిగ్బంధము చేయవలెను! మరియు ప్రక్కను నదిపై వచ్చుచున్న నావలను అందలి సేనలకు తోడునీడగా నుండి కనిపెట్టుచు, వానికి సర్వసహాయములు చేయవలెను.

కొప్పెరుంజింగడు తన సేనలను గోదావరి గాటించుటకై బలవంతముగా నైదువందల తరులను సేకరించి నరసాపురమురేవున నిలిపియుండెను గదా! చీకటి పడునప్పటికి ఆ నదీతరులను వానికి కాపున్న సేనలను ఆకస్మికముగా రుద్రమనౌకలును, నేలపైవచ్చుచున్న అశ్వికదళమును కలసి ఒక్కసారి చుట్టుముట్టెను. రక్షకభటు లందరు నరకివేయబడిరి. ఆ నదీతరులు నడపువారు యుద్ధవీరులు కారు. వారు నదిపై నిద్దరినుండి యద్దరికి మనుష్యులను దాటించు పేదపల్లెకారులు. వారిని ఎవరు భయపెట్టిన వారికి వినయవిధేయతలు చూపి దాసులగు భీరువులు. కాడవసేనలకు పూర్వము భయపడి యక్కడికి వచ్చియుండిరి. ఇప్పుడు రుద్రమసేనలను చూచి వానికి లొంగిపోయి వాని యాజ్ఞలకు బద్ధులైరి. పగలెల్ల కాకతీయనదీనౌకలు దాగియున్న మలుపులోనికి ఇప్పుడవియన్నియు తరలింపబడెను. ఈ పను లన్నియు జరుగుటకు రెండుగడియలుకూడ బట్టలేదు.

ఆవల జన్నిగసేనలు జయోన్ముఖముగా నున్నవి. కాడవసేనలు సేకరించిన తరు లన్నియు రుద్రమవశమైనవి. ఇక భయములేదు. ఆ ధైర్యముతో నా యాశ్వికదళము సాహసించి కొప్పెరుంజింగడు పూజాదికములు నిర్వర్తించుచున్న శిబిరమునే దురుసుగా తాకెను.

ఆ కాలమున పుష్యమాసచంద్రుడు వెన్నెలలు కాయుచు చలిగాలిని మరింత చలువచేయుచున్నాడు. యుద్ధపరిశ్రమలో నున్న యా యాశ్వికదళమున కది సుఖమే కలిగించుచుండెను.

అట్లు వచ్చిన యాశ్వికదళముల కధిపతియే శిబిరమును పట్టుకొని, కొప్పెరుంజింగని వాసిష్ఠగోదావరిలోనికి వెంబడించి యుద్ధముచేయుచు నాతనితోపాటు గోదావరిలోనికి కొట్టుకొనిపోయెను. అది యుపలక్షించిన యా యోధుని పరివారము ఏనుగుల సహాయముతో ఆ వీరుల నిద్దరిని కొనయూపిరితో నుండ నీటిలోనుండి పైకి లాగి చికిత్సలు చేయించిరి.

వారిని తీసి వారి ముక్కులయొద్ద వ్రేళ్లుపెట్టి చూడగా శ్వాసలాడుటలేదు; వారి రొమ్ములుగాని ప్రక్కలుగాని యేమాత్రము నెగురుటలేదు. వారు సామాన్య భటులైనచో నంతటితో నాళలువదలి చనిపోయిరని విడిచిపెట్టి యుండెడివారే. కాని వారు సామాన్యులా? ఒకడు సాహిత్యరత్నాకరుడు, భరతమల్లుడు, ఖడ్గమల్లుడు, నిశ్శంకమల్లుడు, వాల్బలప్పెరుమాళ్, సాక్షాత్తు రాజసింహుడే! మరి రెండవయోధు డెవరో? అతని పే రెవరు నెరిగినట్లు లేదు. అతడు ఎక్కిన గుఱ్ఱపు రంగును బట్టి 'పాలయోధు'డని పేరుపడినాడు. ఆ గుఱ్ఱము నిగనిగలాడెడి పాలరంగు గలది. అది మాటలాడలేకున్నను మనుష్యుల కున్న బుద్ధిబలము ఉన్నదానివలె నున్నది!

సేనావైద్యులు వచ్చిరి. నాడి చూచిరి. నాడు లేమాత్రము కదలుట లేదు. చలికి వారి దేహములు బిగిసికొనిపోయినవి. అట్లున్న యా దేహములకుగూడ మృత్యులక్షణమైన చలువ—నీరుకారుచున్నట్లుండు నసహ్యకర మగు చలువ—యావేశింపలేదు. దానితో వారికి కొంచె మాశ కలిగినది వెంటనే వారు ఆ శవాకృతుల కాలుచేతులు పైకి క్రిందికి నెమ్మదిగా నొత్తసాగిరి. దానితో వారి కుక్షులలో పేరుకొన్న గోదావరినీరు నెమ్మదిగా బయటికి రాసాగెను. కొంతసే పట్లు సాధన చేయగా, నాడు లాడుచున్నట్లు తోచెను. పిమ్మట రొమ్ము ప్రక్కలు లేచి పడసాగెను. ముక్కునొద్ద శ్వాసమాడుచున్నట్లు గుర్తు తగిలెను

ఆ వెంటనే వైద్యులు వారి దేహములు వెచ్చగా నుండునట్లుచేసి, రెండు ప్రత్యేకపటకుటీరములకు చేర్పించియుండిరి. జన్నిగకా వార్తలు తెలిసి స్వయముగా వచ్చి వారి నిద్దరను భద్రపరచు నేర్పాటులన్నియు జేయించి, మిగిలియున్న రణకార్యములు నిర్వర్తింప బోయెను. యుద్ధము గెలిచినపిమ్మట చేయవలసిన పనలు యుద్ధోత్సవము చేయు సన్నాహములనుగూడ నొకవిధముగా మించియుండును. తెల్లవారువరకు జన్నిగ యా పనులయందే నిమగ్నుడై యుండెను. తెల్లవారిన తర్వాతనే గాని, జన్నిగకు శ్రీ రుద్రదేవమహారాజులే స్వయముగా నదీనావలతో వచ్చినట్లు తెలియలేదు.

కొప్పెరుంజింగని సేనలో ఆనాడు యుద్ధనిహతులైనవారె ముప్పదివేలమంది వీరు లుండిరి. మిగిలినసేనలో పారిపోగలిగినవారు బహుస్వల్పసంఖ్యాకులు. ఆ సేనలు కొప్పెరుంజింగని యాజ్ఞల ప్రకారము వాసిష్ఠగోదావరి నంటి యుత్తర దిక్కుగా వెనుదీసిపోవుట సాధ్యపడలేదు. ఒక కొంత పైపున జన్నిగసేనలును, మిగిలిన భాగమున 'పాలవీరుని'సేనలును వారి నవరోధించెను. ఆ సేనల నాయకులకు

కొప్పెరుంజింగని యంతఃపురజనముకూడ శత్రువశమైన దని తెలిసినది. దానితో వారికి ధైర్యము సడలినది. కొప్పెరుంజింగడే సంకేతప్రకారము గోదావరి దాటలేక పోయెననియు ఆ కాడవసేనానులకు తెలిసినది. కొప్పెరుంజింగదేవుడు పూజా మధ్యమున అడావిడిగా లేచి గజముపై వసిష్ఠగోదావరి దాటుట కుంకించినట్లు వారికి తెలియవచ్చినది. ఈ స్థితిగతులలో తమ ప్రభువు సురక్షితముగా నుండుట యసాధ్యము. కాడవసేనానులకు నిస్పృహ యావేశించెను. ఎదిరించి లాభములేదు. అందులో కాని దూరదేశము వారు ముప్పదివేలసేనతో జన్నిగకు లొంగిపోయి శస్త్రములు విసర్జించిరి.

యోధులు కాక, ఆ సేనతో పరిచారకులుగను, వినోదకులుగను, కవులుగను, పండితులుగను, నటులుగను, ఋత్విక్కులుగను ముప్పదివేలమంది వచ్చియుండిరి. వారును నిస్సహాయులై యందరు లొంగిపోయిరి.

ఇంతటి సేనను నిరాయుధ మొనర్చుట సామాన్యపు పని కాదు. అయితే ఒక దిక్కున వసిష్ఠగోదావరీప్రవాహముండుటచే కాకతీయసేనలకు నాలవవంతు పని తగ్గెను. మిగిలిన మూడు దిక్కులే ప్రధానముగా కాపు కాయవలసియుండెను.

* * * *

ఇప్పుడు శ్రీ రుద్రదేవమహారాజులు పేరోలగ ముండి ముందు జన్నిగదేవుని వలన యుద్ధక్రమమునివేదిక యాలకించిరి. ఆ నివేదికతోపాటు అతడు విజయదశమి నాడు పొందినజమిస్త్రతో కొప్పెరుంజింగనామాంకితపత్రముకూడ మహారాజులకు సమర్పించుకొనెను.

అపిమ్మట కోరంగినావధ్యక్షుడు నాకాయుద్ధవివరములు నివేదించుకొనెను. చోళనావలు సర్వనాశనమైనవి. ఏవో పాతికముప్పదిమాత్రము తప్పించుకొనినవి, గాని యవిగూడ యుద్ధముచేయ నాంధ్రతీరమునకు మరల జన్మకు రాలేవు.

అంతట శ్రీ రుద్రదేవమహారాజు ఆ యుద్ధములలో ధైర్యసాహసములు ప్రదర్శించి ఆంధ్రప్రభువుకు జయము చేకూర్చినయోధుల కెల్లరకు విరివిగా బహుమానములు పంచిపెట్టెను.

ఆ సాయంత్రమునకు రెండుపనులు మిగిలిపోయెను. కొప్పెరుంజింగని విచారించి యాతని శిక్షింపవలెను. ఇక నాతని శిబిరము పట్టుకొని, గజముతో గోదావరిలో చొరబారిన కొప్పెరుంజింగని తన యశ్వముతో గోదావరీజలములోనికి వెంటనంటి, సాహసముతో జలయుద్ధ మొనర్చిన యాశ్వికయోధుని బహూకరింపవలెను. ఆతనిపేరు తెలియలేదు. ఆతడు తెరలను చుట్టుముట్టుటలోను శిబిరము ఛేదించుటలోనను చూపిన నేర్పు అమోఘము! కాని కొప్పెరుంజింగని గాని, యాయాశ్వికయోధుని గాని, మహారాజులముందు పెట్టుటకింకను యోగ్యమైన స్థితిలో వా రిద్దరును లేరు. ఇద్దరికిని ప్రాణాపాయము తప్పిపోలేదు.

ఆ యాశ్వికయోధుడు ఎక్కిన పొలగుర్రమునుగూర్చి పరిజనము లెన్నియో విశేషములు చెప్పిరి. దాని రంగు, దాని తీరు, దాని ఠీవి, దాని సులక్షణములు సెన్నియైన వారు వర్ణించిరి. అంతేకాదు! ఆ మహాప్రవాహములో తనపైనుండి యోధుడు పడిపోయినను అది యొడ్డుకు పారిపోయి రాలేదు. పెద్దగా హేష చేయుచు నీటిలో మునిగిపోవుచున్న తన ప్రభువుచుట్టు నది ప్రదక్షిణ మొనర్చుచుండెనట! దాని హేషాశబ్దమును వినియే పరిజనములు ఆ సమీపమునకు వచ్చి యా యోధుల నిద్దర నీటిలోనుండి యుద్ధరించిరట. ఆ యాశ్వికుని తీరమునకు చేర్చుచుండ నదియు తీరముచేరెను. అప్పటికి నదియు సొమ్మసిలిన ట్లయ్యెను. తెల్లవారిన తర్వాత నది మేతకొనినది గాని, లాయములో నిలుచుట లేదు. తన ప్రభువును చూపింపమని కోరుచున్నది కాబోలు! పరిజనుల కాయపరాహ్ణమువరకు నా యూహ తట్టలేదు. అప్పుడు దానిని యజమానుని గుడారముముందు నిలువబెట్టి నిద్రించుచున్న వానిని జూపించిరి. దాని కాతడు జీవించియున్నట్లు నిశ్చయము కాలేదు. హేష చేయదు. మేత ముట్టుట లేదు. ఆ గుడారమునొద్దనుండి ఎంత లాగినను అది కదలుట లేదు. దాని నచ్చటనే వదలిరి. దాని దిగులు చూచినవారికి కన్నుల నీరు వచ్చుచున్నది.

ఈ వృత్తాంతము వినినంతనే శ్రీ రుద్రదేవమహారాజులు ఆ యాజానేయమును చూడవలె నని కోరిక కలిగినదని సెలవిచ్చిరి. భూసురాశీర్వాదములతో నంతట నా సభ ముగిసెను. శ్రీ రుద్రదేవమహారాజు సపరివారముగా నా యోధుని పటకుటీరము నొద్దకు బయలుదేరెను. కొందరు బ్రాహ్మణులుకూడ వెంట నంటిరి. అందులో వెర్రిరాలను నగ్రహారమున కగ్రణి యగు కేశన యను ఛాందసకవియు బయలుదేరెను.

ఆ యశ్వము మహారాజుల రాక చూడగనే వినయవిధేయతలు కనబరచెను. దాని ముఖభంగి చూడగా రుద్రమకు తనతో నది మాటలాడుచున్నట్లే పొడకట్టెను. పరిజనులు చెప్పినదానికంటె ప్రత్యక్షముగా చూడగా నా యశ్వచర్య లామెకు అద్భుతములుగా కనిపించెను.

చేరిన బ్రాహ్మణులు చెప్పిరి. ‘మహారాజా, ఇది పూర్వజన్మలో నా యోధునికి ఆప్తమిత్రమై యుండవలెను. దీనికి తాను పూర్వజన్మమున మనుష్యుడనై యుంటి నను జ్ఞానముకూడ ఉండి యుండవలెను!’

శ్రీ రుద్రదేవమహారాజులు చిరునవ్వు నవ్వుచు నందరను ప్రశ్నించిరి.

“ఇట్టి యశ్వమునకు పూర్వచరిత్ర యుండవలెను. అది ఎరిగినవా రొక్కరును ఇక్కడ లేరా?”

వెర్రిరాలను నగ్రహారమున కగ్రణి మహారాజుల నాశీర్వదించి మాట్లాడెను.

‘మహారాజా, ఈ యశ్వము సర్వవిధముల విశిష్టమైనది. ఇది నిర్వచనోత్తర రామాయణమున గ్రంథస్థమైన యశ్వము!

"ఎల్లైట్లు?"

కేతన మారాడక యీ పద్యము వినిపించెను. అత డాపద్యముచదువుచుండగా వేదసూక్తము చదువుచున్నట్లే రుద్రమకు తోచెను. ఏమి యీ కంఠస్వైచిత్రి!

"శృంగారంబు నలంగదేమియును బ్రస్వేదాంబుర శ్రేణి లే,
దంగంబుల్ మెఱుగేద వించుకయు, మహోగ్రప్రతిసామంతుసా
రంగంబుం గోలి తురంగముం గొని సంగ్రామంబునం దృప్తస
ప్తాంగస్ఫారయశుండు మాన్యవిభుపంపై చన్న సైన్యంబునన్."

పద్యము పూర్తి యయ్యెను. ఒక్కసారిగా శ్రీరుద్రదేవమహారాజులో మార్పు వచ్చెను. మహారాజు సంతోషించినట్లు లేదు! ఆ యాశ్వము నాపై పరీక్షింప లేదు. పటకుటీరమున ప్రమాదావస్థలో నున్న యాయోధుని బరామర్శింపలేదు. ఆ కావ్యకర్త యెవరనియైన నడుగలేదు.

సపరివారముగా శ్రీరుద్రదేవమహారాజులు గ్రక్కున తమ శిబిరమునకు తిరిగి వెడలిపోయిరి.

౪౧

"శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజా స్తంభే జగన్మండల
ప్రాసాదస్థిరభారభాజి దధతీ సా సాలభఞ్జీశ్రియమ్
కుండాలోత్తమగండభిత్తిషు మద వ్యాసంగవశ్యాత్మనామ్
యా ముత్తేజయతేతరాం మధులిహా మానందసాంద్రా స్థితిః

తిక్కనామాత్యుడు.

వసిష్ఠగోదావరీతీరమున శ్రీరుద్రదేవమహారాజు ఐదు దినము లుండెను. ప్రతిదినము గొంటూరునుండియు మోసలపురమునుండియు రావలసిన వార్తల కామె నిరీక్షించుచుండెనుగాని యవి రాలేదు.

మహారాజు లక్కడ విడిసియున్న వార్త చుట్టుపట్టుల శీఘ్రముగా వ్యాపించెను. పలువురు సామంతులును పెద్దలును ప్రజలును రాజదర్శనమునకై శిబిరమున మూగసాగిరి. వారు చెప్పుకొనుచున్న కష్టసుఖములన్నియు మహారాజాలకించెను. దుష్టులగు పలువురు ప్రభువుల నామె తొలగించి యా యాధికారములు క్రొత్తవారి కిచ్చెను. కాలువలు చెరువులు తోటలు వనములు రేవులు ఇత్యాదులగు నెన్నియో విషయములు విచారించి యుక్తములగు నాజ్ఞలు ప్రవర్తింపజేసెను. మహారాజులను ప్రజలు వేనోళ్ల పొగడుచు సెలవు తీసికొనుచుండిరి.

అన్నిటికంటె నెక్కువగా నా చుట్టుపట్టుల గ్రామకరణములు ప్రజానీకమును పెట్టుచున్న బాధలు మహారాజుల కవగతము లయ్యెను. ప్రజానీకమే కాదు. జన్నిగ తన సేనాచలనమునకు గొంటూరువైపులనుండి నరసాపురమునకు వచ్చుచుండ వారు కల్పించిన యిక్కట్లు నివేదించుకొనెను. ఎదురుగా వా రేమియు జేయరు; వినయవిధేయతలతో బ్రవర్తింతురు. చాటునకు పోయి గ్రామీణుల బెదరింతురు. ఎప్పుడో వచ్చి వెంటనే పోవు మహాప్రభువులకంటె నిత్యసన్నిహితులైన గ్రామాధికారులన్న ప్రజల కెక్కువ భయము!

కాని యింతమంది కరణములను ఒక్కసారి తొలగించు టెట్లు? తొలగించిన వ్యవహారము సాగు టెట్లు? రుద్రమ తీవ్రముగా నాలోచించెను. గ్రామవ్యవహారపత్రములన్నియు నికముందు గ్రామపాలకులగు రెడ్ల గృహములందే యుండునట్లు కట్టడిచేసి, ప్రతిగ్రామమునకును వెనుక నున్న కరణమునకు తోడుగా త్వరలో మరియొక కరణమునుగూడ నియమింతుమని సెలవిచ్చిరి. రెడ్లును కరణములతో నెన్నియో బాధలు పడుచున్నందున దీనికి వారును సంతోషముతో నంగీకరించిరి. ఓరుగల్లు చేరినవెంటనే కరణపాఠశాలలో నేర్చుకొనుచున్నవారిలో నిక్కడికి వచ్చుటకు ఇష్టమున్నవారిని, తోడి కరణములుగా నియమింపవలెనని రుద్రమహారాజు లుద్దేశించిరి. ఈ యాజ్ఞలు గొంటూరునుండి దత్తువాటివరకును ప్రవర్తింపజేయ నుద్దేశించెను.

ఆ పుష్యమాసపు వెన్నెలరాత్రు లామె యచ్చట గడపెను. కాని యవి యేమాత్రమును ఆమె హృదయతాపము నుపశమింపలేకపోయెను.

కృష్ణపక్షమున విదియనాడు ఆమె దక్షారామమునకు బయలుదేరెను. దారి పొడుగునను, మహారాజులయొద్దకు వచ్చి కష్టసుఖములు నివేదించుకొను పెద్దలను పిన్నలను చూచుచు వారితో సంభాషించుచుండుటతో రుద్రమ్మకు రాత్రింబవళ్లు తీరికలేదు. మహారాజులకును ప్రజలకును పరస్పరానుబంధము దృఢమయ్యెను. ఈ నూతనానుబంధములు ఆమెహృదయమున కొక విచిత్రమగు తృప్తిని శాంతిని కలిగించుచుండెను.

అట్లు పది దినములు ప్రయాణములు చేసి, యామె దక్షవాటి చేరికొనెను. ఆనాటి సాయంత్రమే రుద్రమ భీమేశ్వరుని సందర్శించెను. ఆ మహాలింగమును చూచినవెంటనే రుద్రమకు తన తండ్రిని దర్శించినట్లే యానందము కలిగెను. అతడు ఆంధ్రరాజులకు ఇష్టదైవము. చాళుక్యులకు ఇలువేల్పు. తాను కాకతిరుద్రమ్మయయ్యు, చాళుక్యుల ఇల్లు మెట్టినది. చాళుక్యుల ఇలువేల్పు తనకును ఇలువేల్పే!

ఆమె యా మహాదేవున కేమి నివేదించుకొన నెంచెనో! పూర్వము తా నక్కడికి వచ్చినప్పుడు తన ప్రక్కను వీరభద్రేశ్వరు లుండిరి. అక్కడ పూజచేయు శివద్విజుడు పూజాసంకల్పమున సపత్నీకు డగు వీరభద్రేశ్వరుల నామమే చెప్పి పూజ చేసెను. ఇప్పు డెట్లు జరుగవలెను?

స్థానికుడగు శివద్విజునకు ఈ సందేహమే కలిగెను కాబట్టి పూజాసంకల్పము ప్రారంభించి దేశకాలసంకీర్తన మొనరించి యజమాననామము చెప్పబోవుచు తల యెత్తెను. వెంటనే అచ్చట నున్న రాజపురోహితుడు శ్రీరుద్రదేవమహారాజ నామ మందిచ్చెను. పూజ సాగిపోయినదిగాని రుద్రమమన స్సెక్కడికో పోయిన ట్లున్నది. ఆమె కన్నులు చెమ్మగిల్లినవా? సమీపవర్తుల కనుమానము కలిగినది. భక్తిచే కలిగిన సాత్త్వికభావమని సరిపెట్టుకొనిరి. వా రేమియు ననలేదు. ఏమందురు? పూజావసానమున మహారాజు తీర్థప్రసాదములు గ్రహించి పుష్కలదక్షిణ లొసంగి భూసురాశీర్వాదములొంది పరధ్యానముగా తన శిబిరమునకు వెడలిపోయెను.

అక్కడికి చేరునప్పటికి ఆమెకు రెండు శుభవార్తలు తెలిసినవి!

జన్నిగ పంపిన భూసేనలు మోసలపుర మైదుదినములు ముట్టడించినవి. మోటుపల్లి నుండి త్రిపురాంతకుడు పంపిన నావలును మోసలపట్టణము రేవును అవరోధించెను; ఐదవనాటి కక్కడికి కొప్పెరుంజింగడు నరసాపురమునొద్ద పరాజయము నొంది జన్నిగకు పట్టుపడినవార్త చేరెను. అందుపై ద్విగుణోత్సాహముతో కాకతీయ సేనలు రెండును మోసలపట్టణముపై విజృంభించెను. అక్కడ నున్న కొప్పెరుంజింగని సేనాని లొంగిపోయెను. చోళనావలు చిక్కినవి చిక్కియు, మునిగినవి మునిగియు, పోగా మిగిలినవి శిథిలావస్థలో పారిపోయెను. మరల నవి యంధ్రసముద్రతీరభూమిని అలజడిచేయలేవు!

రెండవశుభవార్త గొంటూరునుండి వచ్చిన విజయవార్త! ఎంతకాలమో యుద్ధము చేసినగాని సాధింపరాని దుష్కరకార్యమును అంబదేవుడు తన సూక్ష్మబుద్ధితో సులభముగను శీఘ్రముగను సాధించెను. అతనికి అదృష్టముకూడ కలసివచ్చినది. పరస్పరసమాలోచనములకు పలువురు రహస్యముగా గొంటూరులో సమావేశమైయున్నతరి నిర్లక్షించి, సరిగా నప్పు డాకస్మికముగా నంబదేవుడు గొంటూరుపై మహాసేనతో పడెను. ఎక్కువ ప్రయాస లేకుండ గొంటూరు నతడు పట్టుకొనగల్గెను. అచ్చటి ప్రభువగు నాగదేవుడు యుద్ధములో ప్రాణములు గోల్పోయెను. ఆ చుట్టుపట్టులనుండి యచ్చట సమావిష్టులై యున్న తెలుగుచోడప్రభువులందరు పట్టుపడిరి. ఎఱువమల్లిచోడుడు, కేశవదేవుడు, సోమిదేవుడు, అల్లుగంగు, మల్లికార్జునుడు, దామోదరుడు—వీరందరును చిక్కిరి. వారినామాంకితము లగు జమ్మిపత్రములుగూడ అంబదేవు డావార్తతో పంపెను. విజయదశమినాడు ఓరుగల్లుచెరసాలనుండి తప్పించుకొనిపోయిన బొల్లడను మైలారుభటుడును చిక్కిపోయెను.

ఈ శుభవార్తలు తెలిసిన వెంటనే వానిని రుద్రమ్మ తన శిబిరమునను దక్షారామమునను ఆ చుట్టుపట్టులను చాటింపబంచి, ఐదురోజు లుత్సవము ప్రకటించెను. దక్షారామపరిసరప్రజ లారాత్రి నిదురింపబోవుసమయమున సరిగా, శ్రీరుద్రదేవమహారాజులు గొంటూరుమోసలపట్టణముల జయించిన ఘోష నాలకించిరి.

ఆ చాటింపు ఆవల జరుగుచునేయుండెను. ఆ శబ్ద మొకప్రక్కనుండి చెవుల బడుచునే యుండెను. ఆ సమయముననే ఓరుగల్లునుండి వేగులు వచ్చి వార్తాపత్రములు మహారాజుల కందిచ్చిరి. విప్పి చూచుకొన నందు ముఖ్యమైనది రుయ్యమ్మ స్వహస్తలిఖితమైయుండెను. ఆ వార్తల సార మిట్లుండెను :

"వృద్ధులును పూజ్యులు నగు మహాప్రధానులు శ్రీమాన్ గోవిందనాయకుడును బయ్యనినాయకుడును వారి పదవులనుండి విరమించుకొనిరి. మహారాజులు రాజధానిని వదలియున్నతరుణమున రుయ్యమ నచ్చట రాజప్రతినిధిగా నిలిపిపోవుట వారికి సమ్మతముగా నున్నట్లు తోచదు. మరియు పట్టణములో అలజడు లెక్కువగా నున్నవి. భిన్నమతస్థుల పరస్పరకలహములు వారించుట కష్టతరముగా నున్నది. అందులో నొకరిది న్యాయమని నిర్ణయించినచో, ఎదిరివా రది పక్షపాత మని నిందించుచున్నారు. జైనవసతిలో మహాశివరాత్రికి నేమినాథప్రతిష్ఠ చేయ సంకల్పించి రాజకోశమునుండి లక్షసువర్ణము లిప్పింప నర్థించినారు. ఆగ్నేయమునుండి చోళప్రభువును నైరృతినుండి హొయిసలబల్లాలరాజును మన రాజ్యముపై దండెత్తిరానున్నా రని వార్తపై వార్త వచ్చుచున్నది. దేవగిరిపై పునరాక్రమణ పరమశాంతముగా నున్నది. ఆ యాదవప్రభువు తన పైనెత్తిరా నున్న హొయసలప్రభువుల నెదుర్కొన నుత్తరముగా సేనలతో సాగిపోయెను. కరణపాత్రులలో చేరిన యారువేలమంది బ్రాహ్మణులును ప్రాయసవృత్తిలో నారి జేరిరి..."

రుద్రమ్మకు చివరివార్తకు చిరునవ్వు వచ్చెను. తన పెంపుడుకూతురగు నీ [illegible] ఎంత బ్రాహ్మణాభిమానము! ఐనను దీనికి ప్రియుడును పూజ్యుడును

సాక్షాద్భగవత్తుల్యుడును, అగు అన్నమంత్రిని ఏమిచేసినదియును నిది వ్రాయలేదు. అది యాతని విడిపించియుండదు. ఆ మహామాత్యుడు నిర్దోషియని మనుమసిద్ధివలననైన నిరూపింపబడునో, లేదో! కాకతిసామ్రాజ్యమును ధ్వంసము చేయబూనిన మనుమ సిద్ధి చెప్పునది నమ్ముటెట్లు? అతనికి కొప్పెరుంజింగనిపై నున్న ద్వేషముచే నీ యుద్ధములో పాల్గొన్నంతమాత్రమున నాతని నమ్మవచ్చునా? ఇతడు అంబదేవుని సేనలో చేరి,ఇంత యున్నతపదవి, తన పేరు చెప్పకొనకుండ ఎట్లు సాధించెను? కేతనమాటలచే నా 'పాలవీరుడు' మనుమసిద్ధి యను సందేహము తోచినవెంటనే, రుద్రమ యా యోధుని స్వాతంత్ర్యము నిరోధించి సేనాపతిత్వము తొలగించి, భటుల కాపులో నంచెను. తాను చేసినపని నిస్సందేహముగా సత్యమైనది.

అంతలో నేదో యాశాకిరణము రుద్రమ్మతలపులో భాసించినట్లున్నది. వెంటనే భటుని బిలిచి 'పాలవీరు'ని తన సన్నిధికి తెమ్మని యాజ్ఞాపించెను. భటులు 'పాలవీరుని' బంధించి రుద్రమ ఎదుట నిలిపిరి.

'పాలవీరుడు' స్వస్థుడై యుండెను. కాని యాతని కింకను బలము పట్టలేదు. అతనికి ముప్పదియైదేండ్లకంటె వయస్సున్నట్లులేదు. అతని దేహమునందల్ల బాహువులు ఒక విశిష్టసంపదతో నలరారుచున్నవి. అవి రెండును కోదండ్రాచులవలె [illegible] ఇతడు మహాబాహువు అని మాటగనే అనిపించు [illegible] విక్రమలి మనోజ్ఞమైనవి. కన్నులు [illegible]. [illegible] కాంచెముజంకో, [illegible], [illegible]— [illegible] దాని నీది యని [illegible]ంపదరాదు కాదు!

రుద్రమ్మ ఎదుట నిలువబెట్టగనే పాలవీరుడు తల వంచుకొనెను. అతడు రుద్రదేవమహారాజును కన్నెత్తి చూచినయే తన యాజానుబాహువులు రెండును ఒక్కమారు పైకెత్తి శిరమున గదియించి నమస్కరించెను. ఆ బాహువులు రెండు కరికరములవలెనే కలసికొని శోభ కూర్చెను. రక్షకులను పొమ్మని మహారాజు సంజ్ఞ చేయగా వాకలికి వెళ్ళిపోయిరి. రుద్రమహారాజు ప్రశ్నించుచుండగా నాతడు వినీతుడై యుత్తరము లిచ్చుచుండెను.

"నీ పే రేమి?"

"పాలవీరుడు, మహారాజా!"

"ఊరు?"

"విక్రమసింహు లగు తమ కేమని విన్నవించుకొనగలను?"

"నీ వీ సేన కెట్లధిపతి వైతివి?"

"అంబదేవుని యనుగ్రహముచే, మహారాజా!"

"నిన్ను చెరలో నుంచుటకు కారణమేమో ఎరుగుదువు గదా!"

"తమ అనుగ్రహము, మహారాజా!"

"నీవు అన్నమంత్రికి ఉత్తరములు వ్రాసితివిగదా !"

"లేదు, మహారాజా !"

"తిక్కనసోమయాజులకు"

"వా రెక్కడ నున్నారో కూడ నాకు తెలియదు మహారాజా! ఆ పూజ్యపురుషుడు క్షేమముగా నున్నాడా?"

"మారనకు నీవు వ్రాసిన యుత్తరము జ్ఞాపక మున్నదా?"

"మారన ఎవరు, మహారాజా ?"

"మంచిది. నీవు సార్థవాహులద్వారా ఏకశిలానగరములో నెందరు మంత్రీశ్వరుల కుత్తరములు వ్రాసితివో గుర్తున్నదా?"

"ఎప్పుడు మహారాజా?"

"చెప్పెదము. అవి యన్నియు నీకు చూపియే చెప్పుదుము. ఏకశిలానగరమున నిన్ను పూర్తిగా విచారింతుము!"

"మహాప్రసాదము, మహారాజా !"

"నీవు మున్నేమి చేసినను ఏకాదశినాటి యుద్ధములో చేసిన రాజసేవచే ప్రీతుల మైతిమి. అందుచే నిన్ను కొంత కరుణతో చూడదలంచితిమి. నీవు వరమేమైన కోరుకున్న నాలోచింతుము!"

"మహారాజులు సంపూర్ణముగా నన్ను విచారించుటయే నేనును కోరికొను వరము ! అయినను నేను కోరుకొనున దొకటి యున్నది. ఆ పాలకుర్రమును నాతో పాటు చెరలో నుంచ వేడెదను."

రుద్రమ్మ యాశ్చర్యపడెను.

"తిర్యగ్జంతువగు నా గుర్రముపై నీ కంత యభిమాన మేల?"

"పూర్వజన్మమబంధము ! అది నాకు తల్లి! నేను దాని బిడ్డను—"

పాలవీరుని కంఠము గద్గద మయ్యెను. కన్నుల నీరు గిర్రున తిరిగెను.

"నీ కోరిక తీర్చెదము !"

ఇట్లనుచు నాతని దీసికొనిపోవ భటుల కాజ్ఞాపింప వా రట్లే చేసిరి !

* * * *

కొప్పెరుంజింగడును స్వస్థు డయ్యెను. అతని విచారణ మరియొకదినముగా నా మరునాడే జరిగెను.

శ్రీరుద్రదేవమహారాజు దక్షారామభీమేశ్వరుని యాలయావరణమున పేరోలగ [illegible] న్నకతన పలువురు సేనానులు మంత్రులును సామంతులును మహారాజు

లను కొలిచియుండిరి. విద్వాంసులగు భూసురులును ఆశీర్వచనార్థ మచ్చట నుండిరి. వారిలో కేతనయు గలడు.

ఆ మహాసభలోనికి భటులు బంధితుడైన కొప్పెరుంజింగని, నాతని ప్రధాన కాడవసేనానులను దెచ్చి నిలువబెట్టిరి. వారి కందరకు శిరస్సులపై దీర్ఘము లగు కేశములు కలవు.

వారిని విచారించుట ఎక్కువసేపు పట్టలేదు. వారు కేవలము శత్రువులై ఆంధ్ర భూభాగముపై నకారణముగా దండెత్తివచ్చిరి. వారి సాహసముచే నంధ్రవీరులు పలువురు వీరస్వర్గము నందిరి. రాజకోశమునుండి ధనము విశేషముగా వెచ్చింపబడెను. వారి కేమి శిక్ష విధింపవలె ననునదియే ప్రశ్న !

శ్రీ రుద్రదేవమహారాజు కొప్పెరుంజింగనే ప్రశ్నించెను :

“నీకు మే మెట్టి శిక్ష విధింపవలెనో ఎరుగుదువా ?”

కొప్పెరుంజింగడు నిర్భయముగా, ప్రత్యుత్తర మిచ్చెను. అతని నిలకడలోని ఠీవి యా సభనెల్ల నాకర్షించెను.

“మహారాజా, మీచే మేము విజితుల మైతిమి. అంతకంటె వేరు శిక్ష మా కేముండగలదు ? మా ప్రాణములు మీ యధీనములు !”

సభయంతయు నిశ్శబ్దమయ్యెను. ఇట్టివాని కేమి శిక్ష వేయనగును ? శిక్షింపకున్న నితరులకు భయముండు టెట్లు ?

శ్రీ రుద్రదేవమహారాజుల యాజ్ఞచే వారందరికి నప్పుడ శిరస్సులు ముండనములు చేయించి స్నానములు చేయించి భటులు మరల సభలోనికి తెచ్చి వారిని నిలువబెట్టిరి. మహారాజు కొప్పెరుంజింగనితో నిట్లనెను:

“కాకతిరాజేంద్రులకు యావజ్జీవము సామంతుడనుగా నుందునని భగవత్సాక్షిగా నీవు ప్రమాణము చేసినచో నిన్ను నీ సేనానులను ప్రాణములతో వదలెదము!”

“చిత్తము, మహాప్రభూ !”

వెంటనే కొప్పెరుంజింగని ఇష్టదైవ మగు కనకసభాపతివిగ్రహమును కొప్పెరుంజింగని పురోహితునిచేతనే తెప్పించి దక్షారామభీమేశ్వరలింగముపాద సన్నిధి బెట్టించిరి.

కొప్పెరుంజింగడు ముమ్మారు మహాదేవునికి ప్రదక్షిణముచేసి, ఈశ్వరసమక్షమునను, భూసురుల సమక్షమునను, మహాసభాసమక్షమునను, కాకతిగణపతిదేవ పాదారవిందదాసుడనై యుందు నని ప్రతిజ్ఞచేయుచు శ్రీ రుద్రదేవమహారాజుల పాదపీఠమునందు శిరము గదియించి మ్రొక్కెను. మరియు నా సభాసమయమున భీమేశ్వరస్వామి కాతడొక కనకప్రభ దానము చేసి, యాలయమున నాచంద్రతారా

ర్కముగా 'కాకతిగణపతిపాదారవిందమధుకరాయమాన మానసేన రాజసింహేన—' ఇత్యాదిగా నొక శాసనము వేయించెను.

ఇందరు కాడవసేనానులును పట్టువడిన భటులును ఏమగునట్లు? వారి నందర నొక్కసారిగా వారి స్వదేశమునకు పోనిచ్చుట క్షేమముకాదు. వారిని దారిలో పట్ట శక్యము కాదు. అందరను రాజ్యపు సరిహద్దులు దాటిపోవువరకు కాపుండి పంపుట బహు వ్యయప్రయాసలతో కూడిన పని. ఆ పట్టువడిన సైనికులలో కొందరు వంశ పారంపర్యముగా యుద్ధమున కలవాటుపడినవారు. అట్టివారిని రుద్రమ తన సేనలలో చేర్చుకొనుటకు సమ్మతింపగా, వారును దానికి సంతోషముతో నంగీకరించిరి. మిగిలినవారు పలువురు యుద్ధముల కలవాటుపడినవారు కారు. వారు ప్రధానముగా కర్షకులు. ధనాశచే వారు రాజసింహుని సేనలో చేరి యుద్ధకౌశల మభ్యసింపసాగిరి. కాని వారి చేతులలో, ఖడ్గములును ఖడ్గములవలె గాక, హలములవలెనే కదలుచుం డెను. అట్టివారికి గోదావరీతీరమునను కృష్ణాతీరమునను దున్ని పండించుకొనుటకు చిన్న చిన్న భూఖండము లిచ్చుటకు శ్రీ రుద్రదేవమహారాజు లేర్పాటుచేసిరి. వారు ఆంధ్రభూమిలో అరవపల్లెలు స్థాపించిరి. వారి యింటిపేరు అరవవారని స్థిర పడినది. వా రిక్కడి కాపులలో కలసిపోయిరి.

కొప్పెరుంజింగడు తనవెంట నెందరో ద్రావిడ బుత్విక్కులను తెచ్చియుం డెను. వారందరును తమ కుటుంబములతో సాగ్నులై వచ్చినవారే! రమారమి రెండు వందలవరకు ఆ కుటుంబము లున్నవి. కొప్పెరుంజింగని శిబిరమును పట్టుకొనినప్పుడు ఆ బుత్విక్కులను జన్నిగసేనలు నిర్బంధింపలేదు. కాని వారికి ఆశ్రయముపోయినది. ద్వాదశినాటినుండియు నరసాపురమునకు సమీపమున గల యగ్రహారముల బయట నున్న యారామక్షేత్రములలో వారు నివసించుచు, నెట్లెట్లో కాలము గడుపు చుండిరి. శ్రౌతస్మార్తవిదులగు నందరు బ్రాహ్మణులు తమ కుటుంబములతో నిక్కట్లు పడుచుండుట గోదావరీతీరబ్రాహ్మణులకు బాగుండలేదు. వారు ఎన్ని కుటుంబముల నెంతకాలము పోషింపగలరు? విజయోత్సవములు సాగుచున్న సమయ మున, ఆ ద్రావిడులలో పెద్దలను వెంటతీసికొని గోదావరిపండితులు పలువురు శ్రీ రుద్రదేవమహారాజును దర్శించిరి. వారిలో కేతనయు గలడు. కేతనయే దాని కంత కును గారకుడు. కేతన యా ద్రావిడబ్రాహ్మణులు ఆరామక్షేత్రములలో నల్లాడు చుండుట మహారాజులకు నివేదించెను. "విద్వాంసులును, తపస్సంపన్నులును, అగు నందరు బ్రాహ్మణులు నిలువ నీడలేక బాధపడుచుండుట ఈ దేశమునకును తత్పరిపా లకులకు క్షేమముకాదు!" ఆ ఛాందసకవి యంతమాటయు ననివేసెను. శ్రీ రుద్ర దేవమహారాజులు కోపింతురని మిగిలినవారు భయపడిరి.

కాని మహారాజులు కోపింపలేదు. స్థానికులగు నధికారులను వారికి వసతి కొల్పడ కల్పింపదగునో యని వెంటనే విచారించిరి. తుదకు సర్వవిధముల ననుకూలముగా నుండుటచే, ఆ ద్రావిడబ్రాహ్మణులకు శ్రీ రుద్రదేవమహారాజులు తమ విజయయాత్రకు చిహ్నముగా కాకరపర్రు అగ్రహార మొనర్చి దానముచేసిరి.

వచ్చిన ద్రావిడబ్రాహ్మణులును కేతన మొదలుగా నితర గోదావరిబ్రాహ్మణులును శ్రీ రుద్రదేవమహారాజులకు విజయపరంపరలు కలుగుగాత మని యాశీర్వదించి సెలవు తీసికొనిరి. అంతటితో నా ద్రావిడబ్రాహ్మణులకు ఆరామక్షేత్రములలో నలమటించవలసిన దురవస్థ తప్పిపోయినది. స్థిరవసతి యేర్పడినది. కాని గోదావరీబ్రాహ్మణుల జిహ్వాగ్రములలో మాత్రము వారికి ఆరామద్రావిడు లను నామము శాశ్వత మయ్యెను.

* * *

ఆసిమ్మ్రట రెండురాత్రులు చాల ప్రొద్దుపోవువరకు శ్రీ రుద్రదేవమహారాజులు తన ప్రధానదండనాథులతో నేకాంతమున మంత్రించిరి. అందులో జన్నిగయు అజదన్నయు నుండిరి. కోలని రుద్రుడుకూడ పిఠాపురమునుండి ప్రత్యేకముగా నాహ్వానింపబడి యుండెను.

ఆ యేకాంతసభలో ఏకశిలానగరమునుండి వచ్చిన వార్తలును, గొంటూరునుండి అంబదేవుడును మోటుపల్లినుండి త్రిపురాంతకుడును పంపిన వార్తలును చర్చించిరి. వానిలో పరస్పరవిరోధము కొంచెము భాసించెను. ఐనను ఆ వార్తలు నిజము కాకుండుటకు వీలులేదు. సభాంతమున రుద్రమ యీవిధముగా నిశ్చయించెను :

“జన్నిగ వెంటనే మహాసైన్యమును కదలించుకొనిపోయి సుందరపాండ్యుని సేనలపై విజృంభింపవలెను. కోలనిరుద్రుడు వెంటనే కాళింగసేనలను తాకవలెను; అప్పుడే కోరంగినుండి మహానౌకాబలము బయలుదేరి కాళింగుల నౌకాబలములను వాని రేవుపట్టణములందే ముట్టుకొనవలెను. తిక్కచమూపతి ఆగ్నేయమునుండి వచ్చుచున్న చోళసైన్యములను, గోన గన్నారెడ్డి నైరృతినుండి వచ్చుచున్న బల్లాల కర్ణాటసేనలను, రెండు మహాసైన్యములతో వెంటనే పోయి ఎదుర్కొనుటకు ఆజ్ఞలు ఏకశిలానగరమునకు శీఘ్రచరులచే పంపవలెను!”

ఈ నిర్ణయములకు కొంత సందేహము సూచించినది ఒక్క కోలనిరుద్రుడే! ‘ఓరుగల్లునుండి ప్రధానసేన లన్నియు వెడలిపోయిన పురరక్ష యేది? దేవగిరినుండి యాదవప్రభువు దండెత్తివచ్చిన నేమి యుపాయము?’

ఆ భయము లేదు. యాదవులు తమ రాజ్యముపై నెత్తివచ్చుచున్న ముసల్మానుసేనలకు తమ రాజ్యము వదలివేసి ఓరుగల్లుపైకి రాగలరా? ఓరుగల్లునందే ఈ నూతనమతస్థులు నెమ్మదిగా ప్రవేశించుచున్నారు. జీవనోపాధిలేని పేదలవలెను, నికృష్టజీవనములు జరుపు నల్పులవలెను, ఇప్పటికి ఎందరో ఏకశిలానగరమున వారున్నారు. వారిని చారులు కనిపెట్టుచుండవలసినదే కాని, మహారాజులు తమ దేశములో ప్రవేశింపకుండ నెట్లు నిషేధింపగలరు? అట్టివారు ఇంకను సమీపమున నున్న దేవగిరిపై తమ దృష్టి సారించియుండుట సహజము. దేవగిరియు ఏకశిలయు ఏకమై యున్నగాని, ఎప్పటికైన ఆ భయము ఉభయులకును తప్పదు!

ఇట్టివిధముగా కాలనిరుద్రుని సందేహములను తక్కినవారు వారించుచుండిరి. ఏమైన నేమి? నిశ్చయము లైపోయినవి! రాజాజ్ఞలు ప్రవర్తింపబడినవి!

* * * *

కాలనిరుద్రుడు ప్రస్థానభేరి వేయించి యా మరునాడుసాయంత్రము గోధూళిలగ్నమున మహాసేనతో కాళింగులపైకి శీఘ్రయానమున సాగెను. వ్యాకరణ బ్రహ్మ యగు నాతని రణభేరియు చిత్రముగా ధ్వనించి చుట్టుపట్టుల నున్న విద్వజ్జనముల నానందపరవశుల గావించెను.

"అఇఉణ్॥ ఋఌక్॥ ఏఓఙ్॥ ఐఔచ్॥ హయవరట్॥ లణ్॥ ఞమఙణనమ్॥ ఝభఞ్॥ ఘఢధష్॥ జబగడదశ్॥ ఖఫఛఠథచటతవ్॥ కపయ్॥ శషసర్॥ హల్॥"

రుద్రుని రణభేరియు, సంధ్యానాట్యము చేయుచు మహారుద్రుడు తన ఢక్కపై పదునాలుగుమారులు నినదింపజేసిన యక్షరములే చిత్రముగా ధ్వనించెను.

కోరంగి నావలును మనోజ్ఞశ్రుతితో కదలెను.

జన్నిగసేనలును మరునాడు ఉదయమున సాగిపోయెను.

విజయోత్సవములు పూర్తిచేసి శ్రీ రుద్రదేవమహారాజులును సపరివారముగా దారిలో ప్రజల క్షేమ మరయుచు ఓరుగల్లుకు తిరుగు ప్రయాణము సాగించెను.

౪౨

యథావాక్కుల అన్నమయ్యకోపాగ్నికి గురియైన శ్రీవైష్ణవాగ్రేసరుడు కన్నులు పోయి యన్నమేశ్వరునియాలయము ముందు పడిపోయెనుగదా! అతని వెంట వచ్చిన వైష్ణవతండము పారిపోయినది. ఆ పడిపోయినవానియొద్దకు పోవుటకు అన్నమేశ్వరుని యాలయముముందున్న శివభక్తులుకూడ సాహసింపలేదు. అన్నమయ్య కొంతవడికి లేచుచు తన రెండుకన్నులు గట్టిగా మూసికొని, వెనుకకు శివనిందకుని దిక్కై ఇంతవరకు తిరిగియున్నవాడు. మరల ఈశ్వరునివంకకు తిరిగి భక్తివినమ్రుడై నమస్కరించి శివపూజ సాగించెను.

ఈ కథ పట్టణమంతయు ప్రాకిపోయినది. ఎందరో ఆ వింత చూచుటకు వచ్చిరి. జనసమ్మర్దము నిరంతరముగా నుండు నా ప్రదేశమున, మరియు విశేషముగా జనము మూగిరి. అంత జనము మూగినను అందులో నెవ్వరును కన్నులు పోయి పడిపోయిన యా శ్రీవైష్ణవుని సమీపింపరు. వారి కటు పోవుటకే భయము. భయము సంగతి యెటులున్నను, కన్నులు పోయి పడిపోయినాడే యని జాలినందువారైన నక్కడ లేరు. పైగా శివనిందచేసినవానికి ప్రాయశ్చిత్తమైన దనువారే అందరును! అపరాధులు శిక్ష యనుభవించుచుండ వారిపై జాలినొందు నిర్వీర్యస్థితిలో లేరు ఏకశిలానగరపౌరులు! శ్రీవైష్ణవులకు ఆ చాయకు వచ్చుటకుగూడ ముఖము చెల్ల లేదు.

మరి యాతనివెంట నందరు వైష్ణవులు వచ్చియుండిరే! అతడును శ్రీవైష్ణవునివలెనే యుండెనే! ఈవార్త ఏకశిలానగరములో వీథివీథుల వాడ వాడల ప్రాకిపోయినదే! ఎవరును అతనివారు రారేమి? అతనికి భార్యగాని బిడ్డలుగాని లేరా? తల్లిగాని తండ్రిగాని లేరా? అన్నలు దమ్ములు అక్కలు చెల్లెండ్రునుగూడ లేరా? ఎవరునుగూడ లేరా? ఇత డసలు శ్రీవైష్ణవుడే యగునా?

*   *   *   *

ఆనాడు రెండు జాములకు కొంచెము ముందుగా మాచల్దేవి తన చేటికతోడను కొంత పరివారముతోడను కేశవస్వామిని దర్శించుటకు అరుదెంచెను. అది స్వామి సేవ చేసికొన్నది; ఆనందపారవశ్యముతో నొకగీతము నృత్యము స్వామికి ప్రదర్శించి కానుక లర్పించుకొన్నది. పిమ్మట నది స్వయంభూదేవులను గూడ దర్శించి కానుక లర్పించి యాలయప్రాంగణమున నించుక విశ్రమించినది.

అంతలో మండపమునుండి తిక్కనసోమయాజులు మహాభారతరచనము ఆపూటకు చాలించి మారన గురునాథులతో కలసి వెళ్లుట చూచి యది సంభ్రమమున లేచి వారికి మ్రొక్కి సోమయాజుల దయావలోకనప్రసాదము పొందినది.

ఆ ట్లది యక్కడనుండి గృహోన్ముఖముగా మరలిపోనుండగా, నావల అన్నమేశ్వరుని యాలయమునందు శివనింద చేసిన శ్రీవైష్ణవు డొకడు కన్నులంబోయి పడిపోయెనను వార్త విన్నది. పోయి చూడవలెనను వేడుక మాచల్దేవికి కలిగినది.

అది తన చేటికతో పోయి చూచునుగదా, వెంటనే యాతడు శ్రీవైష్ణవుడు కాడని యది నిర్లక్షించెను. వెనుక విజయదశమినాడు కౌముదీజాగరణోత్సవము వేళ తన యింట కొంతవడి జూదమాడి తుదకు పర్వతనాయకునితో ఖడ్గయుద్ధము చేసిన అజ్ఞాతయోగియే యాత డని దానికి తెలిసిపోయినది. చేటికగూడ గుర్తించిన ట్లున్నట. దాని కన్నులు ఆ గుర్తించుటలో నాశ్చర్యసంభ్రమములతో రెండింతలు కాగా, మాచల్దేవివంక తిరిగి 'అక్కా!—' అని యేమో అనబోవుచుండెను. కాని వెంటనే మాచల్దేవి మాటాడవద్దని చేసిన కనుసన్న నందుకొని యది నోరు కట్టి వేసికొనెను.

ఏమిది ? ఇతని కీ వేషమేమి ? మహాయోగియైనచో ఈ శివనింద యేమి, ఈ శిక్ష యేమి? ఈమనుష్యుని వేషభావములతో, నింత లోకజ్ఞానముగల తానే మోసపోయినదా? ఇతని కేమి లోపమున్నను కామమోహితు డగుట యను లోపము లేదు. ఎట్టి మహానుభావులును కామమోహితు లగుట దాని కనుభవము. కామము నిర్జించిన యీ యోగియందు తన కందుచే విశేషగౌరవము కలిగినది!

ఆ రాత్రి రోషావేశముతో పర్వతనాయకుడు పట్టుకొనగా నాతని చేతిలోనికి వచ్చిన జుట్టు కృత్రిమమైనది. ఆ కృత్రిమకేశపాశము అదొకవిధముగా నుండెను. మరి యీనా డీతడు ధరించినది కర్ణాట శ్రీవైష్ణవుల కేశబంధమువలెనే యున్నది. కేశబంధమే యేమి ? అతని వేషమంతయు నట్లే యున్నది. ఏమి యీ ద్వాదశోర్ధ్వపుండ్రములు ? శ్రీవైష్ణవులనుగూడ తన వేషముతో వారిలో నొకడని నమ్మించిన ట్లున్న దీవేషము ! ఇత డెవరో గూఢచారుడై యుండవలెను. ఇతని నెరిగినట్లు కనబడుట ప్రమాదకరము !

ఈ యూహలన్నియు మాచల్దేవిమనస్సులో ప్రసరించెను. వెంటనే చేటి వంకకు తిరిగి, "చెల్లీ ! భగవద్దూషణఫలము చూచినావటే !" అనుచు దానిని తోడు కొని మాచల్దేవి వెడలిపోయినది.

* * * *

సాయంత్రము మూడుజాము లైనది. అక్కడికి చూడవచ్చు జనసమ్మర్దము తగ్గిపోయినది. బొల్లని భార్య మంగి తనకూతురు పాటితో కలసి యక్కడికి వచ్చినది. అప్పటికిని ఆ కన్నులంబోయిన గూఢచరుడు ఏకాకియై యక్కడనే పడియుండెను. అప్పు డెవ్వరును అక్కడికి వచ్చినట్లే లేదు.

పడియున్న యాతని జూడగనే మంగికి దుఃఖము ముంచుకొనివచ్చినది. దాని కాతనిపై తండ్రియందువలెనే ప్రేమ గౌరవము వినయము భక్తియు కలవు.

పూర్వ మొకమారు దాని యింట కరువగా మూన్నాళ్లు ఆహారము లేకుండెను. దాని బంధువులే దానియొద్దకు వచ్చుటకు వెరచుచుండిరి. అది సహాయ మర్థింప బోయిన దాని దగ్గరవారే పెడమొగములు పెట్టిరి. భిక్షమునకు పోవుటకు దానికి మన సొప్పలేదు. అందులో కూతురు పాటికి జ్వరముకూడ వచ్చినది. పిచ్చిమాటలు వెర్రిమాటలు! అది ముఖ్యముగా తండ్రికై దిగులుపడినది. తండ్రినే ఆ సంధిలోకూడ పలవరించుచు. మంగికి కాళ్లాడలేదు.

మూడవనాటి సాయంత్రమున కది యొక నిశ్చయమునకు వచ్చుచుండెను. మరునాడది కూలికో భిక్షమునకో పోవలెను. భిక్షమా? కూలికి పోవుటా? రాతి కోట కట్టుటకు కూలీలు ఎవ్వరైనను ఎందరైనను కావలెను. కాని స్త్రీలు ఆ పనిలో ఎక్కువమంది లేరు. ఒక్కమారు ఆ పనిలోనికి దిగినచో రాజభటులు పని పూర్తి యగువరకు పని చాలింపనీయరు. కోట పూర్తియగువరకు నొకవిధమగు నిర్బంధమే. మరి యది ఎన్నాళ్ళకు పూర్తి యగునో! అంతవరకు తాను పనిలో నిరుకుకొనిన నెట్లు? మరి యీ యాకలిబాధ భరించుట ఎట్లు? తన్ను తన కుమార్తెను పోషించు కొనుట ఎట్లు?

అట్లాలోచించుకొనుచుండగా ప్రొద్దుక్రుంకినతర్వాత ఎవరో ఎరుగని మనుష్యుడు వచ్చి, 'నీ వీ రాత్రి నిద్దురపోకుము. శుభమగును!' అని మాత్రము చెప్పి మరి మాటాడక కనబడకుండపోయెను.

ఏమిది? ఎవ రిది? ఒకప్రక్కను 'పాటి' కి సంధించినజ్వర మట్లేయున్నది. మంగిమనస్సు ప్రపంచమంతయు సంచరింపసాగినది. బొల్ల డెక్కడ నున్నాడు? ఈ విశాలప్రపంచములో నెక్కడ నున్నాడో? తన్ను తన కూతును మరచినా డేమో? రాజభటులచే జిక్కి ఏమి బాధలు పడుచున్నాడో! అతడు చెరసాలకు గొంపోబడినదియు నాతని నెవ్వరో తప్పించినదియుమాత్రమే దానికి తెలియును. ఆపై నేమియు నెరుగదు. ఆ తప్పించినవారు తనవైపైన చూచుటలేదే? వారికే తనపై గూడ కరుణ కలిగినదేమో! కాక తన విభుడు బొల్లడే రహస్యముగ వచ్చునా?

ఆరాత్రి కంటిపై కునుకు రాకుండ నిద్ర కాచి మేలుకొనియున్నది. అర్ధ రాత్రము దాటినది. ఏమియు లేదు. ఆళ సన్నగిల్లినది. ఎంత యాపినను ఆగకుండ నిదురవచ్చుచున్నది. ప్రయత్నపూర్వకముగా మేలుకొనియున్నది.

కూర్చుండి యుండగనే ఒక కలవచ్చినది. మేలుకొన్నవారికి కలలు వచ్చునా? దానికి నిద్దురపట్టియుండవచ్చును. ఒక్క రెప్పపాటుకాలము కునుకు పట్టిన చాలును. ఆ కొంచెముకాలములో మరియొక జీవితకాలము కలలో గడచిపోవచ్చును. కాని మంగికి వచ్చినది చిన్న కలయే! పెనుభూతమువలె జడలు విరియబోసికొనియున్న రొక యాకారము కన్నులముందు కనబడినది. దాని కనేక చేతులు. ఆ చేతులం దన్నిట ఖడ్గము లున్నవి. అవి యన్నియు నొకచో కలసినవి. కలసియున్న

యా ఖడ్గములు చూడగా ఒక భుశుండియాకారము ధరించినవి. అంతలో ఒక పెద్ద చప్పుడైనది. అది యా కత్తులన్నియు విరిగిన చప్పుడా?

కొట్టినట్లు మంగికి తెలివి వచ్చినది. పూర్వవర్ణితుడైన నిశాచరయోగి యాయన దండము కొట్టుచు చేసిన చప్పుడు, అది! అతడాధ్వని చేయుచు చేసిన సంచార మెల్ల మంగి శ్రద్ధగా నాలకించెను. ఈ భయంకరధ్వనిరూపముగా తన కానాడు శుభము రాబోవుచున్నదా? ఏమో!

తిరిగితిరిగి యా శబ్దము తన కుటీరముపై పునకే వచ్చియాగినది. అప్పటికే పేరాసతో మంగి తలుపు తీసినది. ఆ భిక్షువును చూడగానే మంగికి నిరాశ నిస్పృహా కలిగినవి. ఈ భిక్షువువలన తన కేమి లాభ ముండును? అతని యాశీర్వాదము పొందుట కైనను, భిక్షము పెట్టను గింజకూడ తన యింటిలో లేదు. ఏమి చేయును?

తుద కా భిక్షువే దానికి శుభవార్తలు చెప్పెను. చెప్పియంతటితో పూర కొనక నోసెడు సువర్ణము లిచ్చియుండెను. ఆ సువర్ణములును అతని కెట్లు వచ్చినవి? ఆకాశములోనుండి యాతడు పిలిచినంతనే ఎవరో యక్షు లాతని దోసిలిలో పోసిన ట్లున్నారు. అవి యాతడు తన కీయగా నది నిజ మని దానికి ముందు నమ్మకము కలుగలేదు. తీసికొన్నది. నిజముగానే శుభము దాని కా రాత్రి వచ్చినది. ఆ పిమ్మట మనస్సు ఆందోళనముతో దానికి నిద్దురపట్టలేదు.

ఆపిమ్మట దానికి దారిద్ర్యము పోయినది. తదాది పొదుపుగా ఆ సువర్ణములు వాడుకొనుచు జీవించుచున్నది. పాటికి మరిరెండురోజులకు జ్వరము నయ మైనది.

అట్టి మహానుభావుడు ఈనాడు ఇట్లు నడివీధిలో దిక్కులేక కన్నులు పోయి పడియున్నాడు. తనకువలెనే ఈతడు మరి యెందరు బీదలకు ఉపకారము చేసి యుండెనో? వారిలో ఒక్కరును ఇప్పు డిక్కడికి రాలేదు. అతనిని వదలక సమీపమునవే కూర్చుండి మంగి పెద్దపెట్టున నేడువసాగెను. దానికి కారణము తెలిసిపోయినది. పాటి దానిని పైటకొంగు లాగుచు ఇంటికి పోవుద మని తొందరపెట్టుచున్నది.

సాయంకాల మైనది. దీపములు దేవాలయములలో వెలిగించిరి. తిక్కనసోమయాజి మారన గురునాథులతో కలసి స్వయంభూదేవాలయమండపమునుండి యన్నమంత్రియింటికి చేరుటకు బయలుదేరి యా మార్గమున బోవుచుండెను. మంగికి దూరమున సోమయాజులను చూడగనే ఆ మహానుభావుని రక్షింపు మని వేడుకొనవలెనను ఇచ్ఛ జనించెను. అది ఎదురుపోయి సోమయాజుల రెండుకాళ్లు గట్టిగ పట్టుకొని విడువక వెక్కివెక్కి యేడువసాగినది.

సోమయాజులకు ఆశ్చర్యముతోపాటు జాలి కలిగెను. దీనముగా నవదర్యై యేడ్చు మంగిస్థితిని చూచిన ఎవరికి జాలి కలుగదు? అందులో కరుణాళువులగువారికి జాలి కలుగదా?

తిక్కనసోమయాజుల కా ఉదయమున జరిగిన కథ చూచాయగా తెలిసినదే గాని సరిగా తెలియలేదు. ఏమని విచారింపగా అక్కడి జనము ఉదయము జరిగినది చెప్పివేసిరి. అంతయును విని సోమయాజులు "నన్నేమి చేయుమందువు?"అని మంగిని ప్రశ్నించెను.

"రక్షించు, స్వామీ, ఆయన కళ్లు తెప్పించు, స్వామీ! మీకు పుణ్యము ముండును!"

"అతడు నీ కే మగును?"—సోమయాజి ప్రశ్న.

"అతడు నాతండ్రి, స్వామీ! నాబోటి దిక్కులేని పక్షులకందరికీ తండ్రి వంటివాడు స్వామీ!"

సోమయాజులు ఇంచుక ధ్యానించెను.

"అమ్మా! ఇతడు శివనింద చేసి ఈ స్థితికి వచ్చినాడు. అన్నమేశ్వరునికి మ్రొక్కుకొని ఆ యాలయములో నన్న యథావాక్కుల అన్నమయ్యను క్షమా భిక్ష యర్థింపుము. సర్వము శుభమగును!"

వెంటనే మంగి యాతని పాదములు వదలి అన్నమేశ్వరునియాలయము ముందు నిలుచుండియున్న యన్నమారాధ్యుల పాదములపై బడి పరిపరివిధముల ప్రార్థించెను. కొంతవడికి అన్నమారాధ్యులకును జాలి కలిగినది. శివలింగార్పితమైన దివ్యజ్యోతిని ఆ పడియున్నవాని కన్నులపై ప్రసరింప జేసెను. ఆ పడియున్నవాడు కన్నులు నులుము కొనుచు లేచెను.

'మంగి యన్నమారాధ్యులకు మ్రొక్కి 'బాబా, లేచితివా?' యని యా శ్రీవైష్ణవవేషధారిని సమీపించెను. అతడు కన్నులు తెరచినాడు. లేచినాడు. మంగిని గుర్తుపట్టినట్లు లేదు. అది ఎవరోకూడ ఎరుగనట్లే యాతడు ప్రవర్తించెను. నగరములో, సామాల సీమాల ఇనుపపనిముట్లు చేయు పనివారు 'బాబా, బాబా, బాబా'యనుచు నాకస్మికముగా వచ్చి యాతని నక్కడికో తీసికొనిపోయిరి.

అంతనరకును మేచయనాయకుడుతన భటులతో నా చుట్టుపట్టుల వీధు లన్నియు నిరోధించి స్వయముగా నక్కడ కాపుండెను. ఆ భటులందరను కను బ్రామి మేచయనుగూడ కనుబ్రామి యావచ్చిన మనుష్యు లాతని తప్పించుకొని తీసి కొనిపోయిరి. మంగి తన కూతురు పాటితో నక్కడ మిగిలిపోయెను.

మేచయ కాశ్చర్య మయ్యెను. అతడు మంగిని పాటిని ఏమియు జేయదలపలేదు. భయముతో వడకిపోవుచున్న మంగికి ఇంటికి పోవుటకు మేచయ యనుజ్ఞ యిచ్చెను.

* * * * *

మరి యాత డెవరు? రంగనాథరామాయణము రచించుచున్న రంగనాథుడా? కానే కాదు! రంగనాథరామాయణకర్త రంగనాథు డైనచో నాతడు శివనింద చేయుట యసంభవము. ఆ రంగనాథుడు శివభక్తాగ్రేసరుడు!

మరి ఎవరీ శ్రీవైష్ణవుడు? అతడు శ్రీవైష్ణవుడే కాడు. అతడు ఇస్లాముమత ప్రచారకుడు! చాతుర్వర్ణ్యజనములోనివాడు, కాడు!

అది తెలిసిన శ్రీవైష్ణవులలో గుసగుసలు ప్రారంభించెను.

"అయ్యో! ఇతడు నాకు తీర్థప్రసాదము లిచ్చెనే!"

"అయ్యో! ఇతడు నా సహపంక్తిని భుజించెనే!"

"ఎంత మోసపోతిమి!"

"మా పెరుమాళ్లు అపవిత్రమైనాడు. పులికాపు చేయవలెను!"

"ప్రాయశ్చిత్తము చేయించుకొనవలెను."

అదిగో, యెత్తినవారు పట్టణము మధ్యక్షోణి సింహధ్వజం
బదిగో, కట్టినవారు నింబదళమాల్యాతోరణ వ్రాతముల్
విదితం బయ్యె మహోత్సవంబు నెలకొనెన్ వీథీవిటంకంబులం
దదిగో, నిల్పినవారు పూర్ణకలశం బాబాలగోపాలమున్ !

క్రీడాభిరామము

శ్రీ రుద్రదేవమహారాజులు దక్షారామభీమేశ్వరమునుండి పంపిన యాజ్ఞల ననుసరించి ఏకశిలానగరమున విజయోత్సవములు మహావైభవముతో సాగుచుండెను. ఇది మోటుపల్లిని త్రిపురాంతకుడు జయించినప్పుడు జరిపిన యుత్సవము నెన్నియో రెట్లు మించిపోవుచుండెను. ఇప్పుడు కొప్పెరుంజింగడు సంపూర్ణముగా విజితుడయ్యెను. గొంటూరుమాండలికుడగు నాగదేవుడు హతుడయ్యెను. అతని మిత్రులందరు పట్టుపడిరి. మోసలపట్టణము వశమయ్యెను. చోళనాడులన్నియు స్వాధీనములైనవి. మహోత్సవము జరుగకుండు టెట్లు ?

మరియు మహారాజు లాజ్ఞాపించిన ప్రకారము ఓరుగలునుండి యొక మహాసేనను తీసికొని తిక్కచమూపతి దక్షిణమునుండి వచ్చుచున్నారని తెలిసిన హోసల సేన నెదిరింపబోవగాను; గోనగన్నారెడ్డి నైరృతినుండి వచ్చుచున్నట్లు తెలిసిన కర్ణాట సేనల నెదుర్కొనుటకై యొక మహాసేనతో కదలిపోయెను. ఇప్పుడు చూచిన ఓరుగల్లు కేవల మరక్షితముగా నున్నట్లున్నది !

రాజప్రతినిధిగా రాజకార్యములన్నియు మొదటినుండి చూచుచున్న రుయ్యమ్మగారే యీ రాజాజ్ఞ లన్నియు ప్రవర్తింపజేసెను. ఆ యాజ్ఞలును రుయ్యమ్మ పంపిన వార్తల ననుసరించియే రుద్రుడు పంపినటు స్పష్టమయ్యెను. అందుకు రుయ్యమ్మకు నెంతెంతో సంతోషమయ్యెను. ఎంత ప్రేమగల తల్లిదైనను, తాను సూచించిన కార్యమును తల్లికిని సమ్మతిమై, తన సూచనప్రకారము యాజ్ఞలు ప్రవర్తింపజేయబడిననే పిల్లకు సంతోషము కలుగదు ? తిక్కచమూపతియు గోనగన్నారెడ్డియు సేనలతో కదలుచుండగా రుయ్యమ్మను ఆనందమే ఆవేశించెను.

కాని ఆ సేనలు కదలిపోయి మూడుదినము లైనవి. అంతలో నాకస్మికముగా రుయ్యమ్మహృదయములో పెద్ద బెంగ వచ్చి పడినట్లయ్యెను. మనస్సు అంతయు శూన్యమైనట్లు తోచెను. ఇప్పుడు ఏకశిలానగరమునకు బలమగు రక్ష లేదు. శిలాప్రాకారము సంపూర్ణముగా లేవలేదు. పుట్టకోటరక్షణ చాలదు. అయినను భయ మేమున్నది ? రాదగిన శత్రు వెవరు ? దేవగిరిరాజు ఉత్తరదిశాభిముఖుడై దేహళీప్రభువుల సేనల నెదిరింపబోయెనుగదా ! భయ మేమి ?

“అది మోస మైనచో ?”

రుయ్యమ్మగుండెలలో రాయిపడినట్లయ్యెను. ఇప్పుడు తా నెవ్వరితో నాలోచింపగలదు? మహాప్రధానులగు గోవిందనాయకుడును బయ్యననాయకుడును పని చాలించుకొనిరి. ఇన్నాళ్లును తిక్కచమూపతి తన కెంతయేని సహాయము చేయుచుండెను. ఇప్పు డెవ్వరి నడుగగలదు? తనకు విశ్వాసయోగ్యమగు మంత్ర ముపదేశించు పెద్ద లెవరు?

అర్ధరాత్ర మైనది. కాని విజయోత్సవ చిహ్నములు చెవుల దూరమునుండి పడుచునే యున్నవి.

"అకలంకస్థితి శీధుపానరుచులై యాసాదు లుప్పొంగి రో
యకరో యమ్మకరో యమక్కరో యదీయట్టటకో యంచు బా
యక తప్పెట్లును దళ్లెతాళములు నింపై సొంపు రంజిల్లగా
జకజుంజుం జకజుంజు జుమ్మ మనుచుఙ్ సాగుం గడుఙ్ వాద్యముల్"

అని యొక కవి వర్ణించినవిధముగా తప్పెట్లు తళ్లెతాళములు వినవచ్చుచున్నవి. ఆ శబ్దములు వినవచ్చుచున్నకొలదియు రుయ్యమ్మకు ఆవేగ మెక్కువయ్యెను. ప్రశాంతమగు నిశాసమయమున దూరమునుండి వినవచ్చుచున్న యా వాద్యములు వింతయగు దడ కల్గించును. అవి యీనాడు రుయ్యమ్మగుండెలను దడదడ లాడించివేయుచుండెను.

వెంటనే యామె దేవగిరివంకనుండి తనకు వార్తాహరు లంపిన వార్త లన్నియు తీసి పరిశీలించెను. అందులో సందేహింపవలసినపని లేదని గుండె దిటవుచేసికొని శయ్యపై పరుండి రుయ్యమ్మ నిదురింప బ్రయత్నించెను. నిదుర రాదు. దూరమునుండి, 'జుకజుంజుం, జుకజుంజుం, జుకజుంజు' అని తప్పెట్లు చేయు చప్పుడు హృదయమును కలచివేయసాగెను. నిద్దుర రాదు.

"నా కిప్పుడు తగిన మంత్ర ముపదేశించువా రెవరు?"

రుయ్యమ్మయాలోచన పరిపరివిధముల ప్రసరించెను. వృద్ధులగు గణపతిదేవులేమియు రాజకార్యములు పట్టించుకొనుటలేదు. రుద్రమ వచ్చినవెంటనే తీర్థయాత్రలకు బయలుదేర గణపతిదేవులు ఉద్దేశించుచుండిరి. వారి నడిగి లాభము లేదు. జాయపనాయకుడు చేబ్రోలు వెళ్లియుండెను. మహాదేవరాజు అసలే తొందరపాటు మనిసి! కామసాని అంతఃపురవిషయములు తప్ప యితర మెరుగదు. ఎవ రిప్పుడు తనకు తగిన మంత్ర ముపదేశించువారు?

రుయ్యమ్మకు ప్రపంచమే శూన్యముగా కనిపించెను. ఈ లోకములో నెవ్వరును లేనట్లే కొంతవడి దానికి తోచెను. అంతలో నాకస్మికముగా దాని హృదయములోనికి బలవంతముగా నొక పురుషమూర్తి ప్రవేశించెను. అతని యున్నత మగు ఫాలము, నాసము, శ్యామాయిత మగు చాయగల యాతని యాకారము, గొరకన్ను

లతో రుయ్యమ్మ మనస్సులో నిండిపోయెను. కారణజన్ముడైన అన్నమంత్రీశ్వరుడు రుయ్యమ్మకు స్ఫురించెను.

"అన్నమంత్రీశ్వరు లేమందురో ఈ సమయమున సహాయమర్థించిన ?"

తాను మొదలు అన్నమంత్రితో మాట్లాడగలదా ? ఇతర పురుషుల నెవరినైన జూచినను రుయ్యమ్మకు జంకు లేదు. కాని అన్నమంత్రిని చూచినంతనే ఆమె నోరు కట్టువడును. బుద్ధిలో నొకానొక దీనభావ మావేశించును. కన్నులు చెమరించును. ఏమని యాతని దానడుగును ? అందులో నాతడు రాజద్రోహి యని సందేహింపబడి నిర్బంధమున నున్నవా డాయెను ! అట్టివానినే తాను ఈ కష్టవిషయమున మంత్ర మర్థించుటా ? అత డొకవేళ దుర్మంత్ర ముపదేశించిన ఈ రాజ్య మేమి కావలె ? అన్నమంత్రి దుర్మంత్ర ముపదేశించునా ?

"ఏవీ యాతనికి సంబంధించిన పత్రములు.?"

ఇట్లనుకొనుచు శయ్యపైనుండి లేచి తన సమీపముననే యా పత్రసంచయ మున్న దస్త్రము విప్పి చూచెను. ఆ పత్రము లామె మున్నెన్నియో మారులు పరీక్షించియుండెను. ఏమైనను వానిలో లోపము కనిపెట్టి అన్నమంత్రి నిర్దోషి యని నిర్ధారణ చేయనిశ్చయించి ఎంతయో ప్రయత్నించియుండెను. కాని ఏమియు లాభము లేకపోయినది ! ఈనాడు మరల నవి పరీక్షించెను. మరల లాభము లేక పోయెను. అన్నమంత్రి ద్రోహి కాడన సాధ్యము కాదు!

"ఎంతమాట ! అన్నమంత్రి ద్రోహియా ? కాదు ! కాదు!"

ఇట్లని రుయ్యమ్మహృదయము చెప్పుచున్నది. తన యమ్మ రుద్రమ్మకుగూడ నదియే నిశ్చయము!

"అన్నమంత్రిని విడిపించి యీవిషయమున నాతనితో మంత్రాలోచనము చేయుదునా ?"

అంతలో రుయ్యమ్మకు సందేహము కలిగెను. తన పిన్న యభిమానముచే రాజద్రోహిని విడిపించి యాతని యుపదేశప్రకారము రాజ్యతంత్రము నిర్వహింప జూచుటా ?

"ఛీ ! ఎంత ప్రమాదము !"

దూరమున మ్రోయుచున్న తప్పెట్లు రుయ్యమ్మహృదయమున జుక జుం జుం జుక జుం జుం జుక జుం జు మ్మని ప్రతిధ్వనింపసాగెను.

కరణపాఠశాలలో నారువేలమంది బ్రాహ్మణులును సంపూర్ణముగా కరణవిద్య నభ్యసించిరి. వారి యధ్యాపకులు వారి నెన్నో విధముల పరీక్షించి తృప్తిపడిరి. కాని యొక మహాసభలో వారు పరీక్ష యిచ్చి పట్టాలు పొందనిచో విద్యలో నుత్తీర్ణులైనట్లు నిశ్చయమేమి? అందుచే నధ్యాపకులు శ్రీరుద్రదేవమహారాజుల సమక్షమున పరిషత్తు సమకూర్ప నిశ్చయించిరి. కాని మహారాజులు గోదావరీతీరమునకు వెళ్లియుండిరి. వారు తిరిగి వచ్చునప్పటికెంతకాలముపట్టునో! తుదకు విద్యార్థులును అధ్యాపకులును సంప్రదించి తిక్కనసోమయాజులను పరీక్షాధికారులనుగా నుంచుకొని కరణవిద్యాపరిషత్తు సమావేశపరుప నిశ్చయించిరి. అందుకు తిథివారములు లగ్నమును నిశ్చితములయినవి. తిక్కనసోమయాజులును ఆ సభానిర్వహణమున కంగీకరించిరి.

తెల్లవారినచో నా సభ జరుగవలసియుండెను. అందుకు రాజభవనమునకు ముందున్న విశాలస్థలములో మహాసభామండప మొకటి నిర్మింపబడెను. అది చక్కగా కదళీస్తంభములతో పచ్చని యాకులతో తోరణములతో నలంకరింపబడి యుండెను. అన్ని ప్రయత్నములును ఎంత ముందునుండి చేయుచున్నను చివరిక్షణము వఱకు నేవో యొకటి కొదువగానే యున్నట్లుండును. ఇందును అట్టే యున్నవి. విద్యార్థులును అధ్యాపకులును అర్ధరాత్రము దాటువఱకును ఆ తాటియాకుల మహామండపము నలంకరించుచు నక్కడనే యుండిరి. తుదకు పలువురు తమ తమ నివాసములకు పోక యచ్చటనే కునికిరి.

కరణశాలలు ప్రారంభించిన క్రొత్తరోజులలో వానికి ఎన్నో విఘ్నములు చేయ జైనకరణములు ప్రయత్నించియుండిరి. అవి యన్నియు రాజభటుల తీవ్రరక్షణచే నరికట్టబడెను. అంతకంతకు రాజభటుల రక్షణమే అవసరము లేకపోయెను. ఆ పాఠశాలలకు గాని అందలి విద్యార్థులకు గాని ఇప్పుడెట్టి యలజడియు కలుగుటలేదు.

తెల్లవారవచ్చుచున్నది. ఆ మండపమునకు పశ్చిమ భాగమున సూర్యోదయమైనట్లు కాంతి కనబడినది. కన్నులు నులుముకొనుచు నొక విద్యార్థి లేచి సూర్యోదయమైనదని యందరను లెమ్మని లేపెను. పశ్చిమదిశను సూర్యోదయమేమని యాతని బదరుచు వారు లేచి చూచిరి. చూడగా నిజముగా పశ్చిమ దిక్కుగా నరుణోదయప్రభలు కనిపించెను. అది చూచి నిద్దురకళ్ళతో వారు నివ్వెరపోవుచుండిరి.

అంతలో నుత్తరదిక్కున గూడ నరుణకాంతులు పర్వెను. వారు ఆశ్చర్యపడునంతలోననె దక్షిణమునను తూర్పుననుగూడ నరుణకాంతులు ప్రసరించెను. చూచుచుండగానే ఆ యరుణకాంతులు ఆ మండపమును ప్రింగివేయుచుండెను.

ఆ మండపమును మహాగ్నియే దగ్ధము చేయుచున్నది. అందులో నిద్రించుచున్న విద్యార్థులును అధ్యాపకులును మాత్రము ప్రాణములతో బయటపడిరి. తెల్లవారు నప్పటికి ఆ మహామండపములో నొక్క పూరిపుల్లయు మిగులలేదు.

రాజభటులు వచ్చిరి. వారేమి చేయగలరు? జనములు గుంపులుగ కూడిరి. వారీ చోద్యమును చూచుచు విస్తుపోవుచుండిరి. ఎవరు దీనికి కారకులు? వైదికకరణములు! — కాదు. ఈ వైదికకరణములే జైనులపై తప్పువేసి వారిని శిక్షింపజేసి యా యుద్యోగములు తాము సంపాదించుటకు వేసిన యెత్తుగడ యిది! ఐనచో విద్యార్థులు అధ్యాపకులు ఇక్కడనే తెల్లవారులు నుండిరి గదా! వారికి తెలియకుండ నింత ప్రమాద మెట్లు సంభవింపగలదు? — కాదు కాదు! ఇది జైనుల ప్రయోగము! జైనసిద్ధుడు శ్రావణబెళ్గోళనుండి తిరిగివచ్చుచు తన తీక్ష్ణదృష్టి యిట్లు పరపెనట! ఆతని కోపాగ్నికి దగ్ధమైనది ఈ మండపము! యథావాక్కుల అన్నమయ్యచూపుతో నా యువకుని కన్నులు పోలేదా? ఎవరికి తోచినట్లు వా రనుచుండిరి.

అన్నమంత్రియింటికి వెళ్లి పెద్దలందరును తిక్కనసోమయాజులతో కర్తవ్య మాలోచించిరి. అనుకొన్న లగ్నమునకు ఆ ప్రదేశముననే ఆ మహాసభ చేయవలసిన దని తిక్కనసోమయాజులు నిర్ణయించిరి! తాను మాట తప్పుటకు వీలులేదనియు అనృతదోషము వచ్చుననియు వారు పైపెచ్చు సెలవిచ్చిరి.

ఆ నాటి మధ్యాహ్నవేళ నా సభ ప్రారంభ మయ్యెను. దుష్టులు పెట్టిన చిచ్చుకు కాలి భస్మమై కొంత యారియు కొంత యారకున్న యా మహామండపమునందే అవకున్న వేళ కా సభ ఉపక్రమింపబడెను.

యజ్ఞాంతమందు యజ్ఞశాల యగ్నిహోత్రుని కర్పించుట విధి కాదా? ఈ బ్రాహ్మణులు ప్రారంభించిన కరణవిద్యాయజ్ఞము సంపూర్తియైనది. మరి యిక నీ మహామంటపము నాది కదా యని యగ్నిహోత్రుడే తన యధికారము నిట్లు ప్రదర్శించి యాహుతి కొనెనా యన్నట్లున్న దా మహాశాల!

తిక్కనసోమయాజులకు దగ్ధమైన యా మహామండపము చూచినంతనే ఏమని తోచెనో! ఆ మహానుభావుడు రత్నశలాకవంటి తన దేహయష్టిని వంచి యా భస్మము చేతులతో గ్రహించి విభూతిధారణ చేయువిధముననే అభిమంత్రించి దేహమున ధరించెను. అది చూచి వెంటనే ప్రక్కనున్న గురునాథుడును మారనయు అట్లే యొనర్చిరి. వారిని చూచి సభయంతయు మహోత్సాహముతో నట్లొనర్చెను. త్ర్యంబకమంత్రము ఉద్ఘోషింపబడెను!

రుద్రుని కంటిమంట కగ్గమైన కాముడు శ్రీమాతృసంబోధనచే సంజీవితుడై యీ రూపముతోడనే భాసించెనా యనునట్లు ఆ మహాసభ విలసిల్లెను.

ఆ పరీక్షాసభ ఎక్కువసేపు పట్టలేదు. మూడుజాముల వేళకు అంతయు పూర్తి యయ్యెను. ఎవరిని ఏ ప్రశ్న యడిగినను వారు వేదపన్నములు అప్పగించినట్లే వెంటనే ఉత్తరము లీయసాగిరి. మరి వారికి విజయపట్టికలు ఈయవలదా? పత్రము లన్నియు నప్పటికే వ్రాసి సిద్ధముగా నున్నవి. తిక్కనసోమయాజులు చేవ్రాలు చేయుటయే మిగులు!

కాని తిక్కనసోమయాజులు చేవ్రాలు చేయ నిరాకరించెను. సోమయాజులకు తృప్తి కాలేదు!

"వీరందరును ఖడ్గము శూలము ధనుస్సు—ఇందులో ఒక్క రణసాధనము ప్రయోగించుటలో నైన ప్రవీణులు కావలెను!"

సోమయాజుల యాజ్ఞ యది! పిలిచిన పెద్దల నిర్ణయమును ధిక్కరించుటకు అలవాటుపడలే దానాటి జనములు! ఆ బ్రాహ్మణు లందరును సోమయాజుల యాజ్ఞకు తలయొగ్గిరి. ఒక్క మాసముదినములు వ్యవధి కోరిరి. గురునాథుడును నెల్లూరినుండి వచ్చిన కరణములు నే యా విద్య నేర్పుటకుగూడ పూనుకొనిరి!

ఒక్కసారిగా వారి విద్యాశాలలు గరిడి నేర్పు శాలలుగా మారిపోయెను!

మహాశివరాత్రి దగ్గరకు వచ్చినది!

ఒకనాటి యర్ధరాత్రసమయమున దూరమునుండి ఎవరో బిగ్గరగా నిట్టూర్పు చున్నట్లు చిత్రమైన ధ్వని ఓరుగల్లుపౌరులకు వినబడెను. ఓరుగల్లుపౌరులకే కాదు! ఓరుగంటికి చుట్టును చాలదూరమున నున్న పల్లెలకు పట్టణములను ఆ ధ్వని విన నయ్యెను! ఏమిటీ ధ్వని! మనుష్యులందరు నిద్దురపోవుచున్నవారు ప్రక్కలపై నున్నవారు ప్రక్కలపైలేచి కూర్చుండి భయవిహ్వలులై యాశబ్ద మాలకింపసాగిరి. మనుష్యులే కాదు. పశువులుగూడ చెవులు రిక్కించి మోరలెత్తి భయభ్రాంతములై దాని నాలకించుచుండెను. పక్షులు తమ కులాయములనుండి అరచుచు బయటికి వచ్చి వృక్షములపై నల్లాడసాగెను. కీటకములుగూడ తమ కలుగులనుండియు చాటు మాటు నివాసస్థానములనుండియు బయటికి వచ్చి ప్రాకులాడుచుండ, నేల యీని నదా యనిపించుచుండెను.

ఆ శబ్ద మేమి? పిశాచములు దండు వచ్చుచున్నవా? ఆకాశము విరిగి మీద పడనున్నదా? సముద్రము చెలియలికట్టను త్రెంపుకొని భూమండలమును కబళింప బోరకొనినదా? ఆదిశేషుని ఫూత్కారమా?

అల్పకాలమునసే దాని స్వరూపము స్థిరపడినది. వాయుదేవుడు స్వేచ్ఛా విహారము ప్రారంభించినాడు! అతడు జగత్ప్రాణుడే, కాని కోపించినయెడల లోక మునంతటిని మ్రింగివేయు మారుతుడుగూడ నతడే! సర్వమును పునీత మొనర్చు నా పవమానుడే మధ్యమధ్య ప్రభంజనుడును! సర్వమును గ్రహింపగల శక్తి తన కున్నదని యాతని గర్వము!

అట్టి మరుత్వాను డిప్పుడు ప్రకోపించినాడు! ముందు నిట్టూర్పులుగా విన బడిన శబ్దము హోరుగా మారిపోయినది. కాని గాలి యెటునుండి వీచుచున్నదియో మాత్రము స్పష్టముకాలేదు. ఒక కొంతవడి తూర్పునుండియు, కొంతవట్టు పశ్చిమము నుండియు, మరికొన్నియెడల దక్షిణమునుండియు, ఇంకొకతరి ఉత్తరమునుండియు వచ్చుచున్నట్లున్నది. అది యొక భయంకరమగు సుడిగాలి! గాలిగుండము!

ఆ ప్రభంజనముతోపాటు నలువైపులనుండి కాలమేఘములు క్రమ్ముకొని వచ్చినవి. ఆ మేఘములను గాలితాకు పింజెలు పింజెలుగా ఏకివేయుచున్నది. ఏమైనను తెల్లవారుజామున వర్షము ప్రారంభించినది. అదియును కుండపోత!

ఆ గాలికిని ఆ వర్షమునకును ఓరుగంటి పరిసరములన్నియు గడగడలాడిపోయెను. తలదాచుకొన నిరవులు కలవారే నిలువలేకపోయిరి. ఇక నట్టి యాచ్ఛాదనలు లేని వారు తాళలేక నేపోయిరి. దేవకార్యములును రాజకార్యములును మనుష్యకార్య ములును సర్వము కట్టువడిపోయినవి. నిముష మొక యామముగా, యామ మొక దినముగా, దిన మొక సంవత్సరముగా గడచిపోవుచున్నది.

ఈ మాఘమాసములో నీ యకాలవర్షము!

అట్లు మూడు రాత్రులు మూడు పవళ్ళు, గాలియు వానయు ఓరుగల్లుపరిసరములను దడదడ లాడించెను. వృద్ధు లింతటి గాలి వాన తమ జన్మలలో చూడలే దనిరి. పెద్దపెద్ద భవనములే కొన్ని కూలెను. పూరియిళ్లెగిరిపోయెను. పడిపోయిన చెట్లకు లెక్కలేదు. దేశమంతయు జలమయముగా కనిపించెను. పశుపక్ష్యాదు లల్లాడిపోయెను.

రేపు మహాశివరాత్రి యనగా తెరపి యిచ్చెను! సూర్యభగవానుడు దర్శన మిచ్చెను. ప్రజలు ఒకరిమొగము లొకరు చూచుకొన బయలువెడలిరి. ప్రమాదములు కలిగిన జనులను గుర్తించి యుపచారాదులు చేయుట, పారిపోయిన పశువులను వెదకి తెచ్చుకొనుట, పడిపోయిన గోడలను ఇళ్లను సరిచేసుకొనుట జనములు ప్రారంభించిరి. తన దొడ్డిలో చెట్టుపై కాకులు గూళ్లు పెట్టి చికాకుపరచుచుండగా, ఆ యింటి గృహస్థు కోపించి యా గూళ్లను తీసిపారవేయగా, ఆ కాకులు అరచుచు తీసివేసిన పుల్లలను మరల ఒక్కొక్కటే ఏరి ముక్కులతో కరచి తెచ్చి చెట్టుపై పెట్టువిధమునే వారి చర్య లనుకరించెను. చిమ్మివేసిన చీమలపుట్టనుండి వెడలి బారులు తీరి వేలకువేలుగా కూడి మరల తమ పనికి ఉపక్రమించు చీమల సంరంభమునే ఆ ఓరుగంటి ప్రజల ఆత్రము స్మృతికి తెచ్చెను.

* * * *

ముందు వచ్చిన వార్తల ననుసరించి శ్రీ రుద్రదేవమహారాజులు మహాశివరాత్రినా డుదయమున పురప్రవేశము చేయవలసియుండెను. కాని యీ గాలివాన యన్ని ప్రయత్నములను తలక్రిందులు చేసివేసినది. మహారాజు లెంతవరకు వచ్చినదియు గూడ వార్త రాలేదు.

వార్తాహరులు మాత్రము మనుష్యమాత్రులే కదా! వారు రాలే దని కోపించిన లాభము లేదు. రుద్రమ వెంటనే మహారాజుల క్షేమవార్తకై వేగరుల బంపి ఏకశిలానగరమున పరిస్థితులు చక్కజేయు ప్రయత్నమున నిమగ్నమయ్యెను.

ముఖ్యముగా శిలాప్రాకారనిర్మాణమున నియుక్తులైన శిల్పులును పనివారును ఈ మహాక్లేశ యమయాతనయే యనుభవించిరి. గోనగన్నారెడ్డి మహాసైన్యముతో వెళ్లి, కర్ణాటసేనల నెదుర్కొనబోయినదాది శిలాప్రాకారనిర్మాణకార్యక్రమమంతయు మేచయనాయకుని యల్లుడగు నాగదేవనాయకునిపై బడినది. అతడు వెంటనే పనివారిని కూర్చుకొని, పని కడ్డముగా కందకములలో నిలిచిన నీరు వెడల గొట్టించుచు, వారికి కావలసిన సమస్తసదుపాయములు కల్పింపసాగెను.

మేచయనాయకుడు స్వయముగా నగరమునం దెల్లెడ సంచారము చేయుచు పౌరులకు తన భటు లెల్లవిధముల సహాయముగా నుండునట్లు శాసించుచుండెను.

జైనవసతిలో మహాశివరాత్రికి నేమినాథప్రతిష్ఠ జరుగవలసియుండెనుగదా! గాలివానకు ముందే దాని ప్రయత్నము లన్నియు బూర్తి యైనవి. కాని యచ్చటికి ఉత్సవము చూడవచ్చు నశేషజనమునకు ఆచ్ఛాదనకును నివాసమునకును నిర్మించిన పందిళ్లు పాకలు ఎగిరిపోయినవి. సమర్థులగు శిల్పులు వెంటనే వాని నన్నిటిని సరి

చేయుటకు ప్రారంభించిరి. అప్పటికే ప్రతిష్ఠకు పూర్వాంగములగు మాంత్రికతాంత్రికములు నిర్విఘ్నముగా సాగిపోవుచున్నవి.

రాజకోశమునుండి వసదిపెద్దలు కోరినప్రకారము లక్ష సువర్ణములును ముందుగనే వారికి పంపబడియుండెను. ధనవంతులగు జినభక్తు లెందరో విడివిగా నా ప్రతిష్ఠకు ద్రవ్యసహాయ మొనర్చిరి. నగరములో పెద్దల కందరకు వసదినుండి యాహ్వానములు వచ్చినవి. రాజమందిరమునకు ప్రత్యేకముగా నాహ్వానము విశేషగౌరవముతో పోయి యుండెను. శ్రీ రుద్రదేవమహారాజులు స్వయముగా ప్రతాపరుద్రకుమారులతో గూడ వచ్చి యీ మహోత్సవము దర్శించిపోవలె నని వారు మరిమరి యర్థించిరి. కాని శ్రీ రుద్రదేవమహారాజులు గాలివానచే దారిలో నిలువవలసివచ్చిన దని యీ పెద్దలు విని నిరుత్సాహపడిపోయిరి. "లక్ష సువర్ణము లిప్పించి యనుగ్రహించిన మహారాజులు వచ్చు భాగ్యము మాకు ప్రాప్తము కాలేదు. మహాదేవరాజులు శ్రీ ప్రతాపరుద్రకుమారులతో నక్కడికి దయచేసిన కొంత కృతార్థుల మగుదుము." ఇట్లు వసదిపెద్దలు అర్థించిరి. దానితో మహాదేవరాజు మిక్కిలి ప్రీతుడై యంగీకరించెను. ప్రతాపరుద్రకుమారుడును పోయి చూడ నుబలాటపడసాగెను.

మహాశివరాత్రి వచ్చినది. స్వయంభూదేవాలయమున వైదిక శైవవైభవముతో అభిషేకార్చనలు సాగిపోవుచుండెను. కరణపాలకాలలో శస్త్రవిద్య నిష్ణాడభ్యసించుచున్న బ్రాహ్మణాలందరును తమ తమ క్రొత్త శస్త్రములతో నాలయప్రాంగణమున కరుదెంచిరి వారు శతరుద్రీయమును మహాప్రసంఖ్యగా జపింప సంకల్పించి మహాదేవుని పురుషసూక్తముతో ముందు ధ్యానించిరి. మహాదేవుడు విశ్వరూపుడై వారి హృదయములలో నావహించెను. వా రంతట నామూర్తిని శతరుద్రీయముతో మరల మరల స్తోత్రముచేయ నారంభించిరి. ఉదయముననే వా రందు కుపక్రమించిరి. శతరుద్రీయము నూట యిరువదియొక్కమారులు జపించుట వారి కెప్పటికి పూర్తియగును ? అందులో మధ్య వచ్చు మాధ్యాహ్నికములు సాయాహ్నికములు గూడ నిర్వర్తించుకొనవలెను. లింగోద్భవకాలమునకు గాని వారి సంకల్పించిన జపము పూర్ణత నొందదు ! విశ్వమూర్తిని ధ్యానించువారికి సర్వసంకల్పసిద్ధి సాధ్యమగుచో శస్త్రసాధనసిద్ధి యొక టని ప్రత్యేకము చెప్ప నేల ?

మరియు శివభక్తులు అనేకవిధములు నీశ్వరు నారాధించుచుండిరి.

జైనవసదిలో తెల్లవారుజామునుండియు ఒకేతీరున ఘంటానాదములు మ్రోయుచున్నవి. పెద్దపెద్ద యుష్ణీషములు ధరించి జినభక్తులు వేలకువేలుగా వసదికి వచ్చుచుండిరి. రాత్రి ఎనిమిదిగడియలకు గాని గర్భగుడిలో ప్రతిష్ఠాకలాపము పూర్తి కాదు. అంతవరకు మధ్యమధ్య ప్రతిష్ఠాంగముగా తీసికొనిపోబడు ద్రవ్యములే ఆ మహాజనము దర్శించి జయజయనాదములు చేయుచుండిరి. గర్భగుడికి ముందు చిన్న ముఖమండపము కలదు. అందులో జైనసాధువులు పలువు రుపవిష్టులైరి. దానికి బయట మహామండప మొకటి తాత్కాలికముగా నిర్మింపబడినది. ఉత్సవము దర్శిం

చుటకు వచ్చిన పెద్దల కందరికి నిచ్చుట ఆసనాద్యుపచారములు జరుగుచుండెను. ప్రతిష్ఠ పూర్తియై ముందు వసదికి ప్రధానాచార్యు డగు సిద్ధనంద్యాచార్యులు ప్రథమ పూజ నిర్వర్తింతురు. ఆపిమ్మట పెద్దలందరు నొకరొక్కరే ముఖమంటపములోనికి వచ్చి నూతనప్రతిష్ఠిత నేమినాథవిగ్రహమును దర్శించి ప్రసాదము పుచ్చుకొని వెళ్ల వచ్చును.

ఉద్యోగులలో నచ్చుటికి రేచర్ల రామిరెడ్డి నామిరెడ్డి మల్లయరెడ్డి గణపిరెడ్డి మల్రెడ్డి మధ్యాహ్నమునకే వచ్చిరి. చీకటిపడువేళకు నాగదేవనాయుడు వచ్చి దర్శనమున కాలస్య మున్న దని తెలిసి మరల వచ్చెద నని వెడలిపోయెను.

మహాదేవరాజు సాయంత్రము మూడు జాములకే ప్రయాణమై ప్రతాపరుద్ర కుమారులను తెండని అంతఃపురములోనికి వార్త పంపెను. అంతఃపురమునుండి ఇదిగో అదిగో అని కొంతవడి వార్తలు వచ్చెను. మహాదేవరాజు బయట తొందరపడుచుండెను. ప్రతాపరుద్రకుమారుడు కదలుటకు ఊబలాటపడుచుండెను. అతని తల్లి ముమ్మడమ్మ యాతని ప్రయాణము చేయించుచుండెను. అంతలో కామసాని కుబ్జతో నామెయొద్దకు వచ్చి, శ్రీ రుద్రదేవమహారాజులు మరల తాము తిరిగివచ్చువరకు శ్రీ ప్రతాపరుద్ర కుమారుని నెట్టి సందర్భములందును అంతఃపురము వెడలిపోవనీయవద్దని యాజ్ఞాపించినది జ్ఞప్తికి తెచ్చి నిషేధించెను. కామసాని అంతఃపురరక్షకులకు అధికారిణి! అందులో నామె మహారాజుల స్పష్టమైన ఆజ్ఞను గుర్తుకు తెచ్చినది. అది ధిక్కరించి కుమారుని పంపుట సమంజసము కాదు. గట్టిగా కామసాని పట్టుపట్టినచో రాజపుత్రిక యగు తానుకూడ ఎదురాడలేదు. కామసాని పట్టుదలమనిషి. అంత ముదుసలి యైనను దాని తీవ్రత యేమియు తగ్గలేదు. మరి ప్రతాపరుద్రకుమారుని ఊబలాటమును మహాదేవరాజుల కోరికను తాను ధిక్కరించు టెట్లు? పాపము ముమ్మడమ్మ కామసానివంక చూచెను. దాని ముఖము నిశ్చలముగా తీక్ష్ణముగా నుండెను. లాభము లేదని నిశ్చయించి ప్రతాపరుద్రకుమారులు రాలేరని వినయవిధేయతలతో మహాదేవరాజులకు వార్త పంపెను. అది విని క్రోధోగ్రుడై మహాదేవరాజు కదలి యొంటరిగా చీకటిపడినతర్వాత వసదికి చేరుకొనెను. అక్కడి పెద్ద లాతని మిక్కిలి గౌరవించి ప్రతాపరుద్ర కుమారులు రాలే దేమని మరిమరి ప్రశ్నించిరి. ఏమని చెప్పగలడు? మనస్సులో క్రోధము మండిపోవుచున్నది. అంతఃపురజనము నిషేధించుటచే తాను తన కుమారుని వెంట తీసికొనిరాలేకపోతి నని చెప్పునా? మాట మింగుకొని యట్లే [illegible] సభలో కూర్చుండెను. గొప్పవారి యింటి యాడుబడుచును వివాహమాడిన [illegible] యవస్థలో నాత డుండెను.

మరియు నా సభకు ప్రోలరాజు ప్రసాదాదిత్యనాయుడు రుద్రమనాయుడు [illegible] ఉన్నతోద్యోగులు వచ్చిరి. నేమినాథదర్శన మగువేళకు నాగదేవనాయుడును [illegible] కూడ వచ్చిరి.

పెద్దలను దర్శనమునకు ముఖమండపములోనికి రావచ్చునని సూచించుచు మనోజ్ఞమగు ఘంటారావ మొండు మ్రోసెను. అది యొక యపూర్వమగు ఘంట! ముఖమండపమునకును సభామండపమునకును మధ్య నున్న రెండు ద్వారములలో నొక ప్రక్క సన్న ద్వారము తెరువబడెను.

మిక్కిలి ప్రొద్దుపోయినది. అందువలన త్వరలో దేవదర్శనము కావించుకొని వెళ్లిపోవలె నని తొందరపడుచుండిరి. లోపలికి వెళ్ళు ద్వారము చిన్నది.

రాజబంధువులలో అగ్రగణ్యు డగు మహాదేవరాజు ముందు బయలుదేరి ముఖమండపములోనికి వెళ్లెను. అక్కడ జైనసాధువులు క్రిక్కిరిసియుండిరి. వారంతయు నాదరముతో నాతనికి గర్భాలయములో దిగ్వాసస్సుడగు నేమినాథదేవుని దర్శనము చేయించి శుచ్యము లగు ప్రసాదము లిచ్చిరి. అతడు వచ్చినదారినే తిరిగి వెళ్లుటకు వెనుకకు చూడగా, మరియొక రటు లోనికి వచ్చుచుండిరి. ఆ వచ్చువారిని తాను త్రోసికొనిపోవునా! అందుచేత మిక్కిలి గౌరవముగా నక్కడివారు మహాదేవరాజును ముఖమండపమునకు దక్షిణముగా నున్న మరియొక ద్వారమున తీసికొనిపోయిరి.

మహాదేవరాజువెనుక ప్రసాదాదిత్యనాయడును రుద్రమనాయుడును ప్రోలరాజును నాగదేవనాయడును మేచనాయడును లోనికి వెళ్లిరి. వారి కందరకు దేవదర్శనము చేయించి ప్రసాదము లిచ్చి యట్లే ఒకరొకరిని ప్రక్కద్వారమున బంపిరి. గర్భాలయములో సిద్ధనంద్యాచార్యులు లేకుండుట మేచయ కాశ్చర్యమై వా రక్కడ లేరేమని యడిగెను. వా రావల నున్నా రని దక్షిణద్వారము చూపి యచ్చటి కాతని బంపిరి. మేచయ కేదో సంశయము కలిగెను. కాని సంశయించుచునే అతడు దక్షిణద్వారమున ప్రవేశించెను.

ఆపిమ్మట పిల్లలమర్రిరెడ్లు—రేచర్ల కామిరెడ్డి నామిరెడ్డి మల్లయరెడ్డి గణపిరెడ్డి మర్రెడ్డి—మధ్యాహ్నమునుండి వచ్చి వేచియున్నవారు, దేవదర్శనమునకు వెళ్లిరి. వారినందరను ప్రసాద మిచ్చి మరియొకద్వారమున నావలకు పంపిరి.

ఇట్లే ప్రొద్దుపోవువరకు నగరములోని పెద్దలు దేవదర్శనమునకు ముఖమండపములోనికి వెళ్లుచునేయుండిరి. అక్కడనుండి వారిని కొందరిని దక్షిణద్వారమున మరికొందరిని ఉత్తరద్వారమున నావలకు పంపివేయుచుండిరి.

ప్రొద్దుపోవుచున్నకొలది దేవదర్శనమునకు సామాన్యప్రజల సందడి యెక్కువయ్యెను. ముఖమండపమునకును సభామండపమునకును మధ్య నున్న ద్వారము లా యొత్తిడికి సడలి మహాజనమునకు దారితీసెను. మహాకోలాహలముగా నక్కడ దేవదర్శన మగుచుండెను. వాకిట నిలచియున్న పరిజనములకు తమతమ ప్రభువు లెక్కడ నున్నదియు తెలియక వాహనములతో తహతహ లాడుచుండిరి!

"సంగాసంగజయాజయంబు పరిహాసప్రస్ఫుటాశ్లీల భా
షాంగం బాకలితాంతరావలయ కక్ష్యాభాగముద్రాలస
ద్భంగీనిష్ఠిత కాష్ఠశంకుకము పాపద్యూత మీ సన్నిదం
బంగీకారము సేయువారి మొలలం బ్రాపించు గోపీనముల్."

వినుకొండ వల్లభరాయడు.

యాయావకవి యగు గోవిందశర్మయు కరణపాఠశాలలో చేరి విద్య నభ్యసించి యుండెను. శస్త్రపరిశ్రమ యాతనికి పూర్వపరిచితమే యైనందున ఈ నెలరోజులును ఆటవిడుపుగానే ఉన్నది. అతని తోడి బ్రాహ్మణులలో నెక్కువ మంది మహాశివరాత్రినాడు శస్త్రసాధనసిద్ధికై స్వయంభూదేవాలయమున శతరుద్రీయము జపించుచుండిరి. అతనిది తిరుగనేర్చిన కాలం బైనందున, నిలుకడగా నచ్చోట నిలువలేకపోయెను. మహాశివరాత్రియుత్సవము చూచుచు ఓరుగంటి వీథుల వాడల సంచారము చేయ నాతడు బయలుదేరి పోయెను.

దారిలో నాతడు కర్ణాటభామలతో సరస మాడుచు, పామరభామలు గోమయ పిండములు ఇంటిముంగిట చేయుట చూచుచు, సంపెంగనూనె యమ్ము కరణ కాంతల కోకిలస్వరము లాలకించుచు, ములికినాటి తెలికి చిలుకలకొలికుల జిలుగు జూపుల కలుకుచు, మోహరివాడలో కుట్రపుపనివారిం గాంచుచు, నొక్కట పల్నాటి వీరుల కథ లాలకించెను.

*"ద్రుతతాళంబున వీరగుంభితకథం ధుంధుం కిటాత్కారసం
గతి వాయింపుచు నాంతరాళికయతి గ్రామాభిరామంబుగా
యతిగూడం ద్విపదప్రబంధమున వీరానీకముం బాడె నొ
క్కత ప్రత్యుత్తరముం గుమారకులు ఛీట్కారంబునం దూలగన్."

అత డంత కాకతమ్మకు సైదోడగు ఏకవీరను దర్శించి ఆ దేవతయెదుట పరశు రాముని కథ లన్నియు పాడెడి బవనీల చక్రవర్తిని గాంచెను. దారిలో కాపుటాండ్రను జక్కుల పురంధ్రిని జూచుచు, సంతానకాంక్షి యగు నొక యజమాని అక్క లకు పెట్టుకొనుట తిలకించెను. భైరవుని గుడి, చముడేశ్వరీశక్తి నగరు, వీరభద్రాలయము, బుద్ధుని గుడి, ముసానమ్మ గుడి, కుమారస్వామి యాలయము, పాండవుల గుడి, చూచుకొనుచు బోయి యాతడు మధ్యాహ్నమునకు బ్రాహ్మణులవాడకు చేరికొని, యట పూటకూటింట నొక్క రూక యిచ్చి కర్పూరభోగివంటకము కమ్మని గోధుమ పిండివంటయు గుమ్మెడు పంచదారయును క్రొత్తగా గాచిన యాలనేయితో పెసర

* వల్లభరాయడు.

పప్పును కొమ్ము నల్లనటిపండ్లు ఐదు నంజులతో గడ్డపెరుగుతో కూడ భుజించి గర్రున త్రేపుచు మరల నగరసంచారమునకు బయలుదేరెను.

అభ్యాసవశమున నాతని కాళ్లంతట వేశ్యలవాడవైపుకు సాగిపోయినవి. దారిలో కోళ్ళపందెములు పొట్టేళ్లపోరు చూచునంతలో చీకటిపడెను. వేశ్యలవాడ సమీపమున పలువురు జూదమాడుట యాతడుపలక్షించెను. మాచల్దేవిముఖసందర్శనము చేయవలెనను నుత్కంఠనుగూడ మించి యాతని నా యక్షముల చప్పుడు నిలువవేసెను.

ఆ జూదమాడువారు గోవిందశర్మకు పూర్వపరిచితులు కారు. వారి యాకారములును మాటలునుగూడ అటువైపువారివిగా కనుపట్టలేదు. కాని జూదములో క్రొత్తపాత్రలతో నిమిత్తము లేదుగదా! ప్రొద్దుపోవువరకు వారితోపాటు గోవిందశర్మయు జూదమాడెను. కాని మధ్యమధ్య వారు పన్నిదములు వేయుటలో నర్మగర్భముగా "ఇదిగో మేచయతలతో పందెము!" "ఇదుగో మహాదేవరాజు!" "ఇదుగో ప్రతాపరుద్రుడు!" "రుద్రదేవమహారాజులే ఈ పందెమునకు సాక్షి!" — ఇట్టి మాట లాతడాలకించి కలవరపడసాగెను. జూదరుల సంభాషణలో తప్పనిసరిగా వచ్చు, అశ్లీలములు మేలములు అర్థము లేని మాటలు పౌరుషవచనములు సంకేతవాక్యములు ఆతనికి పూర్వపరిచితములే! కాని యీనాడట్లు వారు మాట్లాడుచుండుట యాతని కేదో ఒక భయము కలిగించుచుండెను.

అంతలో దూరమున జైనవసతినుండి యొక ఘంటానాదము భయంకరముగా వినవచ్చెను. ఆ ఉత్తరక్షణముననే ఆ మందిరాంతర్భాగమునుండి యొక జైనసాధువు వచ్చి చేయి యెత్తెను. అందరు నొక్కసారిగా మంత్రముగ్ధులవలె యాట చాలించి లేచి నిలువబడిరి. ఆ సాధువు గోవిందశర్మపై క్రూరమైన దృష్టి ప్రసరింపజేసి "ఇత డెవరు?" అని యచ్చటివారల ప్రశ్నించెను.

ఆ మాటలు వినినంతనే ఆ కంఠస్వరము పూర్వపరిచితమైనదని యాతడుపలక్షించెను. అది మాచల్దేవిభవనమున పర్వతనాయకునితో జూదమాడి పోరిన యజ్ఞాతయోగిది! అత డాతని కంఠము గుర్తించినదే తడవుగా ప్రక్కనున్నవా రాతని బట్టుకొనబోవుచుండిరని యాతనికి దోచినది. వెంటనే శర్మ వీథిలోనికి పరుగెత్తెను. నలువు రాతని వెంబడించిరి. చీకటిలో గోవిందశర్మ పారిపోవుచుండెను. వెంటబడువారిలో నొక్కడే యాతని నుపలక్షించి పట్టుకొన మీద బడెను. గోవిందశర్మ పూర్వాభ్యస్తమగు మల్లయుద్ధనైపుణ్యముచే నాతని మూడు పిడిగ్రుద్దులతో క్రిందపడవేసి తప్పించుకొని పోయి వేశ్యవాటిక జొచ్చి మాచల్దేవియింటిలోనికి పరుగువారెను.

మాచల్దేవి యాతని తత్తర ముపలక్షించి ఎకసక్కెముగా, "ఏమిటి కథ, యువకవిగారూ?" అని ప్రశ్నించెను.

"కొంప మునిగిపోయినది !"

"మీ రీనాడు చెప్పిన పద్యములో యతిభంగమయినదా ?"

"మన కాభయము లేదు. యతిభంగమైన ఆంధ్రపద్యమును కర్ణాటసంప్రదాయమని తప్పించుకొందును."

"మరి ప్రాసభంగ మైనచో ?"

"అది నీకు తెలియదు, సంస్కృత మందును !"

"మీ దేహమున కేదో, ఈ మహాశివరాత్రిపూట, సంస్కారమైనట్లున్నదే !"

"సంస్కారమే కాదు, దేహశుద్ధియే కావలసినది, తప్పించుకొంటిని !"

"ఎవరి యింట"

"అట్లైనను సరసత ఉండెడిది. జూదరుల యింట ?"

"ఓడి ఎగవేసి వచ్చితిరా ? నేను వారికి మిమ్ము పట్టించి యీయవలసినచ్చును !"

"ఆ భయము లేదు !"

ఈ మాటలతో గోవిందశర్మ తేరుకొని మాచల్దేవికి ఏకాంతమున జరిగిన దంతయు తెలిపెను.

గోవిందశర్మమాటలు వినినంతనే మాచల్దేవికిని భయమయ్యెను. కొంతకాలము నుండి ఆ రోగిసంగతి తలచినప్పు డెల్ల విపరీతమైన భయముతో నది యదరిపోవసాగెను. నగరనాయకులనుగూర్చి యంత చులకనగా ప్రసంగించుటయు, వారి తలలపై నవ్వులకైన పందెము లొడ్డుటయు సామాన్యులు చేయునవి కావు. జైనవసదిలో నేమినాథప్రతిష్ఠకు నగరిపెద్ద లందరును వెళ్లియుండిరి. అక్కడి ఘంటకును ఇక్కడి రోగి జూద మాపుటకును ఏదో సంబంధ ముండి యుండవలెను. ఏదో మహాప్రమాదము జరిగియుండవలెను !

ఇట్లాలోచించుచుండినంతలోననె, జైనవసదికి తమ ప్రభువులవంట నేగిన పరిచారకులు తమ ప్రభువులు కనబడనందున వేశ్యవాటికకు వచ్చి రేమో తెలిసికొనుటకు వారు వచ్చిరి. మేచయనాయకుని పరిచారకులు వచ్చి మాచల్దేవికి నమస్కరించి "మా ప్రభువు లిటు వచ్చిరా ?" యని ప్రశ్నించిరి.

మాచల్దేవి: "లేదు. ఏమి జరిగినది ?"

"మా ప్రభువులు నేమినాథదర్శనమునకు లోపలికి పోయిరి. మరల కనబడలేదు."

"అంతేనా ? మరియొకమార్గమున ఇంటికి వెళ్ళిరేమో !"

"లేదు. మహాదేవరాజులును కనబడలేదని వారి పరిచారకులు వెదకుచున్నారు."

"ఆఁ! ఏమి ?"

"అంతే కాదు! ప్రసాదాదిత్యనాయుడు, రుద్రమనాయుడు, ప్రోలరాజు నాగదేవనాయుడు!_"

"త్వరగా పోయి, మీరు శ్రద్ధగా వారు సామాన్యముగా వెళ్లు ప్రదేశములు వెదకుడు!"

ఇట్లనుచునే మాచల్దేవి తీవ్రముగా నాలోచించెను. శీఘ్రముగా నొక నిశ్చయమునకు వచ్చెను. లోనికి పోయి ఒక్క యరగడియలో పురుషవీరుని వేషము ధరించి ఖడ్గము చేత బట్టి, గోవిందశర్మనుగూడ కవచము శిరస్త్రాణము ధరింపజేసి ఖడ్గము చేతికిచ్చి తనతో రమ్మని దొడ్డివాకిటిగుండ నాతనితోగూడి ప్రయాణమయ్యెను.

మాచల్దేవి యట్లు పోయి పోయియన్న మంత్రిదివాణము చేరి యక్కడ కాపున్న భటునిద్వారా తిక్కనసోమయాజులకు మీకొరకు శరణాగతు లిరువురు వచ్చినారని వార్త పంపెను. ఆ మాటలకు వెంటనే తిక్కనసోమయాజులు లోపలికి రానిమ్మని యనుజ్ఞ యీయగా భటుడు వారిని లోనికి తీసికొనిపోయెను.

మాచల్దేవి గోవిందశర్మవెంట పోయి సోమయాజులకు ఆతనితోపాటు మ్రొక్కెను. వా రిరువురును జరిగిన దంతయు సోమయాజులకు నివేదించిరి. సర్వము నాలకించి సోమయాజులు వారిముఖములు తేరిపారజూచెను. మోసము కనబడలేదు. అంతట నాతడు వారి ని ట్లడిగెను.

"నావలన మీకు కావలసిన కార్య మేమి? ఈ యర్ధరాత్రమున మీ మాటలు నమ్మువా రెవరు?"

"మీయొద్ద శ్రీరుద్రదేవమహారాజుల అభయపత్ర మున్నది. మీ రెప్పు డైనను ఎక్కడి కైనను పోవుటకుగూడ ననుజ్ఞ కలదు. ఈవేళ రాజమందిరము చొచ్చి, యీప్రమాదవార్త రాజప్రతినిధుల కందజేసి, ప్రతీకారము ఆలోచించవలెను!"

సోమయాజులు మరియొక్క క్షణమే యాలోచించెను. ఇది యాలోచించుటకు గాని యాలసించుటకు గాని సమయము కాదు. గురునాథునకును మారనకును దివాణము భటులతో జాగరూకులై కాచుచుండవలె నని చెప్పి యప్పగించి, గోవింద శర్మను మాచల్దేవిని వెంట దీసికొని రాచనగరికి బయలుదేరెను.

నగరికి బయట కాపున్న భటులు ముందు వారి నడ్డగించిరి. ఆపిమ్మట సోమయాజులు చూపిన పత్రములు చూచి, కన్నుల కద్దుకొని, వారికి భయభక్తులతో త్రోవ విడిచిరి. కాని వారివెంట మాచల్దేవిని గోవిందశర్మను పోనీయలేదు.

సోమయాజుల కోరికప్రకారము భటులు దారితీయుచు సగౌరవముగా రుయ్యమ్మవాకిలిముందుకు తీసికొనిపోయి వారి రాక యామె కెరిగించిరి.

౪౭

రుయ్యమ్మ యింకను నిద్దురపోలేదు. ఆ పిల్లపై రుద్రమ్మ గాత్ర పోవుచు పెట్టిపోయిన భారము దుర్భర మైనది. రుద్రమ్మయాహా గేమైనా గావచ్చును. గాని, యది రుయ్యమ్మకు భరింప సాధ్యముకాకున్నది. అందును అలనాటి యర్ధరాత్రమున తప్పెటల జాక జుంజుమ్మను చప్పుడు వినుచు, దేవగిరిప్రభువు దండెత్తి వచ్చినచో కోట రక్షించు టెట్లు, అను భయము కలిగిన నాటనుండి ఆ పిల్లకు నిద్రాహారములే లేవు. అది యాలోచించి ముందు అన్ని పనులను చాలించి రాజమందిరముచుట్టును శిలాప్రాకారము మాత్రము తొందర చేసి పూర్తిచేయునట్లు గావించినది. కాని యంతలో నేమగును? ప్రారంభించిన మహాశిలాప్రాకారము ఎన్నటికి పూర్తి యగును ? ఏ మైనను పుట్టకోటను రక్షించుటకైనను చాలినంతమంది సైనికులు లేరే !

మొదలే నిద్దురపట్టని రుయ్యమకు, రుద్రమయొద్దనుండి గాలివాన వచ్చిన నాడి వార్తలే రాకపోవుటతో, నీనాడు మనస్సు జ్వరబాధతోవలె తపించి పోవుచున్నది. అన్నిటికి తోడుగా నీనాడు తిక్కచమూపతియొద్దనుండియు గోనగన్నారెడ్డియొద్దనుండియు వార్తలు వచ్చినవి. ఇటు చోళసేనలు కాని, అటు కర్ణాట సేనలు కాని, దండెత్తివచ్చుచున్న వార్తలు నిజము కావు. ఆ రెండు దిక్కులను ఎట్టి యలజడియు లేదు. ఆ రెండు మహాసైన్యములును వృథాగా ఓరుగల్లునుండి తరలింపబడినవి. అయ్యో ! ఎంత ప్రమాదము సంభవించినది ? తనకు రకరకములైన వార్తలు వచ్చియుండెనే ! అవి యన్నియు నబద్ధములేనా ? అట్లైనచో దేవగిరి ప్రభువు దేవాళీసేనలను ఎదుర్కొనబోయిన వార్త నిజమగునా ? రుయ్యమ్మకు ఆ మహాశివరాత్రినాడు కాళ్లాడలేదు. ఎవరితో నాలోచన చేయగలదు ? నగరములో పెద్దల నామె పిలువనంపెను.

మహాదేవరాజు జైనవసతినుండి రాలేదట ! పోచయ రాలేదట. అతని యల్లుడు నాగదేవనాయడును రాలేదట. ప్రోలరాజు రాలేదట. ప్రసాదాదిత్యనాయడును, రుద్రమనాయడును, వల్లనాయకుడును గూడ తిరిగిరాలేదట ! వారెక్కడనుండిరో కూడ వెంట వెళ్లిన పరిజనమునకే తెలియదట. నేమినాథస్వామిదర్శనమునకు లోనికి వెళ్లినతర్వాత, వారిని చూచినవా రెవరును కనపడలేదు. ఎవరికి వారు మే మెరుగ మన్న మేమెరుగ మనుచున్నారు. పలువు రున్నతోద్యోగుల కథయు నిట్లే యున్నది. ఏమి యీచిత్రము !

రుయ్యమ్మ కీవార్తలు విన, పిచ్చి యెత్తినట్లే యైనది. ఎవరి నేమని యడుగును ? అట్టి సమయమున తిక్కనసోమయాజులు తనకై వచ్చిరని పరిచారకుడు చెప్పినంతనే, సాక్షాత్తుగా పరమేశ్వరుడే తన్నుద్ధరించుట కారూపమున ప్రత్యక్షు,

మైనట్లు దానికి తోచెనటనే వచ్చుచున్న సోమయాజుల కెదురు వచ్చి యది పాదాభివందనము చేసి

'శీఘ్రమేవ కల్యాణప్రాప్తిరస్తు !'

మహాదేవుడు తన్నిట్లు ఆశీర్వదించుచున్నాడు ! అంత యాందోళన ములోగూడ నా చిన్నదాని కను సిగ్గుతో జాజువారెను.

అంతట నది సోమయాజి వచ్చిన పని యేమని ప్రశ్నింపలేదు. తన్ను రక్షించుటకు తన తండ్రి వచ్చెనని భావించి, వెంటనే దాపకుండ తన కష్టము లన్నియు సోమయాజులకు చిన్నది నివేదించుకొనెను. సోమయాజులు శ్రద్ధతో నాలకించి, పరితపించుచున్న మాచల్దేవిని, గోవిందశర్మను లోనికి రుయ్యమ్మ యనుజ్ఞాగతితో రప్పించెను. గోవిందశర్మ తాను బూతికాలలో విన్న వాక్కు లను తుదకు జరిగిన విషయమును నివేదించెను. మాచల్దేవి అజ్ఞాతయోగి వేషములు వివరించి పేచయనాయకాదులకై వారి పరిచారకులు పట్టణములో వెదకుచున్నది తెలిపెను. రుయ్యమ్మకు ఆ వార్త లింకొకవిధముగా తెలిసియున్నందున, సందేహములన్నియు జైనవసతిమీదికి ప్రసరించెను. ఈనాడు వారు ప్రతాప రుద్రకుమారులనుగూడ ఉత్సవమునకు రమ్మని ఎన్నివిధముల వినయవిధేయతలతో బలవంతపెట్టిరి ! అందులో దుర్దశ ముండితీరగలెను. కామసాని యచంచలనిశ్చ యము ప్రతాపరుద్రకుమారుల కెట్టి విపత్తు రాకుండ కాపాడినది ! కాని యిందరు నాయకులకు ప్రమాద మేదో చేయ సాహసించినవారు అంతటితో నాగుదురా ! ఈ రాత్రి తెల్లవారులోపలనే ఎన్ని ప్రమాదములు జరుగనున్నవో గదా !

సమస్తభారమును తనపై నుంచుకొని కాకతీయసామ్రాజ్యమును అకాల ప్రళయమునుండి రక్షింపవలసిన దని సోమయాజులను ప్రార్థించుచు రుయ్యమ్మ ఆతని కాళ్లపై పసిపిల్లవలె పడెను.

సోమయాజులు ప్రీతితో దానిని లేవదీసెను.

"నేను మంత్రిత్వము వదలి చాలకాల మైనది. ఈ రాజ్యతంత్రము నాకు సుపరిచితము కాదు. వెంటనే అన్నమంత్రీశ్వరులను నిర్బంధమునుండి విడిపించి యీ భారమంతయు నాతనిపై బెట్టుము! సర్వము శుభమగును !"

తిక్కనసోమయాజుల యాజ్ఞ రుయ్యమ్మ శిరసావహించి లేచెను. అది మరు మాటాడక తనకు పూర్వము శ్రీరుద్రదేవమహారాజు లిచ్చిన యనుజ్ఞాపత్ర మాధారము చేసికొని, వెంటనే అన్నమంత్రీశ్వరులను బంధమోచనము చేయుచు పత్రము వ్రాసి, మరియొకపత్రముపై శ్రీరుద్రదేవమహారాజులు తిరిగి వచ్చువరకు వారికి ప్రతినిధిగా నుండి వ్యవహరించుటకు తన కిచ్చిన యధికారము లన్నియుంగూడ అన్నమంత్రీశ్వరులకే సంక్రమింపజేయుచు, ఆ పత్రములరెంటికి ముద్రిక వేసి సోమయాజులకు చూపెను. సోమయాజులు అంగీకారసూచకముగా తల యూపెను.

దాని కంగీకారముగా నా బ్రాహ్మణులందరును ఓంకార మొనర్చిరి. ఆ ప్రణవనాదము భూనభోంతరాళముల నిండిపోయెను!

అన్నమంత్రీశ్వరు డంతట తాను ముందు వేసియున్న లెక్క ప్రకారము వివిధశస్త్రధరులగు నా నూతనభటులలో రెండువేలమందిని రాజమందిరముచుట్టు నున్న ప్రాకారముపై నిర్ణీతప్రదేశములలో కాపుంచెను. రెండువేలమందిని స్వయంభూదేవాలయమున, జాగరూకులై యవసరములకై పిలిచినప్పుడు వచ్చుటకు సిద్ధముగానుండు మూలబలముగా పెట్టెను. మిగిలినవారిలో నొక్క వందమంది వీరులతో గోవిందశర్మను పంపి, యాతడు జూదమాడిన ద్యూతశాలల నివారించి యందరను నిర్దాక్షిణ్యముగా బంధించుటకును ఎగురుతిరిగినవారిని ఖండించుటకును ఆజ్ఞాపించెను. మరియు ప్రధానచత్వరములలో కాపుగా నుండ పెక్కు వందల వీరుల నాజ్ఞాపించి యాతడు పంపెను. అట్లు పంపిన ప్రతిదళమునకును నాయకులను, ఉపనాయకులను వెంటనే నిర్ణయము చేసెను.

ఇట్లాజ్ఞలు నిర్వర్తించి తనపై పెట్టుకున్న భారమునకై యొక్క గడియ పాటు యోచించెను. అంతలో తాను పూనిన కార్యమునకు వీరశైవశిష్యుల సహాయము లేనిది సాధించుట కష్టమని యాతనికి స్ఫురించినది. అప్పటికే స్వయంభూదేవాలయమున నందరు బ్రాహ్మణులు శస్త్రధారు లగుట తిలకించిన శివభక్తులకును ఆవేశము పెరిగియున్నది. వారి కేదో మహాశివకార్యము నిర్వర్తింపవలసిన సమయము వచ్చినదని పొడకట్టినది. వారందరును చేతి కందిన ఆయుధములు—కఱ్ఱలు, కట్టెలు, కత్తులు, బల్లెములు, గొడ్డళ్ళు, పలుగులు, పారలు—ధరించి యన్నమంత్రీశ్వరుల యాజ్ఞలకై నిరీక్షించుచుండిరి.

అన్నమంత్రియు వారి నందరగూడ దళములుగా విభజించి నాయకులను, ఉపనాయకులను నిర్ణయించి కూడదీసెను. అంతలో ఇద్దరు యువకులు అశ్వము లెక్కివచ్చి అన్నమంత్రీశ్వరున కొక కవచమును, శిరస్త్రాణమును, ఖడ్గాద్యాయుధములు నర్పించి, యొక యశ్వరాజమును ఇచ్చి, తమ్ము నాతనికి అంగరక్షకులుగా నుండ ననుజ్ఞ వేడిరి. అన్నమంత్రియు నల్లె యని కవచాదులు ధరించి సోమయాజులకు నమస్కరించి సెలవు పుచ్చుకొని అశ్వముపై నా నూతనసైన్యముతో బయలుదేరెను.

తిక్కనసోమయాజులు స్వయంభూదేవాలయముననే యుండిపోయిరి.

అన్నమంత్రీశ్వరుని సేనలు అరగడియ దాటకముందే పోయి మహాసంరంభముతో జైనవసదిని ముట్టడించెను. అచ్చట నున్న మహాసేన యొకటి వారిని క్రోధారభటితో నెదుర్కొనెను.

౭౨

"యస్తస్యైవ రణే జహార కరిణ స్తత్పంచ శబ్దాదికాన్
య స్తత్యాజ వధూవధా దుపరత స్తద్బాహుభుజం రుద్రమామ్."

హేమాద్రి.

కాకతీయరాజులకు పాకాలయొద్ద నొక సేనాస్కంధావారము కలదు. అచ్చట నొక విశాలమగు సరోవరమును కలదు. దానికిఉత్తరమున యోజనముదూరమున కిన్నెరసాని యను నొక వాగు పుట్టి యడవులలోగుండ ప్రవహించి భద్రాచలసమీపమున గోదావరీ నదిలో కలియుచున్నది. కిన్నెరసానివాగునుగూర్చిన కథ లనేకము కలవు. దాని పేరే మనోజ్ఞమైనది. భద్రాచలసమీపారణ్యములలో ప్రయాణము చేయువారిని దాని మలుపులు ఎంతయేని ఆకర్షించును. కవీశ్వరులు దాని గాంచి యుప్పొంగిపోవుటలో వింత యేమి ?

రాజమహేంద్రవరమున కొప్పెగుంజింగడు స్వదేశమునకు తిరిగి పోవుటకు, శ్రీరుద్రదేవమహారాజులయొద్ద సెలవు పుచ్చుకొని, కతిపయపరివారముతో కదలి, ధాన్యకటకముదారిని బట్టి కాశవదేశమునకు వడలిపోయెను.

రుద్రమ్మ తిరిగి వచ్చుచున్న దారిలో కిన్నెరసానివాగు తగిలెను. దానిని చూచినకొలదియు, రుద్రమ్మ దానిని వదలలేకపోయెను. దాని పేరు విన్నకొలదియు దానిపై మక్కువ తెలుగురాణి కెక్కువ యయ్యెను. ఇక దాని కథ విన్నతర్వాత రుద్రమ్మమనస్సు కరగియేపోయెను. ఈ కిన్నెరసాని భర్తపై అలిగి ద్రవించి ఏరుగా ప్రవహించి రాళ్లగప్పలపైనుండి పారుచు అడవులగుండ దిక్కులేక కాని మార్గముల సంచరించుచున్నది. కాని అక్కడనేని దాని రుయ్యాళ్లరము వీడలేదు.

తాను తెలుగురాణి! తన భర్త తనకు కాకుండపోయినాడు. తానిట్లు ఒంటరిగా దేశమంతయు సంచరించుచున్నది తనవంట సేవకు లున్నారు, సైనికు లున్నారు; ఐనను తాను ఒంటరియే! తన సేనానులు శత్రువులను నిర్జించుచున్నారు; ఐనను తనకు విజయసంతోషము లేదు! ఈ కిన్నెరసానివలెనే, తానును ఏకాంతమున నడవులలో సంచరించుచు, తుదకు గోదావరీగర్భమున కలసిపోయిన నెంత బాగుండును!—ఒకనాటి సాయంకాలమున కిన్నెరసానివాగు ఒడ్డున పరిజనులకు దూరమై ఒంటరిగా సంచరించుచు రుద్రమ యీవిధముగా తలపోయుచుండెను.

ఆ సమయమున తనకు కొంతదూరమున జనులు సంభాషించుకొనుచున్న సవ్వడి వినవచ్చెను. అందులో నొకడు దేవగిరి యాదవరాజగు మహాదేవరాజు ప్రశస్తిని గానము సేయుచుండెను.

"అయం శివస్త్రీ శరణాగతానాం హంతా మహాదేవనృపో నజాను
ఇత్థం వినిశ్చిత్య తతో బిభీతై రంధ్రైః పురంధ్రీ సహితా నృపత్వే."

అంతవరకు కలవరించుచున్న దానివలె నున్న రుద్రమ యా మాటలను విని, తోక త్రొక్కిన యాడుత్రాచువలె నొక్కసారి లేచెను. ఆ శబ్దము వచ్చుచున్న వైపు శ్రద్ధగా పరికించెను. [illegible] పలువు రున్నట్లున్నారు. అట్టి [illegible] శ్లోకము చదువువాని తల తెగవేయవలెనని, ముందు కలిగిన [illegible] నిలువరించుకొనెను. అంతలో మరల మహాదేవరాజును పొగడు శ్లోకములు వినవచ్చినవి.

“త్రిలింగక్షితిపాలశూలనిచయ ప్రక్షేప చండానిలః”

అది వినుట యామె చెవులు భరింపలేకపోయెను. అంతలో మరియొక శ్లోకము వినబడెను.

“త్రిలింగాధిపతేః పశోర్విశసనం రుద్రస్య రౌద్రాకృతేః
కృత్వా పూరుషమేధయజ్ఞవిధినా లబ్ధ స్త్రిలోకీ జయః.”

ఆ మాటలకు రుద్రమకు కన్నీరు వచ్చెను. తన పెదతాతగారగు రుద్రదేవుడు యాదవులతో యుద్ధమున ప్రాణములు కోల్పోయియుండెను. తన తాతగారగు మహాదేవుడు యాదవులతో యుద్ధమున నిహతుడయ్యెను. తన తండ్రి గణపతిదేవుడు చిన్నతనములో బహుకాలము వారి చెరసాలయందే యుండెను. ఇప్పుడు తన తండ్రి యాదవులకు తగినశాస్తి చేసియుండెను గాక! ఎన్నాళ్ళ నాటి మాట! ఇప్పటికి అవి జరిగి డెబ్బదియేండ్లయియుండును. అయినను దేవగిరి ప్రభువులు తమ ప్రతాపమును ఆ ప్రగల్భవాక్కులతో పొగడుకొనుచున్నారు. మరి ఇప్పుడు ప్రతాపమునకు భయపడి, శిశువులను స్త్రీలను శరణాగతులను చంపకుండు దీక్ష తమకున్నదని తెలిసి, ఆంధ్రులు స్త్రీని తమ రాజ్యమునకు పట్టాభిషిక్త నొనర్చిరని గదా వారి ప్రగల్భములు!

రుద్రమకు కోపము దుర్భర మయ్యెను. ఖడ్గము దూసెను. ఆ పాడుచున్న గాయకు డున్న వైపునకు నాలుగడుగులు వేసెను. అంతలో ఒంటరిగా నున్నది జ్ఞప్తికి వచ్చెను. దూరమునుండి యామె సంచారమును కనిపెట్టుచున్న ఆమె అంగరక్షకుడగు పర్వతనాయకుడును, ఆ శ్లోకభాగములు వినినట్లున్నాడు. ఆ జనము వైపునకు బయలుదేరిన రుద్రమ నవలక్షించి వెంటనే యాతడామె నెదురుకొని బహు నమస్కరించి, యడ్డము నిలిచి, యిక్కడ నొంటిగా సంచరించుట ప్రమాదకరముగా నున్నదని నివేదించి స్కంధావారమున కామెను కొనిపోయెను.

అప్పటికి బాగుగా చీకటిపడినది. ఐనను రుద్రమ వెంటనే చారులను ఆ శబ్దము వచ్చిన దిక్కుగా బంపి యక్కడి విషయము తెలిసికొనెను. ఆ యర్ధరాత్రమునకు వారు నిశ్చయమగు వార్త తెచ్చిరి. కిన్నెరసాని యావలియొడ్డున నజ్ఞాతమగు నొక మహాసేన యున్నది. అదియు తమ సేనను అనుసరించి వచ్చుచున్న శత్రుసేనగా తోచుచున్నది. అది ఎంత సేన యైనదియు మొదలగు వివరములు మాత్రము వారప్పుడు చెప్పలేకపోయిరి.

ఆ వార్త యందినవెంటనే తన స్కంధావార మంతయు నెప్పటికంటె నెక్కువ యూగ్బద్ధమై యుండ నామె యాజ్ఞాపించెను. ఆమె వెంట నైదువేల సేన కంటె లేదు. శత్రుసైన్య మెంత యున్నదో! అందుచే నామె వెంట నున్న సేనానులు, వెంటనే వెనుదిరిగి యొక మార్గమున పాకాలవైపుకు నడచుట క్షేమమని సూచించిరి. కాని రుద్రమ దాని కంగీకరింపలేదు. "ప్రగల్భపు శోకములు విని జడిసి మనము పారిపోవుటా!— ఆ ప్రగల్భములాడు వాచాలురను శిక్షించి గాని మరి పోరాదు!"

చారులు విషయసంగ్రహణమునకై అన్ని దిక్కులకు నేగిరి.

* * * *

కాని యంతలోనే యా రాత్రియే భయంకర మగు గాలివాన ప్రారంభించెను. మూడు రాత్రులు మూడు పగళ్లు ఎడతెరపి లేకుండ వాయువు మహారౌద్రముగా వీచుచుండెను; మేఘము లేకధారగా వర్షించుచుండెను.

అకస్మికముగా కిన్నెరసాని తన బక్కచిక్కిన నిరాకారము వదలినది. భయంకరమైన మహోగ్రరూపిణి యైనది. ఆ మహారణ్యములో హోరుపెట్టి వీచుచున్న ప్రభంజనము వేగమును గూడ కిన్నెరసాని ప్రవాహవేగము మించిపోయినది. కిన్నెరసానిపొంగు గాంచిన ఋషీశ్వరులకే దాని వర్ణింప నసాధ్యము!

మహావాతమునకు కటకుటీరము లాగునా? ఎంత చెట్టునాటన నుంచినను మాగాణులను నాటిని ఎగురగొట్టి వేయుచుండెను. మరియును నచ్చటి మహావృక్షము లెన్నియో ఆ గాలికి కూకటి వ్రేళ్లతో పెల్లగింపబడినవి. ఏ వృక్షము పవరిపై బడునో! ఆ మహాసంకటములో మహారాజులకును సామాన్యసైనికులకును భేదము పోయినది. శ్రీరుద్రదేవమహారాజులకే ఆకలి తీరుట కష్టమయ్యెను. వంటలు చేయువా రెక్కడ? ఎట్లు? వెంట వచ్చుచున్న గోవులు గేదెలు నిలువ నీడయే లేకున్నవి. అవి మాత్రము పాలెట్లు నీయగలవు? సమీపమున నున్న చిన్న పల్లెలకు పోయిన కొంత సాధింప వచ్చును. కాని మనుష్యమాత్రులు లా గాలిలో వర్షములో ఎటు కదలగలరు?

శ్రీరుద్రదేవమహారాజుల స్కంధావారమంతయు చిరిగిపోయిన గాలిపటము వలె నైనది. ఆ గాలియు వానయు చూచుచుండ రుద్రమహృదయ మేదో ఉత్సాహముతో నుప్పొంగసాగెను. ఎదుట కిన్నెరపొంగు చూచుచున్నకొలదియు, నామె హృదయములోని పొంగు ద్విగుణీకృత మయ్యెను. ఆ సమయమున తాను త్రిలింగప్రభువు నను మాట మరచిపోగలిగెను. కేవలము మానవమాత్రి నను భావ మామె నావేశించెను. నా డెన్నడో యాదవరాజు ప్రతాపము కీర్తించుచు నన్న శ్లోకపాదము మరల మరల నామె కిప్పుడు స్మృతిలోనికి వచ్చుచు వింతశాంతిని చేకూర్చుచుండెను.

"త్రిలింగక్షితిపాలతూలనిచయ ప్రక్షేపచండానిలః"

"త్రిలింగక్షితిపాలతూలనిచయ ప్రక్షేప చండానిలః"

"నిజముగా ఈ చండానిలుని ధాటిముందు తెలుంగుదేశమున కెల్ల రాణి నగు నే నెంత! లోకములోని రాజు లందరును గలసినను మాత్ర మెంత!"

ఆ యరణ్యములో మూడు దినములును మూడు యుగములుగనే గడచిపోయెను. రుద్రమసేనయు పరివారమును చెల్లాచెదరయిపోయినవి. వెంట నున్న గుర్రములు ఏనుగులు చెట్టు కొకటి పుట్ట కొకటిగా పోయి దాగుకొన్నవి. వెంట బంధితుడై వచ్చుచున్న మనుమసిద్ధి రక్షకులు వదలిపోయిరి. అతనిని మాత్రము ఆతని పాలగుర్రము వదలలేదు. ఆతడును శిబిరము దాటి పారిపోలేదు. తుపాను తగ్గగానే ముందు రుద్రమ్మదర్శనము చేసినవాడు మనుమసిద్ధియే!

గాలివాన తగ్గిపోయినను పరివారము కూడుకొనలేకపోయినది. పలువురు ఎవరికి దోచిన త్రోవను వారు పాకాలకు ప్రయాణమైరి. వారు తలదాచుకొన్న తావుల నుండి మరల శిబిరమున్న ప్రదేశము గుర్తించుటే చాలమందికి అసాధ్యమైనది. వార్తాహరులే సరిగా చిక్కలేదు. కిన్నెరసాని ఇంకను భయంకరముగా ప్రవహించుచున్నందున, చారులు ఆవల నున్న సేనజాడలుకూడ తెలియలేకపోయిరి. ఐదువేల సైనికులలోనను నూరుమంది మాత్రమే రుద్రమను ఆ సాయంత్రమునకు పరివేష్టింపగల్గిరి. పర్వతనాయకుడు శీఘ్రయానమున పాకాల చేరికొనుట శ్రేయస్కరమని యుపదేశించెను. మనుమసిద్ధియు అందులకే తొందరచేసెను. కాని రుద్రమ వారి మాట లాలకింపలేదు.

మహాశివరాత్రి వచ్చినది. ఆ యుదయమునకు మరి రెండువందల భటులు రుద్రమను చేరికొనిరి. పాతిక యశ్వములు ఐదు ఏనుగులు మాత్ర మామెవెంట నున్నవి.

కిన్నెరసానిప్రవాహము తగ్గుముఖ మగుచున్నది. ఏనుగు నొకదానిని దాటింప రుద్రమ్మ యాజ్ఞ యిచ్చెను. ఆ ఏనుగు కొంతదూరము పోయి పోలేక వెనుదిరిగి వచ్చినది. మరల ఎంత పొడిచినను ఆ ఏనుగు నీటిలో నడుగుపెట్ట సాహసింపలేదు. కిన్నెర ప్రవాహ మట్లున్నంతసేపును, ఎంత సైన్య మావల నున్నను తనకు భయములేదని రుద్రమ్మ నిబ్బరము!

కాని రుద్రమ్మ పొరబడినది. మహాశివరాత్రి మరునాటికి స్పష్టముగా కిన్నెరసానిప్రవాహవేగము చాల భాగము తగ్గినది. ఆవల యాదవసైన్యము ఐదువేలకు తక్కువ లేకుండ నున్నదనియు, అందును ఏబదిగజములు కలవనియు చారులు తెల్లవారునప్పటికి వార్త తెచ్చిరి.

రుద్రమ్మ వెంటనే తన పరివారమును ప్రయాణముచేయ నాజ్ఞ యిచ్చెను. ముందు ఐదశ్వములపై వేగరుల పాకాలకు పంపి, మహాసేన తనకై ఎదురు రావలసినదని యాజ్ఞాపించి, తన చిన్నపరివారముతో మిక్కిలి జాగరూకతతో కదలెను. ఆ యడవిదారు లెరిగిన కోయదొరలు ఆమెకు దారి చూపుచుండిరి.

ఆమెపరివారము మిక్కిలి స్వల్పము. ఐనను అది శత్రుసేనకు కనబడనీయగూడదు. అందుచే ఉదయమునను మధ్యాహ్నమునను సాయంత్రమును మహాశక్తితోటి పంచతూర్యములను మ్రోయించుచుండ రుద్రమ యాజ్ఞాపించెను. పరివారము

కూడ పెద్దగా ధ్వనిచేయుచు సాగుచుండ నేర్పాటు చేసెను. తనతో నున్న ఐదుగజములనే కిన్నెరసాని ప్రక్కను సాగుచు ఎదిరిసేనలకు కనబడునట్లు చేసెను.

శీఘ్రప్రయాణముతో నిట్లొక రోజు గడచిపోయెను. మరి యొక్కరోజిట్లే ప్రయాణము చేసిన తాను పాకాల చేరుకొనును.

మరునాడుదయము తనకు వచ్చిన ప్రమాదము దూరమైనదను నాశతో, నుత్సాహముగా రుద్రమ సాగిపోవుచున్నది. కిన్నెరసానియు నిప్పుడు దూరమైనది, రుద్రమ యాశ్వముపై నున్నది. ఆమె కిరువైపుల నశ్వములపై పర్వతనాయకుడును మనుమసిద్ధియు నున్నారు. కష్టసమయమున మనుమసిద్ధి ప్రదర్శించిన విశ్వాసము రుద్రమ కాతనిపై కొంత దయ కలిగించినది. అదియును గాక తనవెంట బంధితులను గూడ కాపు కాయగల పరివార మిప్పుడు లేదు. అందుచే నేమైనను అతని నమ్మక వీలులేదు. వారి సమూహముతో కలసి ఇరువదిమంది యాశ్వికులే యున్నారు.

మధ్యాహ్నమున విశ్రమించి ఎక్కువగుచున్న ధైర్యముతో తన యల్పపరివారముతోని రుద్రమ బయలుదేరినది. కొంత దవ్వేగగా వెనుకనుండి పలువు రాశ్వికులు వచ్చుచున్న ధ్వని స్పష్టముగా వినవచ్చినది. ఇప్పటికి వారు అడవిదారి దాటినారు. ఒక్క అరగడియలో వారిని వచ్చి యొక యాశ్వికదళము తాకెను. అందులో ఇరువదిమందికి తక్కువ యాశ్వికులు లేరు.

వెంటనే రుద్రమ యాజ్ఞతో నాంధ్రగజములు ఐదును ఆయాశ్వికులను తాకెను. అవి ముందువరుసలలో నున్న ఏబది యశ్వములను చెండాడినవి. కాని వానిపై మావటీండ్రును యోధులును ప్రాణములు వదలిరి. తిల్లింగక్షితిపాలుని ఆ ఐదు కరులును శవములైనవి.

అంతట నా యాశ్వికులు రుద్రమ పంచతూర్యములు మ్రోయించు పరివారమును, వారి స్వామిభక్తులతో సహా నిర్బంధించి, యా పంచతూర్యములను హరించిరి.

ఆంధ్రపదాతులు అంతట రుద్రమయాజ్ఞలచే ఆ సాయదళము నెదుర్కొనిరి. కాని వారెంతసేపు నిలువరింపగలరు? ఐనను ఆ వ్యవధితో, తనవెంట నున్న యాశ్విక పరివారముతో రుద్రమ శీఘ్రగతి ముందుకు సాగిపోగలిగెను. ఆపైన రుద్రమ నెట్లైనను పాకాల సురక్షితముగా చేర్చుటే వారి యాదర్శమైనది. నురువులు గ్రక్కునట్లు వారాయశ్వముల పరువెత్తించుచుండిరి.

ఏబదిమంది యాశ్వికులు పోరు వదలి శీఘ్రగతి వెంబడింపసాగిరి. పర్వతనాయకుని యాజ్ఞలతో పదిమంది యాశ్వికులు వెంబడించుచున్న యా ఏబదిమందిని ఎదుర్కొనుటకు వెనుకకు తిర్గిరి. ఒక్క అరగడియకంటె వారిని ఆ ఏబదిమందియు నిలువరింపలేకపోయిరి. వెంబడించుచున్న యాశ్వికులలో పాతికమంది వారిని దాటి, రుద్రమను పట్టుకొనగ తమ యాశ్వముల బరువెత్తించుచుండిరి.

మనుమసిద్ధి తన యాశ్వమును మిగిలినవారితోపాటు పోనిచ్చుటకు కళ్ళెము బిగబట్టవలసివచ్చుచుండెను. అతడది రుద్రమకు చూపి యిట్లు ప్రార్థించెను.

"మహారాజా మీరు ఈ పాలుగుర్రమెక్కిన సురక్షితముగా నాకాల చేరి కొనగలరు. దయచేసి దీని నధిరోహింపుడు!"

ముందు రుద్రమ యందు కంగీకరింపలేదు. కాని యందఱు నిర్బంధించుటచే తుద కంగీకరించెను. ఒక మలుపు తిరిగినచోట రుద్రమయు మనుమసిద్ధియు నశ్వములు మార్చుకొనిరి.

ఇప్పుడు శ్రీ రుద్రదేవమహారాజు లధిరోహించిన పాలుగుర్రమునకు కళ్లెము వదలిరి. అది మిగిలిన తొమ్మిది యశ్వములను దాటిపోయి వాయువేగమున బరువెత్తుచున్నది. అది ముందై పోయినది.

మిగిలిన యశ్వదళమును కలసికొని, వెనుకనుండి తరుముకొని వచ్చుచున్న యశ్వాశ్వికదళము వచ్చి తాకినది. మనుమసిద్ధియశ్వమును జూచి రుద్రమ్మగారశ్వ మనుబుద్ధితో వారందరు ముందాతనిపైననే కవిసిరి. తొమ్మిదిమంది సైనికులు నూరుమంది వీరులతో సమానముగా యుద్ధము చేయగలరా? మనుమసిద్ధి గాయపడి గుర్రముపై నిలువలేక క్రింద పడిపోయెను. పర్వత నాయకుడును అట్లే పడిపోయెను.

ఆ వచ్చిన యాశ్వికుల నాయకుడు పడిన మనుమసిద్ధిపై కుప్పించి శిరస్త్రాణము తీసి చూచెను. రుద్రమ కాదు!

మెరపు మెరసినట్లా నాయకుడు తన యాజానేయముపై నెక్కెను. ఒక్క క్షణము నేలపై గుర్రపు గిట్టల జాడలకై నలువైపులం చూచెను. రుద్రమ యెక్కిన పాలయశ్వము వెళిన జాడను ఉపలక్షించి దాని వెంట నంటును అతడును మిక్కిలి శీఘ్రముగా బోవుచుండెను. అతని పారశీకాశ్వము త్వరలో గుర్రమును కలసికొనుచుండెను.

రుద్రమ మాటి మాటికి వెనుదిరిగి చూచుచు పోవుచున్నది. 'పాపము నా పరివారమే మైనది?'

చూడగా నామెకు పరివారము కనబడలేదు. ఒంటరిగా నొక్క యాశ్వికుడే తన్ను వెంటాడించుచున్నాడు తా నింతవరకు స్వప్రాణరక్షణకు పరుగిడి వచ్చుచుండుటయే సిగ్గుగా నున్న దామెకు! ఒక్క క్షణము ఆమె ఆలోచించెను. మరు క్షణమున మనస్సు దిటవుచేసికొనెను తన యశ్వవేగము తగ్గించెను. దానిని వెనుకకు మరల్చెను తన్ను వెంటనంటి వచ్చుచున్న యా యాశ్వికయోధుని రభసమున రుద్రమ్మ యెదుర్కొనెను.

అప్పుడు వారిద్దరకు భయంకరముగా ద్వంద్వయుద్ధము ప్రారంభించెను. ఇద్దరును ఆశ్వకుశలత కలవారే! ఇద్దరును శూలఖడ్గయుద్ధవిశారదులే!

వారిద్దరును ఒండొరుల శూలముల తాకునకు తా మెక్కిన యశ్వములపైనుండి క్రింద పడిపోయిరి ఇద్దరును మెలకువగా దెబ్బ తగులకుండ తప్పించుకొని ఒరలనుండి ఖడ్గములను పెరికి ఒకరితో నొకరు తలపడిరి.

వారిద్దరు ఖడ్గయుద్ధమున నొకరి కొకరు తీసిపోకుండిరి. రుద్రమ మహాకాళిక వలె విజృంభించిన, నా యోధుడు వీరభద్రునివలె నట్టహాస మొనర్చెను.

రుద్రమ యుద్ధశాస్త్రప్రియముగా నంధ్రదేశసంప్రదాయానుగతమైన విధమున ఖడ్గభ్రమణములు చేయుచుండెను. ఆ యోధుని భ్రమణములు కొంత వింతగా నున్నవి. అవి యాంధ్రభూమివిగా లేవు. అవి విదేశమార్గముల ననుకరించుచున్నవి. అందుచే రుద్రమ కొక్కింత మెలకువ యవసర మయ్యెను. రుద్రమ మెలకువ చూపినకొలదియు నా యోధుని దుస్సాహస మెక్కువయ్యెను. ఆ యోధుని దెబ్బలను సులభముగా రుద్రమ తన పలకతో కాచుకొనుచున్నది. ఆమె కాచుకొనుచున్నకొలదియు, యోధుని దుస్సాహసమును ఆత్మవిశ్వాసమును ఎక్కువ కాసాగినవి. అతని కాత్మరక్షణ తక్కువైనది.

ఆ సందు ఒక్కసారి రుద్రమ యుపలక్షించినది. కాని వెంటనే వేటు వేయలేదు. మరియొకతీరున ఆత్మరక్ష చేసికొని తన బలహీనపక్షమున వేయునేమో!

మరల రెండవసారి అవకాశ ముపలక్షించినది. ఈసారియు వదలి వేసినది!

మూడవమారు అవకాశము వచ్చినది! ఈమారు రుద్రమ్మ వదలలేదు. ఆ యోధుని దక్షిణబాహువు నరకివేసినది. ఆ యోధుడు జీవించినను ఈ జన్మకు మరి యుద్ధము చేయలేడు!

ఆ యోధుడు పడిపోయెను. రుద్రమ్మ యిప్పుడు తన యశ్వమెక్కి పోయి యాత్మరక్షణ చేసికొనవచ్చును. కాని యా యోధుని యుద్ధపద్ధతి యామెకు ప్రాగ్విదితమైనదిగా స్ఫురించినది. ఇతనితో మున్ను యుద్ధము చేసినట్లున్న దెప్పుడో! "ఎప్పుడు? - ఎప్పుడు? - ఎప్పుడు?"

రుద్రమ యావేశముతో నాతని శిరస్త్రాణము నెత్తి ముఖము చూచునుగదా ఆతడు వీరభద్రేశ్వరుడే! తన భర్త వీరభద్రేశ్వరుడే! తన ప్రాణేశ్వరుడు వీరభద్రేశ్వరుడే! అతడిప్పుడు స్మృతి తప్పి పడిపోయియున్నాడు!

అంతలో నశ్వదళ మొకటి యక్కడికి చేరుకొనెను!

౪౬

మహాశివరాత్రినాటి రాత్రి శివనాథదర్శనము చేయించి మహాదేవరాజును ప్రక్కనున్న గదిదారిన బంపిరికదా! ఆ ప్రక్క గదిలో పలువురు పరిచారకులు కలరు. మహాదేవరాజు గదిలోనికి రాగానే వారందరును భయభక్తులతో లేచి నమస్కరించి విశేష గౌరవముతో దారి చూపుచు నొక చిన్న ద్వారమునొద్దకు తీసికొనిపోయి యది తెరచిరి.

ఆ ద్వారము నావల కటికిచీకటిగా నున్నది. ఆ ద్వారమున బయటికి పోవుటకు ఇంచుక సంశయించుచు మహాదేవరాజొక క్షణకాలము ఆలోచించు చుండెను. వెంట నున్నవారు మిక్కిలి గౌరవముతో "ఏమి, మహాప్రభూ, చీకటిగా నున్నదా? వెలుగు తెత్తుమా?" అని యడిగిరి.

మహాదేవరాజుకు తనను వారు భయపడుచున్నట్లు భావించిరని తోచెను. అందు కాతనికి అభిమాన మనిపించెను. "ఎందుకు? అవసరము లేదు!" అనుచు నాతడు ఆ ద్వారము దాటి చీకటిలో రెండడుగులు వేసెను.

రెండడుగులు కాదు, ఒక్క అడుగే! ఆ ఒక్క అడుగుకే అతడు ముందుకు పడిపోయెను. ఎంత లోతుకు పడిపోయెనో అత డెరుగడు. పడిపోవుచున్నను అతడొక కేకకూడ వేయలేదు. మహాదేవరాజు ప్రమాదావస్థలో నైనను ఆర్తుడై కేక వేయునా!

అతడు పడిన ప్రదేశములో నదృష్టవశమున జల మున్నది. కాని లోతుగా లేదు. పడిన మొదటిపాటుకు అతడు దిమ్మరపోయెను. ఒక్క క్షణములో స్మృతి వచ్చినది. రోషోద్రిక్తుడై యాతడు నీటిలో పైకి లేచుటకు ప్రయత్నించెను. అది యొక విశాల మగు బలపపురాతి గది. గోడలు నున్నగా నుండి పైకి ఎక్కుటకు ఎక్కడను ఎట్టి పట్టును ఇచ్చుటలేదు. ప్రాకుట కెన్నిసారులు ప్రయత్నించి సాధ్యము కాక జారి నీటిలో పడిపోవుచుండెను.

అంతలో మరల తాను పడిపోయిన ద్వారము తెరచినచప్పుడైనది. మరల బయట ఏవో మాటలు వినబడినవి. మరుక్షణమున మరియొకరి దేహము నీటిలో పడిపోవుట మహాదేవరాజుకు వినబడెను.

మహాదేవరాజు తా నట్టి యపాయస్థితిలో నున్నందు కెట్టి భయమును పొందుటలేదు. ప్రాణత్యాగమునకు వెనుదీయని వీరవంశములో జనించినవా డాతడు! మహారాజుల యల్లు డగు తాను ఈ నీచస్థితిలో నీటిలో దోగుచు నుండు టవమానస్థితికి అభిమానముగా నున్నది. ఇట్టి స్థితిలో తా నుండుట మరియొకరు

చూతురేమో యని సిగ్గుతో ఆతనికి ప్రాణమే పోవుచున్నట్లున్నది. అందుచే నాతడు ఎట్టి సవ్వడియు జేయక ఆ పడిపోవు మనుష్యులకు దూరముగా నుండెను.

అట్లు పడిన రెండవ వ్యక్తి ప్రసాదాదిత్యనాయకుడు! ఆతని యనుభవమును మహాదేవరాజునకువలెనే యుండెను. దిమ్మెరపోయినవాడై లేచి గోడలు పట్టుకొని పైకి ప్రాకుటకు ప్రయత్నించెను. అట్లు ప్రయత్నించి పడుచుండుటలో నాతనికి తనతోపాటు మరియొక వ్యక్తి యందులో నున్నట్లు తోచెను.

"ఎవరు ?"

మహాదేవరాజు మాటాడలేదు. సిగ్గుతో నాతని సహాయమును [illegible] కొనిపోవుచున్నది. ఆతడు [illegible] కుంకుమతో ఎవరో [illegible] ప్రసాదాదిత్యనాయకునకు తోచెను. వెంటనే యాతడు తన [illegible] ఖడ్గము పైకి పొడిచివేయుటకు సిద్ధముగా నుంచి క్రోధావేశముతో పలికెను. తనను మోసముచేసినవారిపై గల కోపమంతయు నిట్లు రూపొందెను.

"ఎవరు ? వెంటనే చెప్పనిచో పొడిచివేసెదను !"

ఈ మాటు మహాదేవరాజు [illegible] కంఠము గుర్తుపట్టెను. ఈ స్థితిలో తాను ప్రసాదాదిత్యనాయకునితో కలహించుటా ? లజ్జతో గద్గదమగు కంఠముతో మహాదేవరాజు పలికెను.

"నాయకా ! నేను !"

ప్రసాదాదిత్యనాయకుడు ఆ గొంతు విని ఒక్క క్షణము ఆగెను. గుర్తు వచ్చినది. ఆతని కోపపు మైకము దిగిపోయెను. కత్తి యొరలోనికి పోయినది.

"క్షమించుము, మహాదేవరాజా ! మీకుకూడ ఈ యవస్థ వచ్చినదా ?"

వారు మాటాడుకొనుటకు నవకాశము లేదు. మరల పైని ద్వారము తెరచిన చప్పుడు ! మరల మాటలు ! మరల నొక వ్యక్తి పడిపోయెను. మరల ద్వారము మూసికొనెను.

ఈ సారి పడిపోయిన వ్యక్తి లేచి గోడలు ప్రాక యత్నించు నవసరము లేకపోయెను. ఆతడు పడినవెంటనే ప్రసాదాదిత్యనాయకుడును మహాదేవరాజును దగ్గరకు పోయి చేవదీసి యాతని నాదరముతో ప్రశ్నించిరి. ఈ మారట్లు పడిపోయినది రుద్రనాయకుడు.

తలుపు మరల మరల తెరచికొనసాగెను. ప్రోలరాజు పడిపోయెను. నాగదేవనాయకుడు పడిపోయెను. మల్లనాయకుడు పడిపోయెను. మరల పైన తలుపు తెరచుకొనెను. ఈ మారు బయట నున్న వ్యక్తి ప్రక్కన నున్నవారిపై కేకలు వేసెను. అంతలో నక్కడ చిన్న పోరాటము జరిగినట్లున్నది. పలువురు కలసి

యా వ్యక్తిని బలవంతముగా లోపలికి త్రోసివేసిరి. ఈమారు పడినది మేచయ నాయకుడు!

మేచయనాయకుడు పడినవెంటనే అందులో నెవరున్నదియు తెలిసికొనెను. అంతట నాతడా చీకటిలో వీలయినంతవరకు నా గది స్వభావము తెలిసికొనుటకు ప్రయత్నించెను.

ఆ గది మూడువిండ్ల లోతున నున్నది. అందులో నీ రున్నను అది బావి కాదు. ఈమధ్య గాలివానచే కురిసిన విశేషవర్షముచేత సగము బావిగా నీ రూరినది. ఆ నీరు లేకున్న తా మెవ్వరును జీవించియుండుట సాధ్యము కాదు. ఇందులో పడినవారు జీవనములతో నుందురని పైవా రనుకొనరు. "అందుచే మన మందరమును జీవించియున్నట్లు సందేహము పైవారికి కలిగింపరాదు!"

కొంతసడి నొకరితర్వాత నొకరు పైనుండి వ్యక్తులు పడుచుండిరి. ఏకశిలానగరములో తెలుగులవారందరును నీ రూరిన యా చీకటి నేల గొట్టములోనకే పడిపోయియుండిరి. పై తలుపు మూసికొన్నది. ఎంతసేపైనను మరల నది తెరచుకొనలేదు. అది యిక మరల తెరచుకొనదని తేలిపోయినది.

అప్పుడు మేచయనాయకుడు అందున్న పెద్దలందరకును నమస్కరించి తన నిర్ధారణ తెలియజేసెను.

"మన మిప్పు డిందుండి ప్రాణములతో బయటపడుదుమని యాశింపరాదు. నగరములో పెద్ద ప్రమాదము లేవో యిప్పుడు జరుగుచుండవలెను. ఏకశిలానగరమున కిప్పుడు ఇంక రక్ష లేదు. మాకు వార్తలు తెచ్చువారే పలువురు మోసగాండ్రని స్పష్టమైనది. జైనకరణములు రాజ్యాంగములో అలుకొని పెనవేసికొని యుండుటచే ఏ వార్త నమ్ముటకును ఏ వార్త నమ్మకుండుటకును సాధ్యము కాకున్నది. భగవంతుడు గణపతిదేవులను ప్రతాపరుద్రకుమారులను ఈ రాత్రి కాపాడును గాక!"

తాము పడియున్న ప్రదేశము వాకిలికి మూడు విండ్లలోతున నున్నదని మేచయ తన చూపుతో నూహించెను. కాని యది చీకటిలో చూపు! అందుచే నది నిర్ధారింపదలచి గోడల నాని యొకరి భుజములపై నొకరిని నిలుచుండజేసి, వారి [illegible] కోరుచు, మేచయ స్వయముగా నా పైవాని భుజములపై తా నెక్కి చూచెను. అతని కిప్పుడు ద్వార మందినది. దాని నాతడు ముందు నెట్టి చూచెను. ఏమియు సందీయలేదు. వెనుకకే తెరచుకొనుచున్నట్లున్నది. చీకటిలో చేతితో తడివి చూచి, దాని యంచు లుపలక్షించి కొంచెము నెమ్మదిగా నది లాగి చూచెను. అది యించుక వెనుకకు వచ్చి యంతట నాగిపోయినది. బయట గొళ్ళెము వేసియున్నదని యాతడు నిశ్చయించెను. ఈ దారి ప్రస్తుతము లాభము లేదు! నెమ్మదిగా నాతడు మరల నీటిలోనికి దిగిపోయెను.

[illegible] మరియొక ద్వారమేమైన నున్నదేమో యని యాతడు గోడలన్నియు పరీక్షించెను. ఏమియు నగపడలేదు. కాని యా గోడలు కట్టిన పని వారు [illegible] గోడలలో నుంచిన కంతలు మాత్రము పూడ్చియుండ లేదు. కంతలలో క్రిందివానినుండియే సన్నగా నీరా గదిలోనికి కారుచున్నది. [illegible] గది నీటితో నిండిపోయిన?

“[illegible] బాగుగా వచ్చునా?”

“[illegible] — [illegible] — వచ్చును.” అను గుసగుసలు వినవచ్చెను. రాదను [illegible] చెప్పుటకు ధైర్యము కలిగెను ఆ కంతలు పొడిచి దారి [illegible] జలప్రవాహము లోనికి వచ్చునెడల నేమగును? [illegible]

[illegible] పుంజుకొనగలుగు? తల యెత్తి పరీక్షించెను కప్పుపైనుండి [illegible] నక్షత్రములు కానవచ్చుచున్నవి. [illegible] రాదుట కొంత కష్టముగా [illegible]. [illegible] గాలికి గాని లోటు లేదు. లోపల నున్నవారికి అవసరమగుచో [illegible] అంత [illegible] నిర్దేశింపబడినవి. తాను జీవించియున్నది లేనిది [illegible] నవి యుపయోగింపగలవు.

[illegible] ఏదైన శబ్దము వచ్చునేమో యని [illegible] ఆలకింపసాగెను. శబ్దము లేదు. [illegible] ప్రతి కార్యమునందును అతని యల్లుడగు నాగదేవనాయ [illegible] మహాదేవరాజు మధ్య మధ్య కోపముతో పండ్లు [illegible].

[illegible] ప్రొద్దుపోవుచున్నది. వారి దేహములన్నియు నలసట చెందియున్నవి. నిద్రాభారము ఎక్కువగుచున్నది. అక్కడ నున్నవారిలో పలువురు గోడలకు జేరగిలబడి [illegible]సాగిరి. ఆ కునుకుపాటులో ఒక్కొక్కసారి నీటిలోనికి జారిపోయి [illegible], తడిసిపోయి దీనావస్థలో మరల లేచుచున్నారు. కాని [illegible] నిద్రించుట లేదు.

[illegible] లైనట్లున్నది. అప్పుడు వారి కేదో [illegible] శబ్దము [illegible] వారికి వినవచ్చెను. అది యంతకంత కెక్కువ యయ్యెను. పైన [illegible] జరుగుచుండవలె! శ్రీరుద్రదేవమహారాజుల సేనలకు జయ [illegible] పాతాళగృహములోని నాయకులు మహాదేవుని ప్రార్థించుచుండిరి. కాని శ్రీరుద్రదేవమహారాజుల పక్షమున పోరుటకు పెద్ద సేనలు నగరములో లేవు. రేచర్లవారి బలము లున్నవి. వారు రాజభక్తి కలవారైనచో నీ పాతాళగృహములో [illegible]. [illegible] వారిపై నాధారపడుట సాధ్యము కాదు. పూర్వము గణపతిదేవులు దేవగిరి చెరసాలలో నుండగా కాకతీయసామ్రాజ్యమును రక్షించి [illegible]రాజ్యభారధౌరేయుడని ప్రసిద్ధివహించిన రేచర్ల రుద్రసేనానివంశమున పుట్టి రాజద్రోహు లిప్పు డుదయించినారు!

అంతకంతకు యుద్ధము భయంకరమైన ట్లున్నది. ఆ ప్రదేశమునందు [illegible]లాడు నొక శబ్దము తప్ప మరియేమియూ రాలేదు.

అంతలో తాము ఇందులో పడకముందు ఉన్న గదిలో పలువురి యడుగుల చప్పుడు వినవచ్చినది. ఎవరో సత్వరమున ద్వారము తీసినారు. లోపలి [illegible] యా వ్యక్తి తమతో పాటు పడిపోయినది. అట్లు పడిపోవుచు [illegible] ఆర్తస్వర మొనర్చెను "అయ్యో, అన్నా—!" అది యొక స్త్రీకంఠముగా మేచయకు భాసించెను. పూర్వపరిచితమగు కంఠమువలె కూడ నాతనికి తోచెను. ఎవరో యనుచు నుద్ధరించుటకు దగ్గరకు పోయెను. అది యొక బాలవీరుడు!

మేచయ దగ్గరకు రాగానే ఆ బాలవీరునికి అపరిమితమగు భయము [illegible]. ఆకస్మికముగా నట్లు తాము కూపములో పడిపోవుట, అచ్చట తిన్నగా [illegible] ఎవరికి భయము కలిగింపదు! అట్లు తనకు [illegible] చాలా! భూతప్రేతపిశాచములు ఉన్నవని మేము నమ్మము [illegible] వారే, ఒంటరిపాటున చిత్రధ్వనులు విన్న నది యేమో దయ్యమని [illegible]. మరి యిక వాని యునికి విశ్వసించువారి కెట్లుండును?

అంతలో నింకను కొందరు లోపలికి పడిపోయినారు. [illegible] ఒక వ్యక్తి వారల నా ద్వారమున బోవద్దని వారించుచుండెను. [illegible] టికి పైన దివిటీలు కానవచ్చెను.

మేచయకు తా నుద్ధరింపబడితిమని ధైర్యము కలిగినది. [illegible] ప్రయత్నించిన విధముగా నొకరిపై నొకరిని నిలువబెట్టి [illegible] మేచయనాయకుడు ఆ తెరచిన ద్వారబంధమునకు లంఘించి [illegible].

అచ్చట నాతనికి ఎదురుగా అన్నమంత్రీశ్వరుడు ప్రత్యక్షమయ్యెను. కవచగాత్రుడైన యా మంత్రీశ్వరుడు శిరస్త్రాణము పైకెత్తి [illegible] తెలిసికొన దివిటీవెలుగున ప్రయత్నించుచుండెను. వచ్చుచున్న మేచయ నాతనికి చేయూత యిచ్చి యుద్ధరించెను.

మేచయ నిర్ఘాంతపోయెను. తనచే బంధితుడైన యన్నమంత్రి యిక్కడ నుండు టేమి? అతడేమి చేయుచున్నాడు? రాజద్రోహుల నాయకుడు [illegible]? [illegible] మేచయనాయకుడు వెంటనే పోరుకు తలపడియుండును. మహామంత్రీశ్వరుడగు అన్నమంత్రి తేజస్సు మేచయనుగూడ ముగ్ధునిజేసెను. అన్నమంత్రి శాంతముగా ప్రశ్నించెను.

"మరి ఎవరున్నారు లోపల?"

మేచయసందేహము ఒక్క క్షణమాత్రమే! మరుసటి క్షణమున నాతడు చెప్పివేసెను. నీళ్లలో దాగియున్న మేచయకు వెంటనే ఉపచారములు చేయ భటుల కాజ్ఞాపించి అన్నమంత్రి మిగిలినవారి నుద్ధరించుటకు ప్రయత్నములు

చేసెను. భటుల యుత్తరీయములును ఉష్ణీషములును ముడివేసి వెంటనే త్రాడుగా చేసి బలశాలురగు భటులు పట్టుకొని లోపలికి దింపిరి. దాని సహాయముతో నొక్కొ రొక్కరే పైకి వచ్చిరి.

ముందు పైకి వచ్చినది బాలవీరుడు! క్రిందివారును పైవారును ఎంత యర్థించినను లోపల నున్నవా రెల్ల నుదరింపబడునంతవరకు మహాదేవరాజు పైకి రాలేదు. అందరు పైకి వెళ్లిరని నిశ్చయింపబడినతర్వాత అతడును పైకి వచ్చెను.

మహాదేవరాజునకు సంతోషముకంటె సిగ్గు ఎక్కువగా నున్నది. అది దివిటీవెలుగున నుపలక్షించిన యన్నమంత్రీశ్వరుడు తన రెండు బాహువులు కైదండ యిచ్చి యాదరముతో పైకెత్తెను.

సంతోషము పట్టలేక మహాదేవరాజు, "నీవటయ్యా, అన్నమంత్రీశ్వరా?" అనుచు నాతని గాఢముగా నాలింగనము చేసికొనెను. మహాదేవరాజు సురక్షితముగా నున్నందుకు అన్నమంత్రికి ఆనందబాష్పములు కారెను.

అంతట నందరనాయకులకును తానే ప్రభువైనట్లు అన్నమంత్రి సాదరముగా నాజ్ఞలు అందజేసెను.

"మీ కందరికి తీరని పని యున్నది. కాని యింత యలసటలో ఇప్పు డేమియు జేయలేరు. మీరు వెంటనే భటుల సహాయముతో మీగృహముల కేగి విశ్రమించి జాము ప్రొద్దెక్కునప్పటికి స్వయంభూదేవాలయమున నన్ను గలసికొనుడు! ఇప్పుడు నాకు తీరని పనియున్నది. మంచిది!"

మంత్రముగ్ధులవలె నందరు నిర్ణీతులైన భటుల రక్షణతో తమ తమ గృహముల కేగిరి.

* * * *

మరి యిది యంతయు నెట్లు జరిగినది?

ఆ రాత్రి అన్నమంత్రీశ్వరుడు స్వయంభూదేవాలయమున తిక్కనసోమయాజుల సెలవు తీసికొని నూతనబ్రాహ్మణవీరులతోడను శైవవీరులతోడను జైనవసతిపైకి కదలెనుగదా! వారి నక్కడ నొక సేన యెదిరించెను గదా! ఆ యెదిరించిన సేన కధిపతులు రేచర్ల కామయ, నామయ, మల్లయ, గణపిరెడ్డి, మల్లిరెడ్డి! రేచర్లరుద్రసేనానివంశజు లగు వారిని చూచినంతనే ఒక్కక్షణకాలము అన్నమంత్రికి చేతులు కాళ్లాడలేదు. మహాసభాసమయమున శ్రీరుద్రదేవమహారాజుల పట్టాభిషేకము నిషేధించి హరిహరదేవుని నభిషేకింపుడని వాదించుటతో వీ రంగతేరు! వెంటనే తన సేనను అన్నమంత్రి వారితో పోరుట కాజ్ఞ యిచ్చెను.

ఇట్టి యుద్ధములకు పూర్వశిక్షితమైనది కాదాతని వెంటనున్న సేన! కాని యన్నమంత్రి తమకు నాయకుడుగా నుండుటయే దానికి మహాసాహసము

చేకూర్చెను. జైన వసదిని చుట్టియున్న సేనయు మిక్కిలి పెద్దది కాదు. ఇంత యాకస్మికముగా నిందఱు వసదిపై నెత్తివత్తురని రేచర్ల వా రూహించియుండలేదు.

శైవవీరుల మొదటితాకే వసదిని చుట్టియున్న సేనలను చీకాకుపరచెను. అదియు నొక గాలివానతాకువలెనే యుండెను. చిట్టడవిని మహాప్రవాహము వలెనే, ఆ సేన వసదిని ముంచివేసెను. గడియ కాకయుండ రేచర్ల కామిరెడ్డియు నామిరెడ్డియు గణపిరెడ్డియు హతులైరి; మల్లయరెడ్డి మల్రెడ్డి గాయపడి పట్టుబడిరి. వసది అన్నమంత్రివశ మయ్యెను.

వీరావేశముతో శైవవీరులు వసదిని త్రవ్వివేయ ప్రారంభించిరి. కొన్ని ప్రక్కల దానికి వారు నిప్పు ముట్టించిరి. అన్నమంత్రీశ్వరుడు అతికష్టముమీద వారి యావేశమును మాన్పి యాయగ్ని చల్లార్పజేసెను.

"వసదిలో నగరనాయకు లున్నారని యైన మీరు మఱచరాదు!" అంత స్పష్టముగా ప్రకటించువరకు నా శైవవీరులు ఆగలేదు.

అన్నమంత్రి యంతట వసదినంతయు వెదకించెను. అందులో నొక్క జైన సాధువుకూడ కనపడలేదు. నూతనముగా ప్రతిష్ఠితమైన నేమినాథవిగ్రహమునకు వెనకనున్న చిన్న గదిలో, వసదికి నామమాత్రము అధిపతి యగు సిద్ధనంద్యాచార్యులు ప్రాణమాత్రావశిష్టుడై పడియుండెను. అతని నోట గుడ్డలు క్రుక్కబడియున్నవి. కొన్నిదినములుగా నతడు భోజనము చేసినట్లే లేదు. అతని రక్షించుటకు తనతో వచ్చిన బాలవీరులలో చిన్నవాని నప్పగించి, రెండవవానితో నగరనాయకుల నన్వేషించుచు అన్నమంత్రి బయలువెడలెను.

ఒక ప్రక్కను వారు వసదికరణశాలను జూచిరి. కొద్దిసేపటివరకును అక్కడ కరణములు వ్రాయుచుండిన చిహ్నములు కనబడినవి. కాని కరణములు లేరు. వారు వెళ్ళిపోవుచు కొన్ని పత్రములు ఒకమూల ప్రోవుచేసి అగ్ని ముట్టించిన ట్లున్నది. ఆ యగ్ని ఇంకను రాజుకొనుచునే యున్నది. దానిని వెంటనే ఆర్పించి ఆ గదికి బ్రాహ్మణవీరులను కాపుపెట్టి అన్నమంత్రి త్వరితగతిని రెండవ బాలవీరునితో నాయకులకై వెదకుచు వసది గాలింపసాగెను.

నేమినాథవిగ్రహమునకు దక్షిణమున నున్నగది వారు ప్రవేశించిరి. అందుండిపాతాళగృహమునకు బోవు ద్వారము నుపలక్షించి, యా బాలవీరుడు గొళ్ళెము తీసి దూర మాలోచింపక ముందుకు అడుగువేసి పడిపోయెను.

* * * *

బాలవీరుడు చేసిన యుపచారములతో సిద్ధనంద్యాచార్యుడు కొంచెము తేరికొనెను. వసదిపాకశాలనుండి గోక్షీరములు తెప్పించి సిద్ధనంద్యాచార్యులకు అతడు త్రావించెను. కొంచెము ఓపిక రాగానే సిద్ధనంద్యాచార్యులు "ఎక్కడ

నుంటిని?" అని యడిగెను. బాలవీరుడు శాంతముగా "వసదిలోనే ఉన్నారు. ఆ దుష్టులందరు పారిపోయినారు" అనెను.

సిద్ధవంద్యాచార్యులు నిట్టూర్చెను.

*　　*　　*　　*

జైనవసది లేమ వశమైనతర్వాత, శైవవీరులకు దానిని నేలమట్టము చేయకుండ పట్టుట సాధ్యము కాకుండెను. వారి సంప్రదాయమున జైనవసదుల విటతాట మొనరించుట యొక పుణ్యకార్యము! పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో శైవభక్తులు ఎన్ని జైనవసదులను ద్రచ్చి ద్రయ్యలు చేసినట్లు వర్ణింప లేదు? ప్రాచీన శివభక్తులను తాము అనుకరింపవలెనని వారును ఉద్రూత లూగుటలో నాశ్చర్య మేమి? కాని అన్నమంత్రీశ్వరుని యాజ్ఞలను ఆనకట్టకు వారు విధిలేక కట్టువడిపోవలసినవా రైరి.

౫౦

ఏకశిలానగరమున మహాశివరాత్రినాడు ఎన్నియో చోట్ల అలజడులు రేగినవి.

పలువురు తండ్రములు తండములుగా నగరములోని వ్యవహారశాలలపై దాడులు సలిపిరి. అక్కడక్కడ కాపున్న యల్పసంఖ్యాకులను భటులు ఆ దాడుల ప్రయత్నముపై నరికట్టిరి.

ఒక తండము అన్నమంత్రిభవనమును ముట్టడించెను. కాని యక్కడి గృహ నాయకుడును మారనయు పరివారము నంతటిని సిద్ధముచేసికొని యుండుటచే వచ్చినవారు విచ్చిపోయిరి.

రాజమందిరముచుట్టును కావలి కాయుచున్న స్వామిభక్తిగల రాజభటులు జాగరూకులై వారిని పారద్రోలిరి.

ఒక తండము వేశ్యవాటికవైపు పోయి, యందుగల నాగసానిభవనములోనికి జొరబారి విలువగల వస్తువులను ఛిన్నముచేయుటకు ప్రయత్నములు సాగించిరి. సకాలమున వచ్చుటకు గోవిందశర్మ తన నూర్గురు బ్రాహ్మణయువకులతో వచ్చి యా మూకలను పారద్రోలెను.

గోవిందశర్మ అన్నమంత్రి యాజ్ఞచొప్పున తన భటులతో ద్యూతశాలలకు పోయెను గాని యా ద్యూతశాలలో నెవ్వరు లేరు. ఆపిమ్మట వారు మాచల్దేవిభవనమువైపు వెళ్ళియుందురని యూహించి యచటకు వెళ్ళెను గాని వారెవ్వరు నక్కడ లేరు. ఐనను మాచల్దేవియిల్లు దోచుకొనుచున్న పురజనవర్గపు మూకను మాత్రము పారద్రోలగలిగెను.

ఆతడంతట జూదగులకై పట్టణమున నలజడి జరుగుచున్నచోటుల నెల్ల వెదకెను. కాని కనపడలేదు.

తుదకు క్రీడాశైలమునొద్ద పెద్దమూక చేరినదని విని యాతడచ్చటికి బోయెను. అప్పటికే ఆ మూక యక్కడి భటులను నిర్జించి క్రీడాశైల మెక్కుచుండెను. ఆ యెక్కువారును క్రీడాశైలశిఖరమునకు పెద్ద మోపులతో గడ్డి చొప్ప నెత్తి చేదారము చేర్చుచుండిరి. అది చూచి గోవిందశర్మకు ముందు చిత్రమనిపించెను. వీరి యుద్దేశమేమి?

అంతలో లోకానుభవముగల యా యువకవికి మెరపు మెరసినట్లును కవితావేశమువలెను స్ఫురించినది.

“దూరమున నున్నవారి కెవరికో వీరు సంజ్ఞతో వార్త నంపబూనుకొన్నారు!”

వెంటనే గోవిందశర్మ తనతోనున్న వీరులతో క్రీడాపర్వతముపై కధిరోహించి యక్కడ నున్నవారితో తలపడెను. వారిలో ద్యూతశాలలో తాను చూచినవా రున్నారు. ఆ లోపలినుండి వచ్చిన జైనసాధు వేషధారియు నున్నాడు!

ఉభయులకును పోరు సాగుచున్నది. పై శిఖరభాగమున చేర్చిన చెత్తకు ఆ వేషధారి స్వయముగా నిప్పు అంటించినాడు. శర్మ ఎన్నడు మున్ను వినియుండని వాక్యములు ఏదో భాషలో నుచ్చరించుచు, నా వేషధారి యా చెత్తచుట్టును తిరుగుచు చుట్టును నిప్పు అంటించుచున్నాడు. ఆ చెత్తయు రగుల్కొని మండసాగినది.

ఆ శిఖరమునకు పోయినవారు వచ్చిన మార్గమునగాని వెనుదిరిగి రాలేరు. అవల కొండచరియ యున్నగా నిట్టనిలువున నున్నది. మనుష్యమాత్రుడు పడిపోయి ప్రాణములతో నుండలేడు. సరాసరి పోయి ఎంతో దిగువ నున్న స్వయంభూనగరములో పడిపోదురు! అందుచే పై నున్నవారు గోవిందశర్మతో వచ్చిన వీరులతో పోరాడక తప్పలేదు. కాని వారందరు నిశ్శేషముగా ఖండింపబడిరి. వేషధారిమాత్రము శిఖరాగ్రమునుండి రెండు మూడు తాళ్ల ప్రమాణమున క్రింద నున్న స్వయంభూనగరములోనికి [illegible] దూకి యదృశ్యుడయ్యెను.

గోవిందశర్మ ఎంత ప్రయత్నించినను ఆ మండెడు మంట లార్పింపలేక పోయెను. ఆ పైన చిన్న కొండచరియలోనున్న యూటకును తప్ప వేరు నీరులేదు. ఆ ఊటనుండి తోడి పోయించినను మంటలు చల్లారలేదు. తెల్లవారువరకు ఆ యేకశిలాశిఖరాగ్రము పై మండుచుండెను. దూరమున రెండు మూడు యోజనముల వరకు నది కనబడుచు ఏకశిలానగరమే మండి దగ్ధమై పోవుచున్నదను భావము కలిగింపసాగెను.

* * * *

వసతినుండి స్వయంభూదేవాలయగోపురమునకు వచ్చుచుండిన అన్నమంత్రి యిది గమనించెను. కాని ఏమి చేయగలడు?

అన్నమంత్రి ఇప్పు డెక్కడికి కేగవలెను? ఒక్క క్షణకాలము మాత్ర మాలోచించెను. అతనికి స్వగృహమునకు పోవ నిచ్ఛ కలుగలేదు; సరాసరి తా నిన్నాళ్ళున్న చెరసాలకే తిరిగి పోయెను.

తెల్లవారబోవుచున్నది. అన్నమంత్రి స్నానసంధ్యాదికము లాచరించెను. క్రిందటి దినమంతయు నాత డుపవసించి యుండెను. రాత్రియంతయు జాగరణము చేసి బడలియుండెను. ఏమైన భుజింపవలెనను నిచ్ఛ జనించినది. కాని నేడమావాస్య. అమావాస్యాంగము లను పితృకర్మ లాచరింపనిది తా నేమియు భుజింపరాదు.

జాము ప్రొద్దెక్కు వేళ పూర్వనిర్ణీతవిధమున స్వయంభూదేవాలయము ప్రాంగణమున నాయకుల నందరను కలసికొనెను. సాంకేతికమాటలతో రాత్రి జరిగిన విషయములు వారల కాతడు వివరించెను. క్రొత్తగా వచ్చిన వార్తలు ఆలకించెను. ఏకశిలపై ఆ వేసిన మంట ఎవరికో సంకేతము! ఎవరికి? ఎవరికైనను కోట సర్వవిఘ్నముల రక్షించుటకు పూనుకొనవలెను. విశ్వాసపాత్రులనువారిని నిర్ధారణచేసి వారికి పను లప్పగింపవలెను!

అన్నిటికంటె ముందు శ్రీరుద్రదేవమహారాజుల క్షేమవార్తలు తెలిసికొనవలెను! వెంటనే తిక్కన సమూపతిని గోనగన్నారెడ్డిని తమ మహాసైన్యములతో అతిశీఘ్రప్రయాణముల వెనుదిరిగి ఏకశిలానగరము చేరుకొనునట్లు చేయవలెను.

అంబదేవునిగూడ సాధ్యమైనంత సేనతో ఏకశిలానగరమునకు రమ్మని వార్తలు సాగ వలెను! ఆ సభలో ఏకవాక్యతయేగాని రెండవమాట లేదు.

ఆ సభయైనవెంటనే అన్నమంత్రి తన బంధనశాలకు పోయి అమావాస్యాంగ కర్మకలాపములు కావించుకొని భుజించెను. భోజనమునప్పటికి, తిక్కనసోమ యాజుల యాజ్ఞచే నాతని యాశ్వికభటు డగు బవిరినీడు, అన్నమంత్రీశ్వరుల కాంభోజాశ్వమును దెచ్చెను. దాని నెక్కి యన్నమంత్రి ఏకశిలానగరమం దెల్లెడ సంచరించెను. అత డట్లు వాహ్యాళికై సంచరింపలేదు!

అతడు వెళ్లుచున్న ప్రదేశమంతయు నాతని మనస్సులో నచ్చొత్తినట్లు చిత్రిత మొనర్చుకొనుచుండెను. శిలాప్రాకార మే స్థితిలో నున్నది? పుట్టకోట ఎట్లున్నది? ఎట్టివా రెక్కడ నున్నారు? దానితోపాటు లతని తలలో లెక్కలును సాగిపోవుచుండెను. ఈ కోటరక్షణకు ఎందరు భటులు కావలెను? ఎట్టి భటులు కావలెను? అతడు మరల నిజబంధనశాలకు వచ్చునప్పుడు ఉత్సాహముగా లేడు!

మం దాతడు విపరీతముగా నాహారపదార్థములు రాజమందిరమునకు చేర్పించి, యందలి జలాశయము లన్నియు నింపునట్లుచేసెను. పుట్టకోటను కాపాడగల సేనలు ప్రస్తుతము లేవు. శిలాప్రాకారము పూర్తి కాలేదు. రాజ ప్రాసాదముచుట్టును పూర్తిగా కట్టబడియున్న యున్నత మగు ప్రాకారమే ప్రధాన మగు శరణ్యప్రదేశముగా నాతనికి పొడకట్టెను. అక్కడనే మహాసేనలు వచ్చువరకు శత్రుసేనలు నిలువరించుట సాధ్యపడవచ్చును! ఇంతలో కొంత సేనను ప్రోవుచేయవలెను!

అదృష్టవశమున మూడవనాటికి శ్రీ రుద్రదేవమహారాజులు సురక్షితముగా పాకాలస్కంధావారము చేరి రను వార్త వచ్చినది!

* * * *

శ్రీవీరభద్రేశ్వరులను గాయపరచి శ్రీరుద్రదేవమహారాజులు గుర్తించిన సమయమున, నక్కడికి వచ్చిన యాశ్వికులు పాకాలనుండి సాయమువచ్చుచున్న సైనికులు. వారు శ్రీరుద్రదేవమహారాజుల యాజ్ఞచే వీరభద్రేశ్వరుని భద్రముగా చికిత్సకై వైద్యుల యొద్దకు పాకాల చేర్చిరి.

ఆ యాశ్వికులు శ్రీరుద్రదేవమహారాజుల నా స్థితిలో చూచుటచే ఉద్వేగమును ఆనందమును పొంది పాకాలకు దయచేయ వేడిరి. కాని మహారాజు లందు కంగీకరింపక ఆ యాశ్వికసేనను తీసికొని, తాను వచ్చినదారిన వెనుకకు ప్రయాణమయ్యెను. ముందు వారికి మనుమసిద్ధియు పర్వతనాయకు డును కనబడిరి. ఆ తొమ్మిదిమందిలో జీవించియున్నవారు వారిద్దరే. వారును మిక్కిలి గాయపడి బాధపడుచుండిరి. వెంటనే రుద్రమ వారి కుపచారములు చేయించి వైద్యులయొద్దకు చికిత్సకు చేర్పించెను.

మరికొంతదూరము పోగా ముందు తన్ను వెన్నాడివచ్చిన యాశ్వికుల నెదిరించిన పదిమంది యాశ్వికుల శవములును కనిపించినవి. శ్రీరుద్రదేవమహారాజులు భక్తితో వారికి తర్పణ మొనర్చి, వారి శవములకు విధివిధానమున సంస్కారము లొనర్చ నాజ్ఞ లిచ్చెను.

అంత మరియు వెనుకకు బోయి అశ్వికులను ధైర్యసాహసములతో తన పదాతులెదిరించిన ప్రదేశము చేరికొనెను. వారిలో పలువురు వీరశయ్యలలంకరించిరి. కాని నూరుమందిమాత్రము గాయపడియు ప్రాణములతో నున్నారు. వారి కందరకు నుపచారములకును వైద్యమునకును ఏర్పాట్లు చేసి, మరల నా యాశ్వికులతో తన్ను వెంటాడిన యాశ్వికదళమును కనిపెట్టి వెంటాడి పోరుట కుద్యమించెను. కాని వారు కనబడలేదు. వారి జాడయే లేదు!

ఎంత ప్రయత్నించినను ఆ శత్రుసేన హరించిన తన యైదు కరులును పంచశబ్దములును శ్రీరుద్రదేవమహారాజులకు తిరిగి లభింపలేదు!

తుదకు నిరాశచేసికొని యా రాత్రికి మహారాజు పాకాల చేరికొని విశ్రమించి ఏకశిలానగరమునకు వార్త లంపెను.

అక్కడినుండి శ్రీ రుద్రదేవమహారాజు లామరునాటి యుదయముననే బయలుదేరి రాత్రికి ఏకశిలానగరము చేరికొనిరి.

మహారాజులు విజయయాత్ర చేసి తిరిగి వచ్చియుండుటచే మహోత్సవము చేయవలసియుండెను. కాని యట్టి దేదియు జరుగలేదు. శ్రీరుద్రదేవమహారాజులను మరల చూడగలిగినందుకు నాయకులందరును ఆనందపరవశులై యుండిరి. కాని వారిపై నిప్పుడు విశేషభారము పడినది! ఏకశిలానగరమును, గణపతిదేవులను ప్రతాపరుద్రకుమారులనే కాక శ్రీరుద్రదేవమహారాజులను కూడ రానున్న యాపదనుండి రక్షించుకొనవలసిన భారము వారిపై నిప్పుడున్నది. దేవగిరియాదవసేనలు సమీపించిన వార్త యిప్పుడు రహస్యము కాదు. అది యందరికిని తెలిసిపోయినది!

అంతఃపురములోనికి వెళ్లి శ్రీరుద్రదేవమహారాజులు ముందు గణపతిదేవుల దర్శించి మ్రొక్కి నిజమందిరము చేరిరి. కామసాని వచ్చి దృష్టి తీసినది. కుబ్జ ప్రతాపరుద్రకుమారులను తీసికొనివచ్చినది. ముమ్మడంబ వచ్చి నమస్కరించినది. మహాదేవరాజు వందన మాచరించెను.

రుయ్యమ్మమాత్రము రాలేదు! తాను ప్రతినిధిగా నుంచిపోయిన రుయ్యమ్మ రుద్రమకు కనిపించనేలేదు! చిత్రము! అస్వస్థతగా ఉన్నదా? ఎవరును ఏమియు చెప్పలేదు. అడుగుటకు రుద్రమ సాహసింపలేదు!

ఈమధ్యలో జరిగిన సంగతు లన్నియు మననచేసికొనుచు, నా రాత్రి రుద్రమ్మకు ప్రొద్దుపోవువరకు నిద్దురపట్టలేదు. నిద్రించి యారుగడియలైన గాలేదు!

అంతలో దూరమున భయంకరముగా తప్పెట్ల మ్రోత వినవచ్చినది. అది పూర్వము రుయ్యమ్మ వినిన ఉత్సవాంగమగు తప్పెట్ల జుక జుంజుం మ్రోత కాదు! ఇవి రణతప్పెట్లు! రణభేరులు!

తెల్లవారి చూచునప్పటికి దేవగిరి యాదవసేనలలో నగ్రదళములు ఏకశిలానగర ప్రాకారమును దరిసి పురావరోధనమునకు ననుకూల మగు స్థానములు నిర్ణయించుకొనుచుండెను! వెనుకనుండి సేనాప్రవాహమే వచ్చుచున్నది!

"రేరే ఘూర్జర జర్జరోసి సమరే, లంపాక కిం కంపసే?
వంగ త్వంగసి కిం ముధా? బలరజః కాణోఽసి కిం కోంకణ
ప్రాణత్రాణపరాయణో భవ మహారాష్ట్ర పరాష్ట్రోన్నతిః
యోద్ధారో వయ మిత్యరీన్ ప్రభవం త్వం ప్రతాపరుద్రనృపః"

ప్రతాపరుద్రీయము.

దేవగిరియాదవులే తమ్ము మహారాష్ట్రుల మని చెప్పుకొనుచుందురు. మహారాష్ట్రములో నొక భాగమువారు దేవగిరియాదవులు. యాదవసైన్యములు ఏకశిలానగరమును ముట్టడించునని ముందుగనే అన్నమంత్రికి తెలిసియుండెను. అతడు పుట్టకోట చుట్టునున్న కందకము నీటితో నింపియుంచెను; ప్రాకారము నొద్దనెల్లను యథాశక్తిగా రక్షకభటుల నాపుంచెను. కాని పుట్టకోటను దీర్ఘకాలము రక్షించుట సాధ్యము కాదు!

పుట్టకోటగోడ నిడివి నలువైపుల గలసి రమారమి రెండు క్రోశములు కలదు. కోట రక్షించుటకు శిక్షితులైన భటులు ఐదువేలమందికంటె లేరు. వారికి సహాయముగా క్రొత్తగా ఆయుధసాధనమాత్ర మభ్యసించిన యారువేలమంది గ్రామీణులు తోడు కాగలరు. కాని వా రెంతమాత్రము పోరాడగలరో? రక్తమాంసములతో బీభత్సముగా నుండు రణరంగమునకు వారు అలవాటు పడియుందురో, లేరో? వారు గాక ఏడెనిమిదివేలమంది వీరశైవులు ఇష్టపూర్వకముగా యుద్ధమునకు అంగీకరించినారు. కాని వారు పలువురు కోట నిర్మించుటకు వచ్చినవారు. వారు గునపములు, పారలు, ఉలులు, బాడిసెలు, గొడ్డళ్లు, సుత్తెలు పట్టుటలో నేర్పు కలవారు గాని, రణసాధనములకు వారు క్రొత్తవారు. మరియును వారలు [illegible]! ఆయుధములు సక్రమముగా సుశిక్షితముగా పాలించు నభ్యాసము వారికను అలవడవలసి యున్నది. ఇట్టి సేనతో సుశిక్షితములగు మహారాష్ట్రసేనల నెదిరించు టెట్లు? మహారాష్ట్రసేన మూడు లక్షలకు తక్కువ లేదు. దానిని నడుపుచు యాదవప్రభు వగు మహాదేవుడే స్వయముగా వచ్చియున్నాడు. ఎంత నిబ్బరము లేనిచో అతడు స్వయముగా వచ్చును?

పుట్టకోటను రక్షించుటలో మరియొక ప్రమాదముకూడ గలదు. పుట్టకోటకును లోచుచున్న రాతికోటకును మధ్యనే జైనుల నివాసము లున్నవి. అచ్చటనే విదేశీయు లగు కర్ణాటులయు యవనులయు మహారాష్ట్రులయు కళింగులయు నివాసములును ఉన్నవి. అట్టి సందేహాస్పదులను వెనుక నుంచుకొని కోటగోడలు రక్షింప బూను కొనుట ఎంత అపాయకరమగు పని?

ఐనను అన్నమంత్రి యిట్లు నిశ్చయించెను. సుశిక్షితమైన సేనలు పుట్టకోటను ముందు రక్షింపబూనుకొనవలెను. సందులు గలిగి యసంపూర్ణముగా నున్న శిలాప్రాకారము, నెట్లో సందులు పూడ్చి, వీరశైవయోధులు రక్షింప దొరకొనవలెను.

రాజప్రాసాదముచుట్టు నున్న శిలాప్రాకారమును బ్రాహ్మణయోధులు కాపాడవలెను. పుట్టకోట యాగనప్పుడు దాని వదలి యచ్చటి భటులు శిలాప్రాకారము చేరికొనవలెను. అదియు సాధ్యము కానప్పుడు వారును వీరశైవభటులును గలసి రాజప్రాసాదము చేరికొనవలెను. ఇట్లు రాజప్రాసాద మైనను నెలరోజులపాటు రక్షింపబడినచో భయము లేదు. అప్పటికి తమ సేనల సహాయము తప్పక చేకూరును. కాని యిన్నాళ్లు ఈ కోట నిలుచుట కష్టసాధ్యము! అని అన్నమంత్రి కున్న శంక!

మహారాష్ట్రసేనలు ఒక్కనాడు మాత్రము స్థావరము లేర్పాటు చేసికొనుచు పోరుకు దిగకుండెను. కాని మరునాటి యుదయమున చీకటి యుండగనే, వారు కోట పట్టుకొనుటకు తలపడిరి. కోటగోడలపై భటులు పలుచపలుచగా నుండుట వారు నిర్లక్షించిరి. దానితో వారికి వచ్చిన వార్తలు ధ్రువపడెను. మొదటినాటి సాయంత్రమునకు వారు పలుచోట్ల కందకము పూడ్చివేసి కోటగోడలు దరియుటకు దారులు చేసికొనిరి. మరునాడు తెల్లవారునప్పటికి వా రా దారులు దృఢపరచిరి.

నాగదేవనాయకుడును ప్రసాదాదిత్యనాయకుడును దనకు సహాయముగా, అన్నమంత్రి స్వయముగా కోటగోడలను పరీక్షించుచు శత్రుసేనల శక్తిసామర్థ్యముల నుపలక్షించుచుండెను. అన్నమంత్రి రెండు స్పష్టులతో నగ తిలకించుచుండెను. ప్రస్తుతము వారి నాపుటెట్లు? ముందు తగినంత బలము వచ్చినప్పుడు, వారిని నిర్జించుటెట్లు? అన్నమంత్రికి బాలవీరు లిద్దరును పార్శ్వరక్షకులుగా నుండి యాతని సతతము ననుసరించుచుండిరి.

ఐదవనాటికి పుట్టకోట రక్షించుట సాధ్యము కాదని ధ్రువపడెను. ఆ రాత్రి పుట్టకోటగోడలపై నన్నమంత్రి యాజ్ఞానుసారముగా నార్భాట మెక్కువగా భటులు చేయసాగిరి. ఇది యేమని శంకించి మహారాష్ట్రులు వెనుకనుండి యెక్కువ సేనలు వచ్చువరకు గోడలపై నెక్కుటకు సాహసింపలేదు! ఆ వ్యవధిలో చీకటినుండగనే ఆంధ్రసేనలు పుట్టకోట వదలి శిలాప్రాకారము వెనుకకు చేరికొని వీరశైవభటులను గలసెను.

ఇంత యాకస్మికముగా నంధ్రసేనలు పుట్టకోట విడిచిపోవుట మహారాష్ట్రసేనల కాశ్చర్య మయ్యెను. ఇందులో నేదో మర్మమున్నదని శంకించి వారు వెంటనే గోడలపై నెక్కి యాక్రమింప సాహసింపలేదు. అట్లు వారికి హస్తగతము లైన పుట్టకోటగోడలను రెండు దినములవరకు వా రాక్రమించుకొనలేదు. ఎక్కడనే గోతులు త్రవ్విరో యని బహుజాగరూకులై వారు ముందుకు సాగిరి.

పుట్టకోటకును శిలాప్రాకారమునకును మధ్య నున్న ప్రదేశము నవగతము చేసికొని యందులో పోరున కనువుగ తమ సేనల స్థాపించుటకు మహారాష్ట్రులకు మరి రెండురోజులు పట్టెను. ఆ పిమ్మట నూతనోత్సాహముతో వారలా యసంపూర్ణ మగు శిలాప్రాకారమును ముట్టడించిరి.

ఈ శిలాప్రాకారములో సందు లున్నవి. ఆ సందులలో నిలిపిన యడ్డంకులు దృఢమైనవి కావు. ప్రాకారమే కొన్నియెడల పైకి లేవలేదు. అట్టియెడల దాని నెత్తుగా చేయుట కుపయోగించిన సాధనములును గట్టివి కావు. అయిన నేమి? ఈ

శిలాప్రాకార మున్నంతవరకు దుర్భేద్యమైనది. [illegible] దీనిని రక్షించుచున్న సైనికుల సంఖ్య ఎక్కువ. [illegible] యావేశము దుర్భరముగా నున్నది. సామాన్యసేనలకు [illegible] రణోత్సాహ ముండదు.

ఆంధ్రభటులు కోటగోడలపై నుంచి నుది [illegible] యాదవవీరుల పలువుర గూల్చుచుండిరి. [illegible] వీరులు శిలావర్షము కురిపించుచుండిరి. అట్లు వర్షించుటకు [illegible] ప్రాకారము పూర్తి చేయుటకు సిద్ధపరచియున్న శిలలన్నియు [illegible] పడవేయుట కనువుగా నున్నవి. [illegible] యాదవులు తమ గజబలమును ప్రయోగించుచుండిరి. [illegible] నుండి సలసల కాచిన జలమును నూనెయు వీరులు పోసి [illegible]

శిలాప్రాకారము నొద్ద పోరులో నొక క్రొత్త [illegible] యొద్ద పోరు సాగుచుండగనే రెండు ప్రాకారముల మధ్య [illegible] నను జైనులలోనను కలవరము ప్రారంభమయ్యెను. [illegible] యొక మహాప్రవాహమునే అనుకరించుచుండెను. జైనుల [illegible] నాడు అన్నమంత్రి పట్టుకొనినపు డక్కడ సిద్ధనంద్యాచార్యులు [illegible] రను లేకుండిరి గదా! ఆ మరునాడే సిద్ధనంద్యాచార్యులను [illegible] రాజప్రాసాదమునకు దీసికొనిపోయి యుండిరి. పుట్టకోట [illegible] రాజభటులు అన్నమంత్రి యాజ్ఞలతో వసదివ్యవహారశాలలలో [illegible] మిగిలిన పత్రములను రాజభవనమునకు చేర్పించి కార్యభారణు [illegible] వ్యవహారశాలలో పదిలము చేసిరి. ఇది జైనులలో విప్లవకారులకు వంక [illegible]

"రాజభటులు జైనవసదిపై దండెత్తి వసది [illegible] సిద్ధనంద్యాచార్యులనుగూడ బంధించినారు. ఇప్పుడు వసదిపత్రి [illegible] ద్రవ్యమును హరించినారు. ఈ రాజ్యమును మనము ధ్వంసముచేయవలెను! [illegible] రాజ! జయ మహారాష్ట్రి మహాదేవరాజ!"

ఈ విధముగా విప్లవకారులగు జైనులు ప్రచారము సాగించిరి. అందు [illegible] ముఖ్యుడు నాగాచారి. సామాన్యజైనులు పలువురు ఈ ప్రచారమునకు వశులై, స్త్రీ బాలవృద్ధులను విచక్షణకూడ లేక, చేతికి దొరికిన యాయుధములు గ్రహించి శిలా ప్రాకారముపైకి విజృంభింపసాగిరి. మహారాష్ట్రులును ఆ వీలు గమనించి అపాయకరమైన ప్రదేశములందెల్ల వారినే ముందుంచి యుద్ధయాత్ర సాగించిరి. ఇందువల్ల మహారాష్ట్రిసేనకు నష్టము తగ్గిపోయెను.

కాని జైనులందరు ఈ విప్లవవచనములకు వశులు కాలేదు. వారిలో పలువురు కాకతీయరాజన్యుల రక్షణతో తరతరములుగా నీరాజ్యములో కాపురములు చేయుచున్నారు. వారికి రాజకీయములతో పనిలేదు. సుఖముగా ఎవరి సంసారయాత్ర వారు చేసికొనుటే వారికి ప్రధానము. "ఎవ రెంత చెప్పినను జైనులైనంతమాత్రమున రాజభటు లెవ్వరికి నన్యాయము చేసియుండలేదు. దుర్మార్గము చేసినవారిని రాజభటులు శిక్షింపకుందురా? నగరనాయకులనందర వధించుటకు కుట్రచేసిన వసదివారిని ఏ ప్రభుత్వము వదలిపెట్టును?" ఈ విధముగా వారు తలంచుచు ఆ యలజడులలో

సౌఖ్యము కలిగించుకొనకుండిరి. కాని వారి కచ్చట నిలుచుట సాధ్యము కాకున్నది. వారిలో కొందరు నగరము విడిచి చుట్టుపట్టుల నిమ్న గోత్రీయులున్న ప్రదేశములకు తలదాచుకొనబోయిరి. కాని యందరకు నట్టి గోత్రులు లేరు. అట్టివారు శిలా ప్రాకారములోనికి రానిమ్మని రాజభటుల నర్థించుచుండిరి. ఏమిచేయుట? నమ్ముటా! వీరిని నమ్మకుండుటా? ఇట్లు శరణాగతులై వచ్చినవారిలో వీరభల్లటదేశికుడును గలడు. వీరభల్లటదేశికుడు ప్రసిద్ధుడు గనుక వెంటనే అతనికి లోనికి రా ననుజ్ఞ వచ్చినది. కాని పలువురు అల్లాడిపోవుచుండిరి. అట్లు లోనికి వచ్చుట కనుజ్ఞ రానివారు ఆంధ్రరాజును తిట్టి నగరము తొలగుచుండిరి. హరిహర సేనలకు బహు జయ నినాదములు చేయుచుండిరి.

శిలాప్రాకారము మరి రెండు దినములకంటె ఎక్కువకాలము మహారాష్ట్రుల ధాటికి నిలువలేదు. కోటప్రాకారరక్షకులు వెనుకకు తగ్గి రాజప్రాసాదము చుట్టునున్న ప్రాకారరక్షణకు అక్కడ నున్న బ్రాహ్మణవీరులతో కూడి పూనుకొనిరి. రెండు ప్రాకారములు దాటినతర్వాత మహారాష్ట్రసేనల యుత్సాహ మెక్కువయ్యెను. ఆంధ్రవీరులకు గుండెలు జారిపోయెను. ఇప్పుడు స్వయంభూదేవుని యాలయమునే ఎట్టి రక్షణయు లేకుండ వదలవలసివచ్చినది.

రాజప్రాసాదముచుట్టు నున్న ఆవరణము మిక్కిలి చిన్నది. అందులోనికి ఇప్పుడు మహాప్రధానులయు నగరనాయకులయు కుటుంబములగూడ చేర్చవలసివచ్చినది. అందరతోపాటు, అన్నమంత్రీశ్వరుని తల్లి గౌరమ్మయు, పత్నులగు పార్వతమ్మ లకుమమ్మలును, కూతురు బాలయు, రాజభవనము చేరికొనిరి. తిక్కనసోమయాజియు సోమిదేవితో నందు చేరికొనెను. గురునాథున కుమారునకు, బ్రాహ్మణవీరులకు శిక్షణ యొసగుటతో తీరిక లేకున్నది. అన్నమంత్రిమాత్రము తన బంధనశాల వదలలేదు. అదియే ప్రస్తుత మాతని దివాణము! ఆతడు శ్రీ రుద్రదేవమహారాజులను గూడ దర్శింపక, తనపై బడిన కార్యభారము తీర్చినపిమ్మట దర్శింతునని వ్రాత మూలమున నివేదిక పంపుకొనెను. మహారాజందులకు సమ్మతి తెలిపెను.

రాజప్రాసాదముచుట్టును భయంకరముగా యుద్ధము సాగుచున్నది. రాత్రింబవళ్ళు విధివిరామము లేకుండ స్త్రీపురుషులందరు ఏదో ఒక విధమున పోరాడుచున్న యోధులకు సహాయపడుచుండిరి. ప్రాసాదము లోపలను బయటను మహాకోలాహలమే వినవచ్చుచున్నది. మహారాష్ట్రసేనలు మాటిమాటికి హరిహరనాథునికి జయశబ్దములు చేయుచుండుటచేత ఆ సైన్యములో రుద్రమ సవతికుమారుడగు హరిహరు డున్నట్లు విశదమయ్యెను.

అప్పటికి కొంతకాలమునుండి గౌరమ్మ తిక్కనసోమయాజుల నర్థించి వారు రచించుచున్న ఆంధ్రమహాభారతము వినుచుండెను. పూజ్యురా లగు నామె పలుకుల చేత రాజమందిరమున గల స్త్రీజనమునందంతటను శ్రీమహాభారతప్రశంస ప్రాకిపోయినది. శ్రీమహాభారతము కల్పవృక్షమే! అది యొక ధర్మశాస్త్రము, నీతిశాస్త్రము! అదియే అధ్యాత్మవిద్య! శ్రీరుద్రదేవ మహారాజులకుగూడ ఆ ప్రశస్తి వినవచ్చినది. ఆనాడు స్వయంభూతేశ్వరాలయములో తిక్కనసోమయాజుల భారత భాగము విన్ననాటి ఆమెకు కలకగా నున్నది. కల్పవృక్షము నర్థించిననే కోరిక నెరవేరదా? "రాజనీతివిశేషము లేవి? శత్రురాజుల జయించు తెరంగేమి? ఈ

ప్రశ్నలకు మహాభారతములో నుత్తర మున్నదా ?" యని ప్రతాపరుద్రదేవమహారాజు లకు ప్రశ్న కలిగెను. ఆనాటి రాత్రియే పనులన్నియు [illegible] చేసికొని రుద్రమ్మ, గౌరమ్మ ఏకాంతమందిరమున కేగి సోమయాజుల నట్టి భాగ మున్న వినిపింపవేడెను.

సోమయాజులు చిరునవ్వు నవ్వుచు, "అమ్మా, ఈనాడే ఆ భాగము వ్రాసి నాను. అవధరింపుడు !" అని ఇట్లు వినిపించెను. రుద్రమ గాంభీర్యముతో నాల కించెను.

"ధృతరాష్ట్రుడు ధర్మజునకు రాజనీతివిశేషంబులు చెప్పుట.
"నీవు నిచ్చలును విద్యావృద్ధజనంబుల డగ్గఱి నుపాసింపు, ముఖ్యముగ వారిని
ప్రీతుల జేయుము, నీతులు వా రుపదేశింప వాని నూఁదిన మనంబు
గలిగి నిర్వర్తింపు కార్యంబు, నింద్రియంబుల రాజ్యతంత్రంబు భోగ సంగ
రక్షింపు, మప్పింపు రక్షితంబైన ధనంబులం గాపించి, భావశుద్ధి

ధాముంబులును పితృపితామహక్రమసమా
గతులు విశదమతులు గాఁగ వలయు
సచివు, లతి విదగ్ధచారుల బనుపుము,
పరుల యాప్తజనులభంగు లరయ.
"పురరక్షణంబు దృఢంబుగ,
నరవర చేయంగవలయు నమ్మఁగలుగు స
త్పురుషుల నిఁకదగు గుఱుపు ని
దుర మొదలగులోని పనుల తోడరుపు లరయఁగ.

న్యాయంబుతోడ విధిఁ,
పాయంబుల నర్థముల నుపార్జింపుము భూ
నాయక రాజ్యవిఘాతము,
సేయుజనుల నెఱిఁగి చంపఁ జేయఁగవలయుఁన్.

నీవలనను భక్తిస్నేహా
వేశము గలిగి శూరులై యలజడికిం
దా విసువని సత్కులజుల,
గావింపుము సైన్యవిభులఁగాఁ గురుముఖ్యా !
"ధృతరాష్ట్రుడు ధర్మజునకు శత్రురాజుల జయించు తెఱంగు చెప్పుట."
"విసుకువనిచ్చుతఱియుఁ గురువర ప్రక్కించు,
నవసరంబు నెఱిఁగి యరినృపాలు
నీవు ధీరవృత్తి నిజుమద్రాటఁ బోనిమ్ము,
క్రమ్మఁ కపిల యనఁగ గ్రమ్మఁచెఱుపు.
సంపదల నాపదల నొక్కఁచంద మగుట
వికృతి నొందుట యా బలవితతులందుఁ
గాంచి యెల్లప్పుడును హితకారి యైన
బలము నెక్కుడుగాఁ బ్రోవు భరతముఖ్య.

వినికి గలిగి రక్షించుచు,
ననువున దయలోడి పొడి నాయకు లెల్లం
గొనుచు దగనేలి పొగడొం
దిన రాజున కుర్వి గామధేనువ కాదే!"

అట్లు విని కోశపూజ గావించిన సువర్ణాక్షతలు తిక్కన సోమయాజులు స్వహస్తదత్తంబులు, భక్తితో శ్రీ రుద్రదేవమహారాజులు శిరస్సున గ్రహించి సెలవు తీసికొని నిజమందిరమున కేగెను.

* * * * *

అక్కడి కప్పుడే కోలనిరుద్రుడు పంపిన విజయవార్త వచ్చియుండెను. చాళుక్యరణబ్రహ్మ సేనలు మొదటిఘాటికే కాళింగసేనలు విచ్చిపారినవి. వారితో నున్న యువరాజిపుడు మాత్రము సాహసించి మార్కొని తల గోల్పోయినాడు. ఆంధ్రసేనలు కళింగసేనలను సింహాద్రి దాటి నాలుగుయోజనముల మేర తరిమివేసినవి. శీఘ్రముగా శ్రీ రుద్రదేవమహారాజుల దర్శనమునకు విజయోత్సాహముతో కోలనిరుద్రుడు వచ్చుచున్నాడు!

ఆ వార్త వినగానే రుద్రమకు బ్రహ్మానంద మైనది. అది తిక్కనసోమయాజుల యాశీర్వచనమునకు సద్యఃఫలముగా నామెకు భాసించినది. అట్టి మహాత్ముల వాక్కు లమోఘములు!

రుద్రమ్మ రణక్రూరకాలము ధ్యానించెను. ఆవల మహారాష్ట్రసేనలు, "[illegible]!" అని చేయుచున్న జయజయనినాదము లామె [illegible]. "ఈ కలహ మేల? ఈ జననాశన మేల? ఇది కులకలహము! [illegible]! రాజ్యకాంక్షచే దాపురించిన కలహము!"

అంతలో నామెకు తిక్కన సోమయాజుల సూక్తి మనోవీథిలో భాసించినది. కురుపాండవసమరసమయమున వ్యాసభగవానులు నిర్లిప్తులై దాని నాలోకించుచుండెను గదా! నేడు తిక్కనసోమయాజులు తాము వ్రాసిన ఆంధ్రమహాభారతభాగము వినిపించిరి. "అది వా రీనాడే వ్రాసినారట! ఈ మహాయుద్ధసమయమున వారికి మనస్థిమిత మెట్లు కల్గినదో! వ్యాసభగవానుల యంశ తప్పక తిక్కనసోమయాజులలో నున్నది!"

అంతలో రుద్రమ్మకు తిక్కనసోమయాజులు వినిపించిన చివరి వాక్యము స్మృతికి తగిలినది!

"తగనేలి పొగడొందిన రాజున కుర్వి కామధేనువ కాదే!"

"కామధేనువ! ఈ యుర్వి కామధేనువ కాదా నాకు?" ఇట్లామె ధ్యానించుచుండగా వ్యాసభగవానుడే తిక్కనసోమయాజుల రూపమున తన్నాశీర్వదించినట్లు స్ఫురించినది.

"నాకు ఉర్వి కామధేను వగుటకు ఆరంభించినది!" ఇట్లనుకొనుచు కోలనిరుద్రుని విజయవార్తను మహారాజు తిక్కన సోమయాజులకు ముందు తెలియజేసి, ఆవెంటనే ప్రాసాదాంతర్భాగమునను కోటగోడలపైనను చాటింపబంచెను.

ఆంధ్రసైనికులు బ్రాహ్మణయోధులయు వీరశైవయోధులయు సహాయముతో నిప్పటికి రెండు దినములుగా రాజప్రాసాదమును రక్షించుచున్నారు.

దాని గోడ లున్నతమైనవే కాని బలిష్ఠమైనవి కావు. [illegible] రాతితో కట్టబడినవి. అవి వర్షములకు కారిపోకుండుటకై [illegible]ఫలకా రాతి పలక లమరించినారు. ఆ యిటుకలు మిక్కిలి గట్టివి కావు [illegible] నేలికవి. [illegible] వుంచవు. నీటిలో వేసిన నవి మునుగక తేలును. కాకతీయశిల్పులు [illegible] యిటుకగోడల నిర్మాణమున నెంతయో నేర్పు చూపించిరి. కాని యివి సుదీ[illegible] యుద్ధమును ఓర్చు నుద్దేశముతో నిర్మించినవి కావు. [illegible]ప్రాసాదములకు సౌంద ర్యరక్షణ చేయుటకే అవి ఉద్దిష్టమైనవి. ఆ గోడల నాశ్రయించి యిప్పుడు సుదీ[illegible] రణము చేయవలసివచ్చినది! దానిలోపల నున్న యవకాశము [illegible]. [illegible] తావులో నింత పెద్ద జనసమూహ ముండుట మిక్కిలి కష్టము[illegible]. పుష్కలముగా నాహారము జలము ఉన్నవి. కాని మరి [illegible] యున్నచో మహామారివంటి యంటువ్యాధి యేదో పుట్టుట నిశ్చయము! [illegible] క్షణము సైనికుల ధైర్యము జిగజారిపోవుచున్నది. ఆ [illegible] యీ విజయఘోష వారల కొక ధైర్యము కలిగించెను. [illegible] రించినది.

మరునాటి యుదయమున మహారాష్ట్రవీరులు విపరీతమైన [illegible] ప్రాసాదకుడ్యములపై కెగబ్రాకుచుండిరి. వారు హరిహరదేవుని [illegible] మునకు పట్టము కట్టినవారివలెనే "జయ, హరిహర దేవరాజ, జయ!" [illegible] షించుచున్నారు. వారి ఏనుగులయు నిడుపాలములయు తొపులు భీకరముగా ప్రాసాదకుడ్యములను కంపింపజేయుచున్నవి. ప్రతితొపుతోపాటు హరిహర దేవరాజుకు జయఘోషయు మిన్నుముట్టుచున్నది. హరిహరదేవుడే యీ [illegible] నడిపించుచుండబోలును!

ఆ తొపులు ముఖ్యముగా ప్రాసాదమున నంతఃపుర [illegible] తీవ్ర తరమైనవి. అక్కడనే హరిహరుని జయశబ్దములును అతిశయించినవి. అచ్చటి ప్రాసాదముగోడలు భగ్నమగుటకుముందు బీటలువారినవి. అంతలో నవి పడలి పోవ ప్రారంభించినవి. మహారాష్ట్రసైనికులు ఆ సందులలోనుండి లోనికి రాసాగిరి.

కామసాని యది ముందుగనే నిర్లక్షించినది. వెంటనే [illegible] ప్రతాపరుద్ర కుమారుని కుబ్జ కప్పగించి కొద్ది పరివారముతో నేలలో నున్న యొక సొరంగపు మార్గముగుండ కోట దాటించు నేర్పాటుచేసినది. ఆ పని చేసినవంటనే, అది యంతఃపురపరివారమును గూర్చుకొని, అప్పటికే అటువైపు వచ్చుచున్న మహారా ష్ట్రసైనికుల నెదిరించెను.

కామసాని ఎనుబదేళ్ళ వృద్ధురాలు. వంగిపోయిన నడుమును ప్రయత్నపూర్వ కముగా నది నిలువబెట్టుకొనుచున్నది. వడకుచున్న చేతుల నది దృఢముచేసికొను చున్నది. ఎడమచేతితో డాలు పట్టినది, కుడిచేతితో ఖడ్గము ధరించినది. దాని వెంట నున్న పరివారములో కొద్దిమంది స్త్రీలు, మిగిలినవారు పేదులకు విజ ల్లులు! వారిని మహారాష్ట్రసైనికులు 'జయ హరిహరదేవరాయా, జయ!' అను చు భయంకరముగా దాకిరి.

ఆ జయనాదము చెవుల బడగానే రోషముతో కామసాని అపాదమస్తకము కంపించెను. దానికి ఆవేశము ఆగలేదు. అట్లు జయనాదము చేయుచున్న మొదటివానిని అది తన ఖడ్గపు కొనతో పొడిచివేసెను; రెండవవాని తల తెగవేసెను; మూడవవాని జయనాదము పూర్తి కాకుండగనే దక్షిణబాహువు నరికివేసెను. చిరకాలముగా దానికి ఖడ్గవిద్య యభ్యస్తమయినందున, బలహీనమై వడకుచున్న దాని చేతులలోగూడ నా ఖడ్గము అప్రయత్నముగా బోలె విలాసముగా పరిభ్రమించుచున్నది. ఆ సమీపముననే వేల సారంగ మున్నదని యెరిగినవారే యట్లు వచ్చుచున్నట్లు దానికి తోచినది. ఇందులో హరిహరుడే యుండవచ్చును. కాని కవచాచ్ఛాదితులై శిరస్త్రాణములు ధరించినవారిని గుర్తించు టెట్లు?

అంతలో కామసానికి హరిహరుడే ఎదురయ్యెను. అతనిముఖము కనబడకున్న నేమి? అతని ఉనికి, నడక దానికి చిరపరిచితమే! కామసాని క్రోధమూర్తియై 'ఓరీ, పాపీ!' యనుచు నాతనిపై విజృంభించెను.

కాని దాని మనస్సులో నున్న శక్తి దేహములో లేదు. అప్పటికే అది తూలుచున్నది. కన్నులు మూసికొనిపోవుచున్నవి. చమురయిపోయిన దీపశిఖవలె నున్నది దాని స్థితి! స్వయముగా హరిహరరాయల నది యెదుర్కొని పోరాడగలదా? అతని మొదటి వ్రేటుకు దాని ఖడ్గము దూరముగా పడిపోయినది; రెండవ వ్రేటు దాని హృదయములో దిగబడినది. ఆ యంతఃపురరక్షణకు ముందు ప్రాణ మర్పించినది కామసాని! ఆ వృద్ధురాలి ప్రాణములు హరించుటను మహావీర శౌర్యముతో హరిహరదేవుడు రాజమందిరములో నడుగు పెట్టెను!

అంతఃపురరక్షకులకును అతడు హరిహరుడని తెలిసిపోయినది. సారంగుని సమీపించుటకే వా రట్లు కలియుచున్నా రని వా రూహించిరి. మధ్యనింకను రెండు ద్వారము లడ్డమున్నవి. వారా రెండును మూసి ముందుకు వచ్చి వచ్చుచున్న వీరులతో తలపడిరి.

వారు స్త్రీలును పేడులునే గాని మహాభయంకరులు! అందును ఆ పేడులు భీతి తెలియనివారు. ఐన నేమి? హరిహరునివెంట మహారాష్ట్రసేనలు క్షణక్షణము ఎక్కువై పోయి లోనికి జొరబారుచున్నవి. వారిని నిలువరించుట యచ్చటి రక్షకులకు సాధ్యమగుట లేదు!

ఆ క్రిందటిరాత్రియే అన్నమంత్రి ప్రాకారసంచారముతో ఆప్రక్కగోడ బలహీనస్థితిలో నున్నదని నిర్లక్షించి యుండెను. ఆ భాగము ఎప్పుడు విచ్చిపోయిన నాక్షణమే అటు కదలుటకు ఐదు వందలమంది బ్రాహ్మణవీరులను ఆదేశించి సిద్ధముగా నుంచెను. వారిలో నొక వందమందికి గోవిందశర్మ నాయకుడు! ఆ యువకవి యీ యుద్ధములో మిగుల నేర్పు కనబరచుచు, అన్నమంత్రి మెప్పు గాంచుచుండెను.

అన్నమంత్రి పార్శ్వరక్షకులగు ఇద్దరు బాలవీరులలో పెద్దవాడు గోవిందశర్మతో పరియాచకము లాడుచుండును.

"గోవిందశర్మా, మీ వాక్కు కవిత్వములో ప్రసరించెడుకంటె, మీ బాహువులు రణరంగములో నేర్పుగా ప్రసరింపగలవయ్యా!"

కాని యిప్పుడు పరిహాసమాడు సమయము కాదు. ఆ యిరువందలమంది బ్రాహ్మణవీరుల కగ్రేసరుడై ఇప్పుడు స్వయముగా అన్నమంత్రీశ్వరుడే వచ్చినాడు! ఈ బ్రాహ్మణవీరుల రాకతో మహారాష్ట్రవీరుల విజృంభణము కొంచెము వెనుకపట్టినది.

హరిహరదేవుడు అన్నమంత్రిని, అన్నమంత్రి హరిహరదేవుని గుర్తించినట్లున్నారు! వారుభయులును ఒకరితో నొకరు తలపడినారు! సైన్యాలు రెండు వారు పోరుచుండ మిగిలినవారు మంత్రముగ్ధులవలె ఒకటి రెండు నిముసముల పాటు రిచ్చవడి నిశ్చేష్టులై వారి యుద్ధము చూచుచు కన్నులప్పగించి నిలిచిరి.

వారు తలపడినదాది హరిహరుడు అన్నమంత్రీశ్వరుని [illegible] ఊంకించుచుండెను. అన్నమంత్రి యాత్మరక్షణ చేసికొనుచు హరిహరుని నిరాయుధుని జేయుటకే యత్నించుచుండెను. కాని ఎంత ప్రయత్నించినను అన్నమంత్రి కది సాధ్యము కాకుండెను. హరిహరుని [illegible] వయినది. ఎన్నిమారులు అన్నమంత్రి [illegible] యున్నట్లు చూపరకు తోచుచుండెను.

ఈమారు స్పష్టముగా అన్నమంత్రీశ్వరుని [illegible] ముగా నున్నది. మెరపు మెరసినట్లు బలమైన [illegible] మావైపుకు వచ్చుచున్నది. అన్నమంత్రి హరిహరుని [illegible] లేకున్నట్లున్నాడు. అది చూడలేక బ్రాహ్మణులందరు [illegible] కన్నులు మూసికొనిరి. ఏకకాలమున రెండు శబ్దములు [illegible] చీల్చి వేసెను! ఆ రెండుశబ్దములును చీల్చు శబ్దములే!

హరిహరుని ఖడ్గము అన్నమంత్రిహృదయమున స్పృశించుటకు ముందుగనే ఆతని చర్మ మస్తు తగిలినది. బలముతో విసరిన హరిహరుని [illegible] ఖడ్గము అన్నమంత్రిపలకలో దిగబడినది. అది యూడదీయ [illegible] వేగముగా నవకాశములోపలనే అన్నమంత్రిఖడ్గము హరిహరదేవుని కంఠమును తెగవేసెను! హరిహరదేవుని శిరస్సు ద్రెస్సి, పడిపోయియున్న కామసాని పాదములముందు పడి, రక్తధారలతో నభిషేక మొనర్చెను!

ఇది యంతయు ఒక రెప్పపాటుకాలములో జరిగిపోయినది. [illegible] సైని రెండు బలములు తారసిల్లినవి. హరిహరుని పార్శ్వరక్షకులిద్దరు అన్నమంత్రిపై కవిసిరి. ఇప్పు డన్నమంత్రి యలసినట్లున్నాడు. [illegible] శరీరము నకంటె మనస్సు నావేశించినట్లున్నది. శ్రీ రుద్రదేవమహారాజుల యభిషేకమునకు పూర్వము, కాకతీయసామ్రాజ్యమునకు చక్రవర్తి [illegible] అందరు తలంచుచుండిన ఆ హరిహరదేవుడు, తన చేతులలో నిట్లు తల తెగబడి పడియుండుట చూచి, నెవరికి జంకు కలుగదు! ఆ జంకుతో [illegible] అన్నమంత్రి నుత్సాహమును కలిగినది!

అన్నమంత్రి మనస్సులో నా క్షణమున గలిగిన [illegible]తో హరిహరుని పార్శ్వరక్షకుల ఖడ్గములకు తన ప్రాణము లర్పించియుండెడివాడే! కాని యాతని పార్శ్వరక్షకు లగు బాలవీరు లిద్దరును వారిని నరకి వేసి అన్నమంత్రి ప్రాణము లా క్షణమున గాపాడిరి.

అన్నమంత్రిమనస్సు మరుక్షణముననే కుదుటబడెను. ప్రాకారములోనికి జొరబారిన మహారాష్ట్రవీరులపైకి తన వెంటనున్న బ్రాహ్మణవీరులను పురికొల్పుచు నాతడు విజృంభించెను. ఆ బ్రాహ్మణవీరులును యుద్ధమునకు అపరిచితులైనను సుశిక్షితులవలెనే ప్రవర్తించుట అన్నమంత్రికే యాశ్చర్య మొదవించుచుండెను.

ఇది యిట్లు జరుగుచుండ నావల ఒక మందిరములో గౌరమ్మ తన యిద్దరు కోడండ్రతోను మనుమరాలగు బాలతోను ప్రసంగించుచున్నది. వారికి రాజప్రాసాదములోనికి శత్రువీరులు ప్రవేశించినవార్త యింకను తెలియదు. ఆ గదిలోనికి ఆయుధపాణులగు మహారాష్ట్రభటులిద్దరు ప్రవేశించిరి. అది చూచి యంతఃపురములోనికి పరపురుషులు ప్రవేశించిరను భావముతో, గౌరమ్మ వారిపై కోపముతో నిప్పులు కురియు దృష్టితో చూచుచు, 'ఎవడురా యది?' యని యడిగెను. ఆమె ధ్వనిగర్జనకా భటులిద్దరు నులిక్కిపడి ఒక్క యడుగు వెనుకకు వేసిరి. వారు తెప్పిరిల్లి ముందుకు సాగుచుండగా గోవిందశర్మ వారి నిద్దరను తన చేతి నున్న శూలముతో గోడకు గ్రుచ్చివేసెను. అతని వెంట నున్న బ్రాహ్మణభటులు ఆ కళేబరముల నావలికి త్రోసివేసిరి. 'కవాటము బంధించి యప్రమత్తులుగా నుండుడు' అని యచ్చటివారి నాదేశించి గోవిందశర్మ ఐదుగురు భటులను బయట కాపుంచి వెడలిపోయెను.

అంతఃపురము ప్రక్కన నిచ్చిన ప్రాకారపు ద్వారముగుండ ప్రవేశించిన మహారాష్ట్రులతో, ఆ బ్రాహ్మణవీరులు మధ్యాహ్నమువరకు పోరినప్పటికి, నంతవరకు లోనికి ప్రవేశించినవారి నందరను వారు వధించి యామార్గము నిరోధింప గలిగినారు.

కాని ప్రాణము లేని రాతిగోడ చేయవలసిన నిరోధము, ప్రాణులగు మనుష్యులతో పెట్టిన గోడ ఎంతసేపు చేయగలదు? అక్కడ సందు కలిగినదని తెలియగనే, మహారాష్ట్రసేనాప్రవాహ మావైపునకే మరలినది. వెంటనే అన్నమంత్రియు శూలధారులగు నారువేలమంది బ్రాహ్మణవీరులను అంతఃపురరక్షణకై యక్కడ జీవత్కుడ్యముగా జేసి కాపుగా నుంచ నియోగించెను.

మూడు జాములైనది! ఏమి కారణమోగాని, చిత్రముగా, మహారాష్ట్రసేనల యౌద్ధత్యము తగ్గిపోయినది. అది చూచి నగరనాయకులకే యాశ్చర్యమైనది. నగరరక్షణమునకై ఈనాడెంతో బ్రాహ్మణరక్తము చిందినది. ఆ రక్తబిందువులనుండి శత్రుబాధకములగు నమానుషశక్తి యేదైన నుద్భవించి మహారాష్ట్రసేనల నావల మార్కొనుచున్నదా? ముందున్న సేనలు ముందున్నవి; కాని వెనుకనుండి మహారాష్ట్రసేనలు ముందుకు వచ్చుటలేదు!

సాయంత్ర మగుచున్నది! ఈ రాత్రి రాజప్రాసాదమును శత్రువుల గుత్తినుండి రక్షించుట దుస్తరమని నగరనాయకులు నిశ్చయించిరి. ఎవరెవరిని ఏయే రహస్యమార్గముల సురక్షితప్రదేశములకు చేరవేయుటయో, ఎవరెవరు తుదివరకు నిలిచి పోరాడుటయో నిశ్చయమైనది. శ్రీ రుద్రదేవమహారాజులు ఎంత సుచెప్పిన వినక, తన నగరనాయకులతోపాటు చివరవరకు పోరాడువారిలో

నుండుటకే నిశ్చయించిరి. వారు ఆత్మరక్షణకై పారిపోవుట కిచ్ఛగింపలేదు. అపాయ మెక్కువగుచున్న కొలదియు వారి వీరోత్సాహమును ఎక్కువగుచున్నది !

సాయంత్ర మయినది. మహారాష్ట్రసేనలు వెనుకకే తగ్గుచున్నవి ! ఏమి యీ మాయ ? కనుకట్టుగా నున్నదే !

రాత్రి జాముప్రొద్దు పోయినది ! మహారాష్ట్రసేనలు శిలాప్రాకారము వెనుకకు పోయినవి. రాజప్రాసాదమునకును శిలాప్రాకారమునకును నడుమ నొక్క యాదవవీరుడును లేడు! ఏమిది !

అర్ధరాత్ర మైనది ! మహారాష్ట్రసేనలు పుట్టకోటబయటికి చేరినవి. ఏమి యీ యద్భుతము ! కోటలోనివారిని ప్రలోభపెట్టి బయటికి రానిచ్చి ఒక్కసారి విజృంభించుటకు ఎత్తిన పన్నుగడయా ?

తెల్లవారినది. మహారాష్ట్రసేనలు తమ స్కంధావారమునంతయు నెత్తి వేసి పలాయనోన్ముఖముగా నున్నవి !

ఏమిది ? తెల్లవారువరకును కోటలోనివారికి కారణము తెలియదు. రెండు మూడు దినములనుండి బయటినుండి యే వార్తయు రాకుండ శత్రువులు నిరోధించి యుండిరి. తమ్ము ముట్టడించిన సేనలు నిష్కారణముగా నింత యాకస్మికముగా వెనుదీయుచుండుట, కోటలోనివారికి మోసమనియే తోచెను. ఆ యూహతో రాజప్రాసాదము నెవ్వరును విడిచి పోరా దని మహారాజు లాజ్ఞాపించిరి. గూఢ చారులు మాత్రము రహస్యమార్గముల నిజమారయ బయలువెడలిరి.

తెల్లవారునప్పటికి చారులు నిజవార్త తెచ్చిరి ! "మనము రక్షింపబడితిమి !"

ఆ మాటలు రాజప్రాసాదమున నలుదెసల ప్రతిధ్వనించెను. పాలిపోయిన వారల ముఖములలో నెత్తురు చిమ్మినది ! "రక్షింపబడితిమి ! రక్షింపబడితిమి !"

ఎట్లు ?

అవల తిక్కచమూపతియు గోనగన్నారెడ్డియు తమ యాశ్వికబలములతో రెండువైపులనుండి మహారాష్ట్ర సైనికస్కంధావారమును తాకి చెండాడు చున్నారు. రాత్రియంతయు భయంకరముగా యుద్ధము సాగినది. తెల్లవారు నప్పటికి వారి పదాతిబలములు కలసికొనగలవు ! అంబదేవుడును కొంతసేనను పంపినాడు. అదియును సమీపించినది !

ఆనాటి సూర్యోదయముతోపాటు ఏకశిలానగరమున స్థైర్యసూర్యోదయ మయ్యెను. వార్తలు ధ్రువపడినవి. ఆవెంటనే శూలధారులగు నాగులైల బ్రాహ్మణయోధుల కగ్రేసరుడై అన్నమంత్రి నగరద్వారములు తెలువకి మహా రాష్ట్రసేనలను తాకెను. మూలబలముతో రుద్రమయు నాతని వెంట తోడుగా సాగినది.

వా రుభయులకును వీరశైవబలము అండగా మహోత్సాహముతో బయలు దేరినది !

౫౨

దొడ్డిలో కాకి మరల మరల అరచుచున్నది! ఈమధ్య చెలరేగిన గాలివానతోను మహాయుద్ధముతోడను ఏకశిలానగరములోని పెలిపాలెము ముఖ్యముగా ఎక్కువ దెబ్బతిన్నది. బొల్లని ఇంటి కప్పుకు వేసిన ఆకులన్నియు లేచిపోయినవి. నిరాటంకముగా ఇప్పుడు సూర్యభగవాను డందులోనుండి ఇంటిలోనికి ఉదయము నుండి సాయంత్రమువరకు ప్రవేశించి రాకపోకలు సలుపుచున్నాడు. ఆ మధ్య కాకుల సంచారము కూడ కట్టువడినది. ఈనాడు ఆ కాకి మరల మరల తన దొడ్డిలో అరచుచుండుటచే, మంగికి నిస్పృహలో ఒక ఆశాలేశము అంకురించినది.

"ఎవరు వస్తారు. కాకమ్మా?"

ఆ మాటలు విని ఉత్సాహముతో పోటి అందుకున్నది. తెలుగుగడ్డపై తెలుగు పుట్టినప్పటినుండి ఉన్న పాట ప్రారంభించినది :

"కాకమ్మ, కాకమ్మ, కబురు కాకమ్మ!
చుట్టాలొస్తే చూచీ పో,
పక్కాలొస్తే పారీ పో,
నీ కాలికి గజ్జె కట్టిస్తా,
నీ కూతురుకు పన్న పెట్టిస్తా,
మాయయ్య వస్తే కాలెత్తి
గంతెయ్యి,—ఒక్కటే గంతూ!"

ఆ కాకియు చిత్రముగా ఒక్కటే గంతు వేసినది. పోటిముఖము నవ్వుతో వికసించినది. మంగి తనకు కడుపులో పొంగుకొని వచ్చుచున్న దుఃఖము ఎక్కడ పైకి కనబడనీయకుండ అపుకొనుచు, 'మీ యయ్య వస్తాడులేవమ్మా?' అన్నది.

పోటి ఊహలు దూరముగా అల్లుకొనిపోయినవి.

"మా యయ్య నాకేమి తెస్తాడమ్మా?"

మంగికి కన్నులలోనుండి నీరు ఉబుకుకొని వచ్చుచున్నది. పోటికి అర్థము కాలేదు.

"అయ్య వస్తుంటే అట్లా ఏడుస్తావేమే?"

కాకిగంతుమీద పోటి కున్న నమ్మకము తల్లి కేదీ? వాకిటిలో బరువైన అడుగుల చప్పుడైనది. "అయ్యవచ్చాడు!" అనుచు చెంగున పోటి వాకిటిలోనికి పరుగెత్తినది. దాని వెంటనే మంగికూడ నెమ్మదిగా నడచినది.

వాకిటిలోనికి వెళ్లగానే పోటికి ఉత్సాహభంగమైనది! సంపూర్ణముగా కవచములు ఆచ్ఛాదించిన దేహములు గల ఇద్దరు యోధవీరులు దానికి కనబడినారు. వారిద్దరును ముఖపిధానము లేమియు పట్టములు పైకెత్తి చిరునవ్వుతో దానివైపు చూచుచుండిరి. తన తండ్రి కానందునకు ఒక్క ముఖము చేసికొని పోటి చప్పున ఆగి, ఎగాదిగ వారివంక చూడసాగినది. దానికి ఉత్సాహభంగమై ఏడుపు కూడ వచ్చుచున్నది.

ఆ వచ్చిన యోధు లిద్దరు పక్కన నవ్వి, స్వతంత్రముగా, ముందుకు వచ్చినారు. అందులో ఒకడు ఆదరముతో పాటిని తన చేతులతో నెత్తికొన్నాడు. పాటి [illegible]టుతో ముఖ మావలకు త్రిప్పి తప్పించుకొనవలె నని ప్రయత్నించుచున్నది.

ఈ మారు చిరునవ్వు నవ్వినది మంగి! దాని కన్నీరంతయు నది [illegible] సంతోషమే రూపొందినట్లైనది.

"ఏమే? అయ్యను మామయ్యను పోల్చుకోలేదుటే?"

"ఎవరు?—అయ్య?— మామయ్య?—"

పాటిని ఎత్తుకొనిన వీరుడు దానిని దింపి శిరస్త్రాణము పూర్తిగా తీసివేసి పాటికి తన ముఖము చూపినాడు. అది వెంటనే 'అయ్యా!' అనుచు వానిని కౌగిలించుకొనినది.

మంగి లోనికి వెళ్లి ఇద్దరకు కాళ్లకు నీళ్లు తెచ్చినది.

కొంచెముగా సంభాషణ జరిగినతర్వాత బొల్లనికి ముందు ఆశ్చర్య[illegible] ప్రశ్నించినది ఆ యింటినిగూర్చి!

"నేను పంపిన బంగారము నీకు చేరలేదా?—దానితో పెద్ద భవనము నీవు కట్టించి యుండవచ్చునే!"

మంగికి ఆశ్చర్యమైనది!

"నీవు బంగారము పంపినావా?— పాపము, మహానుభావుడైన ఒక ఫకీరు నాపై జాలి పొంది చారెడు బంగార మిచ్చినాడు. తర్వాత లెక్క పెట్టగా ఏబది మాడలున్నవి. అవి జాగ్రత్తగా ఇంతవరకు వాడుకొనుచున్నాను. ఇంకా ముప్పది మిగిలి ఉన్నవి!- ఇదుగో." అని మంగి లోపలికి వెళ్లి తెచ్చి బొల్లనికి చూపినది!

అది చూచుచునే బొల్లడు మండిపోయెను. మంగి ఉలికిపడెను. పాటి ఏమో [illegible] సాగించెను.

"వాడు మహానుభావుడా? దొంగ!—ఏబది మాడలు నీకు ముష్టి పెట్టినాడా?"

మంగికిని ఆశ్చర్యమై బొల్లనివంక చూడసాగినది.

"నేను వేయి మాడలు పంపినాను!—"

అతనితో వచ్చిన గండడు చిరునవ్వు నవ్వుచు, "పోనీ, పాపిష్ఠి ధనము తీరే అది!" అనుచు బొల్లని ఓదార్చెను.

"ఆ దొంగ ఇప్పు డెక్కడ ఉన్నాడు? మరల కనబడినాడా?"

మంగి మౌనము వహించెను. స్వయంభూదేవాలయసమీపమున జరిగిన రాత్రి సంగతి అది చెప్ప సాహసింపలేదు. అంతలో అది బొల్లని ప్రక్కనున్న గండనివంక తిరిగి "గండా, ఎన్నాళ్లకు కనిపించినావు! కాళ్లు కడిగికొనలేదేమి?" అని అడిగినది.

"నే నింకా ఇంటికి చేరలేదు. నీ రాజును నీకు అప్పగించిపోదామని వచ్చినాను. ఇదుగో!—మరచిపోకు, బొల్లా! మధ్యాహ్నం వేళకు సరిగా [illegible] పోచయనాయకుల దర్శనము చేయవలె!—పాటీ, మీ అయ్య నీకేమేమి తెచ్చినాడో అడుగు, పెద్ద సాహుకారయినాడులే, వారిని వీరిని దోచి గుంటూ[illegible]!"

ఇట్లనుచు గంపడు తన యింటికి చేరికొనెను.

*　　　*　　　*　　　*

ఏకశిలానగరమంతయు నిప్పుడు రుద్రభూమివలెనే ఉన్నది. ముందు వచ్చిన భయంకరమైన గాలివాన! దాని ఘాటిని సరిచేసికొనకముందే మీదబడిన మరాఠీల దండు! ఎప్పటి కప్పుడు ఉభయసేనలును చనిపోయినవారి దేహములకు సంస్కారములు చేసివేయుచుండెను. కాని యింకను కళేబరములు మూలమూలల మిగిలిపోయినవి. ఏ పొదచాటుననో, ఏ పాడుపడిన యింటిలోననో ఒకటి ఉండును. గాయపడిన వీరుడు ఆత్మరక్షణకో, దాహము తీర్చుకొనుటకో, క్షుధానివారణకో, చికిత్సకొరకో, ప్రాకులాడి ఎక్కడనో ప్రాణములు వదలియుండును. ఎక్కడ నున్న నేమి? ఆ ప్రాణి జీవించియుండగా కన్నులున్న యాతని యాప్తులకును కనబడియుండక పోవచ్చును; చెవులున్న యాతని బంధువులాతని యార్తవాక్కు లాలించియుండక పోవచ్చును. ఇప్పుడు ప్రాణము వదలిన పిమ్మట ఆ దేహమునుండి వచ్చు దుర్గంధము మాత్రము, శత్రుమిత్రులను విచక్షణ లేకుండ, అందరకు దుర్భరమై దాని యునికి నెఱుకను తెల్పును! అది చూచువారికి శ్మశానవైరాగ్య మంకురించుటలో విశేషము లేదు.

అందరు మనుష్యు లొక్కసారి బలవన్మరణము పొందుట కాకులకు, గ్రద్దలకు, రాబందులకు, నక్కలకు, కుక్కలకు పెద్దపండుగ! అవి ప్రాణము లేనివారి కళేబరములనే కాక, సజీవులై వానిని నివారింపలేని స్థితిలో నున్నవారిని గూడ, పొడుచుటకును కరచుటకును వెనుకాడకున్నవి. అభ్యాసవశముచేత వానికొక వింత ధైర్యమును వచ్చినది. ఒంటరిగా నిద్రించుచున్నవారిని గూడ నవి ఇప్పుడు బాధింపసాగినవి. ఇన్ని కాకులు, గ్రద్దలు, రాబందులు, నక్కలు, కుక్కలు ఎక్కడినుండి వచ్చినవో!

ఈ శవము లన్నియు తొలగింపవలెను. పడిపోయిన యిండ్లు బాగుచేయవలెను. కూలిన వాపీకూపములు పునర్నిర్మింపవలెను. గండ్లు తెగిన కాలువలు సరిపరచవలెను. అపరిశుభ్రమైన తావులు శుభ్రము చేయవలెను. చెడిపోయిన రాజమార్గములు బాగుచేయింపవలెను. శిథిలమైన నగరకుడ్యములు పరిష్కరింపవలెను. ఇవియన్నియు నగరరక్షణలో నెట్టి ప్రాలుమాలికయు లేకుండ, సాగింపవలసి యున్నది. మారుమూలల దాగియున్న యంతశ్శత్రువులను బహిశ్శత్రువులను గాలించి తగిన శిక్షలు విధింపవలెను. ఈ కార్యక్రమమునకంతటికి మేచయనాయకుడు పూనుకొనెను. అతని కందుకూరి వల్లనాయకుడు మిక్కిలి సహాయపడుచు తోడుగా నుండెను. అంబదేవుడు పంపిన సైన్య మిప్పుడు నగరరక్షణకు నియమింపబడినది.

పూర్వనిర్దిష్టము ప్రకారము నాడు మధ్యాహ్నమే గంపడు బొల్లని తీసికొని మేచయనాయకుల దర్శించెను. వారిద్దరు దళపతుల వేషములతో వచ్చుట నాయకునకు ముందాశ్చర్యమై తలయెత్తి సందేహముతో వారివంక నాతడు చూచెను. వెంటనే గంపడు అంబదేవుడు పంపిన పత్రములు మేచయకు సమర్పించెను. అవి చదువుచున్నకొలదియు నాతని ముఖమున నాశ్చర్యము వ్యక్తమగుచుండెను. "బొల్లడు చేసిన యకృత్యములు స్వల్పములు. ఐనను అతడు పశ్చాత్తప్తుడై, రాజద్రోహులను పట్టించుటలో ఈమధ్య చూపిన నమ్మకముచే, నాతని దోషములు క్షమింపదగినవి. అతని సత్ప్రవర్తనకు

గండడే పుట్టుగా నుండునట్లు చేసి, గంపనికి ఆతడు మహారాజుగా నుండునట్లు చేయ వచ్చును!"

అంబదేవునంతవాని సూచనపత్రమే యైనను, [illegible]!

బొల్లా, నీ కీ నగరములో పని చాల పడును. [illegible] వేషధారి యగు యువకుని మాకు పట్టింపవలెను!"

"ప్రభూ, చిత్తము! నాకును అందుకే మనస్సు [illegible]. ఆపిమ్మట నాగాచారిని పట్టుకొనవలెను!"

"బొల్లా, నీ వనుక్షణము జాగరూకుడవై యుండవలెనుసుమా! [illegible] నీ కాపురము మాకు సమ్మతము కాదు! — గండా నీవును!"

వారిద్దరకును శిలాప్రాకారములోపల ఒకదాని సరసను ఒక యిల్లు నిర్దేశించి, వారి నందుండ [illegible] నియమించెను. ఆ సాయంత్రమునకే వారిద్దరును తమ కుటుంబములతో నూతననివేశములలో ప్రవేశించిరి. ఆ రాత్రియే [illegible] కదృష్టము పండినది!

* * * *

బొల్లడా రాత్రి బిచ్చగాని వేషములో నగరసంచార మొనర్చ నారంభించెను. అతడు సంచరించుచున్నదియు నగరమునందెల్ల వింతలై యనాసక్తకరమైన ప్రదేశములు. ఇంత మహాద్భుతమగు నగరములో గూడ నింత నికృష్టమైన ప్రదేశము లుండునా యని చూచిన క్రొత్తవారి కనిపించును. శిథిలమైన భవనములు, కూలిపోవుచున్న కుటీరములు, పొదలు పుట్టలు పెరిగి క్రూరజీవుల కునికిపట్లగు జీర్ణోద్యానములు, [illegible] బావులు! ఇవి యన్నియు గూడ ఆంధ్రరాజుల రాజధానీనగరములోనివే నా? [illegible] ముల కంపు, నక్కల కూతలు, అంతకంటె భయంకర మగు మానుష్యుల [illegible] ఆ ప్రదేశములలో ముష్టివాని కేమి ముష్టి లభించును? ఎక్కడనైనను దొంగలు [illegible] నక్కియుండవచ్చును. కాని బిచ్చగాండ్లకు పోరాని ప్రదేశ మేమి?

బొల్లడప్పు డొక యాపానభూమిని సమీపించెను. అచ్చటనుండి వినవచ్చుచున్న కేకలు పాటలు తిట్లు దీవనలు ఆతని నాకర్షించినవి. అక్కడ [illegible] యథాధికారముగా కులార్ణవతంత్రోక్తము లగు సప్తభూమికలలో [illegible] ప్రోత్సహించినది. తద్విదులగువారు మద్యముచే గలుగు నుల్లాసమును ఏడువిధములుగా వర్ణించినారు. ఆరంభము, తరుణము, యౌవనము, ప్రౌఢము, ప్రౌఢాంతము, ఉన్మనము, అనవస్థము అని యా యుల్లాసములు వరసగా సప్తభూమికలు. వానిలో ప్రౌఢోల్లాసమును వర్ణించుచు నా తంత్రము,

"పీత్వా పీత్వా పునఃపీత్వా యావత్పతతి భూతలే
ఉత్థాయ చ పునః పీత్వా పునర్జన్మ న విద్యతే ||
యత్సుఖం కులనిష్ఠానాం కులద్రవ్య నిషేవణాత్
తత్సౌఖ్య మేవ మోక్షం స్యాత్ సత్య మేవ న సంశయః ||"

అని వర్ణించినది. ఆ తంత్రములో చెప్పిన మోక్షమున కర్హులగువారు [illegible] రా పానగోష్ఠిలో నున్నారు.

అట్లు మోక్షస్థాయి నందుకొనలేక ఆరంభ తరుణ యౌవనభూమికలలో నున్నవారు ద్యూతమాడుచుండిరి. వారిలో నారంభభూమికలో నున్నవాడొకడు చప్పున ప్రక్కవాని చేయి పట్టుకొని వాడు చేసిన మోసము బయలు పెట్టెను. వెంటనే ఆ సాయంత్రమునుండి అతనితో నాడి ధనము కోల్పోయినవారందరు నామోసగానిపై బడిరి. అతడు ఎంత పారిపోవ ప్రయత్నించినను, మిగిలిన త్రాగుబోతులు పోనీయక వానిని పొదివి పట్టుకొనిరి. తలవరులను పిలువగా సమీపములో నున్నవారు ఇరువురు వచ్చిరి.

మరుక్షణమున నక్కడనే కితవధర్మాసనము ఏర్పడెను. ఆ ధర్మాసనము ప్రభుస్థాపితము కాదు. అక్కడి కితవులే అందులో పెద్దలు. వారే ధర్మము విచారించి శిక్ష విధింతురు. అది తలవరులు విధిగా నిర్వర్తింపవలసినదే! అట్లే జారులలో తగవులు ప్రాప్తించిన జారధర్మాసనము తీర్చును. కితవధర్మాసనములు జారధర్మాసనములు తీర్పుట ఆ చాటుగొందులలో సర్వసామాన్యము!

అట్లు ముందు చేయి పట్టుకొనినవాడు రెండవ కితవుడు చేసిన మోసము వర్ణించెను. అక్షముఖము ముందు తన కనుకూలముగా స్పష్టముగా కనిపించినది. అంతలో నా మోసగాని హస్త మావైపు ప్రసరించినది. అట్లైపె అక్షముఖము మారిపోయినది! వెంటనే తా నాతని చేయి పట్టుకొనినాడు.

దానికి నిందితుడైన కితవుడు ఆతడు చెప్పినదంతయు నబద్ధమని వాదించెను. ఆ నిందితుడు విదేశవర్తకునివలె నున్నాడు. అతడు విలువగల వస్త్రములు నాభరణములు ధరించి యుండెను. అతని వాక్కుకూడ సౌమ్యమై, నిరపరాధి యనియే అందరకు అనిపించుచుండెను. పాప మేదో పొరపాటు జరిగియుండవలెను. కాక మొదటివాడే మోసగాడో!

కాని అతడానాడు ధన మొడ్డుకొన్నవా రందరును అట్లే సాక్ష్యమిచ్చిరి. అందరును ఆతని హస్తచాలనము గమనించినవారే, కాని కేవలము అక్షము స్పృశించినట్లు చెప్పగలవా రెవరును లేరు. మొత్తముమీద నతనికి హస్తలాఘవవిద్య యేదియో అభ్యస్తమని వారు నిర్ణయించిరి. మరి కాకున్న సరిగా నావేళకే హస్తచాలన మట్లేల జరుగవలెను?

గోవిందశర్మ యాదారిన పోవుచు ఇక్కడనీ ధర్మాసనము తీరినా రేమని ప్రశ్నించెను. ధర్మాసనము తీరిన పెద్దలు విషయము నివేదించి గోవిందశర్మను ఏమి చేయుట సమంజస మని యర్థించిరి. గోవిందశర్మ వంటనే బదులు చెప్పెను.

"ఇందరు అక్షవిదులు కూడినారు. దీనికి పాణ్మాసచింత ఏలనండీ! ద్యూతములో హస్తలాఘవము ప్రదర్శించినవారికి కరచ్ఛేదము!"

వెంటనే ధర్మాసనము కూడిన పెద్దలు గోవిందశర్మ యుపదేశ మంగీకరించి తీర్పు చెప్పిరి. "హస్తచ్ఛేదము!" తలవరులు ఆ వర్తకుని పట్టుకొనబోవుచుండగా నాతడు తప్పించి పారిపోవుచుండెను. సరిగా నప్పుడే బొల్ల డెదురై యాతని దృఢముగా బంధించి "ఇతడు దొంగ! నా తొమ్మిదివందల యేబది మాడలు హరించెను." అనెను. శత్రుడుగా మాట లనుచుండుటచే నందరికి నవ్వు వచ్చెను!

అంతలో మట్టుపట్టులనుండి అ[illegible] [illegible], నా బంధితుని తప్పించుటకు పొంచియుండి సుసుశిష్యులు అక్క[illegible] [illegible] గంఢని పరివార మా యల్లరిమూకను [illegible] [illegible] యనాయకున కప్పగించెను. గండడు [illegible] [illegible] యుండెను.

ఈవిధముగా మేచయ కన్నులు [illegible] [illegible] తప్పించుకొనుచున్న అజ్ఞాతయోగి [illegible] [illegible].

* * * *

బొల్లనియు, గండనియు నప్పటి నుండిటలో నా [illegible] [illegible] అర్ధరాత్రమువరకు నగరసంచార మొనర్చి జైనవసతి [illegible], [illegible] నొక గదియందు శయనించిరి. అదియే ప్రార్థ్యము [illegible]! [illegible] నిదుర నటించుచుండిరి కాని నిదురపోవుటలేదు. అంతలో [illegible] కదలెను. అందుండి యొక వ్యక్తి [illegible] [illegible] కొనక తన చేతిలో నున్న కత్తి క్రింద పెట్టి, [illegible] కొట్టుచుండెను. అప్పటికే జాగరూకులై యున్న గండ[illegible] [illegible] లేచిరి. గండడు క్రిందపెట్టియున్న కత్తి పట్టుకొనెను. [illegible] వ్య[illegible]ని పట్టుకొనెను. వెలుగు చేసి పరీక్షింపగా నాతడు నాగాచారి! [illegible] ప్రభువుల ముద్ర లెన్నియో లభించెను.

తిక్కచమూపతియు, గోనగన్నారెడ్డియు మహాసైన్యముల[illegible] [illegible], యటువైపులనుండి శత్రుసైన్యములు వచ్చుటలేదని తెలిసిన[illegible]నుండియు, మేచయ కెవరో అబద్ధవార్తలు నమ్మకమైనవిగా [illegible] [illegible] యనుమానము కలిగెను. దేవగిరి వైపునుండి యొట్టి [illegible] [illegible] వచ్చుటయు, అటునుండియే మహాసేన దండెత్తివచ్చుటతో, నాతని [illegible] [illegible] ధ్రువపడెను. నవరాత్రముల నాటి [illegible] పొల్గొని యుక్తోద్యగములు [illegible] కొనిన కరణములే దానికి కారకులై యుండవచ్చుననియు, నాతనికి [illegible] జైనవసతిని పట్టుకొనినప్పు డందు దొరకిన పత్రములు పరీక్షిం[illegible] నాతని కా యూహ నిజమని నిశ్చయమైనది.

అన్నిటికి మూలకారకుడు నాగాచారి! అతడు కనబడుటలేదు. కాని యాతడు నగరము వదలలేదు. అతనికై నగర మెల్లెడ గాలించుచున్నను కనబడుచుండలేదు. ఈనాడు మేచయ వసదికి మరల కొన్ని పత్రములు చేర్చినట్లు సూచన చేసెను. అక్కడ నెట్టి రక్షకభటులును కాపుండనట్లు చేసి, గండని బొల్లని నర్ధరాత్రమున కచ్చటికి పంపెను. మేచయయత్నము ఫలించినది!

* * * * *

శ్రీరుద్రదేవమహారాజులు మహారాష్ట్రసేనలను తరుముకొనుచు పురనిర్గమనము చేసిన [illegible]దినములలో ఏకశిలానగరము యథాస్థితికి వచ్చినది. పదునైగు [illegible] విరోధింపబడినది. అందులో కొన్ని దినములు మహారాష్ట్ర [illegible] ఉన్నవి. ఆంధ్రసేనలకు మహారాష్ట్రసేనలకు మహా [illegible] లో నొక విశేషము! ఏకశిలానగరమున గల యన్ని

దేవాయతనములందును నిత్యపూజలకు ఒక్కనాడుకూడ విఘ్నము కలుగలేదు. రాజనగరు నంటియున్న కేశవస్వయంభూదేవాలయములందుగూడ నంతే! వాని ప్రాకారమునకు, రాజప్రాసాదము ప్రాకారమునకు మధ్య ఒక పెద్ద రాజవీధియే అడ్డమున్నది. ఆ విశాలరాజవీధియందు దంతటు యుద్ధము భయంకరముగనే సాగుచున్నది. మహారాష్ట్రప్రభువగు మహాదేవరాజు కేశవ స్వయంభూని కేతనములలోనికి తనవెంట వచ్చిన ఋత్విక్కులను పంపి పరీక్ష చేయించి యచ్చట భటు లెవ్వరును లేరని నిశ్చయించి, యాపైని ద్వారములకొద్ద మాత్రము భటుల గాపునుంచెను. మహారాష్ట్రప్రభువే ఆ యాలయములలో తన గోత్రనామములతో పూజలు చేయింప ఋత్విక్కుల నియోగించెను. ఆతని సామంత దండనాథులుగూడ పూజలు చేయించిరి.

అట్లే అన్నమేశ్వరుని యాలయమునకుగూడ నించుకంతయు ఆటంకము కలుగలేదు. పైగా యథావాక్కుల అన్నమయ్య మహత్వము మహారాష్ట్రసైనికులలో కథలుగా ప్రాకినది. అందుచే వారు భయభక్తులతో నాతనికి నమస్కరించి, తాము విన్న యాతని మహత్త్వము ఒకరితో నొకరు చెప్పుకొనుచు వేనోళ్ళ పొగడుచుండిరి. ప్రత్యేకముగా నప్పు డన్నమయ్యకు సర్వేశ్వరశతకమునుండి యీ పద్యము తరచుగా నోట నావృత్తి మగుచుండెను.

“కులశైలంబులు పాదు పెల్లగిలి దిక్కూలంబునం గూలినం
జలధుల్మేరల నాక్రమించి సముదంచద్భంగి నుప్పొంగినన్
జలజాతప్రియశీతభానులు యథాసంచారము ల్దప్పినం
దలకం డుబ్బడు చొప్పుదప్పడు భవద్భక్తుండు సర్వేశ్వరా!”

అన్నమయ్య యుండు ప్రదేశమునకు మిక్కిలి సమీపముననే సిద్ధనంద్యాచార్యులను భటులు చేర్చిరి. జైనవసదిలో జరిగిన దుర్ణయమున కా మహానుభావున కెట్టి సంబంధము నుండదని రాజపురుషుల కందరకు తెలియును. పైగా నాతడు నొటిలోని సుద్దులు కుక్కబడి యవశిష్టప్రాణమాత్రుడై యున్న స్థితి చూచినవారికి, వసదివ్యవహర్తల యాగడ మాతడు ప్రతిఘటించి యుండు ననికూడ స్పష్టపడినది. రాజపురుషు లాతని గౌరవముతో నాదరముతో రాజభవనమునకు చేర్చి సమస్తోపచారములు చేయుచుండిరి.

రాజమందిరము చేరినప్పటినుండియు నాతనిలో నొక మార్పు ద్యోతకమయ్యెను! వసదిలో నకృత్యము లెన్నియో ఆతడు చూచెను. వసదివ్యవహర్తలు ద్రోహియగు వీరభద్రేశ్వరు నే జైనసిద్ధవేషముతో వసదిలో దాచి, పైపెచ్చు తిరుణాల సాగించిరి. మరియు నచ్చటివారి యకృత్యము లెన్నియో ఆతడు కన్నులార చూచియుండెను. అందుచే ఆ మార్పు వచ్చినదో, మరి పూర్వకర్మానుగుణముగా కలిగినదో, కాక తరచుగా యథావాక్కుల అన్నమయ్యను ప్రత్యక్షముగా చూచుచుండుటచే నేర్పడినదో—

కారణ మేమైనను, ఒక మార్పు సిద్ధనంద్యాచార్యులలో వచ్చినది. ఆతని హృదయమున నేదో యొక శూన్యభావ మావేశించినది. ఆతడు బహుకాలముగా శ్రద్ధాభక్తులతో నధర్మ మనుష్ఠించియుండెను.

"దగ్ధే బీజే యథాత్యంతం ప్రాదుర్భవతి నాంకురః
కర్మబీజే తథా దగ్ధే న రోహతి భవాంకురః
కర్తాస్తి కశ్చిత్ జగతః స చైకః స సర్వగః స స్వవశః స నిత్యః
ఇమాః కుహేవాకవిడంబనాః [illegible]"

"కర్మబీజము దగ్ధమైననాఁడు భవాంకురము [illegible] నిత్యుఁడగు పరమాత్మ యొక [illegible] మనుకొనుట [illegible]!" — [illegible] ముగా నాతఁడు విశ్వసించి యనుష్ఠించి యుండెను. [illegible] సిద్ధనంద్యాచార్యులకు హృదయములో నావేశించిన [illegible] నది. దేవతాప్రతిష్ఠ లేని శూన్యాలయమువలెనే [illegible] నది. ఎదుట శివార్చనాపరుఁడై ఆనందతేజస్సుతో కలకలలాడుచున్న [illegible] రూపము ఆతనిని ఆకర్షించినది. వెంటనే సిద్ధనంది బయలు[illegible]!

ఆతఁడు దిగంబరుఁడు! దారిలో [illegible] తన చేతిలోని కుంచె యాడించుచు [illegible] ములలో గాలిలోని జీవులకు [illegible] కలిగింపకుండుటకు [illegible] వస్త్రము తగిలించుకొనియే ఆతఁడు బయలుదేరెను. [illegible] పోయి యాతఁడు అన్నమేశ్వరుని యాలయముముందు నిలిచెను. [illegible] పూజ యాపి తన్ను సాక్షాత్తుగా శివుఁడే యనుకొని పిలిచినట్లు [illegible] నాతఁ డిట్లు సిద్ధనందిరూపుఁడగు సర్వేశ్వరుని సంబోధించెను.

"అమరంగా గురుమంత్రకార్ముకమునం [illegible]
గమహోముష్టివివేకి యేయుటయుఁ, [illegible]
త్త్వము లెల్లన్వడి గ్రుచ్చి [illegible]
క్ష్యమునం దద్భుతశక్తితోడ గమియంగా నాటు, సర్వేశ్వరా!"

అష్టాంగయోగసాధనలో నిష్ణాతుఁడగు సిద్ధనంద్యాచార్యుల కది [illegible] ముగా దోఁచెను. మరుక్షణమున నాతఁడు తనకు శివదీక్ష నిమ్మని యన్నమారాధ్యుల వేడికొనెను. వెంటనే యథావాక్కుల అన్నమయ్య యాతనికి పంచాక్షరీ మంత్రోపదేశ మొనర్చి నిత్యార్చనకు ప్రాణలింగము నొసంగెను.

సిద్ధనంద్యాచార్యులు జంగముఁడైన వార్త ఏకశిలానగరమునను, చుట్టుప్రక్కలను ప్రాకినమాత్రముననే, వందలు, వేలుగా జైనులు అన్నమయ్య నాశ్రయించి, యాతని యనుగ్రహముచే లింగధారణ మొనర్చి జంగములైరి. అది యొక వేలము వెర్రిగా పరిణమించెను. వారిలో పలువురు సిద్ధనంద్యాచార్యులు మారి గనిన [illegible] నమ్మలేక చూడవచ్చినవారే! చూచినపిమ్మట వారికిని మార్పు వచ్చినది. ఇట్లెన్నో జైనకుటుంబములవారు శివదీక్ష గ్రహించిరి.

* * * *

మరి మహారాష్ట్రమహాదేవరాజు యాదవసైన్యములను తరుముచుబోయిన [illegible] చేసినవి? ఆ రాత్రిలో శ్రీరుద్రదేవమహారాజు లేమి చేసిరి? [illegible] మంది నూతనబ్రాహ్మణవీరుల నడిపించుకొనిపోయి [illegible] చెను? ఏకశిలానగరము క్లిష్టస్థితిలో నుండగా నుత్సా

హాయుతో తోడుపడిన వీరశైవయోధు లెట్లు పరాక్రమించిరి? గోన గన్నా రెడ్డియు, నాతని సేనానులును, సేనలును ఏమొనర్చిరి? తిక్కచమూపతియనుష్ఠించిన మహాత్కార్య మేమి?

అవి యన్నియు నొక్కొక్కటి యొక్క బృహత్కథ కాగలదు. ఒక్కొక్కటి ఒక్కొక్క ఆంధ్రకవి ప్రత్యేకముగా విస్తరించివర్ణించి గానముచేయదగిన వీరగాథ! ఆ కాలపు కవు లవి గానము చేసియుండిరి. ఆ యుద్ధములో ఆంధ్ర వీరులు చూపిన ధైర్యసాహసములు, అన్నమంత్రి యుజ్జ్వలప్రతిభ, గోనగన్నారెడ్డి పరాక్రమప్రదర్శనము, తిక్కచమూపతి ప్రతాపము, వీరరుద్రమహారాజుల సర్వతోముఖప్రజ్ఞ—ఆ కాలపు కవు లనేకులు అనేకవిధముల గానముచేసిరి. అవి యరువదియేండ్లపాటు ఆంధ్రదేశమున తిరుమలతిరుపతినుండి సింహాద్రివరకును, కల్యాణకటక శ్రీశైలములనుండి సముద్రమువరకును, మారుమ్రోగిపోయినవి. అంతే కాదు! ఆ యుద్ధములో పాల్గొనిన రెండులక్షల యేబదివేలమంది యోధుల యింటింటను ఒక్కొక్క యోధుని వీరగాథయు దినదినమును స్మరింపబడుచుండెను. కుమారులు, కుమారికలు, మనుమలు, మనుమరాండ్రు—ఆ యోధవరేణ్యులనోటనే ఆ గాథలు విన నోచికొనిరి. అట్లు అరువదియేండ్లు ప్రతిధ్వనించిన ఆంధ్రవీరుల విజయఘోష, ఆ అరువదియేండ్ల పిమ్మట ముంచుకొనివచ్చిన మహాసముద్రప్రవాహములో కలసిపోయి విస్మృతమయినది. జనులు మరచిపోయినారు!

* * * *

కాని యీ మహాయుద్ధము కన్నులార చూచిన గోదావరీనదియు, మంజీరా నదియు, ఆ చుట్టుపట్టుల గల పర్వతారణ్యములునుమాత్రము ఇప్పటికిని అది మరువలేదు! మంజీరానది మంజీరమంజుశింజితము పలుమరు నా కథనే స్మరించును. గోదావరీనదియు మంద్రగంభీరస్వరమున నా కథనే స్మరించును. ఆ రెండు నదులకును ఆంధ్రులును, మహారాష్ట్రులును ఒక్కటే! ఆ రెండు దేశములవారును ఒకరితో నొకరు కలహించుట, యీ రెండు నదులకును ఇష్టము లేదు. వారు ఒకరిపై నొకరు దండెత్తినంత నా నదులు బహుకాలము వారించుచుండెను. ఆ నదుల యానలు మీరినప్పుడెల్ల అట్లు మీరినవారి నా నదులు శిక్షించుచుండెను. అట్లు శిక్షించుచునే ఆ రెండు నదులును విషాదమునొందును. తమ కుమారులు ఒకరితో నొకరు కలహించుచుండగా ఏ తల్లి కిష్ట మగును!

మహారాష్ట్రులకు, ఆంధ్రులకు తల్లులగు మంజీరా గోదావరీనదులకు విషాదము కలిగించు గాథ మనము మాత్రము త్రవ్వనేల? కేవలము శుష్కచరిత్రకారులు చెప్పినట్లు ఆ యుద్ధకథ స్మరింతము!

మహారాష్ట్రసేనలు వెనుదిరిగి పోయిపోయి మంజీరానది గోదావరిని కలయుచోట నాగెను. అంతవరకు ఆంధ్రసేనలు వానిని వన్నంటి విడువక తరుముచుండెను. ఇక పారిపోవుటకు వీలు లేదు. రెండు నదీప్రవాహము లడ్డమయినవి. మహారాష్ట్రసేనలు తమ్ము తరుముచున్న ఆంధ్రసేనల నెదుర్కొని పోరాడక తప్ప లేదు. మహారాష్ట్రులు మూడు లక్షలున్నారు. ఆంధ్రులును రెండు లక్షల యేబదివే లున్నారు. ఉభయరాజ్యముల ప్రభువులును రెండుసేనలను నడుపుచున్నారు. ఉభయసేనలలోనను సమర్థులగు సేనానులున్నారు. ఉభయసేన

లలోనను వీరు లున్నారు. ఉభయసేనలును భయంకర [illegible] [illegible]. [illegible] వరకు పోరాడినవి. ఉభయసేనలందును పలువురు [illegible] [illegible] యినారు. ఆ రాత్రికి మహారాష్ట్రమహా[illegible] [illegible].

"అక్రమముగా సరిహద్దు [illegible]పోయినది నేను!"

ప్రక్కనే ప్రవహించుచున్న మంజీరానది [illegible] గోదావరీనది దూరమున ప్రతిధ్వనించినది!

ఐన నేమి? మరునాడును యుద్ధము ఉభయసేనలనడుమ [illegible] సాగెను. అంతవరకును ఒకరిని మించి [illegible] [illegible]. ఉభయుల యుద్ధవిధానములును ఒకటియే! ఉభయుల [illegible] చుగా నొక్కటియే! ఆ మధ్యాహ్నమునకు [illegible], [illegible] పారద్రోలిన విజయగర్వముతో, నొక మహాసేన [illegible] గోదావరి [illegible] యొడ్డునకు జేరికొని మహారాష్ట్రసేనలను [illegible]. ఆ సాయంత్రమునకు కొంత సేనను గోదావరి [illegible] [illegible] శేవులనుగూడ నాతడు నిరోధించినాడు!

"మహారాష్ట్రమహాదేవరాజునకు [illegible] సంధి చేసికొనుట [illegible] తోచినది. ఇంకను జననష్టమైనపిమ్మట పర్యవసాన" మేమగునో! [illegible] శ్రీరుద్రదేవమహారాజులకు రాయభారమంపెను.

"మహారాష్ట్రులును, ఆంధ్రులును ఒక తల్లిబిడ్డలు. మన మిట్లు కలహించుట యుచితము కాదు. ఉత్తరదేశమున ఉభయులకును శత్రువులు [illegible]చుచున్నారు. మేము సరిహద్దు దాటి వచ్చినతొందరపనికి నష్టపరిహారముగా కోటిసువర్ణము లర్పించుకొందుము. మన మింతటితో [illegible] [illegible]!"

ఇట్లు మహారాష్ట్రప్రభు వంపిన రాయబారుల వాక్యములు శ్రీ [illegible] మహారాజులు నిండుకొలువుండి యాలకించిరి. వారు తన మంత్రి, సామంత, దండనాథులను తమకు యుక్తమని తోచినది చెప్పగోరిరి. వారును [illegible] తమ తమ యూహలు నివేదించిరి. అంతయు మహారాజులు శ్రద్ధగా నాలకించిరి. [illegible] సోమయాజులు ఆంధ్రమహాభారతమున [illegible] వినిపించిన పద్యములలో నొకటి మహారాజుల చెవులలో ప్రతిధ్వనించెను.

"కడువనిచ్చుతతియైన గురువర క్రక్కించు, నవసరంబు [illegible] యరిన్రుపాలు
నీవు ధీరవృత్తి నిడు ద్రాట బోనిమ్ము, క్రమ్మ కపిల యనగ గ్రమ్మ [illegible]."

ప్రకృతిజనముల యనుమతితో శ్రీ రుద్రదేవమహారాజులు సంధి కియ్యకొనిరి. దేవగిరియాదవప్రభునివలన కోటి సువర్ణములును గొని, శ్రీ రుద్రదేవమహారాజు గోదావరీ, మంజీరానదీతీరముల తన విజయ స్తంభములు నెలకొల్పజేసి విజయోత్సాహముతో తన సామంత, మంత్రి, దండనాథులతో ఏకశిలానగరమునకు మహావైభవముతో ప్రయాణ మయ్యెను. ముందు మహారాష్ట్రులవలన దాను గొన్న కోటిసువర్ణములతో తిక్కచమూపతిని పంపి, మహారాజులును, శీఘ్రప్రయాణమున వసంత నవరాత్రోత్సవములు నిర్వర్తించు వ్యగ్రతతో పోవుచుండిరి.

ఈ యుద్ధములో మారన తీవ్రముగా గాయపడెను. అతనిని అందలముపై శత్రుసైన్యాలు పరివేష్టింప తిక్కసామంతి సేనలతో పంపివేసెను.

మహారాష్ట్రులను తరుముకొనిపోవు సమయమునయందు ఒక విషాదసంఘటన జరిగినది. ఆంధ్రరాజ్యములో మహారాష్ట్రసేనలకు ముప్పదియూరు జనపదములు ఆశ్రయమిచ్చెను. అందులో ముఖ్యముగా జైనులు నివసించుచుండిరి. మహారాష్ట్రులా జనపదములనుండి పారిపోయిన సమయమున, ఆంధ్రసేనలు వానిపై కఠినచర్య తీసికొనెను. ఆ గ్రామములలోని పెద్దల నందరను దండనాయకులు పిలిచి తీవ్రముగా శిక్షించిరి. ఆ రాత్రియే ఆ ముప్పదియూరు గ్రామములును పరశురామప్రీతి యయ్యెను. జైనులు తమ గ్రంథములలో మతావేశముచే శైవు లీ రాక్షసకృత్య మొనర్చిరని వ్రాసిరి. పాపము, ఆంధ్రసేనతో వచ్చుచున్న వీరశైవులు శివనిందను వినిన మనియును, శివనింద చేయువారిని శివకోపాగ్నియే దహించునని చెప్పుకొనిరి. ఆ గ్రామములలో నల్లాడుచున్న జనులను బాలురను, వృద్ధులను, స్త్రీలను రక్షించుటకు ఆంధ్రసైనికులు మిక్కిలి పాటుపడిరి.

కాని మానుషప్రయత్నము వారికి చాలేదు.

* * * *

ఆంధ్రసేనలు కృతార్థులైనవి. శ్రీరుద్రదేవమహారాజులను ఏకశిలానగర వాసులు మహానందముతో ఎదుర్కొని దీవించి, సమాదరించి పూజించిరి. ఇంతవరకు శ్రీమహారాజుల సర్వసేనలకు నాధిపత్యము వహించిన అన్నమంత్రీశ్వరు లిప్పుడు సర్వాధికారములను త్యజించి, తనకు మహారాజు లుంచిన చెరసాలకు పోయి, అందులో మహాసాత్త్వికముగా వేదాంతగ్రంథపఠనమును, వేదాంతశ్రవణములలో నిమగ్నులైరి.

* * * *

శ్రీరుద్రదేవమహారాజులు అంతఃపురము చేరగనే కుట్ట మంగళారార్తికము పట్టినది. వెంటనే ప్రతాపరుద్రదేవుడు వచ్చి పాదాభివందనము చేసినాడు. రుద్రదేవు బాలుని నాశీర్వదించి చేతులలోనికి తీసికొన్నది. మునుపటివలె ఎదుర్కొనుటకు వృద్ధురాలగు కామసాని అమ్మగారు లేదు.

వెంటనే రుద్రదేవు కామసాని శివపూజ చేయుచు ప్రాణముల నర్పించిన గదికి బయలుదేరినది. రుద్రమ పెంపుడునెమలి పింఛము విప్పి యాడుచు క్రేంకారములు చేయుచు నెదురువచ్చెను. పంజరములోని రామచిలుక 'జయ రుద్రా! జయ రుద్రా!' అని పలుకసాగెను.

కామసాని ప్రాణములు వదలిన ప్రదేశమునకు సమీపమున కుడ్యమున వీరభద్రపటము వ్రేలాడుచున్నది. ఆ పటము రుద్రమ స్వయముగా చిత్రించినది. దక్షాధ్వరధ్వంస మొనర్చిన వీరభద్రావతార మందులో తాను చిత్రించినది.

ఆ గదిలోనికి చేరగనే రుద్రమను ఎదుర్కొన్నది ముమ్మడమ్మ! గోదావరియాత్ర చేసివచ్చినదాదిగా ఇంతవరకు రుద్రమకు ముమ్మడాంబ కనబడలేదు. దానిని చూచుటకు రుద్రమ తహతహలాడుచుండెను. ఆ తల్లి కూతుండ్రు ఒకరి నొకరు గాఢముగా కౌగిలించుకొనిరి.

౫౩

అమృతరసాఖి వర్షకమె యౌ శివకామసఖీకృపాకటా
క్షమున మహోద్భుతక్రమ వశంవద నవ్యనిరూఢితో వ నా
సమయమునన్ జనించె సరసస్మయమాన ముఖాంబుజంబుతో
సుమశరశేఖరుండు జిగి సొంపున దొల్లిటికన్న మిన్నగన్."

కామసంజీవనము.

శిశిరఋతువు గతించినది, వసంతము ప్రవేశించినది. ఏకశిలానగరమున వసంతో
త్సవములు మహావైభవముతో నారంభమైనవి !

వసంతోత్సవమునకు మూలకందములైన మావులు చిగిర్చినవి; అవి పూచినవి; కాయలు కాసినవి. అవి ఎర్రగా తెల్లగా పచ్చగా నుండి మాసవసాక్షిం చుచున్నవి. తేనెటీగలు వానిపై మూగుచున్నవి. తుమ్మెదలు ఝంకారము చేయుచు ప్రదక్షిణసంచారము లొనర్చుచున్నవి. కోయిలలు కవులతో పోటిగా పాడుచున్నవి!

నదులందును, సరస్సులందును నీరు తేటగా నుండి స్నానపానాదులను సుఖముగా నున్నవి.

ఐనను శరత్కాలమువలెనే వసంతమును జీవులకు ప్రమాదకరమగు కాలము !

"కాలుని దంష్ట్రియుగ్మ మనగా విలసిల్లు వసంతముం శర
త్కాలము, ఘోరరోగమృతి కారణముల్, బహుదుర్గమంబు లా
వేళలు సర్వజీవులకు, విశ్రుతభక్తి వివేకశాలురీ
మూల నెఱింగి చండికకు బూజ లొనర్తురి విశేష సుత్తిగన్."

ఇట్లని శ్రీభాగవత ముపదేశించుచున్నది. ఆ యుపదేశము జనులకు ఉపదేశముగ దృఢముగా నాటుకొనియుండిన పుణ్యకాల మది. వసంతోత్సవము వసంతనవరాత్రవ్రతముతో నారంభించును.

శ్రీ రుద్రదేవ మహారాజుల యభ్యర్థన ననుసరించి రాజగురువులగు శ్రీ విశ్వేశ్వరశంభుదేశికులు ముందుగనే అనేక శిష్యగణముతో గూడి రాజధానీనగరమునకు విచ్చేసియున్నారు. వారి శిష్యవాక్కులచే రాజ్యాభిషిక్తులైన శ్రీ రుద్రదేవ మహారాజులు వారి యాశీర్వచనముతో రాజ్యభార మూని, పరిపాలన మారంభించినారు. ఈ యారునెలలలో మహారాజుల కెన్నియో ఉపద్రవములు ఎదురైనవి. శ్రీ గురువుల కటాక్షముతో పాటు, పరమేశ్వరుని కటాక్షవీక్షణమును, మహారాజులపై ప్రసరించి వారిని సర్వోపద్రవములనుండియు నుత్తరింపజేసినది. భగవంతునిపై భారముంచి, ధర్మ మనుష్ఠించువారికి, ప్రయత్నము లేల ఫలింపకుండును ? కాకతీయసామ్రాజ్యముపై ఒక్కసారిగా తుపానువలె కష్టములు చెలరేగి శ్రీరుద్రదేవ మహారాజుల ప్రయత్నమను మహావాయువుచే విచ్ఛిన్నమైనవి. కాని యన్ని ప్రయత్నములందును. కంటికి కనపడకున్నను అనుభవమున స్పష్టముగా గోచరించుచు, శ్రీ విశ్వేశ్వరగురుకారుణ్యావలోకనము సిద్ధముగనే యున్నది. మహారాజులు ఒకవంక మహా [illegible] నెన్నాళ్ళకోవుచునే, విస్మరింపక రాజగురువులకును, సామ్రాజ్య

మునం గల మహానుభావులకును ఆహ్వానము లంపిరి. జన్నిగగురువులగు శాంతపూర్వ శివదేశికులును వచ్చిరి.

నగరమం దెల్లెడల వరాహధ్వజములు చిరుగాలి కల్లలనాడుచు ఉత్సాహముతో కన్నులపండువు చేయుచున్నవి. భూమండలమును తన దంష్ట్రాగ్రముతో నుద్ధరించిన యజ్ఞవరాహమూర్తి స్వరూపమే అనాదిగా ఈ మత్స్యభూమి రాజులకు ధ్యేయముగా నున్నది; ప్రభుత్వచిహ్నముగా నున్నది. వారివి వరాహధ్వజములు. వారి సువర్ణములు వరాహాంకితము లై అజ్జుల నోళ్ళలోబడి వరహాలైనవి.

స్వయముగా శ్రీ రుద్రదేవమహారాజులు విధివిధానముగా ఉపవసించి వసంతనవరాత్రపూజలు నిర్వర్తించుచున్నారు. స్వయముగా శ్రీవిశ్వేశ్వర శంభు దేశికులు మహారాజుల దక్షిణపార్శ్వమున నున్నతపీఠ మలంకరించి సమస్తము జరిపించుచున్నారు. నవరాత్రపూజలో ప్రాతఃకాలములందు కుమారీపూజయు, సాయాహ్నముల సువాసిన్యర్చనయు, మహావైభవముతో సాగుచున్నవి. అట్టి మహారాజులు శ్రద్ధతో అర్చించుచున్నప్పుడే సహస్రనామముల సంపూర్ణప్రయోజనము ఘటిల్లును. ఒక్కొక్క కుమారికి, ఒక్కొక్క సువాసినికి, ఒక్కొక్క నామముతో పూజ జరుగుచున్నది. ఇట్లు సహస్రనామములకును కుమారికలు, సువాసినులు లభ్యమయినారు.

రాజమందిరమున రాజవైభవముతో నిట్లు పూజలు సాగుచుండ ఏకశిలానగరమున నాబాలగోపాలము వసంతోత్సవములు జరుపుచున్నారు. చిల్లరదేవతల గుళ్లనుండి కేశవ శ్రీ స్వయంభూనికేతనములవరకు, ఉత్సవము యథాధికారముగా యథోత్సాహముగా సాగుచున్నది. ఇందరు దేవత లెక్కడ నున్నారు? ఈ పట్టణములో నింటికొక దేవతయున్నదా? ముప్పది మూడుకోట్లమంది దేవతలును స్వర్గమునుండి నవరాత్రోత్సవము చూడ దిగివచ్చినారా? అని క్రొత్తవారి కనిపించును!

యువకవి యగు గోవిందశర్మతో పోయి వీధులు తిలకించియాతని వర్ణన లాలకింతము!

అదుగో, పలనాటి వీరపురుషపరమదైవతములగు శివలింగభవనవాటిలో నొక వనిత ద్విపదప్రబంధమున వారి వీరకథ పాడుచుండగా వీరులు కొందరు వీరసంబెట్లు వేయుచుండ, కొందరు కుంతాసనము చేయుచున్నారు. ఒకడు ఛీత్కారము చేయగా, నొకడు గుఱ్ఱము భంజళ్ళు బరపుచున్నాడు.

ఇక రేణుకాస్వరూపమగు ఏకవీరామహాదేవి యాలయప్రాంగణము ననొక బవనీడు పరశురాముని కథ పాడుచుండగా, జనంగమప్రమద ఏమి చేయుచున్నది? గోవిందశర్మ వర్ణన నాలకింతము!

“ఆలయమందాడి జనంగమ ప్రమద యుద్వ్యానద్ధఘంటాస్వనుల్
వెలగం బాడె సహస్రలోక జననిన్ శ్రీ యేకవీరాంబికన్
[illegible] మూర్ఛనాస్వరమునన్ ప్రాణంబు కల్పింపగా
గిలకల్ కలకంఠ రావముల కుహూకారంబు తోరంబుగన్.

మరి జక్కులపురంధ్రి కామవల్లీమహాలక్ష్మియెదుట [illegible] పలుకులు పాడుచు.

* * *

"గిల్కు గిల్కున మ్రోయు కింకిణీస్వనంబు తాళము సంబుళ[illegible]
రాగమునుండి లంఘించు రాగమునకు నటుచు యూరువిద్యాయాంబు[illegible]"

వచ్చుచున్నది. అటు చూతము !

"మంద్రమధ్యతార మానత్రయాన్నమహితశృంగనాదములు [illegible]
డమరుడిండిమంబు ఢమఢమధ్వని మ్రోసె నద్భుతం బగును [illegible]!"

అది మైలారుభటుల సందడి! వారికెల్ల బొల్లడు [illegible] దళవాయి వేషము త్యజించి మైలారుభక్తుని రూపముతో సాగుచున్నాడు. [illegible] డాతనికి 'ఆడెసోకు' భయము లేదు. ఆ యుత్సవములో నిప్పులు త్రొక్కు[illegible]నున్నారు. ఆ యాడుచున్న గారగపనులు చూచుచున్నావా, గోవిందశర్మ!

"వెనకకు మొగ్గవ్రాలి కడు విన్నను పొ[illegible]
మునిగి తదంతరస్థమగు ముంగర యుక్కున గ్రుచ్చికొంచు [illegible]
చెను రసనాగ్రవాళమున శీఘ్రమ గ్రుచ్చెను వల్లపు[illegible]
రనుపమలీల నిప్పుడు చుపాయము లిట్టివి యెట్లు నేర్చెనో !"

అదుగో! వారికి కాకతిభటులు ఎదురైనారు? వారికేనాడు [illegible] గామి! వీరికి వారికి ఈనాడు పోరు మరల పొసగునా? లేదు! కాకతి భటులును, మైలారుభటులును కలసి మెలసి కొంతదూరము ఊరేగి ఎవరిదారిన వారు పోవుచున్నారు.

ఆ భైరవస్థానము చూడండి! గోవిందశర్మ, భైరవుని వ[illegible]న్నాడా!

"అమితోత్సాహముతోడ నీవు పటు బాహా ఢక్క నొక్కొక్క [illegible]
టు మనఃకంపము నొందజేయ దొలకొండును వార్ధి వేలాలుచ
త్క్రమతంబై, వలమాన మీనమయి, యుద్యన్నక్రమై, యుత్తర
త్తిమిరై, యుల్లలదంబు మగ్నధులియై, ధీరామహాభైరవా !"

ఈ మహోత్సవములో నెందర దేవతలను భక్తులను, దర్శించగలము! [illegible] హేశ్వరీ మహాశక్తి నగరదిగో! అదే వీరభద్రేశ్వరాగారము[illegible]! [illegible] బొద్దదేవుని విహారము! ముద్దరాలు గ్రసానమ్మనివాసము అదిగో! కుమారస్వామి నగరదే! ఆపైన పాండవులగుడి యల్లదిగో! అన్నింటికంటె పైగా, [illegible] లున్నందుకు సార్థకత కల్పించుచున్న యా రెండు గోపురములు [illegible]!

"కొంతదవ్వుల నదె, మహాగోపురముల
పైడి కుండలు రవిదీప్తి బ్రజ్వలించి
కాననయ్యెను మేరుశృంగములబోలె
గేశవశ్రీ స్వయంభూనికేతనములు !"

వాని శిఖరదర్శనముతో జనములు పావనులైనవి. [illegible] ణమున కరణవిద్య నేర్చిన యూరు వేలమంది బ్రాహ్మణులు[illegible], [illegible] బ్రాహ్మణులగూడి వేదపారాయణము చేయుచున్నారు.

వీసుల సంచారము చేయుటచే, గోవిందశర్మ తాను శుచిగా నున్నట్లు భావింపక, ఆ యాలయములకు తొలగి వెళ్లుచున్నాడు. అతనికి పుష్పలావిక యెదురై,

"శివుని చిచ్చుటకంట వెచ్చినయనంగుబూది కెనయైన కమ్మ బుప్పొళ్లతోడ
దావి ఘనమైన కమ్మగేదంగిపూవు"

ఇచ్చినది. దానిమీద జాలితో గోవిందశర్మ పద్యము చెప్పుచున్నాడు.

"క్రొన్నెలరేఖతోడ గెడ గూడి సుఖింపగ భాగ్య మబ్బమిన్
ఖిన్నత నొందు గాని నవకేతకిశూలి వివేకహీను డై
తన్ను దిరస్కరించుటకు దైన్యమునొంద దదే వివేక సం
పన్నిధి దాని పాలి పెరుమాళ్ళిక డెక్కడనైన లేదొకో !"

ఆ కేతకిని గ్రహించి యాత డభ్యాసవశమున వేశ్యవాటికలో ప్రవేశించి మాచల్దేవిమందిరము సమీపించినాడు. అక్కడ,

"చందనంబున గలయంపి చల్లినారు
గ్రుగ్గ లిడినారు కాశ్మీరమున ముదమున
వ్రాసినా రిందు రజమున రంగవల్లి
కంజముల దోరణంబులు గట్టినారు"

గోవిందశర్మను జూచినంతనే హంసతూలికాతల్పముమీద గూర్చున్న హావభావ విభ్రమ విలాసనిధి మాచల్దేవి లేచి,

"కంకణాలంక్రియారుణత్కార మెసగ
నయ్యగారికి జోహారు లనుచు మ్రొక్కె."

"కవిగారూ, దర్శన మిచ్చి ఎన్నాళ్లయినదండీ మీరు ? ఉదయమునుండి మీకై దూతికపై దూతికను పిలువబంపితిని. మీ జాడ కనిపింపలేదు. సరిగా వేళకు దయచేసినారు ?"

"ఏమి పని?" ఇట్లనుచు తనచేత నున్న మొగలిచెండును మాచల్దేవి కీయగా నది మహాప్రసాదమని గ్రహించి యిట్లనెను.

"చెప్పెదను. రసజ్ఞులైన మీరు లేని దీ యుత్సవ మింతవరకు శోభగా లేదు!"

"ఏమి టే యుత్సవము ?—రాచకార్యములైపోయినవా ?"

"అదుదానికి రాచకార్యము లేమిటి ? యోగివేషధరుని మోసముచే వచ్చిన ప్రమాదము తప్పుకొనుటకు పెట్టుకొన్న పని ! ఈనాడు వసంతోత్సవ ప్రారంభముగా నాలినచిత్రశాలాప్రవేశము చేసినాను ! ఈ చిత్రశాలలో చిత్రములు మీరు చూడనిది నాకు తృప్తి లేదు !"

అప్పటికే నగరములోని పెద్దలు పలువురు రాచిత్రములు తిలకించుచుండిరి. గోవిందశర్మయు చిత్రములు పరికించి మాచల్దేవితో నిట్లన్నాడు !

"చిత్తజుని శౌర్య మెఱిగించె చిత్రశాల ?"

మాచల్దేవి చిరునవ్వు నవ్వి గోవిందశర్మతో పని చెప్పెను.

"మీరు మచాలస నెరుగుదురు గదా, అది అన్నమంత్రీశ్వరుల ఇంట నృత్యమునకు తిరముగా నల్లెడిది ! అది ప్రభుకార్యార్థినియై అంబదేవుని సేనల ననుగ